# పత్రికా రచన

BRAOU

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం
హైదరాబాదు - 500 033.
2003

# పాఠ్య నిర్మాతలు

**సంపాదకులు**

పొత్తూరి వెంకటేశ్వర రావు

**రచయితలు**

ఘంటా చక్రపాణి
ఎమ్.ఇ.వి. ప్రసాద రెడ్డి
కొండుభట్ల రామచంద్ర మూర్తి
కె. శ్రీనివాస్
ఎ. వెంకటరావు (సుధామ)
డా॥ వి. చంద్రశేఖర రావు
వి. శ్రీనివాస్
సి. వెంకటేష్
డా॥ సి. మృణాళిని
కె. శ్రీనివాస రెడ్డి
గోవాడ సత్యారావు
డా॥ సి.వి. నరసింహా రెడ్డి
డా॥ కె. శివశంకర్
డి. నాగార్జున
డా॥ ఉమాపతి వర్మ
డా॥ కె. నాగేశ్వర్
జి.ఎస్. వరదాచారి

115091
29-4-05

Dr. B.R.A.O.U. LIBRARY
Acc. No. 115091
Date 29.4.2005
Call No

BRAOU

**కార్యక్రమ సమన్వయకర్త**

ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి

**పాఠ్యాంశ సమన్వయకర్త**

ఘంటా చక్రపాణి

సమన్వయం

డా॥ ఆర్. వసునందన్
డా॥ కె.ఎస్. రమణ
డా॥ ఉమాపతి వర్మ

ముఖ చిత్రం

చంద్ర

అనువాదం

డా॥ కె. శివశంకర్
పి. వేణు గోపాలస్వామి
ఆర్. నరేందర్ రావు

డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం,
హైదరాబాదు.

ప్రథమ ముద్రణ, 1997, 2003

© 1997, డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం

అన్ని హక్కులు విశ్వవిద్యాలయానివి. ఈ పుస్తకంలో ఏ భాగాన్నయినా ఉపయోగించదలచుకుంటే, విశ్వవిద్యాలయం అనుమతి పొందాలి. ఈ పాఠ్యాంశాలు సార్వత్రిక విశ్వవిద్యాలయం పాఠ్య ప్రణాళికలో ఒక భాగం.

ఇతర వివరాలకు : డైరెక్టర్ (అకడమిక్), డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
రోడ్ నెం. 46, జూబ్లీహిల్స్, హైదరాబాదు - 500 033.

Lr.No.49/Dr. BRAOU/DMP/PTG/F.No.45/J.O.202/2003-2004/dt.16.4.03/No. of Copies 200

Printed at : **Graphica Printers**, Hyderabad.

# పరిచయం

ఆధునిక ప్రపంచంలో మానవ సంబంధాలను విస్తృతంగా ప్రభావితం చేస్తోన్న ప్రసార మాధ్యమాల్లో పత్రికలు కీలక పాత్ర వహిస్తున్నాయి. కేవలం సమాచారాన్ని చేరవేసే సాధనాలుగా మాత్రమే కాక పత్రికలు ఇవాళ ప్రజాబాహుళ్యపు బాగోగులు చూసే బాధ్యతను కూడా స్వీకరించాయి. ప్రజల కష్టనష్టాల్ని కడతేర్చేందుకు, పాలకులకూ ప్రజలకు మధ్యన పత్రికలు వారధిగా నిలబడుతున్నాయి. పత్రికలన్నా పాత్రికేయులన్నా సమాజంలో గౌరవం, గుర్తింపు, ఆకర్షణ పెరిగాయి. పాత్రికేయ వృత్తిపట్ల ఆసక్తి పెరిగింది.

తెలుగు పత్రికా రంగానికి శతాబ్దాల చరిత్రవున్నా, పత్రికారంగం పరిశ్రమగా, పాత్రికేయత ఒక వృత్తిగా ఎదగలేకపోయింది. పత్రికా రంగంలో చేరుతున్న వాళ్లు, కొనసాగుతున్నవాళ్లు చాలా తక్కువ. నిజానికి తెలుగు పత్రికలు సమాజ వికాసానికి ఎనలేని సేవ చేశాయి. స్వాతంత్ర్య సమరంలో నైతేనేమి, సంస్కరణ దశలో నైతేనేమి తెలుగు పత్రికల కృషిలత చిరస్మరణీయం. ఇటీవలి కాలంలో రాజ్యాంగ వ్యవస్థల్లో ప్రధానమైన శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు విమర్శల పాలవుతున్న దశలో పత్రికలే ప్రజాస్వామ్యానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. అంతే కాకుండా ...లకు అనుగుణంగా ఎజెండా రూపొందించి పోరాడుతున్నాయి. అందుకే ఇటీవలి కాలంలో పాత్రికేయ వృ... ఆకర్షణ పెరుగుతున్నాయి. అలాగే, తెలుగు పత్రికల వికేంద్రీకరణ, ప్రాంతీయ, జిల్లా ఎడిషన్ల మూలం, ... అవసరం, అవకాశాలూ పెరిగాయి. అయినా విశ్వవిద్యాలయాల్లో పాత్రికేయ వృత్తిశిక్షణ తక్కువే. పత్ర... ...న్నవారికి, పాత్రికేయ వృత్తిలో చేరాలనుకుంటున్న వారికీ శిక్షణావకాశాలు పెద్దగా అందుబాటులో లే... ప్రధాన నగరాల్లో తప్ప, గ్రామీణ ప్రాంతాల్లో వున్నవారు ఆ కొద్ది అవకాశాలు కూడా పొందలేక పోతున్నారు. ఈ అవసరం, ప్రాధాన్యత దృష్ట్యా డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం 'ప్రసార మాధ్యమాల కోసం రాయడం' కార్యక్రమంలో భాగంగా పత్రికా రచనను కూడా ఒక అధ్యయన అంశంగా చేర్చడం జరిగింది.

'పత్రికా రచన' కు కేటాయించిన ఈ సంపుటంలో అధ్యయనాంశాలను మొత్తం ఆరు ఖండాలుగా విభజించడం జరిగింది. వాటిని 1. వార్తా రచన, 2. ప్రత్యేకాంశాలరచన, 3. సంపాదకీయాలు, ప్రధానవ్యాసాలు, ప్రత్యేకానుబంధాలు, 4. కాలిక పత్రికలు - ఇతర పత్రికలు, 5. విన్యాసం, అలంకరణ, ముద్రణ, 6. భారతరాజ్యాంగం-పత్రికారంగంగా ఇందులో పొందుపరిచాము.

ఈ ఖండాల్లో మొత్తం 34 భాగాలున్నాయి. వాటిని ఆయా రంగాల్లో ఆరితేరిన సీనియర్ పాత్రికేయులు, విశ్వవిద్యాలయాల ఆధ్యాపకులు, వృత్తి నిపుణులు రూపొందించారు. పత్రికా రచనపై ఇంత వివరంగా తెలుగులో అధ్యనాంశాలు రూపొందించడం ఒక విశ్వవిద్యాలయం స్థాయిలో బహుశ ఇది తొలి ప్రయత్నం. ఈ పాఠ్యాంశాల అధ్యయనం ద్వారా పాత్రికేయులు, పాత్రకేయ విద్యార్థులకు పత్రికా రచనపట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది. అది వృత్తి నిపుణత సాధించుకోవడానికి, కొత్త మెలకువలు పెంపొందించుకోవడానికీ తోడ్పడుతుంది.

- సంపాదకులు

BRAOU

BRAOU

# పత్రికా రచన - విషయసూచిక


| ఖండం-1 : వార్తా రచన | | | పేజీ. నెం. |
|---|---|---|---|
| భాగం - 1 | : | పత్రికా రచన - ప్రాథమిక సూత్రాలు | 1 |
| భాగం - 2 | : | వార్తా సేకరణ - పద్ధతులు, ఆధారాలు | 8 |
| భాగం - 3 | : | వార్తా రచన - విలువలు | 15 |
| భాగం - 4 | : | విలేఖనం / రిపోర్టింగ్ | 22 |
| భాగం - 5 | : | వార్తల ఎడిటింగ్ | 41 |
| భాగం - 6 | : | కార్టూన్లు, ఫొటోలు, ఫొటోఫీచర్లు | 51 |
| **ఖండం -2 : ప్రత్యేకాంశాల రచన** | | | |
| భాగం - 7 | : | వార్తావ్యాసాలు | 58 |
| భాగం - 8 | : | శాస్త్రవిజ్ఞానం | 70 |
| భాగం - 9 | : | వాణిజ్యం | 80 |
| భాగం - 10 | : | వ్యవసాయం | 91 |
| భాగం - 11 | : | క్రీడలు | 96 |
| భాగం - 12 | : | సమీక్షలు | 113 |
| **ఖండం - 3 : సంపాదకీయాలు, ప్రధానవ్యాసాలు, పత్రికానుబంధాలు** | | | |
| భాగం - 13 | : | సంపాదకీయం | 125 |
| భాగం - 14 | : | బాలలకోసం రాయడం | 136 |
| భాగం - 15 | : | మహిళల కోసం రాయడం | 143 |
| భాగం - 16 | : | యాత్రారచన | 148 |
| భాగం - 17 | : | వికలాంగులకోసం రాయడం | 158 |
| భాగం - 18 | : | ప్రత్యేక సంచికల కోసం, అనుబంధాలకోసం రాయడం. | 173 |
| **ఖండం - 4 : కాలిక పత్రికలు - ఇతర పత్రికలు** | | | |
| భాగం - 19 | : | కాలిక పత్రికలు - రకాలు | 183 |
| భాగం - 20 | : | కాలిక పత్రికా రచన | 192 |
| భాగం - 21 | : | సాహిత్య పత్రికలు | 200 |
| భాగం - 22 | : | సాంకేతిక పత్రికలు, పరిశోధనా పత్రికలు | 210 |
| భాగం - 23 | : | సంస్థా పత్రికలు | 222 |


BRAOU

ఖండం - 5 : విన్యాసం, నమూనా - అలకరణ, ముద్రణ

| | | | |
|---|---|---|---|
| భాగం - 24 | : | పేజీ అలంకరణ మెలకువలు | 234 |
| భాగం - 25 | : | ముద్రణ పద్ధతులు. ప్రక్రియలు | 243 |
| భాగం - 26 | : | ముద్రణలో కంప్యూటర్ల పాత్ర | 250 |
| భాగం - 27 | : | గ్రాఫిక్ రూపకల్పన, నిర్మాణం | 256 |
| భాగం - 28 | : | తెలుగుఫాంట్లు -వికాసం | 264 |
| భాగం - 29 | : | విన్యాసం, నమూనా - కీలకాంశాలు | 271 |

ఖండం - 6 : భారత రాజ్యాంగం - పత్రికా రంగం

| | | | |
|---|---|---|---|
| భాగం - 30 | : | భారతరాజ్యాంగం, పత్రికారంగం | 281 |
| భాగం - 31 | : | పత్రికా మండలి, పత్రికా శాసనాలు, పత్రికా స్వేచ్ఛ | 292 |
| భాగం - 32 | : | వార్తా సంస్థలు | 305 |
| భాగం - 33 | : | పాత్రికేయ చట్టాలు, యూనియన్లు, వేతన బోర్డులు | 311 |
| భాగం - 34 | : | పాత్రికేయులు, నైతిక విలువలు. | 316 |


BRAOU

# ఖండం - 1

# వార్తా రచన

సమాజంలో భావ ప్రసారానికి సంబంధించినంత వరకు వార్తాపత్రికలు ప్రముఖ పాత్రను నిర్వహిస్తున్నాయి. విశ్వం నలుమూలల నుంచి అనేక విషయాలు సేకరించి ప్రజలకు చేరవేయడంలో పత్రికలు అత్యంత కీలకమైన పాత్రను నిర్వహిస్తున్నాయి. అలాగే ప్రజల మనోభావాలను పాలకులకు తెలియజేయడంలో కూడా పత్రికలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. ఒక రకంగా పాలకులకు ప్రజలకు మధ్య పత్రికలు ఒక వారధిగా పని చేస్తున్నాయి. అలాగే ప్రజలను వివిధ సమస్యల పట్ల, విషయాల పట్ల చైతన్యవంతులను చేయడంలో కూడా పత్రికలు ఎంతో కృషి చేస్తున్నాయి.

మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పత్రికల పాత్ర విస్తృతమైంది. పాత్రికేయులు అనేకానేక విషయాలపై దృష్టిని కేంద్రీకరించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పాత్రికేయులు, పాత్రికేయ విద్యార్థులు అనేక మౌలిక విషయాలు తెలుసుకోవలసి వుంటుంది. ఈ ఖండంలో పత్రికా రచనకు సంబంధించిన వివిధ అంశాలను ఆరు భాగాల్లో పరిచయం చేస్తున్నాం. అవి **1.** పత్రికా రచన - ప్రాథమిక సూత్రాలు **2.** వార్తా సేకరణ - పద్ధతులు, ఆధారాలు **3.** వార్తా రచన - విలువలు **4.** విలేఖనం/రిపోర్టింగ్ **5.** వార్తల ఎడిటింగ్ **6.** కార్టూన్లు, ఫోటోలు, ఫోటో ఫీచర్లు.

ఈ భాగాల్లో ఆయా అంశాలను వివరంగా చర్చించడం జరిగింది. ఇవి చదివే సందర్భంలో పాఠ్యాంశంలో మేము పొందుపరచిన వ్యాఖ్యలు, వివరణలు ఉదాహరణలు కూడా పరిశీలించండి. వాటిని వివిధ పత్రికల్లో నిత్యం మీరు చూస్తున్న వార్తలతో, రచనా శైలితో, పద్ధతితో అన్వయించుకొని ఆలోచించండి.

BRAOU

BRAOU

# భాగం - 1 : పత్రికారచన - ప్రాథమిక సూత్రాలు

## విషయక్రమం


1.0 ఉద్దేశం

1.1 ప్రవేశిక

1.2 పత్రికారచన - అర్థవివరణ

1.3 పత్రికారచన - చరిత్ర

1.4 పత్రికారచన - స్వభావం - పరిధి

1.5 పత్రికారచన - రూపాలు

1.5.1 వార్తారచన

1.5.2 ప్రత్యేక వ్యాసాలు

1.5.3 సంపాదక రచన - ఇతర రచనలు

1.6 వార్తారచన ప్రత్యేకత

1.7 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 1.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- పత్రికారచన అంటే ఏమిటి
- పత్రికారచనకు వార్తా రచనకు తేడా
- పత్రికా రచన రూపాలు - ప్రత్యేకతలు తెలుసుకుంటారు.

BRAOU

## 1.1 ప్రవేశిక

పత్రికా రచన అనేది ఆధునిక ప్రక్రియ. పాశ్చాత్యదేశాల పరిస్థితి ఎలావున్నా మనదేశంలో ముఖ్యంగా ప్రాంతీయ భాషల్లో పత్రికారచన ప్రారంభమైంది మాత్రం 19వ శతాబ్దంలోనే. పత్రికల ప్రారంభానికి ముందు వివిధ సాహిత్య, భావ ప్రసార ప్రక్రియలు వున్నా పత్రికలకు ఉన్నంత ప్రాధాన్యత, విస్తృతి వాటికి ఉండేదికాదు.

సమాజంలో సమాచార వినిమయం, పఠనాసక్తి, అక్షరాస్యత పెరిగిన కొద్దీ పత్రికల అవసరం పెరుగుతోంది. నానాటికీ మారుతూ, క్లిష్టమవుతూ వున్న మానవ సంబంధాల నేపథ్యంలో పత్రికలు సమాచార వ్యాప్తిలో క్రియాశీల పాత్ర నిర్వహిస్తున్నాయి. కేవలం వినోదం కోసం మాత్రమే కాకుండా పత్రికలు విజ్ఞాన, వికాసాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఇప్పుడు పత్రికలు ప్రజాజీవనం నుంచి విడదీయలేని రీతిలో అల్లుకుపోయాయి. ఈ నేపథ్యంలో పత్రికా రచన ప్రాధాన్యత, ముఖ్యంగా తెలుగులో పత్రికారచన వికాసం, అందులోని మౌలికమైన అంశాలను చర్చించడం ఈ భాగం ప్రధానోద్దేశ్యం.

## 1.2 పత్రికా రచన - అర్థవివరణ

పత్రికా రచన అంటే పత్రికలకు రాయడం. దీన్నే మనం 'జర్నలిజం' (Journalism) అంటున్నాం. ఒక వ్యక్తి తనకు తెలిసిన విషయాన్ని లేదా తోచిన విషయాన్ని అచ్చువేసి ఇతరులకు తెలిజేస్తే దాన్ని పత్రికా రచన అనవచ్చు. ఇది నిరంతర ప్రక్రియ. అంటే ఒక క్రమ పద్ధతిలో, ఒకనిర్ణీత కాలం (Period) లో వెలువడితేనే దానిని పత్రిక అంటాం. పత్రికలు దిన, వార, పక్ష, మాస, ద్వైమాసిక, త్రైమాసిక సంచికలుగా వెలువడుతాయి. కొన్ని పత్రికలు సంవత్సరానికి ఒకటి రెండుసార్లు మాత్రమే వెలువడుతాయి. కాల వ్యవధి ఏదైనా క్రమపద్ధతిలో వెలువడే సమాచార సంపుటమే పత్రిక.

పత్రికా రచనను (Journalism) అంటారని తెలుసుకున్నాం. అయితే ఈ ఇంగ్లీషు పదానికి మూలం 'Jour' అనే ఫ్రెంచి పదం. Jour (జూర్) అంటే రోజు లేదా దినం అని అర్థం. ఇదే పదానికి దినచర్య, దినచర్యాగ్రంథం, విశేషాల నమోదు పుస్తకం వంటి అర్థాలు కూడా వున్నాయి. కాబట్టి ఏదైనా విశేషాన్ని నమోదుచేసే సంపుటాన్ని Journal అని అట్లా నమోదు చేసే పనిని Journalism అని అంటారు.

పత్రికలకు ఎవరు ఏ రకమైన రచన చేసినా జర్నలిజమే అవుతుంది. అది వార్త కావచ్చు. వ్యాసం కావచ్చు, కార్టూన్, ఫొటో ఏ రూపంలో నైనా వుండవచ్చు.సమాచార విశ్లేషణకు, వ్యాప్తికి ఎవరు దోహదం చేసినా అది జర్నలిజమే అవుతుంది. అయితే పూర్తిగా పత్రికా రచననే 'జీవనవృత్తి'గా స్వీకరించి, దానిపైనే ఆధారపడిన పత్రికా ఉద్యోగులను 'వర్కింగ్ జర్నలిస్ట్'లు అని అడపాదడపా రచనలు చేస్తూ ఇతర వృత్తుల్లో వున్న వారిని 'ఫ్రీలాన్స్ జర్నలిస్టు'లు అని అంటారు.

ఇక్కడ గమనించవలసిన మరో విషయం పత్రికా రచన అంటే కేవలం వార్తారచన (News Writing) మాత్రమే కాదు. వార్తా రచన అనేది పత్రికా రచనలోని వివిధ ప్రక్రియల్లో ఒకటి. వార్తలతోపాటు పత్రికల్లో సంపాదకీయాలు, వ్యాసాలు. వ్యాఖ్యలు, ఫీచర్లు, లేఖలు, కార్టూన్లు, ఫొటోలు ఇలా అనేక అంశాలుంటాయి. ఇవన్నీ పత్రికా రచనలలో అంతర్భాగాలే.

## 1.3 పత్రికారచన - చరిత్ర

ప్రపంచంలోని వివిధ భాషల పత్రికారంగంతో పోలిస్తే తెలుగులో పత్రికా రచన చాలా ఆలస్యంగానే ప్రారంభమైందనవచ్చు. 'లిపి' రూపొందిన చాలా ఏళ్ళకు పత్రికారచన మొదలయ్యింది. అది కూడా క్రైస్తవ మిషనరీల మత ప్రచారం కోసం కొందరు హిందూ సనాతన సాంప్రదాయాలు, దురాచారాలకు వ్యతిరేకంగా మరి కొందరు, సాంస్కృతిక, సాహిత్య వికాసానికి కొందరు పత్రికారచన ప్రారంభించారు. అప్పటి పత్రికలకు స్పష్టమైన కాలనియమం (Periodicity) వుండేది కాదు. వారానికో, పక్షం రోజులకో ఒకసారి పత్రికను ప్రచురించేవారు. కాబట్టి సమాచారం కూడా ఆలస్యంగా వెలుగుచూసేది. కొన్నిసార్లు వార్తల కంటే సంపాదకుడి వ్యాఖ్యలు, విశ్లేషణలు, సందేశాలే ఎక్కువగా చోటు చేసుకునేవి. తెలుగు తొలి పత్రికలైన మద్రాసు క్రానికల్ (1833) వృత్తాంతి (1838) వర్తమాన తరంగిణి (1842) గోదావరి మండల విద్యా ప్రబోధిని (1869) ఆంధ్రభాష సంజీవని (1871) వివేక వర్ధిని (1874) శశికళ (1894) వంటివి సంక్షేమం, సంస్కరణాభిలాషతో ప్రారంభించబడినాయి. ఆ తరువాత చాలా కాలానికి తెలుగులో దినపత్రికలు మొదలైనాయి. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు బొంబాయిలో 1908లో వార పత్రికగా ప్రారంభించిన 'ఆంధ్రపత్రిక' ను 1914లో మద్రాసుకు తెచ్చి దిన పత్రిక చేశారు. తరువాత కృష్ణా పత్రిక, ఆంధ్రప్రభ వచ్చాయి. వీటికి తోడు అప్పటి హైదరాబాద్ స్టేట్‌లో వున్న మహబూబ్‌నగర్ నుంచి 'హితబోధిని' (1913) ఇనుగుర్తి అనే గ్రామంనుంచి తెలుగు పత్రిక నల్లగొండ నుంచి నీలగిరి సురవరం ప్రతాపరెడ్డి గారి గోలకొండ (1920) వెలువడినప్పటికి వీటిలో చాలా పత్రికలు నిజాం పాలకుల దమన నీతికి మూతపడిపోయాయి. ఒక్క గోలకొండ మాత్రం చాలా కాలం దిన పత్రికగా కూడా ప్రచురింపబడింది. ఆంధ్రప్రభ (1938) అనంతరం ప్రారంభమై చాలా కాలంవరకు నిలబడి కొనసాగుతున్న పత్రికలలో 1960 తరువాత వెలువడిన ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి 1970 తరువాత ఈనాడు, 1980 తరువాత ఉదయం ఇప్పుడు వార్త (1996) ప్రధానమైనవిగా పేర్కొనవచ్చు.

అయితే ఈ పత్రికల్లో వచ్చిన ప్రధాన పరిణామాల్లో భాష, ప్రచురణాంశాల్లో వచ్చిన మార్పులను చెప్పుకోవచ్చు. తొలినాళ్ళలో కేవలం సంఘ సంస్కరణకే ప్రాధాన్యతనిచ్చిన పత్రికలు ఆ తరువాత సమాచారం చేరవేయడంలో, వ్యాప్తిలో, భాషా ఉద్యమంలో కీలకపాత్ర పోషించాయి. అయితే కొత్త టెక్నాలజీ, ఆధునీకరణ, సమాజంలో వచ్చిన మార్పులు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ వంటి అంశాల ప్రభావం వల్ల పత్రికల్లో పత్రికా రచనల్లో మొత్తంగా పత్రికా వ్యవస్థలోనే గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి.

పత్రికలు పుట్టిన తొలినాళ్ళలో వాటి పరిధి ఇంత విస్తృతంగాలేదు. నిజానికి భారత దేశంలోని పత్రికలకు చాలాకాలం వరకు పరిపూర్ణతలేదు. పత్రికలన్నీ ఏదో ఒక లక్ష్యం కోసం పుట్టినవే. కొన్ని పత్రికలు స్వాతంత్ర్య పోరాటానికి ఉపయోగపడితే మరికొన్ని సంస్కరణదృష్టితో నడిచాయి. ఆ సమయంలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి మాత్రమే అవి ప్రాధాన్యత నిచ్చేవి. అంటే వాటి పరిధి, లక్ష్యం పరిమితమన్నమాట.

కానీ ఇవాళ పత్రికారంగం ఒక పరిశ్రమగా ఎదుగుతోంది. మరోవైపు సమాజం కూడా విస్తృతంగా మార్పులకు లోనవుతోంది. ఇవాళ ప్రజల అభిరుచులు, ఆసక్తులు ఒకే రకంగా లేవు. ఒక్కొక్కరికి ఒక్కొక్క రంగం పట్ల ఆసక్తి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సమాజ అభివృత్తులకు అనుగుణంగా పత్రికలు కూడా మారవలసి వస్తోంది. 'పత్రిక కుటుంబంలోని అందర్నీ

BRAOU

అలరించే విధంగా వుండాలి' అన్నది ఇప్పుడు ప్రధాన సూత్రం అయ్యింది. అంటే సమాజంలోని అన్ని తరాలు, అన్ని వర్గాలు, అన్ని సెక్షన్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పత్రికలు రూపొందుతున్నాయి. తెలుగు పత్రికల్లో ఈ 'విషయబాహుళ్యత' స్పష్టంగా కనిపిస్తుంది. సమకాలీన రాజకీయ వార్తలు, వ్యవహారాలు, ప్రకటనలు, ప్రజాభిప్రాయాలతోపాటు మహిళలు, క్రీడలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విద్యార్థులు, బాలలు, ఉద్యోగులు నిరుద్యోగులకు తెలుగు పత్రికలు ప్రత్యేక ప్రాధాన్యత నిస్తున్నాయి. దీనికితోడు సమకాలీన అవసరాలకు అనుగుణంగా మార్కెట్ విశ్లేషణలు, వినియోగ వస్తువుల వివరాలు, వైద్య, ఆరోగ్య సలహాలు, వాస్తు సూచనలు, మంచి, చెడు ఇట్లా అనేక అంశాలపై వార్తలు - వ్యాసాలు అందిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలకు నిత్యం ఎదురయ్యే అన్ని అంశాల గురించి ఇవాళ పత్రికలు రాస్తున్నాయి.

కేవలం సాంకేతిక, నిర్వాహకపరమైన మార్పులే కాక రాసే పద్ధతుల్లో రచనాంశాల్లో, వస్తువు (Content) లో రూపం (Form) లో కూడా అనూహ్యమైన పరిణామాలు వచ్చాయి.

## 1.4 పత్రికారచన - స్వభావం - పరిధి

సాధారణ రచనకు పత్రికారచనకు స్పష్టమైన తేడా వుంది. ఆ తేడాకు మూలబిందువు పాఠకలోకం. ఏ రచనకైనా మూలకేంద్రం పాఠకులే. అయితే కవిత్వం, కథ వంటి సంక్లిష్ట సాహిత్య ప్రక్రియలతో పోల్చితే పత్రికా పాఠకుల్లో వైవిధ్యత ఎక్కువ. పత్రికలు మొదలు కాక ముందు నుంచే రచనలు అనేకం వెలువడినా అవి ఒక ప్రత్యేక పాఠక వర్గం (Target Group) కోసం వెలువడ్డాయి. పత్రికలకు Target Group అనేది వైవిధ్యంతో కూడుకున్న జన సముదాయం కావడం వల్ల పత్రికారచన కూడా అంతే వైవిధ్య భరితంగా తయారయ్యింది.

పత్రికలకు సంబంధించినంతవరకు ఏది రాయవచ్చు? ఏది రాయకూడదు? అనే చర్చవుండదు. ప్రజలకు ఉపయోగపడే ఎటువంటి సమాచారమైనా పత్రికల్లో ప్రచురించవచ్చు. అంటే ప్రజలకు తెలియాలని భావించినట్లయితే, ఆ సమాచారం వల్ల ప్రజలకు ప్రయోజనం వుంటుందనుకుంటే ఏ సమాచారం అయినా అచ్చువేయవచ్చు. దేశ రహస్యాలు, దేశ భద్రతకు ముప్పుతెచ్చేవి, మత సామరస్యాన్ని దెబ్బతీసే అంశాల వంటి సున్నితమైన విషయాలు మినహా ఏ విషయంపైనైనా పత్రికలు సమాచారం ప్రచురించవచ్చు.

పత్రికారచన మూడు ప్రధాన అంశాలమీద ఆధారపడివుంటుంది. అవి : 1. వస్తువు లేదా రచనాంశం (Content) 2. పాఠకలోకం (Reader Ship). 3. పత్రిక స్వభావం (Nature of Magazine). అంటే మనం ఏ విషయాన్ని చెప్పదలచుకున్నాం, ఎవరికి చెప్పదలచుకున్నాం, ఏ పత్రికాద్వారా చెప్పదలచుకున్నాం, అనేదాన్ని బట్టి ఎలా రాయాలో నిర్ణయించుకోవచ్చు.

ఉదాహరణకు మనం ఒక పోలీసుకాల్పులగురించో, ప్రభుత్వ పతనం గురించో, రైలుప్రమాదం గురించో రాయాలనుకున్నాం. దానికి వార్తను (News) మించిన మార్గం లేదు. అంటే ఆ విషయం తాజా సమాచారం అయితే వార్తా రూపంలో రాస్తాం. లేదా అది ఎప్పుడో ఆర్యులకాలంనాటి ఆహారపు అలవాట్లు గురించో, రెండో ప్రపంచ యుద్ధకాలం గురించో అనుకోండి దాన్ని ప్రత్యేక వ్యాసం (Feature) రూపంలో రాస్తాం. అదే సారాపై నిషేధం ఎత్తివేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంఅయితే విమర్శిస్తూనో, నిందిస్తూనో వ్యాఖ్య (Comment) రాస్తాం. అదే సంపాదకుడు అయితే సంపాదకీయం (Editorial) కార్టూనిస్ట్ అయితే 'కార్టూన్' రూపంలో తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు.

అలాగే ఎవరికోసం రాస్తున్నామో కూడా గుర్తుపెట్టుకోవడం మంచిది. మన పాఠకులను, వారి అవగాహన స్థాయిని, చైతన్యాన్ని బట్టే మనం రచన రూపాన్ని నిర్ణయించుకోవలసి వుంటుంది.

ఉదాహరణకు కంప్యూటర్ రంగాలోనో, ఎలక్ట్రానిక్స్ రంగంలోనో వస్తోన్న మార్పులగురించి ఆయా రంగంలో అధ్యయనాలు చేస్తున్నవారికోసం రాస్తే ఎలారాసినా ఫరవాలేదు. కానీ అదే సామాన్య పాఠకులకోసం అయితే భాష విషయంలో శైలివిషయంలో సరళత అవసరం. సాంకేతిక, పరిశోధన పత్రికలకు సరళంగా రాసినా, సాధారణ దిన, వార పత్రికలకు క్లిష్టంగా రాసినా అది సందర్భోచితం కాదు. అంటే మన Target Readers ను బట్టే భాషను వాడాలి.

ఇక మూడవది పత్రిక స్వభావం. మనం రచన ఏ పత్రికకోసం చేస్తున్నాం అనేది ముందే తెలిస్తే దానికి అనుగుణంగా రాయవచ్చు. మనకు పత్రిక స్వభావం తెలిస్తే ఎలారాయాలి, ఎన్ని లైన్లలో రాయాలి అనేది నిర్ణయించుకోవచ్చు. అంటే అది దిన పత్రికా, వారపత్రికా, పక్ష పత్రికా అనే అవగాహన వుండాలి. దిన పత్రికయితే ఎన్ని లైన్లలో రాయాలి, ఫోటోలు అవసరమా అనేది కూడా చూసుకోవాలి. ఎందుకంటే దిన పత్రికల్లో స్థలం తక్కువ. పెద్దగారాస్తే అచ్చువేయడం, చదవడం కూడా కష్టం. అలాగే వార, పక్షపత్రికలకు రాసేటప్పుడు వివరంగా, విపులంగా రాయాలి. అలాగే పత్రిక స్వభావాన్ని బట్టి కథనంలో కూడా తేడా వుంటుంది. కాబట్టి రచనకు ఉపక్రమించే ముందే వీటిని దృష్టిలో వుంచుకుని రచనా రూపాన్ని (Form) ఎంచుకోవడం అవసరం.

## 1.5 పత్రికారచన - రూపాలు

పత్రికారచన అంటే చాలా మంది వార్తారచన అనే అనుకుంటారు. మనం ముందే చెప్పుకున్నట్టు పత్రికల్లో కేవలం వార్తలేవుండవు. వార్తలు కూడా పత్రికల్లో ఒకభాగం. వార్తలతోపాటు పత్రికల్లో వ్యాసాలు, వ్యాఖ్యలు, ప్రత్యేక వ్యాసాలు ఎడిటోరియల్స్ వుంటాయి. వీటితోపాటు కార్టూన్లు, లేఖలు ఇతర అంశాలు కూడా వుంటాయి. వీటిని ప్రధానంగా 3 రకాలుగా వర్గీకరించవచ్చు. అవి :

### 1.5.1 వార్తలు

వార్తలను పత్రికలు తమ తమ ఉద్యోగులైన విలేకరుల ద్వారా సేకరిస్తాయి. వివిధ ప్రాంతాల్లో వుండే ఈ విలేకరులు ఆయాప్రాంతాల సంఘటనలు, తాజా సమాచారాన్ని సేకరించి ముద్రణా కార్యాలయానికి పంపిస్తారు. గతంలో వీటిని పోస్టుద్వారా, బస్సులద్వారా పంపేవారు. ఇది ఆలస్యానికి కారణం అయ్యేది. ప్రస్తుతం కంప్యూటర్ నెట్‌వర్క్ ద్వారా క్షణాల్లో వార్తలు ప్రచురణ కేంద్రానికి చేరుతున్నాయి. వార్తలతోపాటు వార్తావ్యాసాలు, కథనాలు, వార్తపూర్వాపరాలను, విశ్లేషించే ఇతర రచనలు కూడా ఈ కోవకే చెందుతాయి. వీటిని గురించి వివరంగా తరువాతి భాగాల్లో చర్చించాం.

### 1.5.2 ప్రత్యేక వ్యాసాలు

వార్తలపైగానీ, ఇతర అంశాలపైగానీ ఆయారంగాల్లో అధ్యయనం చేసినవారు, నిపుణులు రాసే వ్యాసాలను ప్రత్యేక వ్యాసాలు (Features) అంటున్నాం. ఇవి వార్తలకు సంబంధించినవైతే వార్తా వ్యాసాలు (News Features) అని, ఇతర రంగాలకు సంబంధించిన విశ్లేషణలు, వ్యాఖ్యానాలు అయితే ప్రత్యేక వ్యాసాలు (Special Features) అని అంటున్నారు.

వీటిలో రాజకీయ వ్యవహారాలు మొదలుకొని, సాహిత్యం, వ్యవసాయం, వాణిజ్యం, క్రీడలు, పర్యావరణం విద్య, వైద్యం ఇట్లా అనేక రంగాల గురించిన విశ్లేషణలు ఉంటాయి. వీటిలో కొన్ని ప్రధానమైన అంశాలపై ప్రత్యేకవ్యాసాలు ఎలా రాయాలో మిగతా భాగాల్లో చర్చించడం జరిగింది.

### 1.5.3 సంపాదక రచన - ఇతర రచనలు

పత్రికా రచనలో సంపాదకీయ రచనలకు ప్రత్యేక స్థానం వుంది. ఒక విషయం మీద సంపాదకుడుగానీ, సంపాదక వర్గంగానీ వ్యక్తం చేసే అభిప్రాయాలే సంపాదకీయాలు. అలాగే సంపాదకీయం ప్రచురించే పేజీల్లోనే కొన్ని ప్రధాన వ్యాసాలను విశ్లేషణలను కూడా ప్రచురిస్తుంటారు. సమకాలీన విషయాలపై ఈ రచనలు విశ్లేషణలు, వ్యాఖ్యానాలు చేస్తుంటాయి.

వీటికి తోడు సంపాదక వర్గం అంటే సబ్ ఎడిటర్లు, న్యూస్ ఎడిటర్లు రాసే విశ్లేషణలు, ఉపోద్ఘాతాలు, కామెంటరీలు, కార్టూన్లు కూడా పత్రికా రచనలో భాగమే. అలాగే వివిధ ప్రాంతాల నుంచి పాఠకులు రాసే లేఖలు, ప్రతి స్పందనలు, అభిప్రాయాలు కూడా పత్రికారచనగానే పరిగణించవచ్చు. పత్రికారచన నియమాలు వీటన్నిటికీ వర్తిస్తాయి. అయితే వీటన్నిటి కంటే వార్తా రచన కొంత భిన్నమైనది. వార్తా రచనను గురించి ఈ ఖండంలో చర్చించి మిగతా రచనల గురించి ముందు ముందు ఖండాల్లో వివరించడం జరిగింది.

## 1.6 వార్తారచన ప్రత్యేకత

పత్రికా రచనలో వార్తారచనకు ఒక ప్రత్యేకత ఉంది. వివిధ ప్రాంతాలనుంచి వార్తలు సేకరించడం ఒక ఎత్తయితే వార్తలు రాయడం ఒక ఎత్తు. వార్త సూటిగా, స్పష్టంగా నాన్చుడు లేకుండా చెప్పాలి. అసలు విషయాన్ని ఒక్క మాటలో, 'లీడ్' లో చెప్పేయాలి. వార్తలు ఎలా రాయాలో ముందరి ఖండాల్లో వివరంగా చెప్పినప్పటికీ వార్తా రచనలో పాత్రికేయులు కొన్ని ప్రాథమికమైన అంశాలను గుర్తుంచుకోవాలి. పాత్రికేయుడు ముందుగా తాను సేకరించిన సమాచారాన్ని అర్థం చేసుకోవాలి. తాను ఎవరి కోసమైతే వార్త రాస్తున్నాడో ఆ పాఠకుల స్థాయిని అంతస్తును అంచనా వేసుకోగలగాలి. పాఠకుల భాషను మాత్రమే వాడాలి. పదాడంబరం పనికి రాదు. వార్తలో కీలకమైన అంశాలను ప్రసక్తాను ప్రసక్తంగా వదిలి వేయకుండా వివరిస్తూ వార్తను అవసరమైన మేరకు విస్తృతపరచాలి. అనవసర గణాంక వివరాలు ఇస్తే పాఠకుడిని తికమకపెట్టినట్టే అవుతుంది. కాబట్టి గణాంక వివరాలను వీలైనంతవరకు తగ్గించాలి. బంద్, హర్తాళ్ వంటి సంఘటనలను సరిగ్గా గుదిగుచ్చినట్టుగా పాఠకుడికి అందజేయాలి.

సమాచార సేకరణ దశలోనే ఒకటికి రెండుసార్లు పోల్చి చూసుకుని నిర్ధారించుకోవాలి. అన్ని రకాల ఆధారాలనూ సమకూర్చుకోవాలి. వార్తా రచనకు ఉపక్రమించే ముందు కొన్ని కీలకమైన అంశాలు గుర్తుంచుకోవాలి. వాటిలో ముఖ్యమైనవి.

### ఎ. వార్త లక్ష్యం

పత్రికా రచయిత తాను రచనకు పూనుకునే ముందు తన లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలి. అంటే ఆ వార్త విశేషం ఏమిటి, ఎందుకు రాస్తున్నాడు రచయితకు తెలియాలి. వార్తా రచనలో భాగంగా వార్తలోని అంశానికి సంబంధించిన పూర్వరంగం ఏమిటో

BRAOU

పాఠకులకు బోధపరచగలగాలి. వార్తాంశాన్ని కాలక్రమనిక పద్ధతి (Chronological order)లో వివరించాలి. ప్రధానాంశాన్ని ముందుగా లీడ్‌లో ప్రస్తావించి మిగతా వివరాలను క్రమానుగతంగా ఇవ్వాలి.


**బి. నిర్మాణం**

వార్తా రచయిత వాస్తు శిల్పి వంటివాడు. భవన నిర్మాణానికి వాస్తుశిల్పి ఒక ప్రణాళిక, బ్లూ ప్రింట్ రూపొందించినట్లే వార్తా రచయిత కూడా సమాచారానికి వార్త రూపం ఇవ్వడానికి ఒక ప్లాన్ రూపొందించుకోవాలి. వార్తా రచయిత తాను చెప్పదలుచుకున్న విషయాన్ని కథన పద్ధతిలో వివరిస్తూ పోవాలి. ఇదొక అల్లికలాగా సాగాలి. కథనం కల్పనలకు, వర్ణనలకు అతీతంగా నడవాలి. కథనంలో ముఖ్యాంశాలను ముందుగా వివరించాలి.

**సి. రూపం**

ముందుగా రూపొందించుకున్న నిర్మాణం ప్రకారం సమాచారాన్ని అల్లుకుంటూపోతే వార్తాంశానికి ఒక రూపం వస్తుంది. ప్రధాన విషయాన్ని ముందు వివరించి, నేపథ్యాన్ని పర్యవసానాలనూ తరువాత రాయడం అవసరం. ఈ వివరాలు తలకిందైన పిరమిడ్ (Inverted Pyramid) రూపంలో అంచెలంచెలుగా పేర్కొనాలి.

వార్త రూపం ఎలా వుండాలో ఈ కింది పటం ద్వారా గమనించండి. శీర్షిక, డేట్ లైన్ వార్త అగ్రభాగానే ఉంటాయి. ఆ తరువాత వార్తాంశాలు ఒక దాని కింది ఒకటి పొందుపరిచి ఉంటాయి.




BRAOU

**శీర్షిక**

వార్తకు శీర్షిక ప్రధానమైంది. నిజానికి కొన్ని శీర్షికలే వార్తలను చదివిస్తాయి. శీర్షిక మొత్తం వార్తకు ప్రాతినిధ్యం వహించేదిగా ఉండాలి. అంటే వార్త సారాంశాన్ని సూచించేదిగా వుండాలి. శీర్షికలు పేలవంగా వుంటే వార్తకు గుర్తింపు ఉండదు. శీర్షిక సార్వత్రికాంశాన్ని ప్రతిబింబిస్తూనే సాధారణ పాఠకుడిని ఆకట్టుకోగలగాలి.

**డేట్ లైన్**

కరీంనగర్, ఆగస్టు 13, బొంబాయి, జనవరి 5, వంటి పదాలు ప్రతి వార్త ముందూ ఉంటాయి. వీటినే డేట్ లైన్ అంటారు. ఇలా శీర్షిక కింద ప్రతి వార్తకూ డేట్‌లైన్ వుంటుంది. కొన్ని సందర్భాలలో వార్తా కథనానికి, న్యూస్ కాలమ్‌కి డేట్ లైన్ ఉండకపోవచ్చు. డేట్ లైన్ ఆ వార్త ఏ ప్రాంతం, ఏ పట్టణం నుంచి వచ్చిందీ సూచిస్తుంది. దీనివల్ల సంఘటన ఎక్కడ జరిగిందో పాఠకుడు గ్రహిస్తాడు. అలాగే ఏ ప్రాంత విలేఖరి దాన్ని రిపోర్టు చేశాడో కూడా తెలుస్తుంది. శీర్షిక చూడగానే కలిగే కుతూహలాన్ని డేట్‌లైన్ కొంతవరకు తీరుస్తుంది. పాఠకుడికి ఆసక్తి కలగడమో, కలగకపోవడమో డేట్ లైన్ చూడగానే తెలుస్తుంది. ఉదాహరణకు "బస్సు బోల్తా ; 40 మంది మృతి" అనే శీర్షికతో వార్త అచ్చయ్యిందనకోండి. సాధారణంగా పాఠకులకు వెంటనే "ఎక్కడ జరిగింది"? అన్న ఆతృత పెరుగుతుంది. డేట్ లైన్‌లో రుమేనియా మే 26 అని వుందనుకోండి ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కానీ "రామగుండం" అని వుంటే వెంటనే వివరాల్లోకి వెళ్ళడం జరుగుతుంది. అంతేకాకుండా ఆ వార్త రాసింది ఎవరో కూడా తెలిసే అవకాశం వుంది.

**1. ప్రధానాంశం**

వార్తల్లో సాధారణంగా ప్రధానాంశం తొలి వాక్యాలలోనే (Intro) వుంటుంది. శీర్షిక చదివిన తరువాత వార్తను వెంటనే చదవాలన్న ఆసక్తి కలగడం సహజం. ఈ ఆసక్తి దృష్ట్యా కీలకమైన సమాచారాన్ని లేదా వార్తకు సంబంధించిన ప్రధానాంశాన్ని తొలి

వాక్యంలోనే చెప్పడం మంచిది. ఇది వార్త లోపల ఏమి ఉన్నదో చెప్తున్నందు వల్ల దానిని Intro అని అంటారు. దీన్నే Lead అని కూడా అంటారు. వార్తలోని ప్రధానమైన భాగం ఇదే నన్నమాట. సంఘటనకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం అంటే ఏమిటి, ఎక్కడ, ఎప్పుడు, ఎలా, ఎందుకు వంటి వివరాలు ఈ భాగంలోనే పొందుపరచాలి.

**2. వివరణ**

ప్రధానాంశాన్ని చెప్పిన తరువాత దాని తాలూకు వివరణను రాయాలి. వివరణ అనేది ప్రధానాంశాన్ని విశ్లేషించగలగాలి. లీడ్‌లో పేర్కొన్న విషయాన్ని వివరించగలగాలి.

**3. పూర్వరంగం**

వార్తలో వివరణ పూర్తయితే వార్తకు సమగ్రరూపం వస్తుంది. అయితే ఆ వార్తకు సంబంధించిన నేపథ్యం ఇస్తే సమగ్రత ఉంటుంది. దీనివల్ల అప్పుడే కొత్తగా ఆ వార్త చదువుతున్న వ్యక్తికి అంతకుముందు ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతుంది. ఈ దృష్ట్యా వార్త పూర్వరంగాన్ని కూడా వివరించడం అవసరం. ముఖ్యంగా గతంలో జరిగిన సంఘటనకు సంబంధించిన Follow up story అయితే ఈ పూర్వ రంగం తప్పనిసరి.

**4. ఆధారాలు**

వార్తను ముగించే ముందు ఆ వార్తకు సంబంధించిన ఆధారాలు కూడా పేర్కొన్నట్టయితే వార్తకు విశ్వసనీయత ఉంటుంది. ఆ వార్త ఎలా బయటపడింది. ఎవరి ద్వారా తెలిసింది తదితర వివరాలు ఇవ్వడం మంచిది.

**5. చిన్న చిన్న వివరాలు**

వార్త ముగింపులో వార్తకు సంబంధించిన చిన్న చిన్న వివరాలు చివరన ఇవ్వవచ్చు. అయితే ఈ వివరాలు ఎడిటింగ్‌లో తొలగించినా వార్తరూపం మారకుండా వుండాలి. అటువంటి వివరాలను కొనమెరుపుగా అందించాలి.

ఈ కింది ఉదాహరణ పరిశీలించండి. (ఈనాడు)

**శీర్షిక: తీహార్ జైలులో చంద్రస్వామి**

*లీడ్ : సి.బి.ఐ. గురువారం రాత్రి మద్రాసులో అరెస్టు చేసిన వివాదాస్పద తాంత్రికవేత్త చంద్రస్వామి, ఆయన ప్రైవేటు సెక్రటరీ కైలాన్‌నాథ్ అగర్వాల్ అలియాస్ మామాజీలను శుక్రవారం ఇక్కడి తీహార్ జైలుకు తరలించారు. చంద్రస్వామి బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ డ్యూటీ మేజిస్ట్రేట్ వీరికి ఒకరోజు జ్యూడీషియల్ రిమాండ్ విధించారు. చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రేమ్‌కుమార్ ముందు శనివారం ఆయనను హాజరుపర్చాల్సిందిగా ఆదేశించారు.*

*వివరణ : చంద్రస్వామిని తీహార్ జైలు నం.1లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఉంచినట్లు ఢిల్లీ జైళ్ల ఐ.జి. ఆర్.ఎస్. గుప్తా తెలిపారు. అయితే చంద్రస్వామిని, మామాజీని ఇతర ఖైదీలతో కలిపి ఉంచారా, లేదా వేరే సెల్‌లో ఉంచారా అనే విషయం చెప్పడానికి ఆయన నిరాకరించారు. వారికి జైలులో 'బి' క్లాసు సౌకర్యాలు కల్పించారా అన్న ప్రశ్నకు 'బి' క్లాసు జైలులో ఉంచాల్సిందిగా డ్యూటీ మేజిస్ట్రేట్ ఆదేశించలేదని గుప్తా తెలిపారు.*

*పూర్వరంగం : లఖుభాయ్ పాఠక్ అనే ప్రవాస భారతీయుడిని మోసం చేసిన నేరంపై నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ కావడంతో చంద్రస్వామిని, మామాజీని గురువారం రాత్రి మద్రాసు అపోలో ఆసుపత్రికి అనుకొని ఉన్న సింధూర్ హోటల్లో సి.బి.ఐ. అధికారులు అరెస్టు చేశారు.*

*ఆధారాలు, ఇతర వివరాలు : శుక్రవారం ఉదయం ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో వారిని ఢిల్లీకి తరలించారు. అనంతరం సి.బి.ఐ హెడ్‌క్వార్టర్స్‌కు తీసుకువెళ్లి దాదాపు అయిదుగంటల పాటు వారిని ఇంటరాగేట్ చేసిన తర్వాత బయటకు తీసుకువచ్చారు. చంద్రస్వామి ఆ సమయంలో తెల్లని కుర్తా, ఆకుపచ్చ రంగు అంగవస్త్రం ధరించి ఉన్నారు. చంద్రస్వామి, మామాజీలు ఇద్దరూ విలేఖరులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి నిరాకరించారు. ప్రధానమంత్రి పి.వి. నరసింహారావుతో సంబంధాల గురించి అడిగినప్పుడు చంద్రస్వామి చేతులు జోడించి మౌనంగా తలవూపారు. సి.బి.ఐ. అధికారులు వారిని తీస్‌హజారీ కోర్టులోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. నిందితులకు ఆరోగ్య కారణాలపై బెయిల్ మంజూరు చేయాలని డిఫెన్స్ న్యాయవాది వాదించారు. హృద్రోగంతో బాధపడుతున్న చంద్రస్వామి మద్రాసులోని ఆసుపత్రిలో దాదాపు అపస్మారక స్థితిలో ఉన్నారని ఆయన తెలిపారు . దీనికి ఆధారంగా డాక్టర్లు ఇచ్చిన డాక్యుమెంటును సమర్పించాలని కోరగా చంద్రస్వామి ఊపిరితిత్తుల ఎక్స్‌రే ప్లేటును మాత్రం డిఫెన్స్ న్యాయవాది సమర్పించారు. "నాకు వైద్యశాస్త్రం గురించి కొంత తెలిసిఉండవచ్చు. అంతమాత్రం చేత ఎక్స్‌రే చూసి బెయిల్ ఇవ్వలేను కదా" అని జడ్జి వ్యాఖ్యానించారు. అయితే తీహార్ జైలులో వీరిద్దరికీ తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని ఆయన ఆదేశించారు.*

BRAOU

## 1.7 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

★ పత్రికారచన సాధారణ రచన కంటే భిన్నమైనది. ఇది ఆధునిక ప్రక్రియ. తెలుగులో పత్రికారచన ప్రారంభమై కేవలం రెండు శతాబ్దాలు కావస్తోంది.

★ భావ ప్రసారానికి, సమాచార వినిమయానికి పత్రికారచన దోహదపడుతుంది. ఆధునిక సమాజాలు సంక్లిష్టమైన ఈ దశలో పత్రికారచన ఒక Net Work లాగా పనిచేస్తోంది. సమాజంలోని అన్ని రంగాలను అనుసంధానం చేయడంలో పత్రికల పాత్ర ఎనలేనిది.

★ పత్రికారచనలో రచనాంశం, పాఠకులు స్థాయి, చైతన్యాన్ని బట్టి రచనారూపం వుంటుంది. పత్రికా రచనా రూపాల్లో వార్త, ప్రత్యేకవ్యాసం, సంపాదకీయాలు, సంపాదక రచనలు ప్రధానమైనవి.

★ వార్తారచన సరళంగా, స్పష్టంగా, సంక్షిప్తంగా వుండాలి. వివిధ ఆధారాలతో నమ్మదగినదిగా ఒక క్రమ పద్ధతిలో వుండాలి.

## 1.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. ఈ కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానం రాయండి.

1. పత్రికారచనలను నిర్వచించి స్వభావం, పరిధిని చర్చించుము.
2. పత్రికా రచన ప్రధాన రూపాలను గురించి చర్చించుము.

II. ఈ కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానం రాయండి.

1. వార్తారచన ప్రత్యేకతను పేర్కొనండి.
2. తెలుగు పత్రికారచన సంక్షిప్త చరిత్ర రాయండి.

BRAOU

**- ఘంటా చక్రపాణి**

# భాగం - 2 : వార్తల సేకరణ; పద్ధతులు-ఆధారాలు

## విషయక్రమం


2.0 ఉద్దేశం

2.1 ప్రవేశిక

2.2. వార్త నిర్వచనం

2.3 వార్త లక్షణాలు

2.4 వార్తల సేకరణ పద్ధతులు

2.4.1. సభలు

2.4.2. చట్ట సభలు

2.4.3. సమావేశాలు

2.4.4. ప్రదర్శనలు

2.4.5. లేఖలు

2.4.6. ప్రకటనలు

2.4.7. బ్రోచర్లు

2.4.8. పరిశోధన

2.4.9 ఇంటర్వ్యూలు

2.5 వార్తల ఆధారాలు

2.6 వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

2.7 ముఖ్య విషయాలు గుర్తించుకుందాం

2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 2.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు.

- వార్త అంటే ఏమిటి?
- వార్తల సేకరణ పద్ధతులేమిటి?
- వాటికి ఆధారాలేమిటి?
- వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి మొదలైన అంశాలను తెలుసుకుంటారు.

## 2.1 ప్రవేశిక

మానవుడు సంఘజీవి. తానున్న ప్రపంచంలో, తన చుట్టూ ఏం జరుగుతోందన్నది తెలుసుకునేందుకు మానవుడు ఆసక్తి కనబరుస్తాడు. తన జీవితంపై ప్రభావం చూపే అంశాలకు ప్రాముఖ్యమిస్తాడు. ఆసక్తి, అభిరుచి ఉన్నప్పటికీ వ్యక్తి మరెవరి సహాయమూ లేకుండా ఇవన్నీ తెలుసుకోవడం అసాధ్యం. ప్రతి రోజు ఉదయమే ఉషా కిరణాలతో పాటే ప్రపంచాన్ని మన కళ్ళ

ముందు సాక్షాత్కరింప చేసేందుకే పత్రికలు ఉన్నాయి. పత్రికలు ప్రపంచ వ్యాప్తంగా జరిగే సంఘటనలను, విషయాలను వార్తలుగా మలిచి మనకు చెబుతాయి. అయితే జరిగే ప్రతి సంఘటనా, తెలిసే ప్రతి విషయమూ వార్త అవుతుందా? కాదని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. అయితే మరేది వార్త? వార్త అంటే ఏమిటి? వార్తకు చాలా మంది చాలా రకాల నిర్వచనాలిచ్చారు. అయితే వార్త అంటే ఇదీ అని కచ్చితంగా చెప్పగలిగే నిర్వచనమేమీ లేదు. కానీ ప్రతి వార్తకు కొన్ని లక్షణాలు తప్పనిసరిగా ఉండాలని అందరూ అంగీకరిస్తారు. వార్త నిర్వచనం, వార్త లక్షణాల సంగతి సరే. ఇంతకీ వార్తలు ఎక్కడ దొరుకుతాయి? బజారులో దొరుకుతాయా? అవును, బజారులో కూడా దొరుకుతాయి. ఒక్క బజారేమిటి వార్తలను పసిగట్టగల నేర్పు వాటిని సేకరించగల సామర్థ్యం, ఓర్పు వున్నట్లయితే మీకు ప్రతి చోటా దొరుకుతాయి. వార్తల కోసం మీరు వెదకనక్కర్లేదు. మీ చుట్టూ వార్తలే. మరి వాటిని సేకరించడం ఎలా? వార్తల సేకరణకు కొన్ని పద్ధతులున్నాయి. సేకరించిన వార్తలన్నింటినీ రాయగలమా? లేదు. అలా రాయకూడదు. సేకరించిన ప్రతి వార్తకు తగిన ఆధారాలు వుండాలి. తగిన ఆధారాలు లేకుండా రాసినదేదీ వార్త అనిపించుకోదు. అది ఊహాగానం మాత్రమే అవుతుంది. వీటన్నింటి గురించి మనం వివరంగా తెలుసుకుందాం.

## 2.2 వార్త నిర్వచనం

వార్త అంటే ఏమిటి? అనే ప్రశ్నకు సరైన జవాబు చెప్పడం అంత సులభం కాదు. వార్తకు ఒక్కొక్కరు ఒక్కో రకమైన నిర్వచనం చెప్పారు. అయితే అందరికీ ఆమోదయోగ్యమైన నిర్వచనమేదీ లేదనే చెప్పవచ్చు.

ఉత్తరం (North), తూర్పు (East), పశ్చిమం (West), దక్షిణం (South) దిక్కుల నుంచి వచ్చే సమాచారమే వార్తలని కొందరంటారు. ఇది వినడానికి బాగున్నప్పటికీ శాస్త్రీయమైన నిర్వచనం కాదు. "ఏది కొత్తదో అది వార్త" (What is new is news) అని మరికొందరి అభిప్రాయం. 'నిన్న తెలియనిది నేడు వార్త' (News is something you don't know yesterday) అని, 'ప్రజలు చర్చించుకునేలా చేసేది వార్త' (Any thing that makes people talk is news) అని మరికొందరు నిర్వచించేందుకు ప్రయత్నించారు. బ్రిటిష్ పత్రికాధిపతి నార్త్ క్లిఫ్ 'అసాధారణమైనది వార్త' అని చెప్పేందుకు 'కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు. మనిషి కుక్కను కరిస్తే వార్త' అన్నారు. 'ఆసక్తికరమైన ఏ సమాచారమైనా సరే వార్త' అనేది అస్పష్టంగా, అసమగ్రంగా వున్నప్పటికీ చాలా వరకు సరిపోయే వివరణగా భావించవచ్చు.

BRAOU

## 2.3 వార్త లక్షణాలు

వార్త ఎలా వుండాలి? అంటే పాఠకునికి ఆసక్తికరంగా వుండాలి అని చెప్పుకోవచ్చు. జరిగే ప్రతి సంఘటనా, తెలిసే ప్రతి విషయమూ వార్త కానేరదనే సంగతి మనం ఇదివరకే చెప్పుకున్నాం. మరి ఏది వార్త అవుతుంది? అంటే ఈ కింది లక్షణాలున్నది వార్త అవుతుంది.

★ సాధారణ, రోజువారీ సంఘటన కాకుండా కొంత ప్రత్యేకత కలిగి వుండాలి.

★ ప్రజల జీవితాలను ప్రభావితం చేసేదిగా వుండాలి.

★ మానవ ప్రగతిని కానీ, వైఫల్యాలను కానీ చిత్రించేదిగా వుండాలి.

★ పత్రిక చదివే స్థానిక పాఠకులకు చేరువైనదిగా, వారికి ఆసక్తి కలిగించేదిగా వుండాలి.

★ వ్యక్తులు, ముఠాలు, కులాలు, మతాలు, జాతులు, దేశాల మధ్య జరిగే ఘర్షణలు.

★ నేరాలు, ఘోరాలు, బీభత్సాలు, ఉపద్రవాలు.

★ ప్రముఖులు చేసే ప్రకటనలు, అసాధారణమైన పనులు, తీసుకునే నిర్ణయాలు.

★ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, పన్నుల విధింపు, తగ్గింపు, జీవన ప్రమాణం తదితర అంశాలు.

రాజకీయాలు, అవినీతి, అక్రమాలు, ప్రముఖుల చర్యలు, సమాజంలో ఘర్షణలు, రోజువారీ జీవితంలో సమస్యలు, సంఘటనల్లో సస్పెన్స్, మిస్టరీ, నేరాలు, ఘోరాలు, కోర్టు తీర్పులు, సెక్స్-కుంభకోణాలు, వివిధ రంగాల్లో ప్రముఖులు, వారి జీవన విధానం, సాధించిన విజయాలు, సాహసకృత్యాలు, ఆస్తిపాస్తులు, పిల్లలు, జంతువులు, వినోదం, విజ్ఞానం, ఆరోగ్యం, మతం, పర్యావరణం, స్థానిక సమస్యలు ప్రకృతి వైపరీత్యాలు, శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన విషయాలన్నీ వార్తలుగా పనికి వస్తాయి. వార్తలేవైనా కచ్చితంగా, స్పష్టంగా, సమగ్రంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. వీటిలో ఏది లోపించినా వార్త విలువ, విశ్వసనీయత తగ్గిపోతుంది.

## 2.4 వార్తల సేకరణ పద్ధతులు

వార్తల సేకరణకు చాలా రకాల పద్ధతులున్నాయి. సంఘటనలు, సభలు, చట్టసభలు, సమావేశాలు, ప్రదర్శనలు, లేఖలు, ప్రకటనలు, ఇంటర్వ్యూలు, బ్రోచర్లు, పరిశోధన తదితర మార్గాల ద్వారా మనం వార్తలను సేకరించవచ్చు.

అవి వినోదం కలిగించేవి కావచ్చు లేదా విషాదభరితమైనవైనా కావచ్చు. బ్రిటిష్ యువ రాజు ప్రిన్స్ ఛార్లెస్, లేడీ డయానాల వివాహ వేడుకా వార్తే, విడాకులూ వార్తే. కుమారి జయలలిత తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆమె పెంపుడు కుమారుడు సుధాకరన్ వివాహం ఒక పెద్ద వార్త. వివాహం ఎంత వైభవంగా జరిగింది? వివాహానికి వచ్చిన ప్రముఖులెవరు? మొదలైన విషయాలు వార్తలైనాయి.

కోస్తాఆంధ్ర తుపాను, కనిష్క విమాన ప్రమాదం, గోరఖ్‌పూర్ రైలు దుర్ఘటన, ప్రకృతి వైపరీత్యాలు మొదలైన విషాద సంఘటనలు ఆసక్తికరమైన వార్తలకు ఆధారలైనాయి. ప్రమాదాలకు సంబంధించి అవి ఎలా జరిగాయి? ఎంత మంది మరణించారు? ఎంత మంది గాయపడ్డారు? తీసుకున్న సహాయక చర్యలేమిటి? వాటితో పాటు బాధితుల కథనాల గురించి సవివరంగా రాయవచ్చు. ఏదైనా దుర్ఘటన జరిగినప్పుడు బాధితులు చెప్పే కథనాన్ని చక్కగా రాసినట్టయితే పాఠకులు ఆసక్తిగా చదివే అవకాశముంటుంది.

### 2.4.1 సభలు

వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసే బహిరంగ సభల్లో ముఖ్యమైన విషయాలు తెలుస్తుంటాయి. తమ సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలు, తీసుకోనున్న చర్యల గురించి సభల్లో ప్రకటిస్తుంటారు.

### 2.4.2 చట్ట సభలు

చట్ట సభలు అసెంబ్లీ, పార్లమెంటు సమావేశాల్లో రాష్ట్రానికి, దేశానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసు కుంటారు. అభివృద్ధి, అవినీతి తదితర విషయాలకు సంబంధించి సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు జవాబు చెబుతారు. ఈ సభల్లో జరిగే చర్చలు, తీసుకునే నిర్ణయాల ప్రజల జీవితంపై ప్రభావం చూపుతాయి. కనుక వీటి పట్ల పాఠకులు ఆసక్తి కనబరుస్తారు.

### 2.4.3 సమావేశాలు

వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు, ప్రభుత్వనేతలు తమ కార్యక్రమాలు, పనుల గురించి ప్రజలకు తెలిపేందుకు విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేస్తారు. ఈ సమావేశాల్లో చెప్పే సమాచారం ముఖ్యమైనదై వుంటుంది. ప్రభుత్వ నేతలు ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు ఈ సమావేశాల్లో వివిధ విషయాలపై ప్రకటనలు చేస్తుంటారు. తమ ప్రభుత్వ మంత్రిత్వ శాఖల ప్రగతి గురించి చెబుతారు. కొన్ని సార్లు విధానపరమైన నిర్ణయాలు ప్రకటిస్తుంటారు.

BRAOU

ఎన్నికల సమయంలో విలేకరులే 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం ఏర్పాటు చేసి వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తుంటారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రముఖులెవరైనా వచ్చినప్పుడు కూడా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తుంటారు. సమావేశాలకు విలేకరులందరూ హాజరై వివిధ విషయాలపై ప్రశ్నలు వేసి సమాచారాన్ని రాబట్టి పాఠకులకు తెలియజేస్తారు.

### 2.4.4 ప్రదర్శనలు

రాజకీయ పార్టీలు, సంస్థలు, సంఘాలు అనేక అంశాలపై ప్రదర్శనలు నిర్వహిస్తుంటాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఎక్కువగా జరిగే ఈ ప్రదర్శనలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తాయి. కనుక పాఠకులకు ఆసక్తి కలిగిస్తాయి. సెలెక్టెడ్ టీచర్లు 1995లో ఏడాది పాటు నిరసన ప్రదర్శనలు నిర్వహించి ప్రభుత్వ దృష్టి, కోర్టుల దృష్టి తమవైపు మళ్ళేలా చేసుకోవడంలో విజయం సాధించారు. మహానగరాల్లో ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట ఏదో ఒక ప్రదర్శన జరుగుతూనే వుంటుంది. ఈ నిరసన ప్రదర్శనలకు భిన్నమైనవి మరో రకం ప్రదర్శనలు. ఈ ప్రదర్శనల్లో వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన వస్తువులు, కళాఖండాలు వుంటాయి. పారిశ్రామిక, వ్యవసాయ, యంత్రసామాగ్రి, పుస్తక ప్రదర్శనలు కూడా జరుగుతుంటాయి. ఆయా అంశాలకు సంబంధించిన సమస్త సమాచారమంత ప్రదర్శనల్లో లభిస్తుంది.

### 2.4.5 లేఖలు

పాఠకులు రాసే లేఖల్లో ఒక్కోసారి ఎంతో సమాచారం లభిస్తుంది. కొన్నిసార్లు సమాచారం లభించనప్పటికీ ముఖ్యమైన వార్తలకు క్లూలు దొరుకుతాయి. తమ ప్రాంతంలోని సమస్యలు లేదా అధికారుల అవినీతి, కుంటుపడిన అభివృద్ధి, రాజకీయ నాయకుల అక్రమాల గురించి పాఠకులు రాసే లేఖల్లో లభించే సమాచారం ఆధారంగా పరిశోధించి వార్తలు రాయవచ్చు.

### 2.4.6 ప్రకటనలు

ప్రభుత్వాధినేతలు, అధికారులు విడుదల చేసే ప్రకటనల్లో ఎంతో సమాచారముంటుంది. ప్రభుత్వ ప్రగతి, వివిధ మంత్రిత్వశాఖల పని తీరు, అభివృద్ధి, సమస్యల గురించిన వివరాలు లభిస్తాయి. ప్రభుత్వ ప్రైవేటు రంగ పరిశ్రమలు, సంస్థలు కూడా ప్రకటనల విడుదల చేస్తుంటాయి. ఈ ప్రకటనల్లో ఆ కంపెనీలు సాధించిన ప్రగతి, చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరాలు లభిస్తాయి.

రాజకీయ నాయకులు, పార్టీలు తమ కార్యక్రమాల గురించి ప్రకటనలు జారీ చేస్తుంటాయి. రాజకీయ పార్టీలు. నాయకులు చేసే ప్రకటనల్లో ఇతరులపై ఆరోపణలు కూడా ఉంటాయి. ఈ ఆరోపణలు, విమర్శలను పరిశీలించి పరిశోధించినట్టయితే మంచి వార్తలు లభించే అవకాశముంటుంది.

### 2.4.7 బ్రోచర్లు

కంపెనీలు, సంస్థలు విడుదల చేసే బ్రోచర్లులో ఆయా కంపెనీలు, సంస్థలకు సంబంధించి సమగ్రమైన సమాచారం లభిస్తుంది. కంపెనీ లాభనష్టాలు, ప్రగతి, విస్తరణ తదితర వివరాలుంటాయి. కంపెనీల హౌస్ జర్నల్స్‌లో కూడా తగినంత సమాచారం లభిస్తుంది. కంపెనీలోని అధికారులు, వారి కుటుంబాలు, కార్మికులు ఇతర వర్గాల సంక్షేమ సమాచారం కూడా లభ్యమవుతుంది.

### 2.4.8 పరిశోధన

వార్తా రచనలో పరిశోధన ముఖ్యమైనది. మనకు లభించిన సమాచారం సరైనదా, కాదా? అనితెలుసుకునేందుకు పరిశోధన అవసరం. అవినీతి, అక్రమాలు, నేరాలు తదితర అంశాలకు సంబంధించి అందిన క్లూ ఆధారంగా మరింత పరిశోధన చేసి వాటిని బయటపెట్టాల్సి ఉంటుంది. రాజకీయ నాయకులు, అధికారులు చెప్పే అభివృద్ధి లెక్కలు, నిధులు మంజూరు తదితర విషయాల నిగ్గు తేల్చేందుకు పరిశోధన తప్పనిసరి.

BRAOU

### 2.4.9 ఇంటర్వ్యూలు

వార్తా సేకరణలో ఇంటర్వ్యూలు ముఖ్యమైనవి. రాజకీయ నాయకుల, ప్రభుత్వాధినేతల, ప్రముఖుల గురించి సమగ్రమైన సమాచారాన్ని పాఠకులకు అందజేసేందుకు ఇంటర్వ్యూలు ఎంతో తోడ్పడతాయి. ఇంటర్వ్యూలు వ్యక్తిగత ఇంటర్వ్యూలు, ఫోన్ ఇంటర్వ్యూలు, ప్రశ్నావళి ఇంటర్వ్యూలని మూడు రకాలు. అయితే మన దేశంలో వ్యక్తిగత ఇంటర్వ్యూలకే ప్రాధాన్యముంది. ఇది ఎంతో అనువైనది కూడా.

**అభ్యాసం-1 : వార్తలు ఎక్కడ లభిస్తాయి?**

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

## 2.5 వార్తల ఆధారాలు

వార్తలకు ఆధారాలు తప్పనిసరిగా వుండాలి. అధారాలు లేని వార్తలకు విలువగానీ, విశ్వసనీయత గానీ ఉండవు.

సంఘటనలకు సంబంధించి సమాచారం సేకరించినప్పుడు అధికారుల అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవాలి. దుర్ఘటనలు జరిగినప్పుడు మృతుల సంఖ్య, గాయపడిన వారి సంఖ్య గురించి ప్రభుత్వ, ఆసుపత్రి అధికారుల నుంచి అడిగి తెలుసుకోవాలి. ప్రమాద కారణాల గురించి ఊహాగానాలు చేయకుండా అధికారులను, బాధితులను అడగడం మంచిది.

చట్ట సభల్లో జరిగే చర్చలు తీసుకున్న నిర్ణయాలను అవసరమైతే అధికారిక రికార్డులతో సరి చూసుకోవాలి. ఒక్కోసారి ప్రకటనలు చేసిన సంబంధితులు వాటిని మార్చుకోవచ్చు లేదా ఉపసంహరించుకోవచ్చు. అంకెలను ఒకటికి రెండు సార్లు సరి చూసుకోవడం వల్ల పొరపాట్లు జరిగేందుకు అవకాశముండదు.

రాజకీయ నాయకులు ఒక్కోసారి తాము చెప్పిన విషయాన్ని పత్రికలు వక్రీకరించాయని అనడం మనం గమనిస్తుంటాం. సభల్లో, సమావేశాల్లో, ఇంటర్వ్యూల్లో నాయకులు ఏదో ప్రకటన చేయడం, అది కాస్తా వివాదాస్పదమయ్యే సరికి తామలా అనలేదని చెప్పి తప్పించుకునేందుకు ప్రయత్నించడం సహజం. అలాంటి సందర్భాల్లో వారు చెప్పిన విషయాలను రికార్డు చేసుకోవడం మంచిది. నాయకులు ప్రెస్ నోట్లు జారీ చేయడం, అవి ప్రచురితమయ్యాక ఖండించడం కూడా జరుగుతుంటుంది. పత్రికా ప్రకటనల ఆధారంగా వ్రాసిన వార్తలు ఒక్కోసారి వివాదకారణమవుతుంటాయి. నిజానికి వివిధ సంస్థలు, వ్యక్తులు జారీ చేసిన పత్రికా ప్రకటనలను కనీసం నెల రోజుల వరకు భద్రపర్చడం బావుంటుంది.

మనం రాసే వార్తలకు విలువ, విశ్వసనీయత ఉండాలంటే తగిన ఆధారాలతో రాయాలి. మనం రాసే వార్తలను బట్టి ఆ పేపర్ క్లిప్పింగులు, అధికారిక పత్రాలు, ప్రకటనలు అవి ప్రచురితమైన తేదీలను ఉటంకించడం మంచిది.

## 2.6 వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలు

వార్తా సేకరణలో తీసుకోవలసిన మొట్టమొదటి జాగ్రత్త - మనం సేకరించే వార్త పాఠకునికి ఆసక్తి కలిగిస్తుందో లేదో పరిశీలించాలి. పాఠకునికి ఆసక్తి లేని వార్త సేకరించడం, దాని కోసం సమయం వెచ్చించడం వృథా అవుతుంది.

BRAOU

సంఘటనలకు సంబంధించి సమాచారాన్ని సేకరించేటప్పుడు మరింత జాగ్రత్త వహించాలి. ప్రమాదంలో మృతుల, బాధితుల వివరాలు రాసినప్పుడు పొరపాట్లు లేకుండా చూసుకోవాలి. వార్తా సేకరణ సమయంలో అధికారులకు ఇబ్బంది కలిగించరాదు. మత కలహాల సంఘటనల గురించి రాసినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. నిష్పక్షపాతంగా, ఎవరి మనోభావాలను గాయపర్చకుండా, ఉద్వేగాలను రెచ్చగొట్టకుండా వుండాలి. బాధితుల కథనాల సేకరణలో ఏ ఒక్క వర్గానికీ ప్రాధాన్యమివ్వకుండా అన్ని వర్గాల వారి అభిప్రాయాలు తెలుసుకోవాలి.

చట్టసభల వార్తలు రాసేప్పుడు హక్కుల ఉల్లంఘన విషయం గుర్తుపెట్టుకోవాలి. ప్రజా ప్రతినిధుల గౌరవ మర్యాదలకు భంగకరంగా వార్తలు రాయరాదు. స్పీకర్ రికార్డుల నుంచి తొలగించిన అంశాలను, మాటలను ఎట్టి పరిస్థితుల్లోను రాయకూడదు. సభలో మాట్లాడిన, ప్రకటనలు చేసిన వారి పేర్ల విషయంలో పొరపాటు చేయరాదు. అయోధ్యలో ఆలయాన్ని ఆరునూరైనా నిర్మిస్తామని మార్క్సిస్టు సభ్యుడు చెప్పినట్లు రాస్తే గొడవ తప్పదు. సభ్యుని పేరు గురించి అనుమానమేమైనా ఉంటే తోటి పాత్రికేయుడిని అడిగి తెలుసుకోవడం మంచిది.

కోర్టు విషయంలో కూడా జాగ్రత్తగా వ్యవహరించాలి. న్యాయమూర్తులకు, వారి తీర్పులకు దురుద్దేశాలు అంటగడితే కోర్టు ధిక్కారనేరం కింద శిక్ష అనుభవించక తప్పదు.

రాజకీయ నాయకులు పరస్పరం చేసుకునే ఆరోపణల విషయంలో కూడా జాగరూకత అవసరం. ఆరోపణ చేశారు కదా అని రాస్తే పరువు నష్టం కేసు ఎదుర్కోవాల్సి రావచ్చు. సంఘంలో పరువు, ప్రతిష్ట కలిగి ఉన్నత స్థానాల్లోని వ్యక్తులపై అవినీతి, అక్రమాలు తదితరాలకు సంబంధించి ఏదైనా రాసే ముందు ఒకటికి రెండు సార్లు ఆధారాలను సరిచూసుకుని రాయాలి. లేనట్టయితే ఇబ్బందులు తప్పవు. నేర ప్రపంచపు రారాజు దావూద్ ఇబ్రహీంతో తనకు సంబంధాలున్నాయని రాసినందుకు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి శరద్‌పవార్ 'ఔట్‌లుక్' (outlook) పత్రికపై 10 కోట్ల రూపాయలకు పరువు నష్టం దావా వేసిన విషయం తెలిసిందే.

ఇంటర్వ్యూలకు సంబంధించి కూడా ఈ జాగ్రత్తలు పాటించినట్టయితే వివాదాలకు తావుండదు. 1). ముందుగా మనం ఇంటర్వ్యూ చేయబోయే వారి గురించి పూర్తి సమాచారం సేకరించాలి. వారి అలవాట్లు, అభిరుచులు తెలుసుకోవాలి. 2). ఇంటర్వ్యూ చేయబోయే ముందు కనీసం పది ప్రశ్నలైనా రాసి పెట్టుకోవాలి. ఆ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేటప్పుడు అనుబంధ ప్రశ్నలు వేసే అవకాశం లభిస్తుంది. 3) మనం ఎవరినైతే ఇంటర్వ్యూ చేయబోతున్నామో వారికి ఆసక్తిగల విషయాలను మాట్లాడుతూ మనకు కావలసిన సమాచారాన్ని రాబట్టుకోవాలి. 4). ఇంటర్వ్యూలో ప్రశ్నలు స్పష్టంగా, సూటిగా, సరళంగా, క్లుప్తంగా ఉండాలి. 5) ఇంటర్వ్యూ ఇస్తున్న వ్యక్తి మన ప్రశ్నలకు ఆగ్రహావేశాలు వ్యక్తం చేసినప్పటికీ మనం ప్రశాంతత కోల్పోకూడదు. 6) అసలు విషయం పక్కదారి పట్టినట్టయితే ఆ సంగతి వారికి మర్యాదగా చెప్పాలి. 7) ఎదుటి వ్యక్తి తన ప్రత్యర్థులపై నిందారోపణలు చేసినట్టయితే వాటిని రాయమంటారా? అని అడగాల్సి వుంటుంది. 8) సాధ్యమైనంత వరకు సామరస్య, ఆహ్లాదకర వాతావరణంలో ఇంటర్వ్యూ చేయడం మంచిది 9) ఇంటర్వ్యూలో చెప్పిన విషయాలు పత్రికలో వచ్చిన తర్వాత తానలా అనలేదని ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తి ఖండించే అవకాశముంటుంది. మనం ఆయన చెప్పిందే రాశామని రుజువు చేసుకోవాల్సి వుంటుంది అందుకే ఏ ఇంటర్వ్యూనైనా రికార్డు చేయడం మంచిది.

ఫోన్ ద్వారా, పోస్టు ద్వారా జరిపే ఇంటర్వ్యూల కన్నా ముఖాముఖి ఇంటర్వ్యూలే అనువైనవి. ఇంటర్వ్యూ ఇచ్చే వ్యక్తి ముఖకవళికలను, వారి మనోభావాలను గుర్తించడానికి దీనిలో వీలవుతుంది. ఫోన్, పోస్టు ఇంటర్వ్యూల్లో మనకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టేందుకు అవకాశం తక్కువ. చాలా మంది తమకన్నా తక్కువ స్థాయిల్లో వున్న వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడేందుకు అంతగా ఇష్టపడరు. మన ఫోన్లు సరిగా పనిచేయవు కనుక సంభాషణ సరిగా వినిపించక వ్యక్తీకరణ పొరపాట్లు జరిగే ప్రమాదం ఉంది. ఫోన్ సంభాషణ ఎవరైనా వినే అవకాశం కూడా ఉంటుంది.

BRAOU

పోస్టులో ప్రశ్నావళి పంపి ఇంటర్వ్యూ చేయడం కూడా అంత అనుకూలమైంది కాదు. ఈ విధానంలో అనుబంధ ప్రశ్నలకు తావు లేదు. పోస్టల్ జాప్యం ఎక్కువ. మనం పంపిన ప్రశ్నావళి ఎప్పుడు చేరుతుందో, అసలు చేరుతుందో లేదో తెలియదు. చేరిన తర్వాత ఎదుటి వ్యక్తి ఎప్పుడు ఓపిక చేసుకుని సమాధానాలు రాసి తిరిగి పంపిస్తారో తెలియదు. ఈ సమస్యల కారణంగా ముఖాముఖి ఇంటర్వ్యూలు అనుకూలమైనవని చెప్పవచ్చు.

**అభ్యాసం - 2 : మీకు అందుబాటులో ఉన్న రాజకీయ నాయకుడిని ఇంటర్వ్యూ చేసేందుకు ప్రశ్నావళిని రూపొందించండి?**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 2.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ ఆసక్తికరమైన ఏ సమాచారమైనా సరేవార్త అనేది అస్పష్టంగా, అసమగ్రంగా ఉన్నా వార్త నిర్వచనానికి దగ్గరగా కన్పించే వివరణ.

★ వార్తకు లక్షణాలున్నాయి. సేకరణ పద్ధతులున్నాయి. సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, లేఖలు, ఇంటర్వ్యూల వంటివి వార్తలకు ఆధారాలు.

★ వార్తల సేకరణలో కేవలం విలువ, విశ్వసనీయతలే ప్రధానం కాదు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు కొన్ని ఉన్నాయి.

## 2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వార్తల సేకరణలో తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి?
2. ఇంటర్వ్యూకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలపండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. 'వార్త'ను నిర్వచించండి?
2. సమావేశాలు ఎలా రిపోర్టు చేయాలి?

**- ఎం.ఇ.వి. ప్రసాదరెడ్డి**

BRAOU

# భాగం - 3 : వార్తా రచన - విలువలు

## విషయక్రమం

3.0 ఉద్దేశం

3.1 ప్రవేశిక

3.2 వార్తల విలువలు

3.3 వార్తల ఎంపిక

3.4 వార్తల ప్రచురణలో జాగ్రత్తలు

3.5 విలువలు - వాటి ప్రాధాన్యం

3.5.1. సంఘటన

3.5.2. కాలనియతి

3.5.3. సామీప్యత

3.5.4. ప్రాముఖ్యత

3.5.5. పర్యవసానం

3.5.6. ప్రభావం

3.5.7. ఘర్షణ

3.5.8. నిశ్చేతన, విమర్శ

3.5.9. నవ్యత

3.5.10 మానవీయత

3.5.11. అభివృద్ధి, ప్రగతి

3.6 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

3.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 3.0. ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు.

- వార్తల విలువలు
- వార్తల ఎంపికలో తీసుకోవలసిన జాగ్రత్తలు
- వార్తల ప్రచురణలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుసుంటారు.

## 3.1 ప్రవేశిక

అసాధారణమైనవీ. అసహజమైనవీ, పాఠకుల్లో ఆసక్తిని కలిగించేవీ వార్తలుగా గుర్తింపు పొందుతున్నాయి. పాఠకుని మానసిక స్థితిని బట్టి అతనికి కొన్ని అంశాల మీద ఆసక్తి, మరికొన్ని అంశాల మీద అనాసక్తి కలుగుతుంది. కాలమాన పరిస్థితులకు



Dr. BRAOU LIBRARY
Acc. No: 115091
Class No:

అనుగుణంగా వార్త నిర్వచనం మారుతూవుంటుంది. వార్త నిర్వచనంపై భిన్నాభిప్రాయాలుండగా, వార్తలకు కొన్ని మౌలిక విలువలు లేదా లక్షణాలు వుండాలన్న విషయంపై ప్రపంచ వ్యాప్తంగా ఏకాభిప్రాయముంది.

## 3.2 వార్తల విలువలు

1) సంఘటన (Incident)

2) కాలనియతి/కాలానుగుణత (Timeliness)

3) సమీప్యత (Proximity)

4) ప్రాముఖ్యం (Prominence)

5) పర్యవసానం (Consequence)

6) ప్రభావం (Impact)

7) ఘర్షణ (Conflict)

8) నిశ్చేతన, విమర్శ (Negative, Criticism)

9) నవ్యత (Novelty)

10) మానవీయత (Human Interest)

11) అభివృద్ధి/ప్రగతి (Development)

ఈ అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా ఏకాభిప్రాయం కుదిరినప్పటికీ ఈ జాబితా సమగ్రం కాదు. పిల్లలకు సంబంధించిన వార్తలు, వాతావరణంలో వచ్చే మార్పులు, జాతి వైరుధ్యాలు, రాగద్వేషాలు, ప్రముఖుల వ్యక్తిత్వంలో వుండే అల్ప లక్షణాలు, ధనార్జనకు గల అవకాశాలు మొదలైన ఎన్నో అంశాలు పాఠకులకు అసక్తి కలిగిస్తాయి. ఎంతమంది పాఠకులున్నారో అన్ని రకాల వార్తలు ఉన్నాయని తలపండిన పాత్రికేయులు అంటుంటారు. పత్రికలకు పాఠకులు ఎవరు? వారి అవగాహన స్థాయి ఏమిటి? అని గుర్తించి ముందుకు సాగాలి.

BRAOU

## 3.3 వార్తల ఎంపిక

అన్ని పత్రికలకూ అన్ని రకాల వార్తలు అవసరం కావు. అవసరమనిపించినా అన్ని వార్తలనూ ఒక విధమైన ప్రాధాన్య క్రమంలోప్రచురించడం సాధ్యం కాదు. కాలం, స్థలం అనే రెండు మహత్తర శక్తులు పత్రికా ప్రచురణకు పరిమితులు విధిస్తుంటాయి.

పత్రికా కార్యాలయానికి వచ్చిన వార్తలన్నింటికీ పత్రికల్లో స్థానం లభించడం అసాధ్యం. వార్తల స్వీకరణలో పత్రికల స్వభావం, లక్ష్యం, పరిమాణం ప్రధాన పాత్ర వహిస్తాయి. తక్కువ మంది పాఠకుల కోసం కాక ఎక్కువ మంది పాఠకులకు ఎక్కువ ఆసక్తి కలిగించే వార్త ఏదో గమనించి దాన్ని ప్రచురించాలి. సరైన వార్తల ఎంపిక ఎంతో ముఖ్యం. అన్ని సమయాల్లోనూ సరైన కచ్చితమైన ఎంపిక పద్ధతులను పేర్కొనడం సాధ్యం కాదు. కానీ వార్తలు ప్రచురించే ముందు పాత్రికేయులు కొన్ని అంశాలను పరిశీలించాల్సి వుంటుంది. అవి

1) ఈ అంశం రోజువారీ సంఘటనల కంటే భిన్నమైందా?

2) ఈ విషయం ఎక్కువ మంది పాఠకులను చదివింప చేస్తుందా? ప్రజలను ఆకర్షిస్తుందా?

3) ఈ విషయం ఒక వ్యక్తి అభిప్రాయాన్ని తెలియజేసేదైతే ఆ అభిప్రాయం నిజంగా పదుగురు తెలుసుకోవాల్సిందేనా?

**ఇక ఎంపిక చేయకూడని వార్తలేవో తెలుసుకుందాం.**

★ కొనసాగే ఏదో ఒక పరిణామమో, సంఘటనో, దుర్ఘటనో, సన్నివేశమో లేని వార్తలను ప్రచురణకు స్వీకరించకూడదు. ఒకవేళ స్వీకరించినా ఏదో మారుమూల పేజీలో సంక్షిప్తంగా ప్రచురించాలి.

★ నిశ్చేతన (Negative) వార్తలను పరిహరించాలి. పాఠకుల దృష్టిలో ఎంతో కొంత ప్రాముఖ్యం, ప్రాధాన్యం లేని వార్తలను నిశ్చేతన వార్తలంటారు. అంతేగాని ఏదో ఒక వ్యతిరేక క్రియా రూపమున్నంత మాత్రాన అది వ్యతిరేక వార్త కాదు.

★ దరఖాస్తులు, విజ్ఞాపనలు, కోరికలు, వాగ్దానాలు, ప్రతిపాదనలు మొదలైన వాటి ద్వారా ఏదో ఒక సమాచారం అందించే వార్త గణాంక వివరాలవంటి సమాచారం లేకుండా అందినప్పుడు గానీ, ప్రజాభిమానమో, ప్రజా ప్రయోజనమో సాధించదనిపించినప్పుడు గానీ మారుమూల పేజీల్లో సంక్షిప్తంగా ప్రచురించడానికి మాత్రమే యోగ్యమని గుర్తించాలి.

**అభ్యాసం : 1 వార్తల ఎంపికలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి.**

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

BRAOU

## 3.4 వార్తల ప్రచురణలో జాగ్రత్తలు

వార్తల ప్రచురణ సమయంలో తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి వుంటుంది. ఆ జాగ్రత్త అనేది పత్రిక స్వభావాన్ని బట్టి వుంటుంది. అయితే ఏ పత్రికలోనైనా వార్తల ప్రచురణ సమయంలో జాగ్రత్తలు పాటించడం మంచిది.

★ రాజకీయ నాయకులు, ప్రముఖులు పరస్పరం దూషించుకోవడం కూడా వార్త అవుతుంది. అయితే వారు ఉపయోగించిన అసభ్యకరమైన అశ్లీలమైన భాషను వార్తా ప్రచురణ సమయంలో తొలగించాలి. అశ్లీల ప్రసంగాలను ప్రచురించడం నేరం కాబట్టి పాత్రికేయులు ఆ దుర్భాషలను సవరించడం తప్పనిసరి.

★ సంపాదకీయ రచనలో సైతం ఎవరినీ కించపరిచి, రెచ్చగొట్టే, అగౌరవ పరిచే రాతలు రాయరాదు. ఎవరిని గురించి నిర్లక్ష్యధోరణిలో రాయకూడదు.

★ వార్తా కథనంలో సందర్భశుద్ధిని పరిగణించకుండా అతిశయోక్తులు రాయకూడదు. అర్థ రహితమైన, ప్రయోజన శూన్యమైన విశేషణాలను ప్రయోగించకూడదు.

★ ప్రధాన వార్తను అర్థం చేసుకోవడంలో అడ్డంపడే అనవసర విషయాలను రాయరాదు. ప్రధాన వార్తకు సంబంధం లేని అ ప్రధానాంశాలకు వార్తా కథనంలో స్థానం లేదు.

★ ఆయా వార్తలను రాసేటప్పుడు నిష్కారణ మనో వికారాలకు గురికారాదు. అభిమాని, దురభిమాని, ప్రసంగాలు చేయరాదు. పాతకాలపు పడికట్టు రాళ్ళ వంటి అర్థ రహిత ప్రయోగాలను పదేపదే వాడరాదు. ఊత పదాలను గుప్పించరాదు.

ఈ జాగ్రత్తలన్ని తీసుకుని వార్తా రచనకు ముందు పత్రికా విధానం ప్రకారం ఎటువంటి వార్తలను ప్రచురించాలో, ఏ రకం వార్తలకు ఎంత ప్రాధాన్యమిచ్చి ఎంత పరిమితిలో వార్తా కథనం ముగించాలో గమనించాలి. నియమితకుల పరిమితి కానీ, స్థల పరిమితి గానీ అతిక్రమించకూడదు.

## 3.5 విలువలు - వాటి ప్రాధాన్యం

కాలనియతి, సామీప్యత ప్రాముఖ్యత, పరిణామం, ఘర్షణ, మానవీయత మొదలైన లక్షణాలు కలిగిన వార్తలు పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి. వీటిని మౌలిక లక్షణాలుగా సర్వత్రా అంగీకరిస్తారు. ఈ మౌలిక లక్షణాలను, వాటి విలువలను వివరంగా తెలుసుకుందాం.

### 3.5.1 సంఘటన

వార్తకు మూలం సంఘటన. ఏదైనా ఒక సంఘటన జరిగినప్పుడు, జరుగుతున్నప్పుడు లేదా జరగనున్నప్పుడు అది ఆధారమవుతుంది. సంఘటన లేకుండా వార్తలుండవు. ఉదాహరణకు బస్సు నదిలో పడి 50 మంది మృతి చెందడం "జరిగిన సంఘటన" అవుతుంది. మెజారిటీ సాధనకు అధికార పార్టీ చేస్తున్న బేరసారాలు "జరుగుతున్న సంఘటన". మరో అయిదు రోజుల్లో సంపూర్ణ సూర్యగ్రహణం సంభవించడం "జరగనున్న సంఘటన".

### 3.5.2 కాలనియతి

వార్తను సకాలంలో అందిస్తేనే పాఠకులు దానిని స్వీకరిస్తారు. సకాలంలో వార్తలు అందించడంలోనే పాత్రికేయుల నేర్పు ప్రాముఖ్యత ఇమిడి వున్నాయి. పత్రికల విజయం కూడా సకాలంలో, సరైన వార్తలను పాఠకులకు అందజేయడం మీద ఆధారపడి ఉంది. వార్త జీవన కాలం చాలా తక్కువ. వార్తా పత్రికలు మాత్రమే రంగంలో ఉన్నప్పుడు వార్త జీవిత కాలం 24 గంటలైనా వుండేది. ఎలక్ట్రానిక్ ప్రసార సాధనాలు వచ్చిన తర్వాత వార్త ఆయుష్షు బాగా తగ్గిపోయింది. ప్రతిక్షణం పాత్రికేయులు సకాలంలో వార్తలు అందించడానికి తంటాలు పడేది. ఇందుకే సంఘటన జరిగిన వెంటనే ప్రచురిస్తే అది పాఠకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఎప్పుడో జరిగిన సంఘటనల పట్ల ప్రజలకు ఆసక్తి వుండదు. వార్తా సాధనాల సామర్థ్యం బాగా పెరగడం వల్ల పాఠకుల్లో ఆసక్తిని కలగజేయడం చాలా శ్రమతో కూడుకున్న పని.

అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ హత్య వార్త ప్రపంచ ప్రజలందరికి చేరేసరికి చాలా సమయం పట్టింది. అందువల్ల ఆ సంఘటన చాలా కాలం వార్తగా చలామణి అయింది. అయితే అమెరికా మరో అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నెడీ హత్య వార్త ప్రపంచ ప్రజలందరికీ చేరడానికి కొద్ది నిమిషాలు మాత్రమే పట్టింది. ప్రచార సాధనాల సామర్థ్యం పెరిగిన కొద్ది వార్త అయుష్షు తగ్గిపోతుందని గుర్తించాలి. అయితే కొన్ని ప్రధాన వార్తలను ఆ పాఠకుడు చదివిన తర్వాత కూడా ఆ వార్తల నేపథ్యం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తిని కలిగి వుండవచ్చు. ఈ నేపథ్యాన్ని వార్తతో పాటు ఇవ్వగలిగితే పాఠకుడు వెంటనే వివరాలు తెలుసుకుని సంతృప్తి చెందుతాడు. అర్ధరాత్రి జరిగిన సంఘటన గురించి దిన పత్రికలు మరుసటి రోజు పూర్తి వివరాలు ప్రచురించలేకపోవచ్చు. అందువల్ల తర్వాత రోజు పత్రికల్లో వార్తల పూర్తి వివరాలు ప్రచురించవచ్చు. అటువంటి పూర్తి వివరాలు కూడా సకాలంలో ప్రచురించినట్లుగానే పాఠకులు భావించక తప్పదు.

BRAOU

### 3.5.3 సామీప్యత

సామీప్యత అనేది వార్తకు ప్రాణం వంటిది. పాఠకులు తమ ఇరుగుపొరుగున, తమ ప్రాంతంలో, తమ రాష్ట్రంలో, తమ దేశంలో జరిగిన సంఘటనల పట్ల ఆయా సందర్భాన్ని బట్టి ఆసక్తి కనబరుస్తారు. ప్రపంచమంతా ఒక "విశ్వ గ్రామం" (గ్లోబల్ విలేజ్)గా రూపొందుతున్నా పాఠకుడు తన సహజ లక్షణాలను కోల్పోవడం లేదు. దేశాల మధ్య, ప్రాంతాల మధ్య ఆటల పోటీలు, యుద్ధాలు జరుగుతున్నప్పుడు ఆయా జాతుల, ప్రాంతాల ప్రజలు తమ జాతి, ప్రాంతం పట్ల మొగ్గు చూపడం ఇందుకు తిరుగులేని ఉదాహరణ. వార్తా పత్రికల్లో ప్రచురించే వివిధ సంఘటనలకు కూడా ఇది వర్తిస్తుంది. దిన పత్రిక మొదటి పేజీ చూసిన తర్వాత చాలా మంది పాఠకులు జిల్లా, సిటీ చిన్న పత్రికల మీద దృష్టి సారించడం కూడా ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

యూరప్‌లో జరిగిన విమాన ప్రమాదంలో 60 మంది మరణించిన వార్త కంటే తమ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సలైట్లు మరణించిన వార్త పాఠకులను ఎక్కువగా ఆకర్షిస్తుంది. అయితే వార్తకు ఉండాల్సిన ఈ సామీప్యత అనే లక్షణాన్ని కొంత పరిమితి వరకే పరిగణించాల్సి వుంటుంది. అంతర్జాతీయ విమాన సర్వీసుకు జరిగిన ప్రమాదంలో తమ ప్రాంతానికి చెందిన వారెవరైనా మృతి చెందినట్లయితే ఆ వార్త పట్ల ఆయా ప్రాంత ప్రజలు ఆసక్తిని ప్రదర్శించవచ్చు. ఇటువంటిదే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల గురించి కూడా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు గతంలో ఒకసారి తెనాలి నుంచి బి.హెచ్.ఇ.ఎల్. (హైదరాబాద్) వస్తున్న బస్సు హైదరాబాద్ శివారులో ప్రమాదానికి గురై పలువురు ప్రయాణికులు మరణించారు. వారిలో చాలా మంది కోస్తా ఆంధ్ర ప్రాంతం నుంచి వస్తున్నారు. ఈ బస్సు ప్రమాదం రాష్ట్రమంతా మొదటి పేజీ వార్త కావడమే కాకుండా ఆయా జిల్లాలకు చెందిన ప్రయాణికుల వివరాలు తెలియజేయడానికి పాత్రికేయులు విశేష కృషి చేశారు. జిల్లాల్లో కూడా ఈ వార్తను విరివిగా చదివారు.

ప్రతి వార్తకు సామీప్యతను కొలమానంగా తీసుకోవడం సరైన పద్ధతి మానవుడు తొలిసారిగా చంద్రమండలంపై అడుగు పెట్టినప్పుడు ఆ సంఘటన సుదూర ప్రాంతంలో జరిగిందే. అమెరికా ఈ రంగంలో సాధించిన విజయం కేవలం అమెరికాకే పరిమితం కాదు. మొత్తం మానవ జాతి అంతా వైజ్ఞానిక రంగం సాధించిన పురోగతి పట్ల పొంగిపోయింది. ఈ విశేష సంఘటనలో సామీప్యత అనే వార్తా విలువ లేకున్నా వార్తకు వుండాల్సిన అనేక ఇతర విలువలు, లక్షణాలు వున్నాయి. ఈ వార్తను సకాలంలో సచిత్రంగా ప్రచురించిన పత్రికలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

BRAOU

### 3.5.4 ప్రాముఖ్యత

ప్రాముఖ్యత సంఘటనలకు, వ్యక్తులకు సంబంధించిన అంశం. ఆయా సంఘటనలు, ప్రాముఖ్యతను బట్టి వార్తా విలువలను సంతరించుకుంటాయి. అలాగే ఆయా వ్యక్తుల ప్రాముఖ్యతను బట్టి చిన్న చిన్న అంశాలకు కూడా వార్తా విలువ వస్తుంది. జాతి జీవనాన్ని ప్రభావితం చేసే సంఘటనలన్నీ సహజంగా వార్తలకెక్కుతాయి. యుద్ధాల వల్ల జాతి జీవనం సంక్షుభితమవుతుంది. సైన్యంలో తమ కుటుంబ సభ్యులున్నవారు, తమ గ్రామస్థులున్న వారు మాత్రమే కాకుండా మొత్తం దేశ ప్రజలందరూ యుద్ధ వార్తల కోసం ఎదురు చూస్తుంటారు. అందువల్లనే ఈ యుద్ధ వార్తల సేకరణకు ప్రచార సాధనాలు పోటీపడి, ప్రాణాలకు తెగించి కృషి చేస్తాయి. ఇరాక్‌కు, అమెరికా నేతృత్వంలోని మిత్రపక్షాలకు మధ్య జరిగిన యుద్ధ వార్తలను సేకరించేందుకు ప్రసార సాధనాలు ముఖ్యంగా కేబుల్ న్యూస్ నెట్‌వర్క్ (సి.ఎన్.ఎన్.) చేసిన కృషి అపూర్వం. మొదటి, రెండో ప్రపంచ యుద్ధ సమయాల్లోనూ అటు తర్వాత జరిగిన ఘర్షణల్లోనూ ఎంతో మంది జర్నలిస్టులు తమ విధి నిర్వహణలో మరణించడం ఇప్పుడు చరిత్రలో భాగమైంది.

అలాగే ప్రకృతిలో సంభవించే ఉపద్రవాలు ప్రజలందరి జీవితంపై ప్రభావం చూపిస్తాయి. తుపానులు, కాటకాలు ఈ

కోవలోకి వస్తాయి. తుపానులు ఉధృతంగా ఒకేసారి వచ్చిపడతాయి. కాబట్టి వాటిని గుర్తించని వారుండరు. కాటకాలు క్రమంగా, నెమ్మదిగా సంభవించే అంశం. దీనిని గుర్తించడానికి, ప్రజల దృష్టిని ఆకర్షించడానికి పాత్రికేయులు గణాంకాలు సేకరించవలసి ఉంటుంది. ప్రజలలో అధికారులతో సంభాషించవలసి వుంటుంది.

రాష్ట్రపతులు, ప్రధానులు, ముఖ్యమంత్రుల వంటి కీలక వ్యక్తులకు సంబంధించిన విషయాలకు కూడా వార్తా విలువ ఉంది. వారి ఉపన్యాసాలు, ఆరోగ్య పరిస్థితి, ఆలోచనా ధోరణి, వ్యక్తిగత వివరాలు అన్నీ వార్తలే. ప్రముఖులకు సంబంధించిన చిన్న చిన్న అంశాలు కూడా వార్తలకు ఎక్కుతాయి. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంతో పాటు, రాష్ట్రపతి ప్రార్థన సమావేశాలలో లేవలేకపోవడం వంటివి కూడా వార్తలే. సినిమా నటుల వివాహాలు, వారి ప్రేమ వ్యవహారాలకు కూడా వార్తా స్థాయి రావడానికి కారణం వారు ప్రజలు ఆసక్తితో గమనించే వ్యక్తులు కావడమే.

### 3.5.5 పర్యవసానం

ఆయా సంఘటనల పర్యవసానం, పరిణామం వార్తలకు విలువ తెస్తుంది. పర్యవసానం అంటే ముగింపు. కొన్ని నిర్ణయాలు, చర్యలు తీసుకొన్న తరువాత కాని జరుగుతుందన్నది వార్తకు ప్రాముఖ్యం కలిగిస్తుంది. బడ్జెట్‌ల ప్రతిపాదనాలు ప్రతి వ్యక్తి జీవితంపై ఎంతో కొంత ప్రభావం చూపుతాయి. అలాగే రూపాయి విలువ తగ్గింపు, ధరల పెరుగుదల, పన్నుల హెచ్చింపులకు సంబంధించిన వార్తలను పాఠకులు ఆసక్తితో చదువుతారని వివిధ అధ్యయనాల్లో వెల్లడైంది. యుద్ధ వార్తలు, ప్రకృతి ఉపద్రవాల వార్తలు, ప్రముఖ సంఘటనలు కావడానికి వాటి పర్యవసానాలు కారణం.

భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు లాల్ కృష్ణ అద్వానీ రథయాత్ర, వి.పి.సింగ్. నేతృత్వంలోని జనతా దళ్ మద్దతు ఉపసంహరణ, మండల్ కమిషన్ సిఫారసుల అమలు ప్రాముఖ్యం సంతరించుకోవడానికి కారణం వాటి పర్యవసానాలే.

### 3.5.6 ప్రభావం

ప్రజల జీవితాలపై, ప్రకృతిపై ప్రభావం చూపే విషయాలకు కూడా వార్తా విలువ వుంటుంది. బస్ ఛార్జీల హెచ్చింపు, కరెంటు కోత, మద్య నిషేధం ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. యుద్ధాలు, ప్రభుత్వ విధానాలు ప్రజల జీవితాలపై ఎంతో ప్రభావం చూపుతాయి.

ఎన్టీ రామారావు లక్ష్మీపార్వతిని (ద్వితీయ) వివాహం చేసుకోవడం, అనంతరం జరిగిన పరిణామాలు రాష్ట్ర ప్రజలపై తీవ్ర ప్రభావం కలిగించాయి. వివిధ రకాలైన కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఓజోన్ పొరకు రంధ్రం పడడం మానవ మనుగడపై ప్రభావం చూపే ఘటన.

### 3.5.7 ఘర్షణ

ఘర్షణ అనేది కేవలం జాతుల మధ్య, వ్యక్తుల మధ్య జరిగే పోరాటం మాత్రమే కాదు. నిత్య జీవితంలో, జీవన పోరాటంలో ఎంతో ఘర్షణ వుంది. వివిధ ఆలోచనా ధోరణుల మధ్య, జీవన రీతుల మధ్య, మత విశ్వాసాల మధ్య ఘర్షణ ఇమిడి వుంది. ఈ ఘర్షణను పాత్రికేయులు పాఠకుల కోసం ఆవిష్కరించాల్సి వుంటుంది. పీడనకు గురవుతున్న ప్రజలు, అత్యాచారాలకు గురవుతున్న వర్గాల ప్రజల ఆదరణను సంపాదించవచ్చు. అయితే ఈ అంశాలు రాసేటప్పుడు అతి జాగ్రత్తగా వ్యవహరించాలి, వివాదాల్లో పాఠకులు ఏదో వైపు మొగ్గు చూపడం సహజం. మద్య నిషేధం ఎత్తివేత, సబ్సిడీ బియ్యం విద్యుత్ రాయితీ తదితర ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగినప్పుడు అభిప్రాయాల మధ్య ఘర్షణ ఏర్పడవచ్చు.

### 3.5.8 నిశ్చేతన, విమర్శ

ఎలాంటి కదలికా లేకుండా, జడప్రాయంగా, (నిశ్చేతనంగా) యథాస్థితి కొనసాగుతున్న పరిస్థితిలో సాధారణంగా వార్తకు చోటు లేదు. ఫలానా నాయకుడు పార్టీ అధ్యక్షుడుగా దిగిపోతాడనో, తిరిగి ఎన్నిక అవుతాడనో చెప్పడం వార్త. కానీ "నిన్న అధ్యక్షుడు, నేడు కూడా అధ్యక్షుడే" అనడం వార్త కాదు. ఇక దిగిపోతాడనుకున్న నాయకుడు దిగకుండా కొనసాగడం వార్త అవుతుంది. ఇద్దరు రాజకీయ నాయకులు లేదా రెండు ప్రత్యర్థి పార్టీలు పరస్పరం దుమ్మెత్తి పోసుకోవడానికి కూడా వార్త విలువ వుంది. పరస్పరం చేసుకునే విమర్శల్లో ప్రజలకు అంతవరకు తెలియని సమాచారం తెలియవచ్చు. విమర్శలు ఆసక్తికరంగా వుండవచ్చు. పార్టీల, ప్రభుత్వ విధానాలను వాటి అమలు సమీక్షిస్తూ విమర్శనాత్మకంగా వార్తలు రాయవచ్చు.

### 3.5.9 నవ్యత

సాధారణ విషయాలు కాక కొత్త దనంతో కూడినదేదైనా వార్తే అవుతుంది. శరీరం బయట గుండెతో బాలుడు పుట్టడం, పాములను ఆహారంగా తీసుకోవడం, పన్నుతో విమానాన్ని లాగడం ఇలాంటి విషయాలన్ని నవ్యతతో కూడినవే. వీటన్నింటికి వార్తా విలువ వుంటుంది. అవినీతిని తీవ్రంగా ఖండించే ప్రముఖుడే కుంభకోణంలో నేరస్తునిగా రుజువుకావడం, మద్య నిషేధ ఉద్యమానికి జీవం పోసిన గ్రామంలోనే దొంగ సారా దొరకడం, పోలీసే దొంగగా పట్టుపడడం ఇవన్నీ కూడా వార్తా విలువ కలిగిన విషయాలే.

### 3.5.10 మానవీయత

కేవలం కుతూహలాన్ని తీర్చి వేయకుండా పాఠకులలో హృదయ స్పందన కలిగించేవే, మానవీయ వార్తలు. ఇవి మనుషులను గురించినవే కావలసిన అవసరం లేదు. సామాన్య పాఠకుని నుంచి అసామాన్య పాఠకుని వరకూ ఇతర ప్రజల నుంచి తెలుకోవాలన్న ఆసక్తి వుంటుంది. ఈ ఆసక్తి నుంచే వదంతులు, పుకార్లు పుట్టుకొచ్చాయి. వదంతులు, పుకార్లకు వార్తల స్థాయి ఎప్పటికీ రాదు. కానీ ఇతరుల గురించి, వారి సుఖ దు:ఖాల గురించి తెలుసుకోవాలన్న పాఠకుల ఆసక్తిని పాత్రికేయులు ఏదో విధంగా సంతృప్తి పరచాలి. అందులోంచే మానవీయ వార్తలు పుట్టుకు వచ్చాయి. మానవీయ వార్తల్లో రకరకాల మనుషులు దర్శనమిస్తుంటారు. రకరకాల సంఘటనలు తటస్థ పడుతుంటాయి. సైకిల్‌పై ప్రపంచ పర్యాటన చేసేవారు, పెను ప్రమాదాలను తప్పించేవారు, అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించేవారు, మౌనంగా బాధలు భరించే వారు. అందరూ మానవీయ వార్తల్లో కెక్కడానికి అర్హులే. మహారాష్ట్రలోని లాతూరు భూకంప శిథిలాల్లో చిక్కుబడి వారం రోజుల తర్వాత కూడా ప్రాణంతో వున్న పసిపాప, చెత్త కుండిలో శిశువు ఈ వార్తలకు తగినవే. అవి ఇప్పుడు కూడా ప్రజలకు ఆసక్తి కలిగించే అంశామే. దివిసీమ ఉప్పెన సంభవించినప్పుడు ఆప్తులను కోల్పోయిన వారి దీనగాధల నుంచి ఎన్నో మానవీయ వార్తలు వచ్చాయి.

### 3.5.11 అభివృద్ధి, ప్రగతి

అభివృద్ధి, ప్రగతికి సంబంధించిన సమాచారానికి కూడా వార్తా విలువ వుంటుంది. తమ ప్రాంతంలో వేయి కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమ నెలకొల్పనున్నారన్న వార్త ఆ ప్రాంత ప్రజలకు ఎంతో ముఖ్యమైనది. పుష్కలంగా వ్యవసాయ దిగుబడులు, పారిశ్రామిక పెరుగుదల రేట్లు, కమ్యూనికేషన్ల విస్తరణ ఇవన్నీ కూడా ప్రజలకు ఆసక్తి కలిగించేవే.

విచిత్రమైన సంఘటనలు, నేర వార్తలు, మతానికి సంబంధించిన వార్తలు, సెక్స్, వార్తలు, హాస్యాన్ని పుట్టించే సంఘటనలు, మిస్టరీ, ఆరోగ్యం, వైజ్ఞానిక సాంకేతిక విషయాలు, వినోదం, ఆహారం, విభిన్న వర్గాల జీవన శైలి కూడా ప్రజలను ఆకొట్టుకుంటాయి. ముందే చెప్పినట్టు ఏ ఇద్దరు పాఠకులూ ఒకే విధంగా ఆలోచించరు. అందువల్ల వార్తలకు రంగు, రుచి, వాసన వున్నప్పుడే వివిధ వర్గాల పాఠకులను ఆకట్టుకుంటాయి.

BRAOU

వార్తా విలువలను అవగాహన చేసుకోవడంతో పాటు కొన్ని ఉన్నత విలువలను కూడా పాఠకులు, పాత్రికేయులు గమనించాల్సి వుంటుంది. అలాగే వార్తలకు రంగు, రుచి, వాసన కల్పించడం కోసం మానవతా విలువలను మరచిపోరాదని జోసెఫ్ పులిట్జర్ చేసిన హెచ్చరికను కూడా గుర్తుంచుకోవాలి. పాత్రికేయులు వార్తలు రాసేటప్పుడు, కుదింపు చేసేటప్పుడు వార్తలకు కనీస మౌలిక విలువలు వున్నాయో, లేవో తప్పని సరిగా చూసుకోవాలి.

**అభ్యాసం - 2 : దినపత్రికల్లోని వివిధ వార్తల విలువలు పరిశీలించండి.**

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

## 3.6 ముఖ్యవిషయాలు గుర్తుంచుందాం

★ మౌలిక విలువలున్న సమాచారం, విషయం లేదా అంశమే వార్త అవుతుంది.

★ వార్తా విలువలు పదికి పైగా వున్నాయి. విలువలు లేనిదేదీ వార్త కాదు.

★ వార్తల ఎంపికలో వార్తల ప్రచురణలో జాగ్రత్తలు తీసుకోవాలి.

★ వార్తలు రాసేటప్పుడు మానవతా విలువలను మరచిపోరాదు.

## 3.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1 వార్తా విలువలు అంటే ఏమిటి? వాటి గురించి వివరంగా రాయండి?

2. వార్తల ఎంపికలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలపండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వార్తా విలువల్లో కాలనియతి ప్రాముఖ్యాన్ని వివరించండి?

2. మానవీయ వార్తలు.

**- ఎం.ఇ.వి. ప్రసాదరెడ్డి**

BRAOU

# భాగం - 4 : విలేఖనం / రిపోర్టింగ్

విషయక్రమం


4.0 ఉద్దేశం

4.1 ప్రవేశిక

4.2 విలేఖనం - చరిత్ర

4.3 విలేఖనం - లక్షణాలు - విభాగాలు

4.4 విలేఖనం - రకాలు

4.4.1. ఇంటర్వ్యూ - విలేఖనం

4.4.2. పత్రికా ప్రకటన - విలేఖనం

4.4.3. సభలు, సమావేశాలు - విలేఖనం

4.4.4. చట్టసభలు - విలేఖనం

4.4.5. న్యాయస్థానాలు - విలేఖనం

4.4.6. నేరవార్తలు

4.4.7. వ్యవసాయ వార్తలు

4.4.8. క్రీడా వార్తలు

4.4.9. ప్రగతి వార్తలు

4.4.10. సైన్స్ వార్తలు

4.4.11. మానవీయ వార్తలు

4.4.12. పరిశోధనాత్మక వార్తలు

4.4.13. అన్వయ వార్తలు

4.4.14. అనంతర వార్తలు

4.4.15. వ్యాపార వార్తలు

4.4.16. సాంస్కృతిక వార్తలు

4.4.17. రాజకీయ వార్తలు

4.5 విలేఖరి లక్షణాలు - బాధ్యతలు

4.6 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

4.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 4.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరవాత మీరు

- విలేఖనం అంటే ఏమిటి? అందులోని రకాలు?
- విలేఖనంలో పాటించవలసిన విధి, నిషేధాలు
- మెళకువలు
- నేర్పు సంపాదించడం తెలుసుకుంటారు.

## 4.1 ప్రవేశిక

వార్తా రచనే విలేఖనం. పత్రికకు వార్త ముడి పదార్థం. వార్తలు పేర్చితే వార్తా పత్రిక రూపొందుతుంది. వార్తా రచనకు ఉపక్రమించే ముందు వార్త అంటే ఏమిటో తెలుసుకోవాలి. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఆసక్తి కలిగించేది వార్త. "కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు. మనిషి కుక్కని కరిస్తే వార్త "అని లార్డ్‌నార్త్‌క్లిఫ్ చెప్పిన నిర్వచనం చాలా పాతది. నవ్యత, అసాధారణత, తాజాదనం వార్త లక్షణాలు. అసాధారణ ఘటనలు, వెలుగు చూడని వాస్తవాలు. ప్రముఖ వ్యక్తులు, ప్రదేశాలు, జనజీవనాన్ని ప్రభావితం చేసే ఘటనలు, నేరాలు, ఘెరాలు, వాతావరణం, వివిధ రకాలలో మార్పులు - ఇవన్నీ వార్తకు ప్రాణం పోసే అంశాలే.

## 4.2 విలేఖనం - చరిత్ర

మనిషితో పాటే వార్తా పుట్టింది. మనిషి సంఘజీవి. తన చుట్టూ ఏమి జరుగుతోందో, ఏమి జరగబోతోందో తెలుసుకోవాలన్న ఆసక్తి ఉంటుంది. తన పైనే కాకుండా తోటి సంఘ జీవులపైన ప్రభావం చూపించే అంశాలు ఏమిటో తెలుసుకోవాలని కోరుకుంటాడు.

మధ్య యుగాలలో సంకేతాల ద్వారా వార్తా ప్రసారం జరిగేది. రాయబారాలు. ఆయుధాలు, సంధులు, సమాలోచనలకు సంబంధించిన వార్తలు, శుభ, అశుభ కార్యాలకు చెందిన వర్తమానం తాటాకులపైనో వస్త్రాలపైనో రాసి వార్తా హరుల ద్వారా పంపించేవారు. రాజు లేదా స్థానిక ప్రభువు ఏదైనా సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని అనుకున్నప్పుడు టముకు (చాటింపు) వేయించేవారు. (ఈ ప్రక్రియ కొన్ని పల్లెలలో ఇప్పటికీ అమలు జరుగుతున్నది) కాగితం, ముద్రణ యంత్రాలు వచ్చిన తర్వాత వార్తా పత్రిక పుట్టింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొలదీ వార్తా పత్రికల రూపురేఖలు వేగంగా మారిపోయాయి. వాసి, రాసి పెరిగాయి. వేగం పెరిగింది. పాఠకులకు సమాచారం అందించడంలో పోటీ పెరిగింది.

సమాచారం వేగంగా అందించాలి. సమగ్రంగా అందించాలి. లోప రహితంగా ఉండాలి. సులభ గ్రాహ్యంగా ఉండాలి. ఇన్ని షరతులకు లోబడి రాయలంటే శిక్షణ అవసరం అయింది. విలేఖనం ఒక శాస్త్ర రూపాన్ని సంతరించుకుంది.

BRAOU

## 4.3 విలేఖనం - లక్షణాలు - విభాగాలు

వార్తకు ఉండవలసిన అయిదు ముఖ్యమైన లక్షణాలు ఇవి.

1) ఆసక్తి కలిగించాలి 2) వాస్తవమై ఉండాలి 3) తాజాగా ఉండాలి 4) తేలికగా అర్థం కావాలి. 5) సమగ్రంగా ఉండాలి.

వార్తా లేఖనమే విలేఖనం అని చెప్పుకొన్నాం వార్త అంటే ఏమిటి? ఒక ఘటన గురించి తెలిపేది. ఎలా తెలియజేయాలి? సాధారణంగా మనం ఏదైనా ఉదంతాన్ని ఇతరులకు వివరించేటప్పుడు అసలు విషయాన్ని ముందుగా టూకీగా చెబుతాం. శ్రోత ఆసక్తి పెంచేందుకు ఉత్కంఠ రేకెత్తించే వాక్యాలు చేరుస్తాం. ప్రధానాంశాన్ని టూకీగా చెప్పే తొలి వాక్యాలను "లీడ్" అనీ "ఇంట్రో" అనీ అంటారు. దీనినే "వార్తాంశం" అనవచ్చు. వ్యాసానికైతే ఎత్తుగడ అంటాం. ఆ తర్వాత వివరాలు చెబుతాం. దీనిని "వార్తా మధ్యం" లేక విషయ వివరణ (the middle or the body) అంటాం.

ముగింపు కూడా ఆసక్తిదాయకంగానే ఉండాలి. వార్తకు శీర్షిక ఎలాగూ ఉంటుంది. కాబట్టి వార్తను నాలుగు భాగాలుగా విభజించవచ్చు. ఎ) శీర్షిక బి) వార్తాగ్రం సి) "వార్తామధ్యం" లేక విషయ వివరణ డి) ముగింపు

## ఎ) శీర్షిక

ఇంగ్లీషులో దీనిని హెడ్‌లైన్ అంటారు. వార్తా పత్రికకు శీర్షికలు కిటికీలు. వార్తల సారాంశాన్ని సంగ్రహంగా సూచించి పాఠకులను ఆకర్షించడం శీర్షిక లక్షణం. సాధ్యమైనన్ని తక్కువ అక్షరాలతో అత్యంత బిగువుగా, ఆకర్షణీయంగా, ఎక్కుపెట్టి విడిచిన బాణం లాగ శీర్షిక ఉండాలి. బాగా ప్రచారంలో ఉన్న పద్యపాదాలను, సామెతలను, జనం నోళ్ళలో నానే మాటలను, జాతీయాలను ఉపయోగించుకోవచ్చు. సాధారణంగా విలేఖరి పంపిన వార్తను ఉప సంపాదకులు సరిదిద్ది లేదా తిరగరాసి శీర్షిక పెడతారు. కానీ వార్త రాసిన విలేఖరే శీర్షిక కూడా పెట్టడం ఉత్తమం. విలేఖరి నిస్సంకోచంగా శీర్షికను సూచించవచ్చు. ఏ కారణం వల్లనైనా తన శీర్షికను సంపాదక మండలి మార్చినా, తిరస్కరించినా విలేఖరి నిరుత్సాహపడకూడదు.

ఉదా: ఎంతకు రాని రైలు - ఎదురు చూపులకే కాలం చెల్లు

(ఈనాడు,హైదరాబాద్ ఎడిషన్ ఆగస్టు 8, 1995)

ఈ శీర్షిక బాగానే ఉంది. 'నీవు ఎక్కవలసిన రైలు జీవితకాలం లేటు' అన్న కవి ఆరుద్ర వాక్యాన్ని ఈ శీర్షికను ఉపయోగించుకోవచ్చు. కానీ అది వాడివాడి అరిగిపోయింది. అంతకన్నా బిగువుగా, అర్థవంతంగా కూడా శీర్షికను పెంపొందించేందుకు ప్రయత్నించవచ్చు. శీర్షిక హృద్యంగా, చెవికి ఇంపుగా ఉండాలి. కానీ ప్రాసకోసం పాకులాడి విషయంతో సంబంధం లేని శీర్షిక పెట్టకూడదు. సూటిగా, శక్తిమంతంగా ఉండే శీర్షికలే పాఠకుడిని అకట్టుకుంటాయి

## బి) వార్తాగ్రం/వార్తా మకుటం (లీడ్)

BRAOU

వార్తకు తొలివాక్యాలు ప్రాణం లాంటివి. శీర్షిక చూసి వార్త చదవడం ప్రారంభించిన చదువరికి తొలి వాక్యాలు చివరి వరకూ చదివించేలా ఉండాలి. ఇది చిరాకు కలిగించే విధంగా అస్పష్టంగా ఉన్నట్లయితే పాఠకుడు మరో వార్తవైపు దృష్టి మళ్ళిస్తాడు. వార్తలోని ప్రధానాంశం మొదటి వాక్యాల్లోనే ఉండాలి. లేదా సూచన ప్రాయంగానైనా ఉండాలి. వార్త మొదటి పేరాకు ఒకే వాక్యము ఉండవచ్చు. రెండుమూడు వాక్యాలు ఉండవచ్చు. కాని అంతకంటె ఎక్కువ ఉండటం బాగుండదు. ఈ మొదటి పేరాను వార్తా మకుటం అనవచ్చు. ఒకే వాక్యం ఉంటే వార్తాగ్రం అనడం యుక్తం.

ఏమిటి? ఎక్కడ? ఎవరు? ఎప్పుడు? ఎందుకు? ఎలా? - ఈ ఆరు ప్రశ్నలకు ప్రస్తావనలకే సమాధానాలు ఉండాలన్నది పాత పద్ధతి. ఇప్పుడు మొదటి పేరాలో ఈ ప్రశ్నలలో కొన్నింటికి మాత్రమే సమాధానాలు ఉంటున్నాయి. ఇందులో ముఖ్యాంశాలు మాత్రమే చెబుతాం. ఆరు ప్రశ్నలలో ప్రస్తావనలో కొన్నింటికి సమాధానాలు చెప్పి తక్కిన వాటని విషయ వివరణ అరంభంలో చెబుతాం. ఈ ఆరు ప్రశ్నలకు మొదటి పేరాలోనే జవాబులు చెప్పాలని ప్రయత్నిస్తే వార్తామకుటం సుదీర్ఘంగా, గందరగోళంగా తయారవుతుంది.

వార్తా మకుటాలు అనేక రకాలు ఉన్నాయి. 1) ప్రశ్నార్థక మకుటం, 2) ఆశ్చర్యార్థక మకుటం 3) వర్ణనాత్మక మకుటం. వార్తలోని అంశానికి సంబంధించి ఏదైనా ఒక ప్రశ్న వేసి, దానికి సమాధానం చెబుతూ వార్త కొనసాగించడం ఒక పద్ధతి. ఒక చమత్కార ప్రకటన చేసి వాక్యాన్ని ఆశ్చర్యార్థకంతో ముగించి మకుటం రాయడం మరో పద్ధతి. విషయాన్ని వర్ణిస్తూ మకుటం రాయడం చాలా కాలంగా నలిగిన పద్ధతి.

'ఆంధ్రప్రభ' హైదరాబాద్ ఎడిషన్ ఆగస్టు 8, 1995 నాటి సంచికలో ఒక వార్త చూడండి.

**బుస కొడుతున్న చేప**

*- అగర్తలా, ఆగస్టు 7 :*

*ఈల్ చేపలా కనిపిస్తూ పాములా బుసకొడుతూ దోసకాయలు తింటున్న ఓ కొత్తరకం చేప ఇక్కడి మత్స్యశాఖ శాస్త్రజ్ఞులను తికమకపెడుతున్నది. ఈ వింత చేపని చేప అని పిలవవచ్చునో, లేదో కూడా వారికి అర్థం కావడం లేదు....*

ఈ వార్త శీర్షికే విలక్షణం. చేప బుసకొట్టడం ఏమిటి? ఈ ప్రశ్న పాఠకుడికి ఆకర్షిస్తుంది. తర్వాత ప్రస్తావనలో ఎవరు? ఎక్కడ? ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయి. తక్కిన ప్రశ్నలకు జవాబులు తర్వాత ఉంటాయి. చేపలా కనిపిస్తూ, పాములా బుసకొడుతూ, దోసకాయలు తింటున్న చేప వైనాన్ని తెలుసుకోవాలన్న ఉత్కంఠ చదువరిలో రేపే విధంగా ప్రస్తావన ఉన్నది. వార్తలలో కూడా ఇది అసాధారణమైన వార్త కనుక పత్రికలో "బాక్సు" కట్టి మరీ ప్రచురించారు.

ప్రశ్నార్థకమకుటం :

> **పౌరులు నివాసావరణలో జాతీయ పతాకాన్ని ఎగురవేయరాదా?**
>
> *న్యూఢిల్లీ, ఆగస్టు 11 : జాతీయ పతాకం ఒక్క భారత ప్రభుత్వానికి సంబంధించిందేనా? భారతీయ పౌరులు త్రివర్ణ పతాకాన్ని తమ నివాసాలు, వ్యాపార కేంద్రాల ఆవరణల్లో ఎగురవేసుకోకూడదా?*
>
> *జస్టిస్ డి.పి. వధ్వా, జస్టిస్ ఎం.కె. శర్మలతో కూడిన ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచి ఈ అంశంపై విచారణ జరుపుతోంది. తన ఇంటి ఆవరణలో గౌరవప్రదమైన రీతిలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసుకుంటే తనను ఎవ్వరూ నిరోధించరాదంటూ ఒక వ్యాపారి దాఖలు చేసిన ఒక పిటిషన్‌పై బెంచి విచారణ జరుపుతుంది.*
>
> *(ఈనాడు, హైదరాబాద్ ఎడిషన్, ఆగస్టు 12, 1995)*

ఆశ్చర్యార్థక మకుటం :

> **'మేరిమాత క్షీరపానం'**
>
> *కౌలాలంపూర్, సెప్టెంబర్ 26: హిందూ దేవతా విగ్రహాలే కాదు జీసస్ క్రీస్తు, మేరీమాత విగ్రహాలు కూడా క్షీరపానం చేస్తున్నాయి. భారత దేశంలో, మరికొన్ని ఇతర దేశాలలో వినాయకుని విగ్రహాలు పాలు సేవించాయని సంచలన వార్తలు వచ్చిన నేపథ్యంలో....*
>
> *(ఆంధ్రజ్యోతి 1995 సెప్టెంబర్ 27వ తేది సంచిక మొదట పేజీలో 'బాక్సు' వార్త)*

BRAOU

ఇవి కాక కొటేషన్‌లతో మకుటం ప్రారంభించవచ్చు. వర్ణనతో, ఆవేదన వ్యక్తీకరణతో, ఆగ్రహ ప్రకటనతో రకరకాలుగా ప్రస్తావన ప్రారంభం కావచ్చు. ఏ రకమైన మకుటం అయినప్పటికి పాఠకులను ఆకర్షించడమే దాని లక్ష్యం.

## సి) విషయ వివరణ/వార్తా మధ్యం

తొలి వాక్యాలలో సంక్షిప్తంగా చెప్పిన విషయాన్ని ఇక్కడ వివరంగా రాయాలి. అన్ని ప్రశ్నలకు జవాబులు ఈ వివరణలో ఉండాలి. వివరణను ఒక క్రమ పద్ధతిలో అమర్చాలి. ప్రధానాంశాలు ముందుగా రాయాలి. అంతేకానీ వ్యక్తి చెప్పిన క్రమంలోనే వార్త రాయాలన్న నియమం లేదు.

ఉదాహరణకు ఒక బహిరంగ సభలో ప్రధాన మంత్రి అనేక విషయాలు చెబుతారు. ధరలు, పేదరికం, రైతుకు గిట్టుబాటు ధరలు, కాశ్మీర్ సమస్య, నిరుద్యోగం తదితర అంశాలపై ప్రసంగిస్తారు. వీటిలో ఏది పాఠకుల దృష్టిలో అత్యంత ప్రధానమైనదని మనం భావిస్తామో ఆ అంశాన్ని ప్రముఖంగా రాయాలి. ఆ తరువాత సభ ఎక్కడ, ఎన్నిగంటలకు జరిగిందో చెప్పాలి. విషయాన్ని వివరంగా రాయడంలో కూడా చదువరి ఆసక్తి ఎంత వరకు ఉంటుందో గమనించాలి. ఆసక్తి కలిగించని అప్రధానమైన అంశాలను వదలివేయాలి. వార్త రాసే సమయంలో పాఠకులకు ఏయే అంశాలు ఆసక్తి కలిగిస్తాయో నిర్ణయించడంలోనే విలేఖరి తెలివితేటలు ఉపయోగించాలి. ఏదైనా సమస్య ప్రజలలో చర్చనీయాంశంగా నలుగుతున్నా, ప్రజల జీవితాలను విశేషంగా ప్రభావితం చేసే ఘటన ఏదైనా జరిగినా, వర్తమాన రాజకీయ, సాంఘిక పరిణామాలకు సంబంధించిన అంశమైనా పాఠకుడికి ఆసక్తి కలిగిస్తుంది. ఆసక్తి కలిగించే విషయాలను వివరించడం ఎంత ముఖ్యమో ఆసక్తికరంగా వివరించగలగడం కూడా అంతే ముఖ్యం.

### డి) ముగింపు

వార్తను ఎంత ఉత్కంఠభరితంగా ప్రారంభించి బిగువుగా రాస్తామో అంతే ఆలోచనా ప్రేరకంగా ముగించాలి. Start with a bang and end with a whimper అంటారు. అయితే అన్ని వార్తలకు చమత్కారమైన లేదా ఆలోచనాస్పదమైన ముగింపు కుదరక పోవచ్చు. సాధారణంగా గ్రామీణ వార్తలలో చివరిగా పేర్లు ఉంటాయి. వార్త స్వభావాన్ని బట్టి రచన ఉండాలి. విశేషవార్తలకు ముగింపు కూడా అసాధారణంగా ఉండాలి. సాదాసీదా వార్తలలో అప్రధానమైన వివరాలను మాత్రమే చివరలో రాయాలి. పేజీ తయారు చేసే క్రమంలో కొన్ని వార్తలకు తోక కత్తిరించవలసిన అవసరం ఏర్పడవచ్చు. కత్తిరించినా ఇబ్బందిలేని అంశాలను ముగింపు పేరాలో రాయాలి. ముఖ్యమైన అంశాలను విషయ వివరణలోనే చేర్చడం మంచిది.

**అభ్యాసం 1 : విలేఖనం లక్షణాలు**

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

## 4.4 విలేఖనం - రకాలు

రకరకాల వార్తలు రాసేసమయంలో వార్త స్వభావానికి అనుగుణ్యమైన భాషను, పద్ధతిని వినియోగించాలి. కొన్ని సూటిగా, చప్పగా, నిరాశగా చెప్పే వార్తలు ఉంటాయి. మరికొన్ని భావోద్రేకంతో హృదయానికి హత్తుకునే విధంగా చెప్పే వార్తలు ఉంటాయి. ఏ రకమైన వార్తకు ఏ విధంగా సమాచారం సేకరించాలో, సేకరించిన సమాచారాన్ని వార్తగా రాసే క్రమంలో ఏ భాషను ఉపయోగించాలో, ఏ పద్ధతిని అనుసరించాలో తెలుసుకోవాలి. ఔచిత్యం పాటించాలి.

BRAOU

### 4.4.1. ఇంటర్వ్యూ - విలేఖనం

వార్తలు రాయడానికి కావలసిన సమాచారాన్ని రాబట్టే ప్రక్రియలలో ఇంటర్వ్యూ ముఖ్యమైనది. ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకోవడం ఈ ప్రక్రియ లక్ష్యం. ముఖాముఖిగా టెలిఫోన్ ద్వారా, టెలిప్రింటర్ ద్వారా, ఫాక్స్‌మీద లేదా లేఖలు రాసి ప్రశ్నలకు సమాధానాలు తెప్పించుకోవచ్చు. వీటన్నిటిలోకీ ముఖాముఖి ఇంటర్వ్యూ శ్రేష్ఠమైనది. ఇంటర్వ్యూ కొత్తగా పాశ్చాత్య దేశాల నుండి దిగుమతి చేసుకున్న ప్రక్రియ కానేకాదు. ప్రశ్నోత్తరాలు, సందేహాలు - సమాధానాలు పూర్వకాలం నుంచి మన దేశంలో ఉన్నవే. వినాయకుడు వేదవ్యాసుడిని ఇంటర్వ్యూ చేసి మహాభారతం రాశాడంటారు. యక్షప్రశ్నలలో యక్షుడు ధర్మరాజును ప్రశ్నలు అడగడం, ధర్మజుడు సమాధానాలు చెప్పడం ఒక విధంగా ఇంటర్వ్యూ కిందికే వస్తుంది. ప్రెస్ కాన్ఫరెన్స్ లేదా విలేఖరుల సమావేశాన్ని సామూహిక ఇంటర్వ్యూ అనవచ్చు.

ఇంటర్వ్యూ ఎవరిని చేయాలో, ఎందుకు చేయాలో విలేఖరి ముందుగానే నిర్ణయించుకోవాలి. కొత్త విషయాలను తెలుసుకొడానికి, ఏదైనా సమస్య మీద, ధోరణి మీద ప్రముఖుల, సామాన్యుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఇంటర్వ్యూ చేస్తాం. ఎవరిని ఇంటర్వ్యూ చేయాలో నిర్ణయించుకున్న తర్వాత ఆ వ్యక్తిని ఎలా, ఎక్కడ, ఎప్పుడు ఇంటర్వ్యూ చేయాలో ఆలోచించాలి. ఇంటర్వ్యూ కోసం మనం అడగాలనుకొన్న వ్యక్తి ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనో, మరెక్కడో తారస పడితే ఇంటార్వ్యూ ఇవ్వడానికి వీలవుతుందేమో అడగవచ్చు. లేదా ఆ వ్యక్తి బస చేసిన చోటికి వెళ్ళి అడగవచ్చు. ఫోన్ చేసి ఇంటర్వ్యూ సమయాన్ని, స్థలాన్ని ఖరారు చేసుకోవచ్చు.

ఇంటర్వ్యూ చేయడానికి వెళ్ళే ముందు ఆ వ్యక్తిని గురించి, మనం అడగబోయే విషయం గురించి క్షుణ్ణంగా

తెలుసుకోవాలి. అధ్యయనం చేయాలి. ఇంటర్వ్యూ పూర్తయిన తర్వాత ఏమి రాశారో చూపించవలసిందిగా ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తి అడిగితే చూపించాలి. చూపించడం ఇష్టం లేకపోతే ఆ సంగతి ముందుగానే చెప్పాలి. ఇంటర్వ్యూలో చెప్పిన అంశాలను సంచలనం కోసమో, మీరే ఇతర ప్రయోజనం కోసమో వక్రీకరించకూడదు. ఇంటర్వ్యూలో ఇబ్బంది కలిగించే ప్రశ్నలు అడగవలసి వచ్చినప్పుడు పొగరుగా, ఎగతాళిగా కాక సౌమ్యంగా, వినమ్రంగానే అడగాలి. ప్రశ్నలు, అనుబంధ ప్రశ్నల ద్వారా సమాచారం రాబట్టుకోవాలి. ఇంటర్వ్యూలు ముఖ్యంగా మూడు రకాలు: ఎ) ప్రొఫైల్ ఇంటర్వ్యూ బి) ఫ్యాక్చువల్ ఇంటర్వ్యూ సి) ఒపీనియన్ ఇంటర్వ్యూ

ఎ. ప్రొఫైల్ ఇంటర్వ్యూ.

ఇది (ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తి) వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. ఎవరైనా ఏదైనా పదవిని చేపట్టినప్పుడు ఈ వ్యక్తి జీవితం గురించి వార్తా వ్యాసం రాయడం సందర్భోచితం. ఇందుకు కావలసిన వివరాలను సేకరించేందుకు ఈ వ్యక్తినే ఇంటర్వ్యూ చేస్తాం. ఈ వ్యక్తి ఇష్టాయిష్టాలు, వ్యక్తిగత వివరాలు, అభిప్రాయాలు ఇందులో ఉంటాయి. అందుకని దీన్ని వ్యక్తిత్వ చిత్రణ లేదా ప్రొఫైల్ ఇంటర్వ్యూ అంటారు.

బి. ఫ్యాక్చువల్ ఇంటర్వ్యూ .

ఏదైనా ఒక విషయానికి సంబంధించి వాస్తవ సమాచారం రాబట్టడం కోసం చేసే ఇంటర్వ్యూ ఇది. పి.సి.సి. అధ్యక్షుడుగా ఎవరిని నియమిస్తున్నారు? మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు? ఇలాంటి సందేహాలకు సమాధానాలు వాస్తవాల రూపంలో తెలుసుకోవడానికి చేసే ప్రయత్నం ఇది.

సి. ఒపీనియన్ ఇంటర్వ్యూ.

దేశంలో ఉన్న రకరకాల సమస్యల గురించి, అప్పటికప్పుడు జరిగే తాజా ఘటనల గురించి అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఈ ప్రక్రియ ఉపయోగపడుతుంది. రాజకీయ నాయకులు, పార్టీలు, ప్రభుత్వాల పని తీరు గురించి ప్రజాభిప్రాయ సేకరణకు కూడా ఈ రకం ఇంటర్వ్యూ పనికొస్తుంది.

### 4.4.2. పత్రికా ప్రకటన - విలేఖనం

పత్రికలలో ప్రచురించడం కోసం పంపే ప్రకటనలను పత్రికా ప్రకటనలు అంటాం. విలేఖరి ఆశించకుండా, ప్రయత్నించకుండా వచ్చే ఈ ప్రకటనలో చాలా విలువైన అంశాలు ఉండవచ్చు. పత్రికా ప్రకటనను ఇంగ్లీషులో ప్రెస్‌నోట్, ప్రెస్ రిలీజ్, ప్రెస్ స్టేట్‌మెంట్, ప్రెస్ హాండవుట్ అంటారు. అతిచిన్న విషయం నుంచి అతిపెద్ద విషయం వరకు ఏదైనా పత్రికా ప్రకటనలో ఉండవచ్చు. చక్కెర కోటా విడుదల, కరెంటు కోత గురించి తెలిపే పత్రికా ప్రకటనలు కొందరి దృష్టిలో అప్రధానమైనవి కావచ్చు. కానీ అవి ప్రజలకు ఎంతో అవసరమైనవి. కాబట్టి అనాయసంగా మనముందుకు వచ్చింది కదా అని పత్రికా ప్రకటనను చిన్న చూపు చూడకూడదు.

కొన్ని పత్రికా ప్రకటనలు అమాయకంగా కనిపిస్తాయి. కానీ తరచి చూస్తే ఆసక్తికరమైన సమాచారం దొరుకుతుంది. ఉదాహరణకు అధికారుల బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన పత్రికా ప్రకటనల వెనుక బోలెడు తతంగం జరిగి ఉంటుంది. కూపీ లాగుతే అనేక విషయాలు తెలుస్తాయి. చిన్న పత్రికా ప్రకటన సైతం తెలివైన, సమర్థుడైన విలేఖరి చేతిలో పడితే బ్యానర్ (ప్రధాన వార్త) అవుతుంది.

పత్రికా ప్రకటనలు కొన్ని సార్లు మోసం కూడా చేస్తాయి. ఒకరి పేరు మీద మరొకరు ప్రకటన పంపే అవకాశం ఉంది. అందుకే ప్రకటన రాసిన కాగితాన్ని (లెటర్ హెడ్‌నీ), సంతకాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. సమయం లేక పత్రికా ప్రకటనను ఫోన్‌లో తీసుకునే సందర్భాలలో అవతలి వ్యక్తి విశ్వసనీయతను బట్టి వ్యవహరించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతి పత్రికా ప్రకటననూ విలేఖరి గుడ్డిగా నమ్మకూడదు. మోసం లేదని నిర్ధారించుకొన్న తర్వాతనే దానిని వినియోగించాలి.

BRAOU

### 4.4.3. సభలు, సమావేశాలు - విలేఖనం

పత్రికలలో వచ్చే వార్తలలో ఎక్కువ భాగం బహిరంగ సభలు, సమావేశాలు, సదస్సులు, గోష్ఠులు, సంఘాల, సంస్థల సమావేశాలు, స్వాగత, వీడ్కోలు సభలు, ధార్మిక, స్మారకోపన్యాసాలకు సంబంధించినవే. సభలో ప్రసంగించే వక్తల ప్రాముఖ్యాన్ని, వక్తల ప్రసంగాల ప్రాధాన్యాన్ని పరిశీలించి వార్త రాయాలి. ఒకే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు ఒకే విషయం చెప్పినప్పుడు ముఖ్యమంత్రి ప్రసంగాన్నే ప్రధానాంశంగా పరిగణించాలి. ముఖ్యమంత్రి చెప్పిన విషయాలకు, పార్టీ విధానాలకు భిన్నంగా ఎవరైనా ప్రముఖులు మాట్లాడినట్లయితే అదే ప్రధానాంశం అవుతుంది. అంతేకాకుండా ఒకే వ్యక్తి ఒకే సభలో పలు అంశాలను ప్రస్తావించవచ్చు. వాటిలో ముఖ్యమైన అంశం ప్రసంగం మధ్యలోనో, చివరలోనో ఉండవచ్చు. కొన్ని సందర్భాలలో ప్రసంగం పూర్తియిన తర్వాత కూడ ముఖ్యమైన అంశాన్ని చెప్పవచ్చు. ఉదాహరణకు 1995 ఆగస్టు రెండో వారంలో తిరుమల తిరపతి దేవస్థానం మండలి సభ్యులుగా ప్రముఖ సినీ నటులు రాజకుమార్, రజనీకాంత్ ప్రమాణం చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు ప్రసంగించారు. ప్రసంగం పూర్తయిన తర్వాత ఆయన `భారతదేశం` పార్టీలో చేరవలసిందిగా కన్నడ, తమిళ చిత్రసీమల అగ్రనటులను ఆహ్వానించి సంచలనం సృష్టించారు. చివరలో చెప్పినప్పటికీ ఆ విషయమే మర్నాడు పత్రికలలో బ్యానర్‌గా వచ్చింది.

సభా వేదికపై ఉన్న వ్యక్తుల పేర్లు, వారి హోదాలు విలేఖరికి స్పష్టంగా తెలియాలి. లేకపోతే ఒకరు మాట్లాడిన అంశాలను మరొకరికి ఆపాదించే ప్రమాదం ఉన్నది. కొన్నిసదస్సులు, స్మారకోపన్యాసాలలో ప్రసంగ పాఠాలు ముందుగానే ఇస్తారు. వాటిని చదివి ముఖ్యమైన అంశాలను ప్రాధాన్యక్రమములో గుర్తించి వార్త రాయాలి. సదస్సులలో నిర్వాహకులు ప్రసంగ పాఠం సదస్సు ముగిసేలోగా ఇస్తామని చెప్పి ఇవ్వలేకపోవచ్చు. అందుకే వక్త మాట్లాడుతున్నప్పుడే ముఖ్యాంశాలను విలేఖరి రాసుకోవాలి. ప్రసంగ పాఠంలో లేని కొన్ని ఆసక్తికరమైన అంశాలను వక్త ప్రస్తావించవచ్చు. జాగ్రత్తగా వినాలి. పెద్దపెద్ద సభలకు సంబంధించిన వార్తలు రాసేటప్పుడు విలేఖరి నిష్పాక్షిక పరిశీలకుడిగా ఉండాలే తప్ప తాదాత్మ్యం చెంది ఆవేశపడకూడదు. ఇసుకవేస్తే రాలనంత జనం, క్రిక్కిరిసిన స్టేడియం, జన ప్రవాహం, జన సముద్రం, లక్షలాది మంది జనం వంటి విశేషణాలు ఉదారంగా ఉపయోగించకూడదు. ఎంతమంది సభకు హాజరైనారని నిర్వాహకులు చెప్పకుంటున్నారో వారికే ఆపాదించి రాయవచ్చు. విలేఖరి పూచీ పడకూడదు. సమావేశం ఎందుకు జరిగిందో రాయాలి. ధార్మికోపన్యాసం బదులు స్మారకోపన్యాసం అని రాస్తే రాయకపోవడం కన్నా తప్పుగా రాయడం వల్ల సంబంధిత వ్యక్తులకు ఎక్కువ మనస్తాపం కలుగుతోంది.

BRAOU

### 4.4.4. చట్టసభలు - విలేఖనం

ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై చర్చలు, నిర్ణయాలు చేసే చట్టసభలు వార్తల కల్పతరువులు. రాష్ట్రస్థాయిలో అసెంబ్లీ, జాతీయ స్థాయిలో పార్లమెంటు ప్రజల కోసం చట్టాలు చేస్తూ ఉంటాయి. ఈ చట్టాలు రావడానికి ముందు అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాలు జరుగుతుంటాయి. ఇవన్నీ ప్రజలకు తెలియజేసేందుకు వీలుగా విలేఖరులను చట్ట సభల ప్రెస్ గ్యాలరీలలోకి అనుమతిస్తారు.

చట్ట సభలలో వార్తలు సేకరించే విలేఖరులు చట్టసభల నిర్మాణం, నిబంధనలు, హక్కుల గురించి తెలుసుకోవాలి. ప్రెస్ గ్యాలరీలు విలేఖరులు కూర్చొని కార్యక్రమాలు చూసి వార్తలు రాయడానికి వీలుగా ఉంటాయి. చట్ట సభల వార్తలు రాసే విలేఖరికి ఉండవలసిన లక్షణాలు ఇవి :

ఎ. జ్ఞాపకశక్తి

వందలమంది సభ్యులు ఉంటారు. ఎన్నో పార్టీలకు చెందినవారుంటారు. అనేక సమస్యలపైన మాట్లాడుతూ ఉంటారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు చెబుతూ ఉంటారు. వివిధ అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు వాదులాడుతుంటారు. వీటన్నిటినీ విలేఖరి గుర్తుంచుకోవాలి. కనీసం ముఖ్యమైన సభ్యులను వారి పార్టీలను గుర్తుపెట్టుకోవాలి. ఎవరెవరు ఏ ప్రశ్నలు అడిగారో, వాటికి ఏ మంత్రి ఏ సమాధానం చెప్పారో జ్ఞాపకం పెట్టుకోవాలి. ఈ విషయంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా వార్త తప్పుల తడక అవుతుంది.

బి. సమయస్ఫూర్తి

చట్టసభలలో పలువురు సభ్యులు పలు ప్రశ్నలు అడిగినా వాటన్నిటినీ పత్రికలలో ప్రచురించే అవకాశం ఉండదు. అన్ని ప్రశ్నలూ, సమాధానాలూ రాసుకొని వాటిలో ముఖ్యమైన వాటిని ఎన్నుకోవడంలో విలేఖరి విజ్ఞత చూపాలి. సభ్యులు వ్యక్తిగత విమర్శలు చేసుకున్నప్పుడూ, హక్కుల ఉల్లంఘన జరిగిందని భావించినప్పుడూ కొన్ని విమర్శలను, వ్యాఖ్యలను రికార్డు నుంచి తొలగించవలసిందిగా స్పీకర్ ఆదేశిస్తారు. తొలగించిన విషయాలను పత్రికలలో రాయకూడదు. కానీ ఫలానా సభ్యుడు చేసిన వ్యాఖ్యలను రికార్డు నుంచి తొలగించవలసిందిగా స్పీకర్ ఆదేశించినట్లు రాయవచ్చు. సభలో జరిగిన చర్చలపై సభ్యులు సభ వెలుపల వ్యాఖ్యానించవచ్చు. విలేఖరులు సమయస్ఫూర్తితో ప్రశ్నలు అడిగి సభ్యుల వ్యాఖ్యలు రాబట్టి సభలో వాతావరణాన్ని పాఠకులకు సూచనప్రాయంగా తెలిసేవిధంగా వార్తలు రాయవచ్చు.

సి. సహనం

చట్ట సభలలో గంటలతరబడి చర్చలు జరుగుతూ ఉంటాయి. అన్నీ వినడానికి ఆసక్తి ఉండకపోగా విసుగు కూడా పుట్టవచ్చు. బయటకి వెళ్ళడానికి వీలులేదు. ఏక్షణంలో ఏ మంత్రి అయినా, సభ్యుడైనా, స్పీకరైనా ఏదైనా ముఖ్యమైన విషయం వెల్లడించవచ్చు. అందుకని విలేఖరి ఓర్పుతో అక్కడే కూర్చుని ఉండాలి. సభలో కూర్చోకుండా బయట తిరిగి ఇతర విలేఖరులను అడిగి వార్తలు రాస్తే కష్టాలు కలగవచ్చు.

**డి. చొరవ**

చట్టసభల విలేఖరి వివిధ పార్టీల సభ్యులతో, నాయకులతో వ్యక్తిగత పరిచయం పెంచుకోవాలి. చొరవతో అందరినీ పరిచయం చేసుకోవడం వల్ల ఎవరెవరు ఏయే అంశాల గురించి సభలో మాట్లాడబోతున్నారో విలేఖరికి ముందుగానే తెలుస్తుంది. సభలో కొన్ని విషయాలను కారణాంతరాల వల్ల ప్రస్తావించకపోయినా బయట తమ వ్యతిరేకతను, అసంతృప్తిని వెలిబుచ్చుతూ ఉంటారు. పరిచయాల వల్ల ఇటువంటి సమాచారం ముందుగా తెలుస్తుంది.

చట్ట సభలలో అనేకాంశాలు చర్చకు వస్తాయి. అందులో దేన్ని ప్రస్తావనగా తీసుకోవాలో ముందుగా నిర్ణయించుకోవాలి. వ్యక్తి ప్రాధాన్యంగా కానీ, విషయ ప్రాధాన్యంగా కానీ ఉన్న అంశాన్ని ప్రస్తావన రాయవచ్చు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజున ఆర్థిక మంత్రికి ప్రాధాన్యం ఇస్తాం. విద్యకు సంబంధించిన చర్చ జరిగినప్పుడు విద్యామంత్రి అందరి దృష్టినీ ఆకర్షిస్తారు. విధాన నిర్ణయాలు జరిగిన సందర్భాలలో విషయ ప్రధానంగా ప్రస్తావన రావాలి. ముఖ్య సమాచారం ముందుగా రాసిన తర్వాత ఉపశీర్షికలు పెట్టి మిగిలిన విషయాలు రాయవచ్చు. సభలోనో, వెలుపలా సభ్యుల హాస్యోక్తులు, సరస సంభాషణం, కోపతాపాల ప్రదర్శన, తదితర విశేషాంశాలను ప్రత్యేక వార్తలుగా రాసుకోవచ్చు.

## 4.4.5. న్యాయస్థానాలు - విలేఖనం

ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థకు చాలా ప్రాముఖ్యం ఉన్నది. చట్టసభలో పాలనా వ్యవస్థ రాజ్యాంగబద్ధంగా నడుచుకొంటున్నాయో లేదో చూసే బాధ్యత న్యాయ వ్యవస్థపైనే ఉన్నది. న్యాయస్థానాలలో వార్తలు రాసే విలేఖరులు న్యాయస్థానాల పనితీరును, కొన్ని విధి నిషేధాలను తెలుసుకోవాలి.

న్యాయస్థానాలలో విచారణకు వచ్చిన ప్రతి కేసు గురించి పత్రికలు ప్రచురించవు. పాఠకులకు ఆసక్తి కలిగించే కేసులు, ప్రజలను ప్రభావితం చేసే కేసులు మాత్రమే వార్తలవుతాయి. సామాజిక పరిణామం గురించి తెలిపే కేసులు, తీర్పులు కూడా పాఠకులకు ఆసక్తి కలిగిస్తాయి. ప్రజలకు ఆసక్తి కలిగించే కేసులలో వాదోపవాదాలను ఉన్నవి ఉన్నట్టుగా రాయవచ్చు. ప్రతి కేసుకు సంబంధించిన తీర్పు ప్రతులు న్యాయస్థానాలలో లభిస్తాయి. హైకోర్టులో విచారణ జరుగుతున్న కేసులను, తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నకేసులను సూచించే కాజ్‌లిస్ట్ ఉంటుంది. ఏరోజు ఏ వార్త గురించి వార్త రాయాలో నిర్ణయించుకోవడంలో

విలేఖరికి ఈ సూచిక ఉపయోగపడుతుంది. వార్తల విషయంలో న్యాయాధికారి ఆదేశాలను విలేఖరి ఉల్లంఘించకూడదు. నిరాధారమైన, అన్యాయమైన ఆరోపణలు చేయకూడదు. కోర్టు ధిక్కారం అవుతుంది. అది శిక్షార్హం.

కోర్టు వార్తలు రాసే విలేఖరి గుర్తుంచుకోవలసిన కొన్ని ముఖ్యాంశాలు ఇవి:

★ కోర్టులో ఉపయోగించే పడికట్టు పదాలు సామాన్యులకు అర్థం కావు. వార్తను కోర్టు బాషలో కాకుండా పాఠకులకు అర్థమయ్యే భాషలో రాయాలి.

★ కోర్టుతీర్పుపై వ్యాఖ్యానించకూడదు.

★ ప్రచురించరాదని న్యాయమూర్తి నిర్దేశించిన అంశాలను ప్రచురించకూడదు.

★ న్యాయవాదులతో సన్నిహితంగా ఉంటూ సమాచారం సేకరించాలి.

★ దిగువ కోర్టుల ఆదేశాలను అమలు చేయనప్పుడు ఎగువ కోర్టులు మందలించినట్లయితే ఆ సమాచారాన్ని జాగ్రత్తగా సేకరించాలి.

★ కక్షిదారుల వాదనకు, నిందితుల వాదనకు సమాన ప్రాముఖ్యం ఇవ్వాలి.

★ కోర్టు దోషిగా నిర్ణయించేవరకూ నిందితుడిని దోషి అని రాయకూడదు.

★ తీర్పులోని ప్రధానాంశాన్ని ప్రస్తావనగా రాయాలి.

★ వివరాలను ఒకటికి రెండుసార్లు ధ్రువీకరించుకోవాలి.

★ పరువు నష్టం దావాకు దారితీసే అంశాలను ముందుగానే పరిశీలించి పరిహరించాలి.

★ కోర్టు పరిశీలనలో ఉన్న అంశాలపై సైతం వ్యాఖ్యానించకూడదు.

★ విడాకుల కేసులో భార్యభర్తల వివరాలు రాసేటప్పుడు తెలుసుకోవలసిన వార్తాంశాలనే రాయాలిగానీ. కేవలం చదివిస్తాయనే ఉద్దేశంతో అనైతికమైన విషయాలను రాయడం మంచిదికాదు.

BRAOU

### 4.4.6. నేరవార్తలు

చట్టాన్ని, సామాజిక నియమాలను ఉల్లంఘించడం నేరం. సమాజంలో జరిగే నేరాల వివరాలను పత్రికలలో ప్రచురించాలా, 'వద్దా' అనే ప్రశ్నపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అమెరికాలో క్రైస్తవ ధార్మిక సంస్థ నడిపే 'క్రిస్టియన్ సైన్స్ మానిటర్' అనే పత్రిక నేర వార్తలను ప్రచురించదు. అదే విధంగా 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక కూడా దౌర్జన్యం, అత్యాచారం, ఇతర వికారాలకు సంబంధించిన వార్తలను స్వీకరించదు. నేరస్తులకు పత్రికలు అనవసర ప్రాముఖ్యం ఇస్తున్నాయనీ, నేరవార్తలను ప్రముఖంగా ప్రచురించడం వల్ల నేరస్తులకు ప్రచారం వచ్చి నేర ప్రవృత్తి పెరిగే అవకాశం ఉన్నదనీ కొందరి వాదన. అయితే పత్రికలు సమాజానికి ప్రతిబింబాలు కనుక సమాజంలో కనిపించే అన్ని దోరణులకూ అద్దం పట్టాలి. వాస్తవాలను దాచిపెట్టడం సమాజానికి నష్టమే కానీ లాభదాయం కాదు. నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండటానికీ, నేరస్తుల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వడానికీ నేరవార్తలు ఉపకరిస్తాయి. మనదేశంలో పత్రికలు నేరవార్తలను ప్రచురిస్తాయి. నేరవార్తలు రాసే విలేఖరి గుర్తుంచుకోవలసిన అంశాలు ఇవి :

★ పోలీసు వ్యవస్థకు సంబంధించిన పరిజ్ఞానం, పోలీసు శాఖ పనితీరుపై అవగాహన ఉండాలి. పోలీసులతో తగుమాత్రం పరిచయం, సమాచారం రాబట్టగల నేర్పు ఉండాలి.

- ★ చట్టం గురించి తెలిసి ఉండాలి. అప్పుడే ఏది నేరమో, ఏది నేరం కాదో తెలుస్తుంది.
- ★ విలేకరికి తాను పనిచేస్తున్న ప్రాంతం బాగా తెలిసి ఉండాలి. నేరం జరిగినట్టు సమాచారం అందిన వెంటనే అక్కడికి చేరుకోగలగాలి.
- ★ నిష్కారణంగా ఎవరికీ హాని కలగకుండా చట్టానికి లోబడి వార్తరాయాలి.
- ★ వాస్తవాలు సేకరించుటలో శ్రమకు వెనుకాడరాదు, అలసత్వం ప్రదర్శించరాదు.
- ★ సామాజిక శ్రేయస్సును విస్మరించకూడదు.
- ★ పోలీసుల కథనంలోని వాస్తవాలను పున:పరిశీలించాలి.
- ★ పోలీసులు చెప్పిన విషయాలను, ప్రత్యక్ష సాక్షుల కథనాల ద్వారా తెలుసుకున్న సమాచారాన్ని ఆధారం చేసుకుని వార్త రాయాలి. అవసరాన్నిబట్టి అటు పోలీసులు చెప్పినదాన్నీ, ఇతరులు తెలియజేసిన విషయాన్ని కూడా పాఠకులకు చెప్పాలి.
- ★ కుల, మత ఘర్షణలు జరిగినప్పుడు విలేఖరి రాసిన వార్త అశాంతికి ఆజ్యం పోయకూడదు. ఈ ఘర్షణలలో చనిపోయిన వారి పేర్లను, వారి కులాన్ని లేదా మతాన్ని పాఠకులకు తెలియజేయడం హానికరం.

### 4.4.7. వ్యవసాయ వార్తలు

మనది వ్యవసాయక దేశం. ఎనభై శాతం మంది ప్రజలు గ్రామాలలో నివసిస్తున్నారు. డెబ్బయ్ శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. ఏ భాషా పత్రికలకూ లేనంత విస్తృతంగా తెలుగు పత్రికలకు గ్రామ ప్రాంతాలలో వార్తలు సేకరించడానికి విలేఖరులు ఉన్నారు. అయితే ఈ విలేఖరులు ఇటీవల వరకూ గ్రామప్రాంతాలలో రాజకీయాలు, కక్షలు, కార్పణ్యాల గురించే అధికంగా వార్తలు పంపేవారు. వ్యవసాయ వార్తలు తక్కువ. ఈ ధోరణి క్రమంగా మారిపోతున్నది. ఇది మంచి పరిణామం.

గ్రామీణ విలేఖరులు వ్యవసాయ విస్తరణాధికారులు ఇచ్చే సమాచారంతోపాటు వ్యవసాయ-పరిశోధన క్షేత్రాలనుంచి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలనుంచి, వ్యవసాయ పరిశోధకుల నుంచి వార్తలు సేకరించుకోవాలి. ప్రభుత్వ వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ, సహకార బ్యాంకులు, వాతావరణ పరిశోధన కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయం, విద్యుచ్ఛక్తి శాఖ, నీటిపారుదల శాఖ, తుఫాను హెచ్చరిక కేంద్రాలు, వరద నిరోధక శాఖ, పొగాకు బోర్డు, పొగాకు పరిశోధన సంస్థ, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖ, పాల డైరీలు, పశు సంవర్ధక శాఖ, రైతు సంఘాలు, తదితర విభాగాలు ఎన్నో వ్యవసాయ సంబంధ సమాచారాన్ని అందిస్తాయి.

**వ్యవసాయ వార్తలు రాసే విలేఖరి ఈ క్రింది అంశలపై సమాచారం సేకరించవచ్చు.**

- ★ విలేఖరి పనిచేసే ప్రాంతంలో నేల ఎటువంటిది? దాని స్వభావం ఏమిటి? ఎటువంటి పంట పండుతుంది?
- ★ నీటి వనరులైన చెరువులు, బావులు, కాలువలు, ప్రాజెక్టుల నీటిమట్టం, ఎప్పుడు ఎంత నీరు వదులుతారు, ఏ పంటకు ఎంత నీరు కావాలి, వర్షాధార పంటలు ఏవి? - ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలు సేకరించాలి.
- ★ రుతుపవనాల ప్రభావం పంటలమీద ఎలా ఉంటుంది? రుతుపవనాలు సకాలంలో వచ్చాయా? ముందుగానే వచ్చాయా? సగటు వర్షపాతం ఎంత? వీటివల్ల పంట దిగుబడుల్లో హెచ్చుతగ్గులు ఉన్నాయా?
- ★ సంవత్సరానికి ఎన్ని పంటలు పండుతాయి? ఇంకా ఎక్కువ పంటలు పండించే అవకాశం ఉన్నదా? ఏ పంటలో ఏ పంట కలిపి పండిస్తారు? ఏ పంట తర్వాత ఏ పంట పండిస్తారు.
- ★ ఏ ప్రాంతంలో ఏ పంట ఎక్కువ దిగుబడినిస్తుంది? నేల స్వభావానికి నాటురకం విత్తనాలు మంచివా? హైబ్రిడ్ రకం విత్తనాలు మంచివా?

BRAOU

★ ఏ నేలకు ఏ ఎరువు వాడాలి? ఏ పంటకు ఎంత ఎరువు ఉపయోగించాలి? ఏ పంటకు ఏ తెగులు వస్తుంది? దాని నివారణకు ఏ మందులు వాడాలి?

★ వ్యవసాయ కూలీలకు చెల్లించే కూలీ రేటు ఎంత? ప్రభుత్వం నిర్ణయించిన కనీస కూలీ ఎంత? కూలీలను భూస్వాములు పీడిస్తున్నారా? దగా చేస్తున్నారా? కూలీల జీవన పరిస్థితులు ఏమిటి? స్థానికంగా పని లేకపోతే వలస పోతున్నారా? పోతే పని లేకనే వలస పోతున్నారా? లేక మరేదైనా కారణాలు ఉన్నాయా?

★ భూ సంస్కరణలు ఎంతవరకు వచ్చాయి?

★ శాంతి భద్రతల పరిస్థితి సవ్యంగా లేని ప్రాంతాలలో బడుగు రైతు నలిగిపోతున్నాడా? వివరాలు ఏమిటి?

వ్యవసాయ రంగం పట్ల అసక్తి, అభిమానం ఉన్న విలేఖరికి వార్తల కొదవ లేదు. కృషి కొద్దీ వార్తల పంట పండుతుంది.

### 4.4.8. క్రీడా వార్తలు

క్రీడా వార్తలు చదివిన పాఠకులకు క్రీడలు చూసిన అనుభూతి కలగాలి. ఆటలలో ఉపయోగించే పడికట్టు మాటలను చదువరికి అర్థం అయ్యే విధంగా రాయాలి. కొన్ని మాటలకు సరైన అనువాదం కుదరకపోతే ఇంగ్లీషు మాటనే ఉపయోగించటం శ్రేయస్కరం. క్రీడాకారుల పట్ల విలేఖరికి ఇష్టాయిష్టాలు ఉన్నప్పటికీ వాటిని వార్తలోకి చొప్పించరాదు.

**క్రీడా విలేకరి ఈ క్రింది విషయాలు గమనించాలి.**

★ ఎవరు గెలిచారు? ఎన్ని పరుగులు ఎన్ని సెట్లు లేదా పాయింట్ల తేడాతో గెలిచారు? ఆటలో పాల్గొన్న క్రీడకారుల్లో ఎవరు ఎలా ఆడారు?

★ మొత్తం మీద ఆట ఉత్కంఠభరితంగా సాగిందా? చప్పగా ఉన్నదా?

★ ఎవరైనా నియమాలు ఉల్లంఘించారా? శిక్షలు విధించారా?

★ అం పైర్ల నిర్ణయాలు నిష్పక్షపాతంగా ఉన్నాయా? వివాదం రేకెత్తించాయా?

★ ఆట సాఫీగా ఆడలేని క్రీడాకారులు, తప్పు చేసి అవుటైన ఆటగాళ్ళు ఎవరు?

★ అత్యధిక స్కోరు సాధించినవారి వివరాలు ఏమిటి? ఈ విధంగా లోగడ ఎవరైన అత్యధిక స్కోరు సాధించారా? వారి వివరాలు.

★ జట్లు పన్నిన వ్యూహాలు, ప్రతి వ్యూహాలు, ఎత్తులు, పై ఎత్తులు.

★ ఆడుతున్న సమయంలో క్రీడాకారులు ఎవరైన గాయపడినారా? వాతావరణం వల్ల అంతరాయం కలిగిందా? గెలుపొందినవారికి అనుకూలించిన పరిస్థితులే ఏమిటి?

### 4.4.9. ప్రగతి వార్తలు

ప్రజల పురోగతికి దోహదం చేసేవి. ప్రగతి గురించి తెలియజేసేవి. ప్రగతి వార్తలు. దేశం మనం ఆశించినంత వేగంగా అభివృద్ధి చెందకపోయినా ఎంతో కొంత ప్రగతి జరుగుతూనే ఉన్నది.

వ్యవసాయ, పారిశ్రామిక రంగాల పురోభివృద్ధికి. రవాణా సౌకర్యాల అభివృద్ధికి, ప్రజల సంపదను. కొనుగోలు శక్తిని పెంచడానికి అనేక కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. అయితే, పాశ్చాత్య ధోరణుల ప్రభావం కారణంగా పత్రికలలో ఎక్కువ శాతం సంచలన వార్తలకే ప్రాముఖ్యం ఇస్తున్నాయి. ఈ దుష్ట సంప్రదాయాన్ని అరికట్టేందుకే వర్ధమాన దేశాలు ప్రగతి వార్తలకు ప్రాధాన్యం ఇవ్వాలని తీర్మానించాయి. అది ఒక లక్ష్యంగా అలీన వార్తా సంస్థ ఆవిర్భవించింది.

BRAOU

ప్రగతి వార్తలంటే ప్రభుత్వానికి ప్రచారం చేసి బాగా ఊదే వార్తలనే తప్పుడు అభిప్రాయం ఉన్నది. ప్రభుత్వం వైఫల్యాన్నీ, అటు ప్రభుత్వాన్నీ ఇటు ప్రజలను మోసం చేసే దళారుల నిర్వాకాన్నీ, ప్రగతి పథకాల వైఫల్యానికి గల కారణాలనూ ఎత్తిచూపే వార్తలు కూడా ప్రగతి వార్తలే.

ప్రగతి వార్తలు సేకరించే విలేఖరికి పాత్రికేయుడు ఎం.వి కామత్ చేసిన సూచనలు ఇవి :

- ★ ప్రగతి వార్త పాఠకుల పరిస్థితులకు సంబంధించినదై ఉండాలి.
- ★ ఒక అభివృద్ధి కార్యక్రమం గురించి వార్త రాసేటప్పుడు ఆ కార్యక్రమం అమలు కాకముందు పరిస్థితి గురించి రాయాలి.
- ★ ఒక ప్రాజెక్టుకు సంబంధించిన వార్త రాస్తున్నప్పుడు దానికి సంబంధించిన అధికార, అనధికార వర్గాల అభిప్రాయాలనూ, ప్రాజెక్టు వల్ల ప్రయోజనం పొందే ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలి.
- ★ అభివృద్ధి కార్యక్రమము సరిగా అమలు జరగడం లేదని వచ్చే ఫిర్యాదులను పరిశీలించకుండా, ధ్రువీకరించుకోకుండా వార్త రాయకూడదు.
- ★ ప్రాజెక్టు అధికారులు సమాచార శాఖాధికారులు, ఇతర ప్రభుత్వాధికారులు తమకు అనుకూలమైన అంశాలను మాత్రమే సాధారణంగా అందజేస్తారు. లోపాలను విలేఖరి పరిశోధించి తెలుసుకొని రాయాలి.
- ★ విలేఖరి ఏ ప్రాజెక్టు గురించి రాస్తున్నాడో అటువంటి ప్రాజెక్టు మరేదైనా అందుబాటులో ఉన్నట్లయితే రెండింటినీ పోల్చుతూ రాయవద్దు.
- ★ ఒకే విషయంపై భిన్నాభిప్రాయాలుంటే అన్ని రకాల అభిప్రాయాలను నిష్పక్షపాతంగా రాయాలి.
- ★ గణాంక వివరాలను ఒకటికి రెండు సార్లు ధ్రువీకరించుకున్న తర్వాతనే వార్తలో ఉపయోగించాలి.

## 4.4.10. సైన్స్ వార్తలు

వైజ్ఞానిక, సాంకేతిక రంగాలకు సంబంధించిన సమాచారం అందించేవి సైన్స్ వార్తలు. మానవ జీవన వికాసానికి శాస్త్ర సాంకేతిక విజ్ఞానం ఎలా ఉపయోగిస్తుందో విలేఖరి గ్రహించగలగాలి. సైన్స్ వార్తలను అర్థం చేసుకొని వాటిని సాధారణ పాఠకులకు అర్థమయ్యే విధంగా రాయాలి.

సైన్స్ పత్రికలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలలో పని చేస్తున్న పరిశోధకులు, అధ్యాపకులు, ఆహార, వ్యవసాయ పరిశోధన సంస్థలు, వైద్య పరిశోధన సంస్థలు, అణు పరిశోధన కేంద్రాలు, తదితర సంస్థలు సైన్స్ వార్తలకు వనరులు.

కొత్త ఆవిష్కరణలు, పరికరాలు, ఆధునిక పద్ధతుల గురించే కాకుండా ప్రకృతి వైపరీత్యాలు సంబంధించినప్పుడు ఆరోగ్య, ప్రాణ రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, అంటువ్యాధులకు అరికట్టడానికి చేపట్టవలసిన చర్యలను సూచించే వార్తలు కూడా సైన్స్ వార్తల కిందికే వస్తాయి. దయ్యాలు భూతాలు, మంత్రతంత్రాలు, చేతబళ్ళులాంటి మూఢ విశ్వాసాలను పారదోలడానికి కూడా సైన్స్ వార్తలు ఉపయోగిస్తాయి. ప్రజలలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి, నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించి పరిష్కరించుకోడానికి, పర్యావరణం, పారిశుధ్యం గురించి తెలుసుకోడానికి ఉపయోగపడే విధంగా సైన్స్ వార్తలు రాయాలి.

సైన్స్ వార్తలు రాసే విలేఖరి చాలా అప్రమత్తంగా ఉండాలి. మోసపోకూడదు. మోసం చేయకూడదు. నకిలీ వైద్యులు, మందుల కంపెనీ చేసే మోసపూరిత ప్రకటనలను అమాయకంగా నమ్మి వాటి ఆధారంగా వార్తలు రాసి పాఠకులను తప్పుదారి పట్టించకూడదు. అలాగే శాస్త్ర విషయాలను వక్రీకరించకూడదు.

BRAOU

### 4.4.11. మానవీయ వార్తలు

ఆసక్తి కలిగించే అసాధారణ సంఘటన వార్త అని చెప్పుకున్నాం. చదువరిలో ఉల్లాసం, ఉత్కంఠ, ఆవేశం, ఆవేదన రేకెత్తించే వార్తలు, హృదయాన్ని కదలించే వార్తలు మ్యావీయ వార్తలు చదివినప్పుడు హృదయ స్పందన కలిగించడం మ్యావీయ వార్త లక్షణం వీటినే Human interest stories ఇంగ్లీషులో అంటారు.

ఇవి ప్రత్యేకమైన వార్తలు. వీటి రచనా శైలి కూడా భిన్నంగా ఉంటుంది. తక్కిన వార్తల్లాగా ఎవరో ఏదో అన్నారు, చెప్పారు. ఉద్ఘాటించారు అంటూ పొడిపొడిగా రాస్తే ఈ రకం వార్తలు రక్తికట్టవు. విషయానికి ఎంత ప్రాధాన్యం ఉన్నదో రాసే తీరుకు అంటే ప్రాధాన్యం ఉన్నది. దృశ్యం కళ్ళకు కట్టినట్లు వర్ణించాలి. అందంగా, పాఠక జనరంజకంగా రాయడం దగ్గర నుంచి పేజీలో ఆకర్షణీయంగా అమర్చడం వరకూ ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి.

శైలి, సృజన, వార్త దృష్టి ఉన్న విలేఖరికి ఎక్కడ చూసినా జనాసక్తికర వార్తలు కనిపిస్తాయి. ప్రమాదం జరిగినా, ప్రమోదం జరిగినా అసాధారణ దృశ్యాలు, సన్నివేశాలు కనిపిస్తాయి. ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్ ఫిరోజాబాద్‌లో 1995 ఆగష్టు 20వ తేది అదివారం సంభవించిన ఘోరమైన రైలు ప్రమాదంలో నాలుగు వందల మందికిపైనా ప్రయాణికులు మరణించారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఆగష్టు 21, 22 తేదీలలో వార్తా పత్రికలు పుంఖానుపుంఖాంగా వార్తలు ప్రచురించాయి. 1996 ఆగష్టు 22 'ఈనాడు' సంచిక ప్రచురించిన వార్త చూడండి.

**శవాలపై నగల దోపిడీ**

**ఫిరోజాబాద్‌లో ఖాకీల నైచ్యం**

*న్యూఢిల్లీ, ఆగష్టు 21 (న్యూస్‌టుడే) : 250 మందికి పైగా ప్రయాణికులను బలిగొన్న ఫిరోజాబాద్ రైలు ప్రమాదం గురించి, "సహాయం" కార్యక్రమాల తీరు గురించి స్థానిక ఎం.పి. ప్రభు దయాళ్ కథారియా (బి.జె.పి) ఇచ్చిన వివరణ లోక్‌సభ, సభ్యులను దిగ్భ్రాంతి పరిచింది. స్థానిక అధికారుల అలసత్వం, పోలీసుల దోపిడీ, రైల్వే అధికారుల నిర్లిప్త ధోరణి ఆయన కళ్ళకు కట్టునట్టు తెలియపరిచారు. ప్రమాద వార్త తెలియగానే ఆయన హుటాహుటి ఫిరోజాబాద్ వెళ్ళి సంఘటనా స్థలాన్ని సందర్శించి వచ్చారు. అక్కడ విషయాలను వివరిస్తున్నప్పుడు ప్రభు అనేకసార్లు భోరున విలపించారు. ప్రయాణికుల శవాల్ని కూరగాయలు పోసినట్టు కుప్పలుగా పోశారని ఆయన పేర్కొన్నారు. మహిళల వొంటి మీద విలువైన ఆభరణాలను పోలీసులు నిస్సిగ్గుగా దోచుకున్నారని ఆయన సభ్యులకు తెలియజెప్పారు. "స్త్రీ ఆభరణాలు ప్రయాణికులు లగేజీలో విలువైన వస్తువులు దోచుకోవడమే తప్ప పోలీసులు సహాయ కార్యక్రమాలలో అసలు పాల్గొనలేదు". జుగుప్స, ఆవేదన కలిగించే ఈ వార్తను మరింత శక్తిమంతంగా రాయవచ్చు. వివరాలు పేలవంగా, సాధారణంగా ఉన్నాయి. జనాసక్తికర వార్తను మామూలు వార్తలాగా రాశారు. లోక్‌సభలో సభ్యుడు చెప్పిన అంశాలనే ఇంకా ఎక్కువ ఆవేశంగా, ఆవేదనగా రాయగలగాలి.*

*సాధారణవార్త, జనాసక్తికర వార్త పాలు నీళ్ళలాగా కలిసిపోయి ఉంటాయి. హంసలాగా వాటిని విడదీయ కలిగిన శక్తి విలేఖరికి ఉండాలి. సామెతలు, జాతీయాలు, కవితలు, అలంకారాలు ఉపయోగించి మానవీయ వార్తలను పాఠకుల మనస్సును సూటిగా తాకే విధంగా రాయాలి. అప్పుడే ఆ వార్తలు సార్థకమవుతాయి. జనాసక్తికర వార్తలు ఈ మర్మం తెలియని మామూలు విలేఖరి చేతిలో పడితే నిరర్థకమవుతాయి.*

### 4.4.12. పరిశోధనాత్మక వార్తలు

సామాజిక శ్రేయస్సు కోసం విలేఖరి చేసే సాహసమే పరిశోధనాత్మక వార్తకు ప్రాణం. అక్రమ వ్యవహారాలను, కుట్రలను, అవినీతిని బయటపెట్టాలనుకున్నప్పుడు విలేఖరి పరిశోధన చేయవలసి వస్తుంది. సభల్లో, సమావేశాలలో చేసే ప్రసంగాలను వార్తగా రాసుకోడానికీ, దీనికీ చాలా తేడా ఉంది.

పరిశోధనాత్మక వార్తను విలేఖరి స్వయంగా పరిశోధించి కనిపెడతాడు. నిజ నిర్ధారణ కోసం రాత్రింబవళ్ళు కష్టపడవలసి ఉంటుంది. వాస్తవాలను ధ్రువీకరించుకోవడానికి ఎందరినో కలిసి సమాచారం సేకరించవలసి ఉంటుంది.

BRAOU

అనేకమైన ఒత్తిళ్ళు ఎదుర్కోవలసి వస్తుంది. వీధి గూండాల హత్య రాజకీయాల నుంచి బహుళ జాతి సంస్థల కుంభకోణం వరకు దేన్ని గురించైనా పరిశోధించి విలేఖరి వార్త రాయవచ్చు.

పరిశోధనాత్మక వార్త రాయాలనుకొన్న విలేఖరి తాను కూపీలాగాలను కొన్న విషయంపై అధికారులను, అనధికారులను, ఇతర వ్యక్తులను కలిసి సమాచారం రాబట్టాలి. అవినీతికి పాల్పడిన అధికారి ఆరా తీయడానికి అతని కార్యాలయంలో అటెండర్ దగ్గర వరకూ అందరితోనూ మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలి. మిత్రులు వాస్తవాలను దాచి పెట్టువచ్చు. శత్రువులు కల్పించి చెప్పవచ్చు. వాటినన్నింటినీ సహజంగా పరిశీలించి నిజ నిర్ధారణ చేసుకున్న తర్వాతే వార్త రాయాలి. ఈ రకం వార్తలు రాసే విలేఖరికి నూటికి నూరు పాళ్ళు నిజాయితీ, విచక్షణాజ్ఞానం అవసరం. ఇవి లోపిస్తే సమాజానికి తీరని కీడు జరుగుతుంది.

## 4.4.13. అన్వయ వార్తలు

రోజూ వచ్చే వార్తలను బట్టి కొన్ని తీర్మానాలు చేయవచ్చు. భవిష్యత్తును ఊహించవచ్చు. ఒక రాజకీయ నాయకుడు గతంలో చెప్పిన దానిని, ఇప్పుడు చేస్తున్నదాన్ని బట్టి భవిష్యత్తులో ఏమి చేస్తాడో ఊహించి రాస్తే వార్త అన్వయ వార్త. అన్వయించడం అంటే కార్యకారణ సంబంధాన్ని వివరించడం వార్తకు సరైన దృక్కోణం కల్పించడం కంటికి కనిపించిన, చెవికి వినిపించిన విషయాలను అన్వయించి సమగ్రమైన వార్త రాయడం. తెలిసిన విషయాల ఆధారంగా పరిస్థితిని అంచనా వేయడం ఏమిటి? ఎవరు? అనే ప్రశ్నలకన్న ఎందుకు? ఎలా? అనే ప్రశ్నలకు ఈ వార్తలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ముందు చూపుతో పరిస్థితిని అంచనా వేయడమే అన్వయ వార్త ముఖ్య లక్షణం.

"అన్వయం అంటే నిష్పాక్షిత దృష్టిని ఖండించడం కాదు. ప్రజాస్వామ్యంలో తుది నిర్ణేతలు ప్రజలే కనుక విషయాన్ని పాఠకులు అర్థం చేసుకొని నిర్ణయించుకునే విధంగా వార్తలు ఇవ్వాలి" అని మెక్‌డేగల్ అనే (Mc Dowgal) అమెరికా జర్నలిజం ప్రొఫెసర్ అన్నాడు. అన్వయ వార్తలో - 1) ఉదంతాన్ని పాఠకుడి కళ్ళకు కట్టినట్లు వర్ణించాలి 2). వార్త పాఠకుడికి ఆసక్తి కలిగించాలి 3) సమాజంపై ప్రభావం చూపేదిగా వార్త ఉండాలి. 4) వార్తలోని వ్యక్తుల వ్యక్తిత్వాలను వర్ణించాలి.

అన్వయ వార్త రాసే వ్యక్తి సాధ్యాసాధ్యాలను చర్చిస్తూ పాఠకులను తనతో తీసుకుపోవాలి. తన వాదనకు అనుకూల, ప్రతికూల అంశాలు రెండింటినీ చర్చించాలి. చర్చ ఫలితాన్ని సూచనప్రాయంగా చెప్పాలి. కానీ రూఢిగా ద్వంద్వంగా చెప్పకూడదు. అన్వయ వార్తకు విషయ నియమం లేదు. ఘటన గురించి పూర్తి వివరాలు తెలిసి ఉండి విశ్లేషించగల సామర్థ్యం ఉండే దేన్ని గురించి అయినా అన్వయ వార్తలు రాయవచ్చు.

BRAOU

## 4.4.14. అనంతర వార్తలు

సాధారణంగా ఒకసారి రాస్తే ఆ వార్తలకు తర్వాత విలువ ఉండదు. కానీ కొన్ని వార్తలు దీర్ఘకాలం చర్చనీయాంశాలుగా ఉంటాయి. విషయం దీర్ఘాయుష్షు కలిగింది కావడమే ఇందుకు కారణం. ఒక రోజు ఒక విషయానికి సంబంధించి ఒక వార్త రాస్తే మరుసటి రోజు లేదా కొన్నాళ్ళ తర్వాత ఆ విషయానికే సంబంధించిన మరో కొత్త అంశాన్ని వార్తగా రాయవలసి వస్తుంది. ఇలాంటి వార్తలనే అనంతర వార్తలు అంటారు.

అనంతర వార్తలు రెండు రకాలుగా ఉంటాయి. 1) ఒక వార్తకు సంబంధించిన విషయం కొన్ని రోజులపాటు చర్చనీయాంశంగా ఉంటే దాన్ని గురించి అన్ని రోజులూ వార్త రాయవలసి ఉంటుంది. అసెంబ్లీ సమావేశాలు నెల రోజులు జరిగితే నెల రోజుల పాటూ వార్త రాస్తూనే ఉండాలి. ఏదైనా సంచలనాత్మకమైన హత్యోదంతంపై కొన్ని రోజులపాటు వరుసగా వార్తలు వస్తాయి. హత్య జరిగిన వెంటనే వార్త రాస్తాము. తర్వాత పోలీసుల దర్యాప్తు వివరాలు అందినవి అందినట్టు పాఠకులకు అందిస్తాం. అనుమానితులను పోలీసులు అరెస్టు చేసిన తర్వాత ఆ వైనం తెలియజేస్తారు. కోర్టులు విచారణ వివరాలు, శిక్ష వేయడం, తదితర అంశాలన్నీ పాఠకులకు వార్తల రూపంలో అందజేస్తూనే ఉంటాం. ఇది నిరవధికంగా అనంతర వార్తలు రాయడం.

2) ఒక సంఘటన గురించి ఒక వార్త రాస్తాం. ఆ తర్వాత కొన్నేళ్ళకు అదే సంఘటన గురించి మరో వార్త రాయవలసి

వస్తుంది. అప్పుడు మొదట రాసిన వార్తను ప్రస్తావించి కొత్త వార్త రాయాలి. ఉదాహరణకు తుపాను వచ్చి వెయ్యి మంది మరణించారని అనుకుందాం. ఇలాంటి తుపానే ఇరవై ఏళ్ళ క్రితం వచ్చి ఇంతే ప్రాణ నష్టం కలిగించిందని కూడా అనుకుందాం. ఇప్పటి తుపాను వార్త రాస్తున్నప్పుడు అప్పటి తుపాను గురించి ప్రస్తావించవలసి ఉంటుంది. అలాగే భోపాల్ గ్యాస్ లీకేజి దుర్ఘటన. రెండో ప్రపంచ యుద్ధం చివరిలో హిరోషిమా, నాగసాకి నగరాలపై బాంబులు వేయడం. ఇది జరిగిన పదేళ్ళ తర్వాత భోపాల్ గ్యాస్ బాధితుల బతుకులు ఎలా ఉన్నాయో, 50 సంవత్సరాలు అనంతరం జపాన్ నగరాలు హిరోషిమా. నాగసాకి ఏ రకంగా అత్యద్భుతంగా అభివృద్ధి సాధించాయో తెలియజేసే వార్తలు అనంతర వార్తల కిందికే వస్తాయి.

### 4.4.15. వ్యాపార వార్తలు

ప్రస్తుతం ప్రపంచం వ్యాపారం మీదే నడుస్తోంది. కాబట్టి వ్యాపార వార్తలకు విశేష ప్రాముఖ్యం ఉన్నది. పత్రికలు కూడా వ్యాపార వార్తలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ వార్తలకు ఎక్కువ పేజీలు కేటాయించడమే కాకుండా ప్రత్యేక సంచికలు, అనుబంధాలు ప్రచురిస్తున్నాయి.

వ్యాపార వార్తలు రాసే విలేఖరులు వ్యాపార సంస్థలతో, వాణిజ్య సంఘాలతో సత్సంబంధాలు పెట్టుకొని వార్తలు రాబట్టుకోవాలి వ్యాపారవేత్తలను కలిసి వ్యాపార రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఒక్కో వ్యాపారానికి సంబంధించిన నిపుణులను కలుసుకొని ఆయా వ్యాపారాలలోని లోతుపాతులను తెలుసుకోవాలి. ప్రముఖ వ్యాపారవేత్తలతో, వర్తక నిపుణులతో ఇంటర్వ్యూలు తీసుకోవాలి. కొత్త రకం వ్యాపారాలు. వాటి లాభనష్టాల గురించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలి.

దేశంలోని ఇతర ప్రాంతాలలోని వ్యాపారాల గురించి తెలుసుకొని స్థానికంగా ఉన్న వ్యాపారాలతో తులనాత్మకంగా అధ్యయనం చేసి విశేష వార్తలు రాయవచ్చు. ఇతర దేశాలలోని రకరకాల వ్యాపారాల గురించి తెలుసుకొని వాటిలో స్థానిక పరిస్థితులకు అనువైన వ్యాపారాలు ఏమిటో రాస్తే పాఠకులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

ముఖ్యమైన కంపెనీల వ్యాపార వివరాలు విశ్లేషనాత్మకంగా రాయడం ద్వారా స్టాక్ మార్కెట్‌లో షేర్ల కొనుగోలుదారులకు మార్గదర్శిగా ఉపయోగపడవచ్చు.

వ్యాపారాన్ని, రాజకీయాలను మేళవించి దేశాల మధ్య దౌత్యం సాగుతున్న ఈ కాలంలో వ్యావార వార్తలకు అత్యంత ప్రాధాన్యం ఉన్నది. ఇది క్రమంగా పెరుగుతుందే కాని తగ్గదు.

BRAOU

### 4.4.16. సాంస్కృతిక వార్తలు

సంగీత, సాహిత్య, నృత్య, నాటకాది కళలకు సంబంధించిన వార్తలను సాంస్కృతిక వార్తలు అంటారు. కళలలో పరిజ్ఞానం, కనీస అభిరుచి ఉన్నవారే ఈ రంగంలో విలేఖరిగా రాణించగలుగుతారు.

సాంస్కృతిక సంస్థలు, ప్రభుత్వ సమాచార శాఖ, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే స్థలాలు ఈ వార్తలకు వనరులు, సంగీత కచేరీలు, సాహిత్య సభలు, సదస్సులు, పుస్తకావిష్కరణ సభలు, నాటకాల ప్రదర్శన వంటి కార్యక్రమాల గురించి రాసే వార్తలలో సముచితమైన స్థాయి భాషను ఉపయోగించాలి. ఆయా రంగాలలో నిష్ణాతులైన కళాకారులను ఇంటర్వ్యూలు చేయడం, కొత్త కళాకారులను పరిచయం చేయడం వల్ల సాంస్కృతిక వార్తలకు పరిపుష్టి లభిస్తుంది.

గ్రామాలలో జరిగే వీధి నాటకాలు, జాతరలు, పండగ రోజుల్లో జరిగే కార్యక్రమాలను వివరించే వార్తలు కూడా సాంస్కృతిక వార్తలే.

### 4.4.17. రాజకీయ వార్తలు

చిన్నాపెద్దా తేడా లేకుండ అందరినీ ఆకర్షించే వార్తల్లో రాజకీయ వార్తలు ముఖ్యమైనవి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం గురించి, రాజకీయ నాయకుల గురించి, రాజకీయాల ధోరణి గురించి ప్రజలందరికీ తెలియవలసిన అవసరం ఉన్నది. తెలుసుకోవాలన్న కుతూహలం ఉంటుంది.

మన పత్రికలలో భీముని వాటా రాజకీయ వార్తలదే. రోజువారీ రాజకీయ వార్తలే కాక విశ్లేషణలు, అన్వయవార్తలు, అనంతర వార్తలు కూడా ఉంటాయి. రాజకీయ వార్తలకు వనరులు ఇవి:

- ★ వివిధ రాజకీయ పార్టీలు. గ్రామ స్థాయి నుంచి కేంద్ర స్థాయి వరకూ ఆయా పార్టీల కార్యాలయాలు వార్తలు అందిస్తాయి.
- ★ రాజకీయ నాయకులు, గ్రామస్థాయి రాజకీయ నాయకులు, మండల, జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి నాయకుల వరకూ అందరూ వార్తా సృష్టికి మూలకారకులే.
- ★ ప్రతి పార్టీలోనూ నాయకత్వాన్ని ఎదిరించేవారూ, అధిష్ఠానవర్గంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసేవారూ ఉంటారు. వారు సంచలన వార్తలకు పట్టుకొమ్మలు.
- ★ సభలు, సమావేశాలు, నాయకుల పోటీలు, ఘర్షణలు, ప్రదర్శనలు, ధర్నాలు, బైటాయింపు, ఘెరావ్‌లు, వినతిపత్రాల సమర్పణ, సన్మానాలు ఇవన్నీ రాజకీయ వార్తలను అందించే సందర్భాలే.

రాజకీయ వార్తలు రాయడం కత్తి మీద సాములాంటిది. ఏ రాజకీయ పార్టీకో, నాయకుడికో వ్యతిరేకంగా వార్త రాసే ముందు జాగ్రత్తగా ఆలోచించాలి. ఆ వార్తకు తగిన ఆధారాలుంటే కానీ వార్త రాయడానికి పూనుకోకూడదు. వార్తకు ఆధారమైన వ్యక్తుల హోదా కూడా గమనించాలి. దారినపోయే దానయ్య చెప్పే అవాకులు చెవాకులు ఆధారంగా బాధ్యతగల నాయకులపై విమర్శలు రాయకూడదు. ముందుగానే వాస్తవాలను ధ్రువీకరించుకొని వార్త రాయాలి. ఒక పార్టీకి చెందిన రాజకీయ నాయకుడు మరో పార్టీకి చెందిన రాజకీయ ప్రముఖుడిని దుయ్యబడితే వాళ్ళిద్దరి స్థాయీ భేదాన్ని గుర్తించి గానీ వార్త రాయకూడదు.

అన్ని పార్టీల నాయకులతోనూ, పార్టీలోని నాయకులందరితోను సన్నిహితంగా మెలగడం వల్ల వార్తా సేకరణ సులభం అవుతుంది. కీలకమైన నిర్ణయాలు ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంటుంది.

BRAOU

## 4.5 విలేఖరి లక్షణాలు - బాధ్యతలు

పత్రికకు వెన్నెముక విలేఖరి. వార్తలు సేకరించేవారు, రాసేవారు విలేఖరులు. విలేఖరి సమర్థుడై బాధ్యతాయుతంగా పని చేస్తేనే పత్రికకు విశ్వసనీయత పెరుగుతుంది.

విలేఖరికి ఉండవలసిన లక్షణాలు ఇవి:

### ఎ. సర్వజ్ఞుడు

విలేఖరికి ప్రాపంచిక విషయాలన్నిటిలోనూ కాస్తో కూస్తో పరిజ్ఞానం ఉండాలి. ఏ విషయాన్ని అయినా అవగాహన చేసుకొనే సామర్థ్యం, వార్తా దృష్టి, చదువు, సంస్కారం, మాటకారితనం, చొరవ, విశాలదృక్పథం, జ్ఞాపకశక్తి ఉండాలి. రాజకీయాలు, కళలు, శాస్త్ర విజ్ఞానం, వ్యాపారం-ఇలా అన్ని విషయాలలోనూ వార్త రాయడానికి కావలసిన పరిజ్ఞానం విలేఖరికి ఉండాలి. విలేఖరి ఏ విషయాన్నీ తనకు సంబంధంలేదనుకొని నిర్లక్ష్యం చేయకూడదు.

### బి. వార్తా దృష్టి

ఏది వార్తో, ఏది కాదో గ్రహించగలిగే శక్తి విలేఖరికి ఉండాలి. ప్రతి ఘటననూ వార్త దృష్టితో చూసి అవసరమైన సమాచారం సేకరించాలి.

### సి. వేగం

ఆడుతూపాడుతూ పని చేసే సావకాశం విలేఖరికి ఉండదు. ఎప్పుడూ పరుగే. వార్తా సేకరణ నుండి రాయడం వరకూ ఒకటే తొందర. ఏ మాత్రం ఆలస్యం చేసినా వార్త చద్ది అవుతుంది. సమాచారం అందగానే వార్త రాయాలి. ప్రచురణ కేంద్రానికి పంపాలి. వాయిదా వేయకూడదు.

### డి. నిష్పాక్షిక దృష్టి

ఒక ఘటన తన దృష్టికి వచ్చినప్పుడు ఒకరు మరొకరిపై ఆరోపణలు చేసినప్పుడు వాటిలోని నిజానిజాలను నిర్ధారించుకొని కానీ వార్త రాయకూడదు. ఏదైనా విషయానికి సంబంధించిన సమాచారం సేకరిస్తున్నప్పుడు ముందుగానే ఆ విషయంపై మమకారమో, వ్యతిరేకతో పెంచుకొంటే నిష్పాక్షికమైన వార్త రాసే అవకాశం ఉండదు.

### ఇ. కలుపుగోలు తనం

చొరవలేని విలేఖరి తక్కిన లక్షణాలు అన్నీ ఉన్నప్పటికీ రాణించలేడు. అనేక సంస్థలు, పలువురు వ్యక్తుల నుంచి సమాచారం సేకరించవలసిన విలేఖరి అందరితోనూ కలుపుగోలుగా, చాకచక్యంగా మాట్లాడగలగాలి. ఎవ్వరితోనూ శత్రుత్వం పెంచుకోకూడదు.

### ఎఫ్. ప్రజా సంక్షేమం

సమాజంలో విలేఖరి చాలా బాధ్యతాయుతమైన వ్యక్తి. అందుకని ప్రజా సంక్షేమం విలేఖరి బాధ్యతగా గుర్తించాలి. తాను రాసే వార్తలు ప్రజా సంక్షేమానికి తప్ప వినాశనానికి దారితీయకూడదు. అమాయకులకు, నిర్దోషులకు శిక్షపడే విధంగా, మనస్తాపం కలిగించే తీరుగా వార్తలు రాయకూడదు.

### జి. ప్రజాస్వామ్యంపై విశ్వాసం

ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం బలపడేందుకు విలేఖరి దోహదం చేయాలి. ప్రజాస్వామ్యం ఉంటేనే పత్రికలకు మనుగడ. కులమతాలకు అతీతంగా, సమాజాభివృద్ధికి తోడ్పడే విధంగా వార్తలు రాయాలి. ఆవేశకావేషాలకు లోనుకాకుండ, వాస్తవాలను వక్రీకరించకుండా సంయమనం పాటించాలి.

### హెచ్. శాస్త్రీయ దృష్టి

తన ఇష్టా ఇష్టాలను, విశ్వాసాలను వార్తలలో చొప్పించకుండా కార్యకారణ సంబంధాన్ని వివరిస్తూ విశ్లేషించే బాధ్యత విలేఖరిది. ప్రజల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించడానికి, మూఢ నమ్మకాలను ప్రేరేపించే వారిని, ప్రజలను మోసం చేసేవారిని చట్టానికి పట్టి ఇవ్వడానికి విలేఖరి కృషి చేయాలి.

### ఐ. సమాచార దాతలను అల్లరి చేయకూడదు

తనకు సమాచారం అందించే వ్యక్తుల, సంస్థల వివరాలను అనుమతి లేకుండా విలేఖరి వెల్లడించడం న్యాయం కాదు. ఇంటర్వ్యూలోనూ, లోకాభిరామాయణంలోనూ 'ఆఫ్‌ది రికార్డ్' అని ఎవరైనా చెప్పిన విషయాలను రహస్యంగా ఉంచాలి. ప్రచురించకూడదు.

**అభ్యాసం 2 : విలేఖరికి ఉండవలసిన లక్షణాలు వివరించండి.**

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

BRAOU

## 4.6. ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ విలేఖనం ఆసక్తి కలిగించేదిగా వుండాలి. వాస్తవమైనదై తాజాగా, తేలికగా అర్థమయ్యేలా వుండాలి.

★ వార్తకు శీర్షిక, వార్తాగ్రం, వివరణ, ముగింపు సక్రమంగా, ఆకర్షణీయంగా వుండాలి.

★ వార్తా సేకరణలో ఇంటర్వ్యూ ముఖ్యమైన పద్ధతి, ఇంటర్వ్యూ చేసే విలేఖరికి సంయమనం అవసరం. ఇంటర్వ్యూ రికార్డు చేసుకుంటే మంచిది.

★ శాసనసభల్లో సమాచారం చేసే విలేఖరికి రాజకీయ పరిజ్ఞానం, చొరవ అవసరం.

★ మానవీయ విలువలున్న వార్తలను మంచి భాష, బిగువుతో పాఠకులను కదిలించేలా రాయాలి.

★ వార్త రాసిన విలేఖరి ఆ వార్తకు శీర్షిక కూడా సూచించడం మంచి పద్ధతి విలేఖరికి వేగం, వార్త దృష్టి, సమయస్ఫూర్తి, నిష్పాక్షకత శాస్త్రీయ దృష్టి అవసరం.

## 4.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. విలేఖనం లక్షణాలు తెలిపి అవి ఎన్ని విభాగాలలో వివరించండి?
2. విలేఖరి లక్షణాలు బాధ్యతలు తెలపండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ఇంటర్వ్యూ-విలేఖనం
2. పరిశోధనాత్మక వార్తలు

**- కొండుభట్ల రామచంద్రమూర్తి**

BRAOU

# భాగం - 5ః వార్తల ఎడిటింగ్

## విషయక్రమం


5.0 ఉద్దేశం

5.1 ప్రవేశిక

5.2 ఎడిటింగ్ అంటే ఏమిటి?

5.3 ప్రచురణకు సిద్ధం చేయడం

5.4 వార్తల ప్రచురణార్హత - ప్రాథమిక నిర్ణయం

5.4.1. సాధారణ ప్రమాణాలు

5.4.2. ఇతర కొలమానాలు

5.5 వార్తలను తీర్చిదిద్దడం

5.6 ప్రాధాన్యాల నిర్ణయం

5.7 తుది మెరుగులు

5.8 ఎడిటింగ్ సాధనాలు

5.9 తెలుగు పత్రికా రంగం - ఎడిటింగ్ సమస్యలు

5.10 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

5.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 5.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- ఎడిటింగ్ అంటే ఏమిటి?
- వార్తల ప్రచురణార్హతను ఎలా నిర్ణయిస్తారు?
- ఎడిటింగ్ సాధనాలు
- తెలుగు పత్రికా రంగం - ఎడింటింగ్ సమస్యలు తెలుసుకుంటారు.

## 5.1 ప్రవేశిక

వార్తా పత్రికల ప్రచురణలో ఎడిటింగ్ (సంపాదకత్వం) అతి ముఖ్యమైన, కీలకమైన భాగం. వార్తా పత్రికలలో ప్రచురితమయ్యే అంశాలు స్థూలంగా మూడు : వార్తలు, వ్యాఖ్యలు. వ్యాపార ప్రకటనలు. వీటిలో వ్యాపార ప్రకటనలను మినహాయిస్తే, తక్కిన రెంటిని - అంటే వార్తలను, వ్యాఖ్యలను ప్రచురణకు అనువుగా తీర్చి దిద్దే పనిని సంపాదక విభాగం లేదా ఎడిటోరియల్ సెక్షన్ చేస్తుంటుంది. ఎడిటోరియల్ సెక్షన్ చేసే పనే ఎడిటింగ్ సంపాదక విభాగం అధిపతి సంపాదకుడు/ ఎడిటర్. సంపాదకీయం రాయడం, ప్రతికారంగం ప్రమాణాలకు. స్వీయ ప్రమాణాలకు అనుగుణంగా పత్రికకు రూపకల్పన చేయడం (designing ) పత్రిక పాలసీ అమలును పర్యవేక్షించడం-వంటి స్థూలమైన బాధ్యతలు మాత్రమే ఎడిటర్ స్వయంగా నెరవేరుస్తారు. పత్రికలో ప్రచురితమయ్యే అసంఖ్యాక వార్తలను, వ్యాఖ్యలను ప్రచురణకు అనువుగా మలిచి తుది రూపం ఇచ్చేది మాత్రం సంపాదక విభాగం సిబ్బంది. ఈ విభాగంలో హోదా రీత్యా అనేక శ్రేణులుంటాయి. ఎక్కువ సంఖ్యలో ఉండి.

అత్యంత ప్రాథమికమైన ఎడిటింగ్ బాధ్యతలు నెరవేర్చే ఉద్యోగులను సబ్-ఎడిటర్లు లేదా ఉపసంపాదకులు అంటారు. పత్రికా సంస్థలో హోదా రీత్యా ఉండే శ్రేణులు నిర్వహణ సౌలభ్యం కోసం మాత్రమే కనుక, వార్తల ఎడిటింగ్ అనే వృత్తి పరమైన పనిని చేసే ఉప సంపాదకుల పని విధానం గురించే ఇక్కడ తెలుసుకోబోతున్నాం.

## 5.2 ఎడిటింగ్ అంటే ఏమిటి?

కన్‌సైజ్డ్ ఆక్సఫర్డ్ డిక్షనరీలో 'ఎడిటింగ్'కు రెండు అర్థాలున్నాయి. ఒకటి To assemble, to prepare or modify - written material esp. the work of another or others. అంటే "ఇతరుల లిఖిత రచనలను (ప్రచురణ కోసం) కూర్చడం, సవరించడం లేదా సిద్ధం చేయడం రెండో అర్థం - Be in over all charge of the content and arrangement of - a news paper, a journal etc - to form a unified sequence. అంటే వార్తా పత్రికలలో గానీ, ఇతర రకాల పత్రికల్లో గానీ ప్రచురించే అంశాలు, ఆ అంశాల అమరిక ఒక సమీకృత క్రమంలో ఉండేట్టుగా పర్యవేక్షించడం, బాధ్యత తీసుకోవడం.

మొదటి అర్థం విస్తృతమైనది. పత్రికలలోనే కాకుండా ఎడిటింగ్ ఇతర ప్రచురణలలో కూడా అవసరమైన అంశం. సంకలనాలు, పరిశోధక వ్యాసాలు, సాధారణ గ్రంథాలు - వంటి వాటికి కూడా సంపాదకత్వం అవసరం. మొదటి అర్థం మొత్తం సంపాదకత్వానికి వర్తించేది.

రెండో అర్థం ప్రత్యేకంగా పత్రికల ఎడిటింగ్‌కు వర్తించేది. వార్తలను, వ్యాఖ్యలను ప్రచురణకు అనువుగా తీర్చిదిద్ది సిద్ధం చేయడమే కాకుండా, ప్రచురించే అన్ని అంశాల మధ్య ఒక సమీకృత క్రమం (Unified Sequence) ఉండేట్టు చూడడమే ఎడిటింగ్ అని నిఘంటువు చెబుతున్నది.

కన్‌సైజ్డ్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ చెప్పిన అర్థాన్నే మరింత విపులంగా కమ్యూనికేషన్ కోణం నుంచి జర్నలిజం పండితుడు టిజెఎస్ జార్జి చెబుతున్నారు. "చేరవలసిన వారికి, చేరవలసిన విధంగా సమాచారాన్ని అందజేయాలనడం ఒక కళ. ఆ కళకు సంబంధించి సకల నైపుణ్యాల సమాహారం ఎడిటింగ్. పత్రికలో ఉన్న ప్రతీదీ పాఠకునికి సులువుగా అర్థమయ్యేలా చూడడమే ఎడిటింగ్ లక్ష్యం. పత్రికలోని అన్ని అంశాలు సులువుగా కనుగొనగలిగి ఉండాలి. సులువుగా చదవగలిగి ఉండాలి. సరళమైన, స్పష్టమైన భాష వాడడం ద్వారా, పత్రికలో అత్యంతం ఒకే విధానం, ఏకత్వం ధ్వనించేట్టు చేయడం ద్వారా, ఆకర్షణీయమైన రచనాశైలి ద్వారా ఆ లక్ష్యం సాధించవచ్చు". (టిజెఎస్ జార్జ్, Editing, P. 12, Indian Institute of Mass Communications Publication, 1989)

ఎడిటింగ్ అనే బాధ్యతను నెరవేర్చడం సులువైన పని కాదు. జార్జ్ చెప్పినట్టు కమ్యూనికేషన్ కళకు సంబంధించిన సకల నైపుణ్యాల సమాహారం ఎడిటింగ్. రచన చేయకలిగిన వారందరూ ఎడిటింగ్ చేయలేరు. ఎడిటింగ్‌కు అవసరమైన అనేక నైపుణ్యాలలో రచన చేయగలగడం ఒకటి మాత్రమే. రచయిత కాని వారు కూడా మంచి ఎడిటర్ కాగలరు కానీ, కేవలం రచయిత మాత్రమే అయినవారు సంపాదకుడు కాలేరు. పత్రికలకు సంబంధించినంత వరకు చూస్తే ఎంత గొప్ప రచయిత చేసిన ఎంత గొప్ప రచన అయినా ఎడిటర్ చేతిలో మెరుగుపడుతుంది.

పత్రిక ప్రచురణలో అనేక సాంకేతిక నైపుణ్యాలు, సృజనాత్మక నైపుణ్యాలు అవసరమవుతాయి. అక్షరాల కంపోజింగ్, పేజీ అలంకరణ, ఆఫ్‌సెట్ ముద్రణలో అయితే ఫిల్మ్ ప్రాసెసింగ్, ప్లేట్ మేకింగ్, చివరగా ముద్రణ, ఆపైన పంపిణీ - ఈ అన్ని విభాగాల గురించిన పరిజ్ఞానం, అవగాహన ఎడిటింగ్ చేసే వారికి అవసరం. ఈ అన్నిటి గురించిన నిరంతర స్పృహ ఎడిటింగ్‌కు నేపథ్యంగా ఉంటుంది. ఒక సినిమాను చూస్తున్నప్పుడు ప్రేక్షకులకు నటులనటన ప్రత్యక్షంగా కనిపిస్తుంది, గాయకుల గానం వినిపిస్తుంది. ఛాయా గాయకుడి నైపుణ్యం తెలుస్తుంది. సంభాషణల రచయిత శైలీ విన్యాసం, చమత్కారం తెలుస్తాయి. ప్రత్యక్షంగా తెలియకుండా, వ్యక్తం కాకుండా ఆ మిశ్రమ కళకు రూపాన్నిచ్చినవాడు దర్శకుడు. అతనికింపాటల రచయిత సాహిత్యంలోని సారస్యం, సంగీత దర్శకుడి ప్రతిభ, సాంకేతిక అంశమైన ఫోటోగ్రఫీ అన్ని తెలిసి వుండాలి. పత్రిక సంపాదకుడుసినిమా

లేదా నాటకం దర్శకుని వంటివాడు. తేడా ఒకటే, సినిమాకు, నాటకానికి దర్శకత్వ శాఖలో ఉండే సహాయకుల సంఖ్య కంటె, పత్రికల్లో సంపాదకీయ సిబ్బంది. సంఖ్య కొన్ని రెట్లు అధికంగా ఉంటుంది.

## 5.3 ప్రచురణకు సిద్ధం చేయడం

వార్తలను, ఇతర రచనలను ప్రచురణకు సిద్ధం చేయడమంటే ఏమిటి?

(ఎ) వార్త లేదా రచన ప్రచురణార్హతను ప్రాథమికంగా నిర్ణయించడం.

(బి) ప్రాథమిక పరీక్షలో నెగ్గి, ప్రచురణార్హమని భావించిన దానిని ప్రమాణాలను. ప్రాధాన్యాలకు అనుగునంగా దాన్ని సవరించడం, భాష దోషాలను దిద్దడం, కుదించడం, విస్తరించడం, తిరగరాయడం, అర్థవంతమైన శీర్షిక జోడించడం.

(సి) ప్రచురణకు స్వీకరించి, సవరించినవి కూడా అనేకం ఉంటాయి కాబట్టి. ప్రాధాన్యాలను బట్టి. పత్రికలలో స్థల పరిమితిని బట్టి వాటి స్థానాన్ని నిర్ణయించడం.

(డి) నిర్ణయించిన స్థానంలో అనుబంధ సామగ్రి (ఫోటోలు, బొమ్మలు, చిత్రాలు) ఆ వార్తను లేదా రచనను వ్యంగ్య. చిత్రాలు)తో పాటు అందించడం, తక్కిన తుది మెరుగులు దిద్దడం.

## 5.4 వార్తల ప్రచురణార్హత - ప్రాథమిక నిర్ణయం

పత్రికలకు అనేక మార్గాలనుంచి వార్తలు వస్తుంటాయి. యు.ఎన్.ఐ., పి.టి.ఐ., రాయిటర్, ఎ.పి. మొదలైన జాతీయ. అంతర్జాతీయ వార్త సంస్థలు టెలి ప్రింటర్ల ద్వారా దేశ విదేశాల వార్తలు పంపుతుంటాయి. ప్రతి పత్రికకు దాని స్తోమతను బట్టి. విస్తృతిని బట్టి సొంత సమాచార సేకరణ వ్యవస్థ ఉంటుంది. ఆ వ్యవస్థ ద్వారా విలేకరులు వార్తలు పంపుతుంటారు. దేశంలోని ప్రధాన నగరాలలో నియమితులైన సొంత ప్రతినిధులు, రాష్ట్రం నలుమూలలా ఉన్న ఫుల్‌టైమ్. పార్ట్‌టైమ్ విలేఖరులు. ప్రచురణ కేంద్రాలలో పెద్ద సంఖ్యలో ఉండే స్టాఫ్ రిపోర్టర్లు, స్పెషల్ కరస్పాండెంట్లు ప్రతిరోజు వార్తలు పంపుతారు. ఇక పత్రికా కార్యాలయాలకు తమంతట తాము వార్తలు పంపేవారుంటారు. రాజకీయ పార్టీల నాయకులు. ప్రజా ప్రతినిధులు. ఉద్యమ సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రభుత్వ శాఖల ప్రతినిధులు ఇటువంటి సమాచారాన్ని స్వయంగా అందజేస్తారు. ప్రజలకు తెలియజేయవలసిన, సమాచారాన్ని, వివిధ పరిణామాలపై తమ వైఖరులను, అభిప్రాయాలను ప్రకటిస్తూ పత్రికా కార్యాలయాలకు అందే ప్రకటనలు (Hand-outs) పుంఖాను పుంఖంగా ఉంటాయి. కొన్ని ప్రత్యేక రంగాలకు సంబంధించిన వర్గీకృత సమాచారాన్ని అందజేసే సిండికేటెడ్ వార్త సంస్థలుంటాయి. చందా దారులైన పత్రికలకు అవి రచనలు పంపుతుంటాయి. ఇవి కాక, పత్రికల సంపాదకీయ పేజీలలో, ఇతర ప్రత్యేక శీర్షికల పేజీలలో ప్రచురణ కోసం రచయితలు స్వయంగా పంపే రచనలు. సంపాదక వర్గం కోరి తెప్పించుకునే రచనలు వస్తుంటాయి.

ఇన్ని రకాల మార్గాలనుంచి అందే సమాచారాన్ని, రచనలను మొత్తంగా ప్రచురించాలంటే పత్రికలు తాము ఇప్పుడు ఇస్తున్న పేజీల సంఖ్యను కొన్ని వందల రెట్లు పెంచవలసి ఉంటుంది. స్థలా భావం ఒక్కటే సమస్య కాదు. వార్తల పేరిట వచ్చేవన్నీ వార్తలు కాకపోవచ్చు. వార్తల, రచనల ధోరణి పత్రికా రంగ ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవచ్చు. లేదా ఆ పత్రిక సొంత విధానానికి వ్యతిరేకం కావచ్చు. కాబట్టి, ఎడిటింగ్ చేసే జర్నలిస్టు హంస వలె పాలూ నీళ్లూ వేరు చేయక తప్పదు. తలూ, తప్పా ఏరివేయక తప్పదు.

స్థల పరిమితి వార్తల పరిమాణాన్ని నిర్ణయించవచ్చును. కానీ, వార్తల ప్రచురణార్హతను నిర్ణయించే ప్రధాన కాలమానం కాదు. ఒక సమాచారాన్ని తక్షణం ప్రజలకు తెలియ జేయవలసి ఉన్నదని భావించిన పక్షంలో, వ్యాపార ప్రకటనలు ఎంత స్థలాన్ని సరేనది కాదో ప్రధాన పరిణామం ఎక్కువగా నిండిపోయినా సరే పత్రికలో చోటు చేసుకోక తప్పదు. లేని పక్షంలో, వృత్తి ప్రమాణాల రీత్యా సంపాదకవర్గం, వ్యాపార రీత్యా పత్రిక యాజమాన్యం వైఫల్యం చవి చూడక తప్పదు.

BRAOU

కాబట్టి, కొన్ని వందల పేజీలకు సరిపడే సమాచారం అందుబాటులో ఉండగా, అందులోనుంచి పది పన్నెండు పేజీల మేర ఎంపిక చేయడం ఎడిటింగ్‌లో తొలిదశ మాత్రమే కాదు, కీలకమైన దశ, విశ్వసనీయత సామర్థ్యాన్నీ నిరూపించే దశ. ఏది వార్త, ఏదికాదు, పాఠకులకు ఏది తక్షణం అందజేయవలసిన సమాచారం, ఎలా అందజేయాలి వంటి ప్రశ్నలకు నిమిషాల మీద సమాధానం చెప్పుకుని జర్నలిస్టు నిర్ణయం తీసుకోవలసిన దశ.

**అభ్యాసం 1 : ఎడిటింగ్ అంటే ఏమిటి? వివరించండి?**

..............................................................................................................................................................

..............................................................................................................................................................

..............................................................................................................................................................

..............................................................................................................................................................

..............................................................................................................................................................

## 5.4.1 సాధారణ ప్రమాణాలు

సర్వసాధారణంగా వార్తల ప్రాధాన్యాన్ని నిర్ణయించే 'సాధారణ ప్రమాణాల' గురించి ఇక్కడ చెప్పుకుందాం.

ఫ్రాన్స్‌లో మళ్ళీ అణు పరీక్ష, చైనాలో మానవ హక్కుల ఉద్యమనాయకుడి అరెస్టు, ఆఫ్రికా ఖండంలో ఓ చిన్న దేశం మాజీ పాలకుడి హత్య, భారత దేశంలో విమాన ప్రమాదంలో వంద మంది మృతి, ప్రముఖ రాజకీయ పార్టీ నుంచి ప్రముఖ నాయకుడి బహిష్కరణ, విద్యుత్ ఘాతంవల్ల ఫలానా గ్రామంలో 10 పశువుల మృతి, హైదరాబాద్‌లో పిల్లల అపహరణ, ప్రభుత్వ రంగ పరిశ్రమల ఉద్యోగుల సమ్మె నోటీసు, అణు ఒప్పందంపై అమెరికా విధానాన్ని ఖండించిన మండల స్థాయి రాజకీయనేత, ఫలాన పార్టీలో ఫలానా నాయకుడు 10 వేల మందితో చేరిక ఇలా రకరకాల వార్తల రకరకాల స్థాయిల నుంచి న్యూస్ డెస్క్‌కు చేరుతుంటాయి. వీటిని వడబోయాలి. వడబోసేందుకు ఎడిటింగ్ చేసే జర్నలిస్టు కొన్ని కొలమానాలను ఉపయోగిస్తాడు.

### ఎ. వర్తమానవిషయమై ఉండడం (Timely News)

'అర నిమిషం గడిచేసరికి అదే నాకు గతి దశాబ్ది' అన్నాడు శ్రీశ్రీ. పత్రికారంగంలో 'తాజా సమాచారం' అన్న దానికి నిర్వచనమే కఠినమైనది. ఒక రోజు గడిచేసరికి వార్త పాతపడిపోతుంది. మారుమూల ప్రాంతాలకు చెందిన సమాచారం అయితేనో, లేక కారణంవల్ల మరుగున పడితేనో పాఠకులు క్షమిస్తారు తప్ప, చద్ది వార్తలను సహించరు.

### బి. సామీప్యం (Proximity)

ప్రతి పత్రికకు కొన్ని వర్గాల, కొన్ని ప్రాంతాల పాఠకులే మార్కెట్‌గా ఉంటారు. తెలుగు పత్రికలన్నిటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే మార్కెట్ ఉంది. ఇంగ్లీషు పత్రికలు దక్కన్ క్రానికల్, న్యూస్‌టైమ్ కూడా ఆంధ్ర రాష్ట్ర పత్రికలే. హిందూస్థాన్ టైమ్స్, పయొనీర్ వంటి ఆంగ్ల పత్రికలకు దక్షిణాదిలో సర్క్యులేషన్ లేదు. ఈ పరిమితులు కూడా వార్తల ప్రాధాన్యాన్ని నిర్ణయిస్తాయి. ప్రచురించే వార్త 'స్థానిక' ప్రజలకు, పాఠకులకు ఎంత మేరకు సంబంధించింది అని ఎడిటర్ పరిశీలించాలి. ఎక్కడో ఏదో తెలియని దేశంలో ప్రమాదం జరిగి వందలాది మంది మరణించిన దానికన్న, స్థానికంగ జరిగిన చిన్న ప్రమాద సమాచారం పాఠకులకు ఆసక్తిగానూ, అవసరంగానూ ఉంటుంది. 'సామీప్యం' అంటే కేవలం నైతిక దూరానికి సంబంధించింది మాత్రమే కానక్కర లేదు. లాస్ ఏంజిల్స్‌లో ఘర్షణలో జరిగినప్పుడు అక్కడి సమాచారాన్ని తెలుగు పత్రికలు వివరంగా ప్రచురించాయి. అమెరికాలో తెలుగు వారి సంఖ్య గణనీయంగా ఉండడం, అక్కడి వారి క్షేమ సమాచారాలు తెలుసుకునే పాఠకులు ఇక్కడ పెద్ద సంఖ్యంలో ఉండడం కూడా ఆ వార్తల ప్రాధాన్యాన్ని పెంచాయి. తెలుగు పత్రికలకు సంబంధించి తెలుగు వారి ప్రయోజనాలు ఉన్నంతమేరా అది సమీప స్థలమే.

BRAOU

### సి. ఘర్షణాంశం (Conflict)

యధాతథంగా ఆ వార్తలో పెద్ద పసలేకపోవచ్చు. కానీ, చినికి చినికి గాలివాన అయ్యే లక్ష్యం ఆ వార్తలో ఉండవచ్చు. మున్ముందు సంభవించే పెను పరిణామాలకు తేజం ఆ సమాచారంలో ఉండవచ్చు. హెచ్.డి. దేవెగౌడను యునైటెడ్ ఫ్రంట్ నాయకునిగా ఎన్నుకున్న సంగతి తనకు, ఇతర జనతాదళ్ నేతలకు తెలియకుండా జరిగినదని రామకృష్ణ హెగ్డే మొదట ఆరోపించినప్పుడు అది సాధారణ రాజకీయ వార్త. కానీ, పత్రికాలు దాన్ని ప్రముఖంగా ప్రచురించాయి. అదొక పెద్ద వివాదం కానున్నదని, మున్ముందు అనేక వార్తలు దీనికి పర్యవసానంగా వెలువడనున్నాయని సంపాదకులు గుర్తించినందునే దానికా ప్రాధాన్యం ఇచ్చారు. బోఫోర్స్ వంటి అనేక కుంభ కోణాలు మొదట చిన్న సూచనలుగా బయట పడ్డాయి. వాటి పర్యవసానాలు తీవ్రంగా ఉండగలవని భావించి పత్రికలు మొదటి నుంచే హెచ్చు ప్రాధాన్యం ఇచ్చాయి.

### డి. ప్రాముఖ్యం (Prominence)

రోజువారీ జరిగే సంఘటనలే అయిన ఆ సంఘటనలలోని వ్యక్తులు ప్రముఖులయితే వార్తలకు ప్రాముఖ్యం పెరుగుతుంది. ప్రమాదాల హత్యో, పెళ్ళో, దొంగతనమో కానక్కరలేదు. వారు కాలధర్మం చెందినా అది వార్త అవుతుంది కదా! కేంద్ర మాజీమంత్రి జి. వెంకటస్వామి మనుమడు వికాస్ అనే బాలుడు అపహరణకు గురై దశాబ్దం కావస్తోంది. పత్రికలు ఇప్పటికీ "వికాస్ జాడ ఇంక తెలియడం లేదు' అన్న శీర్షికతో అప్పుడప్పుడు రాస్తుంటాయి. మంత్రిగారి పర్సు ఎవరైన కొట్టేస్తే వార్త అవుతుంది, ముఖ్యమంత్రి సైకిల్ తొక్కినా, బస్సు ఎక్కినా వార్త అవుతుంది.

### ఇ. ప్రభావాలు, పర్యవసానాలు (Consequences, Impacts)

ఎక్కువ మంది ప్రజలకు ప్రభావితం చేసే విధాన ప్రకటనలు, నిర్ణయాలు ఈ కోవలోకి వస్తాయి. భారత అణు విధానంపై అమెరికన్ విదేశాంగ శాఖ ప్రతినిధి చేసిన తీవ్ర వ్యాఖ్యలు కావచ్చు. కాశ్మీర్‌పై ద్వైపాక్షిక చర్చలకు పాకిస్తాన్ అధ్యక్షులు చేసిన ప్రతిపాదన కావచ్చు. ఎరువుల సబ్సిడీని తగ్గించే విషయం యోచిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చేసిన సూచన కావచ్చు, ఏదైనా ప్రైవేట్ పారిశ్రామిక సంస్థ ప్రకటించే లే ఆఫ్ లేదా లాకౌట్ కావచ్చు. ఇవన్నీ తీవ్రమైన పర్యవసానాలు, ప్రభావాలు కలిగిన ప్రకటనలు. వీటి వల్ల ప్రభావితమయ్యే వ్యవస్థలు, వ్యక్తులు పెద్ద సంఖ్యలో ఉంటారు.

### ఎఫ్. మానవీయ (Human Interest) వార్తలు

వార్తల లక్షణాల గురించి చెప్పుకున్నప్పుడల్లా " కుక్క మనిషిని కరిస్తే వార్త కాదు, మనిషి కుక్కను కరిస్తే వార్త" అన్న సరదా నిర్వచనం ప్రస్తావనకు వస్తుంది. ఆ నిర్వచనంలో ఉన్న పరిశీలన ఏమిటంటే, వింతను వైచిత్రిని తెలుసుకోవాలని మనుషులు ఆసక్తి చూపుతారు. వింతలు, విచిత్రాలు అంటే రెండు తలల పాములో, నాలుగు కళ్ళ శిశువులో కానక్కరలేదు. కొడుకును హత్య చేసిన తండ్రి, ఐదు పైసల కోసం తగదా పడి హత్య చేసిన వ్యక్తి వంటి సంఘటనలు కూడా వింతంగా కనిపిస్తాయి. ఆశ్చర్యాన్ని కలిగించేవి మాత్రమే కాకుండా, ఆహ్లాదాన్ని, దయనీ, విచారాన్ని, ఒక్కోసారి ఆగ్రహాన్నీ కలిగించే వార్తలు కూడా ఉంటాయి. మానవులలో స్పందన కలిగించే ఉద్రేకాలను స్పృశించే సంఘటనలన్నీ మానవీయ కథనాలే.

పై కొలమానాల ఆధారంతో ఎడిటర్ వార్తలను జల్లెడ పడతాడు. వార్తల వడబోతలో పనికి వచ్చే మరో అంశం - వర్గీకరణ ఒక వర్గీకరణ ప్రకారం వార్తలు రెండు రకాలు - నిరాక్షిత వార్తలు (Anticipated News), ఆకస్మిక వార్తలు (Unpredictable) మరో వర్గీకరణ ప్రకారం - సూచనీయ (Predictable), అసూచనీయ (Unpredictable), సంభావిత (Anticipated) వార్తలని మూడు రకాలు. ఇంకో పద్ధతి అస్పష్ట (Unclear) అధ్రువ (Unconfirmed) ఆకర్షక (Attractive) వార్తలుగా వర్గీకరించడం.

మేగజైన్లలో సీరియల్ రచనలను మినహాయిస్తే, ఒక సంచికకు మరో సంచికకు పారంపరిక సంబంధం ఉండదు. వార్తా పత్రిక - అందునా దినపత్రిక అలాకాదు. ప్రతిరోజూ వెలువడే దిన పత్రిక అంతకు ముందు రోజు పత్రికకు కొనసాగింపుగా ఉంటుంది. అలాగని, వరుసగా దినపత్రిక చదవని వారు ఒకరోజు పత్రికను అర్థం చేసుకోలేరని కాదు. మానవుల రాజకీయ, సామాజిక, ఆర్థిక జీవితాల విశేషాలే వార్తలుగా వెలువడుతాయి కాబట్టి, జీవితంలో ఉండే క్రమమే, పారం పర్యమే వార్తలలో

BRAOU

కూడా ఉంటుంది. అందువల్లే కొన్ని రకాల పరిణామాలను పత్రికలు ముందుగానే ఊహించగలుగుతాయి. పత్రికలలోని సంపాదకులు ఆ పరిణామాలకు సిద్ధంగా ఉంటారు. ప్రమాదాలు, హత్యలు, హఠాత్ నిర్ణయాలు - వంటివి మొత్తం అకస్మాత్తుగా జరిగే సంఘటనలు. ఎడిటింగ్ నిర్వహించే వారు జరగబోయే పరిణామాలను ఊహించగలిగి వుండాలి. హఠాత్ పరిణామాలకు స్పందించగలిగి ఉండాలి.

### 5.4.2 ఇతర కొలమానాలు

ఏది వార్త, ఏది కాదు అన్న విచికిత్స పూర్తిగా పత్రికా రంగ ప్రమాణాలకు లోబడి ఉంటుంది. అయితే, కొన్ని బాహ్య పరిమితులు కూడా సంపాదకుడికి ఉంటాయి. అవి చట్ట పరమైన, విధానపరమైన, విలువల పరమైన పరిమితులు. రాజ్యాంగం హామీ ఇచ్చిన వాక్స్వాతంత్ర్యం కూడా కొన్ని షరతులలో కూడినదే. పత్రికా, కలముచేతిలో ఉన్నాయి కదా అని నిరాధారమైన ఆరోపణలు చేసి పరువు నష్టం కలిగిస్తే అది వ్యక్తి స్వేచ్ఛను, ప్రతిష్టను భంగపరుస్తుంది. సాక్ష్యాధారాలు లేని ఆరోపణలను పత్రికా విలేఖరి స్వయంగా చేయకూడదు. సంఘంలో ఏదో ఒక బాధ్యతలో ఉన్న వ్యక్తి చేసే ఆరోపణలను ప్రచురించేటప్పుడు పత్రిక మీద భారం తగ్గుతుంది. అటువంటి ఆరోపణల ప్రకటనలను ప్రచురించేటప్పుడు కూడా సభ్యతా సంస్కారాలను పరిశీలనలోనికి తీసికోవాలి. పత్రికా స్వాతంత్ర్యం బాధ్యతలలో కూడినది.

ప్రతి పత్రికకూ ఏదో రాజకీయ విధానం ఉంటున్నది. నిష్పాక్షికతే విధానం అని ప్రకటించుకునేవారు కూడా కొన్ని పద్ధతులూ, విధానాలూ అనుసరిస్తారు. ఎడిటింగ్ బాధ్యతలో నిర్వహించే వారికి పత్రిక పాలసీ కూడ ఒక పరిమితిగా ఉంటుంది. ప్రచురించబోయే వార్త సాధారణ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నదా లేదా చూసినట్టుగానే, ప్రత్యేక పరిమితులకు లోబడి ఉన్నదా లేదా అని కూడా సంపాదకుడు చూడాలి.

## 5.5 వార్తలను తీర్చి దిద్దడం

ప్రాథమిక పరీక్షలో ప్రచురణ యోగ్యతను పొందిన వార్తను ప్రచురణకు సిద్ధం చేయడం ఎడిటింగ్‌లో తొలిదశ. తొలిదశలో వార్తలోని విషయాన్ని మాత్రమే మదింపు చేస్తాం. అది రూపంలో, భాషలో, వర్గీకరణలో ముడి పదార్థం మాత్రమే.

(తెలుగు పత్రికల విషయంలో ముడి సమాచారం వార్త రూపం ధరించడానికి ఒక అదనపు దశ ఉంది. స్థానిక, గ్రామీణ వార్తలు మినహాయిస్తే జాతీయ, అంతర్జాతీయ వార్తలన్నీ ఇంగ్లీషులో అందుతాయి. తెలుగు ఉప సంపాదకులు వాటిని అనువదిస్తారు. అనువాదం కేవలం మక్కికి మక్కి అనువాదం కాదు. ఎడిటింగ్‌తో కూడిన అనువాదం.)

పి.టి.ఐ., యు.ఎన్.ఐ. వంటి వార్తా సంస్థల (న్యూస్ ఏజెన్సీల) నుంచి అందే వార్తలు , అనుభవజ్ఞులైన, సీనియర్ విలేఖరులు రాసే వార్తలు మినహాయిస్తే తక్కిన వార్తలన్నీ దాదాపుగా ముడిపదార్థాలే. వార్తా సేకరణలో ఉద్దండులైనా, సక్రమమైన శిక్షణ లేకపోవడంవల్ల గ్రామీణ విలేఖరులు ఉపసంపాదకులకు ఎంతో పనికల్పిస్తారు. పని విధానం రీత్యా, పరిధి రీత్యా విలేఖరులకు సంపాదకులకు దృక్కోణంలో తేడా ఉంటుంది. ఒక పరిమిత ప్రాంతంలో పని చేసే విలేఖరికి ఒక సంఘటన ముఖ్యమైనదిగా, పెద్దదిగా కనిపించవచ్చు. కానీ, అటువంటి అనేక ప్రాంతాల నుంచి వార్తలను స్వీకరించే 'న్యూస్ డెస్క్' కు ఆ సంఘటన అల్పమైనదిగా, చిన్నదిగా తోచవచ్చు. అటువంటి సందర్భాలలో ఆ వార్తను, దాని వాస్తవ ప్రాధాన్యం చెడిపోకుండా కుదించవలసి ఉంటుంది. కొన్ని సందర్భాలలో ఇందుకు పూర్తి భిన్నంగా కూడా జరగవచ్చు. తమ ప్రాంతంలో జరిగిన సంఘటనను సాదా సీదా ఘటనని భావించి ఆ మేరకే విలేఖరి రాసి పంపవచ్చు. 'డెస్క్'లో కూర్చున్న సంపాదక వర్గ సభ్యుడికి ఆ సంఘటన పర్యవసానాలు తీవ్రమైనవిగా అనిపించవచ్చు. అటువంటి సందర్భాలలో వార్తను దాని వాస్తవ ప్రాధాన్యానికి తగ్గట్టు పెంచి రాయవలసి ఉంటుంది, అవసరమైనవి అదనంగా సమాచారాన్ని చెప్పించవలసి ఉంటుంది.

BRAOU

యు.ఎన్.ఐ. పి.టి.ఐ వంటి ఏజెన్సీల నుంచి కూడా ఈ రకం సమస్యలు తలెత్తుతాయి. అవి జాతీయ వార్తా సంస్థలు కాబట్టి, వాటికి ఆంధ్రప్రదేశ్ వార్తలను ప్రత్యేకంగా ఇవ్వాలని ఉండదు. ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో కీలకమైన ఓ నిర్ణయాన్ని వారు ఓ పెద్ద వార్తలో ఎక్కడో అట్టడుగున ఇవ్వవచ్చు. తెలుగు పత్రికలోని ఉపసంపాదకుడు ఆ భాగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తిరగి రాయవలసి ఉంటుంది.

విలేఖరులు ఎంతో పని ఒత్తిడితో, పడావుడిలో వార్తలు పంపుతారు. సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా పత్రికకు పంపాలని వారి కుంటుంది. కానీ, వార్తకు సంబంధించిన ఉద్రేకాలను, ఆ వేశాలను వార్త రచనలో పలికించే వ్యవధి వారికి ఉండదు. సమాచారం అందించడంతోపాటు, దాన్ని సక్రమంగా అర్థం చేసుకోవడానికి పత్రికా రచయిత ప్రయత్నించాలి. కాబట్టి ఆ బాధ్యత ఎడిటింగ్ చేసే వారే తీసుకోవలసి ఉంటుంది. మానవీయ కథనాలకు మంచి ప్రారంభ వాక్యాలు రాయడం, వార్త స్వభావాన్ని బట్టి భిన్నశైలులను అనుసరించడం, అవసరమైన చోట అదనపు సమాచారాన్ని జోడించడం వార్తకు రక్తమాంసాలను చేకూరుస్తాయి.

ఇక వార్త నిర్మాణంలో ఎక్కడ, ఎప్పుడు, ఎలా, ఎవరు, ఎందుకు, ఏమిటి అన్న అంశాలు 'లీడ్'లో వచ్చాయా లేదా అని చూడడం ప్రధాన విషయాలేవీ కత్తిరింప పడకుండా వార్త గర్భంలోనే ఇమిడేటట్టు చూడడం, భాషా దోషాలను సవరించడం, వ్యక్తుల పేర్లు, పదవులు, సంవత్సరాలు మొదలైన సమాచారంలో తప్పులేనా ఉంటే దిద్దడం - ఇవన్నీ వార్తను తీర్చిదిద్దడంలోనే భాగాలు. సుదీర్ఘమైన వార్తను ఖండాలుగా విభజించడం కూడ ఎడిటింగ్ బాధ్యతే. సాధారణ విషయానికి ఏదైనా ప్రత్యేక అంశాన్ని అనుబంధ వార్తగా ఇవ్వడం, ప్రత్యేక సమాచారానికి సంబంధించి సాధారణ అంశాలను విడిగా ఇవ్వడం వంటి ఫీచరింగ్ లక్షణాలను వార్తా రచనలో కూడా పొదుపుగా వాడుకోవచ్చు. సీరియస్ ప్రసంగ పాఠంలో ఏదైనా హాస్యస్ఫోరకమైన భాగం ఉంటే దాన్ని ప్రధాన వార్త నుంచి వేరు చేయాలి. ఒక వార్తను వేర్వేరు స్పష్ట భాగాలుగా విభజించడం సాధ్యమైతే, అందువల్ల పాఠకుడికి సదుపాయంగా ఉంటుదనుకుంటే ఆ పని చేయాలి. రైల్వే బడ్జెట్ వార్తను ఉదాహరణగా తీసుకుంటే, గణాంకాల వివరాలతో ప్రధాన వార్త, ఛార్జీల పెంపునకు, కొత్త మార్గాల నిర్మాణానికి సంబంధించి విడివిడి వార్తలు, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కొత్త ప్రతిపాదనల గురించిన మరో వార్త - ఇలా అనేక వార్తలు ప్రతి ఏటా కనిపిస్తుంటాయి. ఆ రకమైన విభాగం పాఠకుల సదుపాయం కోసం స్థిరపడిందే.

ఎడిటింగ్ నిర్వహించే వారి ముందుకు వచ్చిన సమాచారం మాత్రమే మొదటి మజిలీకి మాత్రమే చేరింది. అది తిరిగి ప్రజల ముందుకు వెళ్ళాలంటే, సమాచారాన్ని సమర్థంగా అందజేసే కళను దానికి జోడించవలసి ఉంటుంది. ఈ రెండో దశలో ఎడిటర్ చేసే పని అదే.

BRAOU

## 5.6 ప్రాధాన్యాల నిర్ణయం

నిజానికి ప్రాధాన్యాల నిర్ణయం మొదటి రెండు దశల్లోనే ఏక కాలంలో జరుగుతుంది. వార్త ప్రచురణ యోగ్యతను నిర్ణయించినప్పుడే, వార్త ప్రాధాన్యం సంపాదకుడికి అర్థమవుతుంది. వార్త ప్రాధాన్యాన్ని బట్టే ప్రచురణకు అనువుగా తీర్చిదిద్దడం జరుగుతుంది. అయితే, వార్తను పత్రికలో ఎక్కడ ఏ రకంగా ప్రచురించాలి. అన్న నిర్ణయం ముద్రణకు వెళ్ళే వరకు మారుతునే ఉంటుంది. మధ్యాహ్నం 12 గంటలకు నిర్ణయించిన వార్త స్థానం అర్థరాత్రి 12 గంటలకు మారుతుంది. ఒక్కోసారి నిముషాలలోనే వార్తల స్థానాలు తారుమారవుతాయి. కొత్తగా సంభవించే ప్రతి పెద్ద పరిణామము మరో వార్తను లోపలి పేజీలోకి తోసివేస్తుంది. దిన పత్రికలో మొదటి పేజీ అంటే, అంతకు ముందు రోజు జరిగిన కీలక పరిణామాల్లో ముఖ్యమైనవన్నీ ప్రదర్శించే వార్తా దర్పణం. ఏది ముఖ్యమైనది, ఏది కాదు అన్న వివక్ష పత్రికకూ పత్రికకూ, ఎడిటర్‌కూ ఎడిటర్‌కూ మారవచ్చు. ప్రాపంచిక పరిణామాలపై, సామాజిక సమస్యలపై వారికున్న దృక్పథంపై ప్రాధాన్యాలు ఆధారపడతాయి. ముఖ్యమైన వార్తలన్నిటినీ అన్ని పత్రికలూ ఏదో ఒక స్థానంలో, ప్రాధాన్యంలో ప్రచురిస్తాయి. 1996 వరల్డ్ కప్ క్రికెట్ పోటీల్లో కలకత్తా ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన సెమీఫైనల్స్ సందర్భంగా ప్రేక్షకులు చేసిన అల్లరి గురించి 'పయొనీర్' ఆంగ్ల దినపత్రిక మొదటి పేజీ అంతా ప్రచురించింది. కొన్ని తెలుగు పత్రికలైతే ఆ ఘటనను స్పోర్ట్స్ పేజీకే పరిమితం చేశాయి. మానవ హక్కుల గురించి పట్టింపు ఉన్న పత్రికలు లాకప్

మరణాలను, భద్రతా దళాలు పోలీసుల అత్యాచారాలను ప్రముఖంగా ప్రచురిస్తాయి. ఏవైన పత్రికలు మిగిలిన వార్తలతో పోటీ పడి ప్రచురిస్తాయి.

-దేశ రాజకీయాలనుగానీ, ప్రజా జీవనాన్నిగానీ, అమితంగా ప్రభావితం చేసే అంశాలు, ఎక్కువ జనసష్టం కలిగిన దుర్ఘటనలు, మానవీయ కథనాలలో అమితా నక్తిని కలిగించేవి సాధారణలో మొదటి పేజీల్లో కనిపించే వార్తలు. మొదటి పేజీలో కూడా మొదటి సగానికీ, రెండో సగానికీ ప్రాధాన్యాలలో తేడా ఉంది. లోపలి పేజీల్లో కుడివైపు పేజీలకు, ఎడమ వైపు పేజీలకు తేడా ఉంది. రంగాల వారీగా పేజీల కేటాయింపు జరుగుతున్న నేటి రోజుల్లో ప్రతి పేజీకీ ఓ పతాక శీర్షిక వార్త ఉంటున్నది. ఏ పేజీలో ఏ స్థానంలో ప్రచురణ జరుగుతున్నదని ఒక కాలమానంకాగా, ఎంత స్థలంలో వార్త ప్రచురితం మవుతున్నదన్నది ప్రాధాన్యానికి మరో నిదర్శనంగా ఉంటున్నది. ఎనిమిది 'కాలా'ల్లో (8 Colums) ప్రచురితమయ్యే తెలుగు దిన పత్రికల్లో మొదటి పేజీ పతాక శీర్షిక వార్త ఎనిమిది 'కాలా'ల్లో ఉంటే ఆ వార్త చాలా ముఖ్యమైన వార్త అని అర్థం. లోపలి పేజీల్లో ఆరు కాలాల వార్త కంటె మొదటి పేజీల్లో సింగిల్ కాలమ్ వార్త మిన్న. ఎడిటింగ్‌లో ఈ ప్రాధాన్యాల నిర్ణయం కీలకమైనది. ప్రతి వార్తకూ ఓ చోటు కేటాయించడం ద్వారా పత్రిక ఆ వార్త ప్రాధాన్యాన్ని చెబుతున్నది. పాఠకుడు కూడా ఆ ప్రాధాన్యాన్ని అదే రకంగా అర్థం చేసుకున్నప్పుడే ఎడిటర్ సఫలమైనట్టు లెక్క. అనుచితమైన ప్రాధాన్యం ఇచ్చినా, ప్రాధాన్యం తగ్గించినా పాఠకుడు గుర్తిస్తాడు. సంపాదకుడి త్రాసు ఎప్పుడూ ఖచ్చితమైన తూకాన్నే చూపాలి.

## 5.7 తుది మెరుగులు

వార్త స్థానాన్ని నిర్ణయించిన తరువాత పేజీలలో ఆ స్థానంలో వార్తను అమర్చాలి. అలా అమర్చేటప్పుడు ఎడిటర్ విచక్షణకు లోబడి అవసరమనుకున్న మేరకు అనుబంధ సామాగ్రి జత చేయాలి. 'వార్త'కు సంబంధించిన తాజా ఫొటోలు కానీ, ఫైల్ ఫోటోలు కానీ, అర్థవంతం అనుకుంటే వ్యంగ్య చిత్రాలు కానీ, కారికేచర్లు గానీ జోడిస్తే 'వార్త'ను ప్రజలకు చేరవేయడంలో మరి కొన్ని మంచి సాధనాలను వాడుకున్నట్టవుతుంది. వార్తకు తగ్గ శీర్షికను రాయడం కూడా అదనపు విలువ జోడింపే. ఆఖరి నిముషం మార్పులకు లోబడి వార్తలో మార్పులు చేయవలసి వస్తే, సాధ్యమైనంత తక్కువ సమాచారాన్ని కుదించి రాయడం, తిరగరాయడం వంటివన్నీ తుది మెరుగులు కిందికి వస్తాయి.

BRAOU

## 5.8 ఎడిటింగ్ సాధనాలు

ఎడిటింగ్‌లో సమర్థంగా వ్యవహరించాలంటే ఏమేం పరికరాలు కావాలి? కావలసినవన్నీ బౌద్ధిక పరికరాలే. అవి

- ★ సమకాలిక రాజకీయ సామాజిక పరిణామాలన్నిటి గురించి అవగాహణ
- ★ ముఖ్యమైన సమస్యలు, వివాదాలన్నిటి గురించి అన్ని పక్షాల అభిప్రాయాలతో, వాదాలతో పరిచయం.
- ★ అన్ని ప్రముఖ పత్రికల సొంత విధానాలు (Policies) ప్రాధాన్యాలు
- ★ పత్రిక రంగం వృత్తిపై గౌరవం. బాధ్యతాయుతమైన ప్రవృత్తి.
- ★ సంచలనాత్మకతకు లోనుకాకుండా, స్థితి ప్రజ్ఞతలో అంచనాలు వేయగలగడం, అదే సమయంలో స్పందించే కోల్పోకుండా ఉండడం.
- ★ తక్కువ సమయంలో త్వరగా నిర్ణయాలు తీసుకొనే ధైర్యం ఉండాలి. ఊగిసలాట ఎడిటర్‌కు పనికి రాదు.
- ★ సమాచారాన్ని సమర్థంగా వ్యక్తం చేసే సాధనంగా భాషపై పట్టు.

## 5.9 తెలుగు పత్రికారంగం - ఎడిటింగ్ సమస్యలు

తెలుగు పత్రికా రంగానికే కాదు, ప్రాంతీయ భాషల పత్రికలన్నిటికీ కొన్ని సమస్యలున్నాయి. ఆ సమస్యలన్నిటికీ మూలకారణం అవి ప్రాంతీయ భాషలు కావడమే.

ప్రాంతీయ భాషలు కావడంవల్ల వాటి మార్కెట్ చిన్నది. పాఠకుల సంఖ్య చిన్నది. వాటి వ్యాపారం తక్కువ. సమాచార సేకరణ వ్యవస్థపై వారు వెచ్చించగలిగిన ధనం తక్కువ అందువల్ల జాతీయ, అంతర్జాతీయ వార్తలకు ఏజెన్సీల దగ్గరే ఒక దఫా ఎడిటింగ్ జరిగిపోతుంది. మరో సమస్య ఏజెన్సీ వార్తలు ఇంగ్లీషులో రావడం. ఫలితంగా తెలుగు సంపాదక విభాగం ప్రధాన విధుల్లో అనువాదం ముఖ్యమైనదిగా మారిపోయింది. ఏజెన్సీలు ఇచ్చే వార్తలు అప్పటికే ఒక దఫా సంపాదకుల చేతిలో సరిదిద్దినవి కావడం మూలాన అనువాదం చేయడమే తెలుగు ఎడిటోరియల్ పనిగా మారిపోయింది. కొన్ని వివరాలను మినహాయించడం తప్పించి, తక్కిన మూలాన్ని యథాతథంగా దించడం వల్ల ఎడిటింగ్ అభ్యాసం తెలుగు వారికి కొరవడింది. ఎడిటింగ్ అంతా ముఫసిల్ (గ్రామీణ) వార్తలను చూసే సంపాదకులకు పరిమితమైంది.

ముఫసిల్ వార్తలు రాసే విలేఖరులు ఉన్నత విద్యావంతులు కాకపోవడానికి వేరే కారణాలున్నాయి. ఈ రంగంలో లభించే పారితోషికాలు స్వల్పం కావడం ఒక ముఖ్య కారణం. యఫ్.సిల్.వార్తల ఎడిటింగ్ ప్రధానంగా కుదించి రాయడం, భాషాదోషాలు సవరించడంగా మారిపోయింది. జిల్లాల వారీగా మినీసంచికలు వెలువరించడం ప్రారంభమయ్యాక స్థానిక వార్తలకు ఎక్కువ స్థలం లభించింది. వార్తా రచనలో కొత్త పద్ధతుల అన్వేషణ జరగక, పాత వార్తలే ఇంకా రాజ్య మేలుతున్నాయి. ఎక్కువ స్థలం లభ్యం కావడంతో, ఎడిటర్లకు ఎంపికకు అవకాశం దొరకడం లేదు. రాసినదంతా, రాసినవన్నీ ప్రచురితమయ్యే స్థితి ఉన్నది. ఫలితంగా వార్తల రాశి పెరిగినా వాసి పెరగడం లేదు. మార్కెటింగ్ అవసరాల రీత్యా జరిగిన విస్తరణ, సాంకేతిక అభివృద్ధి ఎడిటింగ్ ప్రమాణాలలో ప్రతిఫలించడం లేదు. వార్తలనిడివిని బట్టి పారితోషికాలు ఇవ్వడంవల్ల సాగదీసి రాయడం ఒకరి అవసరంగానూ, దానికి కత్తెరవేయడం మరొకరి అవసరంగానూ ఉంది. ఫలితంగా అవసరమైనంత రాయడం అన్నది విలువగా కనిపించడం లేదు. ప్రాధాన్యాల నిర్ధారణ, ప్రాధాన్యాల అవసరాలకు అనుగుణమైన ఎడిటంగ్ అన్నవి తెలుగు పత్రికలలో అనువాదం అక్షరదోషాల సవరణ మాత్రమే ముందు నిలబడ్డాయి.

**అభ్యాసం 2 : ఎడిటింగ్ సాధనాలను పేర్కొనండి.**

....................................................................................................................................................

....................................................................................................................................................

....................................................................................................................................................

....................................................................................................................................................

....................................................................................................................................................

BRAOU

## 5.10 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

ఎడిటింగ్ అంటే "చేరవలసిన వారికి చేరవలసిన విధంగా సమాచారాన్ని అందజేయగలగడం. అది ఒక కళ.

ఆ కళకు సంబంధించిన సకల నైపుణ్యాల సమాహారం ఎడిటింగ్. పత్రికలో వున్న ప్రతీదీ పాఠకునికి సులువుగా అర్థమయ్యేలా చూడడమే ఎడిటింగ్ లక్ష్యం. పత్రికలోని అన్ని అంశాలు సులువుగా చదవగలిగి వుండాలి.

సరళమైన, స్పష్టమైన భాష వాడడం ద్వారా, పత్రికలో ఆదంతం ఒకే విధానం, ఏకత్వం ధ్వనించేట్టు చేయడం ద్వారా ఆకర్షణీయమైన రచనా శైలి ద్వారా ఆ లక్ష్యం సాధించవచ్చు.

పత్రికలకు అందిన వార్తలన్నింటినీ ప్రచురించడం సాధ్యం కాదు. వార్తలను కొన్ని ప్రమాణాలను అనుసరించి ప్రచురణకు ఎంపిక చేయాలి. ఎంపిక చేసిన వార్తలను తీర్చిదిద్ది వాటి ప్రాధాన్యాలను అనుసరించి ప్రచురించాలి. తెలుగు పత్రికా రంగంలో ఎడిటింగ్ అనేది కేవలం అనువాదం అక్షర దోషాల సవరణకు మాత్రమే పరిమితమైంది.

## 5.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I **కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.**

1. ఎడిటింగ్ అంటే ఏమిటి?

2) తెలుగు పత్రికా రంగం - ఎడిటింగ్ సమస్యల గురించి వివరించండి?

II **కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.**

1) వార్తల ప్రాధాన్య నిర్ణయం అంటే ఏమిటి?

2) ఎడిటింగ్ సాధనాల గురించి తెలపండి?

**- కె. శ్రీనివాస్**

BRAOU

# భాగం - 6: కార్టూన్లు, ఫోటోలు, ఫోటోఫీచర్లు

## విషయక్రమం


6.0 ఉద్దేశం

6.1 ప్రవేశిక

6.2 కార్టూన్లు అర్థం నిర్వచనం

6.2.1 ప్రయోజనం

6.2.2 చరిత్ర

6.2.3 వర్గీకరణం

6.2.4 ప్రాధాన్యత

6.3 ఫోటోలు-ఫోటోఫీచర్లు

6.4 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 6.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- కార్టూన్లు అంటే ఏమిటి?
- కార్టూన్ల ప్రయోజనం, ప్రాధాన్యతలు
- ఫోటోలు, ఫోటోఫీచర్ల ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.

BRAOU

## 6.1 ప్రవేశిక

పత్రికా రచన అంటే కేవలం వాక్య నిర్మాణం, వార్తాంశ రచన మాత్రమే కాదు. వాక్యాలు. వ్యాఖ్యలూ లేని దృశ్యమాంకము వ్యంగ్య చిత్రాలు కూడా.

కార్టూన్ల ద్వారా హాస్యం, వినోదం, విమర్శ, వ్యంగ్య రచన, అవహేళన ఏదైనా సూటిగా చెప్పవచ్చు. అలాగే ఫోటోలు ద్వారా వార్తకు అధికారాన్ని, బలాన్ని సమకూర్చవచ్చు. వార్తా పత్రికలో కార్టూన్లు, ఫోటోలు. ఫోటోఫీచర్ల ప్రాముఖ్యత అవశ్యకలు ఏమిటో ఇక్కడి జరిగింది.

## 6.2 కార్టూన్లు అర్థం నిర్వచనం

కార్టూన్ అంటే వ్యంగ్య చిత్రం. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో - 'సమకాలీన సంఘటనల్ని వినోదకరమైన రీతిలో చిత్రించే చిత్రం అని ఈ పదానికి అర్థం కనిపిస్తుంది.

కార్టూన్ అనే పదం ఇటలీలో పునరుజ్జీవన కాలంలో చిత్రకారులు వాడారు. గోడ మీద బొమ్మలకూ (Murals) బొమ్మల తెరలకూ (Tapestry) కిటికీ అద్దాల వంటి రంగుల అద్దకపు పనితనాలకూ మొట్టమొదటగా ఆనాడు కార్టూను అనే పదమే వ్యవహారంలో వుండేది.

వార్తలకూ, సంపాదకీయాలకూ వ్యాఖ్యలుగా చిత్రాలు గీసి పత్రికలు వినోదాన్ని అందించడానికి పూనుకోవడంతో కార్టూన్లు అన్న పదం ఆ తరహా చిత్రాలకు స్థిరమయింది.

### 6.2.1 ప్రయోజనం

కార్టూన్ వినోద ప్రధానమైనదే అయినా హాస్యం, వ్యంగ్యం, విమర్శ, అవహేళన వంటిది ఏదయినా సరే క్లుప్తంగా, సూటిగా మనసుకు నాటుకునేలా వుంటుంది. అంతర్లీనంగా ఒక విషాద వాస్తవాన్ని అందించేవీ వుంటాయి.

అల్పాక్షరాల అనల్పార్థ రచన, తక్కువ గీతల్లో విస్తృత భావం అందించగలిగేది కార్టూన్.

కార్టూన్ వేసేవారికి చూసేవారికీ కూడా కొంత పదును, ఆలోచించగల శక్తి, ఒక సరికొత్త దృష్టి కోణం వుండాలి. కార్టూన్- ఒక కథో, ఒక వ్యాసమో, మరొక సాహిత్య ప్రక్రియో చెయ్యలేని పనిని కొద్ది గీతల్లో, కొన్ని మాటల్లో ప్రభావోపేతంగా చేయగలుగుతుంది. ఒక సంఘటననో, ఒక వార్తనో, ఒక వాస్తవాన్నో దాని వెనుక దాగిన 'అసలు నిజం'తో వెలికి తీసి - వ్యక్తిలో, సామాజంలో వున్న బలహీనతలనీ, దోషాలనీ, అవకతవకలనీ, అన్యాయాల్నీ సూటిగా చురుక్కుమనిపించేలా, ఆలోచించేలా, తద్వారా మార్పుకు, సంస్కరణకు అవసరమయిన భావాలను ఉద్దీపన చేసేదిగా తోడ్పడుతుంది.

"సమర్థులైన కార్టూనిస్టులు ప్రజలలో ఆలోచనాశక్తిని పెంచటంలో గాని, మానసిక చైతన్యాన్ని చురుకు పరచటంలోగాని, సమాజిక చైతన్యాన్ని చురుకు పరచటంలో గాని, సామాజిక చైతన్యాన్ని ముందుకు తీసుకుపోవటంలో గాని. ఏ రచయితకూ ఏ ఉపన్యాసకుడికీ తీసిపోనవసరం లేదు. ఒక గంట పూకదంపుడు ఉపన్యాసం చేయలేని పనిని ఒక కార్టూను చేయవచ్చు.. ఆ మాటకు వస్తే కవిత్వం కన్న కూడా సూక్ష్మమైనది కార్టూను" అన్నారు గంటి కుటుంబరావు. అందువల్ల కవి కన్నా, రచయిత కన్నా తన ప్రయోజనం సాధించడంలో కార్టూనిస్టుకు అవకాశం ఎక్కువ. అక్షరాస్యుడు కాని వాడయినా ఒక పత్రికను చూసినప్పుడు కార్టూను అర్థం అవుతుంది. కేవలం రేఖలతోనే, కొద్ది అక్షరాల అవసరం కూడా లేకుండానే కార్టూన్ సంతరించగల అవకాశం వుండడమే దీనికి కారణం.

చూసిన వెంటనే విషయాన్ని వ్యంగ్య, విమర్శ, వివరం, విజ్ఞానం మొదలయిన వాటిన్నింటితో బాటుగా తక్కువ వ్యవధిలోనే సమగ్ర అవగాహనతో అందించగలుగుతుంది కార్టూను.

B R A O U

### 6.2.2 చరిత్ర

పత్రికల్లో కార్టూనింగ్ పాశ్చాత్యుల నుండే మొదలయింది. తొలి రాజకీయ వ్యంగ్య చిత్రం 1754లో అమెరికన్ చిత్రకారుడు హెన్రీ డాకిన్స్ బెంజిమిన్ ఫ్రాంక్లిన్ విధానాలను విమర్శిస్తూ వేసింది. అమెరికాలో కార్టూన్ కళ ఈనాడు విస్తృతస్థాయిలో వుంది. కార్టూన్లు, బొమ్మల కథలు మాత్రమే ప్రచురించే పత్రికలు అక్కడ అనేకం. ఛార్లెస్ షుల్ట్జ్, హంక్ కెచమ్ వంటి అమెరికన్ కార్టూనిస్టులు కోటీశ్వరులుగా వెలుగొందారు.

19వ శతాబ్దంలోనూ, 20వ శతాబ్దపు తొలి రోజుల్లోనూ పాశ్చాత్య పత్రికలు కార్టూన్లకు ప్రాతినిధ్యం విశేషంగా ఇవ్వడం జరిగింది. పారిస్‌లో సారివేరిన్ (Charivarin) లండన్‌లో పంచ్ (Punch) అమెరికా సంయుక్త రాష్ట్రాలలో లైఫ్, జడ్జ్ (Life, Judge) పత్రికలు కార్టూన్లకు ప్రాముఖ్యం ఇచ్చాయి. బ్రిటిష్ పత్రిక 'పంచ్' రాజకీయ కార్టూన్లు పరితలకు స్ఫూర్తిదాయకమయ్యేవి.

మనదేశంలో కార్టూనిస్టులుగా ఆర్.కె. లక్ష్మణ్ (టైమ్స్ ఆఫ్ ఇండియా) అబూ అబ్రహాం (ఇండియన్ ఎక్స్‌ప్రెస్) మేరియొ (ఇలస్ట్రేటెడ్ వీక్లీ) ఓ.వి. విజయన్ (పేట్రియాట్, హిందూ) సుధీర్‌ధార్ (స్టేట్స్‌మన్, హిందుస్థాన్ టైమ్స్) వంటి వారు ఆంగ్ల పత్రికల ద్వారా సుప్రసిద్ధులు. అలాగే ప్రత్యేకంగా కార్టూన్లు, హాస్య, వ్యంగ్య రచనలతో దేశంలో ఎమర్జెన్సీ ముందు 1948 నుండి 1975 వరకు 'శంకర్స్ వీక్లీ' పత్రిక నడిపిన కీ॥శే॥ శంకర్‌పిళ్లై నాలుగు దశాబ్దాలకు పైగా కార్టూన్ రంగంలో కృషి చేసి ఎందరో కార్టూనిస్టులకు అవకాశాలు కల్పించినాడు.

పత్రికాముఖంగా తెలుగులో తొలి కార్టూనిస్టు తలిశెట్టి రామారావు. 'అగ్స్‌బర్గ్' డ్రాయింగు పుస్తకాలతో ప్రేరితుడై కార్టూన్ చిత్రాలను మొదలెట్టాడు. ఆంధ్రపత్రిక, భారతిల్లో 1930 ప్రాంతాల నుంచీ విరివిగా కార్టూన్లు వేశాడు. ప్రబంధాలలో

స్త్రీ సౌందర్యాన్ని ఉపమిస్తూవాడే వస్తు సంచయాన్నే యథాతథంగా చిత్రిస్తూ 'ప్రబంధసుందరి' వంటి కార్టూన్లు తలిశెట్టి సుస్మిత హాస్యానికి, వ్యంగ్యానికీ ఉదాహరణలు. తలిశెట్టి రామారావు వలెనే విశ్వాత్ముల నరసింహమూర్తి, ఆ తరువాత 1953 ప్రాంతాలలో విశాలాంధ్ర దినపత్రికలో రాజకీయ వ్యంగ్య చిత్రాలు గీసి రాంభట్ల కృష్ణమూర్తి, దానికి పోటీగా ఆంధ్రప్రభలో 'వాసు' పత్రికాపాఠకుల్ని ఆనాడు ఆకట్టుకున్న కార్టూనిస్టులు. బాపు (సత్తిరాజు లక్ష్మీ నారాయణ) ప్రవేశంతో తెలుగు పత్రికల్లో కార్టూన్లు, చిత్రలేఖనం పట్ల అభిరుచి, ఆదరణ విశేషంగా పెరిగాయి. 'బాపు బొమ్మ' అందానికి పర్యాపదమైంది. బాపు రైటింగ్ అనేది తెలుగు లిపికి కొత్త సొబగులిచ్చింది. ఆయన కార్టూన్లతో ప్రేరితులై ఎందరో యువకులు ఏకలవ్య శిష్యులుగా ఎదిగారు. నాటికీ నేటికీ బాపు తనదైన స్థానాన్నీ, స్థాయినీ ఈ రంగంలో నిలుపుకునే వున్నారు.

### 6.2.3 వర్గీకరణం

కార్టూనులను ప్రాథమికంగా

1. వ్యాఖ్య సహితం (Cartoons with Caption)
2. వ్యాఖ్య రహితం (Caption less or Silent Cartoons) అని పేర్కొనవచ్చు.

కేవలం బొమ్మ ద్వారానే అభివ్యక్తం చేయదలచిన అంశాన్ని రేఖల ద్వారా అందించగలిగే కార్టూన్లే ఉత్తమమైనవి అని కొందరు పేర్కొంటారు. ప్రాంతీయతకు భాషాభేదాలకు అతీతంగా ఇలాంటి కార్టూన్లు చూపరులందరికీ అర్థమై, నిరక్షరాస్యులను సైతం అలరించేవి కాగలుగుతాయి. అంటే ఈ కార్టూన్లకు భౌగోళిక, భాషాది హద్దులు, ఎల్లలు లేవన్నమాట. ఏ దేశంలోనైనా ఎక్కడయినా అర్థం కాగలిగేవి కాగలుగుతాయి. అయితే వీటిల్లోనూ రేఖల ద్వారానే ఆ కార్టూను దేశకాల పరిస్థితుల నేపథ్యం ద్యోతకం కాగలుగుతుంది కూడాను. అలాకాక ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడయినా, ఎవరికయినా అర్థం కాగలిగితే అది మంచి వ్యాఖ్యరహిత కార్టూన్ కాగలుగుతుంది. నిజానికి ఒక కార్టూనిస్టు ప్రతిభా ప్రావీణ్యాలు ఎక్కువగా తెలిసేది ఇందులోనే.

క్యారికేచర్లు వ్యాఖ్య రహితంగానే వుంటాయి. బొమ్మ చూడగానే ఆ బొమ్మ ఏ వ్యక్తికి ప్రతీకో తెలిసిపోతుంది. ప్రతి వ్యక్తిలోనూ బాహ్యపరమైన రూపులోనే కొట్టవచ్చినట్లు కనబడే ఒక ప్రత్యేకత వుంటుంది. కార్టూనిస్టు కార్యరికేచర్లో దాన్ని పట్టుకుంటాడు. దానికి కాస్త అతిశయోక్తి మిళాయిస్తాడు. ఆ ముక్కునో, మూతినో చూడగానే నవ్వు పుట్టించేలా మలుస్తాడు. జుట్టు తీరునో, మీసకట్టునో విశేషంగా చిత్రిస్తాడు. లేదా తలగోక్కునే అలవాటునో, కళ్లు చిట్లించే తీరునో బొమ్మలో చూపిస్తాడు. ఒక్కొక్క వ్యక్తినీ ఇలాంటి ఒక్కొక్క ప్రత్యేకత వల్ల గుర్తుపట్టేలా కార్టూనిస్టు తన రేఖల్లో మూర్తి కట్టిస్తాడు.

దిన పత్రికల్లో ప్రధానంగా పాకెట్ కార్టూన్లు, రాజకీయ కార్టూన్లు, స్ట్రిప్ కార్టూన్లు చోటు చేసుకుంటాయి. దిన పత్రిక మొదటి పేజీలో పొలిటికల్ (రాజకీయ) కార్టూను పాకెట్ కార్టూను చోటుచేసుకోగా లోపలి పేజీల్లోనో ఎడిటోరియల్ పేజీలోనో స్ట్రిప్ కార్టూను చోటు చేసుకుంటూ వుంటుంది.

టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఆర్.కె. లక్ష్మణ్ పాకెట్ కార్టూన్లు 'You said it. ఆంధ్రపత్రికలో 'మనవాళ్లు' పేరిట బాపు 1962 ప్రాంతాల్లో పాకెట్ కార్టూన్లు వేశారు. ఈ పాకెట్ కార్టూన్లు, వివిధ దినపత్రికల్లో 'ఇదీ సంగతి' అనో, లోకంపోకడ' అనో 'విచిత్రవార్త' అనో ఇలా ఏదో పేరుతో వెలువడుతూంటాయి. కార్టూను బొమ్మ క్రింద మూడు నాలుగు పంక్తులకు మించని వ్యాఖ్యో, వాఖ్యానమో వుండి వివిధ విషయాలను పాఠకులకు హాస్య వ్యంగ్యాలతో అందిస్తూంటాయి. ప్రధానంగా సమకాలీన అంశాలను.

దినపత్రికల మొదటి పుటలోనే కొంచెం పెద్ద సైజులో రాజకీయ కార్టూన్లు వస్తూంటాయి. వీటిని వేసే కార్టూనిస్టులు అత్యంత మెలకువతో, అప్రమత్తతతో ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలను నిశితంగా హేతుబద్ధంగా, ఆలోచిస్తూ వ్యంగ్యగా, హేళనగా నిజాలను నిర్భీతిగా వెల్లడించే చురకలుగా వాటిన సంతరిస్తూంటారు. విమర్శకు, సంస్కరణకు కూడా అవి ప్రాతిపదికలు. మన తెలుగు దినపత్రికల్లో రాంభట్ల, గోఖలే, టీవీ, ప్రభంజన్, పాప, మోహన్, శ్రీధర్, సురేంద్ర, శేఖర్, శ్యాంమోహన్, నిర్సిం, రాజు వంటివారు పాఠకుల్ని ఆకర్షించే ఇటువంటి రాజకీయ కార్టూన్ల సృష్టికర్తలు.

ఇక స్ట్రిప్ కార్టూన్లు అంటే ప్రత్యేకమైన ఒకటి రెండు పాత్రల సృష్టితో నిరంతరంగా సాగేవి. మొట్టమొదట స్ట్రిప్ కార్టూను 19వ శతాబ్దపు తొలిదినాల్లో వచ్చింది. బస్టర్ బ్రౌన్ (Buster Brown) అనే పాత్రను సృష్టించి రిచర్డ్ ఔట్‌కల్ట్ (Richard ourcault)

BRAOU

1902లో తన కామిక్‌స్ట్రిప్‌ను ప్రచురించాడు. అలాగే తొలి కార్టూన్ స్ట్రిప్పుల్లో మరొకటి Bringing up father ఇది 1912లో వచ్చింది. అమెరికా నుండి ప్రాచుర్యం చెంది 27 భాషల్లోకి అనువాదమై 71 దేశాలకు విస్తరించింది. హొగర్త్ (Hugarth) గోయా (Goya) డామియర్ (Daumier) రౌలండ్సన్ (Rowlandson) అనే ప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారులు ఒక కథపాత్రను సృష్టించి ఆ పాత్రల సహసకృత్యాలతో తొలి కార్టూన్ బొమ్మల కథలు వేశారు.

తెలుగులో గురజాడ అప్పారావు కన్యాశుల్కంలోని 'గిరీశం' పాత్రను తీసుకుని స్ట్రిప్ కార్టూన్స్ వేశారు బాపు. పొడుగ్గా, బక్కపలచగా వుండి, కండువా వేసుకుని సిగార్స్ కాలుస్తూ ఉండే రూపంలో గురజాడ వారి గిరీశాన్ని తీర్చిదిద్ది ఆ పాత్ర ద్వారా అనేక సాంఘిక రాజకీయాంశాలను కార్టూన్లుగా గీశారు బాపు. ఇలా సుప్రసిద్ధమైన పాత్రను వినియోగించుకున్నది ఆయనేనేమో. ఆంగ్లంలో డెన్నిస్ దిమేనేస్ సుప్రసిద్ధమైన కార్టూనిస్టు సృష్టించిన బాల పాత్ర. ఆ ప్రేరణతోనే వచ్చినా బాపుగారి 'బుడుగు' పిల్లల ఆగడాన్ని, ఆకతాయి పనుల్నే కాక అనేక ఇతర అంశాలను కూడా కార్టూన్లుగా అందించడం కనిపిస్తుంది. బుజ్జాయి 'డుంబు', సత్యమూర్తి 'బంబూ' వంటి బాలపాత్రల సృష్టించారు. మల్లిక్ వంటి మరికొందరు కార్టూనిస్టుల బాలపాత్రలు కూడా అలరించాయి.

మెయిల్ ఆంగ్ల దినపత్రికలో బడ్‌ఫిషర్ సృష్టించిన జఫ్ అండ్ మట్ (Jeff and Mutt) పాత్రలు హాస్యాన్ని పండించిన కార్టూన్ స్ట్రిప్స్‌లో స్మరణీయమైనది.

ఇక కార్టూనిస్టే తన కార్టూన్స్‌లో పాత్రగా ప్రతిఫలించిన స్ట్రిప్స్ కూడా వున్నాయి. షుల్స్ తన చిన్నప్పటి రూపాన్నే పీనట్స్ 'చార్లీబ్రవున్' పాత్రగా రూపొందించాడు. హెర్గే అనే కార్టూనిస్టు 'టిన్‌టిన్' పాత్రను తన యవ్వన ప్రతీకగా తీర్చాడు. తెలుగులో సత్యమూర్తిగారి 'చదువుల్రావ్' స్ట్రిప్స్‌లో కార్టూనిస్టు జయదేవ్ బాబాయిగా తనను అబ్బాయిగా తన మిత్రుడు గోపాల్‌ను ప్రతిబింబించారు. ఈ కార్టూన్ స్ట్రిప్స్ అన్నీ కూడా అనేక సాంఘికాంశాలపై హాస్య, వ్యంగ్య చమత్కారాలను అందించాయి.

రాజకీయ కార్టూన్ల సంఖ్య, వాటిని చిత్రించే కార్టూనిస్టుల సంఖ్య - సాంఘికాంశాలపై కార్టూన్లతోనూ, వాటిని వేసే కార్టూనిస్టులతోనూ పోలిస్తే తక్కువే.

1976 జనవరి రెండవ వారంలో తెలుగు కార్టూనిస్టుల ప్రథమ మహాసభలు జరిగేనాటికే తెలుగు కార్టూనిస్టుల సంఖ్య సుమారు 80 దాకా వుంది. బాపు, చంద్ర, సత్యమూర్తి, ఇ.వి రమణ జయదేవ్, బాబు బాలి, శంకు, రామకృష్ణ, సుధాము, శ్రీనివాస్, సత్యం, గీత తులసీరాం, పులిచెర్ల వంటివారు అప్పటికే పరిచితులు. రాగతిపండరి, కాటూరి శశిధర్, మల్లిక్, నాని, టింగు, వెంకటో, గోపి, రంగ, ప్రభంజన్ వంటివారు ప్రసిద్ధి చెందుతూ వచ్చారు.నేడు కార్టూన్ల రంగంలో కొందరే నిలద్రొక్కుకున్నారు. ఇంకా ఎందరో నూతన కార్టూనిస్టులు వస్తూనే వున్నారు.

దినపత్రికలే కాక వార, మాసపత్రికలు, దినపత్రికల ఆదివారం అనుబంధాలు నేడు కార్టూన్లను విరివిగా ప్రచురిస్తున్నాయి. శ్రీధర్, మోహన్, జావేద్, సంధ్య టీపీ, మల్లిక్, శేఖర్, శ్యాంమోహన్, నర్సిమ్, రాజు, కరుణాకర్ వంటి కార్టూనిస్టులు పత్రికల్లో తమ కార్టూన్లతో ప్రముఖంగా పాఠకులను అలరిస్తున్నారు. పేరు పేరునా అందరి పేర్లనూ పేర్కొనడం సాధ్యం కాని పని. కార్టూన్ల రంగంలో కృషి చేస్తున్న వారందరూ సామాజిక ప్రయోజనం కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నవారే.

## 6.2.4 ప్రాధాన్యత

కార్టూనులు పత్రికలకే పరిమితం కాలేదు, వాణిజ్య ప్రకటనలకు, విద్యా బోధనకు, సినిమాలకు కూడా కార్టూన్ చిత్రకళ విస్తరించింది. ఒక ప్రముఖ సిమెంటు కంపెనీ తన వాణిజ్యాభివృద్ధికి కార్టూన్ల సంవిధానాన్నే ప్రకటనల పద్ధతిగా విరివిగా ఉపయోగించుకుంది. సామెతలు, వేమన నీతిపద్యాలు వంటివి కార్టూన్లలో చోటు చేసుకొన్నాయి. విద్యాబోధనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో (1986) ప్రాథమిక తరగతుల పాఠాలను బాపు, ముళ్లపూడి జంటతో వీడియో పాఠాలుగా రూపొందింప చేసినపుడు ఈ కార్టూన్ పద్ధతిని వారు విరివిగా ఉపయోగించారు. కార్టూన్ చిత్రాలు కార్టూన్ సినిమాలు రూపొందించడంలో వాల్ట్‌డిస్నీ తర్వాతే ఎవరయినా, మిక్కిమౌస్, డోనాల్డ్ వంటి పాత్రల సృష్టితో డిస్నీ ప్రపంచ ప్రఖ్యాతి చెందాడు. జంగిల్‌బుక్, అలాడీన్ వంటి కార్టూన్ చిత్రాలు ఆబాలగోపాలాన్ని అలరించినవి. కెనడాలో నార్మన్ మెక్లారెన్ అనే డైరెక్టర్ గణితాన్ని

BRAOU

బోధించడానికి కార్టూన్ సినిమాలు తీశాడు. పిటోల్డ్ గీర్స్ అనే పోలెండ్‌లోని కార్టూన్. సినిమా నిర్మాత జీవపరిణామ చరిత్రను కార్టూన్ ఫిలింగా తీశాడు. భూగోళం, భాషాశాస్త్రం, సైన్సు వంటి విషయాలను బోధించడానికి కార్టూన్ ప్రక్రియ దోహదం చేసింది.

బ్లాక్ మేకింగు ప్రింటింగ్ దశ నుండి ఆఫ్‌సెట్ ప్రింటింగుకు ఎదిగిన కారణాన నలుపు తెలుపుల నుండి రంగుల్లో నేడు సునాయసంగా కార్టూనులు అందించే అవకాశం ఏర్పడింది. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల కార్టూన్లు రాశిలోనూ, వాసిలోనూ మరింత అభివృద్ధినీ, నాణ్యతనూ సంతరించుకోగలవు.

## 6.3 ఫోటోలు-ఫోటోఫీచర్‌లు

ఫోటో అంటే ఛాయాచిత్రం. చిత్రకారుడు ప్రకృతిలోని ఒక దృశ్యాన్ని చిత్రిస్తూంటే ప్రకృతిలో వెలుగునీడలు త్వరత్వరంగా మారిపోతూ అతని చిత్రం త్వరంగా పూర్తికావడం కష్టమవుతూండడం గ్రహించాడు. తాను తిలకిస్తున్న దృశ్యాన్ని వేగంగా రికార్డు చేయగల సాధనం కోసం అతని ఆలోచనలు సాగాయి. కెమెరా కనిపెట్టడానికి అదే హేతువయింది. కెమెరా ద్వారా ఫోటోలు తీసి దృశ్యాన్ని తాను తిలకించినప్పటి ఏ దశలో ఏ రీతిగా వుందో ఆ రీతిన యథాతథంగా ప్రతిబింబించేలా భద్రపరుచుకునే అవకాశం అతనికి లభించింది.

19వ శతాబ్దపు ప్రారంభంలోనే ఫోటోలు తీయడం కూడా మొదలయింది. థామస్ వెగ్ వుడ్ Thomas Wedgwood మొదటిసారి పేపరు మీద నీడను 1802లో సృష్టించాడట. 1816-1822లలో జోసెఫ్ నీస్ పోర్‌నిప్సి పరిశోధన చేసి కెమెరాతో ఫోటో తీసి భద్రపరిచే విధానం తెలుసుకున్నాడు. 1839లో విలియమ్ హెన్రీ పాక్స్ నెగిటివ్-పాజిటివ్ విధానానికి అంకురార్పణ చేస్తే బ్రోమైడ్ ఫోటో పేపర్, ఫిల్ము అనేది 1879లో జార్జి ఈస్ట్‌మెన్ తయారుచేశాడు. 1889లో రోల్‌ఫిల్మ్ రూపొందింది. అతని పేరునే ఈస్ట్‌మన్ కోడక్ కంపెనీ వచ్చింది. 1860లో జెమ్స్‌క్లర్కు మేక్సువెల్ థామస్ సూటన్ కలిసి రంగుల ఫోటో కనిపెట్టారు. 1869లో డూకస్ డు హరాన్ కలర్ కెమెరా రూపొందింది. ఇలా ఫోటోగ్రఫీ విధానం క్రమేపీ ఎంతో అభివృద్ధి చెందింది.

పత్రికల్లో ఛాయాచిత్రాల (ఫోటోల) ప్రచురణ కూడా అనివార్యం. ఒక వార్త వాస్తవికత తెలియాలంటే ఫోటోనుమించిన ఆధారం లేదు. ఒక సంఘటనను యాథాతథంగా రికార్డు చేయడానికి ఫోటోగ్రఫీ సహకరిస్తుంది. ఆ ఫోటోను ముద్రించడం ద్వారా లక్షలాది మందికి ఆ యథార్థతను కళ్లకుకట్టి చూపించినట్లవుతుంది.

స్టూడియోలో రూపచిత్రాలు తీయడానికి సమాజంలో, ప్రకృతిలో సంఘటనలను, దృశ్యాలను ఫోటో తీయడానికి తేడా వుంది. ఏ దృశ్యాన్ని ఏ కోణం నుండి ఫోటో తీయాలో, సరిగ్గా ఏ సమయంలో దృశ్యాన్ని ఫోటోగా అందిపుచ్చుకోవాలో ఫోటోగ్రాఫర్‌కు తెలిసి వుండాలి. అందుకే పత్రికల్లో ఫోటో జర్నలిజం అనేది ఒక ముఖ్యమైన ప్రత్యేకమైన శాఖ అయింది. సభలు సమావేశాలు జరిగినప్పుడు; ప్రమాదాలు, ప్రమోదాలు సంభవించినప్పుడు విలేఖరులతో బాటు పత్రికా ఫోటోగ్రాఫర్ల ప్రాముఖ్యం ఎక్కువగా వుంటోంది. పేపర్లో ఫోటో పడడం అనేది ప్రముఖమైన గుర్తింపు అవుతోంది.

కెమెరాతో చిత్రాలు వాస్తవికంగా తీయడం మామూలు పద్ధతే. కంటికి కనిపించే రూపాన్ని కెమెరాతో మరో విధంగా రూపకల్పన చేసి తీసే పద్ధతి కూడా వుంది. ఇదే ఆధునిక, నైరూప ఛాయాచిత్ర కళగా కళారంగంలో ఎదుగుతోంది.

రాళ్లను, ఇసుకను, చెట్లను అతిదగ్గరగా ఫోటోలు తీసి ఎడ్వర్డు వస్టన్ మొట్టమొదట ఫోటోల ద్వారా కొత్త రూపాలను సృష్టించాడు. ఒకే ఫిల్ము మీద పలుమార్లు ఎక్స్‌పోజ్ చేసి పాల్‌స్ట్రేన్డ్/సరికొత్త రూపాలను ఆవిష్కరించాడు. ఆల్విన్ లాంగ్‌డన్, క్రిస్టియన్ మొదలైనవారు 1917-18 ప్రాంతాలలోనే ఫోటోగ్రామ్స్ అంటూ క్యూబిస్టు చిత్రాలవంటివి రూపొందించారు.

కెమెరాలో ఆర్టుఫిల్ము మంచి ఫోటోలు తీస్తే వెలుగునీడలు లేతచాయలు రాకుండా తెలుపు నలుపు డ్రాయింగు బొమ్మల్లా వస్తాయి. అలాగే ఒక వస్తువు వెనుక ప్రకాశవంతమైన వెలుగు పడేలా చూసి వస్తువుపై వెలుగులేకుండా ఫోటో తీస్తే నల్లని నీడబొమ్మల ద్వారా కెమెరాను వుపయోగించి బుద్ధుని జీవితకథను చిత్రించారు.

కెమెరాతోనూ, ఎన్‌లార్జర్‌తోనూ, జూమ్‌లెన్స్ సహాయంతోనూ ఫోటోలలో ఎంతో వైవిధ్యాన్ని. వైరుధ్యాన్నే చూపేవీలుంది.

BRAOU

చిత్రకారుడు చేసేపనులను, చేయలేని పనులను కూడా ఈనాడు కెమెరా చేయగలుగుతోంది. ఎన్నో చారిత్రక సంఘటనలను, ప్రముఖ సన్నివేశాలను, సుప్రసిద్ధ వ్యక్తులను ఫోటోల ద్వార రికార్డు చేసి శాశ్వతత్వాన్ని అందించగలుగుతున్నాం.

నేరాలు, హత్యలు, ప్రమాదాలు వంటి సంఘటనల ఫోటోలు పత్రికలకు సంచలనాన్ని సంతరించి పెట్టడమే కాదు ఒక్కొక్కసారి ఆ ఫోటోలు నిజ నిర్ధారణకు సహకరించేవి కూడా కాగలుగుతూంటాయి. అందుకనే ఫోటోగ్రాఫర్ల వృత్తి (రిస్క్) సాహసంతో కూడుకున్నదిగా కూడా మారుతోంది.

దృశ్యాలను యథాతథంగా చిత్రీకరించడానికి ఫోటోగ్రాఫర్లు సంఘటనా స్థలంలో అత్యంత సమీపంగా కూడా సంచరించవలసి వుంటూంటుంది. ప్రముఖుల రాక సందర్భంగా ఏర్పరచే రక్షణ వలయాన్ని కూడా ఛేదించుకుపోగలిగే ప్రయత్నం చేస్తూంటారు. అలాగే ప్రమాద స్థలాల్లో, బందులు కాల్పులు జరుగుతున్నా వాస్తవికతను అంది పుచ్చుకోవడం కోసం పరుగులు తీస్తూంటారు. ఫోటోగ్రాఫర్ లేనిదే, వారి 'క్లిక్' మనించే ఫ్లాష్‌లు వెలుగులు లేనిదే సంఘటనలకూ సందర్భాలకు నిండుదనం రాదు. మరునాడు వెంటనే పత్రికలలో ఆ ఫోటోలు రానిదే పాఠకులకూ తృప్తి కలుగదు.

ఫోటోలు తీయడంలోనూ ఎన్నో అధునాతన మార్గాలు వచ్చాయి. ఫాక్స్ ద్వారా ఫోటోలు వెంటవెంటనే పంపగల వీలుంది. ఇన్‌సాట్ ఫోటోల ద్వారా వాతావరణ చిత్రాలను అందిపుచ్చుకోగల్గుతున్నాం.

రంగుల ఫోటోలను పత్రికలలో ముద్రించడం కూడా చాలా సులభతరమైంది. ఆఫ్‌సెట్ ప్రింటింగు వల్ల ఎక్కడో ఒక కాగితం మీద వున్న రంగుల బొమ్మనైనా వెంటనే యథాతథంగా కావలసిన రీతిలో ముద్రించగల అవకాశాలు నేడున్నాయి.

ఏదైనా ఒక పెద్ద సంఘటన జరిగినప్పుడు దానిపై వార్తాపత్రికా వ్యాసాలూ ప్రచురించినట్లే, దిన పత్రికల ఛాయాచిత్రాలు చేర్చి చిత్రమాలిక వ్యాసంగా ప్రచురించే సంప్రదాయం కూడా ఉంది.

వార మాస పత్రికల్లో ఫోటోఫీచర్‌లు కూడా నేడు ప్రచురితమవుతున్నాయి. వ్యాపార ప్రకటనలకు మోడలింగ్ అనేది ఫోటోల ద్వారా అభివృద్ధి చెందుతున్న విధానమే. కథలకు కూడా రేఖాచిత్రాలను సంతరించేందుకు మారుగా కొన్ని పత్రికలు కథలోని పాత్రలకు అనుగుణంగా వ్యక్తులను ఎంపిక చేసుకుని కథ సంఘటనల సందర్భానుసారంగా వారిచే నటింపచేసి, ఆ భంగిమలను ఫోటోలు తీసి ప్రచురించే ప్రయోగాలు కూడా కొన్ని పత్రికలు చేసాయి.

ఒక కథను సమకూర్చుకుని తదనుగుణంగా పరిసరాలను, ప్రదేశాలను ఎన్నుకొని, కథా పాత్రలకు కొందరు వ్యక్తులను ఏర్పరుచుకుని ఫోటోల ద్వారా ఆ కథను పత్రికలు ఫోటోఫీచర్లుగా అందించడం ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి వంటి పత్రికలు చేశాయి. అయితే ఒక వర్గం పాఠకులను ఆకర్షించినంతగా ఈ తరహా-ఫోటోలతో ప్రచురించిన కథలు, ఫోటోఫీచర్‌లు అన్ని వర్గాలవారినీ ఆకట్టుకోలేకపోవచ్చు.

మంచి ప్రకృతి దృశ్యాలను ఫోటోలుగా తీసి ముఖచిత్రాలుగా ముద్రించడం కొన్నేళ్ల క్రితం అడపాదడపానయినా కొన్ని పత్రికల విషయంలో జరిగేది కాని ప్రస్తుతం సినిమా నటీనటుల ఫోటోలతోనే దాదాపు అనేక తెలుగు వార, మాస పత్రికలు రూపొందుతున్నాయి. సినిమాల్లోని సన్నివేశాల ఫోటోలు సినిమాపత్రికలకే కాదు అన్ని దిన వార మాస పత్రికలకూ అవసరమౌతున్నాయి. పత్రికల వ్యాపారాభివృద్ధికి సినిమా ఫోటోలు ప్రాథమికమైన ముడిసరుకుగా మారాయి.

చందమామ వంటి పిల్లల పత్రికలు ఫోటో వ్యాఖ్యాల పోటీని కొనసాగిస్తున్నాయి. రెండు వైవిధ్య భరితమైన ఫోటోలను ముద్రించి ఆరెంటికీ మధ్య సమన్వయాన్ని ఒక వ్యాఖ్య ద్వారా సంతరించడం ఈ పోటీ లక్షణం. ఇది ఒక ఆసక్తికరమైన పోటీగానే పాఠకులు హర్షించినట్లుతోస్తుంది. అలాగే మరికొన్ని పత్రికలు ఒకే ఫోటో ప్రచురించి ఆ ఫోటోలోని దృశ్యాన్నో, వ్యక్తులనో, వాతావరణాన్నో కవితాత్మకంగా వ్యాఖ్యానించమని పోటీ పెడ్తూంటాయి. లేదా ఒక సినీ నటినో, నటుడినో, ఒక చిత్రంలోని సన్నివేశాన్నో ఫోటోగా ప్రచురించి ఆ నటి లేక నటుడెవరో ఆ సన్నివేశం ఏ చిత్రంలోనిదో గ్రహించమంటారు. అలాగే ఒక సినీనటి కళ్ళనో లెక ముఖంలోని కొంత భాగాన్నో ప్రచురించి కనుగొనమంటారు ఇవన్నీ ఫోటోలను ఆధారం చేసుకుని రూపొందించే పోటీలే.

BRAOU

ఒకప్పుడు నవలల పోటీలోనో, కథల పోటీలోనో బహుమతి పొందిన రచయిత(త్రు)ల ఫోటోలు ప్రచురించడమే విధానంగా వుండేది. నేటి పత్రికలలో పాఠకులు పాల్గొనే అనేక శీర్షికల్లో, వారి అభిప్రాయాలను వారి ఫోటోలతో బాటుగా ప్రచురించడం జరుగుతోంది. అలాగే పుట్టినరోజు పాపాయిల ఫోటోలు. పాత గ్రూపు ఫోటోలు ప్రముఖులతో తీయించుకున్న ఫోటోలు ప్రచురించుతూ పాఠకులు పాల్గొనే ఫోటోలతో కూడిన అనేక ఫీచర్‌లను పత్రికలు స్వీకరిస్తున్నాయి.

కార్టూనులు, ఫోటోలు నేటి పత్రికలకు అనివార్యమైన నిత్యావసర సామగ్రి. ఎందుకంటే అవే అత్యధికశాతం పాఠకుల అభిరుచిని తీర్చేవి.

## 6.4 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

కార్టూన్లు వ్యంగ్య చిత్రాల ద్వారానే చెప్పినప్పటికీ ఒక సంఘటననో, వాస్తవాన్నో, వార్తనో వివరించేవిగా, విశదపరిచేవిగా వుంటాయి. ఇవి వాక్య రహితంగా వాక్య సహితంగా రెండు రూపాల్లోనూ వుంటాయి. కెమెరాలు. ప్రింటింగ్‌కు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందని కాలంలో కార్టూన్లు, చిత్రకళ ప్రాధాన్యత విశేషంగా వుండేది.

సాంకేతికాభివృద్ధి ఫోటోగ్రఫీని జర్నలిజానికి పరిచయం చేసింది. ముఖ్యంగా పరిశోధనాత్మక జర్నలిజంలో ఫోటోగ్రఫీ కీలకమైన అంశంగా ఎదిగింది. చివరికి వార్తలు, వ్యాసాలు కూడా ఫోటోల ద్వారా వివరించే ఫోటోఫీచర్ల పద్ధతి పత్రికల్లో మొదలైంది.

కార్టూన్లు, ఫోటోలు, ఫోటోఫీచర్లు వార్తలో చెప్పదలుచుకున్న విషయానికి అద్దంపడతాయి. విశదీకరిస్తాయి, విశ్లేషిస్తాయి. ఇవి భావప్రసారానికి మరింత ఆధారాన్నీ, బలాన్నీ ఇస్తాయి.

## 6.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు 30 పంక్తుల మించని సమాధానాలు రాయండి.**

1. కార్టూన్లు అనగానేమి? పత్రికల్లో వాటి ప్రాధాన్యతలను వివరించండి.
2. 'ఫోటోలు, ఫోటోఫీచర్లు' ఆధునిక జర్నలిజంలో కీలకమైన పాత్ర కలిగివున్నాయి. వివరించండి.

**II. కింది ప్రశ్నలకు 20 పంక్తులలో సమాధానాలు రాయండి.**

1. రాజకీయ కార్టూన్లు
2. ఫోటో జర్నలిజం

***- ఎ. వెంకటరావు (సుధామ)***

BRAOU

BRAOU

# ఖండం - 2
# ప్రత్యేకాంశాల రచన

సమాజంలో వస్తోన్న ఆధునిక ధోరణులు, మార్పులు వార్తా పత్రికలను విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. గతంలో సమాచారం మొత్తాన్ని పేజీలనిండా అచ్చువేసి పాఠకులకు అందజేసిన పత్రికలు ఇవాళ వర్గీకరించి, విశ్లేషించి వివరిస్తున్నాయి. విషయాన్ని బట్టి, ప్రత్యేకతను బట్టి, పాఠకులకు అవసరమైన సమాచారాన్ని క్రోడీకరించి వివిధ రంగాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పత్రికల్లో పొందుపరుస్తున్నాయి.

పాఠకుల అవసరం, అభిరుచి, ప్రాధాన్యత ప్రత్యేకతలను బట్టి, పత్రికారచనలో వస్తోన్న మార్పులను పొందుపరుస్తోన్న అంశాలను బట్టి ప్రత్యేకంశాల రచనను ఆరుభాగాలుగా పేర్కొనడం జరిగింది. ఈ ఖండంలో ఆయాభాగాలను వివరంగా చర్చించడం జరిగింది. అవి **1.** వార్తా వ్యాసాలు **2.** శాస్త్రవిజ్ఞానం **3.** వాణిజ్యం **4.** వ్యవసాయం **5.** క్రీడలు **6.** సమీక్షలు.

ఈ భాగాలను చదివే ముందు వివిధ పత్రికలను, అయా పత్రికల ప్రత్యేక పేజీలను పరిశీలించండి. వాటిలోని అంశాలను ఎలా రాస్తున్నారో గమనించండి. వాటిని ఈ భాగాల్లో చర్చించిన అంశాలు, సూత్రాలు, వివరణలతో పోల్చిచూడండి. వాటిని ఈ సూత్రాల ప్రాతిపదికన అన్వయించుకొని ఆలోచించండి.

BRAOU

BRAOU

# భాగం - 7 : వార్తా వ్యాసాలు

## విషయక్రమం


7.0 ఉద్దేశం

7.1 ప్రవేశిక

7.2 వార్తా వ్యాసం అంటే ఏమిటి?

7.3 వార్తకు, వార్తా వ్యాసానికి తేడాలు

7.4 వార్త వ్యాసాలు రకాలు

7.5 వార్తా వ్యాసానికి, ప్రత్యేక వ్యాసానికి తేడా

7.6 వార్తా వ్యాస రచన, జాగ్రత్తలు

7.7 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

7.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 7.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు ఈ కింది విషయాలు తెలుసుకుంటారు.

- వార్తా వ్యాసమంటే ఏమిటి?
- వార్తకు, వార్తా వ్యాసానికి గల తేడాలు
- వార్తా వ్యాసానికి, ప్రత్యేక వ్యాసానికి గల తేడాలు
- వార్త వ్యాసాలు, రకాలు
- వార్త వ్యాస రచన జాగ్రత్తలు

BRAOU

## 7.1 ప్రవేశిక

వార్తా పత్రికలలో ప్రచురించే అంశాలలో వాణిజ్య ప్రకటనలను మినహాయిస్తే, తక్కినవాటిని వార్తలు, వ్యాఖ్యారచనలు అని స్థూలంగా వర్గీకరించవచ్చు. రాజకీయ, సామాజికాది రంగాలలో జరిగే సంఘటనలను, సంభవించే పరిణామాలను వెంటవెంటనే పాఠకులకు తెలియజేసేవి వార్తలు. వార్తలలో పాఠకులకు అందేది సమాచారం మాత్రమే. సంపాదకీయ వ్యాఖ్యలు, సంపాదకీయ వ్యాసాలు రాజకీయ, సామాజికాది రంగాలలో సంభవించే పరిణామాల పూర్వాపరాలను, పర్యవసానాలను విశ్లేషించి చెప్పే ప్రత్యేకవ్యాసాలు (features- ఫీచర్స్) వివిధ తరగతుల పాఠకులకోసం ప్రత్యేకంగా నిర్వహించే శీర్షికలలోను, విజ్ఞానశాస్త్రాలు, కళలు వంటి ప్రత్యేకరంగాల శీర్షికలలోనూ ప్రచురించే ప్రత్యేక వార్తా వ్యాసాలు (Special Features - స్పెషల్ ఫీచర్స్) ఇవన్నీ వ్యాఖ్యారచనలుగా చెప్పుకోవచ్చు. ఈ రకం రచనలు పాఠకులకు సమాచారాన్ని మాత్రమేకాక, అవగాహననీ, దృక్పథాన్నీ, వినోదాన్ని, విజ్ఞానాన్నీ అందిస్తాయి. ఈ భాగంలో మనం వార్తా వ్యాస్యాలు, ఫీచర్స్ గురించి తెలుసుకుంటాం. వార్తా వ్యాసాలు అంటే ఏమిటో వాటిలో ఎన్ని రకాలున్నాయో, వాటిని ఎలారాయాలో తెలుసుకుంటాం. ప్రత్యేక వార్తా వ్యాసాలు - అంటే స్పెషల్ ఫీచర్స్ గురించి మున్ముందు మరో భాగంలో చర్చించడం జరుగుతుంది.

## 7.2 వార్తా వ్యాసం (ఫీచర్) అంటే ఏమిటి?

భారతదేశం ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలలో కాశ్మీర్ పరిస్థితి ముఖ్యమైనది. జమ్మూకాశ్మీర్‌లో రోజూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. భద్రతాదళాలపై మిలిటెంట్లు జరిపేదాడులు, ఎన్‌కౌంటర్లలో మిలిటెంట్ల మరణాలు, మరోప్రక్క సమస్యపరిష్కారానికి వివిధ స్థాయిలలో జరిగే ప్రయత్నాలు, దేశంలోనూ బయటా కాశ్మీర్ పరిస్థితి గురించి వెలువడే ప్రకటనలు, తీర్మానాలు, అంచనాలు ఇలా ఎన్నో రకాల సమాచారం పత్రికల ద్వారా పాఠకులకు అందుతూ ఉంటుంది. ఆ సమాచారం అంతా గుదిగుచ్చి అందించినా, కాశ్మీర్ గురించిన సమగ్ర అవగాహన పాఠకులకు అందదు. విడివిడిగా ప్రతి చెట్టునూ, పిట్టనూ వర్ణించినప్పటికీ అది అడవి రూపురేఖలను కళ్ళకుకట్టదు. అలాగే ఎంత సమాచారం కుమ్మరించినా అది స్వయంగా జ్ఞానం కాజాలదు. కాశ్మీర్‌లో వాస్తవ పరిస్థితి ఏమిటో పాఠకులకు తెలియజేయాలంటే ఆ ప్రాంతంలో సమస్య ఏర్పడడానికి మూలకారణాలు, స్వయంప్రతిపత్తి, ప్లెబిసైట్, 370 అధికరణం వంటి అంశాల వివరణ, అంతర్జాతీయంగా, జాతీయంగా ఆ సమస్య చర్చలోకి రావడానికి కారణాలు, వివిధ మిలిటెంట్ సంస్థల వైఖరులు- ఇలా ఎన్నో అంశాల నేపథ్యంలో, ఉల్లేఖనలు, ఉటంకింపులతో వ్యాసరచన జరగాలి. రోజూ జరుగుతున్న సంఘటనలను ఒక సంబంధ క్రమంలో చూడగలగాలి. జమ్మూకాశ్మీర్‌కు సంబంధించి ఆనాటి పరిస్థితిపై స్పష్టమైన అవగాహన ఏర్పడాలి. ప్రత్యేకవ్యాసం (ఫీచర్) చేసేపని అదే. కాశ్మీర్‌వంటి తీవ్రమైన రాజకీయ సమస్యే కానక్కరలేదు. నిరుద్యోగం, పేదరికం, వరకట్నం, అడవుల విధ్వంసం వంటి అంశాలన్నిటిపైనా ప్రత్యేకవ్యాసాలు పాఠకులకు అవసరమవుతాయి. చెల్లా చెదురుగా, చిందర వందరగా పత్రికల్లో కనిపించే వార్తల మధ్య అంతస్సూత్రం ఏమిటో పాఠకులు తెలుసుకోవడానికి వార్తా వ్యాసాలు సహాయపడతాయి.

వార్తా వ్యాసాల ఉద్దేశ్యం సమాచారం అందించడం కాదు. అలాగని వాటిలో సమాచారం ఉండదని కాదు. గతంలో వార్తల రూపంలో వచ్చిన సమాచారాన్ని గానీ, కొత్తగా సేకరించిన సమాచారాన్ని గానీ ప్రస్తావనాంశంగా వ్యాసకర్త (ఫీచర్‌రైటర్) అందిస్తాడు. అయితే, వార్తా వ్యాసం ప్రధాన విధి, వ్యాసంలోని అంశంపై పాఠకులను చైతన్య పరచడం, అవగాహన కలగజేయడం, వారిని వినోదింపజేయడం, వారిలోని విశ్లేషణాశక్తిని పెంపొందించడం. అయితే వార్తావ్యాసం సందర్భశుద్ధి కలిగి వుండాలి. వార్తల్లో ఉన్నఅంశాల గురించే వార్తావ్యాసాలు రావాలికానీ, వార్తల్లోలేని, వర్తమానంతో ఏ సంబంధమూ లేని అంశాల గురించి కాకూడదు.

వార్తావ్యాసం అంటే ఒక అంశం గురించిన ఒక వైఖరిని పాఠకులకు అందించడం. ఈ క్రమంలో వార్తా వ్యాసరచయిత ఎంతో సమాచారాన్ని పోగుపరుస్తాడు. ఇందులో కొంత కొత్త సమాచారం ఉంటుంది. కొంత పాత సమాచారం ఉంటుంది. కొన్ని గణాంకాలను కూడా సేకరించవలసివుంటుంది. ఆ అంశంపై కొందరు చెప్పిన, రాసిన మాటల ఉటంకింపులను పోగు చేయవలసివుంటుంది. వీటన్నిటినీ రచయిత జాగ్రత్తగా అమర్చి తనవైఖరిని నిర్మిస్తారు. తన వైఖరి ప్రకారం రచనాంశానికి సంబంధించి కొన్ని నిర్ధారణలు చేస్తారు.

వార్త రాయడానికి ఒక నిర్దిష్టమైన పద్ధతి ఉంది. అయిదు డబ్ల్యు' (W)లు, ఒక 'హెచ్' (H) వార్త ప్రారంభ వాక్యాలలో ఉండాలి. అంటే ఎప్పుడు (When) ఎక్కడ, (Where) ఏమిటి (What) ఎందుకు (Why) ఎవరు (Who) ఎలా (How) సంఘటన జరిగిందన్న సమాచారం మొత్తం వార్త మాటలలో (లీడ్) లో వచ్చి తీరాలి. లేకపోతే చావుకబురు చల్లగా చెప్పిన సామెత గుర్తుకు వస్తుంది. మరి వార్తావ్యాసానికి కూడా అటువంటి కఠిన నియమాలు ఉన్నాయా?

వార్త లక్ష్యం వేరు, వార్తా వ్యాసం లక్ష్యం వేరు. సమాచారం కోసం వార్తావ్యాసాల్ని ఎవరూ చదవరు. అవగాహనకోసం, విజ్ఞానం కోసం, వినోదంకోసం వార్తావ్యాసాల్ని చదువుతారు. అయితే, పాఠకులను ఆకట్టుకోవడంలో వార్తకు కొన్ని నిర్మాణపరమైన సదుపాయాలున్నాయి. వార్త శీర్షిక, వార్తలో లీడ్ పాఠకులను వెంటనే ఆకర్షిస్తాయి. ఫలానా చోట రోడ్డు ప్రమాదంలో 10మంది మరణించారన్న వార్త ఉందనుకోండి. ప్రాణనష్టానికి సంబంధించిన సమాచారం శీర్షికలోనే ఉండి

BRAOU

పాఠకుల దృష్టిని ఆకట్టుకుంటుంది. ఫలానా రోజున ఫలానా ప్రాంతంలో రెండు వాహనాలు ఢీకొని 10మంది మరణించారనీ, మరి కొందరు గాయపడ్డారనీ వార్త ప్రారంభ పేరాగ్రాఫ్‌లోనే ఉంటుంది. శీర్షికను గమనించిన పాఠకుడు వివరాలకోసం వార్తలోకి ప్రవేశిస్తాడు. వార్తలోని విషయం కలిగించే ఆసక్తిని బట్టి, ఆందోళననుబట్టి ఆసాంతం చదువుతాడు. వార్తా వ్యాసం విషయంలో పరిస్థితివేరు. మునుపటిరోజు జరిగిన సంఘటనకో, దుర్ఘటనకో సంబంధించిన సమాచారం అందులో ఉండదు. శీర్షిక కూడా సమాచారాత్మకంగా ఉండదు. వార్త సారాంశం అంతా లీడ్ పేరాగ్రాఫ్‌లో ఉన్నట్టు వ్యాసం సారాంశం మొదటి పేరాగ్రాఫ్‌లో ఉండదు. వ్యాసం మొత్తంగా చదివితే తప్ప రచయిత చెప్పదలచుకున్నదేమిటో పూర్తిగా అర్థంకాదు. మరి వార్తా వ్యాసాన్ని చదవాలన్న ఆసక్తి పాఠకులలో ఎలా కలుగుతుంది?

సాధారణ వ్యాసం రాయడానికి ఎటువంటి నియమాలుంటాయో అవన్నీ వార్తా వ్యాసానికి కూడా ఉంటాయి. అంతకు మించిన కఠిన నియమాలేవీ ఉండవు. సాధారణ వ్యాసానికి ఉండే లక్షణాలు, నియమాలు కూడా ఎంతో వెసులుబాటుతో కూడినవి. ప్రారంభం ఎలా ఉండాలి. విషయ చర్చ ఎలా చేయాలి. వ్యాసాన్ని ఎలా ముగించాలి మొదలైనవి సాధారణ వ్యాసరచన గురించి పాఠశాలస్థాయిలోనే మనం నేర్చుకుని ఉంటాం. వార్త పత్రికలలో నడుస్తున్న విషయాలపై విస్తృత పాఠకలోకాన్ని ఉద్దేశించి రాస్తున్నప్పుడు వ్యాసం మరింత స్వేచ్ఛ పొందుతుంది. సారళ్యం, జనరంజకత్వం అవసరమవుతాయి. సమాచారాన్ని అందించే గుణం, శీర్షిక, లీడ్‌వంటి వాటిద్వారా పాఠకుడి దృష్టిని ఆకర్షించగలగడం వార్తకున్న సదుపాయాలుకాగా, వార్తా వ్యాసానికి ఆ లక్షణాలు లేకపోవడం వల్ల పాఠకులలో ఆసక్తి కలిగించడానికి వ్యాసకర్త విశిష్ట రచనా పద్ధతిని అనుసరించాలి. వార్తా వ్యాసాన్ని నిర్మించడంలోనూ, శైలిలోనూ ఆ విశిష్టత కనిపించాలి.

**అభ్యాసం-1 : వార్తావ్యాసం అంటే ఏమిటి?**

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

## 7.3 వార్తకు - వార్తా వ్యాసానికి తేడాలు

ఎ) వార్త తక్షణ సమాచారాన్ని అందించేది. వార్తా వ్యాసంలో అంటే ఫీచర్‌లో సమాచారం ఉంటుందికానీ, అది తక్షణ సమాచారం కానక్కరలేదు. సంఘటనల గురించి, పరిణామాలగురించి ఆసక్తి కరంగా, మాననీయ అనుభూతులను కలిగించేలా, విజ్ఞానం సమకూర్చేలా, వినోద పరిచేలా రాసేదే వార్తా వ్యాసం.

బి) వార్తలో సొంత అభిప్రాయాలకు తావులేదు. అభిప్రాయాలు, వర్ణనలు, భాష్యాలు లేని వార్తా వ్యాసం ఉండదు.

సి) వార్తలో సారాంశం అంతా మొదటి వాక్యాలలో వచ్చేయాలి. వార్తా వ్యాసంలో ఆ నియమం లేదు.

డి) విశేషణాలు, అతిశయోక్తులు, కవితాత్మకశైలి వార్తలో పనికిరావు. అభివ్యక్తిలో వైచిత్రి, సౌందర్యం చూపడానికి వార్త వ్యాసంలో ఆస్కారం ఉంటుంది.

ఇ) సంఘటనల బాహ్యవిశేషాన్ని మాత్రమే వార్తలు తెలియజెప్పుతాయి. సంఘనల అంతర్యాన్నీ, నేపథ్యాన్నీ, పర్యవసానాల్నీ వార్తా వ్యాసాలు వెల్లడిస్తాయి.

BRAOU

ఎఫ్)  స్పష్టత, సాధికారికత వార్తలకు ముఖ్యం. విశ్లేషణ తర్కం, చర్చ వార్తా వ్యాసాలకు ఆవశ్యకాలు.

## 7.4 వార్తా వ్యాసాలు - రకాలు

పత్రికా రచనలో వార్తా వ్యాసం ఒక ప్రక్రియ (Form). కథ, నవల, కవిత, వ్యాసం మొదలైనవన్నీ రచయిత పాఠకులతో పంచుకోవడానికి ఎంచుకున్న ప్రక్రియ రూపాలు. అలాగే వార్తా వ్యాసం కూడా. ఈ ప్రత్యేక వ్యాసంలో కొన్ని ఉప ప్రక్రియలున్నాయి.

అ) ప్రముఖ వ్యక్తి వ్యక్తిత్వ పరిచయం (Personality Profile)

ఆ) మానవీయ కథనం (Human Interest Story)

ఇ) ధోరణుల విశ్లేషణ (Trend Story)

ఈ) నిశిత కథనం (In-depth Story)

ఉ) నేపథ్యం (Back Grounder)

### అ) ప్రముఖవ్యక్తి వ్యక్తిత్వ పరిచయం **(Personality Profile)**

'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో తుర్లపాటి కుటుంబరావు 'వార్తలలోని వ్యక్తి' అన్న శీర్షికను కొన్ని దశాబ్దాలపాటు నిర్వహించారు. ఇంగ్లీషు దిన పత్రికలలోనూ, కాలిక పత్రికలలోను వార్తలలో ఉన్న వ్యక్తుల విశేషాలను ప్రచురిస్తారు. (Main News Personality, News makers వంటి శీర్షికలలో). ఒక్కొక్కప్పుడు ఒక్కోవ్యక్తి వార్తలలో తరచుగా కనిపిస్తారు. 'టాడా'కింద నిర్బంధంలో ఉన్న కాలంలో సంజయ్‌దత్, ఆ తరువాత అరెస్టయిన కేంద్రమంత్రి కల్పనాథ్‌రాయ్, కస్టడీలో మరణించిన పారిశ్రామికవేత్త రాజన్‌పిళ్ళై, 1996 ఎన్నికలఘట్టం ముగుస్తుండగా అరెస్టయిన తాంత్రికుడు చంద్రస్వామి, రష్యన్ దాడిలో మరణించిన చచన్య తిరుగుబాటు నాయకుడు దుదయెవ్- వీరందరూ 1996 ప్రథమార్థభాగంలో వార్తలలోని వ్యక్తులే. పత్రికలు వీరి గురించి విశేషమైన వ్యక్తిత్వ కథనాలు ప్రచురించాయి. ఈ రకం ప్రత్యేకవ్యాసాలు రాయడానికి జరుగుతున్న పరిణామాలతో నిత్యం పరిచయం కలిగివుండాలి. వార్తలలోనివ్యక్తి, వార్తల్లో లేని వ్యక్తిగా మారడానికి ఎక్కువకాలం పట్టదు. 1992 నుంచి 1994 దాకా తరచు వార్తల్లో కెక్కిన ప్రముఖస్టాక్ బ్రోకర్ హర్షద్‌మెహతా 1996లో ఎవరినోటా నానడంలేదు. కాబట్టి చెలామణీలో ఉన్న వ్యక్తులను ఈ శీర్షిక కింద ఎంచుకోవాలి. ఆ వ్యక్తులగురించి ఆసక్తికరమైన ఉదంతాలను పేర్కొంటూ, జీవిత విశేషాలను వార్తలలోకి వీలైన క్రమాన్ని సమాచారాత్మకంగా రాయాలి.

### ఆ) మానవీయ కథనం **(Human Interest Story)**

విచిత్రమైన విషయాన్నో, మనసును కదిలించే విషయాన్నో, వినోదాన్ని కలిగించే విషయాన్నో చెప్పడానికి రచయిత స్వీకరించే ప్రక్రియ. మరో రకంగా చెప్పాలంటే పాఠకుల చేత ఓహోఅనో, అయ్యోఅనో, ఆహాఅనో అనిపించే రచన. రోజువారీ జరిగే సంఘటనలలోనే హృదయ విదారకంగా వుండేవి, హృదయాన్ని ఆహ్లాదపరిచేవి, ధైర్యాన్నిచ్చేవి, కోపాన్ని కలిగించేవి, నవ్వుపుట్టించేవి అనేకం ఉంటాయి. రైలు ప్రమాదంలో బోగీలోని వందమందీ మరణిస్తారు, ఓ మూడు నెలల పసిగుడ్డు తప్ప.

ఓ కరువు జిల్లాలో పనిచేసే తల్లులు, పసిపిల్లలు ఆకలికి ఏడ్వకుండా కల్లుసీసాకు పాలపీక పెట్టి తాగిస్తారు. బాంబుపేలుళ్ళ భయం ఉన్న ఢిల్లీలో లక్షరూపాయలున్న సూట్‌కేస్ మూడురోజులయినా సురక్షితంగా పబ్లిక్‌ప్లేస్‌లో ఉన్న సంఘటన- ఇటువంటి ఏకైక సంఘటన గురించే కాక, ధోరణుల గురించి,సంఘటనల పరంపర గురించి కూడా మానవీయకథనాలు చేయవచ్చు. మానవీయ కథనం రచనలో సృజనాత్మక అంశంముఖ్యం. ఆర్ద్రంగా కదిలించే విధంగా. హాస్యస్ఫోరకంగా మానవ అనుభూతులన్నిటినీ పలికించగల రచనా విధానం, శైలి అవసరమవుతాయి.

## ఇ) ధోరణుల విశ్లేషణ (Trend Story)

ఏక కాలంలో వ్యక్తులలోగానీ, సంస్థలలోగానీ, ప్రజల జీవితశైలిలోగానీ ప్రస్ఫుటంగా కనిపించే లక్షణాన్ని ధోరణి అంటాము. వార్తలు సంఘటనలను చెబుతాయికానీ ధోరణులను చెప్పవు. సింథెటిక్ వస్త్రాలకన్నా కాటన్ వస్త్రాల వాడకం భారతదేశంలో పెరుగుతున్నదని ఏ భారతీయ వాణిజ్య మండలుల సమాఖ్యోప్రకటన విడుదల చేస్తే తప్ప వార్తరాదు. ఆ వార్తకూడా కేవలం గణాంక వివరాలతో ఆర్థిక పరిభాషలో మాత్రమే ఉంటుంది. కాటన్ వస్త్రాల వాడకం పెరగడమనేది పత్తి రైతులకు, జౌళివ్యాపారులకు మాత్రమే సంబంధించినది కాదు. అది భారతీయుల. ముఖ్యంగా యువజనుల జీవనశైలిలో వస్తున్న ముఖ్యమైన మార్పు. ఆ మార్పును చిత్రించాలంటే అగ్గిపెట్టెలో పట్టే వస్త్రాలను చేసే భారతీయ నేత పనివారల చేతులునరికి మిల్లువస్త్రాలను బ్రిటిష్‌వారు భారతీయ మార్కెట్‌లో అమ్మడం దగ్గరనుంచి 1960 వ దశకంనుంచి టెర్లిన్, టెరికాట్, పాలియెస్టర్ క్రమంగా ఎలా ఆధునికతకు, హోదాకు సంకేతాలై ఎలా మార్కెట్‌ను ఆక్రమించిందీ చెప్పాలి. యువజనులను ఇంటర్వ్యూచేసి నేత వస్త్రాల గురించి వారి అభిప్రాయాలు రాయాలి. అలాగే కేబుల్ టీవీ విజృంభణ తరువాత ప్రజల అభిరుచులలో మార్పులు. అపార్ట్‌మెంట్ జీవితాల్లో ఇరుగు పొరుగు సంబంధాలు, ప్రభుత్వేతర సంస్థల్లో (స్వచ్ఛందసంస్థల్లో) క్రమంగా పెరుగుతున్న క్రియాశీలత, ఆక్వాకల్చర్ ప్రవేశం తరువాత కోస్తా గ్రామసీమల్లో ఆర్థికస్థితిగతులు- ఇటువంటి అంశాలన్నీ ధోరణులపై రాసే ప్రత్యేకవ్యాసాలకు పనికివస్తాయి. రాజకీయ, సామాజిక రంగాల్లో, జీవనశైలీ విధానాలలో కొత్తగా వస్తున్న ధోరణులను పసిగట్టే నేర్పు దీనికి ముఖ్యం. ధోరణులను విశ్లేషించడానికి రాజకీయ పరిచయం, సామాజిక విశ్లేషణాశక్తి అవసరమైన నైపుణ్యాలు.

## ఈ) నిశిత కథనం (In-depth Story)

ఏదైనా అంశం గురించిన సర్వసమగ్ర సమాచారాన్ని, విశ్లేషణనీ అందిస్తే అది నిశిత కథనం. వార్త అందించే సమాచారం కంటే, సాధారణ ప్రత్యేకవ్యాసం అందించే సమాచారం కంటే నిశితకథనం అందించే సమాచారం అధికం. ఇందులో పరిశోధన, దర్యాప్తు అధికంగా అవసరం. ఒక నాయకుడి అవినీతి భాగోతమైనా, ఒక సంస్థ లేదా ఒక మంత్రిత్వశాఖ అవకతవకలైనా ఈ రకం రచనలో వివరంగా రాయడం కుదురుతుంది. జాతీయ దృష్టిని ఆకర్షించిన హవాలా కుంభకోణం వంటి వ్యవహారాలపై పుర్వాపరాలను నిశిత కథనాలలోనే రాయవచ్చు. రాజకీయ అంశాలపైనే కాకుండా, సాంస్కృతిక సమాజసేవ రంగాలలోని వ్యక్తులగురించి, సంస్థల గురించీ నిశిత కథనాలు రాయవచ్చు. గాంధేయవాది, స్వాతంత్ర సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య జీవిత విశేషాలుకానీ, యువ సంగీత దర్శకుడు ఎ.ఆర్. రెహమాన్ అనతికాలంలో అగ్రస్థానానికి చేరుకున్న క్రమంకానీ, ఎక్కువ వడ్డీలను ఇవ్వజూపుతూ పెట్టుబడులను అహ్వానిస్తున్న 'నిధి' సంస్థల తీరుతెన్నులను గానీ సవివరంగా పాఠకులకు చెప్పాలంటే నిశిత కథనాలే సరైన వాహికలు.

## ఉ) నేపథ్య కథనాలు (Back grounders)

దీన్నే విశ్లేషణాత్మక కథనం అనికూడా అనవచ్చు. వర్తమానంలో ప్రాచుర్యంలోకి వచ్చిన ఒకవ్యక్తిగానీ, సంస్థకానీ. పద్ధతికానీ ఈ స్థితికి రావడానికికారణాలను వివరిస్తూ విశ్లేషించే ప్రక్రియ ఇది. వార్తలలో ఉన్న అంశాలకు అనుబంధాలుగా ఇవి పాఠకులను సమాచారం అందిస్తాయి. భూకంపం సంఘటన జరగగానే భూకంపాలు రావడానికి కారణాలను, గతంలో వచ్చిన పెద్దభూకంపాలకు పత్రికలు ఇటువంటి ప్రక్రియలోనే వివరిస్తాయి. ఒక ఉరిశిక్ష అమలు తరువాత ఉరిశిక్ష ఔచిత్యానౌచిత్యాల

BRAOU

గురించి, ఉరిశిక్షల చరిత్రగురించి పత్రికలు రాస్తుంటాయి. అది కూడా ఈ కోవలోదే. వ్యక్తిత్వ కథనాలు విశిష్టవ్యక్తుల వ్యక్తిగత,సామాజిక జీవిత విశేషాలను మాత్రమే వివరిస్తాయి. నేపథ్యకథనాలు వ్యక్తుల గురించేకాక, ప్రాచుర్యంలోకి వచ్చే ఈ అంశాలపైనా పాఠకులకు పూర్తి సమాచారాన్ని తాజా మదింపును అందజేస్తాయి.

బూదరాజు రాధాకృష్ణ రాసిన జర్నలిజం, అవగాహన- ఆచరణ (దక్షిణభారతజర్నలిస్టుల సమాఖ్య, మద్రాసు ప్రచురణ, 1995) లో ఆరు రకాల వార్తా వ్యాసాలను పేర్కొన్నారు.

1. పూర్వరంగం (Back ground)
2. అన్వేషణ (investigation), విచారణలు (Enquiries)
3. పలాయనవాదం (Escapism)
4. దీర్ఘ సూత్రత (Anticipation)
5. తక్షణ చరిత్ర (Instant History)
6. సేవ రూపకం (Service Type)

### 1. పూర్వరంగం (Back ground)

ఇందులో విశ్లేషణ (Analysis), వివరణ (Explanation), చర్చ (Discussion) ప్రధానం. ఒక ప్రత్యేక సంఘటన లేదా దుర్ఘటన జరిగినప్పుడు, ఆ ప్రత్యేక సంఘటనకు కారణాలు విశ్లేషించి, మూల కారణాలను అన్వేషించి, నివారణకు ఏమిచేయాలో చర్చిస్తూ రాసే వ్యాసం.

ఉదాహరణ

ఒక అపార్ట్‌మెంట్‌లో తాజాగా జరిగిన గృహిణిహత్య.ఆ హత్యకు కారణాలు చెప్పడం- ఇటీవల జరిగినటువంటి అ సంఘటనల మధ్యపోలికలు చూడడం. సాధారణంగా అపార్టమెంటుల్లో లోపించిన భద్రత గురించి చర్చించడం అపార్ట్‌మెంట్‌లో ఉండేవారు, శాంతి భద్రతల యంత్రాంగం పాటించవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన నివారణచర్యలు సూచించడం ఇదీ క్రమం.

### 2. అన్వేషణ (Investigation) విచారణ (enquiry)

లిఖితాధారలతో ఒక అవాంఛనీయ పరిస్థితిని (undersirable Situation) అందులోనూ అందరికీ తెలిసిన విషయాన్ని పరిశీలించి పరీక్షించి ప్రత్యేకవ్యాసం రాస్తే అది అన్వేషణాత్మకం.

ఉదాహరణ :

విద్యార్థులకు వసతిగృహాల కొరత, ఉపాధ్యాయులులేని పాఠశాలలు, నలుగురికీ తెలియని అంశాల్ని ప్రాతిపదికగ తీసుకొని ఖండన సాధ్యంకాని సాక్ష్యాధారాలతో సంచనలనాత్మకమైన నిరూపణలతో ఒక విషయాన్ని ప్రదర్శించే వ్యాసం. ఉదాహరణ : బోఫోర్స్ ముడుపులు.

### 3. పలాయన వాదం (Escapism)

సాహసకృత్యాలు, విహారయాత్రలు, సరసశృంగార వ్యవహారాలు, హాస్యోక్తులు చమత్కారాలు మొదలైనవి.

### 4. దీర్ఘసూత్రత (Anticipation)

ఒక అంశం పర్యవసానాలను ముందుగానే ఊహించి మంచి చెడులను చెప్పేరచన. సామాజిక అటవీ పథకాలకింద

BRAOU

యూకలిప్టస్ చెట్లను పెంచడం వల్ల భూసారం, జలవనరులు తగ్గిపోతాయని ఒకవాదం. దాని ఆధారంగా ఆ పథకం పర్యవసానాలను ఊహించి హెచ్చరించవచ్చు.

### 5. తక్షణ చరిత్ర (Instant History)

ప్రముఖులైనవారు ప్రసంగించిన విషయాల ఆధారంగా ప్రకటించిన అభిప్రాయాల ఆధారంగా రాసేవే ప్రత్యేక వ్యాసాలు. కాంగ్రెస్ అధ్వర్యంలో జాతీయ ప్రభుత్వం ఏర్పడాలని 1994లో జనతాదళ్‌నేత రామకృష్ణ హెగ్డే అన్నారు. దానిపై పత్రికలలో అనేక ప్రత్యేక వ్యాసాలు వచ్చాయి. సినీనటుడు రజనీకాంత్ 1995లో ఒక సభలో ప్రసంగిస్తూ తమిళనాడులో బాంబుల సంస్కృతి పెరిగిపోతున్నదని విమర్శించారు. ఆ మాటల ఆధారంగా రజనీకాంత్ రాజకీయ ఉద్దేశాల గురించి పత్రికల్లో అనేక వ్యాసాలు పరంపరగా వచ్చాయి (ఆ తరువాత 1996లో తమిళనాడులో జయలలిత ప్రభుత్వం పతనానికి రజనీకాంత్ చురుకుగా ప్రయత్నించి సఫలమయ్యారు).

### 6. సేవా రూపకం (Service Type)

సినిమాలు, క్రీడలు, నాటకాలు ఇతర సాహిత్య ప్రక్రియలు- ఈ రంగాలలో నిపుణులు అయినవారు రాసే విమర్శలు- ప్రతి విమర్శలు, అభిప్రాయాలు ఈ కోవలోకి వస్తాయి.

ఇవే కాకుండా రచనాంశం ఆధారంగా ప్రత్యేక వ్యాసాలను వర్గీకరించవచ్చు

1. రాజకీయ ప్రత్యేక వ్యాసాలు - రాజకీయ పరిణామాలను విశ్లేషించేవి
2. సామాజిక ప్రత్యేక వ్యాసాలు - సామాజిక ధోరణులను చర్చించేవి
3. వైజ్ఞానిక వ్యాసాలు - వివిధ శాస్త్రరంగాల సమస్యలను వివరించేవి
4. ఇతరాలు - పైమూడు రంగాలకు సంబంధించనివి.

BRAOU

**అభ్యాసం-2 : మానవీయ కథనం.**

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

## 7.5 వార్తా వ్యాసానికి, ప్రత్యేక వ్యాసానికి తేడా (Feature and Special Feature)

వార్తా వ్యాసాలు సార్వజనీన సాధరణ విషయాలపై రాసేవికాగా, ప్రత్యేక వ్యాసాలు ప్రత్యేక రంగాలపై అధికారంతో రాసే'నిపుణవ్యాసాలు'. విద్యారంగం, రక్షణరంగం, సాహిత్యం, కళలు, వైద్యం, వాణిజ్యం- ఈ రంగాలకు సంబంధించిన సాంకేతికతను పాటిస్తూ ఖచ్చితమైన రీతిలో శాస్త్రధోరణితో రాసే సవివర వ్యాసాలు. ప్రత్యేక వ్యాసాలు కూడా అందరూ చదవడానికి ఉద్దేశించిన జనరంజక వ్యాసాలే అయినప్పటికీ, విషయ ప్రత్యేకతల రీత్యా రచన ప్రత్యేకరీత్యా భిన్నమైనవి, విశిష్టమైనవి. ప్రత్యేక వ్యాసాల (Special Feature) గురించి మరో ఖండంలో తెలుసుకుంటాం.

## 7.6 వార్తా వ్యాసరచన - జాగ్రత్తలు

"వార్త పవిత్రమైనది, వ్యాఖ్యకు ఏ కట్టుబాట్లూ లేవు" (News is sacred, Comment is free) అన్నది పత్రికారంగ ప్రమాణాలలో అగ్రగణ్యమైనది. వార్తా రచనలో సొంతఅభిప్రాయాలు చొప్పించడం కూడని పని. వార్తా వ్యాసరచనలో అభిప్రాయ వ్యక్తీకరణ తప్పనిసరి. పాఠకులు సమాచారాన్నీ ఆశిస్తారు. వ్యాఖ్యా సహితమైన రచననూ కోరుకుంటారు. రెండిటినీ కలగలపకుండా వాటివాటి నిర్దిష్టస్థానాలలో వార్తలను, వాఖ్యలను అందించే పత్రికలను పాఠకులు గౌరవిస్తారు, ఆదరిస్తారు.

వార్తా వ్యాసకర్తలు తమ రచనలలో ప్రకటించిన అభిప్రాయాలను పాఠకులు యధాతధంగా ఆమోదిస్తారనుకోకూడదు. ఒకే అంశంమీద వివిధ పత్రికలలో వచ్చిన వార్తా వ్యాసాలను పోల్చిచూడండి. ఒకే అంశం మీద ఒకే పత్రికలో వేర్వేరు రచయితలు రాసినవార్తా వ్యాసాలను, కూడా పోల్చి చూడండి. ఆయా రచయితల అభిప్రాయాలు ఒకే రకంగా లేవనీ, ఒక్కో వ్యాసం ఒక్కో దృష్టికోణంలోనుంచి రాసినదనీ సులభంగా అర్థమవుతుంది. నడుస్తున్న విషయాల మీద ఆలోచనా పరుల అభిప్రాయాలన్నీ ఒకేరకంగా ఉండవు. సగం వరకు నీరున్న గ్లాసును చూసి ఒకరు సగం నిండుగా ఉన్నదని అంటే, మరొకరు సగం ఖాళీగా ఉన్నదని అనవచ్చు. ఒక రకమైన గణాంకవివరాలను, సమాచారాన్ని ఉటంకిస్తూ కూడా వేర్వేరు అభిప్రాయాలను ప్రకటించే రచనలు వస్తాయి. ఈ రకమైన వైవిధ్యం పాఠకులను గందరగోళ పరచదా? అన్న అనుమానం రావచ్చు. ఒక ప్రమాదంలో పందమంది మరణించారని ఒక పత్రిక రాసి, పదిమందే మరణించారని మరోపత్రిక రాస్తే పాఠకులలో గందరగోళం ఏర్పడుతుంది. ఎందుకంటే ప్రమాదం గురించి తెలియజేప్పేది వార్తకనుక. ప్రత్యేక వ్యాసాల విషయంలో పాఠకులు వేరేవైఖరి తీసుకుంటారు. ప్రత్యేక  వ్యాసానికి రచయిత ఉంటారు కాబట్టి, అందులోని అభిప్రాయాలు ఆ రచయితవి అన్న స్పృహ పాఠకునికి ఉంటుంది. ఆ రచయిత ప్రత్యేక వ్యాసంలో విషయాన్ని చర్చించిన పద్ధతి, వ్యక్తం చేసే అభిప్రాయాలు, చూపించిన పరిష్కారాలు తనకు ఆమోదయోగ్యంగా ఉన్నంతమేరకు పాఠకుడు స్వీకరిస్తాడు. సమర్థుడైన రచయిత అయితే పాఠకుడు తనపూర్వ అభిప్రాయాలను వదులుకుంటాడు కూడా.

ఉదాహరణకు మళ్ళీ కాశ్మీర్ సమస్యనే తీసుకుంటే- ఇప్పుడు ఆ సమస్యపై అన్ని పత్రికల్లోనూ తరచుగా వ్యాసాలు వస్తున్నాయి. అక్కడ శాంతిస్థాపన కోసం సామరస్య పూర్వకమైన చర్యలు తీసుకోవాలని కొందరు, తీవ్ర చర్యలు తీసుకోవాలని మరికొందరు ప్రత్యేక వ్యాసాల్లో సూచించడం చూస్తుంటాం. అలాగే, కేంద్రప్రభుత్వం 1990 దశకం ప్రారంభంలో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానాల గురించి వచ్చే వ్యాసాలు. ఆ విధానాలు దేశానికెంతో మేలు చేశాయని, దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేశాయని కొందరు రాస్తుంటే అవి చెరుపు చేస్తున్నాయని మరికొందరు వాదిస్తున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలలో పత్రికారంగం ఒకటి అని అందరూ అంగీకరిస్తున్నారు. ప్రాథమిక హక్కులలో ఒకటయిన భావప్రకటనా స్వేచ్ఛను నెరవేర్చే అతి ప్రధానమైన వేదిక పత్రికారంగం. భిన్నమైన ఆలోచనలకు ఆస్కారం లేనప్పుడు భావప్రకటనా స్వేచ్ఛకు అర్థంలేదు. పత్రికలలో వెలువడే వార్తా వ్యాసాలు ఈ ప్రజాస్వామిక కర్తవ్యాన్ని నెరవేర్చే ప్రధాన సాధనాలు- వార్తావ్యాసాలు రాయగోరే రచయితలకు భావప్రకటనా స్వేచ్ఛకుసంబంధించిన ఈ స్ఫూర్తి ఉండడం అవసరం. తనదంటూ ప్రత్యేక అభిప్రాయాలను వ్యక్తం చేయకుండా, ఇతరుల అభిప్రాయాలను పూసగుచ్చినట్టు ఉటంకించడం, సమాచారాన్ని కుమ్మరించడం మంచి వ్యాసకర్త లక్షణాలుకావు.

నడుస్తున్న విషయాలమీద వ్యాఖ్యా సహితంగా వార్తా వ్యాసరచన చేయడంసులువైన పనికాదు. రాజకీయ, సామాజికాది రంగాలలో వర్తమానంలో సంభవిస్తున్న పరిణామాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండడమేకాదు. ఆ పరిణామాల మూలాలగురించి పరిజ్ఞానం ఉండాలి. పర్యవసానాలను అంచనా వేయగలిగిన నేర్పు ఉండాలి. గతానికీ భవిష్యత్తుకూ వర్తమానం ద్వారా లంకె కుదిర్చినప్పుడు మాత్రమే సమస్య గురించిన స్పష్టత ఏర్పడుతుంది. ఇక్కడ ప్రత్యేక వ్యాసకర్తకు రెండు అంశాలను పసిగట్టే నేర్పుండాలి.

BRAOU

1. సాదృశ్యం లేదా పోలిక

2. బేధం లేదా తేడా

పైరెండు ఎంత త్వరగా, ఎంత ప్రతిభావంతంగా స్ఫురిస్తే వార్తా వ్యాసం రచన అంతగా సులువవుతుంది. పి.వి. నరసింహారావు ప్రధానమంత్రి అయిన వెంటనే 1991లో రూపాయి విలువను మూడు మార్లు తగ్గించారు. అది ఎన్నో పర్యవసానాలున్న చర్య. ఆ అంశంపై వార్తావ్యాసం రాయదలచుకున్న రచయితకు 1960 దశకం మధ్యలోకూడా రూపాయి విలువ తగ్గింపు జరిగిందనీ, రెండింటి పరిస్థితులకు పోలికలున్నాయనీ స్ఫురించాలి. అయితే 1960 దశకంలో భారతప్రభుత్వం నియంత్రిత ఆర్థిక విధానాలనే కొనసాగించదలచుకున్నదనీ, 1990లలో కొత్త విధానాల అమలుకు అరంభం జరిగిందనీ రెంటికి మధ్య బేదంవుందని గుర్తించాలి. వార్తా వ్యాసరచనకు సంబంధించిన ఈ కీలకమైన దృష్టి వుంటే అదనపు సమాచారం ఏమికావాలో, వ్యాసాన్ని రచయిత దృష్టికోణంనుంచి ఎలా నిర్మించాలో సులువుగా బోధపడుతుంది. 1980నుంచి భారతప్రభుత్వ ఆర్థికవిధానాలలో క్రమంగావస్తున్న మార్పులు, 1985 తర్వాత వి.పి.సింగ్ ఆర్థిక మంత్రిగా ఉండగా మొదలైన సరళీకరణ సోవియట్ యూనియన్ పతనం, గల్ఫ్‌యుద్ధం, భారతదేశ ఖజానాలో విదేశీమారకం నిండుకోవడం, విదేశీరుణాలు చెల్లించలేని స్థితి రావడం ఈ క్రమపరిణామాలన్నీ నూతన ఆర్థిక విధానాల నేపథ్యంగా అందరూ అంగీకరిస్తారు. ఈ పరిణామాలకు సంబంధించిన సమాచారంలో నడుస్తున్న విషయంమీద మంచి పరిశీలనాత్మక రచన చేయవచ్చు.

అలాగే, 1996 ఎన్నికల సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ఓటర్ల ఓటింగ్ సరళిగురించి ప్రత్యేకవ్యాసం రాయదలచుకున్న వారికి ఏ ఎన్నికల్లో ఏ పార్టీకి ఎన్నిస్థానాలు వచ్చాయి అన్న సమాచారం మాత్రం తెలిస్తే చాలదు. 1980 ఎన్నికలు మినహాయిస్తే 1977నుంచి జరిగిన అన్ని పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆంధ్రఓటర్లు దేశంలోని తక్కిన ప్రాంతాలకు భిన్నంగా ఓటు చేశారని తెలియాలి. 1983 తరువాత ఆంధ్రప్రదేశ్ ఓటర్లు లోక్‌సభ ఎన్నికలు అయినా, శాసనసభ ఎన్నికలు అయినా ప్రాంతీయ ప్రాధాన్యాలపైనే అధికంగా స్పందిస్తున్నారన్న విశ్లేషణతో పరిచయం ఉండాలి. ఆంధ్రరాజకీయాల ఇటీవలి పరిణామాల నేపథ్యంలో 96 లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ సరళి ఎలా ఉండవచ్చునో చర్చించాలి. అంటే, గతంలోని లోక్‌సభ ఎన్నికల్లో ఆంధ్రోటర్ల ఓటింగ్ సరళిని తులనాత్మకంగా చూసి ఒక సూత్రీకరణ చేయడం, 1996 నాటి పరిస్థితిలో మునుపటి ఎన్నికల పరిస్థితులకున్న పోలికలను తేడాలను చూడడం విశ్లేషణకు అవసరమైన సాధనాలు.

పోల్చిచూడడం అనేది వేర్వేరు కాలాలలో జరిగిన ఒకేరకమైన సంఘటనల్లో, సందర్భాల్లో కానక్కరలేదు. ఒకే కాలంలో వేర్వేరు ప్రదేశాల్లో జరిగే ఒకేరకమైన సంఘటనో సందర్భమో కూడా కావచ్చు. ఎన్నికల ఫలితాలు, రూపాయి విలువ తగ్గింపు వంటివి వేర్వేరు కాలాల్లో జరిగే ఒకేరకమైన సంఘటనలకు ఉదాహరణలు 1985లోభోపాల్‌లో యూనియన్‌కార్బైడ్‌లో 'మిక్' గ్యాస్‌లీక్ సంఘటన జరిగినప్పుడు- పారిశ్రామిక ప్రమాదాల గురించి బహుళజాతి సంస్థలు వర్ధమాన దేశాల్లో ఫ్యాక్టరీల భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం గురించి అసలు పెస్టిసైడ్స్ (క్రిమిసంహారకాలు) ఫ్యాక్టరీలు మనకు అవసరమా? వంటి అంశాలతో ఎన్నో వ్యాసాలు వాచ్చాయి.

BRAOU

### వార్తా వ్యాసాల రచన

వార్తా వ్యాసాల రచనకు కఠినమైన నియమాలు లేవు. కానీ, మంచి ఫీచర్ రైటర్ కాగోరేవారు పాటించవలసిన కొన్ని పద్ధతులున్నాయి. వ్యాసకర్త మొదట చేయవలసిన పని వ్యాసంలో చర్చించబోయే విషయాన్ని ఎంచుకోవడం. విషయాన్ని ఎంచుకోవడంలో ఏమాత్రం అస్పష్టత, ఊగిసలాట ఉన్నా వ్యాసం గందరగోళం గానూ, గజిబిజిగానూ తయారవుతుంది. విషయం ఎంపికతరువాత దానికి సంబంధించిన పుర్వాపరాలను సేకరించాలి. వివరాలను సేకరించకముందే విషయానికి సంబంధించి ఒక నిర్ధారణకు రావడం, అశాస్త్రీయమని కొందరు భావిస్తారు. అర్ధపరిజ్ఞానంతో ఏ అంశంపైన అయిన తొందరపడి నిర్ధారణలు చేయడం పొరపాటే. అయితే, సమాచారాన్ని ఏదిశగా అన్వేషించాలి. ఏరకమైన సమాచారాన్ని పొందాలి అన్న

అవగాహనలేకపోతే వ్యాసం ముందుకు సాగదు. కాబట్టి, రాయదలచుకున్న విషయంపై ఓ తాత్కాలిక నిర్ధారణతో అన్వేషణ ప్రారంభించి, లభ్యమైన సమాచారానికి అనుగుణంగా ఆ నిర్ధారణలను సవరించుకుని, తుదినిర్ధారణలు చేయడం శాస్త్రీయం. ప్రత్యేకమైన అంశానికి సంబంధించి వీలైనంత సమాచారాన్ని గణాంకాలను సేకరించిగానీ వ్యాసరచనకు ఉపక్రమించకూడదు.

వ్యాసరూపకల్పనలో ముఖ్యమైన దశ సేకరించిన వివరాలను ఒక క్రమంలో అమర్చుకోవడం. ఏవివరానికి మంచి ప్రాధాన్యం ఇవ్వాలి, ఏది ముందు చెప్పాలి, ఏది తరువాత చెప్పాలి అన్నదానిపై అవగాహన ఏర్పడితే వ్యాసరూపం సగం పూర్తయినట్లే.

### వార్తా వ్యాసం ఎత్తుగడ

ఇది వ్యాసానికి మకుటంలాంటిది. పాఠకుడు అందమైన, అర్థవంతమైన ప్రారంభంకోసం వెతుకుతాడు. ప్రారంభం పేలవంగా ఉండి తరువాత ఎంత ప్రయోజనకరమైన విషయాన్ని వ్యాసంలో పొందుపరిచినప్పటికీ పాఠకులు చదవకపోవచ్చు. ఎత్తుగడ వ్యాసంమొత్తాన్ని పరీక్షకు నిలబెడుతుంది. వేగవంతమై పోతున్న ఆధునిక జీవితంలో ప్రతి విషయాన్ని చదివే ఓపిక, సమయమూ పాఠకులకు ఉండదుకాబట్టి, వారు వ్యాసం ప్రారంభాన్ని చదివి మొత్తం చదవాలో లేదో నిర్ణయించుకుంటారు.

అయితే వ్యాసాన్ని ఎలా ప్రారంభించాలి? ఏదైనా నిర్దిష్ట విధానమొకటి ఉన్నదా? అన్న ప్రశ్నలు తలెత్తకమానవు. నిజానికి ప్రతి వ్యాసానికి ప్రారంభంలో ఏమి వుండాలో, ఎలా వుండాలో విషయానికి అనుగుణంగా నిర్ణయించుకోవలసిన బాధ్యత వ్యాసకర్తదే. ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతిలో వ్యాసాన్ని ప్రారంభిస్తుంటారు. విషయాన్ని మొదట్లోనే స్పష్టపరిచే విధంగా ఒక పరిచయవాక్యంతో వ్యాసాన్ని ప్రారంభించడం మంచి పద్ధతి. చెప్పదలచుకున్న విషయానికి సంబంధించి బాగా ప్రచారంలో ఉన్న (వ్యవహారంలోకానీ సాహిత్యంలోకానీ) ఒక నానుడినుంచి కానీ, ఒక ప్రముఖుడి ఉల్లేఖనలలోకానీ, లేదా వ్యాసకర్త సొంత అభిప్రాయలతో నిర్ధారణలతో కానీ ప్రారంభించవచ్చు.

### వ్యాసగర్భం

పాఠకుడు ఈ భాగానికి వచ్చేసరికి వ్యాసకర్త చెప్పదలచుకున్న విషయంపై కనీస అవగహనకు రావాలి. ఈ భాగమే వ్యాసానికి అత్యంత ప్రధానమైనది. సేకరించిన వివరాలను అర్థవంతంగా పొందుపరుస్తూ ఈ భాగం సాగుతుంది. పేరాగ్రాపుల మధ్య సమన్వయం లేదా నిర్మాణంలో స్పష్టత ఉండేలా చూచుకోవాలి. వ్యాసం ఉద్దేశాలను, లక్ష్యాలను ఈ భాగంలోనే పొందుపరచడానికి వ్యాసకర్త ప్రయత్నించాలి. వ్యాసం గతి (Pace) ఒక క్రమంలో లేకపోతే పాఠకుడికి చిరాకు కలుగుతుంది. సీరియస్‌గా ఒక విషయాన్ని చర్చిస్తున్నప్పుడు సీరియస్ వాక్యాలు, అభిప్రాయలు వ్యాసానికి అందాన్నివ్వవు. అదే విధంగా వ్యాస ప్రవంతి (Flow)ని భంగపరిచే అనవసర సమాచారాన్ని నివారించాలి. అన్నింటికంటే ముఖ్యం వ్యాసం ఆరంభంలో చెప్పిన అభిప్రాయాలకు విరుద్ధమైన, వ్యతిరేకమైన అభిప్రాయాలను ప్రకటించకూడదు. అలా ప్రకటిస్తే పాఠకుడిలో గందరగోళం ఏర్పడుతుంది. వివిధ అభిప్రాయాలను ప్రస్తావించడంవేరు, రచయితే భిన్నాభిప్రాయాలను చెప్పడంవేరు.

### సంహారం

వార్తా వ్యాసానికి ప్రారంభం ఎంత ప్రధానమో ముగింపు కూడా అంతే ముఖ్యమైనది. వ్యాస సారాంశాన్ని ఒకటిరెండు వాక్యాల్లో సమీక్షించి, ప్రతిపాదనలను సూచనలను, నిర్ధారణను సూక్ష్మంగా చెప్పడం మంచి ముగింపు అవుతుంది. ప్రారంభంవలె ముగింపులో కూడా ఒక ప్రముఖుడి ఉల్లేఖనో, సాహిత్యం నుంచి ఉటంకింపోఉంటే సంపూర్ణత సిద్ధిస్తుంది.

వ్యాస నిర్మాణంలో ప్రారంభం, గర్భం, ఉపసంహారం వంటి నియమాలను పాటిస్తే అందంగా రూపు దిద్దుకుంటాయి. వ్యాసనిర్మాణంలో మరో ముఖ్యమైన అంశం భాషశైలి. చెప్పదలచుకున్న విషయాన్ని విడమర్చి చెప్పే సులభమైన, సరళమైన

భాషను వ్యాసకర్త ఉపయోగించాలి. సాంకేతిక పదాలను సాధ్యమైనంత తక్కువగా ప్రయోగించాలి. సీరియస్‌నెస్ దెబ్బతినకుండానే సాధారణ భాషను వాడడాన్ని అభ్యసించాలి. భాషను అతితేలికగా వాడితే ఒక్కోసారి విషయసాధికారతపై పాఠకులకు అనుమానం వస్తుంది. పెద్దపెద్ద సమాసాలతో, అలంకారికశైలితో కూడినభాష పాఠకులకు చిరాకును కలిగిస్తుంది. వ్యాస ప్రయోజనాన్ని దెబ్బతీస్తుంది. వార్తా వ్యాసంలో విషయం పాఠకులకు కమ్యూనికేట్ కావడమే ముఖ్యం తప్ప వ్యాసకర్త భాషాపాండిత్య ప్రకర్ష వ్యక్తం కావడంకాదని గుర్తుంచుకోవాలి.

ఎంచుకున్న విషయాన్ని బట్టే వ్యాసరచన శైలి సగం నిర్ణయమయిపోతుంది. వ్యాసంలో ఏం చెబుతున్నాం? అన్న దానికంటె ఎలా చెబుతున్నాం అన్నది ముఖ్యమయ్యే సందర్భాలు కొన్ని ఉంటాయి. చెప్పె పద్ధతినే శైలి అనుకుంటే, వ్యాసం పరిజ్ఞానాన్ని అందిస్తున్నదా, ఆహ్లాదానికి ఉద్దేశించినదా అన్నదాన్నిబట్టి శైలిని నిర్ణయించుకోవాలి. పర్యావరణ సమస్య గురించి సరదాశైలిలో రాస్తే ఏలావుంటుంది? రైలుప్రమాదాలపై ప్రత్యేకవ్యాసాన్ని జోకులతో నింపితే ఎలా వుంటుంది? మంచి శైలి సాధించడానికి దగ్గరదారులులేవు. చేయి తిరిగిన వ్యాసకర్తల వ్యాసాలను శైలిదృష్టితో చదువుతూ ఉండడం. సాహిత్యంలో అభిరుచి వుండడం మంచిశైలికి తోడ్పడతాయి.

శైలిలో రెండు ధోరణలును మనం గుర్తించవచ్చు. వ్యాసకర్త ఉత్తమపురుష (నేను)లో తన అనుభవంలోంచి వివరిస్తునట్టు చెప్పడం ఒక పద్ధతి. ప్రముఖులైన వ్యాసకర్తలకు ఇది శోభిస్తుంది. వ్యాసంలో వ్యాసకర్త తెరవెనుకుండి తటస్థంగా వ్యాఖ్యానించే పద్ధతి రెండవది. ఇది అందిరికీ అనువైన పద్ధతి. ఇది పాఠకులకు వ్యాసంపై నమ్మకం కలిగిస్తుంది. చెప్పే విషయం మీద సాధికారికత ధ్వనించే విధంగా ప్రత్యేకవ్యాసాన్ని నిర్వహించగలిగితే అది ఉత్తమశైలి అవుతుంది.

**అభ్యాసం-3. 1. వ్యాసంలో వుండే భాగాలేవి?**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

**2. ఉపసంహారం ప్రాధన్యత ఏమిటి?**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

## 7.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

- ★ పత్రికలలో వ్యాఖ్యల విభాగంలోకి వచ్చేవి వార్తావ్యాసాలు.
- ★ విశ్లేషణను, వినోదాన్ని, అహ్లాదాన్నీ పరిజ్ఞానాన్నీ ప్రత్యేక వ్యాసాలు అందిస్తాయి.
- ★ రచన సంవిధానం రీత్యా విషయం రీత్యా, వార్తా వ్యాసాలుఅనేకరకాలు.



BRAOU

★ ప్రత్యేకవ్యాసం నిర్వహణకు కొన్ని సూత్రలున్నాయి. విషయ సూచన, విషయచర్చ, విషయ సూక్ష్మీకరణ, నిర్ధారణ వ్యాసనిర్మాణంలో ఆదర్శమైన పద్ధతి.

★ వార్తా వ్యాసానికి అనుగుణంగా ఉండే భాషాశైలి అనుసరించాలి.

## 7.8. మాదిరి పరీక్ష ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వార్తా వ్యాసాల రకాల గురించి వివరంగా తెలపండి?
2. వార్తా వ్యాసానికి, ప్రధాన వ్యాసానికి గల తేడాలను వివరించండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వార్తకు, వ్యాసానికి గల తేడాలేమిటి?
2. పూర్వరంగ వ్యాసం.

**- కె. శ్రీనివాస్**

BRAOU

# భాగం - 8 ః శాస్త్ర విజ్ఞాన విషయాలు రాయడం

## విషయక్రమం


8.0 ఉద్దేశం

8.1 ప్రవేశిక

8.2 విజ్ఞాన శాస్త్ర విషయాల ప్రచారం, ప్రాముఖ్యత

8.3 శాస్త్ర విజ్ఞాన రచనలకు ఉండవలసిన లక్షణాలు

- 8.3.1 అవగాహన, అనుభవం
- 8.3.2 పాఠకులు - వారి స్థాయి
- 8.3.3 సాంకేతిక పదజాలం, సరళత
- 8.3.4 తాజా పరిణామాలు, నిపుణుల సలహాలు
- 8.3.5 క్లుప్తత
- 8.3.6 ప్రమాణ సిద్ధత
- 8.3.7 గణాంకాలు, చిత్రపటాలు
- 8.3.8 యదార్థ విషయలే గానీ అభిప్రాయాలు కాదు

8.4 శాస్త్ర విజ్ఞాన విషయాల రచన ... నిర్మాణం

- 8.4.1 రచన-ప్రణాళిక
- 8.4.2 రచనాంశాలు - వాటి నిర్వహణ
- 8.4.3 రచన-ముగింపు
- 8.4.4 రచనా విధానం-కొన్ని సూచనలు

8.5 శాస్త్ర విజ్ఞాన విషయ రచనలు-వాటి రూపాలు

8.6 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

8.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 8.0 ఉద్దేశం

విజ్ఞాన శాస్త్ర విషయాలకు సంబంధించిన అంశంలపై రాయడానికి ఆయా విషయాలపై పూర్తి అవగాహనతో పాటు రచనా విధానపు మెలకువలు కూడా అభ్యసించవలసి వుంటుంది. ఇటీవల కాలంలో ఈ అంశం విశేష ప్రాముఖ్యం సంతరించుకుంది. ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- శాస్త్ర విజ్ఞాన విషయాల ప్రాముఖ్యత.
- రచనలు చేయడానికి ప్రణాళిక రూపకల్పన.
- రచనలు చేయడానికి కావలసిన మెలకువలు.
- శాస్త్ర విజ్ఞాన విషయాల రచనల లక్షణాలు, నిర్మాణ నిర్వహణ విధానం.
- శాస్త్ర విజ్ఞాన విషయ రచనలు - వాటి రూపాల గురించి తెలుసుకుంటారు.

## 8.1 ప్రవేశిక

విజ్ఞాన శాస్త్ర విషయాలపై రాయడం మన దేశంలో అంతగా అభివృద్ధి చెందలేదు. కేవలం కొంతమంది శాస్త్రజ్ఞులు లేదా ఆయా విషయాలలో నిపుణులు మాత్రమే ఈ రంగానికి వస్తున్నారు. వీరు రాసింది విషయాలకి సంబంధించి ఎంతో పటిష్టంగా వున్నప్పటికి, సామాన్య పాఠకులు చదవడానికి అనువుగా వుండటం లేదనే అభిప్రాయముంది.

ఇటీవల కాలంలో ప్రజలలో విజ్ఞాన శాస్త్ర విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం పెరగడం, పత్రికలలో ప్రత్యేక వ్యాసాలు రావడం, విజ్ఞాన శాస్త్రాన్ని ప్రజల వద్దకు తీసుకొని పోవడం వల్ల ఈ రచనలకు ప్రాముఖ్యం పెరిగింది.

మానవ విజ్ఞానంలో శాస్త్ర, సాంకేతిక శాస్త్రాలు అధిక భాగాన్ని ఆక్రమించడమే కాక వివిధ రీతులలో మనకు గోచరిస్తూ వుంటాయి. ప్రజలలో చదివి, అర్థం చేసుకోవాలనే కోరిక పెరిగడం వలన శాస్త్ర విషయాలపై రచనలు చేయడం, ప్రచురించడం గురించి అభ్యసించి వృత్తిగా స్వీకరించేందుకు అవకాశాలు ఎన్నో వస్తున్నాయి.

## 8.2 విజ్ఞాన శాస్త్ర విషయాల ప్రచారం - ప్రాముఖ్యత

అణుబాంబు ప్రయోగం తరువాత ప్రజలలో శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తి మొదలైందని చెప్పవచ్చు. దైనందిన జీవితంలో విజ్ఞాన శాస్త్ర ప్రభావం పెరగడం వలన, ఉపయుక్తమగు విజ్ఞాన శాస్త్ర విషయాల పట్ల మనిషి కుతూహలం, అవగాహన పెంచుకొన్నాడు. ఇటీవలి కాలంలో శాస్త్రీయ విషయాలు రాజకీయలతోనూ, ప్రభుత్వ విధానాలతోనూ ముడిపడి వుండడం వలన ప్రభుత్వాలే విజ్ఞాన శాస్త్ర విషయాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రచారానికి చేయూతనిస్తున్నాయి.

విజ్ఞాన శాస్త్ర విషయాలు ఎందుకు వ్యాప్తి చేయాలి? అనే ప్రశ్న వస్తే ఈ కింది విషయాలు మనం గమనించాలి.

- ★ విజ్ఞాన శాస్త్రం ప్రజల సంస్కృతితోనూ, కళలతోనూ, సాహిత్యంతోనూ, ముడిపడి వుంది.
- ★ విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు అవసరమైన ఆర్థిక వనరులు ప్రభుత్వం నుండి పొందాలంటే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వాటి ప్రాముఖ్యత వివరించాలి.
- ★ ప్రజాధనం వృధా అవుతున్నట్లు ప్రజలు భావించకుండా వుండాలంటే విజ్ఞాన శాస్త్ర పరిశోధనా వివరాలను, విజయాలను ప్రచారం చేయాలి.
- ★ ప్రజలకున్న మూఢ విశ్వాసాలను తొలగించి, శాస్త్రీయ దృక్పథం అలవరచుకునేందుకు, మానవ సంక్షేమానికి, అభివృద్ధికి తోడ్పడేందుకు విజ్ఞాన శాస్త్ర విషయాలను ప్రచారం చేసేందుకు ఐక్యరాజ్యసమితి "కళింగ ప్రైజు"ను నెలకొల్పింది. దీని ముఖ్య ఉద్దేశ్యాలు.

  (i) పాఠశాలలో బోధించని, బోధించలేకపోయిన శాస్త్ర విషయాలు తెలియ చెప్పడం;

  (ii) ప్రజలలో (విద్యావంతులలో) కొత్త విషయాల పట్ల కుతూహలాన్ని పెంచి, పరిశోధనలు చేపట్టేలా చేయడం;

  (iii) విజ్ఞాన శాస్త్ర, సృజనాత్మక విషయాల పట్ల ప్రజలలో అవగాహన పెంచడం

  (iv) ఒక శాస్త్ర శాఖలోని పరిశోధకునికి మరో శాస్త్ర శాఖలో జరిగే పరిశోధనలను తెలియపరచి, వీలైతే ఆ పరిశోధనల మధ్య 'వారధి' ఏర్పరచడం.

విజ్ఞాన శాస్త్ర విషయాలపై రచనలు చేయడానికి అర్హులైన రచయితలు కావాలి. ఆ రచయితలకు విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానంతో పాటు నూతన పోకడలు, పరిశోధనల పట్ల అవగాహన అవసరం.

BRAOU

విజ్ఞాన శాస్త్ర రచనలు కేవలం అంతరిక్ష ప్రయోగాలు, అణుశక్తి, మారణాయుధాలు, కృత్రిమ జన్యువుల వంటి అధునాతన విషయాలే కానక్కరలేదు. మానవ జీవితాన్ని ప్రభావితం చేసే ఏ విజ్ఞాన శాస్త్ర విషయమైనా కావచ్చు. ఉదాహరణకు ఆరోగ్యం, వాతావరణం, వ్యవసాయం, జంతువులు, వృక్షాలు మొదలైన ఏ విషయాలపైన అయినా రాయవచ్చు.

**అభ్యాసం-1: విజ్ఞాన శాస్త్ర విషయాలను ప్రచారం చేయుటలో UN యొక్క "కళింగప్రైజు" ఉద్దేశాలను తెల్పుము.**

.................................................................................................................................................

.................................................................................................................................................

.................................................................................................................................................

.................................................................................................................................................

.................................................................................................................................................

## 8.3 శాస్త్ర విజ్ఞాన రచనలకు ఉండవలసిన లక్షణాలు

శాస్త్ర, విజ్ఞాన రచనలు చేసేప్పుడు ఈ కింది లక్షణాలను దృష్టిలో ఉంచుకోవాలి.

### 8.3.1 అవగాహన - అనుభవం

విజ్ఞాన శాస్త్ర విషయాలకు సంబంధించిన అంశాలపై రాయడానికి ఆ విషయాలపై పూర్తి అవగాహన అవసరం. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల్లో డిగ్రీ వుంటే చాలా ఉపయోగం. వీటిన్నింటి కంటే ముందు విషయాన్ని, నిర్దుష్టంగా ఖచ్చితంగా చెప్పగలగాలి.

BRAOU

### 8.3.2 పాఠకులు - వారి స్థాయి

శాస్త్ర విజ్ఞాన రచనలు సాధారణ పత్రికలకు, సులభ విజ్ఞాన శాస్త్ర పత్రికలకు గానీ గ్రంథాలకు గానీ రాయునపుడు వాటి పాఠకుల స్థాయిని (layman) దృష్టిలో వుంచుకోవాలి. సామాన్య పాఠకుడు ప్రతి విషయం తనకు తెలిసిన విధంగా తనదైన భాషలో తనకు అర్థమయ్యే రీతిలో వివరించాలని కోరుకుంటాడు. అందువల్ల రచయిత తాను "ఎవరి కొరకు రాస్తున్నాడో "ముందుగా తెలుసుకోవాలి. "ఎవరి కొరకు తను రాస్తున్నాను?" అని ప్రశ్నించుకోవాలి. అవే రచనలు విషయ నిపుణులకు గానీ, ఆ విషయంపై పరిజ్ఞానం ఉన్నవారి కొరకు గానీ రాయునపుడు ప్రతి విషయం విపులంగా వివరించేందుకు శ్రమపడనవసరం లేదు. రచయితకు ముందుగా పాఠకులెవరో తెలియడం వలన అందుకు తగిన విధంగా రచనలు చేయడం సులువవుతుంది.

### 8.3.3 సాంకేతిక పదజాలం - సరళత

సాంకేతిక నిపుణుల కోసం, శాస్త్ర పరిజ్ఞానం కలవారి కోసం, రచనలు చేసినప్పుడు సాంకేతిక పదజాలం వాడినా పాఠకులు ఇబ్బంది పడరు. ఎందుకంటే ఆ పదజాలంతో వారికి పరిచయం వుంటుంది గనుక. కానీ సామాన్య పాఠకుల కొరకైతే సాంకేతిక పదజాలం వాడడం సరికాదు. ఎందుకంటే అది వారికి అర్థం కాదు. సాంకేతిక పదాలు వచ్చినపుడు ప్రతి పదాన్ని నిర్వచించి సరళంగా అర్థమగు రీతిలో వివరించాలి. సాధారణ పాఠకునికి సాంకేతిక పదాల అర్థం తెలిసే అవకాశం లేదు కదా! అందువలన వాటిని వివరించ వలసి వుంటుంది. మంచి రచన అంటే సరళమైన రచన మాత్రమే. దీని వలన రచయిత ఏమి చెబుతున్నాడోనని పాఠకుడు అయోమయానికి గురిఅయ్యే ప్రమాదం వుండదు. శైలి సరళంగా ఉండాలి.

### 8.3.4 తాజా పరిణామాలు - నిపుణుల సలహాలు

శాస్త్ర విజ్ఞాన విషయాలపై రచనలు చేసే రచయితలకు మొదట కావలసింది. ఆ విషయంపై సరైన పరిజ్ఞానం.

విషయంపై ఏ విధమైన పరిజ్ఞానం లేనివారు విజ్ఞాన శాస్త్ర రచనలకు ఏ విధంగానూ న్యాయం చేకూర్చలేరు. విషయ పరిజ్ఞానం లేకపోవడం కొన్ని సందర్భాల్లో ప్రమాదకరం కూడా.

విజ్ఞాన శాస్త్రం అనంతమైంది. దీనిలోని ఏ విభాగంలోనూ సంపూర్ణ జ్ఞానం సంపాదించడం, ఒక జీవిత కాలంలో సాధమయ్యేది కాదు. ఇటువంటి పరిస్థితులలో రచయితలు, వ్యాసాలకు సంబంధించిన ప్రముఖమైన పుస్తకాలను తమ సొంత గ్రంథాలయంలో సమకూర్చుకోవాడం ఎంతో మంచిది. ఇవి రెఫరెన్సుకు ఉపయోగపడతాయి. విశ్వ విద్యాలయ కళాశాల లేదా విద్యా సంస్థల గ్రంథాలయాలలో తాజా ప్రచురణలు విషయ పత్రికలను సంప్రదించడం ద్వారా తాజా పరిణామాలను తెలుసుకొని, జ్ఞానం ప్రత్యగ్ర (update) పరచుకోవచ్చు. శాస్త్రజ్ఞులతో, సాంకేతిక నిపుణులతో చర్చలు జరపడం, సాన్నిహిత్యాన్ని పెంచుకోవడం ద్వారా కూడా తాజా పరిణామాలు తెలుస్తాయి. రచనలను విషయ నిపుణులచే పరిశీలింప చేయవచ్చు. నిపుణుల సలహాలు జ్ఞాన వికాసానికి దోహదపడతాయి.

అయితే దిన పత్రికలకు రాసే సాధారణ శాస్త్ర విజ్ఞాన రచనలకు ప్రముఖ నిపుణుల అవసరం అంత ఉండకపోవచ్చు. అవసరమైనట్టయితే క్లిష్టమైన శాస్త్రీయ అంశాలను గురించి విషయ నిపుణులతో చర్చించి ఒక చిత్తు ప్రతిని తయారుచేసి, దానిని నిపుణులకు చూపించి వారి ఆమోదాన్ని పొందడం చాలా మంచిది.

### 8.3.5 క్లుప్తత (Brevity)

క్లుప్తతనేది సాధారణంగా రచనలకు కావలసిన ఒక సుగుణం కానీ శాస్త్ర విజ్ఞాన రచనలలో పదాలు అధికం వాడినా తప్పు లేదు. పదాలు అధికంగా వాడడం ద్వారా అనుకొన్న అర్థాన్ని స్పష్టంగా చెప్పేందుకు వీలవుతుంది. మొదటి చిత్తు ప్రతి నుండి ఆఖరి ప్రతికి పోయినపుడు దానిలోని పదాల సంఖ్య సహజంగానే తగ్గుతుంది. మొదటి ప్రతిలో ఉదాహరణకు 700 పదాలుంటే, చివరి ప్రతిలో అనవసర పదాలను వదలి పదాల సంఖ్యను 500 వరకు తగ్గించి పరిపూర్ణత సాధించవచ్చు. అయితే సామాన్య పాఠకులకు ఉద్దేశించిన రచనలలో స్పష్టత కొరకు కొన్ని అంశాలను పునరుక్తము చేయవలసి వస్తుంది. అందువల్ల స్పష్టత కొరకు కొన్నిసార్లు అధికంగా పదాలు వాడినప్పటికీ అభ్యంతరం లేదు.

### 8.3.6 ప్రమాణసిద్ధత (Authenticity)

విజ్ఞాన శాస్త్ర రచనలలో అతిముఖ్యమైనది - ప్రమాణ సిద్ధత. ప్రమాణ పూర్వకంగా ఉండాలనే ఉద్దేశంతో విజ్ఞాన శాస్త్ర రచయితలు యధార్థ విషయాలకు పూర్తిగా అంటుకొనిపోయి, రచనను చప్పగా చేస్తారనే దురభిప్రాయముంది. ఇది సరి కాదు. విజ్ఞాన శాస్త్రం అనేక ఆశ్చర్యకరమైన విషయాలతో కూడివుంటుంది. ఒక్కొక్క పరిశోధన (Discovery) ఒక్కొక్క అద్భుతం. మొదటిసారిగా కనుగొన్నప్పుడు దాని పరిశోధకులు ఎంత సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యుంటారో మనం ఊహించుకోగలం. 'నిప్పు'ను కనుగొనడం, 'చక్రం' తయారుచేయడం, భారతీయ శాస్త్రజ్ఞుడు 'సున్న'ను సృష్టించడం, ఆర్కిమెడీస్ సిద్ధాంతం ప్రతిపాదన, 'పెన్సిలిన్ లేదా ఎక్స్‌రే ప్రయోగాలు - ఇవన్నీ యధార్థాలే. వీటిని గురించి ఇప్పటికీ ఆసక్తి రేకెత్తిస్తూ సృజనాత్మకంగా రచనలు చేయవచ్చు.

### 8.3.7 గణాంకాలు, చిత్రపటాలు

విజ్ఞాన, సాంకేతిక శాస్త్ర రచనలు యదార్థ విషయాలతో పాటు అంకెలతో కూడిన సమాచారాన్ని పట్టికల రూపంలో కూడా పొందుపరచాలి. రచనల పరిపూర్ణతకు ఇవి ఎంతో దోహదపడతాయి. ఒకదానితో మరొక దానికి గల తారతమ్యాన్ని, సంబంధ బాంధవ్యాలను తెలిపేందుకు గణాంకాలు అవసరం. వీటి ద్వారా వివిధ అంశాలను స్పష్టంగా వివరించేందుకు కూడా వీలు కలుగుతుంది.

శాస్త్ర విజ్ఞాన రచనలలో చిత్రపటాల ప్రాముఖ్యం ఎంతో వుంది. పాఠకులు రచనలను సులభంగా అర్థం చేసుకోవడానికి, కొన్ని యదార్థ విషయాలను రూఢి చేసేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

BRAOU

### 8.3.8 యధార్థ విషయాలే గాని అభిప్రాయాలు కాదు (Facts not opinions)

శాస్త్ర విజ్ఞాన విషయాలు రాయడం అంటే విస్తృతంగా వున్న శాస్త్ర సాహిత్యాన్ని సామాన్య పాఠకులకు అర్థమయేలా సులువుగా సరళంగా సంక్షిప్త పరిచే ప్రక్రియ. ఇందులో యదార్థ విషయాలకు మాత్రమే తప్ప, రచయిత అభిప్రయాలకు తావులేదు. అందువల్ల శాస్త్ర విజ్ఞాన రచనలు చేయడం చాలా కష్టం. ఇక్కడ మనకు మూడు విషయాలు తెలుస్తాయి.

మొదటిది - కచ్చితంగా చెప్పడం : ప్రతి వ్యాసంలో సాధారణంగా ఇది అవసరమే కావచ్చు. విజ్ఞాన శాస్త్ర విషయాల్లో మాత్రం దీనికి అత్యంత ప్రాముఖ్యత వుంది.

రెండోది - సంపూర్ణత : అతకని, అసంపూర్ణ అంశాలు చాలా వుంటాయి. కాబట్టి చెప్పవలసిన విషయాన్ని క్లుప్తంగా, స్పష్టంగా, సూటిగా కచ్చితంగా పూర్తిగా చెప్పడం ఎంతో అవసరం.

మూడోది - సమన్వయం : (Coherence) పాఠకుల ఆసక్తిని, విషయ స్థాయిని సమన్వయ పరుస్తూ పొందుపరచడం ఎంతో అవసరం. రచయిత తెలివిగా రాస్తున్నాననుకొంటూ, అదే అభిప్రాయాన్ని పాఠకునిలో జొప్పిచేందుకు ప్రయత్నిస్తుంటాడు. కానీ స్పష్టతలోపిస్తుంది. అంటే పాఠకునికి భారం అనిపించకుండా తేలికగా వుండాలి. "ఈ రచన నేను ఎందుకు చదవాలి"? - అనే అభిప్రాయం పాఠకునిలో రాకూడదు. దీనివలన విషయం పాఠకునికి అర్థం కాకుండాపోయే ప్రమాదముంది.

**అభ్యాసం-2: విజ్ఞాన శాస్త్ర విషయ రచనలో ఉండవలసిన మూడు ముఖ్య నియమములేవి?**

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

## 8.4 విజ్ఞాన శాస్త్ర విషయాల రచన - నిర్మాణం

సమాచారం, అనుభవం నుంచి పరిశీలన, శోధన, విచక్షణల నుంచి వస్తుంది. సమాచార వ్యాప్తి రచనల ద్వారా జరుగుతుంది. రచనలలో స్పష్టత ఉన్నప్పుడే సామాన్య పాఠకులకు అవి చేరుతాయి. స్పష్టతతోను, అర్థవంతంగానూ సాగే రచనల నిర్మాణ నిర్వహణ క్రమబద్ధంగా ఉంటుంది. అనవసర వివరణలు వదలాలి. దీని వలన రచన పరిమాణం తగినంతగా కుదించబడి ప్రచురణా సౌలభ్యత చేకూరుతుంది.

విజ్ఞాన శాస్త్ర విషయాల రచన నిర్మాణ నిర్వహణలో పాటించవలసిన కొన్ని విధులను చర్చించుకొందాం.

### 8.4.1 రచనా - ప్రణాళిక

రచనకు ప్రణాళిక అవసరం. రచనా విషయం ప్రాముఖ్యత, అర్థం, ప్రచురణ తరువాత దాని ప్రభావం మొదలైనవి. రచనా ప్రణాళికలో తోడ్పడతాయి. రచనాంశాన్ని బట్టి వేర్వేరు ప్రణాళికలు అవసరమవుతాయి. పత్రికలలో రాసే వ్యాసానికి 100 నుండి 700 పదాల వరకు అవసరమవుతుంది. దీనివలన రచయిత విషయంలోని కొన్ని అంశాలకు మాత్రమే పరిమితమై ఆ అంశాలపై మాత్రమే వీలైనంతగా దృష్టి కేంద్రీకరించవలసి వుంటుంది. ప్రత్యేక నివేదికలలోనూ, పెద్ద పెద్ద వ్యాసాలలో మాత్రమే ఇతివృత్తాన్ని అన్ని కోణాల నుండి పరిశీలించి విస్తృతంగా రాయడానికి అవకాశముంటుంది.



BRAOU
Dr. BRAOU LIBRARY
Acc. No. 115091

రచయిత మొదట తాను రాయబోవు వ్యాసానికి సంబంధించి ఒక సంక్షిప్త ఆకారాన్ని (outline) తయారు చేసుకోవలసి వుంటుంది. దీని ద్వారా వ్యాసం నిడివిని చేర్చవలసిన విషయాంశాలను కుదించుటకు లేదా విస్తృతపరచుటకు అవకాశముంటుంది.

### 8.4.2 రచనాంశాలు - నిర్వహణ

చాలాకాలం వరకు పత్రికా రచనలో ప్రారంభం ఆరు 'ఎ'లుగా అంటే ఎవరు? ఏమిటి? ఎప్పుడు? ఎక్కడ? ఎందుకు? ఎలా? (Who - What - When - Where - Why and How) ద్వారా సాగేది. ఈ విధానాన్నే ఇప్పటికీ కొందరు అవలంబిస్తున్నారు. మరికొందరు పాఠకుల దృష్టిని ఆకర్షించే విధంగా. ఆసక్తి రేకెత్తించే రీతిలో ఇవేవీ పాటించకుండా రాస్తున్నారు. కొందరి ఉద్దేశంలో ప్రారంభ పంక్తి (Lead) భావన (Concept) రీతికి అర్థం లేదు. ప్రారంభించే రీతి, (భావన, కాన్సెప్ట్) రచనను బట్టి ఉంటుంది.

రచనాంశాల నిర్వహణ విషయానికొస్తే, కొన్ని పద్ధతులు తరుచుగా మనకు కనబడుతూ వుంటాయి. వాటిలో 1) అనురూపత (Parallelism techique) 2) వర్ణన - వివరణ - మూల్యాంకన పద్ధతి.

అనురూపత లేదా సాదృశ్యంలో రచయితలు రెండు వస్తువులలో గల రూప, నిర్మాణాలలో గల సంబంధాలను పోలుస్తూ వాటి సమస్యలను వివరిస్తారు. ఈ రెండు వస్తువులలో ఒకటి పాఠకునికి బాగా పరిచయం వుండటం వల్ల రెండవ దాని గురించి సులువుగా అర్థం చేసుకునేందుకు వీలు కలుగుతుందనే నమ్మకం రచయతలో ఉంటుంది.

రెండవ పద్ధతిలోని వర్ణన - వివరణ - మూల్యాంకన వ్యవస్థ (Description - Explanation - Evaluation - system) విజ్ఞాన శాస్త్ర ధోరణులను సమీక్షించే వ్యాసాలకు (Trends in science) అనువైన విధానం. ఈ పద్ధతి ద్వారా మొదట మార్పులను వర్ణించి, దానికి గల కారకాలను వివరిస్తూ, భవిష్యత్తులో వచ్చు కొద్ది మార్పులతో ఈ పద్ధతిని వేర్వేరు విషయ ఇతివృత్తాలకు అన్వయించవచ్చు.

### 8.4.3 రచనా - ముగింపు

ఏ రచన అయినా చివరలో ముగింపు లేకుండా అది అసంపూర్ణమవుతుంది. సాధారణంగా రచనల్లో అంతవరకు చెప్పిన దాని ముఖ్య విషయాలను తీసుకొని వాటిని సమీక్షిస్తూ ముగించడం కద్దు. కానీ ముగింపు ప్రతిభావంతంగా ఉండాలంటే - రచన మొత్తం జ్ఞాపకం ఉంచుకొనేందుకు వారితీసే విధంగా పాఠకులపై ముద్రవేయాలి. అసాధారణంగానూ, అనుకోని రీతిలోనూ ముగింపును చేర్చుటకు కొంత మంచి రచయితలు పాఠకుల విశ్వాసాలను ప్రభావితం చేస్తూ, ఒక ప్రకటన చేయడమో తన వాక్పటిమను చూపుతూ అలంకారాలతో భవిష్యత్ విధానంపై ప్రశ్నించడమో జరుగుతుంది. ఇది పాఠకునిలో పరిశీలన, విచక్షణ, ఆలోచనా ధోరణులను ప్రభావితం చేస్తుంది.

### 8.4.4 రచనా విధానం - కొన్ని సూచనలు

శాస్త్ర విజ్ఞాన విషయాలు రాసే రచయితలు ఎప్పుడూ కొన్ని విషయాలను జ్ఞప్తికి ఉంచుకోవలసి వుంటుంది. అనంతమైన విజ్ఞాన - సాంకేతిక శాస్త్ర పరిశోధనలను తాను కేవలం సామాన్య పాఠకుల కోసం సరళీకృతం చేయుటకు, స్పష్టపరచుటకు, అనువదించుటకు మాత్రమే సంకల్పించుకొన్నానని మరువరాదు. దీనివలన వాక్యాలు వీలైనంత చిన్నవిగానూ, అర్థవంతంగానూ, నిర్దుష్టంగానూ ఉండేటట్లు చూడగలడు.

శాస్త్ర విజ్ఞాన వ్యాస రచనలు చేసే రచయితలు వారి అనుభవాలతో కొన్ని సూచనలు ఇస్తూవుంటారు. ఇటువంటి సూచనలు వర్తమాన రచయితలకు చాల ఉపకరిస్తాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవి.

1. విజ్ఞాన, వైద్య శాస్త్రాలకు సంబంధించిన వ్యాసాలు మిగతా రచనలతో ప్రచురణా స్థలం కోసం పోటీ పడుతూవుంటాయి. కాబట్టి రచనలు దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా, ఆసక్తికరంగా, సామాన్యులకు అర్థమయ్యే రీతిలో ఉండాలి.

BRAOU

2. రచనలు 700 నుండి 900 వరకు లేదా అంతకన్నా తక్కువ పదాలతో గానీ ఉండేటట్లు చూడాలి. ఇంతకుమించినట్లయితే వార్తాపత్రికలలోనూ, మాగజైన్లలో కూర్పు చేయడం కష్టం.

3. వ్యాసం నిడివిని తగ్గించి, ఫోటోలు, చిత్రపటాలు చేర్చడం ద్వారా పాఠకులు రచనను సులువుగా అర్థం చేసుకునేందుకు వీలవుతుంది.

4. సంఖ్యాపరంగా వివరించినప్పుడు వాటిని గుర్తుంచుకునేందుకు వీలుగా వాటిని కుదించాలి.

5. విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు సంబంధించి క్లిష్టమైన విషయాలపై రాసినప్పుడు మానవుని అనుభవాలతో పోల్చడం మంచిది.

6. సరళంగా, స్పష్టంగా, పాఠకునికి అర్థమయ్యే రీతిలో రాయాలి.

7. సాంకేతిక పదాలు, అరుదుగా ఉపయోగించే పదాలను నిర్వచించాలి. వాక్యాలనిడివి వీలైనంతగా తగ్గించడం మంచిది. అవసరమైనంత వరకు మాత్రమే వివరణ ఇవ్వండి.

తప్పనిసరిగా పాటించాల్సిన సూచనలతో పాటు నిషేధాలు కూడా ఉన్నాయి. గత 50 సంవత్సరాలుగా విజ్ఞాన శాస్త్ర రచనలలో పాటిస్తున్న కొన్ని ముఖ్యమైన నియమాలను గమనించండి.

1. పాఠకుల విద్య-పరిజ్ఞానాన్ని అధికంగా అంచనా వేయవద్దు. అలాగే అతని తెలివి తేటలను తక్కువగా కూడా అంచనా వేయొద్దు.

2. తెలిసినదంతా 500 పదాలతో చెప్పేందుకు ప్రయత్నించవద్దు. కొన్ని విషయాలను మరో సమయంలో అవకాశమున్నప్పుడు చెప్పవచ్చునని వదలివేయడం మంచిది.

3. విషయం పాతదే కనుక ప్రజలకు తెలిసే వుంటుందనే భావన రానియ్యొద్దు. తెలియని విషయాలు పాఠకులకు తగిన సమయంలో అందించే వార్త కావచ్చు.

4. రచన మధ్యలో అప్పుడప్పుడూ "ఇది ఏమిటి? ఎందుకు?" అనే ప్రశ్నలు పాఠకుల మెదడులో ఉద్భవిస్తాయని మరిచిపోకుండా అటువంటి ప్రశ్నలకు సమాధానాలు పొందుపరచాలి. లేనట్టయితే పాఠకులు చదవడం మధ్యలోనే నిలిపి వేసే ప్రమాదముంది.

5. పటాటోపమైన భాషను అధికంగా వాడడం ద్వారా అసందర్భ పరిహాసాన్ని చేర్చడం ద్వారా రచనను ఆసక్తికరంగాను, ఆకర్షణీయంగానూ మలచ వచ్చుననే భావన రానీయవద్దు. అలా అనుకోవడం పొరపాటు.

6. నిరూపించ గలిగినప్పటికీ, "ఈ పరిశోధన (లేదా ఆవిష్కరణ) అసక్తికరమైనది" అని చెప్పకూడదు- చెప్పవలసినపనిలేదు.

7. రచనా విషయానికి సంబంధించిన వాఙ్మయ గ్రంథాలన్నింటిని పేర్కొన వలసిన పనిలేదు. కానీ సంప్రదించిన గ్రంథాలను పేర్కొనాలి. పాఠకులకు ఉపయుక్తమైన వాటిని ఇవ్వడం మరచిపోవద్దు.

8. కఠిన పదాలను నిర్వచించేందుకు మరికొన్ని కఠిన పదాలను వాడకూడదు.

9) సాంకేతిక పదాలన్నింటిని వదిలి వేయాలని ఎప్పుడు అనుకోరాదు. సందర్భోచితంగానూ; పాఠకులు అర్థం చేసుకోదగిన అవసరమైన పదాలను ఉపయోగించవచ్చు.

10) వ్యాస ప్రతి (Manuscript) ని సంపాదకుడు ఎందుకు అంగీకరించలేదో వివరణ ఇస్తాడని భావించి ఎదురు చూడకూడదు. సంపాదకుని తీర్పు ఖచ్చితమైనదే అయినప్పటికీ, పదే పదే కోరినప్పుడు కారణాలు కల్పించే అవకాశం వుంది.

BRAOU

**అభ్యాసం-3: డి.డి.ఇ. (DDE) వ్యవస్థ అనగానేమి?**

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

## 8.5 శాస్త్ర విజ్ఞాన రచనలు - రూపాలు

శాస్త్ర విజ్ఞాన విషయాలపై రాయాలను కొన్న రచయితలు ముందుగా ఎదుర్కొనే ప్రశ్న - రచనను ఏ రూపంలో మలచుకోవాలో నిర్ణయించుకోవడం. ఇందుకుగాను విజ్ఞాన శాస్త్ర రచనల రూపాలను పరిశీలించవలసి వుంటుంది. కొన్ని ప్రముఖ విజ్ఞాన శాస్త్ర రచనల రూపాలను ఈ దిగువన పొందుపరుస్తున్నాము.

### 1. వైజ్ఞానిక వార్తా రచనలు : (Science News)

ఉపన్యాసం వెను వెంటనేగానీ టెలిఫోను ద్వారా గానీ, తంతి ద్వారా గానీ వార్తా పత్రికలలో వెను వెంటనే ప్రచురింప బడాలనే ఉద్దేశముతో పోటీగా, తొందరపాటుతో రాసి పంపిన సమాచారం ఈ కోవకు చెందుతుంది. అందవలన ఇటువంటి సమాచారం క్లుప్తంగానూ, సంక్షిప్తంగాను ఉండి, సంఘటన సమాచారంతో కూడి వుంటుంది.

### 2. విజ్ఞాన శాస్త్రజ్ఞులపై పత్రికలలో వార్తా వ్యాసాలు (Features)

వీటిని "మానవీయ" రచనలుగా కూడా రాయవచ్చు. అందువల్ల రచయిత ఇటువంటి రచనలకు రంగు చేరుస్తూ, పూర్తి వృత్తాంతము ఇస్తూ నాటకీయంగా కూడా మలచడం జరుగుతుంది. ఇందులో విషయంపై కన్న, దానికి సంబంధించిన వ్యక్తులపైకన్న, తరచుగా, దృష్టి కేంద్రీకరించబడుతుంది.

### 3. పూర్వరంగ వృత్తాంతం (Background Story)

విజ్ఞాన శాస్త్ర వార్తలకుగానీ, ప్రత్యేక వ్యాసాలకుగానీ పూర్వ చరిత్ర వృత్తాంతం ఎంతో వుంటుంది. వీటికి సంబందించిన సంఘటనల చరిత్ర రోజులు, సంవత్సరాలు, శతాబ్దాల వెనుక ఎప్పుడో మొదలవుతుంది. ఈ వృత్తాంతంలో సంస్థల యాజమాన్యములలో విభేదాలు చోటు చేసుకొంటాయి. ప్రజా విధానాలతో విజ్ఞాన శాస్త్రం ముడి పడి వున్నందువల్ల ఇటువంటి పూర్వరంగా వృత్తాంతం గురించి తెలియ పరచవలసిన అవసరం ఎంతో వుంది.

### 4. విజ్ఞాన శాస్త్ర వ్యాఖ్యాస రచన (Interpretation)

దీనిని "ఆలోచనాంశం" (Think Piece) అని కూడా అంటారు. వివిధ శాస్త్ర నిపుణులతో చర్చలు, ఇంటర్వ్యూ ద్వారా వెలువడడం మూలంగా కొన్ని పదాలకు అర్థాలు స్పష్టంగా వుండక, కొన్ని సందర్భాలలో వివాదాస్పదంగా కూడా తయారవుతాయి. అందువల్ల రచయిత అతి జాగ్రత్తగా విషయాలను పరిశీలించి. తన వ్యాఖ్యానాన్ని కూడా శోధించవలసి వుంటుంది. దీని ద్వారా రచయిత తన సొంత ఆలోచనలను, అభిప్రాయాలను పొందుపరచుటకు కూడా అవకాశముంది.

### 5. వార్తా పత్రికలలో "కాలమ్స్" (Columns)

ఒక కాలనియతి ప్రకారం, అంటే ఇన్ని రోజులకు ఒక సారి అనో, లేదా మరొక కాలనిర్ణయానుసారంగానో ఒకే రచయిత

BRAOU

"కాలమ్" రాయవచ్చు. వార్తా పత్రికల ప్రత్యేక అనుబంధ సంచికలకుగానీ ఆదివారపు ప్రత్యేక సంచికకుగానీ ఇవి రిజర్వు చేయబడతాయి. మార్పులు చేర్పులకు సంపాదకుని స్వేచ్ఛ ఉంటుంది. ఈ విజ్ఞానశాస్త్ర సంబంధమైన ఈ కాలమ్స్‌కు వార్త ప్రాముఖ్యత అంతగా వుండదు.

6. శాస్త్రజ్ఞుల వ్యక్తిగత చరిత్ర

క్లుప్తంగా రాసిన శాస్త్రజ్ఞుల వ్యక్తిగత చరిత్రలు ఈ కోవకు చెందుతాయి. ఇందులో శాస్త్రజ్ఞుని కృషి, ప్రేరణ, మొదలగునవి చోటుచేసుకొంటాయి. శాస్త్రీయ సమాచారానికి ఇందులో అంతప్రాముఖ్యత వుండదు.

7. హాస్య రచనలు (Humour)

విజ్ఞానశాస్త్రరంగంలో హాస్య రచనలకు అంతగా చోటు లేదు. ఛలోక్తులతో వ్యంగంగా చేసిన రచనలు రావచ్చు. కాని ఇవి కూడా అరుదుగానే కనిపిస్తాయి.

8. వైజ్ఞానిక వ్యాసపరంపం (Series)

వృత్తాంతం క్లిష్టమైందీ, విస్తృతమైందీ అయినపుడు. దానిని చిన్నచిన్న భాగాలుగా విడగొట్టి ఒక్కొక్కదానిమీద ఒక్కొక్కవ్యాసాన్ని రాసి ధారావాహికంగా ప్రచురించడం జరుగుతుంది.

9. విజ్ఞాన సాహస యాత్రలపై రచనలు

శాస్త్రనిపుణులతో కలిసి వైజ్ఞానిక, సాహస యాత్రలు (expeditions) చేసి, ప్రత్యక్షంగా గమనించిన విషయాలను నిపుణులతో చర్చించి చేసే రచనలు ఈ కోవకు చెందుతాయి. ఇటువంటి రచనలు పాఠకులలో ఆసక్తిని ఉత్కంఠను రేకెత్తిస్తాయి.

**అభ్యాసం-4: శాస్త్రవిజ్ఞాన వార్తల ముఖ్య లక్షణములేవి?**

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

BRAOU

## 8.6 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

విజ్ఞాన సాంకేతిక శాస్త్ర విషయాలపై రాసే విధానము గురించి ఈ ఖండికలో తెలుసుకొన్నారు. ఈ విషయాలపై రాయడం మన దేశంలో అంతగా అభివృద్ధి చెందలేదు. ఇప్పటివరకు శాస్త్రజ్ఞులు, విషయ నిపుణులు మాత్రమే రాస్తున్నారు. విజ్ఞాన సాంకేతిక శాస్త్ర విషయాలపై రాసేవారు ఈ క్రింది అంశాలను దృష్టిలో వుంచుకోవాలి.

★ శాస్త్ర విజ్ఞాన విషయాలపై అవగాహన, అనుభవం

★ పాఠకులు - వారిస్థాయి

★ అతిగా సాంకేతిక పదజాల ప్రయోగం - నివారణ

★ తాజా పరిణామాలు తెలుసుకోవడం - నిపుణుల సలహాలుపాటించడం

★ రచనలో క్లుప్తత, ప్రమాణ సిద్ధత పాటించడం

★ గణాంకాలు, చిత్రపటాలు చేర్చుట

★ యథార్థ విషయాలేగానీ అభిప్రాయాలకు చోటు లేకపోవడం

విజ్ఞానశాస్త్ర రచనకు ఒక ప్రణాళిక, క్రమపద్ధతిలో విషయాంశాల, నిర్వహణ, చక్కని ముగింపు అవసరం. రచనకు అవసరమైన పాటించవలసిన సూచనలు పొందుపరచడం జరిగింది. విజ్ఞాన శాస్త్ర విషయాలపై రచన అనేక రూపాలలో జరుగుతుంది. వాటిలో కొన్ని ప్రధానరూపాలను పేర్కొనడం జరిగింది.

## 8.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1) విజ్ఞానశాస్త్ర విషయాల రచనా ప్రాముఖ్యతను తెలుపండి?

2) విజ్ఞానశాస్త్ర రచనలకు ఉండవలసిన లక్షణాలేవి? వాటిని సంగ్రహంగా వివరించండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1) విజ్ఞానశాస్త్ర రచనా నిర్మాణం గురించి తెలిపి. రచనా నిర్మాణ నిర్వహణలో పాటించవలసిన సూచనలను(Dos). (Don'ts) నిషిద్ధాలను పేర్కొనండి.

2) విజ్ఞానశాస్త్ర రచనల వివిధ రూపాలను పేర్కొని. ఒక్కొక్క దానిని గూర్చి క్లుప్తంగా వర్ణించండి.

**- వి. చంద్రశేఖరరావు**

BRAOU

# భాగం - 9 : వాణిజ్యం

## విషయక్రమం

9.0 ఉద్దేశం
9.1 ప్రవేశిక
9.2 వార్తల వర్గీకరణ
9.2.1. ఆర్థిక విధానసంబంధమైన వార్తలు
9.2.2. ఆర్థిక రంగాల వార్తలు
9.2.3. కార్పోరేట్ వార్తలు
9.2.4. కాపిటల్ మార్కెట్ వార్తలు
9.2.5. వ్యవసాయ వాణిజ్య రంగం
9.3 సంపాదక రచన (ఎడిటింగ్)
9.4 విలేఖనం (రిపోర్టింగ్)
9.5 ఎలక్ట్రానిక్ మీడియాకు రాయడం
9.6 సమాచార ఆధారాలు
9.7 పారిభాషిక పదాలు
9.8 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం
9.9 నమూనా వార్తలు
9.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 9.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తర్వాత మీరు

- వాణిజ్య వార్తలంటే ఏవి?
- వాణిజ్య వార్తల రచన
- వాణిజ్య వార్తల రకాలు
- ఎలక్ట్రానిక్ మీడియాకు రాయడం
- వాణిజ్య వార్తల ఆధారాలు
- పారిభాషిక పదాలు తెలుసుకుంటారు.

BRAOU

## 9.1 ప్రవేశిక

Economics and finance are generally considered dry-as-dust subjects, and it is taken for granted that it must be a dull occupation to write about them. Yet given the necessary degree of imagination it is easy to discover in finance a great deal of romance and drama, very often comedy, and at times tragedy. It all depends on the way the financial journalist treats his subject. He can settle down, if he wishes to give himself trouble to dull routine. But if he is sufficiently interested, no two working days in his life need be the same.

- Paul Einzig

"In the Centre of things"

తెలుగులో బిజినెస్ జర్నలిజానికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఈ రంగంలోని పాత్రికేయులకు పూర్వ శిక్షణ గానీ, ఆధారపడేందుకు నిర్దిష్టమైన ఒరవడిగాని లేవు. బిజినెస్ జర్నలిజం ఇప్పుడిప్పుడే ప్రత్యేక శాఖగా ఎదుగుతున్నందున ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం స్టాక్ మార్కెట్ సమాచారం, కార్పొరేట్ సంస్థల వార్తలు మాత్రమే బిజినెస్ జర్నలిజంగా చలామణి అవుతున్నాయి. బిజినెస్ జర్నలిజం పరిధి ముమ్ముందు భాగా విస్తరించే అవకాశం ఉన్నందున, ఈ రంగంలోని పాత్రికేయులు తదనుగుణంగా తమనుతాము సన్నాద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బిజినెస్ జర్నలిజం అంటే పి.ఆర్.జర్నలిజం అన్న అపప్రద ఉంది. బిజినెస్ జర్నలిస్టుల్లో అధ్యయనాత్మక దృష్టి, పరిశోధనాత్మక దృక్పథం కొరవడటం వల్ల ఇలాంటి విమర్శలకు అవకాశం ఏర్పడింది.

బిజినెస్ జర్నలిజంలో విశ్వసనీయతకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. రాజకీయ వార్తల్లో పాఠకుడు అందులో తనకేముంది అని ఆలోచించే అవకాశం లేదు. బిజినెస్ వార్తల్లో మాత్రం తమ స్వప్రయోజనాలను సంబంధించిన అంశాలను పాఠకుడు వెంటనే వెతుక్కుంటాడు. వాణిజ్య ప్రకటనలకు పత్రికల్లో, ప్రసార సాధనల్లో వున్న ప్రాముఖ్యత దృష్ట్యా, వార్తల సేకరణలో బిజినెస్ జర్నలిస్టులు కొన్నిసార్లు ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తుంది. ఈ ఇబ్బందులను అధిగమిస్తునే పాఠకులను విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడం జర్నలిస్టు బాధ్యత. బిజినెస్ వార్తలు ఇన్వెస్టర్ల మదుపు నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఒక కార్పోరేట్ సంస్థ గురించి మంచిగా రాసినా, చెడుగా రాసినా అందులో వాస్తవికత లోపిస్తే, వార్త ఆధారంగా ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయం తీసుకునే పాఠకులు దెబ్బతినే అవకాశం ఉంది. అందువల్ల బిజినెస్ జర్నలిస్టులు విధి నిర్వహణలో అత్యంత జాగ్రత్త పాటించాల్సిన అవసరం ఉంది. అంకెలు అధికంగా ఉండే బిజినెస్ సమాచారం ఒక్కోసారి విసుగు అనిపిస్తుంది. అయితే అంకెలను శోధించినప్పుడు వెలువడే అంశాలను, సమాచారాన్ని పాఠకులకు చేరవేస్తునప్పుడు విసుగు మాయం అవుతుంది.

అంకెలను అక్షర రూపంలోకి అనువాదం చేయగల సామర్థ్యం బిజినెస్ జర్నలిస్టులకు అత్యంత అవసరం. పత్రికా, ప్రసార రంగాలల్లో బిజినెస్ వార్తల కవరేజ్ భిన్నంగా ఉంటుంది. దృశ్య ప్రధానమైన టెలివిజన్, శ్రవ్య ప్రధానమైన రేడియోల్లో ప్రసారానికి అనువుగా టెలివిజన్ వార్తాలను మలచడానికి సృజనాత్మకత అవసరం. చార్టులు, గ్రాఫులు బిజినెస్ జర్నలిస్టులు విస్తారంగా ఉపయోగించుకోవల్సిన అవసరం వుంది. ఇంటర్వ్యూలు, ఆర్థిక వేత్తలు, వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రముఖుల అభిప్రాయాలు, అంచనాలు మీడియా ద్వారానే ప్రజలకు చేరుతాయి. ప్రవేటీకరణ ప్రక్రియ ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్నది. వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సంస్థలు ప్రైవేట్ పరం అయ్యాయి. ఇంటా, బయటా గూడా సమాచారం ప్రాధాన్యత అసాధారణంగా పెరిగింది. అంతర్జాతీయ వాణిజ్యాన్ని వాణిజ్య కూటములు, వాణిజ్య ఒప్పందాలు ప్రభావితం చేస్తున్నాయి. బహుముఖాలుగా విస్తరించిన బహుళజాతి సంస్థలు పోటీని పెంచుతున్నాయి. ఒక అమెరికా కంపెనీ, ఇండియాలో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటుచేసి, జపాన్ నుంచి విడిభాగాలు తెప్పించి, సింగపూర్‌లో అసెంబుల్ చేసి (కూర్చి) యూరప్‌లో మార్కెట్ చేస్తున్న రోజులివి. అందువల్ల ప్రపంచంలో ఏ మూల ఏ చిన్న పరిణామం చోటుచేసుకున్నా, దాని ప్రభావం అంతర్జాతీయంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో బిజినెస్ జర్నలిజానికి అసాధారణ ప్రాధాన్యత, ప్రాముఖ్యత పెరిగాయి.

BRAOU

## 9.2 వార్తలు - వర్గీకరణ

బిజినెస్ జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణగాని, విడిగా కోర్సులు గాని లేకపోవడం వల్ల ఈ రంగంపై ఆసక్తితో వున్న జర్నలిస్టులు స్వయంగా ఈ అర్హతల సముపార్జనకు కృషి చేయాల్సి ఉంటుంది. సంపాదక రచనలోనూ, రిపోర్టింగ్‌లోనూ ఉండే ఇబ్బందులు, పరిమితులు, వెసులుబాట్లు పత్రికా రంగానికి, ప్రసార రంగానికి ఒకే రకంగా లేవు. అయితే రెండు మాధ్యమాల్లోనూ బిజినెస్ జర్నలిజం పరిధిలోకి వచ్చే అంశాలు మాత్రం ఒక్కటే. ఈ అంశాలను స్థూలంగా అయిదు రకాలుగా వర్గీకరించవచ్చు. ఎ) ఆర్థిక, విధాన సంబంధమైన వార్తలు బి) ఆర్థిక రంగాల వార్తలు సి) కార్పోరేట్ వార్తలు డి) కాపిటల్ మార్కెట్ వార్తలు ఇ) వ్యవసాయ వాణిజ్య వార్తలు.

ఇవి స్థూల వర్గీకరణ మాత్రమే. రాజకీయాలు, ప్రజాపాలన, విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక శాస్త్రం, వినియోగదారుల

హక్కులు జనాభా. ప్రైవేటీకరణ. మౌళిక వసతి సదుపాయాల కల్పన. ప్రభుత్వ రంగం. మేధో హక్కులు. విద్య. ఆహారం. ఆరోగ్యం. టూరిజం, పర్యావరణం. అంతరిక్ష విజ్ఞానం, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు వంటి అంశాలు కూడ బిజినెస్ జర్నలిస్టులు ఆసక్తి చూపిస్తున్న రంగాల్లో వున్నాయి. ఈ పరిధి ముమ్ముందు భారీగా విస్తరించే అవకాశం ఉంది.

ముందస్తుగా స్థూలవర్గీకరణలోకి వచ్చే అంశాల్లో మౌలిక జ్ఞానం కోసం బిజినెస్ జర్నలిస్టు కృషి చేయాలి. ఇందులో నిరంతర అధ్యయనం విధి నిర్వహణలో ఒక భాగంగా మారాలి. ఆంగ్ల భాష పరిజ్ఞానం. అంకగణితంతో పరిచయం బిజినెస్ జర్నలిస్టులకు అవసరం. కంప్యూటర్ పరిజ్ఞానం ఆధునిక కాలంలో తప్పనిసరి.

### 9.2.1 ఆర్థిక విధాన సంబంధమైన వార్తలు

దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఈ కోవలోకి వస్తాయి. ప్రభుత్వం తీసుకునే విధానపర నిర్ణయాలే, ఆర్థిక పారిశ్రామిక రంగాల గతిని, గమనాన్ని నిర్దేశిస్తాయి. ఎగుమతి దిగుమతులకు సంబంధించి. పన్నులు-సుంకాలకు సంబంధించి. బ్యాంకింగ్-ఫైనాన్స్ రంగాలకు సంబంధించి కాపిటల్ మార్కెట్లకు సంబంధించి, వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం. ప్రభుత్వ ఏజన్సీలైన రిజర్వుబ్యాంకు. 'సెబి' వివిధ ప్రభుత్వ శాఖలు తీసుకునే నిర్ణయాలను పాఠకులకు ఎప్పటికప్పుడు చేరవేయాల్సిన అవసరం ఉంది. టెలికమ్ రంగంలో ప్రవేట్ సంస్థలను ఆహ్వానించాలన్నది ప్రభుత్వ విధాన నిర్ణయం. ప్రవేట్ ఎయిర్‌లైన్స్, ప్రైవేట్ రంగాల ఏర్పటుకు అనుమతినివ్వడం, ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు ప్రకటించడం వంటి ప్రభుత్వ నిర్ణయాలు పాఠకులను ఆకర్షిస్తాయి.

ప్రతి ఏటా ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌ను కూడా ఈ విభాగంలోకి చేర్చవచ్చు. ఆర్థిక వ్యవస్థ స్థితిగతులకు అద్దం పట్టే వార్షిక బడ్జెట్‌ను బిజినెస్ జర్నలిస్టులు క్షుణ్ణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును అంచనా వేయడానికి బడ్జెట్‌లోని అంశాలు ఉపకరిస్తాయి.

### 9.2.2. ఆర్థిక రంగాల వార్తలు

విభిన్న ఆర్థిక రంగాల సమాహారమే దేశ ఆర్థిక వ్యవస్థ సమగ్రస్వరూపం. విదేశీమారక ద్రవ్యమార్కెట్ (ఫారెక్స్ మార్కెట్) మనీ మార్కెట్, బులియన్ మార్కెట్ కార్యకలాపాలకు బిజినెస్ జర్నలిజంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి విలువ పతనం అయిందంటే విదేశీ చెల్లింపుల సమతౌల్యంపై దాని ప్రభావం పడుతుంది. మనీ మార్కెట్‌లో వడ్డీ రేట్లు పెరిగాయంటే కార్పోరేట్ సంస్థల లాభదాయకతపై వేటు పడుతుంది. ద్రవ్య చలామణి ఏ కాస్త హెచ్చినా, ద్రవ్యోల్బణం భగ్గుమంటుంది. ద్రవ్యచలామణిపై ఏ మాత్రం అదుపు చూపినా లిక్విడిటి సంక్షోభం తలెత్తుతుంది. వెండి-బంగారం ధరల్లో ఆటుపోట్లు లక్షలాది మంది ప్రజల జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తాయి. పారిశ్రామిక వడ్డీరేటు, స్థూల దేశీయ ఉత్పత్తి వివిధ పారిశ్రామిక రంగాల పనితీరు కూడా ఈ విభాగంలో చేర్చవచ్చు.

### 9.2.3. కార్పోరేట్ వార్తలు

వివిధ కార్పోరేట్ సంస్థల కార్యకలాపాలు. పనితీరుకు సంబంధించిన వార్తలకు బిజినెస్ జర్నలిజంలో అత్యధిక ప్రాధాన్యత వుంది. బిజినెస్ సమాచారం కోసం వెతికే వాళ్లలో అత్యధికులకు కావల్సింది ఈ సమాచారమే. పారిశ్రామిక రంగం ఉచ్చ దశలో ఉన్నపుడు కార్పోరేట్ రంగంలో హడవుడి అధికంగా ఉంటుంది. గత దశాబ్ద కాలంలో దేశంలో అనేక కొత్త పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. సరళీకృత విధానాల వల్ల విదేశీ కొలాబరేటర్లు, జాయింట్ వెంచర్ సంస్థల ఏర్పాటు పెరిగిపోయింది. టెకోవర్లు, విలీనాలు, కొత్త రంగంల్లోకి అడుగుపెట్టడం, విస్తరణ పథకాలు అమలు చేయడం వంటి పరిణామాలు సాధారణంగా మారాయి. ఈ నేపథ్యంలో మదుపు నిర్ణయాల దృష్ట్యా ఇన్వెస్టర్లు, కార్పొరెట్ సమాచారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం సహజం. కార్పొరేట్ సంస్థల విస్తరణ, వివిధీకరణ, ప్రైవేటీకరణ పథకాలు, వార్షిక ఆర్థిక ఫలితాలు. మార్కెటింగ్ వ్యూహాలు వాటి ఉత్పత్తులకు మార్కెట్‌లో వున్న డిమాండ్. డివిడెండ్లు. అడ్వర్టయిజ్‌మెంట్ ధోరణులు వంటి అంశాలను బిజినెస్ జర్నలిస్టులు కవర్ చేయాల్సి ఉంటుంది. అలాగే కంపెనీల యాజమాన్యంలోని మార్పులు చేర్పులు కూడా ఇన్వెస్టర్ల ప్రయోజనాల దృష్ట్యా ఎప్పటికప్పుడు అందజేయడం చాలా అవసరం.

BRAOU

### 9.2.4. కాపిటల్ మార్కెట్ వార్తలు

దేశంలో కాపిటల్ మార్కెట్ శరవేగంతో వృద్ధి చెందుతున్నది. ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఈ వృద్ధి ఉండటం గమనార్హం. ఈక్విటి షేర్లలో మదుపు చేయడం వల్ల తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు సంపాదించవచ్చనే విశ్వాసం కారణంగా, ఈక్విటి కల్చర్ విస్తృతంగా వ్యాప్తి చెందింది. స్టాక్ మార్కెట్‌లో షేర్లు కొనేవారి సంఖ్య, పబ్లిక్ ఇస్యూలకు దరఖాస్తు చేసేవారి సంఖ్య బాగా పెరిగింది. పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో ప్రజల భాగస్వామ్యం ఈ విధంగా పెరగడం అనూహ్య పరిణామమైనప్పటికీ ఆహ్వానించదగింది. పబ్లిక్ ఇష్యూలు, రైట్స్ ఇష్యూలు, డిబెంచర్లు, బాండ్ల జారీ (ప్రైమరీ మార్కెట్) స్టాక్ ఎక్ఛేంజ్‌ల లావాదేవీలు (సెకండరీ మార్కెట్) మ్యూచువల్ ఫండ్స్ వార్తలపై పాఠకులు (ఇన్వెస్టర్లు) చాలా ఆసక్తిచూపే అవకాశం ఉంది. ఇప్పటికే అన్ని ప్రధాన పత్రికలు స్టాక్ మార్కెట్ కొటేషన్స్ విధిగా ప్రతిరోజు ప్రకటిస్తున్నాయి. చిన్న, చిన్న పట్టణాల్లో సైతం అనధికార స్టాక్ ఎక్సేంజీలు ఏర్పడటం వల్ల ఈ సమాచారానికి ప్రాధాన్యత బాగ హెచ్చింది.

### 9.2.5 వ్యవసాయ వాణిజ్యం

ఇప్పటికీ పత్రికల్లో బాగా నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రధాన రంగం వ్యవసాయం. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడం. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, ఎగుమతుల్లో లాభార్జన అవకాశాలు అధికం కావడంతో ఈ రంగం కూడా క్రమంగా బిజినెస్ జర్నలిస్టుల పరిధిలోకి వచ్చింది. వ్యవసాయానికి సంబంధించి చెరుకు, పొగాకు మాత్రమే గతంలో ఎక్కువగా వార్తల్లో ఉండేవి. ఇప్పుడు పూల పెంపకం, తోటల పెంపకం, రొయ్యలు, చేపలు, కోళ్ళ పెంపకం పరిశ్రమలుగా మారి వీటి వార్తలు విరివిగా కనిపిస్తున్నాయి. మనది ప్రధానంగా వ్యవసాయాధార దేశం. ఇప్పటికీ 70 శాతం మంది వ్యవసాయం జీవనాధారంగా బతుకుతున్నారు. విదేశీ మారకద్రవ్య ఆర్జనకు వీలుగా వున్నా, ఎంపిక చేసిన వ్యవసాయ విభాగాల్లోకి మాత్రం కార్పోరేట్ సంస్థలు అడుగుపెట్టాయి. బాసుమతి బియ్యం ఎగుమతి ఇప్పుడు అతిపెద్ద వ్యాపారం. కొత్తగా చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల వచ్చే లాభాలు రైతులకు చేరాలంటే స్థానిక మార్కెట్లకు సంబంధించిన సమాచారం విధిగా పత్రికలు పాఠకులకు చేరవేయాలి. దుగ్గిరాల, నిజామాబాద్ పసుపు మార్కెట్లు, అనకాపల్లి బెల్లం మార్కెట్, హైదరాబాద్ హోల్‌సేల్ మార్కెట్ ఇలా ప్రముఖ మార్కెట్ల ధరవరల గురించి ఎప్పటికప్పుడు అందజేయడంవల్ల రైతులు, ఇన్వెస్టర్లు లబ్దిపొందడానికి అవకాశం వుంది.

**అభ్యాసం : 1. వాణిజ్య వార్తలను నిర్వచించండి.**

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

**2. స్థానిక పత్రికల్లో వాణిజ్య వార్తలను గుర్తించండి.**

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

BRAOU

## 9.3 సంపాదక రచన (Editing)

తెలుగులో వాణిజ్య సంపాదక రచయితలకు అదనంగా అనువాదంలో ప్రావీణ్యం అవసరం. బిజినెస్ జర్నలిజంలో పరిభాష చాలా ఎక్కువ. ఆంగ్లపదాల చలామణి అధికం. కొన్ని పదాలను ఇంగ్లీష్‌లోనే వాడాల్సిన అవసరం ఉంటుంది. ఉదాహరణకు షేర్లు, డిబెంచర్లు, బాండ్లు అనే మాటలు, స్టాక్ ఎక్ఛేంజ్, డివిడెండ్, లీజింగ్, హైర్‌పర్‌చేజ్ వంటి పదాలు యధాతథంగానే పత్రికల్లో ఉపయోగిస్తున్నారు. పాఠకులకు కూడా బాగా పట్టినందున ఇలాంటి లౌకిక వ్యవహారంలోని ఆంగ్లపదాలను తర్జుమా చేసేందుకు ప్రయత్నించడం అనవసరం. వాణిజ్య వార్తలు సరళంగా వుండాలి. ఇతర రకాల వార్తల్లో చూపించే పదాడంబరం బిజినెస్ జర్నలిజంలో ఎబ్బెట్టుగా వుంటుంది. సంపాదక రచయితలకు ఆర్థిక శాస్త్రంలో, వాణిజ్య శాస్త్రంలో పాండిత్యం వుండాల్సిన అవసరం లేదు. అయితే ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, వివిధ ఆర్థిక రంగాల కార్యకలాపాలు, ద్రవ్య చలామణి, ద్రవ్యోల్బణం, విదేశీ మారకం, స్థూల జాతీయ ఉత్పత్తి, పారిశ్రామిక ఉత్పత్తి, ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, కాపిటల్ మార్కెట్, ప్రధాన పారిశ్రామిక రంగాలు, స్టాక్ మార్కెట్ల పనితీరు గురించిన అవగాహన చాలా అవసరం. రిపోర్టర్లు తెచ్చిన సమాచారాన్ని పరిశీలించి, సాధికారికంగా ఆ వార్తల్లో వాస్తవికతను ధ్రువపరుచుకోవడానికి తగిన పరిజ్ఞానం సంపాదక రచయితలకు వుండాలి. నిజానికి బిజినెస్ జర్నలిజానికి సంబంధించి సంపాదక రచయితలు, విలేకరుల కార్యక్షేత్ర పరిధి దాదాపు ఒక్కటే. అయితే సంపాదక రచయితలపై అదనపు బాధ్యత, భారం ఉంటాయి. ప్రాంతీయ భాషల్లో మరి ముఖ్యంగా ఈవిధమైన పరిస్థితి వుంది.

బిజినెస్ పేజిల్లో సర్వసాధారణంగా కనిపించే సమాచారంలో స్టాక్ మార్కెట్ రోజువారీ లావాదేవీల వివరాలు ముఖ్యమైనవి. బొంబాయి స్టాక్ ఎక్ఛేంజ్, మద్రాస్ స్టాక్ ఎక్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్, హైదరాబాద్ స్టాక్ ఎక్ఛేంజ్ కొటెషన్స్ దాదాపు అన్ని పత్రికలు విధిగా ప్రచురిస్తున్నాయి. ఈ కొటెషన్స్‌తో పాటు సంబంధిత స్టాక్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ ధోరణిపై ఏరోజుకారోజు చిన్నపాటి విశ్లేషణ కూడా అవసరం. ఆ రోజు షేర్ల లావాదేవీలపై జరిగిన మొత్తం టర్నోవర్, సూచికల్లో పెరుగుదల - తరుగుదల ఏ విధంగా ఉంది. అందుకు కారణాలు ఏమిటి? ఇత్యాది అంశాలతో పాటు స్వదేశీ సంస్థలు, విదేశీ మదుపరుల కొనుగోళ్లు, అమ్మకాలు ఏ విధంగ వున్నాయి, మార్కెట్‌పై వారి అభిప్రాయం ఏమిటి అనే అంశం కూడా చాలా ముఖ్యమైనది.

ప్రధాన స్టాక్ ఎక్ఛేంజ్‌లకు సంబంధించిన సమాచారం, వార్తా సంస్థలు, ఆయా కేంద్రాల్లో రిపోర్టర్లు అందజేస్తారు. స్థానిక స్టాక్ ఎక్ఛేంజ్ గురించిన సమాచారం, స్థానిక రిపోర్టర్ సహాయంతో లేదా స్వయంగా కూడా సంపాదక రచయిత సమీకరించవచ్చు. విధాన సంబంధమైన వార్తలు రాసేప్పుడు జాగ్రత్త వహించాలి. విదేశీ మారకం రేట్లు, వెండి-బంగారం ధరలు, స్థానిక మార్కెట్‌లో సరుకుల ధరవరలు ప్రతి రోజు పేజీలో వుండేలా చూసుకునే బాధ్యత సంపాదక రచయితదే.

కార్పోరేట్ సంస్థలకు సంబంధించిన సమాచారం అడ్వర్టయిజింగ్, సంస్థల ద్వారా ప్రజాసంబంధాల సంస్థల ద్వారా పత్రికాప్రకటనల రూపంలో వస్తుంటుంది. ఇలాంటి సమాచారానికి సముచిత ప్రాధాన్యత ఇవ్వడం అవసరం. పత్రిక అడ్వర్టయిజ్‌మెంట్ ప్రయోజనాలు అందులో ఇమిడి వుంటాయి. ఈ సమాచారం సమగ్రంగా లేదనిపించినా, ఏదైన అనుమానం వచ్చినా; సదరు కార్పోరేట్ సంస్థ యాజమాన్యాన్ని లేదా ముఖ్యలను స్వయంగా సంప్రదించి వివరణ తీసుకోవడం అవసరం.

వ్యవసాయ వాణిజ్య వార్తలకు ఖచ్చితమైన ప్రాధాన్యత ఇవ్వాల్సిన బాధ్యత సంపాదక రచయితలదే. అన్నింటికి మించి దేశ విస్తృత ప్రయోజనాలకు ప్రాధాన్యత వుండేలా వార్తల ఎంపిక జరగాలి. మార్కెట్లుకి కొత్త వస్తువులు అనేకం వస్తుంటాయి. వినియోగ వస్తువుల వాడకం పెరిగిన (కన్స్యూమరిజం) కారణంగా రకరకాల వినియోగ వస్తువులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఈ వస్తువుల ఉపయోగాన్ని, మంచి చెడులను విశ్లేషించే కాలమ్ కూడ బిజినెస్ పేజీలో ప్రారంభించవచ్చు. వివిధ సంస్థలు తాము జరిపే మార్కెటింగ్ సర్వేలు, అడ్వర్టయిజ్‌మెంట్ సర్వేల నివేదికలను పత్రికలకు విడుదల చేస్తాయి. వినియోగదారుల దృష్టి నుంచి ఈ సమాచారానికి ఎంతో ప్రాధాన్యత వుంటుంది.

BRAOU

## 9.4 విలేఖనము (Reporting)

జర్నలిజానికి సంబంధించి ఇతర విభాగాల విలేఖరులకు లేని ప్రత్యేక బాధ్యత బిజినెస్ విలేఖరులకు వుంటుంది. ఎందుకంటే బిజినెస్ విలేఖరి రాసే ప్రతి వార్త, పాఠక ఇన్వెస్టర్లపై ఆర్థికంగా ప్రభావం చూపే అవకాశం ఉంది. బిజినెస్ రిపోర్టింగ్‌లో ప్రజాసంబంధాల పాత్ర ఉన్నమాట వాస్తవమైనప్పటికీ, విలేఖరి, పూర్తిస్థాయి ప్రజాసంబంధాల ఏజెంట్‌గా మారితే ప్రమాదం. కార్పోరేట్ రంగానికి సంబంధించిన సమాచారాన్ని కొంతమేరకు విలేకరుల సమావేశాల ద్వారా సంస్థలే స్వయంగా వెల్లడిస్తాయి. పాఠకులకు అవసరమైన సమాచారం అని కాకుండా తాము వెల్లడించదలుచుకున్న సమాచారాన్ని మాత్రమే కార్పోరేట్ సంస్థలు చాలా వరకు వెల్లడిస్తాయి. ఇలాంటి సందర్భాల్లోనే, విలేఖరి చాకచక్యంగా ప్రశ్నల ద్వారా అవసరమైన మొత్తం సమాచారం రాబట్టడానికి ప్రయత్నించాలి. ప్రజల నుంచి డబ్బులు కొల్లగొట్టేందుకే కొన్ని సంస్థల పబ్లిక్ ఇస్యూలకు వస్తుంటాయి. మరికొన్ని సంస్థలు గోరంతను కొండంతలుగా చూపి ప్రజలను మోసగించే ప్రయత్నం చేస్తాయి. స్టాక్ మార్కెట్‌లో ఎప్పుడూ పుకార్లు షికారు చేస్తుంటాయి. విలేఖరి చాలా జాగ్రత్తగా మసులుతూ ఖచ్చితమైన సమాచారాన్ని మాత్రమే పాఠకులకు చేరవేయాలి. కంపెనీల వార్తలు రాసేటప్పుడు, అందులోని వాస్తవికత ధృవపరచుకోవడం నిజంగా కష్టసాధ్యం. ఎందుకంటే కేవలం కంపెనీల యాజమాన్యానికే తప్ప అన్యులకు ఆ విషయంలో అవగాహన ఉండటం కష్టం. సంస్థల అర్థ సంవత్సర ఫలితాలు, వార్షిక ఫలితాలు, డివిడెండ్లు, బోనసులు ఇత్యాది సమాచారంతో పాటు ప్రభుత్వం తీసుకునే ముఖ్యమైన విధాన నిర్ణయాల ప్రభావం స్టాక్ మార్కెట్‌పై కార్పొరేట్ సంస్థలపై ఏ విధంగా వుంటుందో విశ్లేషించి రాయగల నైపుణ్యం బిజినెస్ విలేఖరి అలవర్చుకోవాలి. బిజినెస్ విలేఖరి, తన కార్యక్షేత్ర పరిధిలోని ఆర్థిక నిపుణులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు, స్టాక్ బ్రోకర్లు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండటం అవసరం. ముఖ్యమైన సందర్భాల్లో వారి ప్రతిస్పందనలను కూడా రాయాల్సి వుంటుంది. ఉదాహరణ వార్షిక బడ్జెట్ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత బడ్జెట్‌పై మార్కెట్ ప్రతిస్పందన వెంటనే వుంటుంది. ఈ ప్రతిస్పందనలను సేకరించాలి. ఇన్వెస్టర్లు, వినియోగదారుల ప్రయోజనాలను ఎప్పుడూ దృష్టిలో వుంచుకోవాల్సిన బాధ్యత బిజినెస్ విలేఖరిపై వుంది. ఆర్థిక రంగంలోని వివిధ అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న విషయం విలేఖరి గుర్తించాలి. ఉదాహరణకు అంతర్జాతీయ వాణిజ్యంలో చమురు ధర పెరిగితే, మన విదేశీ చెల్లింపులపై భారం పెరుగుతుంది. తద్వారా వాణిజ్యలోటు మరికొంత హెచ్చుతుంది.

అలాగే విదేశీ పెట్టుబడులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడం ద్వారా మన విదేశీ మారకద్రవ్య నిల్వల పరిస్థితిని అంచనా వేయవచ్చు. 1990వ దశకంలోని అతిముఖ్యమైన పరిణామం ప్రభుత్వరంగాన్ని ప్రైవేట్ పరం చేయడం. ప్రపంచ వ్యాప్తంగ పలుదేశాల్లో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రైవేటీకరణలోని మంచి చెడులు, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ తర్వాత దాని స్థితి ఎలావుంది! ప్రైవేటీకరణ ముందు పరిస్థితి ఏమిటి? ఇలాంటి విషయాలపై ఎప్పటికప్పుడు నివేదికలు తయారుచేయవచ్చు.

బిజినెస్‌లో విలేఖరి - సంపాదక రచయిత ఇద్దరికి ఏదో ఒక విభాగంలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించుకునే అవకాశం ఉంది. సాధారణంగా యాంత్రిక విధి నిర్వహణ బిజినెస్ జర్నలిజంలో రాణించదు. బిజినెస్ జర్నలిస్టు ఈక్విటీ రీసెర్చ్, ఇష్యూల విశ్లేషణ, మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ మార్కెట్ లేదా వ్యవసాయం, చక్కెర, ఆటోమొబైల్, సిమెంట్ ఔషధాల వంటి ఏదో ఒక రంగంలో ప్రత్యేక కృషి చేయాలి. దీనివల్ల భవిష్యత్తు ఉజ్వలంగా వుంటుంది. పాఠకులకు సాధికారికమైన సమాచారం అందివ్వగలిగే అవకాశం ఉంటుంది.

## 9.5 ఎలక్ట్రానిక్ మీడియాకు రాయడం

దృశ్యప్రధానమైన టెలివిజన్ కోసం బిజినెస్ సమాచార కార్యక్రమాలు రూపొందించేటప్పుడు, ఆ మాధ్యమం పరిధి, పరిమితులను దృష్టిలో వుంచుకోవాలి. పత్రికల ద్వారా అందజేసే బిజినెస్ సమాచారం అంతా వాస్తవానికి టెలివిజన్‌లో ప్రసారానికి యోగ్యంకాదు. సాధారణంగా విధానసంబంధమైన సమాచారం, ఇతర సమాచారం ఎలాగూ వార్తల్లో ప్రసారం

BRAOU

చేస్తారు. ప్రత్యేకంగా వాణిజ్యవార్తా కార్యక్రమాలను తయారుచేసినప్పుడు కొంత శ్రమపడాల్సి ఉంటుంది. ప్రత్యేక కార్యక్రమాలను తయారుచేసే పాత్రికేయులకు, కెమెరా సిబ్బందికి మధ్య సమన్వయం చాలా అవసరం. గ్రాఫులు, చార్టులు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, అభిప్రాయాలు వాణిజ్య వార్తా కార్యక్రమాలకు శోభనిస్తాయి. కాపిటల్ మార్కెట్, స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన సమాచారం అందించేప్పుడు చార్టులు, గ్రాఫులు బాగా ఉపయోగపడతాయి. సిమెంట్ రంగం గురించి వాణిజ్య వార్తల్లో ప్రసారం చేయాలంటే నిజానికి ఫ్యాక్టరీ దృశ్యం తప్ప ఆసక్తికరంగా తోచే మరో దృశ్యం ఏదీ ప్రసారం చేయలేము. ఆ రంగానికి సంబంధించిన ప్రముఖులతో ఇంటర్వ్యూలు, ఉత్పత్తి, అమ్మకాలు, డిమాండు, సరఫరా వాటిలో వ్యత్యాసం వంటి వివరాలతో చార్టులు, గ్రాఫులు తయారు చేస్తే కార్యక్రమం ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. అదే సమయంలో సిమెంట్ రంగంలోని మంచి సంస్థల గురించిన పరిచయం వాటి షేర్ ధరల సంగతులు కూడా వార్తల్లో చేర్చవచ్చు. కార్పోరేట్ రంగం దృష్టి ఇటీవల కాలంలో టి.వి. మాధ్యమంపై ఎక్కువగా కేంద్రీకృతమైంది.

టెలివిజన్ అడ్వర్టయిజ్‌మెంట్‌పై కార్పోరేట్ సంస్థలు భారీగా వెచ్చిస్తున్నాయి. ఇలాంటి సమయంలో టెలివిజన్ బిజినెస్ రిపోర్టర్ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రసారాల ప్రభావం అసంఖ్యాకమైన ఇన్వెస్టర్లు, వినియోగదారులపై వుంటుందన్న విషయం గుర్తించుకోవాలి. ప్రలోభాలకు లొంగకుండ వ్యక్తిగత శ్రద్ధతో కార్యక్రమాల రూపకల్పన జరపాలి.

## 9.6 సమాచార ఆధారాలు

బిజినెస్ జర్నలిస్టులకు అవసరమైన సమాచారం సమీకరించేందుకు రకరకాల ఆధారాలు వున్నాయి. వీటిలో కొన్ని సంపాదక రచయితలకు నేరుగా ఉపకరిస్తే మరికొన్ని ఆధారాలు విలేఖరులకు పనికొస్తాయి. ఉదాహరణకు వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు ప్రతి ఏడాది విధిగా విడుదల చేసే నివేదికలు సంపాదకరచయితలు నేరుగా సేకరించాలి. వీటి ఆధారంగా విశ్లేషణలతో కూడిన వార్తలు, వ్యాసాలు రాయవచ్చు. మంత్రిత్వ శాఖలు వాటికి అనుబంధంగా ఏర్పాటయిన స్థాయి సంఘాల నివేదికలు వివిధ శాఖల పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సమర్పించే నివేదికలు బిజినెస్ పాత్రికేయులకు బాగా ఉపకరిస్తాయి.

దేశంలోని ముఖ్యమైన వార్త సంస్థలు పి.టి.ఐ., యు.ఎన్.ఐ. ప్రత్యేకంగా ఆర్థిక సమాచార సర్వీసులను నిర్వహిస్తున్నాయి. ఎకనామిక్ సర్వీస్, కార్పొరేట్ ట్రెండ్స్, సైన్స్ సర్వీసును పి.టి.ఐ. ప్రారంభించింది. యునిఫెన్, యునిస్టాక్ పేరిట ప్రత్యేక సర్వీసులను యు.ఎన్.ఐ. ఆరంభించింది. పలు అంతర్జాతీయ వార్తా సంస్థలు కూడా ఈ విధమైన ప్రత్యేక సర్వీసులు ప్రారంభించాయి. కమ్యూనికేషన్ల రంగంలో వచ్చిన విప్లవం వల్ల క్షణాల మీద సమాచారం భూగోళం అంతా వ్యాపిస్తుంది. ఆధునిక కాలంలో సమాచారంపై పట్టుఉన్న దేశాలదే పెత్తనం. ఇంటర్‌నెట్‌గా వ్యవహరిస్తున్న అంతర్జాతీయ కంప్యూటర్ అనుసంధాన వ్యవస్థ ద్వారా. ప్రపంచ వ్యాప్తంగా సమస్త సమాచారం ఎప్పటికప్పుడు ప్రసారం అవుతున్నది. ఇలాంటి నెట్‌వర్క్‌లు స్థానికంగా కూడ ఏర్పటు చేస్తున్నారు. ప్రపంచబ్యాంకు తమ కార్యకలాపాలకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని నెట్‌వర్క్ ద్వారా అందించడానికి ఒక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. భారత వాణిజ్య, పారిశ్రామిక, రంగాల సమాచారం ఆన్‌లైన్‌పై అందించేందుకు భారత పారిశ్రామిక మండలాల సమాఖ్య (సి.ఐ.ఐ.) 'బిజినెట్' పేరిట ఒక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. ఈ నెట్‌వర్క్‌ను ఇతర అంతర్జాతీయ నెట్‌వర్క్‌లతో అనుసంధానం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అకౌంటెన్సీ, అడ్వర్టయిజ్‌మెంట్, మార్కెటింగ్, బ్యాంకింగ్, ఫైనాన్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఆటోమొబైల్, అంతర్జాతీయ వాణిజ్యం, వ్యవసాయం ఇలా వివిధ రంగాలకు సంబంధించి ఈ ప్రత్యేక పత్రికలు వెలువడుతున్నాయి. భారత్‌లో కూడా ఈ ధోరణి తలెత్తింది. ఈ పత్రికల నుంచి కూడా విలువైన సమాచారాన్ని క్రోడీకరించి క్లుప్తంగా పాఠకులకు అందజేసే అవకాశం ఉంది.

ఆర్థిక విధాన నిర్ణయాల విషయంలో వాణిజ్య, పారిశ్రామిక సంఘాల పాత్ర బాగా ఇటీవల పెరిగింది. అసోచెమ్, ఫిక్కి, సి.ఐ.ఐ. వంటి సంస్థలు ఎగుమతులు, దిగుమతులు, పన్నులు-రాయితీల సంయుక్తరంగాలు, బహుళజాతి సంస్థల విషయంలో ప్రభుత్వ నిర్ణయాలను ప్రభావితం చేసే పరిస్థితి నేడు ఉంది. అందువల్ల ఇలాంటి సంస్థల ప్రతినిధుల నుంచి కూడా బిజినెస్ విలేఖరులకు ఉపయుక్త సమాచారం లభిస్తుంది. స్టాక్ ఎక్ఛేంజ్‌లకు సంబంధించి సీనియర్ బ్రోకర్లు, చురుకైన ట్రేడర్లు కూడా

BRAOU

కీలకమైన సమాచారం అందజేస్తారు. అలాగే కార్పోరేట్ సంస్థల ముఖ్యులతో కూడా సత్సంబంధాలు చాలా అవసరం. భిన్నమార్గాల్లో భిన్న ఆధారాల ద్వారా సమీకరించిన సమాచారాన్ని స్థానిక అవసరాలు, పాఠకుల పరిమిత ప్రయోజనాలకు అనుగుణంగా మలచి అందించడంలోనే బిజినెస్ పాత్రికేయుల సామర్థ్యం రాణిస్తుంది.

## 9.7 పారిభాషిక పదాలు

వాణిజ్య విషయాలు రాసే జర్నలిస్టులకు కొన్ని సాంకేతిక పదాలకు అర్థాలు తెలియవలసివుంది. వీటినే పారిభాషిక పదాలు అంటుంటాం. ఈ అర్థాలు వాటిని ఎలా వాడాలో తెలిస్తే తప్ప వార్తలను సవివరంగా, సమగ్రంగా రాయడం సాధ్యపడదు.

ఎ.జి.ఎం. : వార్షిక సర్వసభ్య సమావేశం. ప్రతి కార్పోరేట్ సంస్థ ఏడాదికొకసారి షేర్‌హోల్డర్లందరిని ఆహ్వానించి నిర్వహించే సమావేశం. కంపెనీ తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలకు షేర్‌హోల్డర్ల అనుమతిని ఈ సమావేశంలో కోరుతారు.

అసెట్స్ : మార్కెట్ విలువ వున్న కంపెనీ స్థిర చరాస్తులు.

బేర్: స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు పతనం కావచ్చన్న భావనతో అమ్మకాలకు దిగి మార్కెట్ పతనానికి మరింత దోహదం చేసే ఆపరేటర్లను బేర్ ఆపరేటర్లుగా వ్యవహరిస్తారు.

బుల్ : స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు పెరిగే అవకాశం ఉందన్న విశ్వాసంతో, భారీగా కొనుగోళ్లు జరుపుచూ మార్కెట్ పెరుగదలకు తోడ్పడే ఆపరేటర్లను 'బుల్స్'గా వ్యవహరిస్తారు.

బి.ఐ.ఎఫ్.ఆర్ : పారిశ్రామిక ఆర్థిక పునర్నిర్మాణక మండలి. ఖాయిలా సంస్థలకు మళ్ళీ దారిలో పెట్టేందుకు ఏర్పాటయిన సంస్థ.

బ్లూచిప్స్ : ఏళ్ళుగా స్థిరమైన అభివృద్ధి సాధిస్తూ భవిష్యత్తులో కూడ మంచి అభివృద్ధి సాధించే అవకాశం ఉన్న సంస్థలను బ్లూచిప్స్‌గా వ్యవహరిస్తారు. స్టాక్ మార్కెట్‌లో ఈ సంస్థల షేర్లకు గిరాకి బాగ వుంటుంది.

బాండ్స్ : నిర్దిష్ట కాలపరిమితితో, నిర్ణీత వడ్డీ రేటుతో బాంకులు, కంపెనీలు, ప్రభుత్వం జారీ చేసే రుణ పత్రాలు. వీటికి ముఖ విలువ ఉంటుంది. కాలపరిమితి ముగిసిన తర్వాత బాండ్లు వెనక్కి తీసుకొని ముఖవిలువ మొత్తం చెల్లిస్తారు. దీనినే రిడెంప్షన్‌గా వ్యవహరిస్తారు.

బోనస్ ఇస్యూ : రిజర్వ్ నిధులు పేరుకుపోయిన సంస్థలు ఆ నిధులను కాపిటల్‌గా మార్చుకునేందుకు వీలుగా, కొంత మొత్తానికి సరిపడ ఉచితంగా షేర్లను, షేర్‌హోల్డర్లను జారీ చేస్తాయి. ఇలా జారీ చేసే షేర్లను బోనస్ షేర్లు అంటారు.

బి.ఎస్.ఇ : బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్. దీనినే దలాల్ స్ట్రీట్ అని కూడ అంటారు.

డివిడెండ్ : కంపెనీలు తమ నికర లాభంలోంచి షేర్ హోల్డర్లకు పంచే మొత్తాన్ని డివిడెండ్ అంటారు.

ఈక్విటీలు : కంపెనీల షేర్లు.

ఎగ్జిమ్‌బ్యాంకు: ఎగుమతి-దిగుమతి కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందించే బ్యాంకు.

ఎఫ్.ఐ.ఐ. : విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్.

జి.డి.ఆర్. : గ్లోబల్ డిపాజిటర్ రిసీట్. భారతదేశంలో కార్పోరేట్ సంస్థలు విదేశీ మారకద్రవ్యం కోసం జారీ చేసే ఈ జి.డి.ఆర్‌లు విదేశీ స్టాక్ ఎక్ఛేంజీల్లో లిస్టయి ట్రేడ్ అవుతుంటాయి.

మ్యూచువల్ ఫండ్స్: వ్యక్తిగత స్థాయిలో ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు తీసుకోలేని చిన్న ఇన్వెస్టర్ల కోసం ఇన్వెస్ట్‌మెంట్‌లో అనుభవంవున్న బడా సంస్థలు నిర్వహించే ఫండ్స్. ఇన్వెస్టర్ల నుంచి సమీకరించిన నిధులను ఈ ఫండ్స్ నిర్వాహకులు మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారు.

BRAOU

ఎన్.ఎస్.ఇ : నేషనల్ స్టాక్ ఎక్ఛేంజ్.

ఎన్.ఎ.వి : నెట్ అసెట్ వాల్యూ (నికర ఆస్తి విలువ).

ఓ.టి.సి.ఇ : ఓవర్ ది కౌంటర్ ఎక్ఛేంజ్.

ర్యాలి : స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరల పెరుగుదల

రేటింగ్ : స్థిరమైన వడ్డీని ఇచ్చే రుణపత్రాల విశ్వసనీయతకు కట్టే అంచనా. ప్రజలనుంచి డిపాజిట్లు సమీకరించే సంస్థలు కూడా రేటింగ్ తీసుకుంటాయి.

రైట్స్ ఇస్యూ : ఒక కంపెనీ కేవలం తన షేర్‌హోల్డర్లను మాత్రమే ముఖ విలువతోగాని, ప్రీమియంతో గాని షేర్లు కేటాయించడం.

సెబి : సెక్యూరిటీస్ ఎక్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా.

వెంచర్ కాపిటల్: రిస్క్ అధికంగా ఉండి మంచి లాభాలకు అవకాశం ఉన్న వ్యాపారంలో పెట్టే పెట్టుబడి.

వాల్ స్ట్రీట్ : న్యూయార్క్ స్టాక్ ఎక్ఛేంజ్.

## 9.8 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

భారత్ వంటి వర్ధమాన దేశాల్లో బిజినెస్ జర్నలిజంలో వుండేవారికి అసాధారణ సామాజిక బాధ్యత వుంది. ఇన్వెస్టర్ల హక్కులు, కంపెనీల బాధ్యతలకు సంబంధించి అభివృద్ధి చెందిన దేశాల్లో వున్న చట్టాలు, రక్షణలు మన దేశంలో లేవు. బిజినెస్ జర్నలిస్టులపై వచ్చిన అనేక విమర్శల వల్ల బిజినెస్ జర్నలిస్టులకు 'ప్రవర్తన నియమావళి' వుండాలని మాలెగావ్ కమిటి సిఫారసు చేసింది. ప్రెస్‌కౌన్సిల్‌తో సంప్రదించి, ఈ ప్రవర్తన నియమావళిని 'సెబి' ఖరారు చేయాలని కూడా కమిటీ సిఫారసు చేసింది.

బిజినెస్ జర్నలిజంలో అవినీతికి ఆస్కారం ఎక్కువగా ఉందన్న విమర్శలు వున్నాయి. రాజకీయ జర్నలిజంలో ఇతర విభాగాల్లో అవినీతి లేదని కాదు. కార్పోరేట్ సంస్థలు అందజేసే బహుమతుల వ్యవహారం ఇప్పటికీ వివాదస్పదంగా తయారయింది. ఈ బహుమతులు ఇతర ఆకర్షణల కారణంగా బిజినెస్ జర్నలిజంపై కొందరు ఆసక్తి పెంచుకుంటున్నారు. దీర్ఘకాలిక దృష్టితో చూసినప్పుడు, ఇది ఏమాత్రం మంచి పరిణామం కాదు. వ్యక్తిగత స్థాయిలో కొందరు పాత్రికేయులు, కొన్ని పత్రికలు మాత్రం, కార్పోరేట్ సంస్థలు విలేకరుల సమావేశాల్లో ఇచ్చే బహుమతులు అంగీకరించరాదని నిర్ణయం తీసుకున్నారు. రాజకీయ విలేఖరుల్లో అవినీతి, పత్రిక విశ్వసనీయతపై తక్షణమే ప్రభావం చూపే అవకాశం లేదు. బిజినెస్ జర్నలిజంలో మాత్రం ఆ అవకాశం తక్షణమే ఉంటుంది. బిజినెస్ విలేఖరులు అప్రమత్తంగా లేకపోతే, పాఠకుల్లోని ఇన్వెస్టర్లు నష్టపోతారు. తద్వారా పత్రికపై ఆ పాత్రికేయులపై విశ్వాసం పోతుంది. ఒక రకంగా భారత్ ఇప్పుడు సంధి దశలో వుంది. ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) కారణంగా అసాధారణ వేగంతో ఆర్థిక వ్యవస్థలో కార్యకలాపాలు సాగిపోతున్నాయి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకుని ప్రజలను మోసం చేసే వారి సంఖ్య పెరుగుతున్నది. హర్షద్‌మెహతా సెక్యూరిటీల కుంభకోణం ఒక ఉదాహరణ మాత్రమే. దీనిని బట్టబయలు చేసింది జర్నలిస్టులే. ఆంధ్రలో కూడ ఈక్విటి సంస్కృతిని ఆసరాగ చేసుకొని విజయవాడ, విశాఖపట్నం వంటి పట్టణాల్లోనే కాకుండ హైదరాబాద్‌లో కూడా ఇన్వెస్టర్లను దారుణంగా మోసగించిన కంపెనీలు, బ్రోకర్లు వున్నారు. చరిత్రలో ఇలాంటి అనుభవాలు ఎన్నివున్నా ఇన్వెస్టర్లు డబ్బు మీద ఆశ కారణంగా ఎప్పటకప్పుడు మోసపోతునే వుంటారు.

1710లో ఫ్రాన్స్‌లో షేర్ల వెర్రి ముదిరింది. ఒక గూని మనిషి తన వీపును షేర్ల దరఖాస్తులు రాయడానికి బల్లగా వుపయోగించి బాగ డబ్బు సంపాదించాడట. 1720-21లో బ్రిటన్‌లో బ్లాక్ సీబబుల్ ఏర్పడి కొత్త కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. షేర్ మార్కెట్‌లో ఈ కంపెనీల వాటాలు కొనడానికి ప్రజలు బారులు తీరారు. మంచి చెడులతో నిమిత్తం లేకుండా దాదాపు అన్ని ఇస్యూలు ఓవర్ స్క్రయిబ్ అయ్యాయి. ఒక కంపెనీ బ్రిటన్‌లో గాడిదలే లేనట్టు దక్షిణాఫ్రికా నుంచి గాడిదల దిగుమతికి పబ్లిక్ ఇస్యూ జారీ చేసింది. మరో కంపెనీ కోడిగ్రుడ్లు పెంకులపై ఉన్ని పెంచే ప్రాజెక్టు చేపట్టింది. డబ్బు

BRAOU

వ్యామోహంతో విచక్షణ లేకుండా వీటిల్లో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లు ఈ మోసం బద్దలయిన తర్వాత రాత్రికి రాత్రే కటిక దరిద్రులుగా మిగిలారు. 1920వ దశకం ఆఖరులో అమెరికన్ స్టాక్ మార్కెట్‌లలో సంభవించిన 'గ్రేట్‌క్రాష్' (మహాపతనం) వందలాది మందిని బజారుపాలు చేసింది. ఎంతో మంది ఆత్మహత్య చేసుకున్నారు. 1990-95 మధ్య భారత్ కూడ ఈ మోస్తరు అనుభవాలను చవిచూసింది. ఈ అయిదేళ్ల కాలంలో వచ్చిన రెండు భారీ స్టాక్ మార్కెట్ ఉత్థాన పతనాలతో లక్షలాది మంది ఇన్వెస్టర్లు ఘోరంగా దివాళ తీశారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన కంపెనీలు, ప్రజలనుంచి వేలకోట్ల రూపాయాలను సమీకరించాయి. అందులో అనేకం అడ్రస్ గల్లంతు కావడం గమనార్హం. సరళీకృత విధానాల కారణంగా వేలాది విదేశీ బ్రాండ్ వినియోగవస్తువులు మన మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. స్వదేశీ పరిశ్రమల అస్తిత్వం ఒక రకంగా ముప్పును ఎదుర్కొంటున్నది. ఈ నేపథ్యంలో బిజినెస్ జర్నలిస్టులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తే తప్ప ప్రజల ప్రయోజనాలను కాపాడడం సాధ్యం కాదు. వివిధ రంగాల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున సంస్కరణలు చేపట్టింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, కాపిటల్ మార్కెట్, పన్నుల వ్యవస్థ, ఎక్సైజ్, కస్టమ్స్, ఎగుమతి, దిగుమతి రంగాల్లో వస్తున్న మార్పులను యధాతథంగా రిపోర్టు చేయడంతో పాటు దేశ ప్రయోజనాల దృష్ట్యా వ్యాఖ్యానించడం కూడా అవసరం. ఈ సంధి దశలో దేశానికి ఉన్నత ప్రమాణాలతో కూడ బిజినెస్ జర్నలిస్టుల అవసరం చాలా వుంది.

## 9.9 నమూనా వార్త

**ఉదా:**

ఇస్యూ వార్త :

ఒక పబ్లిక్ ఇస్యూ వార్త 'ఈనాడు' పత్రికలో రాసిన విధానం ఇది. ఇది సంస్థ ప్రమోటర్ చెప్పిన విషయం యదాతథంగా రిపోర్టర్ మన ముందు ఉంచారు. అలా కాకుండా ఇస్యూ విశ్లేషణలో ఉన్న మంచి చెడులు. సంస్థ భవిష్యత్తు, ఉత్పత్తి, డిమాండ్, యాజమాన్యం సమర్థత వంటి అంశాలు అనేకం ప్రస్తావనకు వస్తాయి.

BRAOU

### మెట్రోపోలి ఓవర్‌సీస్ పబ్లిక్ ఇష్యూ 3న

*హైదరాబాద్, మే 18 (న్యూస్‌టుడే): హీట్ రెసిస్టెంట్ లేటెక్స్ త్రెడ్స్ (హెచ్.ఆర్.ఎల్.టి) ఉత్పత్తికి బెంగుళూరు సమీపంలోని హిడలు వద్ద ప్లాంట్‌ను నెలకొల్పుతున్న మెట్రోపోలి ఓవర్‌సీస్ లిమిటెడ్ రూ. 13.14 కోట్లు సమీకరించేందుకు జూన్ 3న పబ్లిక్ ఇష్యూ చేయనుంది. ఏడాదికి మూడువేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ ప్లాంట్‌కు అవసరమైన సాంకేతిక సహకారాన్ని, యంత్రాలను జర్మనీకి చెందిన ఎలాస్టోమర్స్ గుమిఫాడెన్ జిఎంబిహెచ్ (ఇజిజి) నుంచి పొందుతున్నట్లు డైరెక్టర్ అశోక్‌కుమార్ మొహతా విలేకరుల సమావేశంలో చెప్పారు. దుస్తుల తయారీలో ఈ ఎలాస్టిక్‌ను వినియోగిస్తారని, తిరుపూరు, ఈరోడ్ వంటి టెక్స్‌టైల్ యూనిట్లు అధికంగా ఉన్న పట్టాణాలకు సమీపంలో నెలకొల్పడానికి EA కారణమని అన్నారు. ముడి పదార్థమైన లేటెక్స్‌ను కేరళ రాష్ట్రం నుంచి సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్లాంటు జులై నెలలో వాణిజ్య ఉత్పత్తికి సిద్ధం కానున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రూ. 29.43 కోట్లు వ్యయం కాగలదని అంచనా. దీనిలో రూ. 7.60 కోట్లు ఐ.డి.బి.ఐ నుంచి రుణంగా పొందుతుండగా మిగిలిన రూ. 21.83 కోట్లను ఈక్విటీ ద్వారా సమకూర్చుకుంటోంది. వివిధ కేటాయింపులు పోను నికరంగా పబ్లిక్‌కు 60 లక్షల షేర్లను రూ.5 ప్రీమియంతో కంపెనీ జారీ చేయనుంది. ఇష్యూ అనంతరపు ఈక్విటీ రూ. 19.30 కోట్లలో ప్రమోటర్లకు 29.75 శాతం వాటా ఉంటుంది. తోలు వస్తువుల ఎగుమతి, రొయ్యల చెరువుల రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మెట్రోపోలి ఓవర్‌సీస్ లిమిటెడ్ కలకత్తా, మద్రాస్, బొంబాయి స్టాక్ ఎక్ఛేంజిలలో ఇప్పటికే లిస్టింగ్ పొందింది.*

ఉదా:

ఆర్థిక ఫలితాల వార్త :

కెమ్మాగ్రో ఇంటర్‌నేషనల్ అనే హైదరాబాద్ సంస్థ 1995-96 సంవత్సరానికి అంకెల రూపంలో విడుదల చేసిన ఫలితాలను వార్తగా ఎలా మార్చారో ఇక్కడ చూడవచ్చు. పబ్లిక్ ఇష్యూ సమయంలో కెమ్మాగ్రో జారీ చేసిన ప్రాస్పెక్టస్ దగ్గర ఉంచుకుని ఈ వార్తను రిపోర్టర్ వ్రాసిన విషయం గ్రహించగలరు.

| | | Rs. in lakhs |
|---|---|---|
| Particulars | Financial year-ended 31-03-1996 | Financial year-ended 31-03-1996 |
| Net Sales (net of Taxes and Duties | 3765 | 2042 |
| Other Income | 30 | 39 |
| Total Expenditure | 3010 | 1588 |
| Interest | 374 | 223 |
| Gross Profit after Interest but before Depreciation aand Taxation | 411 | 270 |
| Depreciation | 99 | 65 |
| Provision for Taxation | - | - |
| Net Profit/(Loss) | 312 | 205 |
| Paid-up Equity Share Capital | 853 | 853 |
| Reserves excludidng Revaluation Reserves | 530 | 336 |

**NOTES :**

1. The Board of Directors have recommended a maiden dividend of 15% on the Equity Share Capital of the Company.
2. The figures for 1994-95 relate to the period August 1994 to March 1995.
3. The above results were approved by the Board of Directors at their Meeting held on 17th May, 1996.

By Order of the Board

Place : Hyderabad
Date : 17th May, 1996

P R KUMACHANDRAN
Director and Presient

## కెమ్మాగ్రో ఇపిఎస్ 3.65

## తొలి డివిడెండ్ 15 శాతం

*హైదరాబాద్, మే 17 (న్యూస్‌టుడే): 'నాగార్జునా గ్రూపులోని కెమ్మాగ్రో ఇంటర్నేషనల్ లిమిటెడ్ 1995-96 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 15 శాతం డివిడెండ్ ప్రకటించింది. కంపెనీ నుంచి ఇదే తొలి డివిడెండ్ అవుతుంది. 1995-96లో కెమ్మాగ్రో ఇంటర్నేషనల్ రు. 38 కోట్ల టర్నోవర్ మీ రు. 4.11 కోట్ల స్థూల లాభం. రు. 3.12 కోట్ల నికర లాభం ఆర్జించింది. రు. 8.53 కోట్ల ఈక్విటీపై ఇది రు. 3.65 ఇపిఎస్ అవుతుంది. పూర్తి ఏడాదిక తరుగుదల కోసం రు. 99 లక్షలు కేటాయించారు. శుక్రవారం నాడిక్కడ జరిగిన కంపెనీ డైరక్టర్ల బోర్డు సమావేశం ఈ ఆడిటెడ్ ఫలితాలను పరిగణనలోకి తీసుకొంది. 1994 అక్టోబర్‌లో రు. 5 ప్రీమియంతో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన సందర్భంగా ఇచ్చిన లాభదాయకతర అంచనాలను కెమ్మాగ్రో ఇంటర్నేషనల్ సాధించలేకపోయినప్పటికీ. పెస్టిసైడ్స్ పరిశ్రమలో నెలకొని ఉన్న గట్టిపోటీ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని చూస్తే మాత్రం, పనితీరు పర్వాలేదని చెప్పాలి. 1995-96లో రు. 4.79 కోట్ల నికర లాభం సాధించగలమని పబ్లిక్ ఇష్యూ ప్రాస్పెక్టస్‌లో కంపెనీ పేర్కొనప్పటికీ. ఇది ఆచరణ సాధ్యం కాలేదు. అయితే 1995-96 ప్రథమార్థంతో పోలిస్తే ద్వితీయార్థంలో కంపెనీ పనితీరు కొద్దిగా మెరుగయింది. తొలి ఆరునెలల్లో రు. 17.95 కోట్ల టర్నోవర్‌పై రు. 1.46 కోట్ల నికరలాభం రాగా. మలి ఆరునెలల్లో రు. 20 కోట్ల టర్నోవర్‌పై రు. 1.66 కోట్ల నికరలాభం వచ్చింది.*

BRAOU

## 9.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1) వాణిజ్య వార్తల వర్గీకరణ వ్రాయండి.

2) వాణిజ్య వార్తలు ఎలా సేకరించాలి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1) వాణిజ్య వార్తల విలేఖనం

2) ఆర్థిక విధాన సంబంధమైన వార్తలు

**- వి. శ్రీనివాస్**

# భాగం - 10 : వ్యవసాయం

## విషయక్రమం

10.0 ఉద్దేశం
10.1 ప్రవేశిక
10.2 వ్యవసాయ వార్తలు, వాటి ప్రాధాన్యత
10.3 తెలుగులో వ్యవసాయ వార్తలు, పత్రికలు. పేజీలు
10.4 వ్యవసాయ వార్తలు, ఆధారాలు
10.5 వ్యవసాయ వార్తల సేకరణ - సమస్యలు
10.6 వ్యవసాయ వార్తా రచన, మెలకువలు
10.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
10.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 10.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు.

- వ్యవసాయ వార్తల ప్రాధాన్యత
- వ్యవసాయ వార్తా సేకరణ, సమస్యలు
- వ్యవసాయ వార్తా రచనలో మెలకువలు తెలుసుకుంటారు

BRAOU

## 10.1 ప్రవేశిక

మనది వ్యవసాయం ప్రధాన వృత్తిగా గల దేశం. మన దేశంలో నూటికి 70 మంది వ్యవసాయం, దాని అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా మన పత్రికల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన వార్తలకు పెద్దగా ప్రాధాన్యం లభించడం లేదు. మెజారిటీ పాత్రికేయులకు వ్యవసాయంపై కనీస అవగాహన కూడా లేదంటే అతిశయోక్తి కాదు. వ్యవసాయ వార్తలు సర్క్యులేషన్‌పై అంతగా ప్రభావం చూపలేవనే ఉద్దేశంతో పత్రికల యజమానులు, సంపాదకులు ఈ విషయమై శ్రద్ధ చూపడం లేదు. సకల రంగాల వారికి సమస్త సమాచారం అందించాలనే లక్ష్యం నుంచి వైదొలగిన పత్రికలు కేవలం సర్క్యులేషన్ దృష్ట్యానే వార్తలు ప్రచురిస్తున్నాయనడంలో సందేహం లేదు.

దేశ ప్రజల అవసరాలు తీర్చడమే కాక విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న వ్యవసాయ రంగం గురించి పాత్రికేయులు తెలుసుకోవడం చాలా అవసరం. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ఆవిర్భవించిన తర్వాత వ్యవసాయ రంగానికి క్రమంగా ప్రాధాన్యత పెరుగుతోంది. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ఆవిర్భావానికి ముందే వ్యవసాయ రంగం వార్తల్లోకి వచ్చింది. సబ్సిడీల కోత, ఎగుమతుల కోటా, దిగుమతులు వాటా మేధో సంపత్తి హక్కులు, జీన్ క్యాంపెయిన్, ఇలా ఒకటేమిటి అనేక విషయాలకు సంబంధించిన చర్చలకు పత్రికల్లో పెద్ద ఎత్తున చోటు లభించింది. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ఆవిర్భావంతో తలెత్తనున్న సమస్యలు, రానున్న కష్టాలు, రైతన్న నష్టాలు మొదలైన విషయాలపై భారతీయ రైతులను జాగృతం చేయడంలో దేశ

పత్రికారంగం విఫలమైందని చెప్పుకోవచ్చు. వాణిజ్యం, సుంకాల సాధారణ ఒప్పందం (గాట్)పై ఎడతెగని చర్చలు. ప్రపంచ వాణిజ్య వ్యవస్థ ఆవిర్భావం, అనంతర పరిణామాలు కేవలం మేధావులకు, విద్యావేత్తలకు మాత్రమే పరిమితమైన విషయంగా మారింది. ఈ ఒప్పందం వల్ల ఎవరు లాభనష్టాలకు గురవుతారో వారికే ఆ విషయం తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం గానీ, పత్రికలు గాని ఈ విషయమై సరైన సమాచారాన్ని అందజేయలేదు. పత్రికలు, ముఖ్యంగా భాషా పత్రికలు ఎంతో ముఖ్యమైన ఈ ఒప్పందం, దాని వెనకనున్న మర్మం, లాభనష్టాలు, ఎదురయ్యే సమస్యల గురించి పాఠకులకు తెలియజెప్పడంలో పూర్తిగా విఫలమయ్యాయి. దీనికి కారణం వ్యవసాయ రంగం గురించి అవగాహన కలిగిన పాత్రికేయులు లేకపోవడమే.

స్వాతంత్ర్యానంతరం దేశంలో ఎన్నడూ లేని స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వలు వుండడం, దిగుమతుల నుంచి ఎగుమతులు చేసే స్థాయికి ఎదగడం అభివృద్ధికర పరిణామాలే. అయినా ఎరువులు దొరకకపోవడం, నీటి పారుదల సౌకర్యాలన్నీ కొన్ని ప్రాంతాల్లోనే కేంద్రీకృతమవడం వంటి ఈ పరస్పర విరుద్ధమైన విషయాలపై పత్రికల్లో ప్రస్తావనే కనిపించదు. రైతుల అభివృద్ధి తద్వారా దేశప్రగతి కోసం వ్యవసాయ రంగం వార్తల పట్ల పత్రికలు శ్రద్ధ తీసుకోవాలి. దానికన్నా ముందు పాత్రికేయులు వ్యవసాయ రంగం పట్ల అవగాహన ఏర్పర్చుకోవాల్సిన అవసరముంది.

## 10.2 వ్యవసాయ వార్తలు - ప్రాధాన్యత

దేశంలోని మెజారిటీ ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్న విషయం తెలిసిందే. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించడం పత్రికల బాధ్యత అయితే ఆశ్చర్యకరంగా పత్రికలు మెజారిటీ ప్రజలకు అవసరమైన సమాచారంపట్ల కించిత్తు శ్రద్ధకూడా వహించడం లేదు. రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు. ఒక వేళ అక్షరాస్యులైనప్పటికీ వారు పత్రికలను కొని చదవలేరు. కనుక వ్యవసాయ వార్తలు ప్రచురించినా సర్క్యులేషన్ పెరగదు. అలాంటప్పుడు వ్యవసాయ వార్తలు ప్రచురించి విలువైన పేజీలను ఎందుకు వృథా చేయటమని పత్రికాధిపతులు, సంపాదకులు యోచిస్తుండవచ్చు. వ్యవసాయ వార్తలను రైతే చదవనక్కర్లేదు. రైతుకుటుంబంలోని వ్యక్తులు చదివి చెప్పడం ద్వారా రైతులు వ్యవసాయం గురించిన తాజా విషయాలను తెలుసుకుని లబ్ధిపొందేందుకు అవకాశముంది.

వ్యవసాయానికి నిర్వచనం విస్తృతమైంది. వ్యవసాయమంటే కేవలం ఆహారధాన్యాలు ఉత్పత్తి మాత్రమే కాదు. తోటల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, చేపల పెంపకం, పూలు, పండ్లు, కూరగాయల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్ళపరిశ్రమ, పాడిపరిశ్రమ ఇవన్నీ వ్యవసాయ రంగంలో భాగమే. వ్యవసాయ రంగంలో భాగమైన వీటికి ఎంతో ప్రాధాన్యముంది. కొన్ని వేల కోట్ల రూపాయల పెట్టుబడితో నడుస్తున్న ఈ రంగానికి సముచిత ప్రాధాన్యం లభించాల్సివుంది. పత్రికలు క్రమం తప్పకుండా ఆయా రంగాలకు సంబంధించిన విశేషాలు, విజ్ఞాన విషయాలు, ప్రగతి వార్తలు, పంటల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు వేయాల్సిన ఎరువులు, చల్లాల్సిన మందులు, కోయాల్సిన సమయం, మార్కెట్లు, ధరలు మొదలైన విషయాల గురించి సమగ్రమైన సమాచారం అందిస్తే వ్యవసాయరంగం ఎంతో అభివృద్ధి చెందుతుంది.

BRAOU

## 10.3 తెలుగులో వ్యవసాయ వార్తలు - పత్రికలు, పేజీలు

తెలుగులో అనేక పత్రికలున్నప్పటికీ వ్యవసాయ వార్తలకు లభించే ప్రాధాన్యం తక్కువ. తెలుగులో వ్యవసాయ వార్తలు క్రమం తప్పకుండా ప్రచురించే పత్రికలు రెండే వున్నాయి. అవి ఈనాడు, ఆంధ్రజ్యోతి. ఈనాడులో 'రైతేరాజు' ఆంధ్రజ్యోతిలో 'కృషి' కాలమ్‌లో వ్యవసాయ వార్తలు వస్తుంటాయి. కొత్తగా వస్తున్న 'వార్త'లో పల్లె అనే శీర్షికన గ్రామీణ సమస్యలు, వ్యవసాయ సమాచారం ఇస్తున్నారు. వ్యవసాయ వార్తలు రాసే పాత్రికేయులు లేనందున వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు, రీసెర్చి స్కాలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు ఇవి రాస్తున్నారు. ఈనాడు, ఆంధ్రజ్యోతిలో వచ్చే వ్యవసాయ వార్తలు ఎంతో ఉపయుక్తంగా వుంటున్నాయి. అయితే ఆ వార్తలు పెట్టే చోటు ఎక్కడో మూలన వుంటున్నందున అవి అందరి దృష్టిని ఆకర్షించడం లేదు.

పంటల తెగుళ్ళు, పశువుల రోగాలు, నివారణ, సస్యరక్షణ మందులు, పండ్ల తోటలు, పశువుల పెంపకం, ఉత్పత్తుల ఎగుమతి అవకాశాలు మొదలైన అంశాలపై ఈనాడు, ఆంధ్రజ్యోతి సమగ్రమైన సమాచారాన్ని ఇస్తున్నాయి. ఆయా అంశాలకు సంబంధించి నిపుణులు వ్యాసాలు రాస్తున్నారు.

తెలుగులో పూర్తి వ్యవసాయ పత్రిక 'అన్నదాత' మాత్రమే. ఈనాడు గ్రూపు నుంచి వెలువడుతున్న ఈ పత్రిక రైతుల ఆదరాభిమానాలు పొందింది. ఆయా ప్రాంతాల శీతోష్ణస్థితులు, వర్షపాతం, పంటలు, తెగుళ్ళు, సస్యరక్షణ, దిగుబడులకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని అందజేస్తోంది. ప్రతి నెలా బోనస్ బుక్‌గా ప్రత్యేక పంటలు, పశువుల పెంపకం, మొదలైన విషయాలపై సవివరమైన సమాచారాన్ని అందిస్తోంది. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక పనిముట్లు, మందులు పద్ధతులు, మార్కెట్ అవకాశాల గురించి రైతు లోకానికి వివరిస్తోంది. పూలతోటల పెంపకం, బొప్పాయి పెంపకం, గొర్రెల పెంపకం, పాడి పరిశ్రమ అభివృద్ధికి 'అన్నదాత' అవిరళ కృషి చేసింది. ద్రాక్షతోటలకు సంబంధించి తాజా సమాచారాన్ని అందించి రైతులకు లబ్ది చేకూర్చింది. అన్నపూర్ణ అయిన ఆంధ్రప్రదేశ్‌కు వ్యవసాయ ప్రగతి దాత 'అన్నదాత' అని చెప్పుకోవచ్చు.

## 10.4 వ్యవసాయ వార్తలు, ఆధారాలు

వ్యవసాయ వార్తలకు వ్యవసాయ మంత్రిత్వశాఖ, పశు సంవర్థక శాఖలు ఇచ్చే సమాచారం ముఖ్యమైనది. వ్యవసాయ రంగం పశువుల పెంపకం, పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, కోళ్ళపెంపకం, తోటల పెంపకం, పుట్టగొడుగులు పెంపకం మొదలైన వాటినికి సంబంధించిన సమాచారాన్ని వ్యవసాయ వార్తలుగా చెప్పుకోవచ్చు. విత్తనాలు, ఎరువులు, పంటలు, తెగుళ్ళు, సస్యరక్షణ, దిగుబడి ఎగుమతి, దిగుమతి, అతివృష్టి, అనావృష్టి మొదలైనవన్నీ వార్తల్లో భాగమే.

వ్యవసాయ వార్తలకు వ్యవసాయ మంత్రిత్వశాఖ, పాడిపరిశ్రమ శాఖ, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి శాఖలు, పంచాయతీరాజ్‌శాఖ మూలాధారాలు. ఆయా శాఖలనుంచి ఒక్కో అంశానికి సంబంధించిన సమాచారం లభిస్తుంది. గ్రామ, మండల స్థాయిలో గ్రామ సహాయాధికారి, మండల గ్రామీణాభివృద్ధి అధికారి, మండల అభివృద్ధి అధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా అభివృద్ధి అధికారి. వ్యవసాయ అధికారి, రాష్ట్రస్థాయిలో వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్లు, కార్యదర్శి నుంచి సమాచారాన్ని సేకరించవచ్చు. ప్రాంతాల వారీగావున్న వ్యవసాయ క్షేత్రఅధికారులు కూడా తగిన సమాచారం ఇవ్వగలరు. రైతుల నుంచి, వ్యాపారుల నుంచి గణాంక శాఖ అధికారుల నుంచి సమగ్ర సమాచారం పొందవచ్చు. పంటల పరిశోధనకు సంబంధించిన సంస్థలు మన రాష్ట్రంలో చాలా ఉన్నాయి. అవి కూడా సమాచార సేకరణకు ఉపయోగపడతాయి.

BRAOU

## 10.5 వ్యవసాయ వార్తల సేకరణ

వ్యవసాయ వార్తలను పైన పేర్కొన్న అధికారుల నుంచి సేకరించవచ్చు. ఉన్నతస్థాయి అధికారులు చెప్పే లెక్కలకు వాస్తవ పరిస్థితికి తేడా వుంటుంది. అధికారులు చెప్పే లెక్కలను వాస్తవ పరిస్థితితో అంచనావేసి వార్తలను రాయాల్సి వుంటుంది. ఒక్కోసారి కిందిస్థాయి అధికారులు ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వరు.

పంటలకు వచ్చిన తెగుళ్ళగురించి కింది స్థాయి అధికారులకు తెలియకపోవచ్చు. అలాంటప్పుడు తెగుళ్ళ గురించి తెలుసుకునేందుకు గాను ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్ర అధికారిని గానీ, జిల్లా అధికారులనుగానీ కలపడం మంచిది. పంట విస్తీర్ణం దిగుబడికి సంబంధించి తాజా సమాచారం గణాంకశాఖలో లభించడం కష్టం. అలాంటప్పుడు ఆ ప్రాంత వ్యవసాయ అధికారులను గానీ, వ్యవసాయ మంత్రిత్వశాఖను గానీ కలపడం వల్ల ప్రయోజనం వుంటుంది. ఎరువుల గురించిన సమాచారం సేకరించడం కష్టమైన పని. ఒక్కో జిల్లాకు కేటాయించిన ఎరువుల మొత్తం వాస్తవంగా పంపిణీ అయిన దానికి విరుద్ధంగా వుంటుంది. మొత్తం మీద మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో వ్యవసాయ వార్తలు, గణాంక వివరాలు ఖచ్చితంగా చెప్పడం అంత సులభం కాదు.

**అభ్యాసం : వ్యవసాయ వార్తలకు ఆధారాలేమిటో పేర్కొనండి.**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 10.6 వ్యవసాయ వార్తా రచన, మెలకువలు

వ్యవసాయ వార్తలు రాసే వారికి వ్యవసాయరంగం పట్ల సంపూర్ణ అవగాహన వుండాలి. ఆయా ప్రాంతాల శీతోష్ణస్థితి, నేల స్వభావం, వర్షపాతం రుతుపవనాలు, ఎరువులు, నీటి పారుదల సౌకర్యాల గురించి ముందుగా తెలిసి వుండాలి. విత్తనాలు, పంటలు, పంటకాలం, రైతులు అనుసరించే పనిముట్లు, పద్ధతులు, తరచుగా వచ్చే తెగుళ్ళు, నివారణ చర్యలు. ఎరువులు, క్రిమిసంహారక మందులు, దిగుబడి గురించి అవగాహన వుండాలి. రైతుల అలవాట్లు పంటల ప్రాధాన్యతలు, కొత్త వంగడాలు, మందులు, మిశ్రమపంటలు, లాభాలు మొదలైన విషయాల గురించి తెలిసి వుండాలి. వ్యవసాయ రంగానికి సబంధించి ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, స్థానిక పదజాలం తెలిసివుండాలి. వ్యవసాయ రంగానికి సంబంధించిన అధికారులతో సంబంధాలు పెట్టుకోవాలి. రైతులు, గ్రామపెద్దలు, మోతుబరి రైతులతో నిత్య సంబంధాలు వుండాలి.

1. వ్యవసాయ వార్తలు సూటిగా, స్పష్టంగా వుండాలి.
2. రైతులకు అర్థమయే రీతిలో సరళమైన భాషలో వుండాలి.
3. స్థానికంగా మాట్లాడే భాషను, పదజాలాన్ని ఉపయోగించాలి.
4. వ్యవసాయ వార్తల్లో భాషా పటాటోపం కవిత్వం వుండకూడదు.
5. ఎరువుల, విత్తనాలకు సంబంధించి ఇంగ్లీష్ పేర్లు శాస్త్రీయ నామాలు వాడరాదు.
6. తెగుళ్ళు, చీడలకు సంబంధించి స్థానికంగా ఉపయోగించే పదాలనే వాడాలి .
7. హెక్టార్లలో కాక ఎకరాల్లో చెబితే సులువుగా అర్థమవుతుంది.
8. ఏ ఉత్పత్తులను ఏ మార్కెట్‌కు తీసుకువెళ్తే అధికధర లభిస్తుందో చెప్పాలి.
9. ఉత్పత్తులను నిల్వ చేసుకునే గిడ్డంగుల గురించి పూర్తి సమాచారం ఇవ్వాలి.
10. ఆయా ప్రాంతాల శీతోష్ణస్థితి, వర్షపాతం నేలలను బట్టి ఏ పంటలువేస్తే బాగుంటుందో వివరంగా చెప్పాలి.
11. సహజ ఎరువుల వాడకం ప్రాధాన్యాన్ని, పర్యావరణ పరిరక్షణ గురించి తేలిక మాటల్లో తెలపాలి.
12. కృత్రిమ ఎరువులను అతిగా వాడకం వల్ల నష్టాలను తెలియచెప్పాలి.
13. మిశ్రమ పంటల వల్ల కలిగే లాభం గురించి చెప్పాలి.
14. ఆధునిక వ్యవసాయపనిముట్లు, పద్ధతులు, బ్యాంకు రుణాలగురించి చెప్పాలి.
15. మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏ పంటలు ఎప్పుడు వేస్తే లాభమో చెప్పాలి.
16. అర్థంకాని గణాంకాలతో బెదరకొట్టకుండా తేలికైన మాటల్లో లాభనష్టాలను గురించి తెలియజేయాలి.
17. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులు, అవిచూపగల ప్రభావం గురించి పడికట్టు మాటల్లో కాకుండా వారికి అర్థమయ్యే రీతిలో చెప్పాలి.

BRAOU

18. ఇతర ప్రాంతాల్లోని రైతులు ఏ పద్ధతుల ద్వారా ఏ విధంగా లబ్ధి పొందుతున్నదీ చెప్పి స్ఫూర్తి కలిగించాలి.

19. ఎప్పుడూ ఒకే పంటలు కాకుండా భిన్న రకాలైన పంటలు పండించేలా వాళ్ళకు నచ్చజెప్పాలి.

20. పుట్టగొడుగులు, పూల తోటలు, పండ్ల తోటలు, చేపలు, రొయ్యల పెంపకం. టేకు సిరిగంధం మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలను వివరించాలి.

21. ఏ సహాయం కోసం ఎవరిని సంప్రదించాలో తెలియజేయాలి.

## 10.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ మనది ప్రధానంగా వ్యవసాయదేశం. దేశంలో దాదాపు నూటికి డెబ్బైమంది ప్రజలు వ్యవసాయం మీదే ఆధారపడి వున్నారు.

★ అయినా మన పత్రికల్లో వ్యవసాయ వార్తలకు చోటుదొరకడం లేదు.

★ వ్యవసాయ రంగానికి సంబంధించిన సమాచార వ్యాప్తిలో పత్రికలు విఫలమైనాయని చెప్పడంలో సందేహంలేదు.

★ తెలుగు పత్రికల పరిస్థితి ఈ విషయంలో మరీ అధ్వాన్నంగా వుంది. వారానికి ఒకరోజో రెండురోజులో తప్ప వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రత్యేకాంశాలు పత్రికల్లో కనిపించవు.

★ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా వ్యవసాయ రంగవార్తల ప్రచురణ ఎంతయినా అవసరం. వ్యవసాయ వార్తల సేకరణలో పాత్రికేయులు-భాష, పదజాలం, స్థానిక భౌగోళిక, నైసర్గిక స్వరూపాలు, పంటల తీరుతెన్నులు తెలుసుకుని వుండాలి. సులభంగా కూడా విషయాన్ని విడమరిచి చెప్పగలగాలి.

BRAOU

## 10.8. మాదిరి-పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వ్యవసాయ వార్తలు ఎలా రాయాలి?

2. తెలుగు పత్రికల్లో వ్యవసాయ వార్తల గురించి రాయండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వ్యవసాయ వార్తలు ఏవి?

2. వ్యవసాయ వార్తల సేకరణలో సమస్యలేవి?

**- ఎం.ఇ.వి. ప్రసాదరెడ్డి**

# భాగం - 11 : క్రీడలు

## విషయక్రమం

11.0 ఉద్దేశం
11.1 ప్రవేశిక
11.2 క్రీడా వార్త నిర్వచనం
11.3 క్రీడారంగ పత్రికలు పూర్వాపరాలు
11.4 క్రీడా వార్తల్లో రకాలు
11.5 మామూలు వార్తలకు, క్రీడారంగ వార్తలకు తేడా
11.6 క్రీడా వార్తల పదజాలం
11.7 క్రీడారంగ రచయితలకు కావలసిన అర్హతలు
11.8 క్రీడా వార్తా రచన
11.9 తెలుగులో క్రీడా రచయితల పరిమితులు
11.10 ఛాయా చిత్రాల ప్రాధాన్యత
11.11 వార పత్రికలు, ఇతర మ్యాగజైన్లలో క్రీడా వార్తలు
11.12 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
11.13 నామూనా వార్తలు
11.14. మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 11.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- క్రీడారంగ వార్తలంటే ఏమిటో అర్థం చేసుకుంటారు.
- క్రీడారంగ వార్తలు రాసే పద్ధతి నేర్చుకుంటారు.
- తెలుగు క్రీడా వార్తల తీరు తెన్నులను అవగాహన చేసుకుంటారు.

## 11.1 ప్రవేశిక

మనిషి జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యమైనవి. కాని జీవితంలో అనేక ముఖ్యవిషయాలు నిర్లక్ష్యం చేయబడినట్టుగానే క్రీడలు కూడా నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. మనిషి మానసిక, శారీరక వికాసంలో ప్రధానపాత్ర వహించే క్రీడలను ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదు. ఇతర దేశాల్లో క్రీడలకున్న ప్రాధాన్యత చెప్పలేనిది. ఒక్కో క్రీడ పేరు చెప్పగానే ఒక్కో దేశం గుర్తుకువస్తుంది. ఆయా క్రీడలకు ఆ దేశాలు అంత ప్రాధాన్యాన్ని ఇస్తున్నాయన్న మాట. మన దేశంలో మనమూ, ప్రభుత్వమే కాదు పత్రికలు, రేడియో, టెలివిజన్లు కూడా క్రీడలకు ఆఖరిస్థానాన్నే ఇస్తున్నాయి. పత్రికల్లో చివరి పేజీల్లో దర్శనమిచ్చే క్రీడావార్తలు, రేడియో టెలివిజన్లలో చివరన వినిపిస్తాయి.

ఇంతగా నిర్లక్ష్యానికి గురవుతున్న ఈ క్రీడల వార్తలను ఎవరైనా రాయవచ్చా? రాయవచ్చు అని అనుకుంటారు. చాలా మంది. కానీ అది సరికాదు. నిజానికి క్రీడావార్తలు రాసేందుకు ప్రత్యేకమైన అర్హతలు వుండాలి. క్రీడా పదజాలం తెలియాలి.

BRAOU

సౌందర్యదృష్టి వుండాలి. ఆయా క్రీడల ప్రాధాన్యాన్ని, ఛాయాచిత్రాల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి. సరే, క్రీడా వార్తల గురించి సవివరంగా తెలుసకుందాం.

## 11.2 క్రీడావార్త - నిర్వచనం

క్రీడలకు సంబంధించిన వార్తలను క్రీడావార్తలుగా నిర్వచించుకోవచ్చు. అయితే క్రీడలకు సంబంధించినవి మాత్రమే క్రీడావార్తలా? క్రీడాకారులకు, క్రీడా సంఘాలకు సంబంధించినవి క్రీడావార్తలు కావా అన్న సందేహం కలగవచ్చు. కానీ 'క్రీడలు' అంటే కేవలం ఆటలపోటీలు మాత్రమేనని అనుకోకూడదు. క్రీడాకారుల వ్యక్తిగత విషయాలు, సంస్థాగత విషయాలు ఇవన్నీ క్రీడల్లో భాగమే. క్రీడలకు, సంబంధించిన సమస్త విషయాలు చివరికి వ్యాపారాంశమైన 'స్పాన్సర్‌షిప్'తో సహా అన్నీ క్రీడల్లో భాగమే. ఈ విస్తృతార్థంలో క్రీడారంగానికి సంబంధించిన ప్రతి అంశం 'క్రీడావార్త' అవుతుంది.

అయితే రాజకీయ, సామాజిక కారణాలవల్ల, క్రీడలకు సంబంధించినవే అయినా కూడా కొన్ని క్రీడావార్తలు పరిధిలోకి రావు. 1985లో బ్రసెల్స్ నగరం హీసెల్ స్టేడియంలో ఫుట్‌బాల్ అభిమానుల సాగించిన హింసాకాండ, ఫలితంగా జరిగిన తొక్కిసలాటవల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోవడం కేవలం 'క్రీడావార్త' కాబోదు. ఈ సంఘటనకు నేపథ్యం ఫుట్‌బాల్‌పోటీ అయినప్పటికీ హింసాప్రవృత్తి, శాంతి భద్రతల వంటి సామాజిక, రాజకీయ అంశాలవల్ల ఇలాంటి వార్తలు క్రీడలపేజీ పరిధిని దాటి మొదటి పేజీకి చేరతాయి. క్రీడాంశం తెరమరుగవుతుంది. అలాగే అమెరికాకు చెందిన రగ్బీ ఆటగాడు ఒ.జె.సింప్సన్ హత్య చేశాడన్న ఆరోపణ, ఆ అభియోగంపై జరిపిన విచారణ క్రీడావార్త కాలేదు. అదే టెన్నిస్ స్టార్ స్టెఫీగ్రాఫ్ తండ్రిని జర్మనీలో ఆదాయంపన్ను శాఖ అధికారులు అరెస్టుచేయడానికి సంబంధించిన వివాదం మాత్రం క్రీడావార్తగానే మిగిలింది. ఎందుకంటే ఇందులో రాజకీయ కారణాలు, పరిణామాలు, ఏమీలేవు. కానీ ఒ.జె.సింప్సన్ కేసు మాత్రం అమెరికాలోని వర్ణవివక్ష వివాదంతో ముడిపడి ఉంది. అందుకే అది రాజకీయవార్తయిందే తప్ప క్రీడావార్త కాలేదు. సినీనటుడు సంజయ్‌దత్‌ను 'టాడా' చట్టం కింద అరెస్టు చేయడం సినిమాపేజీ వార్త ఎలా కాదో ఇదీ అంతే.

క్రీడావార్తలకోసం సాధారణంగా దినపత్రికలలో ఆఖరు పేజీలు కేటాయిస్తుంటారు. అయితే ఆఖరున ఉన్నంతమాత్రాన క్రీడావార్తల ప్రాధాన్యతను తక్కువగా అంచనావేయడానికి లేదు. చాలామంది క్రీడాభిమానులు ఉర్దూ చదివినట్టుగా దినపత్రికను వెనకనుంచి చదవుతారు. క్రీడల పేజీలో స్కోరులు, వగైరా చూశాకనే మొదటిపేజీకి వచ్చిరాజకీయ విశేషాలు, తెలుసుకుంటారు. మంత్రివర్గ విస్తరణలో ఎవరెవరికీ కొత్తగా పదవులు లభించాయో తెలుసుకోవాలన్న ఆసక్తి ఎలాంటిదో క్రీడాభిమానులకు క్రికెట్ జట్టులో కొత్తగా ఎవరికి స్థానం లభించిందో చదవాలన్న కోరిక కూడా అలాంటిదే. 1982 ఢిల్లీ ఆసియా క్రీడలప్పటినుంచి టెలివిజన్ ప్రభావం వల్ల మనదేశంలో క్రీడలపై ఆసక్తి పెరిగింది. అంతకు ముందు క్రీడల్లో ప్రవేశం ఉన్నవారికే వాటిలో ఆసక్తి ఉండేది. కానీ టీవీవల్ల, క్రీడాకారులు కానివారు కూడా టీవీద్వారానే ఆటలు నేర్చుకుని వాటి అభిమానులైపోతున్నారు. ఈ కారణంగా పత్రికల్లో కూడా క్రీడావార్తలకు ప్రాధాన్యం పెరిగింది. ఒలింపిక్స్‌లాంటి ముఖ్యమైన పోటీలప్పుడు దినపత్రికలు, వారపత్రికలు ప్రత్యే అనుబంధాలు ప్రచురించడం ఇప్పుడు పరిపాటైపోయింది.

ముఖ్యమైన క్రీడావార్తలు కేవలం క్రీడలపేజీలకే పరిమితమవ్వవు. క్రీడారంగానికి పెరిగిన ప్రాముఖ్యత వల్ల కొన్ని క్రీడావార్తలు మొదటి పేజీలోనే కనిపిస్తుంటాయి. అందువల్ల కేవలం క్రీడలపేజీల్లో వచ్చినవే క్రీడావార్తలనుకోవడానికి లేదు. 1988 సియోల్ ఒలింపిక్స్‌లో బెన్‌జాన్సన్ 'డ్రగ్స్' వాడినట్టు రుజువైనప్పుడు తెలుగు పత్రికలతో సహా అన్ని దినపత్రికలు మొదటిపేజీ ప్రధాన శీర్షికల్లో ఆ వార్తను ప్రచురించాయి. 1983లో మన క్రికెట్‌జట్టు ప్రపంచకప్ గెలిచినప్పుడు గవాస్కర్ 10వేల పరుగులు పూర్తిచేసిన సందర్భాలలో, కపిల్‌దేవ్ టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలరైనప్పుడు కూడా అన్ని పత్రికలు మిగతా వార్తల్ని పక్కనపెట్టి ఆవార్తల్ని మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించాయి. 1976లో భారతక్రికెట్‌జట్టు టెస్ట్ ఆఖరు ఇన్నింగ్స్‌లో 400లకుపైగా పరుగులు చేసి వెస్టిండీస్‌పై సంచలన విజయంసాధించినపుడు కొన్ని తెలుగు పత్రికలు కూడా ఆవార్తను మొదటిపేజీలో ఫోటోలతో సహా ప్రచురించాయి.

BRAOU

## 11.3 క్రీడారంగ పత్రికలు - పూర్వాపరాలు

క్రీడల్లో లాగానే, స్పోర్ట్స్ జర్నలిజం విషయంలోనూ కొన్ని పాశ్చాత్యదేశాలతో పోలిస్తే మనదేశం చాలా వెనుకబడిఉంది. అక్కడి పత్రికలలో క్రీడారంగ వార్తలకు విశేష ప్రాధాన్యం ఉండడమే కాకుండా, కొన్ని దేశాల్లో క్రీడారంగ దిన పత్రికలు కూడా ఉన్నాయి. అమెరికాలో ఈ మధ్యదాకా "నేషనల్ స్పోర్ట్స్ డైలీ"అనే దిన పత్రిక ఉండేది. ఇటలీలోని "గజిటో డిలోల స్పోర్ట్స్" "కెరెర్‌డిల్లో స్పోర్ట్స్" ఫ్రాన్స్‌లో 'లీఎక్విప్' కేవలం క్రీడారంగ వార్తలతో వచ్చే దినపత్రికలు అలాగే బ్రెజిల్‌లో కూడా ఓ దినపత్రిక కేవలం క్రీడావార్తలే ఇస్తుంది. ఆసియాదేశమైన జపాన్‌లో కూడా ఓ క్రీడారంగ దినపత్రిక మొదలయింది.

ఈ దినపత్రికలే కాక అంతర్జాతీయంగా వెలువడే కొన్ని ప్రముఖమైన మ్యాగజైన్లు ఉన్నాయి. "విస్‌డెన్ క్రికెట్ మంత్లీ" "క్రికెటర్", "టెన్నిస్", "స్పోర్ట్స్ ఇలస్ట్రేటెడ్" ఇలాంటి వాటిలో ముఖ్యమైనవి. కేవలం క్రీడారంగం ఫోటోలనందించే "ఆల్‌స్పోర్ట్స్" అనే ఫోటో సిండికేట్ కూడాఉంది.

అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖులైన క్రీడా రచయితల విషయానికొస్తే సర్‌నెవిల్ కార్డస్, జాక్‌ఫింగ్లెటన్ టోనీకోజియర్, మైక్ కొవార్డ్ (క్రికెట్), బ్రియాన్ గాన్‌విల్ (ఫుట్‌బాల్), జాన్‌బాలంటైన్ (టెన్నిస్) వంటి ప్రముఖులు గుర్తుకొస్తారు. ముఖ్యంగా నెవిల్ కార్డస్ క్రికెట్ వార్తల రచనకు ప్రత్యేక ఒరవడి దిద్దిన వాడు.

ఇండియాలో క్రీడారంగవార్తల కోసం ప్రత్యేక దినపత్రికను ప్రారంభించడానికి ఎవరూ సాహిసించలేదు. తొలిరోజుల్లో "ది హిందూ" పత్రిక సంస్థనుంచి " స్పోర్ట్స్ అండ్ పాస్‌టైం" అనే మ్యాగజైన్ వచ్చేది. ఇందులో క్రీడలతోపాటు కొంతభాగాన్ని సినిమాలు, ఇతర వినోదాంశాలకు కేటాయించేవారు. బెంగాలీలో కూడా ఒకటి అరా పత్రికలు క్రీడారంగంపై వచ్చేవి. ఇండియాలో మొట్టమొదటి పూర్తిస్థాయి క్రీడారంగ పత్రిక "స్పోర్ట్స్‌వీక్" ఈ వారపత్రికను ఇంక్విలాబ్ సంస్థ 1968లో ప్రారంభించింది. తర్వాత 1978లో "స్పోర్ట్స్ వరల్డ్", 1979లో "ది స్పోర్ట్స్ స్టార్" ప్రారంభమయ్యాయి. ఇవికూడా వార పత్రికలే. "స్పోర్ట్స్ వరల్డ్" కు మన్సూర్ అలీఖాన్ పటౌడీ, "స్పోర్ట్స్ వీక్"కు సునీల్ గవాస్కర్ సంపాదక బాధ్యతలు చేపట్టారు. కానీ ఇలాంటి ప్రముఖుల దన్నులేకపోయినా ఆకర్షణీయమైన ఫోటోలు, 'ది హిందూ' యంత్రాంగం కారణంగా "దిస్పోర్ట్స్ స్టార్" క్రీడారంగ పత్రికలలో ముందుంది. "స్పోర్ట్స్ వీక్" పత్రిక మూతపడింది. "స్పోర్ట్స్ న్యూస్", "ఒలింపియన్". హైదరాబాద్‌నుంచి కొన్నాళ్ళు వెలువడిన "స్పోర్ట్స్ డైజెస్ట్" (ఎం.ఎల్. జయసింహ దీని సంపాదకుడు) కూడా నిలదొక్కుకోలేక పోయాయి.

ప్రాంతీయ భాషలలో కూడా కొన్ని క్రీడారంగ పత్రికలున్నాయి. హిందీలో "క్రికెట్ సమ్రాట్" "ఖేల్ హల్‌చల్" లాంటి మ్యాగజైన్లు, మారాఠీలో క్రికెటర్ సందీప్‌పాటిల్ సంపాదకత్వంలో " ఏకాచి షట్కార్" వంటి పత్రికలున్నాయి. ఇవన్నీ క్రికెట్‌కు సంబంధించినవే. బెంగాలీలో "ఖేలా", "ఖేలా అసార్" అనే క్రీడారంగ పత్రికలున్నాయి. ఇవి కేవలం ఫుట్‌బాల్ గురించి రాస్తూ, బెంగాలీలకు ఆక్రీడపై ఉన్న మక్కువ వల్ల నిలదొక్కుకున్నాయి. ఇంకా కలకత్తాలో ఫుట్‌బాల్ సీజనప్పుడు "ఫుట్‌బాల్" "మదర్‌కథా" లాంటి చిన్న పత్రికలు ఆ రెండుమూడు నెలలపాటే వెలువడతాయి.

మనదేశానికి చెందిన క్రీడారచయితలలో మొదటివాడు ఎ.ఎఫ్.ఎస్. "బాబీ" తల్యార్‌ఖాన్. ఇతర ప్రముఖులు కె.ఎస్ ప్రభు,రాజు భరతన్, రాన్ హెండ్రిక్స్, కె.టి.పి. సారథి, రాజన్‌బాలా, ఆర్.మోహన్, నిర్మల్‌శేఖర్, అయాజ్ మెమన్.

తెలుగులో స్పోర్ట్స్ జర్నలిజం బాగా ఆలస్యంగా మొదలయింది. 1984లో "ఉదయం" దిన పత్రికలో తెలుగులో ప్రత్యేక క్రీడావిభాగం, క్రీడలకు ప్రత్యేక పేజీ ప్రారంభమయ్యాయి. అయితే ఇపుడు తెలుగు పత్రికలు పూర్తిస్థాయిలో క్రీడావార్తలను అందిస్తున్నాయి. ఒలింపిక్స్, ప్రపంచకప్ క్రికెట్ లాంటి ముఖ్యమైన ఈవెంట్ల సందర్భంలో తెలుగు పత్రికలు ఇంగ్లీషుపత్రికలకు దీటుగా వార్తల నందిస్తున్నాయి. రంగులఫోటోలు తెలుగు దిన పత్రికలు ప్రత్యేకత. అయితే తెలుగులో క్రీడారంగ పత్రికంటూ ఇంకా ఏదీ లేదు.

BRAOU

**అభ్యాసం-1: 1. క్రీడావార్తను నిర్వచించండి?**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

**2. క్రీడా పత్రికల్లో ఏవేని నాలుగు పత్రికలను పేర్కొనండి?**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 11.4 క్రీడావార్తల్లో రకాలు

క్రీడావార్తల్లో చాలా రకాలున్నాయి. దినపత్రికల్లో ప్రధానంగా కనిపించేవి అంతకుముందు రోజు జరిగిన వివిధ పోటీల వివరాలు, విశేషాలు, ఇవేగాక ఆరోజున ప్రారంభం కాబోయే ముఖ్యమైన పోటీలలో పాల్గొనే జట్ల వివరాలు, వారి వారి విజయావకాశాలకు సంబంధించిన వార్తలు కూడా ఉంటాయి. గుర్రప్పందాల విషయానికొస్తే ఆరోజు రేసుల్లో పాల్గొనే గుర్రాల విజయావకాశాలకు సంబంధించిన 'టిప్స్'తో 'రేస్‌కార్డ్‌ను' పత్రికలు ప్రచురిస్తాయి.

పోటీల గురించేగాక క్రీడాకారుల వ్యక్తిగత విషయాలు, ఇతర వివాదాలు కూడా క్రీడల పేజీల్లో కనిపిస్తాయి. క్రీడలకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు, వివిధ క్రీడాసంఘాల కార్యకలాపాలకు కూడా ఈ పేజీల్లో స్థానం ఉంటుంది.

క్రీడావార్తల్లో అతి ముఖ్యమైనవి ఛాయాచిత్రాలు. "వెయ్యిపదాలతో వివరించలేని" ఒక క్రీడాంశాన్ని "ఒక్కఫోటో" చూపించగలుగుతుంది. ఒక్క ఫోటో కూడా లేని క్రీడల పేజీని మనం అరుదుగా చూస్తాం. దీనిని బట్టే ఫోటోల ప్రాముఖ్యత అర్థం చేసుకోవచ్చు.

గణాంక వివరాలు కూడా క్రీడావార్తల్లో ముఖ్యమైనవి. కొత్తరికార్డు నెలకొల్పిన సమయంలోగానీ, ఏదైనా ప్రధానమైన టోర్నమెంటు ప్రారంభమయ్యేప్పుడుగానీ గతంలోని రికార్డులు, పూర్వవిజేతలకు సంబంధించిన గణాంకాల పట్టికలను తరచు మనం పత్రికల్లో చూస్తుంటాం. అలాగే ఒలింపిక్స్ లాంటి ప్రధానమైన పోటీలు జరిగేప్పుడు గతంలోని ఒలింపిక్‌క్రీడల విశేషాలవంటివి కూడా పత్రికలు అందిస్తాయి. ఇలాంటి పోటీలప్పుడు క్రీడామైదానాల వెలుపల జరిగే సరదా సంగతులను కూడా 'సైడ్‌లైట్స్' గా పత్రికలు రాస్తాయి.

వార్తలతోపాటు క్రీడలకు సంబంధించిన వివిధ అంశాలపై స్పందిస్తూ ప్రముఖ పాత్రికేయులు రాసే వ్యాసాలను కూడా క్రీడలపేజీల్లో ప్రచురిస్తాయి. ఇలాంటి వ్యాసాలు ఎక్కువగా విమర్శనాత్మక ధోరణిలో సాగుతాయి. జట్ల ఎంపికలోని లోటుపాట్లు, ప్రభుత్వక్రీడా విధానంలోని లోపాలు, అంతర్జాతీయ పోటీల్లో మన జట్ల ఓటమి, క్రీడా ప్రమాణాల మెరుగుదల మొదలైన విషయాలపై వ్యాసాలు వస్తుంటాయి.

BRAOU

పాత్రికేయులు రాసే వ్యాసాలే కాక ప్రఖ్యాతులైన క్రీడాకారులు రాసే 'కాలమ్స్' కూడా ఇటీవలి కాలంలో చూస్తున్నాం. క్రికెట్‌పై సునిల్ గవాస్కర్, రవిశాస్త్రి, దిలిప్ వెంగ్‌సర్కార్, శ్రీకాంత్, మహమ్మద్ అజరుద్దీన్, టెన్నిస్‌లో రామనాథన్ కృష్ణన్, విజయ్ అమృత్‌రాజ్, బాడ్మింటన్‌లో ప్రకాశ్ పదుకొనె, బిలియర్డ్స్‌లో గీత్‌సేఠి లాంటి వారు ఇలాంటి 'కాలమ్స్' రాస్తున్నారు. అంతర్జాతీయస్థాయిలో విశేషానుభవం గడించిన ఇలాంటి ప్రముఖుల అభిప్రాయాలకు పాఠకులలో మంచి ఆదరణ ఉంది. విదేశాలకు చెందిన క్రీడాకారులు కూడా ఇటువంటి కాలమ్స్ రాస్తున్నారు.

క్రీడాకారుల పరిచయ వ్యాసాలు (ప్రొఫైల్స్) కూడా క్రీడల పేజీల్లో ప్రచురిస్తుంటారు. ఉదాహరణకు ఒక కొత్త క్రికెటర్ టెస్ట్‌పోటీల్లో రాణించినపుడు అతని స్వస్థలం గురించి, అతని కోచ్‌గురించి, రంజీట్రోఫీ మొదలైన పోటీల్లో అతను సాధించిన రికార్డుల గురించి రాస్తూ ఓ వ్యాసం ప్రచురిస్తారు. అలాగే ఒక మాజీ క్రీడాకారుడికి 'బెనిఫిట్' పోటీ సందర్భంలో అతను గతంలో సాధించిన విజయాలను గుర్తు తెచ్చుకుంటూ వ్యాసాలు రాస్తారు. వర్తమాన క్రీడాకారుల గురించికూడా వారిలోని సామర్థ్యాన్ని వివరిస్తూ ఇలాంటి పరిచయవ్యాసాలు వస్తుంటాయి.

గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పోటీలకు సంబంధించిన వార్తలను, ముఖ్యంగా భారతీయ భాషల్లోని పత్రికలు ప్రచురిస్తుంటాయి. ఇలాంటి పోటీలకు పెద్దగా ప్రాధాన్యత లేకపోయినా గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించే బాధ్యత వహిస్తూ పత్రికలు వీటిని ప్రచురిస్తాయి. ఇదేవిధంగా నగరాల్లో, పట్టణాల్లో జరిగే 'లీగ్' స్థాయి పోటీల ఫలితాలను వాటిలో రాణించిన వారి వివరాలను కూడా పత్రికలలో స్థానం కల్పిస్తుంటారు.

క్రీడలపై ప్రత్యేకించి ఉన్న వార్తాపత్రికలలోకూడా ఇంచుమించు ఇలాంటి తరహా వార్తలనే మనం చూస్తుంటాం. అయితే వారపత్రికల విషయంలో వార్తలు పాతబడతాయి కనుక వ్యాసాలకే ప్రాధాన్యత ఉంటుంది.

## 11.5 మామూలు వార్తలకు క్రీడారంగ వార్తలకు తేడా

పత్రికలలో రాసే మిగతా వార్తలకు, క్రీడారంగ వార్తలకు కొంత తేడా ఉంటుంది. ముఖ్యంగా రాసే పద్ధతిలో ఇది గమనించవచ్చు. మిగతా వార్తలతో పోలిస్తే క్రీడావార్తలలో 'అతిశయోక్తి' ఎక్కువగా కనిపిస్తుంది. 'అద్భుతవిజయం' అని రాస్తారు. కానీ నిజానికి అందులో అద్భుతం ఏమీ ఉండదు. 'నరాలు తెగిపోయేటంత ఉత్కంఠ', 'హోరాహోరీ పోరాటం' లాంటి ప్రయోగాలన్నీ ఇలాంటి అతిశయోక్తులే.

క్రీడావార్తలలో ఉపమానాల వాడకం కూడా ఎక్కువ. 'దెబ్బతిన్న బెబ్బులిలాగ విజృంభించి ఆడాడు' అని రాస్తారు. అలాగే 'భారతజట్టు బ్యాటింగ్ పేకమేడలాగ కూలిపోయింది' అంటారు.

పత్రికలలోని మిగతావార్తలకు, క్రీడావార్తలకు ఉన్న ఈ తేడాకు ప్రధాన కారణం సాధారణంగా క్రీడావార్త దృశ్య ప్రధానమైనది కావడమే. ఒక మ్యాచ్‌ను కళ్లకు కట్టినట్టుగా పాఠకుడి ముందుంచాలంటే క్రీడా రచయిత వర్ణనాత్మకమైన శైలిలో రాయాల్సిందే ఆ మ్యాచ్‌ను చూస్తున్నప్పుడు తాను పొందిన అనుభూతులను పాఠకుడికి అందించడానికి ఉపమానాలు, అతిశయోక్తులు అవసరం. ఇక వార్త శీర్షికలలోని అతిశయోక్తులు, ఉపమానాల వల్ల ఓటమిగాని గెలుపుగాని ఏ స్థాయిలో ఉన్నదనేది వార్త పూర్తిగా చదవాల్సిన అవసరం లేకుండానే పాఠకుడికి తెలియజేస్తాయి. ఉదాహరణకు భారత హాకీ జట్టు 6-0 తేడాతో మలేసియాను ఓడించినపుడు 'ఇండియా చేతిలో మలేసియా ఓటమి' అన్న శీర్షిక తేలిపోతుంది. ఆ పోటీలో ఇండియా చూపిన అధిపత్యాన్ని ఆ శీర్షిక ప్రతిబింబించలేదు. అదే ' ఇండియా చేతిలో మలేసియా చిత్తు' అని రాస్తే ఆ గెలుపు ఎలాంటిదనేది ఇట్టే అర్థమవుతుంది.

ముందే చెప్పినట్టు మామూలు వార్తలకన్నా క్రీడావార్తలలో వర్ణనలు ఎక్కువగా ఉంటాయి. మ్యాచ్‌లోని ఉత్కంఠ భరితమైన సన్నివేశాన్ని పాఠకుడి కళ్లముందుంచడానికీ పాత్రికేయుడు ప్రయత్నిస్తాడు. ఇందుకుగాను తన వర్ణనా సామర్థ్యాన్ని

BRAOU

ఉపయోగిస్తాడు. ఉదాహరణకు ఇండియా, పాకిస్తాన్‌ల మధ్య, 'టై'గా ముగిసిన ఒక వన్‌డే పోటీలోని ఆఖరు ఓవర్ గురించి ఓ పాత్రికేయుడు ఇలా రాశాడు.

"ఆట ఆఖరు ఓవర్ (నలభైనాల్గవది) మొదలయ్యే సరికి, విజయానికి గాను పాకిస్తాన్‌కు 7 పరుగులు అవసరం. అప్పటికింకా 5 వికెట్లు ఉన్నాయి. ఆల్‌రౌండర్లు మంజూర్‌ఇలాహి, వసీం అక్రం బ్యాటింగ్ చేస్తున్నారు. భారతజట్టు కెప్టెన్ కపిల్‌దేవ్ బౌలింగ్‌కు దిగాడు. కపిల్ వేసిన మొదటి బంతికి అక్రం ఒక పరుగు చేయగలిగాడు. రెండోబంతికి ఇలాహి రెండు పరుగులు చేశాడు. మూడోబంతిని ఇలాహి మిడ్‌వికెట్ వైపు మాత్రమే కొట్టగలిగాడు. అయినా అక్రం కంగారుగా సింగిల్ తీయడానికి ప్రయత్నించాడు. ఫలితంగా ఇద్దరు బ్యాట్స్‌మెన్ అయోమయంలో పడి ఒకపక్కకే చేరుకున్నారు. అక్రం వెనక్కు తిరిగి వచ్చేలోపల కపిల్, వికెట్లు పడగొట్టి అతన్ని రనౌట్ చేశాడు. అంతే! ప్రేక్షకుల హర్షధ్వనాలతో స్టేడియమేకాదు సగం హైదరాబాద్ నగరం హోరెత్తిపోయింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన అబ్దుల్ ఖాదిర్ నాన్‌స్ట్రయికర్ స్థానంలోకి వెళ్లాడు. ఓవర్ నాలుగోబంతికి ఇలాహిమరొక సింగిల్ మాత్రం తీయగలిగాడు. కపిల్ తర్వాతి బంతికి ఖాదిర్‌కు కూడా ఒకే సింగిల్ వచ్చింది.

ఇక అఖరు బంతి! అప్పటికి స్కోరు 210/6 గెలవాలంటే పాకిస్తాన్‌కు రెండు పరుగులు అవసరం. ఒక్కపరుగు కూడా చేయలేకపోతే ఇండియా నెగ్గుతుంది. ఒకేఒక్కపరుగుచేస్తే స్కోర్లు సరిసమానమై మ్యాచ్ 'టై' అవుతుంది. వికెట్లుకూడా అప్పటికి సమానంగా చెరి ఆరు పోయాయి ఇలా మూడు రకాల ఫలితాలకు ఆస్కారమున్న అఖరుబంతి కోసం ప్రేక్షకులంతా ఊపిరి బిగపట్టుకుని చూశారు. ఓ రెండు నిముషాలపాటు జాగ్రత్తగా ఫీల్డింగ్ సర్దాక కపిల్ బంతిని వేశాడు.

'ఆస్ట్రలేసియాకప్'లో చేతన్‌శర్మ లాగ 'ఫుల్‌టాస్' వేయకుండా, ఆ పరిస్థితికి తగిన బంతి వేశాడు కపిల్. ఆబంతి ఇలాహి లెగ్‌స్టంప్ పై పడింది. డ్రైవ్ చేయడానికి వీలులేని షార్ట్‌బాల్ అది. ఇలాహి ఆ బంతిని స్క్వేర్‌లెగ్ వైపు 'స్వింగ్' చేయగలిగాడంతే. కానీ డీప్‌స్క్వేర్‌లెగ్‌లో ఉన్నది భారతజట్టులోని అత్యుత్తమ ఫీల్డర్, హైదరాబాద్ హీరో అయిన అజరుద్దీన్, అతను కొదమసింహంలాగ బంతివైపు లంఘించి ఒక్క ఉదుటున వికెట్‌కీపర్ సదానంద్ విశ్వనాథ్‌కు విసిరాడు. అప్పటికి ఇలాహి ఒక్క పరుగు మాత్రం చేయగలిగాడు. ఏది ఏమైనా మరోపరుగు చేసి మ్యాచ్ గెలవాలన్నా కంగారులో ఉన్న ఖాదిర్ రెండో పరుగు కోసం ముందుకెళ్లబోయాడు. ఈలోగా విశ్వనాథ్ వికెట్లు పడగొట్టి అతన్ని రనౌట్ చేశాడు. దాంతో భారత ఆటగాళ్లందరూ ఏదోకప్పు గెలిచినంత ఆనందంతో కేరింతలు కొడుతూ పెవిలియన్‌వైపు పరిగెత్తారు. స్కోర్లు సమం అయినా పాకిస్తాన్ కంటె తక్కువ వికెట్లు కోల్పోవడం వల్ల ఇండియానే విజేతయింది."

క్రీడావార్తలు దృశ్యప్రధానమైనవి కాబట్టి మ్యాచ్ దృశ్యాన్ని పాఠకుల కళ్లముందుంచే ప్రయత్నం ఇది. రాజకీయరంగానికి సంబంధించిన వార్తల్లో ఇంతటి వివరణ ఉండదు.

మామూలు వార్తలకు, క్రీడావార్తలకు ఉండే మరో ప్రధానమైన తేడా గణాంకాలు. క్రీడావార్తలలో గణాంకాల ప్రాధాన్యత ఎక్కువ. టెన్నిస్‌మ్యాచ్ మొత్తం ఎన్ని నిముషాలు సాగింది. హాకీలో గోల్ ఎన్నో నిముషంలో కొట్టారు. క్రికెట్‌లో ఒక బ్యాట్స్‌మన్ ఎన్ని నిమిషాలు ఆడి ఎన్ని బంతులు ఎదుర్కొన్నాడు, లాంగ్‌జంపర్ ఎన్ని మీటర్ల ఎత్తుదూకాడు మొదలైన వివరాలకు క్రీడావార్తలలో చాలా ప్రాముఖ్యత ఉంది. అదే మామూలు వార్తల్లోనయితే ప్రధానమంత్రి ఎన్ని నిముషాలు మాట్లాడాడు, ఎన్ని ఇళ్లస్థలాలు పట్టాలు పంచారు. వంటి గణాంకాలకు సాధారణంగా ప్రాధ్యాన్యత ఉండదు. కానీ సంఖ్యావివరాలు లేని క్రీడావార్త సంపూర్ణమనిపించుకోదు.

**అభ్యాసం-2: పత్రికలకు కాలమ్స్ రాస్తున్న క్రీడా కారులెవరు?**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

BRAOU

## 11.6 క్రీడావార్తల పదజాలం

తెలుగులో క్రీడావార్తలు రాయడం అంత తేలికయిన పనికాదు. ఎందుకంటే క్రీడావార్తలలో సాంకేతిక పదజాలం ఎక్కువగా దొర్లుతుంటుంది. క్రికెట్‌లోస్క్వేర్‌కట్, ఇన్‌స్వింగర్, బౌన్సర్, టెన్నిస్‌లో ఏస్, డ్యూస్, టైబ్రేకర్, బాక్సింగ్‌లో నాకౌట్, ఫుట్‌బాల్‌లో సడన్‌డెత్, ఆఫ్‌సైడ్, పెనాల్టీకిక్, అథ్లెటిక్స్‌లో ఫొటోఫినిష్, స్టార్టింగ్ బ్లాక్స్ ఇలా క్రీడల్లో ఎదురయ్యే సాంకేతిక పరమైన పదాల జాబితా అనంతంగా సాగిపోతుంది. ఇలాంటి పదాలకు సమానార్థకాలు తెలుగులో లేవు. అందుకే తెలుగులోని క్రీడావార్తలు ఒక్కోసారి ఇంగ్లీషు పదాలతో నిండి కొంత కృతకంగా అనిపిస్తాయి. ఉదాహరణకు 'బౌలర్ వేసిన ఇన్‌స్వింగర్‌ను బ్యాట్స్‌మన్ లెగ్‌సైడ్‌లో మిడ్‌వికెట్‌వైపు కొట్టి ఫీల్డర్ ఆపేలోపల సింగిల్ తీశాడు " ఇలాంటి వాక్యాలలో తెలుగు పదాలకంటే ఇంగ్లీషు పదాల సంఖ్యే ఎక్కువ.

క్రీడలపేజీ ఎక్కువగా చదివేది యువకులు, ఒకమోస్తరు విద్యావంతులు కాబట్టి ఇలా ఇంగ్లీషుపదాలు దొర్లినా వారికి అర్థమవుతుంటుంది. కానీ పాఠకులకు అర్థమవుతున్నది కదా అని క్రీడావార్తల్ని ఆంగ్లపదాలతో నింపేయడం సబబుకాదు. తెలుగులో క్రీడా సాంకేతిక పదజాలాన్ని అభివృద్ధి చేసి వాటిని వాడుకలోకి తెచ్చుకోవచ్చు. అయితే ఇందుకు చాలా పరిమితులు కూడా ఉన్నాయి. తెలుగులో క్రీడారచన ఇంకా పరిణితి చెందలేదు. కవి ఆరుద్ర రాసిన 'చదరంగం'తో సహా తెలుగులో క్రీడలపై వచ్చిన పుస్తకాల సంఖ్య కూడా బహుతక్కువ. పత్రికల్లో పూర్తిస్థాయిలో క్రీడావార్తల నందించడం కూడా తెలుగులో చాలా అలస్యంగా మొదలయిందని ఇంతకుమునుపే చెప్పుకున్నాం. అదే హిందీ విషయానికొస్తే ఆ భాషలో పత్రికలలో మొదటినుంచి క్రీడావార్తలకు ప్రాముఖ్యత ఉంది. క్రీడలపై ప్రత్యేక పత్రికలు పుస్తకాలు కూడా ఉన్నాయి. అన్నిటికన్నా ముఖ్యంగా వివిధ పోటీలపై హిందీలో రన్నింగ్ కామెంటరీని రేడియోలో, టీవీలో విధిగా ప్రసారం చేయడం వల్ల హిందీలో క్రీడాపదజాలం బాగా వృద్ధి చెందింది. కామెంటరీ వల్ల అది జనవ్యవహారంలోకి కూడా వచ్చింది. 'ఫోర్'ను 'చౌకా' అని 'సిక్సర్'ను 'చక్కా' అని హిందీ క్రీడాభిమానులు వాడుతుండడం మనం గమనించవచ్చు. కానీ తెలుగులో ఇంకా ఫోర్, సిక్సర్ లాంటి పదాలే వాడుకలో ఉన్నాయి.

BRAOU

తెలుగులో కూడా క్రీడల కోసం కొత్త పారిభాషిక పదజాలాన్ని తయారుచేయాల్సిన అవసరం ఉంది. ఇందుకుగాను వివిధ పత్రికలలోని క్రీడారచయితలందరూ కలిసి ప్రత్యేక కృషిచేయాల్సి ఉంది. అంతేగానీ ఒక్కో పత్రికలో ఒకో రకం పదంవాడడం వల్ల పాఠకులు విషయం అర్థంకాక అయోమయంలోపడతారు. 'డొమెస్టిక్ క్రికెట్' (Domestic Cricket)ను 'దేశీయ క్రికెట్' అని కొందరు, 'దేశవాళీ క్రికెట్' అని కొందరు వ్యవహరిస్తున్నారు. ఇలా పత్రికకు పత్రికకు భాష మారుతుంటే పాఠకుడికి పాట్లు తప్పవు.

అయితే ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. తెలుగు పదాలను వృద్ధిపరిచే ఉద్దేశంతో ప్రతి ఇంగ్లీషు పదాన్ని మక్కీకి మక్కీగా తెలుగులోకి అనువదించాలని ప్రయత్నిస్తే, చాలా ఎబ్బెట్టుగా ఉంటుంది. 'రైలు' అనే బదులు 'ధూమశకటం' అన్నట్లే అవుతుంది. తెలుగు నుడికారానికి భంగం కలగకుండా ఇమిడిపోయే పదాలను మాత్రమే ఎంచుకోవాలి. 'ఆ ఆటగాడు చక్కని టెక్నిక్ ప్రదర్శించాడు' అంటేనే బాగుంటుంది గానీ 'సాంకేతికపరంగా అతను చక్కని ఆటను ప్రదర్శించాడు, అనిరాస్తే పాఠకుడికి ఏమీ అర్థం కాదు కూడా. అందుకే అవకాశంలేని చోట ఇంగ్లీషు పదాలను యథాతథంగా వాడడానికి సంకోచించాల్సిన పనిలేదు.

ఆటలపేర్ల విషయంలో కూడా కొన్నిటికి సమానార్థకాలు దొరుకుతాయి. రెజ్లింగ్ (Wrestling) - కుస్తీ, చెస్ (Chess) - చదరంగం, రేసులు (Horse races) - గుర్రప్పందాలు, ఈక్వెస్ట్రియన్ (Equestrian) - అశ్విక క్రీడలు, ఫెన్సింగ్ (Fencing) - కత్తిసాము, ఖడ్గచాలనం, స్విమ్మింగ్ (Swimming) - ఈత. అయితే మరికొన్ని ఆటల విషయంలో ఆయాపేర్లను తెలుగులోకి తేవడం సాధ్యంకాదు. క్రికెట్, టెన్నిస్, ఫుట్‌బాల్, గోల్ఫ్, బిలియర్డ్స్, హాకీ, వీటిని యథాతథంగా వాడితేనే బాగుంటుంది. అంతేగాని 'వెయిట్‌లిఫ్టింగ్'ను 'బరువు లెత్తే క్రీడ' అంటే ఎంత ఎబ్బెట్టుగా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు.

క్రీడావార్తల విషయంలో పాత్రికేయులు ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు స్వేచ్ఛానువాద పద్ధతి అవలంబిస్తేనే చక్కటి తెలుగులో రాయడం సాధ్యమవుతుంది. అంతేగానీ ఇంగ్లీషులో 'Punishable delivery' అని ఉన్నచోట 'శిక్షార్హమైన బంతి' అని రాస్తే అది పాఠకులకు శిక్షే అవుతుంది. అలాగే 'Converted the penalty corner into a goal' లాంటి ఇంగ్లీషు వాక్యాన్ని "పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచాడు" అని రాస్తే అనువాద రీత్యా తప్పుకాకపోవచ్చునుగాని అలాంటి వాడుక తెలుగులో లేనందువల్ల పాఠకుడికి ఏం జరిగిందో అర్థంకాదు. దాని బదులు లభించిన పెనాల్టీ కార్నర్‌ద్వారా గోల్ సాధించాడు" అంటే స్పష్టంగా అర్థమవుతుంది. స్వేచ్ఛానువాదం చేయడం వల్ల భావానికి భంగం కలగకుండా ఇంగ్లీషు సాంకేతిక పదాలు రాకుండ చేయవచ్చు. ఉదాహరణకు "బ్యాట్‌మెన్ ఫ్రంట్‌ఫుట్" అనే బదులు "బ్యాట్స్‌మెన్ ముందుకెళ్లి ఆడి" అని రాసినా అర్థం మారదు. క్రికెట్ లోనే టెయిల్ ఎండర్లు బాగా ఆడినప్పుడు "Wagging the tail" అని వాడతారు. దానిని "తోక జాడింపు" గా అనువదించేబదులు కాస్తస్వేచ్ఛగా "కొసమెరుపు" అంటే బాగుంటుంది.

ఇప్పుడు పత్రికల్లో వాడుకభాషే కనిపిస్తున్నా పత్రికలభాషకు. సామాన్యవ్యవహారంలోని భాషకు కొంత తేడా ఉంటుంది. జనం వాడుతున్న భాషలో రాయాలన్నదే పాత్రికేయుల లక్ష్యం కావాలిగానీ కొంత మార్పు మాత్రం తప్పనిసరి. "బౌలర్‌లైన్ అండ్ లెంగ్త్ బాగా మెయింటైన్ చేశాడు." అనేది మాట్లాడే భాష. కానీ పత్రికలలో ఇలా రాస్తే బాగుండదు. "బౌలర్ సూటిగా బంతులువేశా"డనో "పకడ్బందీగా బౌలింగ్ చేశా"డనో రాయాల్సి ఉంటుంది.

ఇంగ్లీషులో వైవిధ్యం కోసం లేదా సరదాగాను వాడే కొన్ని పదాలను తెలుగులోకి తెస్తే, సామాన్య పాఠకులు ఇబ్బంది పడతారు. జట్టు నాయకుడిని 'కెప్టెన్' అని రాస్తే అర్థమవుతుందిగాని తరచుగా 'సిక్సర్' అని వాడుతుంటే మామూలు పాఠకులు అయోమయంలో పడతారు. అలాగే 'వికెట్‌కీపర్'ను 'స్టంపర్' అన్నా తెలుగు పాఠకులకు ఇబ్బందే. ఇలా ఇంగ్లీషు పదాల విషయంలో ఏదో ఒక పదానికే పరిమితమవ్వాలి. 'ఫుట్‌బాల్'ను ఎప్పుడైనా 'సాకర్' అనవచ్చుకానీ తరచుగా వాడితే అది మరో ఆట అనుకునే ప్రమాదముంది. అమెరికాలో 'అమెరికన్ ఫుట్‌బాల్' అని మరో ఆట ఉంది కనుక మనకు తెలిసిన ఫుట్‌బాల్‌ను 'సాకర్' అని వ్యవహరిస్తారు. కానీ మన దేశంలో ఉన్నది ఒకే ఒక ఫుట్‌బాల్. అందుకే అరుదుగా మాత్రమే 'సాకర్' అని వాడాలి.

కొన్ని సందర్భాలలో ఇంగ్లీషు పదాలను యథాతథంగా వాడడానికి వెనుకాడనవసరం లేదని ఇంతకుముందే ప్రస్తావించడం జరిగింది. ఉదాహరణకు "మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్" అన్న మాటను తెలుగులోకి తర్జుమా చేయాలనుకోవడం వృథా ప్రయాస అవుతుంది. "పోటీలో ఉత్తమ ఆటగాడు" అని రాయవచ్చుగానీ, పాఠకుడికి మనం చెప్పదలచుకున్నది స్పష్టం కాదు. అలాగే 'రేస్‌కార్డ్' ఇచ్చేటప్పుడు 'డేస్ బెస్ట్' (Day's best) అన్న మాట వాడడమే సబబు. రేసులాడేవారికి బాగా అలవాటైన పదం అది. అంతేగాని 'ఈనాటి ఉత్తమాశ్వం' అంటే అర్థంకాక మొదటికే మోసం వస్తుంది. క్రికెట్‌లో 'వన్‌డే ఇంటర్నేషనల్' అన్నది. పరభాషా పదమైనా, అది బాగా వాడుకలో ఉన్నది. దానిని 'ఒకరోజు అంతర్జాతీయ పోటీ' అని అనువదిస్తే పాఠకులు కొన్నిసార్లు అయోమయంలో పడే అవకాశముంది. అదే విధంగా "ఫస్ట్‌క్లాస్ క్రికెట్"ను "ప్రథమశ్రేణిక్రికెట్"గా రాయవచ్చు గానీ ఇలాంటి వాటి విషయంలో తెలుగుపదంకంటే ఇంగ్లీషు పదం అర్థమయ్యే అవకాశాలే ఎక్కువ.

వార్తలకిచ్చే శీర్షికల (హెడ్డింగులు) విషయంలో కూడా తెలుగులో కొన్ని పరిమితులున్నాయి. ఒకే రకం శీర్షికలు మనకు పదే పదే దర్శనమిస్తుంటాయి. 'ఇండియా గెలుపు', 'ఇండియా విజయం' 'సునాయాసంగా నెగ్గిన ఇండియా' లేదా 'కాన్పూర్ వన్‌డే నేడే', హాకీఫైనల్ నేడే' 'నేటి నుంచి మద్రాసు టెస్టు', 'నేటినుంచి అమెచ్యూర్ బిలియర్డ్స్' ఇలాంటి హెడ్డింగులే రోజూ చూస్తుంటాం. క్రీడల పేజీల్లోని హెడ్డింగుల్లో వైవిధ్యానికి ఆస్కారం తక్కువ. అయితే శీర్షికల విషయంలో కూడా కొత్త పదాల అన్వేషణకు పాత్రికేయులు పూనుకోవాల్సి ఉంది. అయితే "త్రీఛీర్స్‌టు ఇండియా" లాంటి పూర్తిగా ఇంగ్లీషుపదాలే నిండిఉన్న శీర్షికలలో కొత్తదనం ఉన్నా వీలైనంతవరకూ ఇలాంటి పూర్తి ఇంగ్లీషు శీర్షికలను వాడకపోవడమేమంచిది. ఇది లిపి అంతరీకరణే అవుతుంది కాని తెలుగుతనం కనబడదు.

క్రీడా రంగ పదజాలంలో కొన్నిసార్లు వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలుకూడా తప్పవు. రెండు భాషల పదాలతో కూడిన "ప్రపంచకప్" లాంటి వైరి సమాసాలు వాడాల్సి వస్తుంది. "ప్రపంచబ్యాంకు" వాడుకలోకి వచ్చినట్టే ఇది కూడా వాడుకలోకి

BRAOU

వచ్చింది. వరల్డ్‌కప్ అనేకంటే ఇదేనయం. "పరిమిత ఓవర్లు" 'భారీస్కోరు' కూడా ఇలాంటివే. వ్యాకరణంపై పట్టింపుఉంటే క్రీడారచయితలకు అడుగడుగునా అవస్థలు తప్పవు. అయితే తెలుగు ఇంగ్లీషు మరీ కలిపేసి కొత్తభాష సృష్టించడం కూడా సబబు కాదు. "బ్యాట్స్‌మన్"కు బహువచనం "బ్యాట్స్‌మన్లు" అంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. "బ్యాట్స్‌మెన్" అని వాడడమే సమంజసం.

## 11.7 క్రీడారచయితలకు కావలసిన అర్హతలు

జర్నలిస్టుల్లో కొంతమంది 'జనరల్' కాగా మరికొందరు స్పెషలిస్టులు. క్రీడలు కూడా ఇలాంటి 'స్పెషలైజేషన్' కు సంబంధించినవే. అందుకే క్రీడావార్తలురాసే పాత్రికేయులకు కొన్ని ప్రత్యేక అర్హతలు ఉన్నాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా క్రీడావార్తలు రాసేవారు క్రీడాకారులైతే మంచిది. అయితే క్రీడాకారుడు అయితీరాలి అనేమీలేదు. రాజకీయవార్తలు రాసేవారు రాజకీయనాయకులై ఉండాల్సిన అవసరం లేదుకదా. అంతేగాక పాత్రికేయుడు క్రీడాకారుడైనా ఏదో ఒకాటలోనో లేక రెండు ఆటల్లోనో ప్రావీణ్యం కలిగి ఉంటాడు. అంతేగానీ అన్ని ఆటల్లో ప్రవేశం కలిగి ఉండడు. అయితే పాత్రికేయుడు కనుక క్రీడాకారుడైతే, ఆటగాళ్ల సాధకబాధకాలు అర్థం చేసుకోగలుగుతాడు. క్రీడాకారుడయినా, కాక పోయినా, స్పోర్ట్సు జర్నలిస్టుకి తప్పనిసరిగా అవసరమైనది క్రీడల్లో ఆసక్తి. క్రీడల్లో అభిరుచిలేని పాత్రికేయుడు రాసే క్రీడావార్తలు చప్పగా ఉంటాయి. అందుకే క్రీడారచయిత తప్పనిసరిగా క్రీడాకారుడుగానీ, క్రీడాభిమాని గానీ అయిఉండాలి.

కేవలం అభిమానమే సరిపోదు. క్రీడల్లో మంచి పరిజ్ఞానం కూడా అవసరం. ముఖ్యంగా ఏ ఆట ఎలా ఆడతారు, అందులో పాయింట్ల పద్ధతి ఎలా ఉంటుంది. ఎంతమంది ఆటగాళ్లు ఉంటారు, ఆ ఆటలోని పారిభాషిక పదాలేమిటి మొదలైన ప్రాథమిక అవగాహన క్రీడారచయితకు అవసరం. ఇలాంటి పరిజ్ఞానం కేవలం పుస్తకాలు చదవడం వల్లనో లేక టీవీలో చూడడం వల్లనో రాదు. ఆయా పోటీలను ప్రత్యక్షంగా చూసినపుడే పాత్రికేయుడు నిష్ణాతుడయ్యే అవకాశం ఉంది. అందుకే క్రీడావార్తలు రాసే పాత్రికేయులు వివిధ పోటీల 'కవరేజీ'కి వెళుతుండాలి. జనరల్ డెస్క్ విషయంలో సబ్ ఎడిటర్లు కేవలం ఆఫీసుకే పరిమితమవుతారు. వార్తల అనువాదం, ఎడిటింగ్, శీర్షికలు పెట్టడం, పేజీ మేకింగ్ ఇవి మాత్రమే వారి విధులు. వార్తాసేకరణచేసే విలేకరుల బ్యూరో వేరుగా ఉంటుంది. కానీ స్పోర్ట్స్ డెస్క్ విషయంలో మాత్రం సబ్ ఎడిటర్లు, రిపోర్టర్లు విడివిడిగాఉండరు. 'ది హిందూ' లాంటి కొన్ని పత్రికలలోతప్ప స్పోర్ట్స్ ఎడిటర్లతో సహా క్రీడావిభాగంలో పాత్రికేయుందరూ రిపోర్టింగు చేయాల్సిందే. డెస్క్‌వర్కులోనూ, రిపోర్టింగులోనూ సమాన ప్రావీణ్యం ఉన్నవారే క్రీడారచయితలుగా రాణించగలుగుతారు.

క్రీడలకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం చాలదు. క్రీడల్లోని కొన్ని ముఖ్యమైన రికార్డులు ప్రముఖుల వివరాలు మొదలైనవి క్రీడావిభాగంలోని పాత్రికేయులకు తెలిసిఉండాలి. ఇందుకుగాను క్రీడారచయితలు తమకంటూ ఒక లైబ్రరీని ఏర్పరుచుకుని క్రీడలపై ముఖ్యమైన పుస్తకాలు అమర్చుకోవాలి. వివిధ రికార్డులకు సంబంధించిన వివరాలు సేకరించి పెట్టుకోవాలి. అలా చేసినపుడే, సచిన్ టెండూల్కర్ లాంటివారు ఏదైనా కొత్తరికార్డు నెలకొల్పినపుడు పాతరికార్డు వివరాల లాంటివి తేలికగా ఇవ్వవచ్చు.

క్రీడల్లో ఎంతటి పరిజ్ఞానం సాధించినా కూడ, అవసరమైనపుడు నిపుణులను సంప్రదించవలసి వస్తుంది. చదరంగంలాంటి ఆటల గురించి రాయడం మామూలుగా పాత్రికేయులకు కష్టమైన పని. అయితే ప్రతినగరంలోనూ, పట్టణంలోనూ అలాంటి ఆటల్లో నిపుణులు కొందరుంటారు. ఆ నిపుణులను సంప్రదించిన విశ్వనాథన్ ఆనంద్ ఎక్కడ తప్పడుగు వేశాడు, ఎక్కడ తెలివైన ఎత్తు వేశాడు వంటివి రాస్తే, మ్యాచ్ రిపోర్టు రక్తికడుతుంది.

క్రీడా విభాగంలోని పాత్రికేయులు వివిధ క్రీడాసంఘాలతో, వాటి అధికారులతో పరిచయాలేర్పరుచుకోవాలి. అలాగే తమ నగరం లేదా పట్టణంలోని ప్రముఖ క్రీడాకారులతో కూడా సత్సంబంధాలు కలిగి ఉండాలి. దీనివల్ల వార్తా సేకరణ సులభమవుతుంది. కేవలం ఫోనుద్వారా వార్తలు సేకరించవచ్చు.

BRAOU

ఏదైనా వివాదం తలెత్తినపుడు సంబంధిత క్రీడాసంఘానికి ఫోనుచేసి ధృవీకరణ కోరవచ్చు. లేదా మన రాష్ట్రానికి చెందిన ఆటగాడెవరైనా అంతర్జాతీయస్థాయిలో రాణిస్తే, అతని విజయంపై ఆ ఆటలోని ఇతర ప్రముఖుల వ్యాఖ్యానాలను ఆఫీసులో కూర్చునే సేకరించవచ్చు.

క్రీడారచయితలు అన్ని ఆటల్లో ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉండడంతో పాటు ఏదైనా ఒక ఆటలో స్పెషలైజ్ చేస్తే మంచిది. దీనివల్ల వారికి ప్రత్యేక గుర్తింపు వస్తుంది. ఆ ఆట గురించి వారు రాసేదానికి విలువ పెరుగుతుంది. కొంతమంది పాత్రికేయులు గుర్రప్పందాలలో స్పెషలైజ్ చేస్తారు. వారు గుర్రాల గెలుపునకు సంబంధించిన 'టిప్స్' కూడా ఇవ్వగలుగుతారు. ఇంకా క్రికెట్, ఫుట్‌బాల్, టెన్నిస్, అథ్లెటిక్స్, మోటారు రేసింగ్ లాంటి క్రీడల్లో స్పెషలైజ్ చేసిన నిపుణులైన పాత్రికేయులు మనదేశంలో ఉన్నారు.

వార్తారచనతో పాటు వ్యాసరచన కూడా చేయగలగడం క్రీడావిభాగంలోని పాత్రికేయులకు ఓ అదనపు అర్హత అవుతుంది. క్రీడారంగంలో ఏదైనా ముఖ్యమైన సంఘటన జరిగినపుడు దానికి వెంటనే స్పందించి ఓ వ్యాసం రాయగలిగి ఉండాలి. క్రీడావార్తలపై సంపాదకీయాలు తక్కువగా వస్తుంటాయి కాబట్టి ఇలాంటి వ్యాసాల రచన అవసరం.

క్రీడావిభాగపు పాత్రికేయుడికి ఉండాల్సిన మరొక ముఖ్యమైన అర్హత 'సౌందర్యదృష్టి'. క్రీడలకు సంబంధించిన ఫోటోల వల్ల పత్రికకు అందం వస్తుంది. ఆ ఫోటోలను చక్కగా అమర్చి పేజీని అందంగా తీసుకురాగల నేర్పు ఉండాలి.

## 11.8. క్రీడావార్త రచన

BRAOU

మామూలు వార్తలకు క్రీడావార్తలకు ఉన్న తేడాలను ఇంతకు ముందు చెప్పుకున్నాం. క్రీడావార్తలు రాసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా, వార్త మొదటిపేరాలోనే ఆ పోటీ ఫలితం ఉండాలి. అంటే టెన్నిస్ పోటీ గురించి రాసే వార్తయితే మొదటిపేరాలోనే ఎవరు ఎవరిని ఓడించారో ఉండాలి. క్రికెట్ టెస్ట్ గురించి రాసే వార్తయితే ఆరోజు ఆటలో స్కోరు ఎంత అన్న విషయం ఆదిలోనే రాయాలి. అంతేగాక ఎప్పుడు, ఎక్కడ, ఎవరెవరి మధ్య అనేవి మొదటిపేరాలోనే ఉన్నప్పుడే పాఠకుడికి సౌకర్యంగా ఉంటుంది. "కటక్‌లో భారత - న్యూజిలాండ్ జట్లమధ్య, జరుగుతున్న మూడోటెస్ట్ నాల్గవ రోజు ఆటలో" అని 'లీడ్'లోరాశాక తర్వాత ఎన్ని వ్యాఖ్యానాలైనా చేసుకోవచ్చు. అలాకాక ఇంతముఖ్యమైన మ్యాచ్ గురించి పాఠకుడికి ఆమాత్రం తెలియకుండా ఉంటుందా అనుకుని కేవలం కామెంట్స్‌తో నింపితే అది వార్త అనిపించుకోదు.

క్రీడావార్తలలో మరో ముఖ్యమైన అంశం 'స్కోరు' కేవలం ఫలితం ఇస్తే సరిపోదు. ఎంత తేడాతో ఆ జట్టు నెగ్గిందనే స్కోరుకూడా అందించాలి. 'పీట్ సంప్రాస్, అగాసీల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో సంప్రాస్ నెగ్గాడు' అంటే సరిపోదు. వారిద్దరి మధ్య జరిగిన సెట్లు ఎన్ని, సెట్లస్కోరు ఎంత అనేది పాఠకుడికి అవసరం. ఎంత చక్కగా పోటీని వర్ణించగలిగినా స్కోరు ఇవ్వకపోతే ప్రయోజనం లేదు. ఆటగాడి ప్రతిభను అన్నిసార్లూ ఈ అంకెలు ప్రతిబింబించలేకపోవచ్చు. అయినా కూడా స్కోరు ప్రాధాన్యతను కాదనలేం. కొన్నిసార్లు స్థలాభావం వల్ల వార్తను కుదించాల్సి వస్తే, మ్యాచ్ వివరాలు రాయడం తగ్గించి స్కోరుబోర్డు ఇస్తే సరిపోతుంది. అంతేగాని మ్యాచ్ వివరాలు ఎక్కువగా రాసి స్కోరుబోర్డు ఇవ్వకుండా పోవడం సరైన పద్ధతికాదు.

పోటీ ప్రాధాన్యత బట్టి వార్త నిడివి నిర్ణయించుకోవాలి. అంతర్జాతీయ వార్తలలో ఇండియా పాల్గొనే పోటీలకు ఎక్కువ నిడివి కేటాయించాలి. ఇండియా కాక ఇతర జట్లమధ్య జరిగే పోటీల గురించి సుదీర్ఘంగా రాయాల్సిన అవసరం ఉండదు. ఉదాహరణకు ఇండియా, ఇంగ్లండ్ క్రికెట్ టెస్ట్‌కిచ్చిన ప్రాధాన్యత ఇంగ్లండ్, న్యూజిలాండ్ టెస్ట్‌కు ఇవ్వాల్సిన పనిలేదు. అయితే ఈ సూత్రం అన్నిసార్లు వర్తించదు. వింబుల్డన్ టెన్నిస్, ప్రపంచకప్ ఫుట్‌బాల్ వంటి ప్రఖ్యాతమైన పోటీలలో ఇండియా ప్రసక్తే ఉండదు. కానీ అలాంటి అంర్జాతీయ పోటీలపై పాఠకులకు ఆసక్తి ఎక్కువ కనుక వాటి గురించి వివరంగా రాయాల్సి ఉంటుంది.

వార్తాసంస్థల (న్యూస్ ఏజెన్సీలు) కోసం రాసే క్రీడావార్తల విషయంలో స్కోరు ప్రాముఖ్యం మరీ ఎక్కువ. వార్తాసంస్థకు చెందిన క్రీడా ప్రతినిధి మ్యాచ్ వివిధ దశలలోని స్కోరును ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలి. క్రికెట్ మ్యాచ్ అయితే లంచ్

సమయంలో స్కోరెంత, టీ విరామమప్పుడు స్కోరెంత, అలాగే ఫుట్‌బాల్ పోటీ అయితే మ్యాచ్ ప్రథమార్థం ముగిసే సరికి స్కోరెంత అనేది వెంటనే మూడు ముక్కల్లో అందించాలి. వార్తా పత్రికలకు అనేక ఎడిషన్లుంటాయి. ఒక్కో ఎడిషన్‌కు 'హెడ్‌లైన్' ఉంటుంది. అందుకే వార్తా సంస్థ క్రీడా ప్రతినిధి ఎప్పటికప్పుడు స్కోరు అందించడంతోబాటు వార్తను కూడా విడివిడిగా పంపాలి. అంటే లంచ్ వరకూ టెస్ట్‌మ్యాచ్ వివరాలు ముందు పంపాలి. ఇవి ఈవెనింగ్ ఎడిషన్లకు పనికొస్తాయి. ఆరోజు ఆట పూర్తయ్యాక మొత్తం మ్యాచ్ వివరాలను సమగ్రంగా అందించవచ్చు.

వార్తా పత్రికలకు చెందిన క్రీడావిలేకరులు వన్‌డే క్రికెట్‌పోటీలు 'కవరేజీ' విషయం సాధారణంగా ఒక పద్ధతి అవలంబిస్తుంటారు. వన్‌డే పోటీ లంచ్ విరామ సమయంలో లంచ్‌కు ముందు ఆడిన జట్టు ఇన్నింగ్స్ వివరాలతో తమ రిపోర్టు సిద్ధం చేసుకుంటారు. మ్యాచ్ గురించిన మొత్తం రిపోర్టు తయారయ్యాక , లంచ్ ముందు ఇన్నింగ్, వివరాలు ఆ రిపోర్టు చివరన చేరతాయి. "అంతకుముందు, టాస్‌గెలిచి మొదటగా బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు.." అని ప్రారంభించి దీనిని మొత్తం రిపోర్టుతో జోడిస్తారు. ఆరుగంటలపాటు సుదీర్ఘంగా సాగే క్రికెట్ మ్యాచ్ కవరేజీ విషయంలో ఇలా లంచ్ విరామాన్ని ఉపయోగించుకోవడం వల్ల రిపోర్టును త్వరగా అందించడానికి వీలవుతుంది.

ప్రస్తుతం క్రీడారంగంపై ఎలెక్ట్రానిక్ మీడియా ముఖ్యంగా టెలివిజన్ ప్రభావం ఎక్కువగా ఉంది. క్రీడాభిమానులు ముఖ్యమైన పోటీలనన్నిటినీ టీవీలో చూస్తున్నారు. అయినా అలాచూడని వారు కూడా ఉంటారు. కాబట్టి పోటీల గురించి సవివరంగా రాయాల్సిన బాధ్యత క్రీడా రచయితపై ఉంది. అయితే ప్రపంచకప్ వంటి ప్రత్యేకమైన ఈ వెంట్‌లను ప్రతి క్రీడాభిమాని ఈరోజుల్లో తప్పనిసరిగా టీవీలలో చూస్తున్నాడు. అలాంటి వాటి గురించి మళ్ళీ పత్రికల్లో వర్ణనాత్మకంగా రాస్తే పునరుక్తి అవుతుంది. వాటి గురించి వ్యాఖ్యానాలతో, ఒక భిన్నమైన దృక్కోణం నుంచి రిపోర్టు అందిస్తే పాఠకుడు ఆసక్తిగా చదువుతాడు.

మొదట్లోనే ప్రస్తావించినట్టు క్రీడావార్తలంటే మ్యాచ్ రిపోర్టులు మాత్రమేకాదు. జరగబోయే పోటీల గురించిన విశేషాలు కూడా పోటీజరిగే రోజున అందించాలి. పాత్రికేయుల పరిభాషలో వీటిని 'కర్టెన్ రైజర్స్' అంటారు. జరగబోయే ముఖ్యమైన పోటీల వివరాలను వివిధ జట్ల విజయావకాశాలను ముందుగానే క్రీడల పేజీల్లో మనం చూస్తుంటాం. ముఖ్యంగా ఒలింపిక్స్, ఆసియా క్రీడలు, ప్రపంచకప్ ఫుట్‌బాల్, వింబుల్డన్, ప్రపంచకప్ క్రికెట్ వంటి ప్రధానమైన పోటీలకు వారం పదిరోజుల ముందునుంచి 'కౌంట్‌డౌన్'గా పత్రికలు రోజూ రకరకాల వివరాలు ఇస్తుంటాయి. సమాచారాన్ని అందించడంతో పాటు పాఠకుల్ని ఆ టోర్నమెంటుకు, పోటీలకు సంబంధించిన 'మూడ్'లోకి తీసుకెళ్లడానికి ఇవి ఉపయోగపడతాయి. అందుకే క్రీడావిభాగంలోని పాత్రికేయులు ఇలాంటి పోటీలకు బాగా ముందుగానే కావలసిన సమాచారాన్ని, గణాంక వివరాలు, రికార్డుల్ని, ఫోటోలను సిద్ధం చేసుకోవాలి.

గ్రామీణ ప్రాంతాల క్రీడావార్తలకు కూడా పత్రికలలో ప్రాధాన్యమివ్వాలని ముందే చెప్పుకున్నాం. అయితే గ్రామీణ ప్రాంతాలకు చెందిన విలేకరులు క్రీడావార్తలు రాయడంలో నిపుణులైనవారు కారు కనుక వారు పంపే వార్తలో క్రీడలకు సంబంధించిన అంశాలకన్నా అనవసర విషయాలే ఎక్కువగా ఉంటాయి. పోటీలను ఎవరు ప్రారంభించారు, ఎవరు అధ్యక్షత వహించారు, వందన సమర్పణ ఎవరు చేశారు మొదలైన విషయాలే ఎక్కువగా ఉండి అసలు జరిగిన ఆటలపోటీల ఫలితాలను కుదించివేస్తారు. ఇవి వార్త చివరన మాత్రమే దర్శనమిస్తాయి. ఇలాంటి వార్తలను తిరగరాసుకుని క్రీడలకు సంబంధించిన అంశాలను హైలైట్ చేయాలి. అలా ఎడిట్ చేసుకోడానికి వీలులేని వార్తలను ఆ జిల్లా ఎడిషన్‌లో ప్రచురించాలే తప్ప క్రీడల పేజీలలోని వార్తలలో క్రీడాంశాలకే ప్రాధాన్యత ఉండాలి.

గ్రామీణ ప్రాంతాలలోను, పట్టణాలు, నగరాల్లోనూ, అప్పుడప్పుడే పైకొస్తున్న యువక్రీడకారులకు తగినంత గుర్తింపు లభించేలాగ చూడడం క్రీడారచయితల బాధ్యత. ఇలాంటి యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారికి ప్రోత్సాహం లభించేలాగ రాయాలి. అంతేగాని వారి సామర్థ్యం కుంటుబడేలాగ విమర్శలు చేయకూడదు. పత్రికల ప్రోత్సాహం లభిస్తే వర్ధమాన క్రీడాకారులు మరింతగా రాణించగలుగుతారు. పత్రికారచయితకు ఏదైనా ఒక క్రీడలో ప్రావీణ్యం ఉంటే, అందులో యువక్రీడాకారులు టెక్నిక్ విషయంలో చేస్తున్న తప్పుల్ని ఎత్తిచూపి, వాటిని సవరించుకోవడానికి సూచనలు కూడా చేయాలి.

వార్తలకు శీర్షికలు ఇవ్వడంలో క్రీడలపేజీల్లో ప్రయోగాలకు అవకాశం ఎక్కువ. పాఠకులను ఆకట్టుకునే విధంగాను, ఉత్సహపరిచేవిగాను హెడ్డింగు ఉండాలి. ఇందుకుగాను చిటికెడు చమత్కారం, శ్లేష(Pun) లను జోడించుకోవచ్చు. ఆటగాళ్ల పేర్ల ఆధారంగాను, పోటీల జరిగే ఊరిపేరు ఆధారంగాను హెడ్డింగుల్లో చమత్కారాన్ని సాధించవచ్చు. ఉదాహరణకు గైఫర్గెట్ అనే ఆటగాడు గెలిచినపుడు ఓ ఇంగ్లీషు పత్రిక "A day to remember for Guy Forget" అన్న శీర్షిక పెట్టింది. చక్కటి శీర్షికలు వచ్చే పత్రికల విషయంలో "రేపు ఈ మ్యాచ్ గురించి ఏం హెడ్డింగ్ పెడతారో" నని క్రీడాభిమానులు చర్చించుకుంటూ ఉంటారు. అయితే హెడ్డింగు బాగుండాలని చెప్పి అసందర్భమైనవి పెడితే పేలవంగా ఉంటుంది. వార్తకు హెడ్డింగు అతికినట్లుగా సరిపోవాలి.

**అభ్యాసం-3ః క్రీడా రచయితకు కావాల్సిన అర్హతలేవి?**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

## 11.9 తెలుగులో క్రీడా రచయితల పరిమితులు

BRAOU

తెలుగులో క్రీడా రచన ఇంకా శైశవ దశలోనే ఉంది. తెలుగు పత్రికలలో పూర్తిస్థాయి క్రీడారచయితలు కొద్దిమందే ఉన్నారు. క్రీడలపై వారపత్రికలు గాని, పక్షపత్రికలు గాని తెలుగులో లేవు. ఇతర వార, పక్ష పత్రికలలో కూడా క్రీడావార్తలు, వ్యాసాలు అప్పుడప్పుడు మాత్రమే వస్తుంటాయి. తెలుగులో వార్తలు పంపే న్యూస్ ఏజెన్సీలు కూడా లేవు. అందుకే తెలుగులో క్రీడారచన దినపత్రికలకే పరిమితమై ఉంది.

తెలుగు దిన పత్రికలలోని క్రీడావిభాగాలు ఎప్పుడూ 'సవతి ప్రేమ' నే పొందుతుంటాయి. తెలుగు పత్రికలలో క్రీడల కంటూ ఓ పేజీ కేటాయిస్తున్నారు కానీ అందులో తగినంత స్థలం ఉండడం లేదు. రోజూ కనీసం 6 నుంచి 8 కాలమ్స్ కేటాయిస్తేనే క్రీడలపేజీ సంపూర్ణంగా ఉంటుంది. కానీ ఒక్కసారి సినిమా వార్తలకు కేటాయించినంత స్థలం కూడా క్రీడలకు దొరకదు. తెలుగు పత్రికల క్రీడా విభాగంలో పాత్రికేయుల సంఖ్య కూడా తక్కువగానే ఉంటోంది. దీనివల్ల క్రీడారచయితలు డెస్క్‌కే పరిమితమై పోతున్నారు. కేవలం పేజీ నింపడం వారి ప్రధాన కర్తవ్యమై పోతోంది. ఫలితంగా రిపోర్టింగుకు వెళ్ళే అవకాశాలు తగ్గిపోతాయి. మ్యాచ్‌లు ప్రత్యక్షంగా చూసినపుడే క్రీడావిలేఖరి తన పరిజ్ఞానాన్ని పెంచుకోగలుగుతాడు. అసలు విలేకరిగానే క్రీడారచయితలోని నిజమైన ప్రతిభ బయటపడుతుంది.

తెలుగులోని క్రీడారచయితలకు తగు శిక్షణ కూడా లేదు. క్రికెట్‌లో జూనియర్ ఆటగాళ్లను 'ఫార్వర్డ్ షార్ట్‌లెగ్' స్థానంలో ఫీల్డింగ్ చేయించే అలవాటుంది. అలాగే తెలుగు పత్రికలలో కొత్తగాచేరిన వారిని క్రీడావిభాగానికి పంపిస్తుంటారు. వారికి క్రీడల్లో పరిజ్ఞానంగాని, ఆసక్తిగాని ఉందా లేదా అనేది పట్టించుకోరు. తెలుగు పత్రికలలో ఎడిటర్, అసిస్టెంట్ ఎడిటర్, న్యూస్ ఎడిటర్ లాంటి కీలక స్థానాలలో ఉండేవారికి ఏ కొద్దిమందికో తప్ప క్రీడలలో ఆసక్తి లేకపోడం వల్లనే ఈ 'సవతి ప్రేమ' పరిస్థితి ఏర్పడుతుంది. క్రీడలపై ఆసక్తి లేకపోయినా పత్రికలలోవాటి విలువను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించిన ఒకరిద్దరుఎడిటర్ల వల్లనే తెలుగు దినపత్రికలలో ఇప్పుడు క్రీడావార్తలు విరివిగా వస్తున్నాయి.

తెలుగు పత్రికలు ప్రాధాన్యమిచ్చినా లేకపోయినా పాఠకులలో మాత్రం క్రీడావార్తలు చదివేవారు ఎక్కువగానే ఉన్నారనేది నిర్వివాదాంశం. సంపాదకులు ఈ విషయాన్ని గుర్తించాలి. తెలుగు పత్రికలలో క్రికెట్‌వార్తలకే ఎక్కువ స్థలం కేటాయిస్తారనే విమర్శకూడా ఉంది. కానీ మన పాఠకులకు క్రికెట్ అంటేనే ఎక్కువ ఇష్టం కనుక ఇది తప్పనిసరి. ఇంగ్లీషు పత్రికలకు

అంతర్జాతీయ స్థాయిలోను, జాతీయస్థాయిలోనూ జరిగే అన్ని ముఖ్యమైన పోటీల ఫలితాలు ఇస్తారు. తెలుగులో ఇలా ఇవ్వాల్సిన అవసరంలేదు. ఇంగ్లండ్‌లో జరిగే గోల్ఫ్‌పోటీలు, దక్షిణాఫ్రికాలో జరిగే రగ్బీపోటీలు మొదలైనవాటికి సంబంధించిన వార్తలు తెలుగు పాఠకులకు అంతగా అవసరం లేదు. వాటిబదులు రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలలో జరిగే వార్తలు ప్రచురించడం మేలు. ఇలాంటి పోటీల కవరేజికి తమ క్రీడా ప్రతినిధులను పంపడానికి ఎడిటర్లు ముందుకు రావాలి. జిల్లాస్థాయిలో కూడా క్రీడా ప్రతినిధులను నియమించుకోవాలి.

బెంగాల్, కేరళ, మహరాష్ట్ర లాంటి రాష్ట్రాలలో ప్రాంతీయ భాషలలో క్రీడారచన బాగా వృద్ధి చెంది ఉండగా, తెలుగులో ఇలాంటి పరిస్థితి ఉండడానికి మరోకారణం ఉంది. పైన చెప్పిన రాష్ట్రాలలో ఉన్న క్రీడాసంప్రదాయం మన రాష్ట్రంలో లేదు. మిగతా మూడు దక్షిణాది రాష్ట్రాలతో పోల్చి చూసినా ఆంధ్రప్రదేశ్ క్రీడల విషయంలో వెనకబడి ఉంది. పిల్లలు ఆటలపిచ్చిలో పడితేచదువు దెబ్బతింటుందన్న అభిప్రాయం ఇప్పటికీ తలిదండ్రులలో పోవడం లేదు. క్రీడలు కూడా ఒక ఆకర్షణీయమైన 'కెరీర్'గా వారు గుర్తించడంలేదు. అందుకే జూనియర్ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ జట్లు రాణించినా సీనియర్ స్థాయికొచ్చేసరికి తెలుగు వాళ్లు వెనకబడుతున్నారు. రాష్ట్రంలో క్రీడలపై ఆసక్తి పెరిగితే స్పోర్ట్స్ జర్నలిజం కూడా బాగుపడుతుంది. అలాగే పత్రికల్లో క్రీడ గురించి. ఎక్కువగా రాస్తే పాఠకులలో అవగాహన పెరిగి క్రీడాప్రమాణాలు పెరుగుతాయి.

## 11.10 ఛాయచిత్రాల ప్రాధాన్యత

ఒక్క ఫోటో కూడా లేని స్పోర్ట్స్ పేజీ బోసిపోతుంది. ఈ టెలివిజన్ యుగంలో కూడా, పత్రికలలో ఫోటోల ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. క్రీడల పేజీలలో యాక్షన్‌ఫోటోలు పేజీకి అందాన్నివ్వడమే కాక, ఆపోటీ పాఠకులకు మరింత దగ్గరయ్యేలాగ చేస్తాయి. ఇద్దరు అథ్లెట్లు 100 మీటర్ల పరుగుపందెంలో ఒకేసారి 'టేప్'ను తాకినపుడు ఇద్దరూ సంయుక్త విజేతలవుతారు. దీనినే 'ఫోటో ఫినిష్' అంటారు. క్రికెట్‌లో మూడో అంపైర్ టీవీ రీప్లే ద్వారా ఫలితం తేల్చినట్లే, ఫోటోద్వారా ఈనిర్ధారణ జరుగుతుంది. గుర్రప్పందాలలో కూడా ఇలాంటి ఫోటోఫినిష్ ఉంటుంది. ఇలాంటి సందర్భంలో క్రీడా రచయిత ఎన్ని వాక్యాలు రాసినా లాభంలేదు. ఆ 'ఫోటో ఫినిష్' ఛాయాచిత్రాన్ని ప్రచురించినప్పుడే వార్తను సమగ్రంగా ఇచ్చినట్టవుతుంది.

అలాగే కొన్ని చారిత్రాత్మకమైన సంఘటనలు, ప్రపంచరికార్డులు ఉంటాయి. వీటిని ఫోటోలు ప్రతిబించించినట్టుగా వార్తలు అందించలేదు. 5 సార్లు వింబుల్డన్ టెన్నిస్ టైటిల్ గెలిచిన బియాన్ బోర్గ్ గెలిచిన ప్రతిసారీ మోకాళ్లపై వంగి కళ్లు మూసుకుని దేవుడికి కృతజ్ఞతలు చెప్పే దృశ్యం తాలూకు ఫోటోచూడాల్సిందేగానీ, దాని వర్ణన వల్ల ప్రయోజనం లేదు. అలాగే సునిల్ గవాస్కర్ టెస్టుల్లో 10వేల పరుగులు పూర్తి చేసినపుడు అతను ఆ అతిముఖ్యమైన ఒక్కపరుగు తీస్తూ చూపినతపన, పొందిన ఆనందం ఫోటోలోనే చూడగలం. కపిల్‌దేవ్ 432వ వికెట్ పడగొట్టి అత్యధిక టెస్ట్‌వికెట్ల రికార్డు సాధించినపుడు అతని విజయావేశాన్ని ఫోటోలే మన కందిస్తాయి. ఇలాంటి ఫోటోలు తరువాత చరిత్రలో భాగమవుతాయి. ఎప్పుడైనా ఆసంఘటన గుర్తుకొచ్చినపుడు మన కళ్లముందు మెదులుతాయి. 1983 ప్రపంచకప్ క్రికెట్ గెలుచుకున్న కపిల్‌దేవ్ మహదానందంతో కప్పును చేతితో పైకెత్తి పట్టుకున్న ఫోటోను క్రీడాభిమానులెప్పుడూ మరచిపోలేరు. అలాగే డియోగో మారడోనా 1986 ప్రపంచకప్ ఫుట్‌బాల్ గెలిచినప్పటిఫోటో, అదే మారడొనా 1990లో తమజట్టు ఫైనల్లో ఓడిపోగా విలపిస్తున్నప్పటి ఫోటో చెరగని దృశ్యాలుగా మిగిలిపోతాయి.

గోల్‌కొట్టిన దృశ్యం, ముఖ్యమైన వికెట్ పడిన సందర్భం లాంటి ఫోటోలు తీయడం చాలా కష్టం. ఇందుకుగాను ఫోటో జర్నలిస్టులు గంటలతరబడి ఎండలో అనుక్షణం అప్రమత్తంగా ఎదురుచూస్తుంటారు. క్రికెటర్ రవిశాస్త్రి ఒక రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఓవర్‌లోని ఆరుబంతులకూ ఆరు సిక్సర్లు కొట్టినపుడు ఆ ఆరు షాట్లను ఒక ఫోటోగ్రాఫర్ తన కెమెరాలో బంధించగలిగాడు. అయితే ఇదే ప్రపంచరికార్డును మొదట సాధించిన గ్యారీసోబర్స్ సిక్సర్లను ఎవరూ ఫోటో తీయకపోవడంతో అవి చరిత్రకు అందకుండా పోయాయి.

BRAOU

1986లో ఆస్ట్రేలియా, ఇండియాల మధ్య మద్రాసులో జరిగిన టెస్ట్ చరిత్రాత్మకంగా 'టై' అయినప్పుడు ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ఫోటో గ్రాఫర్ ఆ టెస్టు ఆఖరు బంతి దృశ్యాన్ని ఫోటో తీయలేకపోయాడు. అప్పుడా పత్రికవారు కొన్ని వేలరూపాయలు వెచ్చించి ఆ ఆఖరు బంతి దృశ్యం ఫోటోను మరో ఫోటో గ్రాఫర్ దగ్గర కొనుక్కొవాల్సివచ్చింది. క్రీడల పేజీకి ఫోటోల ప్రాముఖ్యత ఏమిటో ఈ ఉదాహరణ వల్ల అర్థమవుతుంది.

స్పోర్ట్స్ పేజీలో కేవలం యాక్షన్ ఫోటోలే గాక ఎవరైనా ఒక ఆటగాడు రాణించినపుడు కూడా అతని ఫోటో వేయాలి. కొన్ని పత్రికలలో ఏ క్రికెటర్అయినా 5 వికెట్లు పడగొట్టినపుడు లేదా సెంచరీ చేసినపుడు అది కొలమానంగా పెట్టుకుని వారి ఫోటోను ప్రచురిస్తాయి. కానీ అంతఖచ్చితమైన పద్ధతి ఉండాల్సిన అవసరం లేదు. అలా కాకుండా జట్టు విజయంలో కీలకమైన పాత్ర వహించిన ఆటగాడి ఫోటో వేయాలి. ఇలాంటి సందర్భాలకోసం క్రీడాకారుల ఫోటోలతో కూడిన ఫైళ్లను సిద్ధంచేసుకుని ఉంచుకోవాలి. అయితే ఇలా ఫైల్ ఫోటో వాడేటపుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జిమ్నాస్టిక్స్ లాంటి క్రీడల్లో ఒకే క్రీడాకారిణి అనేక రకాల పోటీల్లో పాల్గొంటుంది. 'ఫ్లోర్ ఎక్సర్‌సైజ్'లో ఓ క్రీడాకారిణి స్వర్ణపతకం సాధించినపుడు, ఆమె 'బ్యాలెన్సింగ్ బీమ్ పై విన్యాసాలు చేస్తున్నప్పటి ఫైల్‌ఫోటో వేస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. క్రికెట్‌లోనయితే ఓ ఆటగాడు బౌలింగ్‌లో రాణించినపుడు అతను బ్యాటింగ్ చేస్తున్నప్పటి ఫైల్ ఫోటో వాడకూడదు.

స్థానిక క్రీడాకారులు రాణించినపుడు కూడా చిన్నసైజులోనైనా వారి ఫోటోలు ప్రచురిస్తే వారిని ప్రోత్సహించినట్టవుతుంది. ఇప్పుడు 'ఫాక్స్‌మిలి' సౌకర్యం అన్నిచోట్ల అందబాటులోకి వచ్చింది కనుక చిన్న చిన్న పట్టణాలలో జరిగే పోటీలకు సంబంధించిన ఫోటోలను కూడా 'ఫాక్స్' పద్ధతిద్వారా తెప్పించుకోవచ్చును.

ఫోటో జర్నలిస్టులు క్రీడలకు సంబంధించిన ఛాయాచిత్రాల బాగా తీయాలంటే వారికి కూడా కొంతపరిజ్ఞానం, ఆసక్తి అవసరం. పత్రికలో ఇలాంటి ఆసక్తి ఉన్నవారినే ఈపనికి నియోగించి వారు స్పెషలైజ్ చేసేలా చూసుకోవాలి.

## 11.11 వార పత్రికలు, ఇతర మ్యాగజైన్లలో క్రీడావార్తలు

ఇంతకు ముందే ప్రస్తావించినట్టు తెలుగులో క్రీడారచన కేవలం దినపత్రికలకే పరిమితంగా ఉంది. అందువల్ల ఇప్పటివరకూ మనం చర్చించుకున్నవన్నీ దినపత్రికలకే ఎక్కువగా వర్తిస్తాయి. తెలుగులో క్రీడలకోసం ప్రత్యేక పత్రికలు లేవుకానీ కొన్ని వారపత్రికలు, పక్షపత్రికలలో క్రీడలకు సంబంధించిన వ్యాసాలు వస్తుంటాయి.

దినపత్రికకు రాయడంలో, వారపత్రిక లేదా పక్షపత్రికకు రాయడంలో ఒక ప్రధానమైన తేడా ఉంది. వారపత్రిక, పక్షపత్రికల విషయంలో వార్తలు పాతబడే అవకాశముంది. అదే మాసపత్రిక అయితే వార్తలు మరింతగా పాతవైపోతాయి. అందుకే ఇలాంటి మ్యాగజైన్లకు రాసేటప్పుడు ఈ విషయం దృష్టిలో పెట్టుకోవాలి. ముఖ్యంగా క్రీడల విషయంలో వార్తలు, వ్యాసాలు వేడివేడిగానే బాగుంటాయి. ఒలింపిక్స్ ముగిసిన నెలరోజుల తర్వాత వాటిగురించి వ్యాసం వస్తే అప్పటికి ఎవరికీ ఆసక్తి ఉండదు.

వివిధపోటీలు, టోర్నమెంటుల గురించిన వార్తలు ఎలాగూ దినపత్రికల్లో వస్తాయి కాబట్టి వాటిని గురించి మళ్లీ మ్యాగజైన్లలో కూడా రాస్తే పునరుక్తి దోషం అంటే ప్రమాదముంది. అందుకే వారపత్రికలలో, రాసేటప్పుడు భిన్నమైన దృక్కోణం నుంచి రాయాలి. దిన పత్రికలలో రాని కొత్త విషయాలుంటేనే వ్యాసాలు రాయాలి. శ్రీలంక చేతిలో పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఎలా ఓడిపోయిందనేది మ్యాగజైన్‌లో రాయడం చర్విత చర్వణ అవుతుంది. అలాగాక ఆ ఓటమి నేపథ్యంలో పాకిస్తాన్ క్రికెట్‌లోని సంక్షోభం బెట్టింగ్ వివాదం, ఇతర రాజకీయాల గురించి కొత్త కోణంలో రాస్తే పాఠకులు ఆసక్తిగా చదువుతారు.

ఏదైన సిరీస్‌గానీ, టోర్నమెంటుగాని జరిగేముందు మ్యాగజైన్లలో రాసే వ్యాసాల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. ఆ వార పత్రిక లేదా పక్షపత్రిక ఏ రోజున మార్కెట్‌లోకి వస్తుందనేది దృష్టిలో పెట్టుకుని ఇలాంటి వ్యాసాలు రాయాలి. పత్రిక

BRAOU

మార్కెట్‌లోకి వచ్చేలోపు ఆటోర్నమెంటు ప్రారంభంకాకుండా ఉండేటట్టయితేనే ఆ వ్యాసాలు రాయాలి. లేదంటే పత్రిక పాఠకుల చేతికందేసరికే ఆ టోర్నమెంటు మొదలై వ్యాసరచయిత అభిప్రాయాలు తలకిందులైతే అలాంటి వ్యాసం హాస్యాస్పదమవుతుంది. గారీ కస్పరోవ్, విశ్వనాథన్ ఆనంద్‌ల మధ్య జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ చదరంగం పోటీ ఉదాహరణే చూద్దాం. దాని గురించి రాసిన వ్యాసం ఉన్నసంచిక ఆపోటీల ప్రారంభమయ్యాక మార్కెట్‌లోకి వచ్చిందనుకోండి. అందులో రచయిత, ఆనంద్‌కు విజయావకశాలెక్కువని రాసి, తీరా ఆ సమయంలో ఆనంద్‌వరుసగా పరాజయాలు ఎదుర్కొంటూ ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

పైన చెప్పిన ప్రమాదాలు తప్పించుకోవాలంటే మ్యాగజైన్లలో ఇలా కాలానికి కట్టుబడి ఉండే వ్యాసాలు జోలికి వెళ్లకుండా ఉండాలి. తమ పత్రికకు ప్రత్యేకం (Exclusive) అయిన ఇంటర్వ్యూలు, ఇతర విశేషాలపైన ఎక్కువగా ఆధారపడాలి. స్పోర్ట్స్ క్విజ్, ఫోటోఫీచర్ లాంటివి కూడా వారపత్రికలు, పక్షపత్రికల అవసరాలకు బాగా సరిపోతాయి.

**అభ్యాసం - 4 : 1. క్రీడా పత్రికలలో ఛాయా చిత్రాలు అవసరమా?**

.......................................................................................................................................................

.......................................................................................................................................................

.......................................................................................................................................................

.......................................................................................................................................................

.......................................................................................................................................................

**2. క్రీడా వార్తలు ప్రచురించే పత్రిక లేవి?**

.......................................................................................................................................................

.......................................................................................................................................................

.......................................................................................................................................................

.......................................................................................................................................................

.......................................................................................................................................................

## 11.12 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

★ వార్తల్లో క్రీడలకు ఒక ప్రత్యేకమైన స్థానం వుందన్న విషయం పాఠం చదివిన తర్వాత అర్థమై వుంటుంది కదా. క్రీడలంటే ఏమిటి? క్రీడా వార్తలు ఎలా రాయాలి. క్రీడా వార్తలు రాసేందుకు కావలసిన అర్హతల గురించి తెలుసుకున్నాం. వార్తల్లో క్రీడలకు ప్రత్యేకమైన స్థానం వుంది. అయినా మన పత్రికల్లో మ్యాచికి తగిన ప్రధాన్యత ఇవ్వడం లేదు. ప్రభుత్వ ప్రసారసాధనాలలాగే పత్రికలు కూడా క్రీడలకు ఆఖరు స్థానాన్నే ఇస్తున్నాయి.

★ క్రీడా వార్తలంటే కేవలం ఆటలపోటీలకు సంబంధించిన వార్తకాదు. క్రీడాకారులు, క్రీడసంఘాలు, సంస్థలతో సహా క్రీడా నిర్వహకులకు సంబంధించి ఏ సమాచారమైనా క్రీడావార్తే అవుతుంది.

★ పాశ్చాత్యదేశాల్లో క్రీడలకు, క్రీడా వార్తలకు, పత్రికలకు విశేష ప్రాధాన్యత వుంది. ఇండియాలో వార, పక్ష పత్రికలు తప్ప పాశ్చాత్యదేశాల్లో మాదిరిగా దిన పత్రికలు లేవు. తెలుగులో ప్రత్యేకంగా క్రీడారంగ సమాచారం అందించే పత్రిక ఒక్కటి కూడా లేదు.

BRAOU

★ క్రీడా పత్రికల్లో ఆటలపోటీల వార్తలతో పాటు, క్రీడా విధానాలు, ప్రభుత్వ ప్రోత్సహం, క్రీడాసంఘాల సమాచారం కూడా వుంటుంది. అలాగే క్రీడా కారులు, రచయితలు రాసే వ్యాఖ్యలు. వ్యాసాలు. కాలమ్స్ వుంటాయి.

★ క్రీడావార్తల రచయితకు ఆటలపట్ల అవగాహన, ఆసక్తి అవసరం. అలాగే మంచి జ్ఞాపకశక్తి కూడా ఉండాలి. క్రీడలకు సంబంధించి ప్రత్యేక పదజాలం వుంటుంది. ఏ ఆటలో ఏ అంశాన్ని ఎలా పిలుస్తారో క్రీడా రచయితకు తెలిసి వుండాలి.

★ క్రీడా వార్తల ప్రచురణలో ఫొటోలకు ప్రాధాన్యత వుంటుంది. కెప్టెన్ 'కప్' అందుకుంటున్న ఫోటోనో. ఫీల్డర్ క్యాచ్ పడుతున్న ఫోటోనో, గోల్ కొడుతున్న ఫోటోనో వేస్తే ఆసక్తికరంగా వుంటుంది. క్రీడా రచయిత వార్త రాసేటప్పుడు ముందుగా ఫలితాన్ని రాసి తరువాత వివరాలు రాస్తే ఆసక్తికరంగా వుంటుంది.

## 11.13. నమూనా వార్తలు

ఎ. ఇలా రాయకూడదు. ఆంధ్రజ్యోతి తేది. (30.10. 95)

**బాల్ బాడ్మింటన్ టోర్నమెంటు ప్రారంభం**

*సిర్పూర్ కాగజ్‌నగర్, అక్టోబర్ 29 (స్పాట్ న్యూస్): తెలంగాణాస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలను ఆదివారంనాడు స్థానిక పేపరు మిల్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎం. బాంట్లా ప్రారంభించారు. టోర్నమెంట్ ఛైర్మన్ డాక్టర్ దామోదరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించంగా డి.ఎస్.పి. శంకరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ సిర్పూర్ పేపర్ మిల్ సౌజన్యంతో ఈపోటీలను నిర్వహిస్తోంది. కాగా పురుషుల విభాగంలో హైదరాబాద్. రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు మహిళల విభాగంలో హైదరాబాద్, మెదక్. రంగారెడ్డి, ఖమ్మం, ఆదిలాబాద్ జట్లు పాల్గొంటున్నాయి. ఆదివారంనాడు జరిగిన పోటీలలో పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు వరంగల్‌ను, రంగారెడ్డి జట్టు ఖమ్మం జట్టును ఓడించగా మహిళల విభాగంలో హైదరాబాద్ జట్టు ఖమ్మంను. మెదక్ జట్టు ఖమ్మంను రంగారెడ్డి జట్టు ఆదిలాబాద్ జట్టును ఓడించాయి.*

*(ఈ వార్తలో ఆటలపోటీల ఫలితాలు వెనుక, ఇతర వివరాలు ముందు ఉన్నాయి.)*

BRAOU

బి. ఇలా రాయాలి. ఈనాడు 4.11.96

**జాతీయ కబడ్డీ : ఆంధ్ర జట్ల ఓటమి**

*దావణగెరె (కర్ణటక) నవంబరు 3 : జాతీయ సీనియర్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ పోటీ లీగ్ మ్యాచ్‌లలో ఆంధ్రాజట్లు ఓటమి చవిచూడగా, హైదరాబాద్ మహిళల జట్టు రెండు లీగ్ మ్యాచ్‌ల్లో నెగ్గి ముందంజ వేసింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఈ పోటీల్లో ఆంధ్ర పురుషుల జట్టు 34-58 స్కోరుతో మేజర్‌పోర్ట్స్ జట్టు చేతిలోనూ. ఆంధ్ర మహిళల జట్టు 25-80 స్కోరుతో తమిళనాడుచేతిలోనూ ఓటమి పాలయ్యాయి. హైదరాబాద్ పురుషుల జట్టు 39-50 స్కోరుతోచండీగఢ్ చేతిలో ఓడిపోయింది. మహిళ విభాగంలోహైదరాబాద్ 60-1 స్కోరుతో చండీగఢ్‌పైనా, 31-12తో మహారాష్ట్ర పైనా ఘన విజయాలతో రెండు విజయాలు నమోదు చేసుకుంది.*

*ఈ పోటీల్లో పాల్గొన్న ఆంధ్రా. కేరళలు నాలుగేసి జట్లతో బరిలోకి దిగాయి. ఆ రెండు రాష్ట్రాల సంఘాలు రెండేసి వర్గాలుగా మారి తమతమ జట్లతో పోటీలకు విచ్చేశాయి. భారత్ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు జి. ఎస్. గెహ్లాట్ జోక్యంతో వైరివర్గాలు కలిసి కంబైన్డ్ జట్లుగా పోటీల్లో పాల్గొన్నాయి. ఆ రెండు సంఘాలు ఇంజెంక్షన్ ఆర్డర్‌లతో పోటీలకు విచ్చేయడంపై గెహ్లాట్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయా సంఘాల్లోని వైరి వర్గాలు తమ విభేదాలను భారత కబడ్డీ సంఘం సమక్షంలోనే పరిష్కరించుకోవాలన్నారు. కోర్టులను ఆశ్రయించినయితే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.*

## 11.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. క్రీడావార్తను నిర్వచించి, క్రీడా వార్తలలోని రకాలను వివరించండి?
2. మామూలు వార్తలకు, క్రీడారంగ వార్తలకు తేడాలను తెలియచేయండి?

II. కింది ప్రశ్నకు 20 పంక్తులకు మించకుండా సమాధానం రాయండి.

1. తెలుగులో క్రీడా రచనల, రచయితల పరిమితులను చర్చించండి?

**- సి. వెంకటేశ్**

BRAOU

# భాగం - 12 : సమీక్షలు

## విషయక్రమం


12.0 ఉద్దేశం

12.1 ప్రవేశిక

12.2 సమీక్ష నిర్వచనం, స్వరూపం

12.3 సమీక్ష ప్రయోజనం

12.4 సమీక్షకుడి లక్షణాలు

12.5 పుస్తక సమీక్ష

12.6 పుస్తక సమీక్షా రచన పరిణామం

12.7 సమీక్షల్లో శైలి

12.8 రేడియో, టెలివిజన్ సమీక్ష

12.9 సమీక్షా ప్రణాళిక

12.10 చలనచిత్ర సమీక్షలు

12.11 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

12.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 12.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- పత్రికలలో పుస్తకాలను
- టెలివిజన్ కార్యక్రమాలను
- సినిమాలను ఏ విధంగా సమీక్షించ వచ్చునో తెలుసుకుంటారు.

## 12.1 ప్రవేశిక

నడుస్తున్న విషయాలను తెలిపే వార్తా పత్రికల్లో కళా, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని సమకూర్చటం, సర్వసామాన్యం. ఈ సమాచారం వల్ల ఆయా రంగాల్లో ఎటువంటి కొత్త అంశాలు ఉద్భవిస్తున్నాయి, వాటివల్ల ప్రయోజనం ఏమిటి, ఏవిషయాన్ని ఎలా స్వీకరించాలి ఎలా అర్థంచేసుకోవాలి అనేవి పాఠకులకు తెలుస్తాయి. కొత్తగా విడుదలైన పుస్తకాలు, రేడియో దూరదర్శన్‌లలో నిత్యం ప్రసారమయ్యే కార్యక్రమాలు, తాజాగా విడుదలైన సినిమాలు వీటి సమీక్షకుడికి ఉండవలసిన లక్షణాలు, ఈనాడు వివిధ పత్రికల్లో వెలవడుతున్న సమీక్షల తీరుతెన్నులు తదితర వివరాలను ఈ భాగంలో మీరు తెలుసుకుంటారు.

## 12.2 సమీక్ష నిర్వచనం, స్వరూపం

సమీక్ష (Review) అంటే "మరోసారి పరిశీలించడం, పత్రికలకు కొత్త పుస్తకాలు పరిచయం చేయడం," అని ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు, సమీక్షణం అంటే 'చక్కగా చూచుట, వెదకుట' అని శబ్దరత్నాకరము నిర్వచించాయి. ఒక పుస్తకం, కార్యక్రమం, సినిమా మంచి చెడులను సహేతుకంగా సహృదయంతో విశ్లేషించి, దాని గురించి తెలియనివారికి నిర్దిష్టమైన అవగాహన కలిగించేది సమీక్ష. ప్రస్తుత పాఠ్యభాగంలో ఈ క్రింది వాటిని వేర్వేరుగా చర్చించవలసివుంది.

1. పుస్తక సమీక్ష

2. ప్రసార కార్యక్రమాల సమీక్ష

3. సినిమాల సమీక్ష

పై మూడింటిలో సమీక్ష ఏ ప్రక్రియకు సంబంధించినదైనా, సమీక్ష ప్రయోజనం, సమీక్షకుడి లక్షణాలు సామాన్యమైనవేనని గుర్తుంచుకోవాలి.

## 12.3 సమీక్ష ప్రయోజనం

1. ఏదైనా ఒక విషయానికి సంబంధించిన కొత్త కోణాలను, దృక్పథాలను పాఠకుడికీ ప్రేక్షకుడికీ పరిచయం చేయడం.
2. ఒక ప్రక్రియకు చెందిన పలు విషయాల్లో దేన్ని ఏ ప్రాధాన్యక్రమంలో ఎంపిక చేసుకోవాలో పాఠకుడికీ, ప్రేక్షకుడికీ సూచించడం, ప్రక్రియ రసానుభూతిని సుగమం చేయడం.
3. సమకాలిన సాహిత్య, కళా రంగాల్లోని మంచిచెడులపై నిఘావేసి, ఆయారంగాల వికాసానికి దోహదం చేయడం.
4. సమీక్షలో విమర్శ అంతర్గతంగా ఉంటుంది కనుక, సాహిత్య ప్రక్రియల్లో ముఖ్యమైనదైన విమర్శ వికాసానికి తోడ్పడటం.

అయితే ఈ ప్రయోజనాలను సాధించడానికి సమీక్షకుడు కూడా కొన్ని అర్హతలు కలిగి వుండాలి. ఈనాడు ప్రతి దినపత్రికలోనూ కొత్త కొత్త సమీక్షకులు పుట్టుకొస్తున్న తరుణంలో కుప్పలు తెప్పలుగా వస్తున్న సమీక్షల్లో పై ప్రయోజనాలను సాధిస్తున్నవి చాలా తక్కువ. కనుక సమీక్షకుడి లక్షణాలను కూడా గుర్తించడం అవసరం.

## 12.4 సమీక్షకుడి లక్షణాలు

1. తను రాస్తున్న ప్రక్రియ (సాహిత్యం, టివి, సినిమా) గురించి, దాని మౌలిక స్వరూప స్వభావాలను గురించి సమీక్షకుడికి కనీసావగాహన (Maximum understanding) ఉండాలి.
2. సమీక్షా రచనలో వ్యక్తిగత రాగద్వేషాలకు తావివ్వక, నిష్పాక్షిక దృష్టితో (Objective View) రాయాలి.
3. సమీక్షకుడికి తర్కజ్ఞానం అవసరం. ఒక పుస్తకం లేదా సినిమాను గురించి ప్రశంసించినా, అభిశంసించినా యథాలాపంగా వ్యాఖ్యానం చేయకూడదు. తన వ్యాఖ్యానాన్ని సహేతుకంగా ఉటంకింపులతో వివరించాలి.

BRAOU

4. సమీక్షకుడు తప్పనిసరిగా గుర్తుంచుకోవాల్సిన విషయం సమీక్షారచనలక్ష్యం. అది స్వీయపాండిత్య ప్రకటన కాదు. ఒక రచనను అంచనా వేయడమే.

5. సమీక్ష చేయడానికి ముందే ఆ పుస్తకం గురించి అభిప్రాయం ఏర్పరచుకోవడం సమీక్షకుడికి పూర్తిగా నిషిద్ధం.

6. సమీక్షకుడు సహృదయుడై వుండాలి. ఒక రచనలో లోపాలు కూడా ఎంచడం వేరు. లోపాలు మాత్రమే ఎంచడం వేరు. రెండిటికీ గల వ్యత్యాసం సమీక్షకుడు ఎరిగి వుండాలి.

ఇక ఇంతకు ముందు పేర్కొన్న ముఖ్యమైన ప్రక్రియల (పుస్తకం, టెలివిజన్, సినిమా) సమీక్షా విధానాన్ని సోదాహరణంగా పరిశీలించవలసి వుంది. వార్తా పత్రికల్లో పై మూడుప్రక్రియల సమీక్షగానీ రేడియో కార్యక్రమాల సమీక్షలు ఇప్పుడు రావడం లేదు. ఒకప్పుడు సమర్థులైన వ్యాఖ్యాతలు రేడియో కార్యక్రమాలను పత్రికలలో సమీక్షిస్తుండేవారు.

## 12.5 పుస్తక సమీక్ష

అన్ని పత్రికల్లోనూ తటస్థపడే సమీక్ష పుస్తక సమీక్ష ఒక్కటే. 'భారతి' వంటి పూర్తిస్థాయి సాహిత్య మాసపత్రిక నుంచీ, 'ఈనాడు' వంటి కేవలం రాజకీయ దినపత్రిక వరకు అన్ని దిన, వార, మాస పత్రికల్లోనూ ఏదో ఒక స్థాయిలో గ్రంథసమీక్ష వుంటుంది. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక (రెండునెలలకు ఒకసారి వచ్చేది), భారతి ( మాసపత్రిక) ప్రతిభ, కృష్ణాపత్రిక, తెలుగు వంటి పాత పత్రికల్లోనూ, ఈనాటి దిన, వార పత్రికలైన ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఈనాడు, హిందూ, డెక్కన్‌క్రానికల్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలోనూ ఆదివారం అనుబంధం, సోమవారం అనుబంధాలలోనూ పుస్తక సమీక్షలు దర్శనం ఇస్తూనే ఉంటాయి.

BRAOU

### పుస్తక సమీక్ష స్వరూపం - ప్రణాళిక

పుస్తక సమీక్షకుడు సాధారణంగా ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం సమీక్షిస్తాడు.

1. మొదట - సమీక్షకు స్వీకరించిన, పుస్తకరచన, రచయితల వెనకవున్న సామాజిక, సాహిత్య నేపథ్యాన్ని స్థూలంగా వివరించాలి.

2. రెండవ దశలో ఆ రచనలో తనకు నచ్చిన విషయాలూ, నచ్చని అంశాలూ సహేతుకంగా విశ్లేషించాలి.

3. మూడవ దశలో సమకాలీన సాహిత్యంలో ఆ రచనకున్న స్థానాన్ని వివేచించాలి.

కానీ పై మూడూ సమపాళ్ళలో ఉండాలి. ఉపోద్ఘాత రూపంలో వుండే 'నేపథ్యం' ఎక్కువై, తక్కిన రెండూ తక్కువైతే అది సరైన సమీక్ష కాజాలదు.

ఉదా: 25 జూన్, 1995వ తేదీ 'ఈనాడు' దిన పత్రిక ఆదివారం అనుబంధంలో ఎర్రంశెట్టిశాయి రచించిన 'హ్యూమరాలజీ' గ్రంథ పరిచయంవుంది. (సమీక్షకుడు స.రా.) ఈ సమీక్షకు కేటాయించిన స్థలమే తక్కువ. నిడివిని బట్టి చెప్పదలుచుకున్న విషయాన్ని కుదించడం, పొందిగ్గా చెప్పడం సమీక్షకుడు ఎరిగి వుండాలి. కానీ ఉన్న రెండు పేరాలలోనూ, ఒక పేరాగ్రాఫ్ పూర్తిగా ఉపోద్ఘాతాకినికే సరిపోయింది. అది ఇలా సాగింది.

"హాస్యం మనిషిని సేదదీర్చి మనసుకి హాయిని కలిగిస్తుంది. చక్కగా నవ్వేవాళ్ళు అసలయిన ఆరోగ్యవంతులు అని

చెప్పుకోవచ్చు. అయితే తెలుగు సాహిత్యంలో హాస్యం చాలా తక్కువగా వుందనీ, తెలుగు వాళ్ళు ఉద్రేకపరులు, గంభీర స్వభావులే కాని అంతగా హాస్యప్రియులు కాదనీ కొందరు అంటూ వుంటారు. ఈ అభిప్రాయం సరికాదని ఆంధ్రులు ఏనాడో రుజువు చేశారు. వెనకటి సాహిత్యంలోనూ, జానపదగీతాలలోనూ ఎంతో హాస్యం వుంది. హాస్యానికి ముందు బారిస్టరు పార్వతీశాన్ని చెప్పిన తర్వాతనే మరొకర్ని చెప్పాలన్నారు మహాకవి. కాని చిలకమర్తివారి గణపతి కూడా తక్కువ వాడేం కాదు. హాస్యంలో వెలనీని కూడా మేళవించిన మహనుభావుడు గురజాడవారి గిరీశం. భమిడిపాటి కామేశ్వరరావుగారి పర్వతాలు, పానకాలు, ముని మాణిక్యంవారి ఉత్తమయిల్లాలు కాంతం, పుస్తకాల కొద్దీ హాస్యాన్ని పండించినవే. ఇహ ముళ్లపూడివారి అప్పారావు, బుడుగు వాళ్ళ అమ్మా, నాన్న రధాగోపాళంలు తెలుగు వారికి గిలిగింతలు పెట్టి తెగనవ్వించినవే. యర్రంశెట్టి శాయి గారి 'హ్యూమరాలజీ' కూడా ఆకోవకు చెందిందే".

ఈ సుదీర్ఘమైన "నేపథ్యం" తర్వాత పుస్తకాన్ని సమీక్షించడానికి మరో 40 లైన్లు మాత్రమే మిగిలాయి. మొత్తం 70 లైన్ల సమీక్షలో 30 లైన్లు ఉపోద్ఘాతానికే సరిపోయాయి. సమీక్షలో ఉపోద్ఘాతం ఎంత పాళ్ళలో ఉండాలో నిర్ణయించుకోలేక పోవడం ఒకలోపం కాగా, ఉపోద్ఘాతంలోని విషయం కూడా పూర్తి ఉచితంగా లేక పోవడం రెండవ లోపం. తెలుగు సాహిత్యంలోని నవ్వు తెప్పించే పాత్రలను ఏకరువు పెట్టడం (గిరీశం, పార్వతీశం, పానకాలు, కాంతం, బుడుగు)లో, ప్రస్తుతాంశాన్ని, ఆ పాత్రలకు మధ్య స్వభావంలోనూ, ప్రక్రియపరంగానూ ఉన్న వ్యత్యాసాన్ని మరిచారు. ఒక నాటకం (కన్యాశుల్కం) రెండు నవలలు (గణపతి, బారిష్టరు పార్వతీశం), ఒక కథల సంపుటి (కాంతం కథలు), ఏ ప్రక్రియకూ లొంగని మరో రచన (బుడుగు) వీటన్నిటినీ ఒకే గాటన కట్టడం, పైగా ఆ రచనల్లో పాత్రలను చెప్పి వాటికి ఈ పుస్తకంలో ఏదో ఒక పాత్రకు బదులు పూర్తి పుస్తకాన్నే తుల్యంగా చెప్పడం సాహితీపరుడు చేయవలసిన పనికాదు. సమీక్షకుడు ఇచ్చిన మొత్తం జాబితాలో భమిడిపాటి కామేశ్వరరావు రచనలు (వీటిని స్కెచ్‌లనవచ్చు) యర్రంశెట్టి శాయి హ్యూమరాలజీ కి కొంత దగ్గరగా ఉంటాయి. అనుచితమైన ఈ తులనాత్మక పరిశీలన వల్ల నిడివిపెరగడంతోపాటు అసలు విషయం చెప్పవలసి వచ్చే సరికి సమీక్షకుడికి చోటు చాలలేదు.

పై సమీక్ష పరిశీలన వల్ల మనకు ఈ విషయాలు తేట తెల్ల మౌతాయి.

1. సమీక్ష ప్రణాళికలో ఉపోద్ఘాతం, విశ్లేషణ, ఉపసంహారం అనే మూడు అంశాలలో దేనికెంత స్థానాన్ని విలువను ఇవ్వాలో ముందుగా ఒక పద్ధతి ప్రకారం నిర్ణయించుకోకపోతే, సమగ్రత కొరవడుతుంది.
2. సమీక్షలో తులనాత్మక పరిశీలన చేస్తున్నపుడు పోల్చడానికి గ్రహించిన ఉపపత్తులు సరైనవో కావో సరిచూసుకోకపోతే సమీక్షలో విశ్వసనీయత (Credibility) లోపిస్తుంది.

సమీక్షలో నచ్చని, నచ్చిన అంశాలను సహేతుకంగా విశ్లేషించాలని చెప్పకున్నాం.

ప్రతిభ (1936 మే) పత్రికలో ప్రసిద్ధమైన కోరాడరామకృష్ణయ్యగారి 'సంధి' పుస్తకంపై ఆ పత్రిక సంపాదకులు తెలికిచర్ల వెంకటరత్నం ఆద్యంతం నంయమనం, తర్కాలతో కూడిన సమీక్ష రాశారు. పుస్తకంలోని మంచిని విపులంగా, సోదాహరణగా చెప్పిన తర్వాత లోపాన్ని ఈ రకంగా చెప్పారు.

"గ్రంథకర్త ఈ గ్రంథంలో ప్రయోగించిన భాషను గురించి ఒకటిరెండు మాటలు చెప్పవలసి ఉన్నది. భాష నానాటికీ మారుతూ ఉంటుందనీ, అందువల్ల భాషకు చరిత్ర ఉంటుందని, వైయాకరణులు ఎప్పటికప్పుడు భాషలో కలుగుతూ ఉన్న మార్పులకు అనుశాసనము చేయవలెనని వ్యాకరణములలో అంగీకరించకపోయినా కొత్త రూపములు వ్యవహారములోనే కాక కావ్యములలో కూడా ఆదరించబడుతూ ఉంటావనీ గ్రంథమంతటా బోధిస్తూ భాషా తత్త్వమూ భాషా ప్రయోగ విధానము ఎరిగి ఈ వచన గ్రంథములో అందులోనూ విషయబోధ ప్రయోజనముగా గల ఈ భాషాశాస్త్ర గ్రంథములో ప్రాచీన కావ్యభాష ఎందుకు ప్రయోగించినారో తెలియకుండా ఉన్నది. తాము చేసిన ఉపదేశములకు వ్యతిరేకముగా గ్రాంధిక భాషలో ఈ గ్రంథము వ్రాయడము అనుచితముగా ఉన్నదని గ్రంథకర్తగారికి మనవి చేస్తున్నాము".

సమీక్షకుడికి, తాను సమీక్షిస్తున్న రచన కర్తపట్ల వ్యక్తిగతంగా ఎంతైనా గౌరవం, భక్తి భావం ఉండవచ్చు. కాని సమీక్షకుడి పాత్ర నిర్వహిస్తున్నపుడు ఆ భావాలు అదుపులో ఉంచలేకపోతే, ఆద్యంతం అతిశయోక్తులతో కూడిన పొగడ్తలే తప్ప, లోతైన విశ్లేషణ సాధించలేడు. ఆంధ్రభూమి దినపత్రిక 'సాహితి' పేజీలో రావూరి భరద్వాజ స్మృతి కావ్యంపై డా॥ జయంతి బాలగంగాధరం సమీక్ష (జూలై31, 1995) ఈ ధోరణికి నిదర్శనం. "భరద్వాజ ఇచ్చేతీర్పులో విశ్లేషణలూ, వ్యాఖ్యానాలూ, అతని అనుభూతులు, అనుభవాలు, అతడు వాటికి స్పందించిన రీతులూ అన్నికూడా సార్వకావ్యతను, సార్వజనీనతను, సార్వదేశికతను సాధించాయి. ఎల్లవేళలా స్త్రీ ఔన్నత్యాన్ని దర్శించడానికే అలవాటుపడ్డ భరద్వాజకు మాత్రమే స్త్రీ అంత సౌందర్య సాక్షాత్కారం జరిగిందని చెప్పాలి." ఇలాంటి వాక్యాలవల్ల పాఠకుడికి రచనలో ఏమున్నదీ అర్థంకాదు. కానీ రచయిత గొప్పవాడు కాబోలుననీ అనుకోవచ్చు. అందువల్ల సమీక్షలో ఎప్పుడూ రచయితను రచనాపరంగా అంచనావేయాలి. తమ అంచనాను సోదాహరణంగా నిరూపించాలి.

అదేవిధంగా పుస్తకంపై అయిష్టతతో సమీక్ష ప్రారంభిస్తే అది మంచి సమీక్ష కాజాలదు. 'భారతి' మాసపత్రికలో చలం రచించిన 'బ్రాహ్మణీకం, పాపం' పుస్తకాల సమీక్ష కేవలం ఒక్క పేరాగ్రాఫులో ముగిసింది. "మొదటిదొక పెద్ద కథ. రెండవది కొన్ని కథల సంపుటి. రెండునూ పాఠకలోకము ఇదివరకు రెండు మూడు సార్లు చవిచూసినవే. ఇది మరియొక ముద్రణ. మన సమాజమునందలి స్త్రీ జీవితములోని అవకతవకలు కేవలము దోషైకదృష్టితో ఈ గ్రంథములందు కథారూపమున వెల్లడింపబడినవి. ఆద్యంతము అవే వస్తువులు. గోరంతలు కొండంతలు చేసి చెప్పుట సమాజ సంస్కరణకు మంచి దోహదము కాదు. చర్విత చర్వణమైన ఈ చర్చకు మరల దిగుట అనవసరము".

ఇందులో రచన ఎందుకు బాగాలేదో చెప్పలేదు. ఒకవేళ ఈ పుస్తకాలపై సమీక్ష ఇదివరకే వచ్చివుంటే (ఇది పునర్ముద్రణ అన్నారుకనుక), అప్పుడు సమీక్ష చేయని పక్షంలో ఇప్పుడు విపులమైన సమీక్ష చేస్తే బాగుండేది. పుస్తకాలు నచ్చక పోవడానికి కారణాలు ఇదివరకే చర్చించివుంటే, అసలా సమీక్ష ఎందుకు చేసినట్టు? ఏరకంగా చూసినా ఇది నిరర్థకమైన సమీక్షే.

సమీక్షావ్యాసాన్ని ప్రణాళికా బద్ధంగా విభజించుకుని, పూర్తిగా ఆపుస్తకానికి న్యాయం చేకూర్చగలిగినవారు తెలుగు సాహిత్యంలో కొద్దిమందే ఉన్నారు. తాను సమీక్షిస్తున్న గ్రంథం దాని నేపథ్యం దాని ప్రయోజనం, దాని విలువ వీటన్నిటినీ చక్కగా బేరీజు వేయగలిగే సమీక్షకుల అవసరం నేటి సాహిత్యానికి ఎంతైనా వుంది.

BRAOU

1940వ సంవత్సరం 'ప్రతిభ' సాహిత్య పత్రికలో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'ఆంధ్రమేఘము' 'మేఘసందేశం' అనే రెండు అనువాద కావ్యాలనూ సమీక్షించిన వైనం చెప్పుకోదగ్గది. తెలుగు సాహిత్యంలో అనువాదాల ఆవశ్యకత కాళిదాసు రచనల అనువాదం ఇత్యాది విషయాలను సంగ్రహంగా/సమగ్రంగా చర్చిస్తూ సునిశితమైన విమర్శ చేసారు.

ఉదాహరణకు కొన్ని వాక్యాలు

"ఆంధ్రసాహిత్యానికి వికాసంలేని ఆదికాలంలో నన్నయాదులు అవసరమయి తెలిగిస్తే - ఇటీవలి వారు అలవాటయి తెలగిస్తున్నట్లు కనబడుతుంది. పోనీ ఇప్పటికింకా వెలుగు చూడని వాటిని వేటినైనా తీసుకొని తెలిగిస్తే కొంతవరకూ బాగు అంతేగాని ఒకే గ్రంథానికి ఇన్ని అనువాద పరంపరలు చేసే ఈ duplicate work లో ఏమీ ఔచిత్యం ఉన్నదో నాకు తెలియడం లేదు".

ఇటువంటి ఔచిత్యం, సమగ్రత కలిగిన సమీక్ష 1-5-1995 నాటి 'ఉదయం' దినపత్రిక సాహిత్యం పేజీల (రచన) కనిపిస్తుంది. 'చదువు కథలు' పుస్తకానికి ప్రాప్తిసర రాచపాళెం చంద్రశేఖరరెడ్డి చేసిన సమీక్ష ఇది. ఒక నిర్దిష్టమైన కథనం ప్రకారం ఈ కథల నేపథ్యం, ఆవశ్యకత, కథల స్వరూప విశ్లేషణ, సముచితంగా సమగ్రంగా చర్చించి తర్వాత ఈ రకమైన ముగింపు నిచ్చారు.

"జీవితం చుట్టూ అవరించిన చదువును, చదువు చుట్టూ అల్లుకున్న జీవితాన్ని అనేక పార్శ్వాల నుండి విశ్లేషించి అసమ సమాజ నగ్నరూపాన్ని ప్రదర్శిస్తున్న ఈ కథలు చదువును పెనవేసుకొన్న సమస్యల్ని ఎత్తి చూపడమే కాక, ఎన్నో ప్రశ్నల్ని, ఆలోచనల్ని రేకెత్తిస్తున్నాయి. చరిత్ర చేసిన తప్పుల్ని చూపిస్తున్నాయి. చదువుకీ ప్రగతికీగల సంబంధాన్ని ఈ కథలు ఋజువు చేస్తున్నాయి. మనం చరిత్ర సంస్కృతులను గురించి మన జబ్బలు చరుచుకోవడం ఎంత హాస్యాస్పదమో ఈ కథలు తెలుపుతున్నాయి. అందుకే ఇవి చదివించే కథలు, అందరూ చదవదగిన, చదవాల్సిన కథలు".

మొత్తం సమీక్షను చదవకపోయినా, ఆ పుస్తకం సారాంశం ప్రయోజనా నిశిత్వం దాని స్థానం పాఠకుడికి తక్షణం స్ఫురించేలా ఇలా ఉపసంహారం రాయడమన్నది సమీక్షకుడి నైపుణ్యానికి, ప్రతిభకు నిదర్శం.

**అభ్యాసం-1: 1. సమీక్ష అంటే ఏమిటో వివరించండి.**

..................................................................................................................................................

..................................................................................................................................................

..................................................................................................................................................

..................................................................................................................................................

..................................................................................................................................................

## 12.6 పుస్తక సమీక్షా రచనల పరిణామం

తెలుగులో కేవలం సాహిత్య పత్రికలైన ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, భారతి, తెలుగు స్వతంత్ర, త్రివేణి తెలుగుసాహితి, స్రవంతి, సమాలోచన, విమర్శిని, వివేచన, సృజన వంటి పత్రికల్లోనూ, సాహిత్యానికి గుణనీయమైన గౌరవాన్నిచ్చిన ఆంధ్రపత్రిక, కృష్ణా పత్రిక వంటి పత్రికల్లోనూ పుస్తక సమీక్షలకు సముచితమైన స్థానం ఉండేది. తెలికిచర్ల వెంకటరత్నం, వోరి నరసింహశాస్త్రి , శ్రీశ్రీ, శ్రీవాత్సవ, కేతవరపు రామకోటి శాస్త్రి వంటి ఎందరో ప్రముఖులు ఈ పత్రికలకుపుస్తక సమీక్షలు చేశారు. కానీ చాలా సందర్భాల్లో సంపాదక వర్గంలోని వారే సమీక్షలు చేయడంవల్ల, సమీక్షకుల పేర్లు ప్రకటించక పోవడం, లేదా కలంపేరు మాత్రమే చెప్పడం జరిగేది.

నేటి తెలుగు పత్రికారంగంలో కేవలం సాహిత్య పత్రికలు లేవు. దిన పత్రికలోని 'ఆదివారం' అనుబంధంలోనూ, ప్రత్యేకంగా నాలుగు దిన పత్రికలు (ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి) సోమవారం వెలువరించే సాహిత్యాను బంధంలోనూ పుస్తక సమీక్షలు చోటు చేసుకుంటున్నాయి.

'పుస్తక సమీక్ష' అంటే కేవలం పుస్తక పరిచయం కాదు, గ్రంథంలోని మంచి చెడులను నిర్భయంగా నిష్కాంక్షగా కొలిచి చెప్పాలన్న అవగాహన అలనాటి నుంచీ సమీక్షకులకు ఉంది. ఈనాడు నచ్చని పుస్తకాన్ని ఘాటుగా విమర్శిస్తారన్న పేరు కొందరికి స్థిరపడిపోయింది. కానీ అటువంటి 'ఘాటు' పాత విమర్శకుల కలం నుంచి కూడా సోకేది.

ప్రతిభ పత్రికలో (1936) రాయసం వెంకటశివుడు రచించిన 'లలితకథావళి' అనే కథా సంపుటిపై శాస్త్రి విమర్శ- "ఈ కథలలో ప్రధానగుణము ఏమో ఆలోచిస్తే అది లాలిత్యమే తప్ప ఇంకొకటి కాదని స్పష్టమవుతుంది. ఏ కథ చూచినా తీవ్రముగా శోకముగాని, భయముగాని అద్భుతముగాని, ఆనందము గాని కలిగించి చదువరులను బాధపెట్టదు. కథలు భావోద్రేకము కలిగించి గాని, ఆలోచనలు ప్రేరేపించి గాని పాఠకులను వృధాగా బాధ పెట్టవు. దీనిలోని భాష ఏమి భాష? అది గ్రాంధికమా లేక వ్యవహారికమా? ఏమయినా వ్యవస్థ ఇందులో ఉన్నదా".

BRAOU

ఇదే పత్రికలో 'ఏకతార' అనే పేరిట ఈ భాష్యకాచార్యులు రాసిన ఇంటి కావ్యంపై 'పా' చేసిన సమీక్ష సమీక్షకుడికి ఒక పుస్తకం ఎంత ఆగ్రహం తెప్పించగలదో నిరూపిస్తుంది. సమీక్షలో ముగింపు వాక్యాలు: "జంకు, బొంకు లేకుండా లోకం అపహసిస్తుందనే భీతి లేకుండా ఈ నీరసపద్య కంకాళాలను ప్రకటించడమే కాకుండా 26 పుటల పీఠికలో అనుపదము ఆత్మశ్లాఘ చేసుకుంటూ పరవశుడౌతున్న ఈ గ్రంథకర్త మనస్సు లోక సామాన్యమైన స్థితిలో లేదు. దీనికి చికిత్స అవసరం. ఆంధ్రుల బహుజన్మకృత పాపఫలమైన ఈ పుస్తకాన్ని సమీక్ష చేయవలసిన విధి నాపాలబడ్డాది శివ శివ".

ఈ సమీక్షకుడికి రచనపై కలిగిన జుగుప్స రచయిత మానసిక స్థితిని సందేహించడం వరకూ వెళ్ళింది. ఇలాంటి సమీక్షలు చదవడానికి చాలా సరదాగా, హాస్యసోరకంగా ఉన్నా, సమీక్షకుడిలో మరికొంత సంయమనం, నిగ్రహం ఉంటే బాగుంటుందనిపిస్తుంది.

ప్రతిపాద విషయం మరుగున పడిపోయి, ఇతర విషయాల చర్చ ఎక్కువకావడం సమీక్షలో లోపమే. అగ్రశ్రేణి కవి శ్రీశ్రీ "తెలుగు స్వతంత్ర' (1949) లో ఉమర్అలీషా అనువదించిన 'ఉమర్ ఖయ్యాం" ఆంధ్రీకరణ ను సమీక్షించిన తీరు ఇటువంటి లోపాన్నే కలిగి ఉంది. పుస్తకాలు అచ్చువేయడం వెనుక సాధకబాధకాలు, ఖయ్యాం ఇతర రచనల అనువాదం వంటి విషయాలను చర్చించిన తర్వాత ఉమర్ఖయ్యాం రచయితలకు పఠాభి, దువ్వూరి రామిరెడ్డి అనువాదాలే బాగున్నాయని సమీక్షకుడి తీర్పు. కాని ప్రస్తుతం సమీక్షించబడుతున్న అనువాదం ఎందుకు బాగలేదో ఎక్కడ బాగుందో సమీక్షకుడు చెప్పలేదు. ఈ సమీక్ష ఉమర్ ఖయ్యాం అనువాదాలపై ఒక చిరువ్యాసంలా వుంది తప్ప ఉమర్ అలీషా కవి అనువాదానికి సమీక్షలా లేదు.

సమీక్షలో పుస్తకానికి సబంధించిన ఏ విషయమూ లేకపోవడం ఒక లోపమైతే, పుస్తకంలోని ప్రతి విషయమూ సమీక్షలో చెప్పాలన్న తాపత్రయం మరొక రకమైన లోపం. తెలుగు అకాడమీ ప్రచురించే 'తెలుగు' పత్రికలో అక్కిరాజు రమాపతిరావు "ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ: భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" అటువంటి సుదీర్ఘమైన సమీక్షను రాసారు. సమీక్ష ద్వారా ఒక కొత్త సిద్ధాంతాన్నో చర్చనో ప్రతిపాదిస్తున్నప్పుడు విపులంగా ఉండడంలో తప్పులేదుగానీ కేవలం 'ఈ పుస్తకం చాలా గొప్పది' అని చెప్పడం కోసం ఇంత వివరంగా రాయనవసరం లేదు.

ఇదే కోవకు చెందిన 'సీరియల్ సమీక్ష' ఇటీవల 'ఉదయం' దిన పత్రికలో వెలువడింది. 1995 మే నెలలో 'నన్నయ్యభారతి' ప్రథమ, ద్వితీయ సంపుటాలపై వెలుదండ నిత్యానందరావు మూడు వారాల సుదీర్ఘ సమీక్ష రాశారు. ఈ సంపుటాల్లో వచ్చిన ప్రతి వ్యాసం పేరు పేర్కొని వాటిలోని విషయాలతో ఏకీభవిస్తూ విభేదిస్తూ రాసిన ఈ సమీక్షలో యాభైశాతం కంటే విలువైన విషయం లేదు.

ఒకనాటి సమీక్షలు, కేవలం సమీక్షలుగా మాత్రమే నిలిచేవి. కానీ ఇటీవల కొత్త పరిణామం వచ్చింది. సమీక్ష ఉద్వేగ భరితమైన చర్చకు నాందిపలకడం, సమీక్ష ప్రచురింపబడిన తర్వాత కొన్ని వారాలపాటు దానిలోని విషయంపై వాద ప్రతివాదాలు కీలకమైన నిశిత చర్చగా మారడం అరుదైన సన్నివేశం. "నిశాని" పేరిట పైడి తెరేజ్‌బాబు, వరదయ్య, మద్దూరి నగేశ్ బాబు, ఖాదా అనే దళితకవులు రాసిన కవిత్వ గ్రంథంపై లక్ష్మీనరసయ్య సమీక్ష (ఆంధ్రజ్యోతి, 1995 జూన్ 4 ఆదివారం) ఒక వివాదాస్పదంగా మారి సాహితీ వ్యాసాల పరంపరకు బీజం వేసింది.

## 12.7 సమీక్షల్లో శైలి

1. సమీక్ష ప్రధాన ప్రయోజనం ఎటువంటి పుస్తకమైనా ఏ స్థాయి పాఠకుడికైనా పరిచయం చేయగలగాలి. సమీక్షలో శైలి, సరళంగా సుబోధకంగా ఉంచాలి.

BRAOU

2. లోపాలను ఎత్తి చూపేటప్పుడు దూషణకంటే వ్యంగ్యం రాణిస్తుంది.

ఉదా॥ పఠాభి "ఫిడేలు రాగాలు డజన్" కావ్యానికి నోరి నరసింహశాస్త్రి సమీక్ష "కొత్తదనము కోసము చేసిన ప్రయత్నము వల్ల ఈ కవి కొంత చిత్ర రచన చేయగలిగినాడు. ఈ కవి 'అహంకారము' వదిలిపెట్టని కొత్త శక్తి కూడా ఉన్న కావ్యాలు ముందు వ్రాయగలడనుకొంటాము. అయితే ఈ కవిని అనుకరించి ఇతరు లెవరైనా కావ్యాలు వ్రాస్తే వాళ్ళను విశాఖపట్టణం పంపవలసి వస్తుంది". (ప్రతిభ, 1936)

1931, ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో "తిరుగుడు పెండ్లి- ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల 65 పుష్పము. శ్రీ వేంకట పార్వతీశ్వర కవులు రచించినది". వేంకట పార్వతీశ్వర కవుల కిరువురకు నొక్కనాటి రాత్రియొక్క రీతిగానే వచ్చిన స్వప్నములోని వృత్తాంతమట" సమీక్ష కర్త పేరు లేదు. ఇందులో వ్యంగ్యం సుబోధకమే.

ప్రస్తుత సమీక్షకుల్లో వ్యంగ్యం, అధిక్షేపం రంగరించిన సమీక్షలకు బుదరాజు రాధాకృష్ణ పెట్టింది పేరు. 'ఈనాడు' ఆదివారం అనుబంధం చివరిపేజీలో వచ్చే వీరి సమీక్షల్లో అవసరమైపుడు సహృదయత, సందర్భాన్ని బట్టి వ్యంగ్యం సముచిత పాళ్ళలో తొణికిసలాడుతుంటాయి.

## 12.8 రేడియో, టెలివిజన్ సమీక్ష

ప్రక్రియ ఏదైనా, సమీక్ష స్వరూపం, ప్రయోజనం సమీక్షకుడికి ఉండవలసిన లక్షణాలు ఒకటే.

BRAOU

పత్రికల్లో ఒకప్పుడు రేడియో కార్యక్రమాల సమీక్షలువస్తుండేవి. ఇప్పుడవి ఆగి పోయాయి. కొన్ని పత్రికల్లో టెలివిజన్ కార్యక్రమాల సమీక్షలు మాత్రం వస్తున్నాయి. ప్రస్తుతం టెలివిజన్ తెలుగు కార్యక్రమాలను సమీక్షిస్తున్న పత్రికలు 'ఈనాడు' 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' జాతీయ కార్యక్రమాల సమీక్ష ఆంగ్ల దిన పత్రికల్లో తరచుగానే కనిపిస్తుంది. 'ఈనాడు' 'ఆంధ్రజ్యోతి' 'ఉదయం' దినపత్రికల్లో తెలుగు కార్యక్రమాల సమీక్ష ఉండేది. టెలివిజన్ కార్యక్రమాలు సమీక్షించే వారికి ఆ మాధ్యమం గురించి లోతైన అవగాహన ఉండాలి. కార్యక్రమాల్లోని విషయంలో పరిజ్ఞానం మాత్రమే కాక, ప్రసార విలువల నాణ్యతను అంచనావేసే శక్తి, ఎరుక కూడా సమీక్షకుడికి అవసరం.

టెలివిజన్ కార్యక్రమాల సమీక్ష, ప్రసారం ముగిసిన తర్వాత అంటే ప్రేక్షకులు చూసిన కార్యక్రమాలను గురించి వుంటుంది. కనుక, పుస్తక సమీక్షలో అ కార్యక్రమాన్ని చూడాలా,అవసరం లేదా అన్న విషయాన్ని సమీక్ష చెప్పదు. మనం చూసి, ఇది వరకే ఏర్పరచుకున్న అభిప్రాయాన్ని సమర్థించేదిగానో, వ్యతిరేకించేది గానో సమీక్ష ఉంటుంది. అయితే, ఒక ధారావాహిక కార్యక్రమంపై రాసిన సమీక్ష వల్ల, అంతవరకూ దాన్ని చూడని ప్రేక్షకులకు, ఆసక్తి కలగవచ్చు. అదే విధంగా టెలివిజన్ కార్యక్రమాల సమీక్షలో ఆయా సీరియల్స్‌కు సంబంధించిన తెరవెనుక సమాచారాన్ని అందించడం వల్ల ప్రేక్షకుల పరిజ్ఞానానికీ ఆకర్షణకూ కూడా పదును పెట్టినట్టవుతుంది.

ఉదాహరణకు 'ఈనాడు' దినపత్రిక మంగళవారం ప్రచురించే హేమలత టి.వి. సమీక్షలో (వినోదిని) ఒక సాహిత్యకారుడి గురించిగానీ, ఇతర రంగాల్లో ప్రముఖుడిని గురించిగానీ వచ్చిన కార్యక్రమంపై సమీక్ష చేస్తున్నపుడు, ఆ ప్రముఖులకు సంబంధించిన సమాచారాన్ని వాళ్ళకు ఆరంగంలోవున్న స్థానాన్ని వివరిస్తూ ఆ కార్యక్రమంలో చెప్పకుండా వదిలేసిన అంశాలను కూడా ప్రస్తావించడం గొప్ప విషయం. అందువల్ల 'వినోదిని' ద్వారా కార్యక్రమాల వివేకపూరితమైన సమీక్షతోపాటు అదనపు సమాచారం కూడా లభిస్తుంది.

కానీ 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో 'దేవయాని' రాసే సమీక్షల్లో పునఃప్రసారాలపై విస్తారమైన చర్చ, ఒక కార్యక్రమం పరిశీలన వంటివి తరచుగా కనిపిస్తాయి.

ఉదాహరణకు 30-7-95వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌ని ప్రాంతీయ దూరదర్శన్ కార్యక్రమాల సమీక్షలో ఆ వారం ప్రసారమైన వాటిలో ఒకే ఒక కార్యక్రమం (త్రిపురనేని రామస్వామి) పై వ్యాఖ్యానం చేశారు. ఒక కార్యక్రమం ఎంతగా నచ్చినప్పటికీ, రోజుకు కనీసం నాలుగు గంటలు ప్రసారమయ్యే డిడి-1 తెలుగు కార్యక్రమాల్లో ఒక కార్యక్రమాన్ని సమీక్షించడం, సమీక్షకుడి సమయ లోపాన్ని సూచిస్తుంది.

**అభ్యాసం-2: పుస్తక సమీక్షకు, టెలివిజన్ సమీక్షకు మధ్య తేడాలు?**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 12.9 సమీక్ష ప్రణాళిక

టెలివిజన్ కార్యక్రమాలను సమీక్షించే వారు ఒక ప్రణాళికను రూపొందించుకోవలసి ఉంటుంది.

1. టెలివిజన్‌లో ఈనాడు అనేక ఛానల్స్‌వస్తున్నందువల్ల అన్ని కార్యక్రమాలనూ సమీక్షించడం సాధ్యంకాదు. అందువల్ల ప్రేక్షకులకు చిరపరిచితమైన ధారావాహిక కార్యక్రమాల కంటె స్వల్పమైన నిడివిగల కొత్త తరహా కార్యక్రమాలను వారం-వారం సమీక్షించాలి. ఉదాహరణకు డిడి-2 లో ప్రాసరమయ్యే 'జునూన్' డిడి-1లో ప్రాసరమయ్యే చంద్రకాంత, చిత్రహార్, జీటివిలో ప్రసారమయ్యే అంత్యాక్షరి,తారా ఇత్యాది సుప్రసిద్ధ కార్యక్రమాల సమీక్ష అనవసరం. ఎప్పటికప్పుడు కొత్తగా ప్రవేశపెట్టే కార్యక్రమాలలోని మంచి చెడులను విశ్లేషించడం ప్రేక్షకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

2. దూరదర్శన్ తెలుగు కార్యక్రమాలను సమీక్షించేటప్పుడు అవి చెత్తగా ఉన్నాయని తీసిపారేయడం తరచుగా కనిపిస్తుంది. విమర్శతోపాటు ఆ కార్యక్రమాలను ఏ విధంగా రూపొందిస్తే బాగుంటుందో ఆచరణీయమైన సలహాలను సమీక్షకుడు ఇవ్వవచ్చు. అలాగే నాసిరకం కార్యక్రమాల మధ్య ప్రసారమయ్యే ఒకటి, రెండు మంచి కార్యక్రమాలను తప్పని సరిగా ప్రశంసించే ధోరణి సమీక్షకుడు అలవరచుకోవడం వల్ల కార్యక్రమ నిర్మాతలకు ప్రోత్సాహకరంగా వుంటుంది.

3. చాలాసార్లు టి.వి. కార్యక్రమాల సమీక్షకులు (ముఖ్యంగా ఈనాడు) ఆ వారం ప్రసారమైన హిందీ, తెలుగు సినిమాలను కూడా సమీక్షిస్తుంటారు. అది పూర్తిగా అనవసరం. సినిమాల సమీక్ష వేరే శీర్షిక కింద ఎలాగో చేయవచ్చు. దూరదర్శన్ కార్యక్రమాల సమీక్ష కోసం కేటాయించిన పరిమితమైన స్థలాన్ని చలనచిత్ర సమీక్షతో మాత్రం చేయకూడదు. అంతేకాక, టెలివిజన్ ప్రసారమయ్యే సినిమాలన్ని ఇదివరకే విడుదలైనవి కనుక వాటిని మళ్ళీ సమీక్షించడంలో అర్థం లేదు.

## 12.10 చలన చిత్ర సమీక్ష

చలనచిత్రాలను సమీక్షించేటప్పుడు, ప్రేక్షకుడి హోదాలో హాయిగా సినిమా చూడడం కుదరదు. సినిమా చూస్తూండగానే ప్రధానమైన అంశాలు కాయితంపై నోట్ చేసుకోవలసివుంటుంది. సాధారణంగా చిత్రం విడుదలయ్యే రోజున చిత్ర సమీక్ష ప్రచురితమౌతుంది. కనుక సమీక్షకులు ప్రీమియర్‌షో చూసి (అంటే ఒక్కసారి చూసి) సమీక్షరాయవలసి వుంటుంది.

BRAOU

సమీక్షకుడికి చలన చిత్రాలకు సంబంధించిన సాంకేతిక విలువల నిర్ణాయకశక్తి కూడా ఉండాలి. చలనచిత్ర సమీక్షలో ప్రధానంగా అంచనా వేయవలసిన అంశాలు

1. కథ, స్క్రీన్‌ప్లే
2. నటన (నటీనటుల ఎంపికలో ఔచిత్యం ఇందులో భాగమే)
3. సంగీతం (పాటల చిత్రీకరణ కూడా ఇందులో భాగమే)
4. ఫొటోగ్రఫీ
5. సంభాషణలు
6. దర్శకత్వం
7. చిత్ర ప్రయోజనం
8. సమకాలీన చిత్రాల్లో దానిస్థానం

వీటిలో ఏదో ఒక దానిపైనే పూర్తి ఏకాగ్రత ఉంచితే సమీక్ష సమగ్రంగా ఉండదు.

అయితే ఒక్కొక్క సినిమాలో ఒక్కొక్క అంశం తక్కినవాటిని అధిగమించేంత ప్రాముఖ్యం కలిగి వున్నపుడు, దాని పరిశీలనకు ఎక్కువ చోటు కేటాయించవచ్చు. ఉదాహరణకు విశ్వనాథ్, బాపు, మణిరత్నం వంటి దర్శకుల చిత్రాలను సమీక్షిస్తున్నపుడు దర్శకత్వంలోని మంచి చెడులపైన ఎక్కువ శ్రద్ధ వహించడం సహజం. అదే విధంగా హిందీలో అమితాబచ్చన్, తెలుగులో చిరంజీవి చిత్రాలను సమీక్షిస్తూన్న ఇప్పుడూ తక్కిన అంశాలు అనుషంగికమై నాయకుడి ఓటమి విజయాలే ప్రాముఖ్యం వహిస్తాయి. లోగడ విజయా బ్యానర్‌కింద వచ్చిన చిత్రాల్లో అన్నిటికంటె కథ ప్రాముఖ్యం వహించేది. సినిమాలో ఎంత మేటి తారలున్నా అందరూ కథకు, స్క్రీన్‌ప్లేకి కట్టుబడ్డ పాత్రలే తప్ప అగ్రశ్రేణి నటులుకారు. అందువల్ల సమీక్షలో కథకే అగ్రతాంబూలం లభించేది.

స్థూలంగా చిత్ర సమీక్షలో ఈ క్రింది మూడు అంశాలు ఎక్కువ ప్రాధాన్యం కలిగి వుంటాయి.

1. బ్యానర్ (ఇందులో నిర్మాత భాగమే)
2. దర్శకుడు
3. నటుడు

ఎక్కువ విజయవంతమైన చిత్రాలనందించిన నిర్మాణసంస్థ (బ్యానర్) తీసినా తాజా చిత్రాన్ని సమీక్షిస్తున్నపుడు, ప్రధానంగా ఆ బ్యానర్ నుంచి విడుదలైన చిత్రాల స్థాయిలో ఈ చిత్రాన్ని పోల్చడం జరుగుతుంది. ఉదాహరణకు కృష్ణాపత్రికలో వెండితెర శీర్షికన సినిమా సమీక్షలు వస్తూండేవి. 1958వ సంవత్సరంలో 'కళాభవాని' అప్పుచేసిపప్పుకూడు, మాంగల్యబలం చిత్రాలను సమీక్షించారు. విజయా బ్యానర్‌పైన అంతకు ముందు వచ్చిన సినిమాలతో వీటిని పోలుస్తూ, సమీక్ష రమ్యంగా సాగింది. దానితోపాటు ఈరెండు సినిమాల తారాగణంలో కూడా కొంత సామ్యం ఉన్నందువల్ల (సావిత్రి, రేలంగి, రమణారెడ్డి, సిఎస్.ఆర్., ఎస్.వి.రంగారావు) రెండిటిలోనూ వారి నటనను కూడా తులనాత్మకంగా విమర్శించారు. కృష్ణాపత్రికలో పెళ్ళినాటి ప్రమాణాలు-సినిమా సమీక్ష ఉత్తమ చలనచిత్ర సమీక్షకు తార్కాణంగా చెప్పుకోదగ్గది. సినిమాలో పైన పేర్కొన్న అన్ని అంశాలనూ పరిశీలించి ప్రశంసిస్తూనే ఈ సినిమా ఎందువల్ల చలనచిత్ర రంగంలో ఒక గొప్ప చిత్రంగా నిలబడలేక పోతుందో కూడా సహేతుకంగా చెప్పిన చక్కటి సమీక్ష ఇది.

BRAOU

అదే విధంగా హిందీలో ఆర్.కె. బ్యానర్, బి.ఆర్.ఫిల్మ్స్, తమిళంలో ఏ.వి.యం. జెమిని ఇత్యాది సంస్థల చిత్రాలను బ్యానర్ పరంగా సమీక్షించడం సామాన్యం. అశోక్‌కుమార్ దగ్గర్నుంచీ చిరంజీవి వరకు అడపాదడపా సినిమాకంటె పెద్ద ఇమేజ్ వున్న నటులు వస్తూనే వున్నారు. వారి కొత్త చిత్రాలు విడుదలైనపుడు ఆ నటుల నటనా జీవితంలో ఆ చిత్రం స్థానమేమిటన్నదే సమీక్షకుడు ప్రధానంగా పరిగణిస్తాడు. 'మహానది' చిత్రంలో కమల్‌హాసన్ మరింత ఎత్తుకు ఎదిగాడు. 'అల్లుడామజాకా' చిత్రంతో చిరంజీవి స్థాయి పూర్తిగా దిగజారిపోయింది. ఈ విధమైన సమీక్షలు (ఇండియన్ ఎక్స్‌ప్రెస్) నటుల పరంగానే సాగాయి. అలా రాయడం ఉచితం కూడా.

ప్రముఖ దర్శకుల సినిమాల సమీక్ష వారి సాఫల్యవైఫల్యాలనే ప్రస్తావిస్తుంది. 'అపద్బాంధవుడు' చిత్రం విశ్వనాథ్ స్థాయిని 'పెళ్లికొడుకు' చిత్రం బాపు స్థాయిని దిగజార్చాయని సమీక్షలు వచ్చాయి.

ఇటీవల ఇళయరాజా, రెహమాన్‌ల సంగీతం సినిమా సమీక్షలసంగీత ప్రస్తావనను పెంచడమే కాక ఇది రెహమాన్ తొలిడైరెక్ట్ హిందీ చిత్రం అనేంత వరకూ సంగీత దర్శకత్వం స్థాయిని పెంచింది. సినిమాల్లో సంగీతాన్ని అనాదిగా సమీక్షకులు ప్రస్తావిస్తూనే వున్నారు. అయితే సంగీత దర్శకుడి పేరుతో సినిమా సమీక్ష ప్రారంభించడమన్నది ఇటీవలి పరిణామం. ఉదా॥ 'బొంబాయి' సినిమా సమీక్షలో మణిరత్నంకు ఉన్నంత స్థానం రెహమాన్‌కు కూడా కల్పించాయి కొన్ని సమీక్షలు.

**అభ్యాసం-3: చిత్రసమీక్షలు ఆ చిత్రాల జయాపజయాలను ఎలా నిర్ణయిస్తాయో చర్చించండి.**

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

BRAOU

## 12.11 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

- ★ పత్రికా రచనలో సమీక్షకు గణనీయమైన, సముచితమైన స్థానం వుంది. సృష్టించేవ్యక్తికీ, స్వీకరించే వ్యక్తికీమధ్య వారధిలాంటి వ్యక్తి సమీక్షకుడు. అందువల్ల అతను ఇరువురి పట్ల తన బాధ్యతను గుర్తుంచుకోవాలి. ఇద్దరికీ న్యాయం చెయ్యాలి.
- ★ రచయితపై అభిమానంతోగానీ, ద్వేషంతో గాని పాఠకుడికి తప్పుడు అవగాహన కలిగించకూడదు. తప్పుడు సమాచారం చెప్పకూడదు.
- ★ సమీక్షకుడు తన వ్యక్తిగత అభిప్రాయాన్ని సార్వజనీనం చేయడానికి ప్రయత్నిస్తాడు. అంటే, తన అభిప్రాయంతో ఇతరులు ఏకీభవించేలా చేయడానికి తన వద్దనున్న సాధన సామగ్రినంతా వినియోగిస్తాడు. కానీ ఈ సామాగ్రి గుణాత్మకమైనదై వుండాలి. తర్కం, సహృదయం, నిష్పాక్షికత, లోకజ్ఞానం, పుస్తకపరిజ్ఞానం, అభివ్యక్తినైపుణ్యం పఠితపట్ల బాధ్యత ఇదే సమీక్షకుడి సామాగ్రి. వీటిని ఉపయోగించి సమీక్ష రాసినపుడు సమీక్ష రచనా కళ ఉన్నత శిఖరాలు చేరుకుంటుంది. అటువంటి సమీక్షవల్ల పత్రికకు గౌరవం హోదా ఏర్పడుతాయి.

## 12.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. సమీక్షను నిర్వచించి, దాని స్వరూప ప్రయోజనాలను వివరించండి?

2. పుస్తక సమీక్ష చేయడంలో సమీక్షకుడు వ్యవహరించవలసిన సరళిని విశ్లేషించండి

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. టెలివిజన్ సమీక్షలో అవలంబించవలసిన పద్ధతులు తెలపండి?

2. సినిమా సమీక్ష ఎన్ని విధాలుగా ఉండవచ్చునో వివరించండి?

- సి. మృణాళిని

BRAOU

BRAOU

# ఖండం - 3

# సంపాదకీయాలు, ప్రధాన వ్యాసాలు పత్రికానుబంధాలు

పత్రికలు కేవలం వార్తలనూ, వ్యాసాలనూ వ్యాఖ్యానాలనూ అందించడమే కాక విశ్లేషణలను కూడా చేస్తుంటాయి. ఈ వ్యాఖ్యానాలూ విశ్లేషణలూ పత్రిక యొక్క దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంటాయి. ప్రధానంగా ఈ వివరణలు, విశ్లేషణలు, వ్యాఖ్యానాలు సంపాదకీయాలు, ప్రధాన వ్యాసాలు ప్రత్యేక అనుబంధాల రూపంలో కనిపిస్తాయి.

ఈ ఖండంలో వీటిని ఆరు భాగాలుగా వర్గీకరించి వివరించడం జరిగింది. వీటిలో మూడు అభిప్రాయ వ్యక్తీకరణకు సంబంధించినవి కాగా మరో మూడు సామాజిక బాధ్యతను ప్రతిబింబించేవి. ఈ ఆరు భాగాలు: **1.** సంపాదకీయం **2.** బాలలకోసం రాయడం **3.** మహిళల కోసం రాయడం **4.** యాత్రారచన **5.** వికలాంగుల కోసం రాయడం **6.** ప్రత్యేక సంచికల కోసం అనుబంధాలకోసం రాయడం.

ఈ ఆరు భాగాల్లోనూ అనేక ప్రత్యేకతలున్నాయి. వీటిని దిన పత్రికల్లో గమనించండి. అవి వివిధ రకాలుగా కనిపిస్తాయి. సంపాదక రచనకైనా యాత్రారచనకైనా ఇలా ఏ ప్రత్యేక రచనకైనా కొన్ని పద్ధతులు, పరిమితులు, వైవిధ్యాలున్నాయి. వాటిని ఎలారాయాలి? ఏఏ అంశాలను పరిగణలోకి తీసుకోవాలి? అనేవి ఈ భాగాల్లో వివరంగా చర్చించడం జరిగింది. వీటిని చదివి పత్రికల్లో వస్తొన్న ప్రత్యేక వ్యాసాలను పరిశీలించండి.

BRAOU

BRAOU

# భాగం - 13 : సంపాదకీయం

## విషయక్రమం

13.0 ఉద్దేశం
13.1 ప్రవేశిక
13.2 సంపాదకీయ రచన - రకాలు
13.2.1. ప్రశ్నించే సంపాదకీయం
13.2.2. నిర్మాణాత్మక విమర్శ
13.2.3. విభేదం
13.2.4. ఏవగింపు
13.2.5. వేదాంత ధోరణి
13.2.6. సలహా
13.2.7. ప్రస్తుతి
13.2.8. ఖండన
13.3 సంపాదకీయాలు - వర్గీకరణ
13.3.1. సందేశాత్మక సంపాదకీయాలు
13.3.2. మానవీయ సంపాదకీయాలు
13.3.3. వివరణాత్మక సంపాదకీయాలు
13.3.4. వార్తాధార సంపాదకీయాలు
13.3.5. పరిష్కారాత్మక సంపాదకీయాలు
13.4 సంపాదకీయం - నిర్మాణం
13.4.1. ఎత్తుగడ
13.4.2. వివరణ
13.4.3. ముగింపు
13.5 సంపాదకీయం - శైలి, భాష
13.6 బరువు బాధ్యతలు
13.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
13.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 13.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు

- పత్రికలలో సంపాదకీయం ప్రాముఖ్యం
- సంపాదకీయాల రకాలు
- సంపాదకీయ రచనలో తీసుకోవలసిన జాగ్రత్తలు
- ఉపయోగించవలసిన భాష, శైలి గురించి తెలుసుకోగలుగుతారు.

## 13.1 ప్రవేశిక

సంపాదకీయం అంటే సంపాదకుడి హృదయం. వివిధ అంశాలపై సంపాదకుడు వెలిబుచ్చే అభిప్రాయం. చేసే వ్యాఖ్య. ప్రజలను ప్రభావితం చేసే నిమిత్తం దైనందిన పరిణామాలపై పత్రికా సంపాదకుడు విశ్లేషించి, వాదించి, వ్యాఖ్యానించి రాసే వ్యాసం సంపాదకీయం.

సంపాదకీయాన్ని అన్ని వేళలా ముఖ్య సంపాదకుడు రాయలేకపోవచ్చు. సంపాదకీయ రచయితలు వేరుగా ఉంటారు. సంపాదకీయ రచయితలు (లీడర్ రైటర్స్) రాసిన సంపాదకీయాలను, వ్యాసాలను ప్రధాన సంపాదకుడు చదివి ఆమోదించిన తర్వాతనే ప్రచురించడం సంప్రదాయం. వివిధ అంశాలపై సంపాదకుడి అభిప్రాయాల ద్వారా పత్రిక విధానాన్నీ వైఖరిని సంపాదకీయం సూచిస్తుంది. పత్రిక హృదయాన్ని ఆవిష్కరించగల వ్యక్తి ప్రధాన సంపాదకుడే కనుక ఆయన అనుమతితోనే ఆమోదంతోనే సంపాదకీయరచన, ప్రచురణ జరుగుతాయి.

" ఈ విషయంపై మీ అభిప్రాయం ఏమిటి?" అనే ప్రశ్నకు సంపాదకుడు ప్రచురించే సమాధానాన్ని సంపాదకీయం అని కూడా చెప్పుకోవచ్చు. విషయం తెలిస్తే అభిప్రాయం పాఠకులే ఏర్పరచుకుంటారు. పత్రిక అభిప్రాయానికి ఏ పాటి విలువ ఉంటుంది? అని ప్రశ్నించేవారున్నారు. పత్రిక పాఠకులలో సుమారు 12శాతం మంది మాత్రమే సంపాదకీయం చదువుతున్నారని 1970వ దశకంలో, అయిదు శాతం మంది మాత్రమే చదువుతున్నారని 1990 వ దశకంలో సర్వేలు వెల్లడించాయి. అయితే ప్రముఖులు, విధాన నిర్ణేతలు ప్రభుత్వాధినేతలు సంపాదకీయాలను విధిగా చదివించుకుంటారని సర్వేలు తెలిపాయి. కనుక ప్రభుత్వం, ఇతరసంస్థల నిర్ణయాలపైన పత్రికా సంపాదకీయాల ప్రభావం ఎంతో కొంత తప్పనిసరిగా ఉంటుంది. సమాజానికి దిశనిర్దేశనం చేయడంలో సంపాదకీయాలది ప్రముఖమైన పాత్ర అని సంపాదకులలో అత్యధికుల అభిప్రాయం. ముట్నూరి కృష్ణారావు వంటి ప్రతిభావంతులైన సంపాదకుల రచనల బలంతోనే కృష్ణాపత్రిక స్వాతంత్ర్య సమరయోధుల కరదీపికగా భాసిల్లింది.

సంపాదకీయ రచనద్వారా పవిత్రమైన సామాజిక బాధ్యత నిర్వహిస్తున్నామనే ప్రగాఢ విశ్వాసం సంపాదకులకు ఉంటుంది. అందుకే అత్యంత విలువైన సమయాన్ని సంపాదకీయ రచనకే కేటాయించడం. తమ సంపాదకీయాల ప్రాచుర్యం కారణంగానే పత్రిక వ్యాపారం, వ్యాప్తి విస్తరిస్తున్నాయనే నమ్మకం కూడా చాలా మంది సంపాదకులను నడిపిస్తుంది. మాంచెస్టర్ గార్డియన్ సంస్థాపకుడు, యజమాని సంపాదకుడు సి.పి.స్కాట్ వార్తలకంటే సంపాదకీయాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవాడు. గార్డియన్ ప్రచురణ (సర్క్యులేషన్) పెరిగితే అది తన సంపాదకీయాల మహిమగా భావించేవాడు. పత్రిక ప్రచురణ తగ్గితే వార్తా విభాగంలో ఏదో లోపం జరుగుతున్నట్టు విసుగుదల కనబరిచేవాడట. తమ సంపాదకీయాల మూలంగానే పత్రిక ప్రాబల్యం పెరుగుతున్నదని గట్టిగా నమ్ముతూ ఒక వేళ పత్రిక ప్రాచుర్యం తగ్గినట్టయితే అది సర్క్యులేషన్ విభాగం నిర్వాకమేనని నిందించే సంపాదకులు ఇప్పటికీ ఉన్నారు.

"సంపాదకీయాలకు నా ముందు తరంలో గల ప్రాధాన్యం నా తరంలోనే తగ్గింది. ఇప్పుడు మరింత క్షీణించింది. ఇది కేవలం మన దేశానికే పరిమితమైన పరిణామంకాదు. దేశదేశాలలో ఇంతే జరుగుతున్నది. ఇందుకు స్పెండర్ వంటి సంపాదకులు అరుదు కావడం ఒక కారణం కాగా, "వెస్ట్‌మినిస్టర్" వరుసగా పదహారు సంవత్సరాలు తనను నష్టపరిచినా వెనుకడుగువేయని సర్ జార్జి న్యూస్ వంటి పత్రికా వ్యవస్థాపకులు కొరవడడం ఇంకొకకారణం. మాంచెస్టర్ గార్డియన్ తనదే అయినా దాని నుంచి సాలుకు 2500 పౌనుల జీతం మాత్రం పుచ్చుకొని తక్కిన లాభాలను పత్రిక అభివృద్ధికై వినియోగించిన స్కాట్ వంటి ఎడిటర్, ప్రొప్రైటర్లు మిగలక పోవడం మరో కారణం" అంటూ "మూడు దశాబ్దాలు"లో ప్రఖ్యాత సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు వివరించారు.

సంపాదకీయం, సంపాదక వ్యాసాల ద్వారానే సంపాదకుడు, వ్యాఖ్యాతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలరు. పత్రికలో ప్రచురించే వార్తలలో వ్యాఖ్యానానికి అంతగా ఆస్కారం ఉండదు. ఏదైనా విషయంపై సంపాదకుడు చాలా గట్టిగా తన అభిప్రాయన్ని వెల్లడించాలనుకుంటే మొదటి పేజీలోనే సంపాదకీయం చోటు చేసుకుంటుంది. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే సంపాదకీయం పత్రిక హృదయం నుంచి సూటిగా వెలువడిన వ్యాఖ్య, వాదం, హితవు, తీర్పు.

BRAOU

## 13.2 సంపాదకీయ రచన - రకాలు

ఏ అంశంపై సంపాదకీయం రాయాలో నిర్ణయించుకోవడం మొదటి ఘట్టం. చిన్న పత్రికలలో సంపాదకులే అన్ని రకాల అంశాలపై సంపాదకీయాలు రాస్తున్నారు. పెద్ద పత్రికలలో వివిధ అంశాలలో ప్రవీణులైనవారు ఆయా అంశాలపై సంపాదకీయాలు రాస్తారు. వీరినే లీడర్ రైటర్స్ అంటాం. సాధారణంగా ప్రతి ఉదయం సంపాదకుడి గదిలో సంపాదకీయ రచయితల సమావేశం జరుగుతుంది. చాలా ముఖ్యమైన పరిణామాలు సంభవించినప్పుడు సంపాదకుడు స్వయంగా సంపాదకీయం రాయాలని సంకల్పిస్తే ఆ సంగతి సహచరులకు తెలియజేస్తాడు. లేకపోతే ఎవరు రాయాలో నిర్ణయిస్తాడు. ఏ విషయంపై రాయాలో, ఎలా రాయలో, ఏ విధంగా వ్యాఖ్యానించాలో సంపాదక మండలి స్థూలంగా చర్చించి నిర్ణయిస్తుంది.

విషయాన్ని బట్టి, పత్రిక వైఖరినిబట్టి సంపాదకీయం ధోరణి ఉంటుంది. ఉదాహరణకు 1995 ఆగస్టు ఉత్తరార్ధంలో తెలుగుదేశం లెజిస్లేచర్ పార్టీలో జరిగిన తిరుగుబాటు ఉదంతాన్ని తీసుకుందాం. ఈ పరిణామాలపై ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క రకంగా వ్యాఖ్యానించింది. ఒకే ఉదంతంపై తమతమ పత్రికల విధానాలు, వైఖరుల ఆధారంగా భిన్నమైన సంపాదకీయాలు రాయడానికి అవకాశం ఉంది.

సంపాదకీయాలలో రకాలను గమనించే ముందు తెలుగుదేశం పార్టీలో పరిణామాలను పరిశీలిద్దాం. ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు భార్య లక్ష్మీ పార్వతి పార్టీ ప్రభుత్వ వ్యవహారాలలో మితి మీరిన జోక్యం చేసుకుంటున్నారనీ, ఆమె రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారనీ ఆరోపిస్తూ పార్టీకి చెందిన శాసన సభ్యులలో అత్యధికులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. వీరికి రామారావు అల్లుడు రెవెన్యూ, ఆర్థిక శాఖల మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వహించారు. మరో అల్లుడు తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కుమారులు హరికృష్ణ, బాలకృష్ణ, ఇతర కుటుంబ సభ్యులు ఈ తిరుగుబాటును ప్రోత్సహించారు. ముఖ్యమంత్రిగా, పార్టీ అధ్యక్షుడుగా రామారావు స్థానాన్ని చంద్రబాబు ఆక్రమించారు.

ఈ ఘటనలపై కింది విధంగా సంపాదకీయాలు రాయవచ్చు.

### 13.2.1 ప్రశ్నించే సంపాదకీయం

నారా చంద్రబాబు నాయకత్వంలోని శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ అధినేత రామారావుపై తిరుగుబాటు చేయడం ప్రజాస్వామ్య బద్ధమా? అనే ప్రశ్నతో సంపాదకీయం ప్రారంభం అవుతుంది. తర్వాత రామారావు ప్రాబల్యం కారణంగా శాసన సభ్యులు గెలిచిన సంగతి, ఎన్నికలకు ముందే రామారావు జీవితంలోకి లక్ష్మీపార్వతి ప్రవేశించిన వాస్తవం, దీనిని ప్రజలు ఆమోదించే తెలుగుదేశం పార్టీకి ఘన విజయం సాధించి పెట్టిన వైనం వివరిస్తాం. ముఖ్యమంత్రి భార్య పరిపాలనలో జోక్యం చేసుకుంటే ఆ జోక్యాన్ని నివారించడానికి ప్రయత్నించాలి కానీ ముఖ్యమంత్రిపైనే తిరుగుబాటు చేయడం భావ్యమా? అని ప్రశ్నిస్తాం.

### 13.2.2 నిర్మాణాత్మక విమర్శ

లక్ష్మీపార్వతి జోక్యాన్ని అనుమతించినందుకు రామారావును విమర్శిస్తూ సంపాదకీయం రాయవచ్చు. 'ప్రజలు రామారావుకు అధికారం ఇచ్చారు కానీ అయన సతీమణికికాదు' అంటూ ప్రారంభించవచ్చు. రామారావు పొరపాట్లు చేసినప్పటికి చంద్రబాబునాయుడు చేసిన పని సమర్థనీయం కాదని విమర్శిస్తూనే ఇక మీదట చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం. పార్టీ రామారావు వర్గం పట్ల ఏ విధంగా వ్యవహరించాలో సూచిస్తాం.

BRAOU

### 13.2.3 విభేదం

'నారా చంద్రబాబునాయుడు వర్గం చేసిన పని ఏమాత్రం సమర్థనీయం కాదు'. ప్రజాస్వామ్యబద్ధం అసలే కాదు అంటూ తిరుగుబాటు దారుల వైఖరితో విభేదిస్తూ సంపాదకీయాన్ని ప్రారంభిస్తాం. ఎందుకు సమర్థనీయంకాదో, ప్రజాస్వామ్య విహితం కాదో వాదిస్తాం. ఈ వర్గం చర్యలను సంపాదక మండలి ఆమోదించడం లేదని స్పష్టంగా చెబుతూ సంపాదకీయాన్ని ముగిస్తాం.

### 13.2.4 ఏవగింపు

చంద్రబాబునాయుడు వర్గం చర్యలతో విభేదించడమే కాకుండా వారి చర్యలను ఏవగించుకుంటూ ఘాటుగా సంపాదకీయం రాయవచ్చు. "కుట్రలు కుతంత్రాలతో సాధించిన అధికారం ఎంతో కాలం నిలువదు'అని శపిస్తూ సంపాదకీయాన్ని ప్రారంభించవచ్చు. "ఎం.ఎల్.ఏ.లను ఆకట్టుకొన్నంత మాత్రాన ప్రజనాయకుడు కాగలరా? ఎనిమిది మాసాల క్రితమే ప్రజలు ఇచ్చిన తీర్పును వక్రీకరించి ప్రజాభిష్టానికి సమాధికట్టినవారు ప్రజాస్వామ్యవాదులా? అని ప్రశ్నిస్తూ ఈ వర్గం వ్యవహార శైలిని అసహ్యించుకునేటట్లు సంపాదకీయాన్ని నడిపించవచ్చు.

### 13.2.5 వేదాంత ధోరణి

"ఎనిమిది మాసాల క్రితం ప్రజలు బ్రహ్మరథం పట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడు రామారావు ఈ రోజున పదవీచ్యుతుడై తలదించుకోవలసి రావడం విధి విలాసం. రాజకీయవాదులకు ఎప్పుడు ఏ గతి పట్టుతుందో చెప్పజాలము. జీవితంలో అన్నీ మనం ఊహించినట్టు జరగవు. అనూహ్య పరిణామాలను కూడా సంయమనంతో స్వీకరించడం స్థితప్రజ్ఞుల లక్షణం.." అంటూ వేదాంతధోరణిలో సంపాదకీయం ప్రారంభించవచ్చు. ఏ వర్గాన్నీ తప్పుపట్టకుండా, ఏ వర్గాన్ని సమర్థించకుండా పరిణామాల పట్ల అవేదన వెలిబుచ్చుతూ సంపాదకీయాన్ని సాగించి ముగించవచ్చు.

### 13.2.6 సలహా

పరిస్థితులను పరిశీలించి తగిన సలహా ఇవ్వడం పత్రికల బాధ్యత. తెలుగుదేశం పార్టీ పరిణామాలు తిరుగులేనివని ఢిల్లీనుంచి హైదరాబాద్ వచ్చిన మాజీ ప్రధాని వి.పి.సింగ్ తెలుసుకున్నారు. రాష్ట్రంలో పార్టీ, ప్రభుత్వ బాధ్యతలను అల్లుళ్ళకు, కుమారులకు వదిలి జాతీయస్థాయిలో రాజకీయాల పట్ల శ్రద్ధ చూపవలసిందిగా ఆయన ఎన్.టి.రామారావుకు హితవుచెప్పారు. ఇదే పత్రిక అభిప్రాయం కూడా అయినట్లయితే "కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని అన్నట్లు రామారావు ఎంతగా గుండెలు బాదుకొంటూ తన అల్లుళ్ళు, కొడుకులపై ఫిర్యాదు చేస్తే అంతగా ఆయన జనం దృష్టిలో పలుచన అవుతారు ..." అంటూ ప్రారంభించి, 'ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను సవ్యంగా అర్థంచేసుకొని రామారావు కొత్త ముఖ్యమంత్రి చంద్రబాబును మనస్ఫూర్తిగా ఆశీర్వదించి రాజకీయాలనుంచి విరమించుకోవడం శ్రేయస్కరం. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడుగా, మాజీ ముఖ్యమంత్రిగా, అనుభవశాలిగా, 'అన్న'గా రామారావు సలహా, మార్గదర్శకత్వం కొత్త ముఖ్యమంత్రికి శిరోధార్యం కావాలి. ...' అని ముగించవచ్చు.

### 13.2.7 ప్రస్తుతి

తెలుగుదేశం పార్టీ పరిణామాలలో చంద్రబాబునాయుడు పాత్రను ప్రశంసిస్తూ సంపాదకీయం రాయాలని సంపాదకుడు భావించినట్లయితే "తెలుగుదేశం పార్టీని విపరీత ధోరణులనుంచి కాపాడటంలో పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యన్ని నెలకొల్పడంలో చంద్రబాబునాయుడు పోషించిన పాత్ర విశిష్టమైనది. ప్రజలు అపార్థం చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ, నాయకుడికి, మామగారికి వెన్నుపోటు పొడిచిన కృతఘ్నుడు అనే అపవాదు వచ్చే ప్రమాదం ఉన్నదని తెలిసినప్పటికీ చంద్రబాబు

BRAOU

చారిత్రాత్మకమైన బాధ్యత నిర్వహించారు. పార్టీని శాసన సభ్యులను కార్యకర్తలను రక్షించుకునేందుకు ఆయన ఎంతో సాహసోపేతంగా చాకచక్యంగా కథ నడిపించి అపర చాణక్యుడని 'పేరు తెచ్చుకున్నారు'.... అంటూ పొగడవచ్చు.

### 13.2.8 ఖండన

ఈ పరిణామాలకు రామారావు ఒక్కరే బాధ్యుడని నిందించాలని పత్రికా సంపాదకుడు నిర్ణయిస్తే 'ఈనాడు 1995 ఆగస్టు 28వ తేదీన ప్రచురించిన సంపాదకీయం శైలిలో రాయవచ్చు. 'ఈ ఉత్పాతం స్వయం కృతం' అన్న శీర్షికతో ఆనాటి ఈనాడు సంపాదకీయం ఇలా సాగింది. "తెలుగుదేశంలో ఈ భూకంపం ఊహించిన ఉత్పాతమే. అడుగుపొరల్లో రాపిడి తన గుండెల్లో ప్రకంపనాలు సృష్టించే స్థాయికి ఎదుగుతుందని తెలుగువల్లభుడు ఎన్టీఆర్ ఊహించలేకపోవడం ఆయన తప్పు.... సతి సన్నిధే సర్వస్వమని మతిమాలిన కారణంగా సుతులచేత హితబోధ చేయించుకొనే దౌర్భాగ్యం ఆయనకు సంప్రాప్తమయింది కటకటా! ..." ఈ రకంగా నిర్దాక్షిణ్యంగా, కటువుగా నడిచిన సంపాదకీయం ప్రధాన లక్ష్యం శ్రీరామరావును దోషిగా జోను ఎక్కించడమే.

ఇదే విధంగా 'ఆంధ్రప్రభ' దిన పత్రిక మొదటి పేజీలో ప్రచురించిన "తారక'భామా' పతనం" అన్న శీర్షిక గల సంపాదకీయం కూడా చాలా ఘాటుగా, ఖడ్గచలనం తీరులో సాగింది.

కాఠిన్యం మోతాదులో తేడా ఉన్నప్పటికీ తక్కిన తెలుగు పత్రికల సంపాదకీయాలు అదే ధోరణిలో సాగాయి. ఇందుకు భిన్నంగా 'హిందుస్థాన్ టైమ్స్' పత్రిక చంద్రబాబును, ఆయన రాజకీయాన్ని నిశితంగా విమర్శించింది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' సంపాదకీయం తటస్థంగా ఉంది.

ఒకే సమస్యను భిన్నమైన కోణాలనుంచి పరిశీలించి తమ అవగాహన మేరకు సంపాదకులు స్పందిస్తారనడానికి ఈ ఉదాహరణ చక్కగా సరిపోతుంది.

అభ్యాసం -1 : నిర్మాణాత్మక విమర్శ?

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

BRAOU

## 13.3 సంపాదకీయాలు - వర్గీకరణ

సంపాదకీయాలను స్థూలంగా అయిదు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. సందేశాత్మక సంపాదకీయాలు 2. మాననీయ సంపాదకీయాలు. 3. వివరణాత్మక సంపాదకీయాలు. 4. వార్తాధార సంపాదకీయాలు. 5. పరిష్కారాత్మక సంపాదకీయాలు. వీటిని గురించి వివరంగా తెలుసుకుందాం.

### 13.3.1 సందేశాత్మక సంపాదకీయాలు

ఇవి సందేశ ప్రధానమైనవి . సమస్య ఏదైనా కావచ్చు. సంపాదకుడు ప్రజలకు (పాఠకులకు) ఏదైనా స్పష్టమైన సందేశం ఇవ్వాలని గట్టిగా భావించినప్పుడు సందేశాత్మక సంపాదకీయం రాయాలి. ఈ రకమైన సంపాదకీయం రాయడానికి

ముందే తాను ఇవ్వదలచిన సలహాను లేదా సందేశాన్ని సంపాదకుడు లేదా సంపాదక రచయిత బాగా ఆలోచించి నిర్ణయంచుకోవాలి. ఒకానొక రాజకీయ సంక్షోభంలో ప్రజలు ఏ విధంగా ప్రవర్తించాలో,సామాజిక పరివర్తనలో ఏ రకమైన పాత్ర పోషించాలో, ఆర్థిక సంస్కరణలలో ఎలా స్పందించాలో సందేశం ఇవ్వవలసిన బాధ్యత పత్రికలపై ఉన్నది. ఆ రోజు కానీ, అంతకు క్రితం రోజు కానీ జరిగిన ఘటనలు ఆధారంగా ఇటువంటి సంపాదకీయాలు రాయవచ్చు. లేదా సమాజంలో కనిపించే ధోరణులపై సందేశాత్మకంగా వ్యాఖ్యానించవచ్చు.

### 13.3.2 మానవీయ సంపాదకీయాలు

నిత్యజీవితంలో సంభవించే ఏదో ఒక చిన్న ఘటనను పురస్కరించుకొని పాఠకులకు ఆసక్తి కలిగించే విధంగా రాసే సంపాదకీయాలు అన్ని దిన పత్రికలలోనూ తరచు కనిపిస్తాయి. పెద్ద పత్రికలలో మూడో సంపాదకీయం హాస్యజనితంగా హృద్యంగా, తేలికగా, హాయిగా సాగేది ఈ కోవకు చెందినదే. భాష, దుస్తులు, అలవాట్లు, భార్యాభర్తలు మధ్య సంబంధాలు, తండ్రీ కొడుకుల మధ్య వివాదాలు- ఒక్కటేమిటి, మహాకవి శ్రీశ్రీ అన్నట్టు కుక్కపిల్ల, సబ్బుబిళ్ళకూడా ఈ రకం సంపాదకీయాలకు వస్తువు కావచ్చు.

పత్రిక మొదటి పేజీలో ప్రముఖంగా కనిపించే వార్తలతో ఈ సంపాదకీయాలకు ప్రమేయం ఉండదు. పత్రికలలో 'బాక్స్' కట్టి ఆకర్షణీయంగా ప్రచురించే వార్తలు ఈ సంపాదకీయాలకు ప్రేరణ. వినోదం కలిగించేవి, చక్కిలిగిలి పెట్టేవి, చిర్నవ్వు పుట్టించేవి, అసాధారణ ధోరణులకు అద్దంపట్టేవి, మానవ స్వభావాన్ని తెలియజేసే వార్తలు ముడిసరకుగా పనికొస్తాయి. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో నార్ల సంపాదకులుగా ఉండగా సహాయ సంపాదకుడు నండూరి రామమోహన రావు ఈ రకం సంపాదకీయాలను రెండో సంపాదకీయాలుగా రాసేవారు.

### 13.3.3 వివరణాత్మక సంపాదకీయాలు

ఏదైనా సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి దాని రెండు పార్శ్వాలను పాఠకులకు వివరించేవి వివరణాత్మక సంపాదకీయాలు. వీటినే బ్యాక్‌గ్రౌండ్ (పూర్వరంగ) ఎడిటోరియల్స్ అనికూడా అంటారు. విషయ పరిశోధన చేసే సావకాశం సాధారణ పాఠకులకు ఉండదు కనుక సంపాదక రచయిత పరిశోధన చేసి ఫలితాలను సంపాదకీయంలో తెలియజేస్తాడు.సమస్యపై తన అభిప్రాయం ఏమిటో చెప్పకుండా అన్ని కోణాలనుంచీ సమాచారం అందించి నిర్ణయం పాఠకులకే వదిలేయడం ఈ రకం సంపాదకీయాల ప్రత్యేకత.

ఉదాహరణకు మహారాష్ట్రలో డాబోల్ దగ్గర ఎన్‌రాన్ అనే బహుళజాతి సంస్థ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించేందుకు కుదుర్చుకున్న బేరం. ఈ బేరం కాంగ్రెస్(ఐ) ముఖ్యమంత్రి శరద్‌పవార్ హయాంలో కుదిరింది. పని ప్రారంభించారు. తీరా 1995 ప్రారంభంలో జరిగిన ఎన్నికలలో బి.జె.పి. శివసేనకూటమి గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే డబోల్ ప్రాజెక్టు బేరాన్ని రద్దు చేసింది. ఈ చర్యను గట్టిగా సమర్థించిన పత్రికలున్నాయి. అంతే గట్టిగా వ్యతిరేకించిన పత్రికలూ ఉన్నాయి. ఈ సమస్యను లోతుగా పరిశీలించి ఎన్‌రాన్ బేరంలోని మంచిచెడులను నిష్పక్షపాతంగా, సాధికారికంగా బేరీజు వేస్తూ సంపాదకీయం రాస్తే రద్దు నిర్ణయం మంచిదో, కాదో పాఠకులే నిర్ణయించుకుంటారు. ప్రతి సమస్యపైనా సంపాదకుడు నిశ్చయంగా ఒక అభిప్రాయం ప్రకటించాలి. కానీ ఏ కారణం వల్లనైనా నిర్ణయాన్ని పాఠకులకే వదలివేయాలని భావించినప్పుడు ఈ ప్రక్రియలను వినియోగించాలి.

### 13.3.4 వార్తాధార సంపాదకీయాలు

వార్త మొదటి పేజీలో ప్రముఖంగా ఉంటుంది. కనుక వివరాలు సంపాదకీయంలో రాయవలసిన అవసరం లేదు. వార్త ఆధారంగా విషయాన్ని విశ్లేషించి, రెండు వైపులా వాదనలను ప్రస్తావించి సంపాదకుడు తన అభిప్రాయాన్ని వెల్లడించాలి.

BRAOU

తన నిర్ణయానికి దోహదం చేసిన అంశాలను సమకూర్చి వాదన నడిపించాలి. ముందుగా వార్త పాఠకులలో ఆసక్తి కలిగించింది. కాబట్టి ఆ ఘటన లేదా పరిణామంపై విశ్లేషణాత్మక వ్యాఖ్య ఏమిటో తెలుసుకోలన్న కోర్కె కలుగుతుంది.

### 13.3.5 పరిష్కారాత్మక సంపాదకీయాలు

సమస్యలను ప్రస్తావించి పరిష్కారం సూచించే సంపాదకీయాలు ఈ కోవకి చెందినవి. సమస్యలంటే పాఠకుల వ్యక్తిగత సమస్యలే కానక్కరలేదు. తక్షణ సమస్యలు కూడా కాకపోవచ్చు. సమీప భవిష్యత్తులో పరిష్కారం కాని దీర్ఘకాలిక సమస్యలుకావచ్చు. ఉదాహరణకు పేదరికం, అవిద్య, అనారోగ్యం. ఈ సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించడం సాధ్యంకాక పోయినప్పటికీ ఎప్పటికప్పుడు, సంధర్భం వచ్చిన ప్రతిసారీ సంపాదకుడు పరిష్కార మార్గాలను సూచించాలి. సమస్యల నిర్మూలనకై జరుగుతున్న కృషిని విమర్శత్మకంగా సమీక్షించాలి.

## 13.4 సంపాదకీయం - నిర్మాణం

వార్తకు, వ్యాసానికి ఉన్నట్టే సంపాదకీయానికి కూడా ఉత్కంఠత రేకెత్తించే ఎత్తుగడ అవసరం. వివరణ, ముగింపు ఉండాలి.

### 13.4.1 ఎత్తుగడ

ఇది సంపాదకీయం ధోరణిని, విషయాన్ని సూచిస్తుంది. విషయాన్ని బట్టి ప్రస్తావన హాస్యస్ఫోరకంగా ఉండాలో లేక గంభీరంగా ఉండాలో నిర్ణయించుకోవాలి. సాధారణంగా ఒక సామెతతోనో, సూక్తితోనో. ఒక బిగువైన వాక్యంతోనో ప్రస్తావన ప్రారంభం అవుతుంది. ఒక ప్రశ్నతో ఆరంభమైన సంపాదకీయం చివరలో ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే విధంగా ఉండాలి. ఏదైనా మంచి కొటేషన్‌తో కూడా ప్రస్తావన రాయవచ్చు. ఉదాహరణకు ది ఎకనామిక్ టైమ్స్ 1995 సెప్టెంబర్ 28వ సంచికలో మూడొ సంపాదకీయం (And it grows). ఈ సంపాదకీయం ప్రస్తావన చూడండి: The continuing expansion of Mr. Narasimaha Rao's ministry brings to mind a conversation from Alice in wonderland. "You've no right to grow here" said the Dormouse. "Don't talk nonsense" said Alice more boldly. "You know you are growing too". "yes, but I grow at a reasonable rate" said the Dormouse. "Not in that ridiculous fashion". Mr. Rao's ministry has grown in a ridiculous fashion to 70 odd colleagues to assist him in controlling this wonderland as well as Ms Sonia Gandhi's shadow cabinet.

### 13.4.2 వివరణ

ప్రస్తావన తర్వాత విషయంలోకి వెళ్ళాలి. సమస్యను ప్రస్తావించి పరిష్కార మార్గాలు సూచించవచ్చు. ప్రభుత్వం లేదా న్యాయస్థానం లేదా చట్టసభలుచేసిన నిర్ణయం ఎందుకు మంచిదో ఎందుకు కాదో వాదించవచ్చు. వాదనకు బలం ఇచ్చే అంశాలను వరుసగా పేర్కొనవచ్చు. ఈ వాదన క్రమంలో అనుకూలమైన అంశాలనుమాత్రమే ప్రస్తావించి ప్రతికూలాంశాలను వదిలివేయరాదు. ప్రతికూలాంశాలనూ కూడా పేర్కొని అవి ఎందుకు పసలేనివో నిరూపించాలి. వాస్తవాల ఆధారంగానే వాదన సాగాలి.

విషయాన్ని బట్టి వివరణకు ఏ పద్ధతి, ఏ రకమైన భాష, ఏ శైలి, ఏ స్వరం వినియోగించాలో నిర్ణయించుకోవాలి.

BRAOU

### 13.4.3 ముగింపు

ఇది సంపాదకీయం చివరి పేరా. సుదర్ఘీంగా, భారంగా ఉండకూడదు. ఎత్తుగడ మాదిరే ముగింపు కూడా ఏదైనా సామెత, కొటేషన్ లేదా నీతి రూపంలో రాయవచ్చు. చెప్పదలచిన విషయం అంతా విషయవివరణ విభాగంలో చెప్పి చివర మాటగా ముక్తాయింపుగా ముగింపు ఉండాలి. దీన్ని ఇంగ్లీషులో క్రాకర్ లేదా కంక్లూజన్ అంటారు. ఎత్తుగడ లాగానే ఇది కూడా భావస్ఫోరకంగా అందంగా బాణంలాగా సూటిగా ఉండాలి.

ఉదాదహరణ: 'ఈనాడు' 1995 సెప్టెంబర్ 29 సంచికలో సంపాదకీయం - 'ఔదార్యం దుర్వినియోగం కాకూడదు' - ముగింపు చూద్దాం:

"వ్యాపారస్తులు వినియోగదారులకోసం 'త్యాగాలు' చేయనవసరం లేదు. అబగా లాభాలు కబళించాలన్న ఆకలిని కొంత అదుపులో పెట్టుకుంటే చాలు! కంటి తుడుపుగా వారిప్పుడు తగ్గిస్తున్నట్టుగా ప్రకటిస్తున్న ధరలు ప్రజలకు ఊరట కలిగించడం లేదు. ఈ మాత్రం తగ్గుదల అయినా పండుగసీజను దాకానే పరిమితమైన దరిమిలా ధరలు యథాప్రకారం పరుగుపందేనికి సరదా పడితే ముఖ్యమంత్రి కసరత్తు యావత్తూ మూన్నాళ్ళ ముచ్చటగా ముగుస్తుంది. అందుకే కీడెంచి మేలెంచాలన్న సూక్తినుంచి స్ఫూర్తి పొందడం తప్పనిసరి". ఈ ముగింపు అత్యుత్తమమైనదని కాదు. సూక్తులతోఎలా రాయవచ్చో. చూపడానికే ఇక్కడి ఉటంకించవలసి వచ్చింది. ప్రాసకోసం యాతన, అపహాస్యంగా కనిపిస్తున్న అధిక్షేపణ లేకుండా చెప్పదలచిన విషయం సూటిగా చెప్పగలిగితే ఈ ముగింపు ఇంకా బాగుండేది.

**అభ్యాసం -2 : ఎత్తుగడ ప్రాధన్యత వివరించండి.**

........................................................................................................................................

........................................................................................................................................

........................................................................................................................................

........................................................................................................................................

........................................................................................................................................

## 13.5 సంపాదకీయం - శైలి, భాష

ప్రతి దిన పత్రికా సంపాదకీయాలు ప్రచురిస్తుంది. ప్రతి సంపాదకుడు సంపాదకీయాలు రాస్తాడు. కానీ కొన్ని సంపాదకీయాలే పాఠకుల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తాయి. వాటి గురించి కొన్ని సంవత్సరాల దశాబ్దాల తర్వాత కూడా చెప్పుకుంటారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురించిన ముట్నూరి కృష్ణారావు వ్యాసాలు అనే పుస్తకంలో పరిష్కర్త డాక్టర్ రావూరు వెంకటసత్యనారాయణ 'పత్రికా సంపాదకత్వంలో ప్రతిభా గరీయసీ' అన్న శీర్షికతో ముందుమాట రాశారు. "కలాన్ని కత్తిగా మార్చుకొని రచనలుసాగించారు. కొన్ని సంపాదకీయాలను రక్త చిత్రాలుగా పోల్చారు పాఠకులు. కొన్నిటిని శంఖారావాలన్నారు. మరి కొన్నిటిని రసతరంగిణులన్నారు. కొన్నిటిని సాహిత్య సందేశాలన్నారు. కొన్నిటిని అపూర్వ విమర్శ పత్రాలన్నారు. కొన్నిటిని అత్యుత్తమమైన రాజకీయ రసాలంకారాలన్నారు. మరికొన్నిటిని వసంతారామ పులకిత పరభృత గానాలన్నారు. కొన్నిటిని తేనెవాకలనీ, కొన్నిటిని మినులేక గలగలలనీ వర్ణించారు. వేయికత్తుల కన్న ఒకకలం మిన్న అన్న ఆర్యోక్తికి ఆనవాలుగా నిలువగలిగారు". అంటూ ముట్నూరి కృష్ణారావుగారి సంపాదకీయాలను ప్రశంసించారు. అటువంటి సంపాదకులకు కొన్ని

నియమాలు, ప్రమాణాలు ఉంటాయి. వీటిలో చాలా వరకు స్వయంగా నిర్దేశించుకున్నవి. సంపాదకుడు ఫలానా విధంగా వ్యవహరించాలని కానీ ఫలానా పద్ధతిలో సంపాదకీయాలు రాయాలని కానీ ఎవ్వరూ చెప్పరు. ఎవరికి వారు తమ భాషను, శైలిని, స్వరాన్ని ఎన్నుకోవలసిందే.

బ్రిటిష్ సంపాదకుడు బాంర్జ్ 'లండన్ టైమ్స్' ఎడిటర్‌పదవిని స్వీకరించిన వెంటనే నాలుగు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నాడు: 1. పత్రికల కర్తవ్యం ప్రభుత్వ భజన కాదు, 2. ప్రజాభిప్రాయాన్ని పత్రికలు వ్యక్తం చేయాలి 3. అవసరమైతే సంపాదకీయాలలో తీవ్ర పదజాలాన్ని వాడటానికి సంకోచించరాదు 4. పరిస్థితులు మారినప్పుడు అతఃపూర్వం తాను వెల్లడించిన అభిప్రాయాలకు విరుద్ధమైన వాటిని సంపాదకుడు వెల్లడించవచ్చు. ఇది చంచల చిత్తం కాదు. అవకాశవాదంకాదు. ఏ నాటి పరిస్థితిని ఆనాడు చిత్తశుద్ధితో సంపాదకుడు పరిశీలించాలి. నిలకడలేనివాడన్న నిందకు భయపడకుండా న్యాయమైనదిగా తాను నమ్ముతున్న దాన్ని నిర్భీకంగా రాయాలి (మూడు దశబ్దాలు).

బాంర్జ్‌లాగానే మరో ప్రసిద్ధ బ్రిటిష్ సంపాదకుడు స్పెండర్ కూడా తన ధర్మ నిర్వహణకు స్థూలంగా కొన్ని సూత్రాలను పెట్టుకున్నాడు. వాటిలో ముఖ్యమైనవి: 1. భాషా వైదుష్యాన్ని ప్రదర్శించడానికి ప్రయత్నించరాదు. సహజధోరణిలో సులభ శైలిలో స్పష్టతనే సదా లక్షిస్తూ రాయాలి. 2. 'కాని' 'అయినా' 'బహుశా' వగైరాలను అసరా చేసుకొని రాస్తూ పోతే మీరు చెప్పగోరేదాన్ని సూటిగా చెప్పలేరు. నీళ్ళు నమిలే సంపాదకునిరాతలు నీళ్ళు కారుతూనే ఉంటాయి. నిర్జీవంగానే ఉంటాయి. 3. చేదు కషాయాన్ని ఒకేసారి గొంతులో పోయడం కంటె అంత చేదుకాని మందును నాలుగైదు మోతాదులుగా మధ్యమధ్య కొన్ని రోజుల విరామంతో వాడకం చేయడం మంచిది. 4. భావాలకు తీవ్రత ఎంత పెరిగితే, భాషలో తీవ్రత అంత తగ్గాలి. 5. మొక్కుబడి తీర్చుకున్నట్టు కాక ఏమి రాసిన ధర్మాభినివేశంతో రాయాలి.

బాంర్జ్, స్పెండర్‌ల అభిప్రాయాలలో ఒకే ఒక అంశంపై వ్యత్యాసం కనిపిస్తుంది. తీవ్రమైన పదజాలం ఉపయోగించడానికి సంకోచించనక్కరలేదని బాంర్జ్ అంటే కూడదని స్పెండర్ అన్నాడు. ఆధునిక పాత్రికేయులు స్పెండర్‌నే ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఎ.జి. గార్డినర్ అన్నట్టు 'వెలుతురులేని వేడి, గమ్యం లేని గమనం, లక్ష్యం లేని ఉద్విగ్నత' అవాంఛనీయం.

"అప్పుడే వండి, వార్చి, వడ్డించిన అన్నం వంటిది దిన పత్రిక సంపాదకీయం" అన్నారు నార్ల వెంకటేశ్వరరావు ఏ రోజు కారోజు తాజా సమాచారం తాజా ఘటన గురించి అప్పటికప్పుడు సంపాదకీయం రాయాలి. పరిశోధనకు అధ్యయనానికి తీర్చిదిద్దడానికి వ్యవధి ఉండదు. ఎంతో హడావుడిగా పరుగుతూలేస్తూ రాసిన సంపాదకీయం అచ్చులో అక్షరంగా నిలిచిపోతుంది. భావి పరిశోధకులకు అధ్యయనాంశం అవుతుంది. అందువల్ల సంపాదకీయం ఏవిధంగా ఉండాలో సంపాదకుడి వ్యక్తిత్వం కూడా అదే విధంగా ఉండాలి. నిద్రలోనైనా, పరుగులోనైనా కొన్ని ప్రమాణాలను నియమాలను పాటించే స్వభావం సంపాదకుడిలో నాటుకోవాలి. ఒకసారి అచ్చువేసి జనం మీదికి వదిలిన తర్వాత ఉపసంహరించుకోవడం అసాధ్యం. ఎన్ని సవరణలు వేసినా క్షమాపణలు చెప్పినా సంపాదకీయంలో దొర్లిన పొరపాట్లకు, లోపభూయిష్టమైన విశ్లేషణకు పరిహారం కాదు. అక్షరం బలి కోరుతుందనే హెచ్చరికను సంపాదక రచయితలు క్షణం కూడా విస్మరించకూడదు.

సంపాదకీయం పాఠకులందరికీ అర్థమయ్యే విధంగా వార్తలాగా సరళంగా ఉంటూనే కొంచెం హుందాగా గంభీరంగా సాగిపోవాలి. వ్యావహారిక భాషలోనే రాయాలి. కానీ పదును, బిగువు ఉండాలి. శైలి హిత బోధలాగానో, ప్రవచనం లాగానో ఉండకుండా సమస్యను మిత్రులకు సాధికారికంగా వివరించినట్టు ఉండాలి. నిష్కర్షగా ఉంటూనే సౌమ్యమైన భాషలో చెప్పాలి.

ఈ కింద పొందుపరచిన సలహాలు సంపాదకీయాన్నే కాకుండా, వ్యాసాన్నైనా శక్తిమంతంగా సులభగ్రాహ్యంగా, అందంగా రాయడానికి ఉపకరిస్తాయి:

1. వాక్యాలు సాధ్యమైనంతవరకూ పొట్టిగా ఉండాలి. ఏడు మాటలు వరకూ ఉన్న వాక్యాన్ని పాఠకుడు తేలికగా అర్థం చేసుకోగలడనీ, అంతకు మించి మాటలుంటే ఇబ్బంది పడతాడనీ మానసిక శాస్త్రవేత్తలు నిర్ధారించారు. అన్ని వాక్యాలూ కురచగా రాయడం సాధ్యం కాకపోవచ్చు. సాధ్యమైనంత వరకూ అలా రాయాలి.

BRAOU

2. ఒకే మాట లేదా ఒకే పదబంధం మళ్లీమళ్లీ రాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా నిర్మాణశైలిలో మార్పులు అవసరం లేకపోతే విసుగు కలుగుతుంది. విన్యాసాలు చేయాలి.

3. వాక్యం మొదట్లోనే ఊరు లేదా పట్టణం పేరుకానీ అంకెలుకానీ సమయం (టైమ్) కానీ రాయకూడదు. వాక్యం బలహీనం అవుతుంది.

4. ఒక్కో పేరాగ్రాఫ్‌లో సాధ్యమైనన్ని తక్కువ వాక్యాలు ఉండాలి.

5. పాఠకులకు పరిచయమైన, తేలికగా అర్థమయ్యే భాష వినియోగించాలి. సరళంగా రాయడం అంటే పొడిపొడిగా చప్పచప్పగా రాయడం కాదు. జన సామాన్యం మాట్లాడే భాషలోనే అందంగా రాయడానికి ప్రయత్నించాలి. అరిగిపోయిన సామెతలను సూక్తులను పరిహరించడం మంచిది.

6. ఏమి చెప్పదలచుకున్నామో ముందుగానే స్పష్టంగా నిర్ణయించుకోవాలి. మొక్కుబడిగా రాయవద్దు. పూర్తి విశ్వాసంతో రాయాలి. మనస్ఫూర్తిగా నమ్మిన విషయాలనే సంపాదకీయం ద్వారా పాఠకులకు తెలియజేయాలి.

7. సంపాదకీయం రాయడం పూర్తయిన తర్వాత ఒకసారి ఆసాంతం చదివి సంతృప్తి చెందిన మీదనే అచ్చువేయడానికి అనుమతించాలి.

8. ఏ అంశం వాస్తవికత గురించి అయినా అనుమానం ఉన్నట్లయితే, దాన్ని సంపాదకీయంలో ఉపయోగించకూడదు. లక్ష వాస్తవాలలో ఒకే ఒక అవాస్తవం ఉన్నప్పటికీ మొత్తం రచన విశ్వసనీయత కోల్పోతుంది. వాస్తవాలను ఒకటికి నాలుగు సార్లు ధ్రువీకరించుకోవాలి. Facts are sacred, coment is free అన్న సి.పి.స్కాట్ నియమాన్ని అక్షరాలా పాటించాలి.

BRAOU

**అభ్యాసం -3 : ఏవేని రెండు సంపాదకీయాల శైలిని పరిశీలించండి.**

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

## 13.6 బరువు బాధ్యతలు

సంపాదకీయాలు దేశాలను ఏలుతాయన్న భ్రమలు ఇదివరకు ఉండేవి. ఇప్పుడు లేవు. 'ది ఎకనామిస్ట్' పత్రిక మాజీ సంపాదకుడు డొనాల్డ్ టయర్‌మన్ అన్నట్టు ఏ సంపాదక రచయితా ఒక్క పాఠకుడిలోనైనా పరివర్తన తెచ్చి ఉండరు. సంపాదకీయాలు చదివే శాతం తగ్గుతున్న మాట నిజం. కానీ కొందరు అంటున్నట్టు పాఠకులపై సంపాదకీయాలు ప్రభావం బొత్తిగా లేదనడం నిజంకాదు. ఈ కంప్యూటర్ యుగంలో, ఈ పరుగుల ప్రపంచంలో అన్ని వార్తలనూ అన్ని వివరాలనూ సాకల్యంగా పరిశీలించి సరైనా నిర్ణయాలు తీసుకునే సావకాశం ప్రజలకు లేదు. వారికి మార్గదర్శకత్వం అవసరం. దైనందిన వ్యవహారాలలో మనిషి మునిగితేలుతాడు కనుక తన బాగోగులు చూసేందుకు, తనను శత్రువుల నుంచి రక్షించేందుకు, తనను పాలించేందుకు తానే ఎన్నుకున్న ప్రతినిధులతో కూడిన పాలక వ్యవస్థను రూపొందించుకున్నాడు.

ఈ వ్యవస్థపై నిఘా ఉంచేందుకు, గాడి తప్పినప్పుడు హెచ్చరించేందుకు, ప్రజల తరపున పత్రికలు కాపలా కుక్కలు

(watch dogs) లాగావ్యవహరించాలి. నేటి సంక్లిష్ట సమాజంలో వివిధ రంగాలకు సంబంధించిన సమాచారాన్ని, విశ్లేషణను పాఠకులకు అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లు అందజేయాలి. పత్రిక అభిప్రాయం ఏమిటో తెలిస్తే పాఠకులు తమ అభిప్రాయాలను ఏర్పరచుకోవడం సులభం అవుతంది. ఆ మేరకు ప్రజలపై సంపాదకీయాల ప్రభావం ఉంటుంది. ఈ శక్తి అల్పమైనది కాదు. ఈ బాధ్యత తేలికైనది కాదు. సంపాదకీయాలు ఔన్నత్యాన్ని పునరుద్ధరించాలంటే నార్ల రెండు దశాబ్దాల క్రితం చెప్పిన అక్షరసత్యాన్ని సదా స్మరించుకోవాలి: "సంపాదకునికి లేని గౌరవం అతడి సంపాదకీయాలకు రాదు. విశ్వమానవ దృష్టి, శీల సంపద, ధర్మాభినివేశం లేనివాడు ఏమైనా కావచ్చుకానీ ఉత్తమ శ్రేణి సంపాదకుడు కాలేడు." గౌరవం ఇచ్చేది, పుచ్చుకునేది కూడా. సంపాదకుడికి పత్రిక యాజమాన్యం, ప్రజలు, పాలనా వ్యవస్థ గౌరవం ఇవ్వాలి. మత, కుల, ప్రాంతీయాభిమానాలతో లేదా ద్వేషంతో సంకుచితమైన దృష్టితో కాకుండా విశ్వమానవ దృష్టి కలిగి ఉండాలి. భౌతిక సుఖాలు, సంపదకోసం సిద్ధాంతాలతో రాజీపడే దౌర్బల్యం ఉండకూడదు. ఏది ఏమైతే మనకేమిటి అనే నిర్లిప్తత లేని ధర్మాభినివేశం శీల సంపదా ఉన్న సంపాదకులను సమాజం గౌరవిస్తుంది.

పాత్రికేయులు, న్యాయమూర్తులు కూడా సమాజంలో కనిపించే వికారాలకు అతీతులు కారనీ, అందరూ ఆ తానులోని బట్టలేననీ ఇతర వర్గాలకు లేని ఉన్నత నైతిక విలువలను వీరు పాటించాలని ఆశించడం అసంగతమనీ వాదించడం పలాయనం వాదం. పరిపాలనా యంత్రాంగం, చట్టసభలు వ్యాధిగ్రస్తమైనా తట్టుకోవచ్చు. చివరికి న్యాయవ్యవస్థలో ప్రమాణాలు దిగజారినా సమాజం కొంతకాలం మనగలుగుతుంది. కానీ ఈ మూడు వ్యవస్థలనూ పర్యవేక్షించే పత్రికా వ్యవస్థే పతనమైతే సమాజానికి నిష్కృతి ఉండదు. అందుకే పత్రికా స్వాతంత్ర్యాన్ని, స్వాస్థ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రజాస్వామ్య ప్రియులందరిపైనా ఉన్నది.

## 13.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

- ★ పత్రిక హృదయాన్ని ఆవిష్కరించేదే సంపాదకీయం.
- ★ సంపాదకీయం ప్రజలకు మార్గ నిర్దేశనం చేసేలా సమస్యలపై తక్షణం స్పందించేవాడై వుండాలి.
- ★ సంపాదకుడు నీతి నిజాయితీ, ధర్మాభినివేశం కలిగి సమస్యలపై తక్షణం స్పందించే వాడై వుండాలి.
- ★ సందర్భాన్నిబట్టి సంపాదకీయాలు వుండాలి.
- ★ సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా వుండడం మంచిది.

## 13.8. మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. సంపాదకీయం అంటే ఏమిటి? అవి ఎన్ని రకాలుగా ఉండవచ్చునో వివరించండి.
2. సంపాదకీయాలను వర్గీకరించి విశ్లేషించండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి?

1. సందేశాత్మక సంపాదకీయం
2. మానవీయ సంపాదకీయం

**- కొండుభట్ల రామచంద్రమూర్తి**

BRAOU

# భాగం - 14 : బాలలకోసం రాయడం

## విషయక్రమం


14.0 ఉద్దేశం

14.1 ప్రవేశిక

14.2 బాలల సాహిత్యం

14.3 రచనాంశాలు

14.4 నైతిక, సామాజిక విలువలు

14.5 భాష, రాసే పద్ధతులు

14.6 బొమ్మల పాత్ర

14.7 వివిధ మాధ్యమాలు, రచనారూపాలు

14.8 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

14.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 14.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు

- బాలలకు అనువైన రచనాంశాలు
- బాలలకోసం రాయడంలో ప్రధాన లక్షణాలు, వాడవలసిన భాష, శైలి.
- బాలల రచనల్లో నైతిక, సామాజిక విలువలు గుర్తించగలుగుతారు.

BRAOU

## 14.1 ప్రవేశిక

బాలలకోసం రాయడం ఒక కళ. ఒక ప్రత్యేక సాధన. బాల సాహిత్య సృజన ఒక ప్రత్యేక విభాగం. బాలలకోసం రాయడం, పెద్దలకోసం రాయడం వంటిది కాదు. సున్నితమైన మనస్తత్వం,ఊహాగుణం వంటివి పిల్లల్లో ఎక్కువగా కనిపించే లక్షణాలు. వారి అభిరుచులు వేరు. వారి దృక్పథాలు వేరు. తమకు తాముగా సృష్టించుకునే ఊహాప్రపంచంలోకి జారిపోగల తత్త్వం వారిది. ఈ నేపథ్యంలో బాలలకోసం రాయడం రచనా విశిష్టతను సాధించుకుంది. పశ్చిమ దేశాలతో పోల్చి చూస్తే మనదేశంలో బాలసాహిత్య రచన ఇంకా ఎదగవలసి ఉంది.

బాలలకోసం రాసే సమయంలో కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకోవాలి. బాల్యదశలోని మానసిక ప్రవృత్తికీ, స్థాయికీ అనుగుణంగా రచనాంశాలూ రాసే పద్ధతులూ ఉండటం అవసరం.

సుదీర్ఘమైన మన జానపద సంప్రదాయంలో పిల్లల కథలు కన్పిస్తాయి. బాలల కోసం ఉద్దేశించిన ఈ కథా రూపాలు జానపద మౌఖిక సంప్రదాయంలో పిల్లలకు కథలు చెప్పే తాతయ్యలు,నానమ్మలు అమ్మమ్మలు కథలు వినిపిస్తారు. అక్షరాస్యతలేని బృందాల్లో పిల్లలకు నైతిక విలువల్ని బోధించే ఈ కథారూపాలే అందుబాటులో ఉండేవి. అక్షరాస్యత పెరిగాక ఇటీవలి కాలంలో పత్రికారంగంలో వస్తున్న మార్పుల వల్ల బాలలకోసం వచ్చే లిఖిత రచనలు ఎక్కువయ్యాయి. కేవలం కథలకే పరిమితం కాకుండా వైజ్ఞానిక అంశాలు, చారిత్రక అంశాలు, కార్టూన్లతో కూడిన కథలు, చిన్న చిన్న వ్యాసాలు కూడా ప్రచురితమౌతున్నాయి. పిల్లలకోసం ప్రత్యేకించి ఉండే పత్రికలు కాక దిన, వార పత్రికలు ఒక విధంగా కాలిక (పీరియాడికల్స్) పత్రికలన్నిటిలోనూ బాలలకోసం పేజీలను కేటాయిస్తున్నారు. 'మెదడుకుమేత', 'పజిల్స్', 'పదాలను కూర్చండి', 'మీకు తెలుసా' వంటి శీర్షికలలో విద్యాపరమైన అంశాలను చూస్తున్నాం.

మన నిత్య జీవితంలో ఆంగ్ల భాష ప్రమేయం కన్పిస్తుంది. పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల భాష బోధనకున్న ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా పేర్కొనాలి. ముఖ్యంగా ఇది పట్టణాలలోనూ, నగరాలలోనూ ఎక్కువగా చూస్తుంటాం. పాశ్చాత్య దేశాల బాలసాహిత్యం మన రచయితల రచనలకు ఆధారమవుతున్నది. భారతీయ భాషలన్నిటిలోనూ ఈ ధోరణి కనిపిస్తుంది. ఇదే ధోరణి తెలుగు బాలసాహిత్యంలోనూ ప్రస్ఫుటమౌతోంది. బాలలకు ఈ రకమైన సాహిత్యం పట్ల ఆసక్తీ, ఉత్సుకత ఉన్నా, ఈ రచనల్లో మన దేశ సంస్కృతి, సాహిత్య విలువలు తరచుగా కనిపించవు. అయితే ఇటీవల కొంత మార్పు వస్తోంది.

## 14.2 బాల సాహిత్యం

ఆంగ్ల భాషలో వస్తున్న బాలల ప్రచురణలను గమనిస్తే పత్రికలు ఇస్తున్న ప్రాముఖ్యం అర్థం అవుతుంది. పుస్తక ప్రచురణ రూపంలో వస్తున్న బాలసాహిత్యం గుణాత్మకంగా ఎదగడం జరిగింది. కమ్యూనికేషన్ల రంగంలో వచ్చిన అభివృద్ధి కారణంగా సమాచార ప్రసారం విప్లవాత్మకమైన మార్పులకు లోనైంది. దీని ప్రభావం బాలసాహిత్యం పైన సైతం పడింది. బాలల కోసం రాయడం విషయంలో 1970 ప్రాంతాల దాకా నైతిక సామాజిక విలువల్నే ఎక్కువగా ఎన్నుకున్నారు. ప్రత్యేకించి బాలల కోసం ప్రచురించిన చందమామ వంటి పత్రికలు బాలల కోసం అందించిన కథలు ఈ దిశలోనే ఉన్నాయి. ఎనభైల నాటికి క్రమేపీ ఆంగ్లభాషలో వస్తున్న 'కామిక్‌లు' చిత్రకథల వంటివి పిల్లల్ని ఆకర్షించడం మొదలయింది. ఆంగ్లభాషాధ్యయనానికి వీటిని చదవటం ఒక అలవాటుగా వచ్చింది. పెద్ద ఎత్తున 'కామిక్' తరహా సాహిత్యం బలపడటం జరిగింది. వీరోచితమైన విన్యాసాలలో ఉండే కథనాలు నవ్వుని తెప్పించే ధోరణిలో బొమ్మలలో ప్రచురించడం మొదలయింది. తొంభైలలో ఈ బొమ్మల కథలూ, విద్యా సంబంధమైన రచనలూ రావడం ప్రారంభమైంది. ఇది ఒక మలుపు. ఇది పిల్లల్లో జిజ్ఞాసకు పదును పెట్టడంతోపాటు వారిలో నిగూఢంగా ఉండే పోటీ తత్వాన్ని పెంచగలిగింది. రాను రానూ పుస్తక రూపంలోనే కాకుండా, పత్రికల్లో, ఇతరత్రా కూడా బాలల కోసం రాయడంలో కొత్త ఒరవడి వచ్చింది.

పాశ్చాత్య దేశాలతో మనం పోల్చుకున్నప్పుడు బాలల సాహిత్యం మన దేశంలో ఎదుగుదల తక్కువేనని చెప్పాలి. ఎదుగుదలను నియంత్రించిన కారణాలు ఉన్నాయి అవి ప్రధానంగా మూడు :

★ చాలా మంది తల్లిదండ్రులు పిల్లల పుస్తకాలను పెద్దగా పట్టించుకోరు. ఈ పుస్తకాలను కొనాలనే భావన, ఆసక్తి వారిలో ఉండకపోవడం.

★ గ్రంథాలయాలు పిల్లల కోసం తగిన సంఖ్యలో పుస్తకాలను సేకరించకపోవడం.

★ ప్రచురణ కర్తలు బాలల కోసం ప్రత్యేకంగా పుస్తకాల ప్రచురణను పెద్దగా చేపట్టకపోవడం. లాభ సాటిగా ఉండదనే ఉద్దేశంతో వీటి ప్రచురణకు వెనుకాడటం.

ఈ పరిస్థితి వల్ల మనదేశంలో బాలల కోసం రాయడం పెద్దగా ఊపందుకోలేదు. కొన్ని పత్రికలు పిల్లల కోసం శీర్షికల్ని నిర్వహించడం, కొన్ని ప్రచురణ సంస్థలు 'కామిక్' తరహా ప్రచురణల్నే ఎన్నుకొనడం జరిగింది. బాలసాహిత్యాని కంటూ ఒక ప్రతిపత్తిని ఇవ్వాలన్న అభిప్రాయం బలపడకుండా పోయింది. కాకపోతే చిన్న పిల్లలు చదువుకోవడానికి అనువుగా ఉండే బొమ్మలతో అక్షరాలను, సంఖ్యలను బోధించే పుస్తకాలు మాత్రం పెద్ద ఎత్తున్న వస్తున్నాయి. బాలల విద్యావసరాలనే ఇవి తీర్చగలుగుతున్నాయి. కానీ, వారి మనో వికాసానికి దోహదం చేసే విధంగా 'సాహిత్యాన్ని' వారికి అందివ్వడం లేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే 6-10 సంవత్సరాల లోపు బాలలకు సరిపడే స్థాయిలో రచనలు లేవనే చెప్పాలి. ప్రచురణకయ్యే ఖర్చు మాట అటుంచితే బొమ్మలతో అందంగా రూపొందించగలిగే ప్రయత్నం పెద్దగా జరగలేదు. ప్రస్తుతం ముద్రణారంగంలో సాంకేతికపరంగా విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముద్రణ ఒక కళగా రూపొందుతోంది. ప్రచురణ కర్తల ఆలోచన సరళి, మారింది. సమాచార ప్రసారం కోసం కమ్యూనికేషన్ వ్యవస్థ యావత్తూ పోటీ పడుతోంది. ముద్రణ రూపంలోకి సాహిత్యం రావడం పెరిగింది. బాలల సాహిత్యం విషయంలో అంత పెద్ద మార్పేది కనిపించకపోయినా, అనతి కాలంలోనే బాలల సాహిత్య ప్రచురణలో పెద్ద ఎత్తున మార్పులు వచ్చే సూచనలు ఉన్నాయి. విద్యా వ్యాసంగం పరిశ్రమగా రూపుదిద్దుకుంటున్న తరుణంలో ఇది తప్పనిసరి కూడా. 21వ శతాబ్దంలో బాలల సాహిత్యం ఒక పెద్ద పరిశ్రమగా రూపొందినా అతిశయోక్తి లేదు.

BRAOU

అభ్యాసం - 1: మనదేశంలో బాలసాహిత్యం ఎదుగుదలను నియంత్రించిన ప్రధాన కారణాలు

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

## 14.3 రచనాంశాలు (Themes)

మహాకవి శ్రీశ్రీ అన్నట్టు 'కాదేదీ కవిత కనర్హం'. అలాగే బాలల కోసం రాయడానికి 'అంశం' (Theme) ఇదీ అని పరిమితం చేయడం సాధ్యం కాదు. సామాజిక, సాంస్కృతిక, వైజ్ఞానిక తదితర రంగాలకు సంబంధించిన అంశం ఏదయినా తీసుకోవచ్చు. అయితే బాలల కోసం రాయడం ప్రారంభించినపుడు మనం కొన్ని విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి. పిల్లల మనో ప్రవృత్తి, వారి వయసు దృష్టిలో ఉంచుకోవాలి. చిన్న పిల్లల రచనలు చేసే సమయంలో ఒకసారి మనం ఎవరి కోసం రాస్తున్నాం ? రాసింది వారి మనసులకు పడుతుందా? వారి ఆలోచనా స్థాయికి దిగి చెప్పదల్చుకున్న దాన్ని అర్థమయ్యేలా చెప్పగలమా? రాసే భాష స్థాయి ఏమిటి ? ఏమోతాదులో చెప్పదల్చుకున్న 'అంశాన్ని' ఇవ్వాలి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. పిల్లల్ని వయసును బట్టి వర్గీకరించి ఆలోచించాలి. 2-3, 4-6, 7-10, 10-15 సంవత్సరాల మధ్యన ఉండే పిల్లల్ని ఒక్కో వర్గంగా గుర్తిస్తారు. పిల్లలకు ఆయా వయసుల్లో ఉండే అభిరుచులు, ఆలోచనలు, ఉత్సుకతల్ని బట్టి ఈ వర్గీకరణ చేస్తారు. ఈ వర్గీకరణ ఆధారంగా పిల్లలు ఏ రకమైన రచనలంటే ఇష్టపడతారో క్లుప్తంగా పరిశీలిద్దాం.

★ 2-3 ఏళ్ల వయసులో ఉన్న పిల్లలకు ఎక్కువ బొమ్మలు ఉండాలి. సాధ్యమైనంత తక్కువ రాత ఉండాలి. ఈ వయసులో వారి పరిశీలనాసక్తిని మనం దృష్టిలో ఉంచుకోవాలనేదే ఇక్కడి ఉద్దేశం.

★ 4-6 ఏళ్ల మధ్య వయసులోని పిల్లలకు చిన్న పదాలలో సరళమైన భాషలో రచన చేయాలి. వారికి జీవితంలో తటస్థపడే సంఘటనలు, కథలు ఆధారంగా రచనలుండాలి. జంతువుల కథలన్నా, ఊహలను పెంచే కథలన్నా వారిష్టపడతారు.

★ 7-10 ఏళ్ల మధ్య పిల్లల్లో ఉత్సుకత అధికం. ప్రతీదీ తెలుసుకోవాలనే ఉబలాట పడతారు. కథలు వినాలనీ, చదవాలనీ కోరుకుంటారు. ఎవరన్నా చదివినా విని ఆనందించే అవకాశం ఉంది. వారి పరిసరాల పట్ల మక్కువ చూపుతారు. సాహసం, స్నేహం, ఆకాశం, విశ్వాంతరాళం, యంత్రాల పనితీరు వంటివి వారికి బాగా ఆకట్టుకొంటాయి.

★ 10-15 ఏళ్ల మధ్య పిల్లలకు బాగా చదివే అలవాటు చేసుకుంటారు. చదివిన అంశాన్ని గుర్తుంచుకోగలరు. సాహసం. స్నేహం, చరిత్ర, పరిసరాలు, వీరగాథలు వంటివి వీరిని బాగా ఆకర్షిస్తాయి. వీరిలో ఊహాశక్తి అధికం. చొరవ, చనువు వీరిలో ఉంటాయి. చెప్పదల్చుకున్న అంశాన్ని మనం అప్పుడంతా అప్పుడంతా చెప్పినా అర్థం చేసుకోగలరు. పాశ్చాత్య దేశాలలో నయితే ఈ వయసులో మగపిల్లలకి, ఆడపిల్లలకి ఉండే అభిరుచుల్ని, ఆలోచనల్ని వేరుగా గుర్తిస్తారు. మనదేశంలో ఈ వర్గాలకు ప్రత్యేక రచనలు అంతగా లేవు. వీరి మధ్య ఉండే వైవిధ్యాన్ని గుర్తించి రాయడం కూడా అవసరం.

## 14.4 నైతిక, సామాజిక విలువలు

ఇతర దేశాలతో పోల్చినప్పుడు మన నైతిక, సామాజిక విలువలు వేరు. మనజీవన విధానం, సామాజిక విధానాలు, సంస్కృతి వంటివి మనకంటూ కొన్ని ప్రత్యేకమైన నైతిక, సామాజిక విలువల్ని కల్పించాయి. వాటిగురించి విస్తారంగా ఇక్కడ ప్రస్తావించనవసరం లేదు. అయితే బాలల విషయంలో మనం గమనించే కొన్ని విషయాల్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకుందాం. బాలలకోసం రాయడంలో కొన్ని మౌలిక భావాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

BRAOU

ఈ విషయంలో ముప్ఫయి ఏళ్లకుపైగా చందమామ పత్రికకు సంపాదకత్వం వహించిన కొడవటిగంటి కుటుంబరావు అభిప్రాయాలను గమనిద్దాం:

"బాల సాహిత్యం పిల్లల మెదడులో కొన్ని మౌలికమైన భావాలను బలంగా నాటాలి. ధైర్యసాహసాలూ, నిజాయితీ, స్నేహపాత్రత, త్యాగబుద్ధీ, కార్యదీక్షా, న్యాయమూ మొదలైనవి జయించటంద్వారా సంతృప్తిని కలిగించే కథలు ఎంత అవాస్తవంగా ఉన్నా పిల్లల మనస్సులకు చాలామేలు చేస్తాయి. దురాశా, ఓర్వలేని తనమూ, అధికార గర్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నతా, అధర్మమూ, స్వార్థమూ మొదలైనవి శిక్షించబడటం కూడా పిల్లలకు తృప్తినివ్వాలి.

సద్గుణాలు ఒక్కొక్క సమయంలో దౌర్భాగ్యంగా పరిణమించటమూ, ప్రమాదం తెచ్చిపెట్టటమూ జరుగుతుంది. భూతదయ చాలామంచిది. నిస్సహాయులపట్ల దయచూపటం వరకూ ఇబ్బందిలేదు. కాని దుర్మార్గుల పట్ల చూపే దయ ప్రమాదాలకు దారితీస్తుంది. అందుచేతనే, బోనునుంచి పులిని విడిపించిన బ్రాహ్మడి కథలో ముఖ్యాంశం బ్రాహ్మడి జాలికాదు. అది తెచ్చిపెట్టిన ప్రమాదమే. ఆ ప్రమాదాన్ని నక్క యుక్తిగా తప్పిస్తుంది. యుక్తి కథలకు బాల సాహిత్యంలో స్థానం ఉంది.

స్థూలంగా చెప్పాలంటే, పిల్లలలో దౌర్బల్యాన్ని పెంపొందించేది మంచి బాలసాహిత్యం కాదు. మహాసత్వుల కథలు ఉత్తమ బాలసాహిత్యం, ఒక లక్ష్యం పెట్టుకున్నాక మహా సత్వుడైనవాడు ఎన్ని ప్రమాదాలనూ లక్ష్యపెట్టడు. అటువంటి పాత్రలుగల కథలు ఎంత హెచ్చుగా చదివితే పిల్లలకు కారెక్టర్ అంత బాగా ఏర్పడుతుంది. మనదేశాలలాంటి పేద దేశాలలో పిల్లలకు డబ్బుమీద దృష్టి ఏర్పడటంకన్న "కారెక్టర్" ఏర్పడటం చాలా అవసరం.

రాక్షసులను మనుషులు జయించటమూ, ధనికులను వాళ్ళ సేవకులు భంగ పరచటమూ, అతి సామాన్యమైన వ్యక్తులలో అసాధారణ శక్తులుండటమూ లేదా వారికవి లభ్యం కావటమూ - ఇలాటి ఇతి వృత్తాలు గల జానపద కథలు ప్రపంచ మంతటా ఉన్నాయి. వాస్తవ సంప్రదాయాలకు ఎదురు వెళ్లే ఈ కథలు చదవటం వల్ల కూడా పిల్లలకు కొంత లాభం ఉన్నది. ముఖ్యంగా, చిన్న పిల్లలకు దొంగల భయమూ, దయ్యాల భయమూ లాటివి అతి తేలికగా అబ్బుతాయి. ఆ భయాలను తగ్గించే దొంగల కథలూ, దయ్యాల కథలూ పిల్లలు చదివి ఉండటం మంచిది.

దేవుడి మీద భక్తినీ, మత విశ్వాసాలనూ ప్రచారం చెయ్యటానికే రచించిన కథలు పిల్లలకు చెప్పటం అంత మంచిది కాదు. కథల్లో దేవతలూ, భక్తులూ ఉండరాదని కాదు. దేవుణ్ణి నమ్ముకుంటే అన్ని సుఖాలూ ఒనగూడతాయన్న అభిప్రాయాన్ని పెద్దలు కలిగి ఉండటం ఎంత తప్పో, పిల్లలకు చెప్పటం అంతకు పదింతలు తప్పు. కథలో నెగ్గవలసినది మనష్య యత్నమూ, మనిషి సద్బుద్ధీనూ. ఇది చాలా ముఖ్యం."

కాలానుగుణంగా మార్పులు వస్తున్నాయని గుర్తించడం, దేశ అవసరాల్ని గుర్తించడం మానవ జాతి ఔన్నత్యాన్ని మనస్సు పట్టించుకోనేలా చేయడం వంటివి నైతిక సామాజిక విలువల్లో ముఖ్యమైనవి. జాతీయ సమైక్యత, శాస్త్రీయ దృక్పథం వంటివి ప్రస్తుత తరాలలో కొత్తగా రూపుదిద్దుకున్న విలువల్లోకి చేరతాయి. కథలు, గేయాలు, వ్యాసాలు, నాటికలు, కార్టూన్ వ్యాఖ్యానాలు ఇవన్నీ సృజనాత్మక రచనలే. కనుక స్థూలంగా ఇలా ఉండాలని చెప్పడం తప్పించి ఏ విధమైన అడ్డంకులు విధించడంగాని, ఫలానా విధంగా ఉండాలనిగాని నిర్దేశించడం గాని కుదరదు.

అభ్యాసం - 2 : 1. బాలలకోసం రాయడంలో ఎన్నుకునే అంశాల(**Themes**) ను ప్రస్తావించండి.

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

BRAOU

## 14.5 రచనా పద్ధతులు

బాలలకోసం రాయడం. ఆ సాహిత్యాన్ని ఒక ప్రత్యేక భాగంగా గుర్తించడం. ప్రతిభాషలోనూ మనం గమనించవచ్చు. బాలలకోసం తెలుగు భాషలో వస్తున్న రచనల్ని చూస్తే ఈ విషయం స్పష్టపడుతుంది. బాలలకోసం రాయడం ప్రారంభించనప్పుడు మనం కొన్ని ఇబ్బందులు ఎదుర్కొవడం సహజం. ముఖ్యంగా భాషవిషయంలో ఇబ్బంది ఎదురౌతుంది. క్లిష్టమైన 'అంశాన్ని' చెప్పవలసి వచ్చినప్పుడు ఈ ఇబ్బంది మరీ అధికంగా ఉంటుంది. పిల్లలకు క్లిష్టమైన విషయాన్ని అర్థమయ్యే భాషలో ఎలా చెప్పాలి? అనేదే ప్రశ్న. పిల్లలకు చెప్పేటప్పుడు భాషాడంబరంతో పనిలేదు. మాట్లాడే భాషనే రాయాలి. భాష సరళంగా ఉండాలి. చిన్న పదాలు వాడాలి. వాక్యాల నిడివి చిన్నదే ఉండాలి. పదాడంబరంలో ఉండే వాక్యాలంటే పిల్లలకు గిట్టదు. సంభాషణ సహజంగా ఉండాలి. పిల్లల ఊహలకు చేయూతనివ్వాలి కానీ వాటిని నియంత్రించకూడదు. కొడవటిగంటి కుటుంబరావు బాలసాహిత్య రచనా విధానాన్ని గురించి చెప్పిన మాటలు ఈ సందర్భంగా అలోచించదగినవి.

"బాలసాహిత్యం రాసేటప్పుడు కథనం పెద్దవాళ్ళు పిల్లలతో మాట్లాడుతున్నట్టుండాలనుకోవటం నా బుద్ధికి చాదస్తంగా కనిపిస్తుంది. "అప్పుడేమయిందనుకున్నారూ?" "రాజుకో కూతురుందనుకున్నాంకాదూ?... చూశారా, వాడి దుర్మార్గం వాళ్ల ఏ స్థితికి తెచ్చిందోనూ?" ఇలా అడుగడుగునా బాల పాఠకులను తట్టుతూ ఉండడం అనవసరం అనుకుంటాను.

రచనలో వ్యర్థ పదాలూ, ప్రకృతి వర్ణనలూ, సౌందర్య వర్ణనలూ పిల్లలను అంతగా ఆకట్టవు. "కీకారణ్యం", "కటిక చీకటి", "పండు వెన్నెల", "పెద్ద కెరటాలతో ఉప్పెన" ఇలాటి మాటలతో వాళ్ళు ఎంతైనా ఊహించుకోగలరు....."

'పిల్లల కోసం రాయటం ఒక గొప్పకళ. తెలుగులో ఆ కళను చెప్పుకోదగినంతగా వృద్ధిచేసిన వారెవరూ ఉన్నట్టు కనపడదు. కొందరు పాత్రోచిత భాష ప్రవేశ పెట్టాలని హీన పాత్రలచేత యాసగా మాట్లాడించటంలాంటి ప్రయోగాలు చేస్తారు. నా దృష్టిలో ఇది గూడా ఈనాటికి పొరపాటే. కథల్లో సంభాషణలు ఉండక తప్పదు. కాని వాటిలో అంత వాస్తవికత నిరుపయోగం.'

కథైనా, వ్యాసమైనా, మరోరచన అయినా తలాతోక లేనిదిగా ఉండకూడదు. మనం ఎంత బాగా చెప్పినా ఒక 'నిర్మితి' అంటూలేనిదే చెప్పిన విషయం అర్థంకాదు. బాలలకోసం రాసే రచనల్లోరచన ఏదయినా ప్రారంభం, విషయం, ముగింపు తప్పనిసరి. చెప్పే అంశం అసలు వ్యూహానికి విరుద్ధంగా కనిపించకూడదు. కేంద్రవ్యూహం చుట్టూ సృజనాత్మకంగా రచనను అల్లగలగాలి. అప్పుడే పిల్లలకు మనం చెప్పే విషయం బాగా అర్థమవుతుంది.

BRAOU

## 14.6 బొమ్మలు

పిల్లలకోసం రాసే రచనల్లో విధిగా బొమ్మలుండాలి. బొమ్మలులేని రచన ఏదయినా నిష్ఫలమే. ఈ నియమం ఇంచుమించు అన్ని స్థాయిల పిల్లల రచనలకు వర్తిస్తుంది. పిల్లల్లో పరిశీలనా శక్తి అభివృద్ధికి బొమ్మలు దోహదం చేస్తాయి. అదీకాక చిన్నవయసు పిల్లలు చదివి అర్థం చేసుకోవడం కంటే చూసి అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు.

బొమ్మలో ఉండే రూపాన్ని బట్టి మనం చెప్పదలుచుకున్న దాన్ని అర్థంచేసుకొని తమ ఊహలోనించి తిరిగి దాన్ని నిర్మించుకునే ప్రయత్నం చేస్తారు. వారి మనోఫలకం మీద చెరగని ముద్ర వేస్తుంది. 2-3 ఏళ్ల పిల్లల విషయంలో రంగు రంగుల బొమ్మలే రచనలో ఉండాలి. అక్షరాల్ని, సంఖ్యల్ని వారికి బొమ్మలతోనే పరిచయం చేయాలి.

రంగుల బొమ్మలతో 6-8 ఏళ్ల పిల్లలకు రచనలు చేయాలి. ఈ దశలో బొమ్మలు మరీ విపరీతంగా ఆకర్షించగూడదు. బొమ్మలకి, రాసే భాషకి మధ్య సమతూకం పాటించాలి. మనం చెప్పదల్చుకున్న దాన్ని రేఖామాత్రంగా చిత్రీకరించి చూపించడం వల్ల బాలలకోసం చేసే రచన అర్థవంతమౌతుంది.

ఆ తర్వాత వయసు పెరిగే కొద్దీ పిల్లలు చదివి తెల్సుకోవాలనే ఉత్సుకత పెరుగుతుంది. కనుక ఈ దశలో బొమ్మలు మోతాదు తగ్గించాలి. అంటే బాలలకోసం రాయడంలో ఒక క్రమమైన ధోరణి కనిపిస్తుంది. చిన్న వయసులో బొమ్మల పట్ల ఉన్న

ఆకర్షణ వారి ఊహాపరిధి, వయసు పెరుగుతున్న కొద్దీ మారుతాయి. కాబట్టి రచన చేసేటప్పుడు బాల మనో చైతన్యాన్ని దృష్టిలో ఉంచుకోవాలి.

## 14.7 వివిధ మాధ్యమాలు, రచనా రూపాలు

బాలలకోసం రాయడం కేవలం పుస్తకాలకే పరిమితం కాదు. రేడియో, టీవి, సినిమా, కంప్యూటర్ వంటి ఆధునిక ప్రసారసాధనాల కోసం రాయవలసిన అవసరం ఏర్పడింది. దశాబ్దకాలంలో ముఖ్యంగా గడచిన రెండు మూడు సంవత్సరాలుగా ప్రసార మాధ్యమాల కోసం రాయడం అధికమైంది. బాలలకోసం రాసే అవకాశాలు బాగా పెరిగాయి. పత్రికా రచనలో బాలలకోసం రాయడం, వివిధ మాధ్యమాల కోసం రాయడం అనే ప్రక్రియలు విడిగా వేటికవి పెరిగి పెద్దవవుతున్నాయి. పత్రికా రచనలో వచ్చిన రచనాంశాలనూ, రచనలనూ వివిధ మాధ్యమాలలో ప్రసారానికి అనువుగా రూపొందిస్తున్నారు. కొత్త కొత్త రచనా రూపాలు వెలుగులోకి వస్తున్నాయి. ఒకటి రెండు ప్రక్రియలు, అంతకంటే ఎక్కువ రచనా ప్రక్రియలు కలిసి మరో రచనారూపంగా రూపుదిద్దుకొంటున్నాయి. కొత్తరూపాలు, కొత్త మాధ్యమాలు బాలలకోసం రాసే అవకాశాల్ని ఒకవైపు పెంచుతూనే మరోవైపు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. కాబట్టి భాషను, రచనా నిర్మితిని, పరిధులు దాటకుండా చూస్తూ, సృజనాత్మక రూపాంతరీకరణకు ప్రయత్నించాలి. రాబోయే శతాబ్దంలో అడుగిడే సమయంలో కొత్త ధోరణుల్ని మనం చూడగలిగే అవకాశాలు మెండు.

**అభ్యాసం - 3 : బాలలకోసం రాయడంలో కనిపించే వివిధ మాధ్యమాలు, రచనారూపాలు.**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

BRAOU

## 14.8 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

'బాలలకోసం రాయడం' అనే విషయాన్ని వివిధ కోణాలనుంచి పరిశీలించాలి. రచనాంశాలు ఎలా ఉండాలి? రచనల్లో నైతిక సామాజిక విలువలెలా ఉండాలి? రచనాపద్ధతులు, ఏ రకంగా వుండాలి? బొమ్మలు నిర్వహించే పాత్ర ఏమిటి? వీటిని క్లుప్తంగా చర్చించుకున్నాం. ఈ భాగంలో స్థూలంగా మనం గుర్తుంచుకోవల్సిన అంశాలు:

★ పిల్లల వయసు బట్టి రచనాంశాలను ఎన్నుకోవాలి.

★ పిల్లలకు అర్థమయే భాషలో, చెప్పడమే కాకుండా కథా కథనం కూడా సరళంగా సూటిగా ఉండాలి.

★ పిల్లలకోసంరాసే రచనలు పిల్లలోని ఊహని, ఉత్సుకతని మేల్కొలిపేలా చేయాలి.

★ మనుష్య ప్రయత్నంమీద విశ్వాసం, సద్బుద్ధి మొదలైన వాటితోపాటు సమకాలీన సమాజానికి సంబంధించిన దేశసమైక్యత, సమగ్రత వంటి విలువల్ని బోధించాలి.

★ రచనల్లో బొమ్మలు రచనలో ఒక పద్ధతి ప్రకారం వయసుని బట్టి వాడాలి.

మంచి దుస్తులలో అందంగా ఉండే మహిళల గురించే రాస్తారు. తల్లిలోని మంచితనాన్నే చెప్తారు. వారు కష్టపడే అంశాల గురించి ప్రస్తావించరు. సమాజానికి, మానవ జీవితానికి కేంద్రబిందువైన మహిళ కష్టపడి పనిచేసే అంశాల్ని పెద్దగా పట్టించుకోరు. జీవితంలో ప్రతీ విషయంలో మహిళ పాత్ర, కృషీ ఉన్నాయని ఎందుకు గుర్తించరు అనేది ఒక ప్రశ్న. వారిపట్ల దృక్పథాన్ని ఎందుకు మార్చుకోరు అన్నది మరో ప్రశ్న.

సమాజంలో మహిళలపట్ల దురభిప్రాయంతో వ్యవహరించటం అనాగరికం. మహిళలపైన వచ్చే రచనలు సమాజాన్ని మార్చగలవు. సమాజం కట్టుబాట్లను తిరిగి నిర్వచించనూ గలవు. అందుకే ఈ రచనల్లో ఒక ఆదర్శం, నైతికశక్తి అవసరమౌతాయి.

ఈ నేపథ్యంలో మహిళల కోసం రాయదల్చుకొన్నప్పుడు మార్గదర్శకాలను కొన్నింటిని ప్రస్తావించాలి. మహిళల సమస్య దేన్నయినా రాస్తున్నప్పుడు పరిశోధించవలసిన అవసరం ఉంటుంది. అప్పుడే వారి సమస్యల పరిష్కారానికి సరైన సమాధానం లభిస్తుంది. జాతి నిర్మాణానికి మహిళల తోడ్పాటును సరైన దృక్పథంలో చూడాలి. మహిళల రచనలుచేసే సమయానికి ముందు మహిళల పట్ల ఒక ఆలోచన తోనో, అభిప్రాయంతోనో ప్రారంభించగూడదు.

మహిళల కోసం ప్రత్యేకించి పత్రికలు, శీర్షికలు ఉన్నాయి. వివిధ రంగాలలో మహిళల భావాల్ని సమస్యల్ని, పరిష్కారాల్ని ప్రచురిస్తున్నారు. ప్రపంచం మొత్తం మీద ఈ మార్పుని చూడగలం. ఆంగ్ల భాషా పత్రికల్లో వస్తున్న కొత్త కొత్త శీర్షికలు మహిళలకు సంబంధించి అనేక విషయాల్ని వెలుగులోకి తెస్తున్నాయి. తెలుగులో ఇంచుమించు అన్ని వారపత్రికలు, వార్తా పత్రికలు మహిళల కోసం కొన్ని పేజీలను కేటాయిస్తున్నాయి. 1970 వరకు కథలు, నవలలు ఇతర సాహిత్య ప్రక్రియల్లో మహిళల రచనల పాలే ఎక్కువ. తెలుగు పత్రికల్లో మాలతీచందూర్, రామలక్ష్మీ ఆరుద్రవంటి వారు, మహిళలకోసం ప్రత్యేకమైన శీర్షికల్ని నిర్వహించడం తెల్సిన విషయమే. ఎనభైలలో మహిళలకు సలహాలు సూచనలనుంచి తిరిగి సామాజిక విషయాలపైనా, ఆరోగ్య సమస్యలపైనా రచనలు రావడం ప్రారంభించాయి. మహిళల కోసం వచ్చే రచనలస్థాయి పెరిగింది. ఈ దశకంనుంచే మహిళల సమస్యల పట్ల దృష్టి సారించడం మొదలయింది. జీవితంలో సమాజంలో వివిధ సమాజాలలో మహిళల సమస్యల్ని, అవకాశాల్ని గుర్తించి రచనలు రావడం మొదలయ్యాయి. తొంభైలది తర్వాత మహిళకోసం రచన చేయడం అన్నది ఒక ప్రత్యేకంశంగా రూపుదిద్దుకుంది. మహిళల విషయాల పట్ల అధ్యయనాలు మొదలయ్యాయి. కొత్త కోణంలోనికి మహిళా రచనలు చొచ్చుకొని వెళ్లాయి. మహిళలకోసం రాయడం అనేది ఈ రోజున ఒక స్వతంత్రమైన అధ్యయన విషయంగా రూపం ఏర్పర్చుకుంది.

## 15.2 రచనాంశాలు గుర్తించడం

మహిళలకోసం రాయడం అన్నది ప్రస్తావించినప్పుడు రచనాంశాలను గుర్తించడం అన్న విషయాన్ని క్లుప్తంగా పరిశీలించాలి. మహిళల విషయంలో రచనాంశాలు ఇవీ అని గిరిగీసి చెప్పలేం. మిగతా రచనల్లో లాగే అంశాలు అనేకం.

మానవాళి పనిచేసే గంటల్లో మూడింట రెండువంతులు కష్టపడి పనిచేసేది మహిళలే. గ్రామీణ ప్రాంతాలలో ఆహారోత్పత్తిలో సగం మహిళలలే. నేల దున్నడంతో మొదలయి పంట చేతికొచ్చేదాకా అన్ని సందర్భాల్లోనూ వ్యవసాయంలో వారి ప్రమేయం విడదీయరానిది. అలాగే గ్రామీణ వాతావరణ మిగతా రంగాల్లోనూ మహిళ పాత్ర విడదీయరానిది. పట్టణాలు, నగరాలలో ఇంట్లో పనిదగ్గరనుంచి, ఆఫీసులోపని, బజారుకెళ్లడం వంటి అన్ని సందర్భాలలోనూ మహిళ ప్రమేయం ఉంది. మహిళ చేయని పని ఏదీ అంటే లేదు అనే సమాధానం చెప్పవలసిన స్థితి. ఇన్ని విధాలుగా చేదోడు వాదోడుగాఉంటున్న మహిళ సమస్యల్ని ఆలోచనల్ని, సంతోషాన్ని, విషాదాన్ని ఎవరు రాస్తున్నారు? ఎందరు పట్టించుకొంటున్నారు?

ఒక ఉదాహరణః కొనేళ్లక్రితం ఒకానొక వార్తాపత్రిక ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పనుల మీద క్రమం తప్పకుండా వార్తల్ని వేస్తుండేది. వార్తల్లోనూ నివేదికల్లోనూ మహిళల గురించి పెద్దగా ప్రస్తావించలేదు. కొన్ని సందర్భాలలో మహిళల గురించి ఊసే ఎత్తలేదు. పురుషుడి గురించి, జంతువుల గురించి, పశువుల గురించి, కోళ్లగురించి ఇంచుమించు అన్నింటి గురించి ప్రస్తావన ఉంది. ఒక మహిళా జర్నలిస్టుకు అనుమానం వచ్చి చూస్తే అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళలు పాలు పంచుకొని పనేలేదు. అయితే ఎందుకిలా జరిగిందని ఆరాతీస్తే మహిళలు ఆ విలేకరితో మాట్లాడలేకపోయారు అని తేలింది.



BRAOU

మరి జంతువులు, పశువులు మాట్లాడాయా అన్న ప్రశ్నకు సమాధానం లభించలేదు. ఇదంతా ఎందుకు ప్రస్తావించడమంటే మహిళ పట్ల చిన్న చూపే దీనికి ప్రధాన కారణం.

మహిళలు పనిచేస్తారని అభివృద్ధిలో వారి కృషిఉందని మనం ఎందుకు గుర్తించటంలేదు కేవలం ఆటబొమ్మగానో, సెక్సు యంత్రంగానో, మరో విధంగానో మరో విధంగానో ఆలోచించడం అలవాటయింది. ఇవే రచనాంశాలుగా మారాయి.

మహిళల పట్ల దృక్పథం మారాలి. సరైన దృక్పథం అలవర్చుకోవాలి. అప్పుడు రచనాంశాలకు కొదవే ఉండదు. ఎన్నో ఉన్నాయి. వాటికి హద్దుల్లేవు. నిర్మాణాత్మకమైన,మంచి అంశాలను గుర్తించడం నేర్చుకోవాలి. రచనాంశం ఏదైనా కానివ్వండి మనం రచన చేసే దృక్పథంలోనే సమూలంగా మార్పురావాలి. ఈ మధ్యవచ్చిన కొన్ని రచనాంశాలను గుర్తించుదాం వైవిధ్యం వున్న రచనాంశాలని, వాటి విస్తృతపరిధుల్ని గమనించండి. ఒకసారి పరిశీలించడం చేస్తే మహిళల విషయంలో రచనాంశాలను గుర్తించడం ఎలా అనేది అవగాహనలోకి వస్తుంది.

**అభ్యాసం - 1 : మహిళల కోసం రాయడం రచనాంశాల్ని ఎలా గుర్తించాలి.**

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

## 15.3 మహిళల రచనలు, పరిధి

ఇంచుమించు తెలుగు కాలసరి పత్రికలు, దిన పత్రికలన్నింటిలో మహిళల పైన రచనలు వస్తున్నాయి. రాయాలనుకున్న రచయితకు రచనాంశాల కొదవలేదని తెలుసుకున్నాం.

పత్రికల్లో వస్తున్న రచనలు, ముఖ్యంగా మహిళలపై వస్తున్న వాటిల్లో మహిళల సమస్యల గురించి. జీవితాన్ని గురించి పని చేసే శక్తిని గురించి ఇలా ఎన్నో విధాలై రచనాంశాలమీద వస్తున్నాయి. ఈ విషయాన్ని పాఠ్యభాగంలో ఇచ్చిన రచనాంశాల ఉదాహరణలనుంచి కొంతవరకైనా అర్థంచేసుకోగలం. నవ్వుతూ మాట్లాడే మహిళలు, సరదాగా మాట్లాడేవారు, నొసటముడతతో సంభాషించేవారు, తమలో తామే మాట్లాడుకొన్నట్టు మాట్లాడేవారు ఇలా ఎందరో. అయితే మన దేశంలో మహిళల సమస్యలు, సమాజంలో వారి ప్రమేయాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమౌతుంది. అది గ్రామీణ ప్రాంతాలలో ఉండే మహిళకు,పట్టణాలు నగరాలలో ఉండే మహిళకు ఉండే వ్యత్యాసం. జీవన సరళిలో, సమస్యల్లో, సంతోషాల్లో, చేసే పనుల్లో ఎంతో వైరుధ్యం కన్పిస్తుంది. రచనాంశాల ప్రస్తావనల్లోను వైవిధ్యం చోటు చేసుకుంటుంది. మహిళరచనల పరిధిని ప్రస్తావించినప్పుడు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి. పరిధి విస్తృతమైంది అని అర్థమవుతుందికూడా.

మహిళల రచనల పరిధిని నిర్ణయించే పరిమితి మరొకటి కూడా ఉంది. మహిళల్లో చదవాలనే ఉత్సుకతపెరగటం. అదీ తమగురించి చదుకోవాలనే అభిలాష ఉండటం మహిళలపై రచల పరిధిని పెంచుతుంది. కమ్యూనికేషన్ వ్యవస్థలో వచ్చిన విప్లవాత్మకమైన సాంకేతిక మార్పులు పరిధిని మరింత పెంచాయి. మహిళ తన గురించే కాకుండా తోటి మహిళ గురించి తెలుసుకోంటుంది. వారి జీవన విధానాన్ని నిశితంగా పరిశీలిస్తుంది. వారి బాధల్ని, అనుభవాల్ని లోతుగా అధ్యయనం చేస్తోంది. మారుతున్న సమాజంలో పరిస్థితులను క్షుణ్ణంగా అవగాహన చేసుకోవడం వాటికి స్పందించడం సామాజికంగా ఎన్నో మార్పుల్ని తెచ్చిపెట్టడం గమనిస్తూనే ఉన్నాం. మహిళలకోసం రాయడం కేవలం ఏదో ఒక అంశానికి పరిమితం కాకుండా. మహిళలపై రాసే రచయితకు ఎన్నో అవకాశాల్ని ముందుంచుతోంది. రచయితగా గ్రామీణ మహిళ నమ్మకాలతో, కట్టుబాట్లతో, విలువల్తో గుర్తింపబడగలగాలి అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. గ్రామీణ మహిళ జీవితంలో గుణాత్మకమైన మార్పు వస్తోంది. మారుతున్న వ్యవస్థలో పట్టణ ప్రాంతాల మహిళల ఆకాంక్షలు, మారుతున్న విలువల పట్ల సరిగా స్పందించగలగాలి.

BRAOU

మహిళలపైన రాయడం మహిళలకోసం రాయడం అనేవి కొత్త అర్థాన్ని సంతరించుకున్నాయి. ఒక డిసిప్లిన్‌గా ఇది ఎదగడమే దీని పరిధిని పెంచగలిగింది.

మహిళకోసం రాయడం కేవలం మహిళా సమస్యల్నీ సందర్భాన్నీ మాత్రమే పరిగణించి ఆగిపోకూడదు. రచనాంశాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలతో ముడిపడి ఉంటాయి. అలాగే ఇతర విషయాలు. ముఖ్యంగా దృష్టిలో ఉంచుకోవాల్సిన విషయాలు మహిళల కోసం చేసే రచనలలో తరచూ తారసపడేవి ఉన్నాయి. అవి:

★ మహిళలు - రాజకీయాలు

★ మహిళలు - ప్రసారమధ్యమం

★ మహిళలు - శ్రమ

★ మహిళలు - కుటుంబం

★ వ్యవసాయ అంశంలో మహిళలు

★ మహిళలు, పరిసర వాతావరణం వంటివి.

ఇలా చెప్పుకుంటూ పోతే అంతుండదు. మహిళ పాత్ర సమాజంలో అంత ప్రాముఖ్యమైంది. కాబట్టి ఈ పరిస్థితి తప్పదు. ఉదా: వరకట్నం మహిళ సమస్య అంటారు. కానీ సమస్య అక్కడితో ఆగిపోలేదు. కట్టుబాట్లతోనూ, మతంతోనూ ఇది ముడిపెట్టుకుంటుంది. అలాగే ఆర్థికపరమైన అంశాలు ఇందులో ఉన్నాయి. వరకట్నం అనేది ఎందుకు వచ్చింది? కష్ట, నష్టాలు ఏమిటి? అని ఆలోచిస్తే ఎన్నో విషయాలు మహిళాసమస్యలతో పాటు చర్చించడం అవసరం. ఈ విషయాలన్నీ లోతుగా వెళ్లి అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంటుంది. 'మహిళా అధ్యయనాలు' ((Women studies)) ప్రాముఖ్యం ఇక్కడే ప్రారంభమయింది. అయితే ఈ అధ్యయనాలు సమాజానికి పనికొచ్చే విధంగా జరగాలేగానీ విద్యాసంబంధ అంశం మాత్రం కాదు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో మహిళ అధ్యయన విభాగాలు ప్రారంభించారు. మహిళ అధ్యయనాలకు సంబంధించి కోర్సులనీ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మహిళకోసం రాయడం ఒక ప్రత్యేక విభాగంగా రూపుదిద్దుకునే దశకు చేరుకుంది.

BRAOU

అభ్యాసం - 2 : 1. మహిళలకోసం రాయడం ఒక డిసిప్లెన్‌గా ఎదిగింగా?

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

## 15.4 భాష, రాసే పద్ధతులు

మహిళల కోసం రాయడం ఒక ప్రత్యేకతను సాహిత్యంలో సాధించుకుంది. మహిళల కోసం రాయడం అన్నది ఒక డిసిప్లిన్‌గా ఎదిగింది. మహిళలకోసం రాయాలనుకున్నప్పుడు భాష ఎలా ఉండాలి? ఎలా రాస్తే బాగుంటుంది? సాహిత్యంలో

రాసే భాషకు మహిళలకోసం రాసే భాషకు వ్యత్యాసం ఉందా? అని ఆలోచనలు వస్తాయి. అసలు రాసే విధానం ఎలా ఉండాలి అనే సందేహమూ వస్తుంది. 'లింగవివక్ష' ఉంది కాబట్టి భాషా, రాసే పద్ధతులు కూడా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. మహిళల పట్ల ఎన్నో అపోహలు, అనుమానాలు కట్టుబాట్ల వెనుకనుంచి తొంగి చూస్తూండటం వల్ల భాషకు ఒక ప్రత్యేక స్థానాన్ని ఇవ్వవలసి వస్తుంది. మహిళల కోసం రాసే భాష తేలికైనదిగా ఉండాలి. తేలిగ్గా అర్థంకావాలి. భావాల్ని సూటిగా చిన్నచిన్న పదాలతో. వాక్యాలతో చెప్పాలి. రచనా శైలిలో జీవం ఉండాలి. వారి మనోభావాల్ని ఆకట్టుకునే విధంగా ఆత్మీయంగా ఉండాలి. మహిళలను కించపరిచే పదాలను వాడకూడదు, ప్రమాణాలను చేయకూడదు. చెప్పేవిధానం తార్కికంగా కొనసాగాలి. రచనకు మొదలు. విషయభాగం ముగింపు తప్పనిసరిగా ఉండాలి. చెప్పదల్చుకున్న నాలుగు అంశాల్ని అస్తవ్యస్తంగా కాకుండా ఒక క్రమరీతి ఏర్పాటుచేసి చెప్పాలి. హాస్యధోరణిని వినియోగించుకోగలగాలి. ఇది దయాదాక్షిణ్యాలను ధ్వనించే హాస్యం కారాదు. అంటే హాస్యం మనసుకు ఆహ్లాదాన్నివ్వాలి. గానీ, గాయపరచరాదు. భాషలో సాధారణంగా వచ్చే లింగద్వేషాన్ని రానీయకూడదు. రచన స్వరం (tone) శృతి మించకూడదు. వారి మనసుని గాయపర్చకూడదు.

## 15.5 ముఖ్యవిషయాలను గుర్తుంచుకుందాం

★ మహిళలకు సంబంధించి రచన వ్యాసంగంలో గుణాత్మకమైన మార్పులు వచ్చాయి.

★ తెలుగు సాహిత్యంలో మహిళకోసం రాయడం ఒక ప్రత్యేక ప్రక్రియగా ఎదిగింది.

★ మహిళల కోసం రాయడంలో రచనాంశాలను గుర్తించాలి.

★ రచనాంశాల పరిధి. భాష, రాసే పద్ధతులు.

★ ఈ భాగం అధ్యయనం చేశాక మహిళల కోసం రచన చేయడం ఎలా. అనేది అవగాహనలోకి వస్తుంది.

## 15.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. మహిళలకోసం ప్రత్యేకంగా రాయడం అవసరమా? ఎందుకు?
2. మహిళల సమస్యలు జనాభాలో మిగతా వారి సమస్యల కంటె ఎలా భిన్నమైనవి?
3. పత్రికలలో మహిళలకోసం కేటాయిస్తున్న పేజీలలోని అంశాలను విశ్లేషించండి?

II. కింద ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. తెలుగులో మహిళల పత్రికలు
2. మహిళలకోసం రాయదగిన అంశాలు పేర్కొనండి.

**- శ్రీనివాసరెడ్డి**

BRAOU

# భాగం - 16 : యాత్రా రచనలు

## విషయక్రమం


16.0 ఉద్దేశం

16.1 ప్రవేశిక

16.2 యాత్ర, యాత్రరచన నిర్వచనం

16.2.1 యాత్రారచనలు: చారిత్రక ప్రాముఖ్యం

16.2.2 యాత్రారచనల లక్ష్యం

16.3 యాత్రాచరిత్రలలో రకాలు

16.3.1 యాత్రా సమాచార సాహిత్యం

16.3.2 పత్రికలలో వ్యాసాలు

16.3.3 యాత్రా చరిత్ర రచన

16.4 యాత్రా రచనలో ఫొటోగ్రఫీ

16.5 యాత్రారచన కొన్ని ఉదహారణలు, నమూనాలు.

16.6 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

16.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 16.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు కింది విషయాలను విశ్లేషించగలుగుతారు.

- యాత్రారచన నిర్వచనం.
- యాత్రారచనల రకాలు
- యాత్రారచనలో పాటించవలసిన జాగ్రత్తలు ఏమిటి

BRAOU

## 16.1 ప్రవేశిక

శతాబ్దాల నుండి ప్రజలు యాత్రలు చేస్తూనే ఉన్నారు. అవి పుణ్యస్థలాలను చూడటానికి, విజ్ఞాన సముపార్జనకు వినోదానికి, లేక సిద్ధాంత ప్రచారానికి జరగుతుండేవి. అయితే ఇటీవలి కాలంలో యాత్రలు, పర్యటనలు, ఉద్దేశ్యం ఏమైనప్పటికి పెద్ద పరిశ్రమగా రూపొందాయి. ఇందులో ఎన్నో రంగాలకు స్థానం ఉంది.

ఇటీవలి కాలంలో యాత్ర ఒక పరిశ్రమగా రూపొంది వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో అభివృద్ధి చెందుతున్నది. దీనితో యాత్ర వినోద పర్యటనగా ప్రాముఖ్యం సంతరించుకుంది. ఇందులో భాగాంగా రవాణా (కార్లు, బస్సులు, రైలు. విమానాలు) భోజన వసతి సౌకర్యాలు (హోటళ్లు), చేతి పరిశ్రమలు మొదలైనవి, యాత్రికులకు వినోదం కలిగించే సంగీత నృత్య విభాగాలు ఇలా అనేక శాఖలు విస్తరించాయి. వీటితోపాటుగా యాత్రాసమాచార సాహిత్యం ఆయా స్థలాలను గురించిన సమాచారం అక్కడ చూడ వలసిన ముఖ్యమైన ప్రదేశాలు, వాటి ప్రాముఖ్యం, అక్కడికి వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యాలు, వసతి సౌకర్యాలు, ఎవరిని సంప్రదిస్తే సౌకర్యాలు లభిస్తాయో వారి టెలిఫోన్ తదితర వివరాలు, వీటన్నిటిని ఆకర్షణీయంగా తయారుచేసి, యాత్రికులను అక్కడికి వెళ్లేందుకు ప్రోత్సహించే విధంగా రూపొందిస్తున్నారు. యాత్ర విహారాలు ప్రాముఖ్యం సంతరించుకోవడంతో యాత్రారచనలు కూడా ప్రముఖ స్థానం పొందాయి.

★ యాత్ర, యాత్రరచన నిర్వచనం

★ యాత్రారచనలలో రకాలు

★ యాత్రాపరిశ్రమలో అంతర్గత శాఖలు

★ రచనలు ఎవరికోసం వంటి విషయాలు తెలుసుకోవడం తప్పనిసరి

★ విషయం ఎన్నుకోనడం

★ యాత్రారచయిత లక్షణాలు

★ రచనలలో పాటించవలసిన జాగ్రత్తలు

★ యాత్రారచనలో ఫొటోగ్రఫీ స్థానం

ఈ అంశాలు యాత్రారచయితగా వృత్తిని స్వీకరించినట్లయితే మీకు లభించగల అవకాశాలను గురించి పరిశీలిద్దాం.

## 16.2 యాత్ర, యాత్రారచన నిర్వచనం

నిఘంటువులు, కథాసరిత్సాగరం, అమర కోశం మొదలైన వాటిలో లభించే అర్థాలు, భారత భాగవత పురాణాలు, మనుస్మృతి, మొదలైన వాటిలో ప్రయోగాలలో యాత్ర అనే మాటకు ఎన్నో అర్థాలు, నిర్వచనాలు లభిస్తాయి. 'కదలిక'తో ప్రారంభించి, ప్రయాణము, గమనము, జాతర, సైనికదండయాత్ర, జైత్రయాత్ర, భోగాల అనుభవం వరకూ తీర్థయాత్రలు, దాడి చేయడం, ఆఖరకు జీవిత యాత్రచాలించడం వరకు ఎన్నో అర్థాలు మనకు దర్శనమిస్తాయి. ఇదే విధంగా యాత్ర అనే పదానికి ఆంగ్లంలో సన్నివేశార్థమైన 'ట్రావెల్'కు కూడా ఎన్నో అర్థాలున్నాయి. ఏమైనప్పటికి మన ప్రస్తుత పరిశీలనలో ఏదోఒక నిర్దిష్టమైన లక్ష్యంతో వివిధ ప్రదేశాలను దర్శించిరావడం అనే అర్థం చెప్పుకుంటే సరిపోతుంది. ఈ లక్ష్యం విజ్ఞాన సముపార్జన, పాండిత్య ప్రదర్శన, జిజ్ఞాస, తృష్ణతో చేసేవి. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న బలీయమైన కోరిక, మత ప్రచారాలు, వినోద విహారయాత్ర ఏదైనా కావచ్చు. యాత్రికులు వారి అనుభవాలు, అనుభూతులను వివరించి, విశ్లేషించి, వర్ణించి ప్రచురించడమే యాత్రరచన. యాత్రికుల అనుభవాలను మన పరిశీలనకు యాత్రారచనలుగా స్వీకరిస్తాం.

BRAOU

### 16.2.1 యాత్రారచనలు: చారిత్రక ప్రాముఖ్యం

భారతదేశంలో నిజానికి ప్రపంచ దేశాలన్నిటిలో కూడా, దేశ విదేశీ యాత్రికుల పర్యటనలను గురించి, వారు క్రోడీకరించిన విషయాలను గురించి మనకు ఎన్నో గ్రంథాలు లభిస్తున్నాయి. రోడ్లులేక, సుకరమైన ప్రయాణ సాధనాలు లేక, ఎన్నో కష్టనష్టాలకు తట్టుకొని ఆకాలంలో యాత్రికులు జిజ్ఞాసువులుగా ప్రపంచపర్యటన చేశారు. ఉదాహరణకు చైనా యాత్రికులు ఫా హియాన్, హుయాన్‌త్సాంగ్‌లు, మధ్యయుగాలనాటి ఫ్రెంచి యాత్రికులు టావెర్నీర్, బెర్నీర్‌లు అరేబియా యాత్రికులు ఇబిన్ బటూటా, ఆల్‌బెరూనీలు ఇటాలియన్ మార్కోపోలో తమ ప్రపంచ పర్యటనలో భాగంగా మనదేశంలో వివిధ ప్రదేశాలను దర్శించి ఆయాస్థలాల ప్రాముఖ్యాన్ని ప్రజల సాంఘిక, మత, వాణిజ్య జీవనం గురించి, రాజకీయ స్థితిగతులను కళాభిమానం గురించి, తాముచూసినవి, విన్నవి అనుభవాలను క్రోడీకరించారు. ఆయా కాలాలలోని భారతదేశ పరిస్థితిని తెలుసుకోనడానికి ఈ యాత్రారచనలు చక్కని చారిత్రకాధారాలు. సామాన్య ప్రజల జీవన స్థితిగతులులను తెలుసుకొనడానికి ఇవే ఆధారాలుగా మిగిలాయి. యాత్రికుల అవగాహ[illegible] రాగద్వేషాలు లేకుండా పరిస్థితులను అర్థంచేసుకొని విశ్లేషించగల శక్తి మొదలైన వాటిపై ఆధారపడి వారి అనుభవా[illegible]న్నది నిర్వివాదాంశం.

ఇటీవలి కాలంలో కూడా స్వదేశీ, విదేశీ [illegible]లు చేస్తున్న వారు చాల మంది ఉన్నారు. తమ అనుభవాలను వారిలో కొందరు గ్రంథస్థం చేశారు. గత ఒకటిన్నర శతాబ్దాల కాలంలో తమ పర్యటనానుభావాలను గ్రంథస్థం చేసిన తెలుగు వారు

వందమందికి పైగానే ఉన్నారని "తెలుగులో యాత్రాచరిత్ర'లను గురించి పరిశోధన చేసిన డాక్టర్ మచ్చ హరిదాసు పేర్కొన్నారు. పి.హెచ్.డి. కొరకు సమర్పించిన పరిశోధనావ్యాసం ఇది. ఈ రచనలలోని ముఖ్యమైన అంశాలను కొన్నింటిని ఈ గ్రంథంలో ఉదహరించారు. వీటిని వారు యాత్రారచనలుగా పేర్కొన్నారు.

### 16.2.2 యాత్రా రచనల లక్ష్యం

యాత్రారచనలు చాల వరకు ఆత్మ సంతృప్తి , ఆత్మానందం కోసం తమ అనుభవాలను గ్రంథస్థం చేసినవే. ఇందులో వారి స్వలాభాపేక్ష, వ్యాపార దృష్టి లేవనవచ్చు. పూర్వకాలంలో వీరంతా సొంతఖర్చుపై విజ్ఞాన సముపార్జనకు, ఒక సిద్ధాంత ప్రచారానికి, ప్రకృతిని అన్వేషించడానికి చేసినవే.

ఇటీవలి కాలంలో ముఖ్యంగా గత 50 సంవత్సరాలలో యాత్రలు చేసి అనుభవాలను గ్రంథస్థం చేసినవారిలో అధిక సంఖ్యాకులు ఇతర దేశాల ఆహ్వానాలపై, వారి ఖర్చు, ఆతిథ్యాలపై వెళ్లినవారే. ఒకప్పటి సోవియట్‌రష్యా, అమెరికాలు ఎందరినో ఆహ్వానించాయి. కారణం ఏదైనా, లక్ష్యం ఏదైనా అక్కడి అనుభవాలను మనకు ఈ సందర్శకులు తెలియజేశారు.

అయితే గత 50 సంవత్సరాల కాలంలో యాత్రలు పెద్ద పరిశ్రమగా అంతర్జాతీయ వాణిజ్యంలో ఆర్థిక కార్యకలాపాలలో ముఖ్యమైన అంశంగా రూపొందాయి. వేలకోట్ల రూపాయల పెట్టుబడులు వాటిద్వారా ప్రయాణం, భోజనవసతి, వినోదయాత్రలు, జ్ఞాపికలు ఎన్నో పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. ప్రపంచ పర్యాటకులతను తమతమ దేశాలకు ఆకర్షించడానికి ప్రపంచ దేశాలు ఎన్నో పథకాలు రూపొందిస్తున్నాయి. ఈ పరిశ్రమ లక్ష్యాలను సాధించడంలో యాత్రారచనలు కూడా ప్రముఖస్థానం ఆక్రమించాయి. ఇవి వాణిజ్య పరమైన లాభాపేక్షతో ఒక వృత్తిగా కూడా మారిపోయాయి.

BRAOU

**అభ్యాసం -1 : యాత్ర, యాత్రరచన పదాలను నిర్వచించండి**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

### 16.3 యాత్రారచనలోని రకాలు

రచనల స్వరూప స్వభావాలు, లక్ష్యం, ప్రయోజనాలు మొదలైన అంశాలను దృష్టిలో ఉంచుకుంటే యాత్రారచనలను రెండు ప్రధాన రకాలుగా విభజించవచ్చు. గతంలో యాత్రికులు స్వయం ప్రేరణతో, జ్ఞానార్జన; విశ్వాసాలు సిద్ధాంతాలు ప్రచారం వంటి ఆదర్శాలతో వెతుక్కుంటూ వివిధ ప్రదేశాలను దర్శించి, అక్కడి వింతలు, విశేషాలు, తమ అనుభవాలను అభిప్రాయాలను క్రోడీకరించి రాసేవారు. ఇవి వారివారి ఆత్మానందం కొరకు లాభాపేక్ష రహితంగా చేసిన రచనలు. అలాగే ఇతరుల ఆహ్వానంపై వారి అతిథ్యం స్వీకరించి, ముందుగా పర్యటన వివరాలన్నిటిని ఖరారుచేసుకొని సుకరమైన ప్రయాణసాధనాల ద్వారా చేసే యాత్రలు- వారు రాసే రచనలు, ఇవీ వారు చూసినవి, విన్నవి, సొంత అనుభవాలతో కూడుకున్నటువంటివి వీటిని యాత్రాచరిత్రలు (ట్రావెలోగ్స్) గా పరిగణించవచ్చు. ఆనాటి ఫాహియాన్, అల్ బెరూనీ మొదలు ఏనుగుల వీరాస్వామయ్య (కాశీయాత్ర) డాక్టర్ నారాయణ రెడ్డి (రష్యాయాత్ర) వరకు ఈ కోవకు చెందినవే.

### 16.3.1 యాత్రా సమాచార సాహిత్యం

ముందుగా యాత్రాసమాచార సాహిత్యం గురించి తెలుసుకుందాం. ఇది ఒక రకమైన సేల్స్ ప్రమోషన్ సాహిత్యం అని చెప్పుకున్నాం కదా. కాబట్టి దీనిని వాణిజ్య ప్రకటనల కోవలో చేర్చవచ్చు. ఇలాంటి వాటిలో వివిధ యాత్రా స్థలాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో చిన్న చిన్న పుస్తకాలు, సంక్షిప్తంగా ఉండే కరపత్రాలు, ఫోల్డర్లు, పోస్టర్లు మొదలైనవి. వీటిని ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యాటక పరిశ్రమాభివృద్ధి శాఖలు, కార్పొరేషన్లు ప్రచురిస్తుంటాయి. ఇవన్నీ వాణిజ్య ప్రకటనల వంటివే ననుకున్నాంగదా. కాబట్టి వీటి లక్ష్యంకూడా వివిధ యాత్రాస్థలాలలను చూడాలన్న కోరిక ప్రజలలో కలిగించి అది కార్య రూపందాల్చేందుకు ప్రోత్సహించడం. ఆయా స్థలాల ప్రాముఖ్యం చారిత్రకంగా ప్రాచీన శిల్ప కళదృష్ట్యా, వాటి ప్రాముఖ్యం వివరించడంతోపాటు, అక్కడికి ప్రయాణం, అక్కడి బస, వాటి ధరవరలు, అక్కడ చూడవలసిన విశేషాలు, హాయిగా కాలంగడిపి ఆనందించడానికి అనువైన కార్యక్రమాలు మొదలైన వివరాలు యిస్తూ ఆకర్షణీయంగా తయారుచేసిన సాహిత్యం. మంచి విషయాలన్నిటినీ ప్రముఖంగా తెలియజేస్తూ, పాఠకునికి నమ్మకం కలిగించే విధంగా రచన సాగాలి. ఇందుకొరకు ఆయా స్థలాలను గురించిన సమగ్ర అధ్యయనం అవసరం. ఆయాస్థలాలలో ప్రముఖ దృశ్యాల ఫోటోలు కూడా దీనిలో ప్రచురిస్తే, పాఠకునిలో ఆసక్తి పెరిగి, పర్యటనకు వెళ్లాలని నిర్ణయించుకొనడానికి ప్రోత్సహించే విధంగా తోడ్పడుతుంది. ఇవన్నీకూడా సాధారణ పౌరునికి యాత్రికునికి ఉద్దేశించినవి.

మతపరమైన, వృత్తి పరమైన, వాణిజ్యపరమైన సంబంధాలను పెంపొందించుకునే ఉద్దేశ్యంతో అనేక మంది పర్యటనలు చేస్తున్నారు. ఇలాంటివారి సంఖ్య రోజురోజుకు అధికమౌతున్నది. ఇలాంటి వారిక ప్రత్యేకంగా ఆసక్తి కలిగించే విషయాలను ప్రముఖంగా తెలియ చేసే సాహిత్యం కూడా అవసరమౌతుంది. ఉదహారణకు థాయ్‌లాండ్, కంబోడియా, జపాన్ వంటి దేశాలనుండి వచ్చే బౌద్ధ యాత్రికులకు దేశంలోని బౌద్ధస్థూపాలు, బుద్ధుని జీవితంతో సంబంధం ఉన్న ప్రదేశాలు, కట్టడాలు ఆసక్తి ఉంటుంది. కనుక చూడడంలో యాత్రికులను ఆకర్షించేవిధంగా ఆయాస్థలాలను గురించిన ప్రాముఖ్యం వివరించే రచనలు చేయవలసి ఉంటుంది.

ఈ రకమైన రచనలు (సమాచార సాహిత్యం) ఆయాస్థలాలను చూడక పోయినా పుస్తకాలలో లభించిన సమాచారం, ప్రభుత్వం అందించే ఫోటోల ఆధారంగా చేయవచ్చు. అయితే ఈ విధంగా సేకరించిన సమాచారానికితోడు, అక్కడికి వెళ్ళి స్వయంగా చూచిన మీదట వాటి వర్ణణతో కథా కథనంతో పాఠకుని మరింతగా ఆకట్టుకోవచ్చు.

BRAOU

**యాత్రాపరిశ్రమ సమాచారం:** మరోరకమైన యాత్రాసమాచార సాహిత్యం కేవలం యాత్రాపరిశ్రమలోని వివిధ శాఖలకు ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. ఉదాహరణకు హోటల్ పరిశ్రమ ఎయిర్‌లైన్స్, టూరిస్ట్ బస్సులు, టాక్సీలు, ట్రావెల్ ఏజెంట్లు టూర్ ఆపరేటర్లు, చేతి పరిశ్రమలు, చేతి వృత్తుల ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు, నృత్యసంగీత కార్యక్రమాలు, మొదలైన రంగాలలోని వారిని ఉపయోగకరమైన సమాచారం వీటిలో లభిస్తుంది. ఒకవైపు యాత్రికులకు మెరుగైన సేవలు అందించి, మరింత మందిని ఆకర్షించడంతో పాటు, తమతమ పరిశ్రమలలో ఎదురవుతున్న సమస్యలను గురించి కూడా ఇందులో చర్చజరుగుతోంది.

### 16.3.2 పత్రికలలో వ్యాసాలు

మరో రకమైన రచనలు పత్రికలలోవ్యాసాలు. పర్యాటక స్థలాలను స్వయంగా దర్శించిన యాత్రికుడు తన అనుభవాలను, అక్కడి దర్శనీయస్థలాలను గురించి పత్రికలకు వ్యాసాలుగా వ్రాస్తారు. రాసిన వ్యాసానికి పత్రికనుండి లభించే ప్రతిఫలం మినహా, వేరే లాభాపేక్ష కన్పించదు. ఏ పర్యాటక పరిశ్రమ ప్రోత్సాహంపై రాసినదికాదు. చదివిన పాఠకులు కొందరిలోనైనా, ఆ స్థలాన్ని దర్శిస్తే బాగుంటుందనే భావంకలగవచ్చు. దాని ఆధారంగా మరింత సమాచారం కరపత్రాలు, ఫోల్డర్ల వంటివాటిని, పర్యాటక శాఖనుండి పొందాలన్న ఉత్సాహం కలగవచ్చు. ఇటువంటి వ్యాసాలు సాధారణంగా సంక్షిప్తంగా రెండుమూడు ఫోటోలతో రెండుమూడు పేజీలకు మించకూడా ఉంటాయి. ఈ కథనం పత్రికా రచన శైలిలో ఉంటుంది.

**వాణిజ్య ప్రేరణతో వ్యాసాలు:** ఒకదేశం లేక ప్రాంతంలోగల దర్శనీయ స్థలాలను గురించి మరోదేశంలో లేక మరో ప్రాంతంలో ప్రచారంచేసి, అక్కడి ప్రజలు ఈ కేంద్రాలను దర్శించే విధంగా ప్రోత్సహించడంలో యాత్రా వ్యాసాలు తోడ్పడుతాయి. ఆయా ప్రభుత్వాలు, పర్యటన పరిశ్రమలో కీలకమైన టూర్ ఆపరేటర్లు కలిసి యాత్రారచయితల బృందాలను తీసుకువెళ్లి వ్యాసాలు రాయిస్తారు. ఉదాహరణకు ఐరోపా దేశాలనుండి ప్రఖ్యాత రచయితలను కొందరిని ఒక బృందంగా భారతదేశానికి తీసుకురావడం. వీరిని భారత దేశంలోని ముఖ్యమైన దర్శనీయ స్థలాలను కొత్త కొత్త పర్యాటక ఆకర్షణలను గుర్తించి ఈ బృందాన్ని తీసుకువెళ్లారు. వారు వివిధ పత్రికలకు వ్రాసిన వ్యాసాలు, ఆయా దేశాలలో పర్యటనాసక్తి గలవారికి మరోచోటకు బదులు భారతదేశంలోని ఈ కొత్త ఆకర్షణలను చూడటం మరింత ఆనంద దాయకం కాగలదని భావం కలిగించాయి. దీనికితోడుగ, ఆయా దేశాలలోని టూర్ ఆపరేటర్లు, ఈ ప్రదేశాలను దర్శించడానికి వీలైన ఒక పర్యటన కార్యక్రమ ప్యాకేజి ప్రకటించారు. చార్టర్ విమానంలో యాత్రికుల బృందాలను తీసుకువచ్చి చూపించారు. దీని వలన ఆ యాత్రికులను సంతృప్తి కలగడంతోపాటు యాత్రపరిశ్రమ ద్వారా మనదేశానికి, ఆ టూర్ ఆపరేటర్‌లకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరాయి. ఈ వ్యాసాలు పర్యటన పరిశ్రమ 'సేల్స్ ప్రమోషన్‌లో మొదటి మెట్టు. విదేశీ పర్యాటకులను అధిక సంఖ్యలో ఆకర్షించడానికి కృషిచేస్తున్న భారతదేశంలో ఇటువంటి టూర్ ఆపరేటర్ల పర్యటనలు, యాత్రారచయితల వ్యాసాలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది.

యాత్రారచయితగా, సమాచార సాహిత్య రచయితగా స్థిరపడినప్పుడు ప్రపంచ పర్యటన చేసే అవకాశాలు లభించగలవు.

ఇటువంటి వ్యాసాలను సాధారణంగా దిన పత్రికల అనుబంధాలలో, వార పత్రికలలో, లేక జనసామాన్యానికి ఆసక్తి ఉండే మ్యాగజైన్లలో ప్రచురిస్తుంటారు. వీటి ఉద్దేశ్యం యాత్ర చేయాలనుకున్న వ్యక్తికి ఆ ప్రదేశం చూడవలసిన ఆవశ్యకతను నచ్చజెప్పడానికి కాదు. నిజాయితీతో నిష్పక్షపాతంగా, నిశితంగా పరిశీలన చేసి తెలుసుకున్న వివరాలను తెలియజేయడం, తద్వారా యాత్రకుపక్రమించేవారికి 'సలహా' యివ్వడం మాత్రమే. పూర్తి సమాచారం అందించి నిర్ణయం అతనికే వదిలివేయడమూ అనవచ్చు. ఆ ప్రదేశాన్ని దర్శించిన తర్వాతనే ఇటువంటి వ్యాసాలు రాయాలి లేకపోతే అది పాఠకులను మోసగించినట్లే కాగలదు.

### 16.3.3 యాత్రా చరిత్ర రచన

యాత్రారచనలోని రకాలను తెలుసుకున్నాం. యాత్రారచనల శైలిలో తేడాలుంటాయి. ఇందుకు రచనా లక్ష్యాలే కారణం. రచయితలలో కూడా కొన్ని ముఖ్యమైన లక్ష్యాలు చూస్తాం. లేకపోతే రచనలలో విశ్వసనీయత లోపిస్తుంది. పాఠకులు శంకిస్తారు.

యాత్రా చరిత్రల రచన. సమకాలీన ఆర్థిక రాజకీయ, సామాజిక, సంస్కృతీ పరమైన సంఘటనల క్రోడీకరణ. తర్వాత తరాలవారు వీటి ఆధారంగా దేశచరిత్రను అవగాహన చేసుకోగలరు. దేశ చరిత్రను అర్థంచేసుకోవడంలోను ఇవి తోడ్పడుతాయి. యాత్రారచనలలోని వర్ణనలు అప్పటి వైభవాన్నీ స్థితిగతులను వివరిస్తాయి. చారిత్రకంగా ఉదాహరణలు మనకెన్నో కన్పిస్తాయి.

రచయిత యాత్రికుడు. తన యిష్టాయిష్టాలను ప్రక్కన బెట్టి చూచినది. విన్నది. నిష్పక్షపాతంగా నిజాయితీతో సత్యానికి దగ్గరగా ఉండేట్లు వర్ణనలు చేయాలి. ఇదిలోపిస్తే చారిత్రకాంశాల వక్రీకరణకు గురవుతాయి. యాత్రకుపక్రమించే ముందుగా ఆయా స్థలాలను గురించి వీలైనంత సమాచారం సేకరించుకొని అక్కడి స్థితిగతులతో వాటిని సరిచూచుకొని సొంత అభిప్రాయాలను చొప్పించకుండా రాయాలి.

యాత్రారచయిత తన అనుభవాలను, చూచినవి, విన్నవి పాఠకునికి కళ్లకు కట్టినట్టు చెప్పగలగాలి. వివిధ అంశాల వర్ణనతోపాటు. చక్కని శైలి, కథా కథనం, గతాన్ని వర్తమానాన్ని మేళవించగల నేర్పు అవసరం. యాత్రారచయిత విలేకరిగా, పరిశోధకుడుగా, నవలా రచయితగా చక్కని శైలిగల రచయితగా తనవిధిని నిర్వర్తించాలి. యాత్రికునిలోని అనుభూతి. పరిసరాల పరిశీలన, సంఘటనపట్ల ప్రతిస్పందన ఇతరుల నుండి విషయాలను సేకరించాలన్న తాపత్రయం మొదలైనవన్నీ యాత్రారచయితలో ఉండాలి. ఆకర్షణీయంగా చెప్పడమన్నది, రచయిత సృజనాత్మకతపై ఆధారపడి ఉంటుంది.

BRAOU

**అభ్యాసం -2 : యాత్రారచనలలోని రకాలను తెల్పండి.**

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

## 16.4 యాత్రా రచనలలో ఫోటోగ్రఫీ ప్రాముఖ్యం

చైనా యాత్రికులు ఫాహియాన్, హూవాన్‌త్సాంగ్ మధ్య యుగంనాటి ఫ్రెంచి యాత్రికులు టావెర్నీర్, బెర్నీరీలు ఆ తర్వాత వచ్చిన అరబ్బు యాత్రికులు ఇబిన్‌బటూటా, ఆల్‌బెరూనీల కాలంలో తాము చూచిన విషయాలను పద చిత్రాలుగానే మనకు అందించగలిగారు. ఫోటోగ్రాపులు. విడియో చిత్రాల రూపంలో అందించే అవకాశం లేకపోయింది. 1830 ప్రాంతంలో ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర చరిత్రను ప్రచురించేనాటికీ ఈ సౌకర్యం లేదు. శాస్త్రసాంకేతిక విజ్ఞానమూ ఇంతగా పరిణితి చెందలేదు.

చిత్రలేఖనంలో ప్రవేశం ఉన్నట్లయితే, యాత్రారచయిత తన అనుభవాలను. తాన చూసిన స్థలాలను సంఘటనలను రేఖాచిత్రాలుగా గీసి తన కథనానికి జోడించేవారు. ఇటువంటి రేఖాచిత్రాలు రచనకు నిండుదనం చేకూర్చేవి.

అయితే 19వ శతాబ్దం మధ్య కాలంలో ఫోటో కెమెరా, ఫోటోఫిలిం తయారైనప్పటినుండి కట్టడాలను, సంఘటనలు. వ్యక్తులను, సన్నివేశాలను ఫోటోలో బంధించడం సాధ్యమైంది. ఒక చిత్రం వెయ్యిమాటల పెట్టుఅనేది నానుడి. అంటే ఒక సన్నివేశాన్ని వర్ణించడానకి వెయ్యి పదాలు అవసరం కావచ్చు. కాని ఆ సన్నివేశాన్ని ఒక ఫోటోగ్రాఫ్‌ద్వారా కళ్లముందుంచవచ్చు. ఉత్ప్రేక్షలని శంకించడానికి వీలులేకుండా విషయాన్ని యథాతథంగా మనకు అర్థమయ్యే విధంగా చూపించవచ్చు. సొంత కెమెరా ఉండి, ఫోటో గ్రాపులు స్వయంగా తీయగల అనుభవం ఉంటే మంచిది. తను చూసినది, తను చూపించదలుచుకున్న విషయం, తాను వ్రాయబోయే విషయానికి అనుగుణమైన విధంగా చిత్రీకరించే అవకాశం ఉంటుంది. గోవా సముద్రతీరంలోదృశ్యాలు, కాశ్మీరులోయలో ప్రకృతి సౌందర్యం, తలలొంచే కొబ్బరిచెట్లతో కేరళ గ్రామీణప్రాంతం, ఖజురహో శిల్పాలు, ఆధునిక దేవాలయాలని పండిట్ నెహ్రూ వర్ణించిన నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టులు, సుభిక్షంగా ఉన్న గ్రామీణప్రాంతాలు, పండుగలు పబ్బాలు, ఒకటేమిటి ఫోటోలద్వారా ఎన్నో దృశ్యాలు కళ్లకు కట్టినట్లు చదువరులకు తెలియచేయవచ్చు. ఇవన్నీ మనం చూసి వర్ణిస్తున్న కథా వస్తువుకు సబంధించినవి. పాఠకుని మనస్సుపై చెరగని ముద్రవేయగలవు.

BRAOU

ఫోటో గ్రాపులు తెలుపు నలుపువి కావచ్చు. వర్ణచిత్రాలు కావచ్చు. ఏదైనసరే చిత్రం నెగెటివ్‌లో వివరాలు స్పష్టంగా ఉండాలి. సరైన వెలుతురులో తీసినప్పుడే ఈ వివరాలుస్పష్టంగా ఉంటాయి. ఇది కెమెరా నాణ్యత, ఫోటో తీసినసమయం, ఫోటో తీయడంలో నేర్పు, మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది. యాత్రారచన, యాత్రాసమాచార సాహిత్యరచన వృత్తిగా స్వీకరించదగిన వారికి ఖరీదు కొంత ఎక్కువే అయినప్పటికీ, వీలైనంత మంచి కెమెరా ఉంటే ఎంతో ప్రయోజనకరంగా ఉటుంది. పెట్టుబడి వృధాగాపోదు.

ఫోటో మనం రాసే విషయానికి సంబంధించినదై దానిప్రాముఖ్యాన్ని ఇనుమడింపజేయగల విధంగా ఉండాలి. మన రచన కథావస్తువుకు సంబంధించి పూర్తి విలువలను ప్రత్యేకతలను, ప్రముఖంగా వివరించగల చిత్రాలను ఎంచుకోవాలి. ఒక ప్రదేశం, ఒక కట్టడం గురించి వ్రాస్తున్నప్పుడు, దానిలోని అనేక లక్షణాలలో అతి ప్రముఖమైన వాటికి ప్రాధాన్యమిచ్చే లక్షణాలను స్పష్టం చేసే చిత్రాలుండాలి. ఉదాహరణకు గోవాలో పర్యటనకు సంబంధించిన రచనలో గోవా సముద్రతీరాలు, ప్రముఖమైన చర్చిలు, మందులు వారి పండగ సరదాలు, నృత్యాలవంటి చిత్రాలు మంచి కథా వస్తువులవుతాయి.

నాగార్జున సాగర్‌ను గురించి రాస్తున్నప్పుడు, ప్రపంచంలో అతిఎత్తయిన రాతికట్టడం ఆనకట్ట, ఆ వెనక మానవ

నిర్మితమైన సువిశాల జలాశయం, నది మధ్యలో కొండమీద నిర్మించిన పురావస్తు ప్రదర్శనశాల, అందులోని నిలువెత్తు బుద్ధవిగ్రహం. శిల్పనైపుణ్యం వివరించే శిల్పాలు, ఎత్తిపోతల జలపాతం, వంటి వాటి చిత్రీకరణలు ఎంతగానో తోడ్పడుతాయి.

చిత్రాలను పత్రికలు లేక ప్రచురణకు పంపడంలో కొన్ని మెలకువలను పాటించాలి. చిత్రంపై గీతలు, మచ్చలు పడకుండా జాగ్రత్తపడాలి. అచ్చులో ఇవి బొమ్మను పాడుచేయగలవు. పోస్టుద్వారా ఫోటోలను పత్రికలకు పంపించేటప్పుడు అవి మడత పడకుండా ఒకగట్టి అటను ఆధారంచేసి పంపించడం మంచిది. ఫోటోలను కాగితాలను గుండుసూదితో గుచ్చరాదు. క్లిప్పులు తగిలించడం మంచిది. రెండు ఫోటోలను పంపించేటప్పుడు వాటిమధ్య టిష్యూపేపర్ ఉంచటం వలన అవి అంటుకుపోకుండా ఉంటాయి. ఫోటో ప్రింట్లు గ్లాసీ పేపర్పై ఉండాలి. అప్పుడే పత్రికలో అచ్చు బాగా పడ్తుంది.

వర్ణచిత్రాలు ప్రింట్లుగాను, లేక స్లైడ్లుగాను తయారు చేయవచ్చు. చిన్న సైజులో ముద్రించాలను కుంటే కలర్ ప్రింట్ సరిపోతుంది. ఇంకాచాల పెద్దదిగా ఎన్లార్జిచేసి పత్రికలో అచ్చువేయవలసివస్తే, కలర్ ప్రింట్కు బదులు, అసలు నెగిటివ్, స్లైడ్నుండి ఎన్లార్జి చేయడం వలన చిత్రంలోని వివరాలు స్పష్టంగా అచ్చుఅవుతాయి.

## 16.5 యాత్రారచనః ఉదాహరణ

ఈ క్రింది యాత్రాచరిత్ర రచనలో ఉదాహరణ తెలుగులో మొట్టమొదటి యాత్రాచరిత్ర రచనగా పరిగణన పొందిన ఏనుగుల వీరాస్వామయ్య 'కాశీయాత్రాచరిత్ర' నుండి గ్రహించినది. 1830 మే 18వ తేదీన మద్రాసునుండి బయలుదేరి వివిధ ప్రాంతాలు గ్రామాలు చూస్తూ 1830 జూన్ 29న నగరం చేరినప్పటి యాత్రా వివరణ ఇందులో ఉన్నదిః

"29వ తేదీరాత్రిమొదలు జులై నెల 8వ తేదీ సాయంకాలం వరకు హాయిదరాబాదు షహరులో చేరిన బేగంబజారులో నున్నాను. ఆ రాత్రి మొదలు జులయి 19 వ తేదీ రాత్రి వరకు శికందరాబాదు అనే పేరుగలిగిన యింగిలీషువారి దండుఉండే బస్తీకి సమీపముగాన్ను కాకా గూటన్ బొమ్మదేవరు నాగన్నతోట చావిడిలో నుంటిని"

"హయిదరాబాదు షహరుకు చుట్టు బేగంబజారు అనేబస్తీ యొకటియున్నది. అందులో సాహుకార్లకోఠీలు కలవు. అది షహరుకంటే వాసయోగ్యము. అక్కడికి కోసుదూరములో కారువానా అనే బస్తీయొకటి యున్నది. అది రత్నాలు వగయిరా అమ్మేవర్తకులుండే స్థలము.

"షహరులోపల షాలిబండ అనే పేరుగలిగిన యొక పేట యున్నది. ఆ స్థలమందు అక్కడి బ్రాంహ్మణులు ఇండ్లు కట్టుకొని కాపురమున్నారు. దివాన్ పేష్కారు చందూలాలు అక్కడ ఇల్లు కట్టుకొని కాపురమున్నారు. నిజాందేవిడి షహర్నడుమ నున్నది. పెద్ద మనుష్యులు, అమీరులు, వుమరాలనే పేరు కలవారు, సాధారణ వర్తకులు నిజాం వంశస్థులున్ను షహరు నడుమ కాపురమున్నారు. షహరునడుమ మక్కామజ్జిత్ అనే యొక తురకల జపశాల యున్నది. దాని స్థూపాలు రెండు మొలాము చేయబడి యున్నవి గనుక బహుదూరానికి తెలియచున్నది. మశీదుకు నెదురుగా లోగడి దివాన్మీరాలం అనేవాడు కట్టించిన కారంజీలు (ఫౌంటెన్లు) లోతుగా నున్నవి. వాటికి సమీపముగా చౌకు అనే పేరుల గుజీరీ అంగడి ఒకటిన్ని, బట్టలయంగళ్లు,పాత్ర సామానుల యంగళ్లున్ను ఉన్నవి. నాల్గుదోవలు చేరడానికిగాను కట్టిన యొకగొప్ప స్థూపం కలిగి నాలుగుద్వారాలు గలిగిన ఒక చావడిన్ని యున్నది. షహరులో రాజవీధుల యందు గుండురాళ్లు పరచియున్నవి. అట్టి వీధులలో నుండే కళ్మలమయిన యడుసులో నడిచే నారిపాదాలు పూడిపోవుచున్నవి. ఇండ్ల యలంకారమున్ను సందులకు సందియున్ను యితర దక్షిణదేశపు షహరులలో వాసముచేసే వారికి ఇష్టముగా నుండవు...

"....కృష్ణానది దాటినది మొదలు హైదరాబాదు వరకు పకీరులు పొగిడి భిక్షము అడుగకమానరు. వారికి కొన్ని గవ్వలైనా యిచ్చిపోకపోతే అపమానము తోచుచున్నది. చెన్నపట్టణము రూపాయి 1కి అక్కడి పయిసాలు 50. పయిసా 1కి 20 పుంజీల గవ్వలు. పుంజీ 1కి గవ్వలు 4..

"ఈ షహరుగోడకు చేరినట్టుగా 'మూసి' అని అక్కడి వారిచేత చెప్పబడుచున్న ముచుకుందనది పారుచున్నది. ఆ నది

BRAOU

వాడపల్లె వద్ద కృష్ణలో కలియుచున్నది. అది గొప్పనది. పోయిన సంవత్సరం నదీ ప్రవాహము ఎక్కువగా వచ్చి ఢిల్లీ దరవాజా వద్ద యింగిలీషువారు కట్టిన వారధిని పగలగొట్టి అషహరులో కొన్ని వీధులున్ను, బేగం బజారులో కొన్ని వీధులున్ను ముంచివేసి పోయినది. బేగం బజారుకున్ను, షమారుకున్ను నడమ ఆ నది దాటుటకు పుర్వకాలమందు తురకలు మంచి రాళ్లతో అతిబలముగా నొక్కవారధి యేనుగల మొదలయినవి గుంపుగా నెక్కిపోవడానకు యోగ్యముగా కట్టినారు. ...

ఇందులో 160 సంవత్సరాల క్రితం మద్రాసులో బయలుదేరి కాశీవెళ్తూ దారిలో హైదరాబాద్‌లో సుమారు 20 రోజుల పాటు మకాంవేసిన ఏనుగుల వీరాస్వామి ఎన్నో వింతలు, విశేషాలను తెలుసుకుని గ్రంథస్థం చేశారు. నగరంలోని కొన్ని పేటలను గురించి అక్కడ నివాసముండేవారిని గురించి, వారి వృత్తి వ్యాపారాలను గురించి రాశారు. ఇళ్లు, దారులను గురించి రాశారు. వాటిని తాము చూసిన ఇతరపట్టణాలతో పోల్చారు. ఆనాడు హైదరాబాద్‌లో బ్రిటిష ప్రతినిధి (రెసిడెంట్) ఉండేవాడని, అతనిసేన సికింద్రాబాదులో ఉండేదని రాశారు. దివాన్, పేష్కారు, సంపన్నులు, ఉమరాలు, వర్తకులు, సీనం పరివారం 'షహర్' (హైదరాబాద్ నగరం) మధ్య నివసించే వారని రాశారు. ఆనాటి నాణాలను గురించి రాశారు. మూసీనదికి వచ్చిన వరద ప్రమాదం గురించి రాశారు. వారి పరిశీలనాశక్తికి ఇది నిదర్శనం.

**ఫోల్డర్ తయారీ అభ్యాసంః** యాత్రారచనలలో మరొకరకం సమాచార సాహిత్యం. ఇందులో తిరిగి అనేక రకాల రచనలున్నాయి. యాత్రాసేవల వివరణ యిచ్చే రచనలు కొన్ని. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో యాత్రాస్థలాలు, దర్శనీయస్థలాలు ఎన్నోఉన్నాయి. వీటన్నింటికి సంబంధించిన వివరాలతో యాత్రాసౌకర్యాల సమగ్ర గ్రంథం వ్రాయవచ్చు. లేక ఒక్కొక్క స్థలం గురించి లేక సమీపంలో ఉండేకొన్ని స్థలాలను గురించి చిన్న చిన్న ఫోల్డర్‌లను తయారుచేయవచ్చు. నాగార్జునకొండ, ఆచుట్టుప్రక్కల దర్శనీయ స్థలాలలను గురించి ఒక చిన్న ఫోల్డర్‌తయారుచేయడం ఈ అభ్యాసం లక్ష్యం. ఇది నాలుగు పేజీలుంటే సరిపోతుంది. ఒకటవ పేజీలో నాగార్జునకొండలో అత్యంత ముఖ్యమైన స్థలం గురించిన చిత్రం ఉంటే బాగుంటుంది. మధ్య పేజీలలో అక్కడ చూడవలసిన ప్రదేశాలు వాటి ప్రాముఖ్యం స్థూలంగా తెలియజేస్తూ, నాలుగైదు చిత్రాలను ప్రచురించవచ్చు. నాలుగో పేజిలో అక్కడికి వెళ్లడానికి ప్రయాణసాధనాలు, అక్కడ భోజన వసతి సౌకర్యాలు, అక్కడ స్థానికంగా వివిధ స్థలాలకు, చూడటానికి రవాణా సౌకర్యాలు, సహాయం కావాలంటే ఎవరిని సంప్రదించాలి, టెలిఫోను, బ్యాంకు తదితర సౌకర్యాలు తెలియచేయవచ్చు.

అభ్యాసానికి ఒక నమూనాగా కింది అంశాన్ని పరిశీలిద్దాం. ఇందులో ఉపయోగించదగిన చిత్రాలు వీటని సమాచారశాఖ పర్యాటక అభివృద్ధి సంస్థనుండి పొందవచ్చు.

1. నాగార్జున కొండ మ్యూజియంలోని నిలువెత్తు బుద్ధవిగ్రహం.
2. మ్యూజియంలోని కొన్ని శిల్పఖండాలు.
3. నాగార్జున సాగర్ ఆనకట్ట దిగువన పవర్‌హౌస్.
4. సాగర్‌లో తిరుగుతున్న ఝురియా బోటు.
5. పైలాన్
6. వ్యూపాయింట్‌నుండి సాగర్ దృశ్యం
7. ఎత్తిపోతల జలపాతం.
8. 'అనుపు'లో పునర్నిర్మించిన ప్రాచీన విశ్వవిద్యాలయం.
9. రంగనాథ స్వామి ఆలయం.

**నాగార్జున కొండలో దర్శనీయ స్థలాలు :**

నాగార్జునకొండ ప్రపంచ బౌద్ధుల ప్రధాన పుణ్యక్షేత్రాలలో ఒకటి. మహాయాన బౌద్ధమతాన్ని ఆనాటి ప్రబోధించిన ఆచార్య నాగార్జునుడు నివసించిన స్థలం. అదే ఆనాటి నాగార్జున విశ్వవిద్యాలయం. క్రీస్తుశకం 3వ శతాబ్దనాటి బౌద్ధారామాలు.

BRAOU

స్థూపాలు అవశేషాలు ఇక్కడ లభ్యమైనాయి. మతోచైత్యాంల బుద్ధభగవానుని పవిత్ర అస్థికలు భద్రపరచినట్లు ఒక శాసనం ఇక్కడ లభ్యమైంది. కృష్ణానదిపై ఇక్కడ ప్రపంచలోనే అతిఎత్తయిన రాతితో కట్టిన నాగార్జునసాగర్ ఆనకట్ట వలన చారిత్రత్మక ప్రాధాన్యంగల ఈ ప్రాంతం నీటిలో మునిగిపోయే ప్రమాదం ఎదురైంది. పురాతనశాఖ ఈ ప్రాంతాన్నంతా త్రవ్వి అవశేషాలను బయటకుతీసి, సాగరమధ్యలో కొండపై నిర్మించిన మ్యూజియంలో భద్రపరిచింది. చారిత్రక ప్రాముఖ్యంతోపాటు శిల్పకళాత్మకంగా అత్యంత సుందరమైన కళాఖండాలు ఇక్కడ ఉన్నాయి.

**అనుపు:** త్రవ్వకాలలో బయల్పడిన నాగార్జున విశ్వవిద్యాలయ అవశేషాలను జాగ్రత్తగా తీసి దగ్గరలోని అనుపు అనే చోట యధాతథంగా పునర్నించారు. బహుశా ఇంతపెద్ద ఎత్తున ఇటువంటి పురాతన శిథిలాల పునర్నిర్మాణ కార్యక్రమం ప్రపంచలోనే రెండవది. అనుపు దగ్గరనే పునఃప్రతిష్ఠ చేసిన రంగనాథస్వామి ఆలయం ఉంది.

**నాగార్జునసాగర్ ఆనకట్ట :** కృష్ణానదిపై నిర్మిచిన ఆనకట్ట, దానివలన ఏర్పడిన 100 చం.మైళ్ళ విస్తీర్ణం గల మానవ నిర్మిత సరస్సు. ఆనకట్ట దిగువన 1000 మెగావాట్ల జలవిద్యుత్ కేంద్రం ఈ సరసులో విహారయాత్రలకు ప్రభుత్వం ఝరియా బోటును నడుపుతున్నది.

**ఎత్తిపోతల:** నాగార్జునసాగర్ ఆనకట్టను 11కిలోమీటర్ల దిగువన చంద్రవంకలో 21 మీటర్ల ఎత్తున్న జలపాతం. యాత్రికులకు ప్రధాన ఆకర్షణ.

**నాగార్జున కొండ ప్రయాణం:** హైదాబాద్‌నుండి 146 కిలోమీటర్లు చక్కనిరోడ్డు. గుంటూరు మాచర్ల రైలుమార్గంలో మాచర్లనుండి 22 కిలోమీటర్లు. నాగార్జున సాగర్‌నుండి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పట్టణాలకు బస్సుసౌకర్యం ఉంది.

బస: యాత్రికుల వసతికి సౌకర్యాలున్నాయి. కొన్ని టూరిస్ట్ గెస్ట్‌హౌస్, విజయవిహార్ కాంప్లెక్స్, ప్రాక్రిక్ష్‌హౌస్, హిల్‌కాలనీ, కాటేజీలు, (హిల్‌కాలనీ) ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుద్వారా రిజర్వు చేసుకోవాలి) లేక ఫ్యూ కుడిగట్టు, (ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కాల్వలు, మాచర్ల ద్వారా రిజర్వు చేసుకోవాలి)

సౌందర్య, టూరిస్ట్ ఎనెక్సీ, యూత్ హాస్టల్, హిల్‌కాలనీ కొండ గెస్ట్‌హౌస్, నాగార్జున కొండ (ఎ.పి.టూరిస్ట్ కార్పొరేషన్ ద్వారా రిజర్వేషన్) చంద్రవంక రెస్ట్‌హౌస్, ఎత్తిపోతల జలపాతం.

స్థానిక ప్రయాణాలు : ఆటోరిక్షాలు.

**చూడవలసిన స్థలాలు:**

| | |
|---|---|
| నాగార్జునసాగర్ దగ్గర : | పైలాన్(దక్కని శిల్పాలుగల రాతి స్థంభం) వ్యూపాయింట్, నాగార్జునసాగర్ దృశ్యం జవహర్‌కెనాల్, లాల్‌బహదూర్ కెనాల్. |
| అనుపు: | పునర్నిర్మించిన బౌద్ధ విశ్వవిద్యాలయ అవశేషాలు. రంగనాధ స్వామి దేవాలయం. |
| నాగార్జునకొండ : | జలాశయం మధ్య కొండపైనున్న పురాతత్వశాఖ మ్యూజియం. |
| ఇతర వివరాలకు : | హిల్ కాలనీలోని టూరిస్ట్ సమాచార అధికారిని సంప్రదించవచ్చు. పోన్ 3633/3634. |

**అభ్యాసం -3 : ఒక నమూనా ఫోల్డర్‌ను తయారుచేయండి.**

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

..................................................................................................................................

BRAOU

## 16.6 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

* చరిత్ర పరంగా నేటి ఆధునిక యుగంలో పర్యాటక రంగం పరంగా యాత్రారచనకు ఎంతో ప్రాముఖ్యముంది.
* యాత్రా రచన అషామాషీగా చేయదగిందికాదు.
* యాత్రా రచనలో అయా స్థలాల పూర్వ చరిత్ర, ప్రస్తుత స్థితి, ప్రముఖులకు సంబంధించివిషయాలు రాయాలి.
* యాత్రా రచనలో ఫోటోలకున్న ప్రాముఖ్యం ఎనలేనిది.

## 16.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. యాత్రారచన ఎన్ని రకాలో వివరించండి.
2. యాత్రా పరిశ్రమలో వివిధ శాఖలను గురించి తెలియజేయండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. యాత్రారచయితకు ఉండవలసిన లక్షణాలు ఏమిటి? రచనలో అతను పాటించవలసిన జాగ్రతలను వివరించండి?
2. యాత్రారచయితగా లభించగల అవకాశాలను వివరించండి.

**- గోవాడ సత్యారావు**

BRAOU

# భాగం - 17 : వికలాంగులకోసం రాయడం

## విషయక్రమం


17.0 ఉద్దేశం

17.1 ప్రవేశిక

17.2 వికలాంగులంటే ఎవరు?

17.2.1 మానసిక వికలాంగులు

17.2.2 శారీరక వికలాంగులు

17.3 వికలాంగుల లక్షణాలు, భావాలు

17.3.1 కుటుంబవైఖరి

17.3.2 సమాజవైఖరి

17.4 వికలాంగులు సాధరణ పౌరులే

17.4.1 జీవించాలన్న పట్టుదల

17.4.2 సమాజ బాధ్యతలు

17.4.3 శిక్షణ సౌకర్యాలు

17.4.4 సాధనాల తయారీ

17.5 వికలాంగుల రచనల లక్ష్యాలు

17.6. రచనలు - వర్గీకరణ

17.6.1 దృష్టిహీనులకు ఆశాకిరణం

17.6.2 విజయగాథలు

17.7 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

17.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 17.0 ఉద్దేశం

ఈభాగం పరిశీలించిన తర్వాత మీరు

- రచనలో ప్రధాన్యమివ్వదగిన అంశాలు.
- ఎటువంటి పదజాలం వాడాలి
- వికలాంగులు గౌరవప్రదంగా, ప్రయోజనకరమైన పౌరులుగా జీవించడానికి రచయితగా చేయవలసిన కృషి తెలుసుకోగలుగుతారు.

BRAOU

## 17.1 ప్రవేశిక

వికలాంగుల కొసం రచనలు చేయడం గురించి చర్చించుకునే ముందు అసలు వికలాంగులంటే ఎవరు? వారిలో అంగవైకల్యం ఎటువంటిది? వారి కోసం ప్రత్యేకంగా రచనలు చేయవలసిన అవసరం ఏమిటి? ఆ రచనలు ఏ లక్ష్యాలను సాధించడానికి ఉద్దేశించినవి? వంటి అంశాలను పరిశీలించడం అవసరం.

అంగవైకల్య మానసికం కావచ్చు, శారీరకం కావచ్చు. మానసికమైతే ఏలోపమూ ఉండకపోవచ్చు. శరీర అంగాలచే పనిచేయించే మెదడు సరిగా ఎదగక లేక ప్రమాదవశాత్తు ఈ శక్తిని కోల్పోయిన స్థితి, అంగవైకల్యం శారీరకమైనదయితే మనం గుర్తించడం తేలికే. కాలు, చెయ్యి, కన్ను, నోరు, చెవి వంటి అంగాలలో లోపాలో లేక శక్తిహీనం కావడమో దీనికి కారణం. మానసికంగా ఏలోపమూ ఉండదు. ఈ స్థితి పుట్టుకతోనే కలగవచ్చు. తర్వాత ఏదైనా ప్రమాదంలో ఏర్పడవచ్చు. ఈ రెండు రకాల అంగవైకల్యం ఆయా వ్యక్తులలో తీసుకువచ్చేమానసిక, శారీరక పరిణామాలు, వాటివలన ఎదురయ్యే సామాజిక మానసిక ఆర్థిక సమస్యలు భిన్నంగా ఉంటాయి. మరోవైపు వారిపట్ల సమాజం ఏవిధంగా ప్రవర్తిస్తున్నది? వారిపట్ల జాలి, దయతోనా? వారిని అపహాస్యంచేసే విధంగా లేక వారికి న్యాయంగా లభించే అధికారాలు, సౌకర్యాలు లభిస్తున్నాయా? మన తోడ్పాటెంత అన్న విషయాలు చర్చకువస్తాయి. వికలాంగుల కూడా భారత రాజ్యంగ చట్టం ప్రకారం సమాన హక్కులు. అధికారాలు గల పౌరులేలు కావడమే దీనికి కారణం.

వికలాంగుల అధికారాలు, హక్కులు, సమాజ బాధ్యత, వికలాంగుల శారీరక మానసిక, స్థితి గతులు వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని రచనలు చేయడాన్ని ఈ భాగంలో పరిశీలిద్దాం.

BRAOU

## 17.2 వికలాంగులంటే ఎవరు?

మనిషి అవయవాలలో ఏదో ఒకటి లోపించినా, వికలంచెందినా, సవ్యంగా పనిచేయలేని స్థితినీ స్థూలంగా అంగవైకల్యం అనవచ్చు. వయసు ననుసరించి మానసికంగా ఎదగని వారిని రోగం, ప్రమాదల కారణంగా మెదడు దెబ్బతిన్న వారిని స్థూలంగా మానసిక వికలాంగులు అనవచ్చు. శారీరకంగా బయటకు కనపించే అంగవైకల్యం వీరిలో ఉండకపోవచ్చు. దీనికి భిన్నంగా, శరీర అంగాలు ముఖ్యంగా కాలు, చెయ్యి, చెవి, కన్నుకు సంబంధించిన అంగవైకల్యం కలవారు మానసికంగా మామూలు మానవులుగా వ్యవహరిస్తారు. నిజానికి వీరిలో అనేకులకు ఈ అంగవైకల్యం వలన కొంత అశక్తత ఏర్పడినా మానసికంగా మరింత చురుకుగా, ఏదోఒక లలితకళలో విశేష ప్రావీణ్యం సంపాదించుకున్నవారు ఎందరో ఉన్నారు. రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చట్టం 1992 ప్రకారం 'అశక్తత' అంటే దృష్టిహీనత, వినేశక్తి లోపించడం, లోకోమోటార్ (అంగాలకదలిక, వస్తువులను కదిలించగల శక్తి లోపించడం) అశక్తత. లేక మానసికంగా సరిగా ఎదగకపోవడం అని నిర్వచించింది.

ఇప్పుడు ఈ రెండు రకాలైన అంగవైకల్యం గురించి వివరంగా తెలుసుకుందాం.

### 17.2.1 మానసిక వికలాంగులు

భారతదేశ జనాభాలో సుమారు రెండు శాతం మంది ఏదో ఒకరకమైన మానసిక వ్యాధులతో బాధపడుతున్నారని 1991 జనాభా లెక్కలలో వెల్లడైంది. అయితే వీరంతా మానసిక వికలాంగులు కారు.

పుట్టుకనుండి మెదడు సరిగా ఎదగక పోవడంతో ఆయా వయసులకు తగినట్లుగా బిడ్డ కర్మేంద్రియాలు సమన్వయంతో పనిచేయలేవు. ఈలోపం కాలు, చెయ్యి మొదలైన అంగాలదికాదు, వీటిని నడిపించే మెదడులోని జీవకణాల లోపంవల్లనే వీరిలో చాల మందికి తమ చుట్టూ ఏమి జరుగుతున్నదో సరిగా అవగాహన చేసుకోగల స్థితి ఉండదు. సమాజాన్ని గురించి తాము పట్టించుకోగల స్థితికూడా ఉండదు. అంగవైకల్యం లేనివారిలో కొందరు తరచుగా వీరిని న్యూనతాభావంతో చూస్తుంటారు. ఆపహాస్యం చేస్తుంటారు. వీరి కన్న తల్లిదండ్రులలో కూడా ఒక్కోసారి 'మోయలేని బరువు' అనే భావం కలుగుతుంటుంది. వీరి ఆలనా పాలనా బాధాకరంగా ఉంటుంది. వారి పుట్టుక శాపంగా భావిచేవారూ లేక పోలేదు. అతిథులు వచ్చినప్పుడు వీరు వారి కంటబడకుండా, దాచి ఉంచే సందర్భాలు అనేకం. ఈ మానసిక వికలాంగులు అటు సమాజంలో తగిన స్థానం లేక, మరో వైపు యింటిలోనే అవాంఛనీయ వ్యక్తులుగా నిర్లక్షానికి గురవుతున్నారు.

మానసిక వికలాంగులలో మరొక రకం, పుట్టుకలో గాక, ఏదో ప్రమాదంలో మెదడుకు దెబ్బ తగిలిన కారణంగా, లేక అశనిపాతంగా జరిగిన ఘటన, తీరని కోరికల వలన మానసిక ఒత్తిడి కారణంగా మతిస్థిమితం కోల్పోయినవారు. వృద్ధిలోకి వస్తున్న చెట్టంత కొడుకు ప్రమాదంలో మరణిస్తే తండ్రి, నమ్మక ద్రోహం వలన వ్యాపారం నాశనమైతే వ్యక్తి మతిస్థిమితం కోల్పోవచ్చు. కారు ప్రమాదంలో తలకు బలమైన గాయం తగిలిన వ్యక్తి ప్రాణాలతో బయటపడిన వృద్ధిక, తన ఆత్మీయులను సైతం గుర్తించగల శక్తి లోపించవచ్చు. వీరు తమ గతాన్ని మర్చిపోయి, వర్తమానంలో తమ చుట్టు ఏమి జరుగుతున్నదో పట్టించుకొనే స్థితిలో ఉండరు. తమలో తాము గొణుక్కుంటూ, అనేక సందర్భాలలో రోడ్డున పడి బట్టలు ఉన్నదీలేనిదీ కూడా పట్టించుకోకుండా తిరిగేవారున్నారు. వీధి పిల్లలు 'పిచ్చివాడు' అంటూ రాళ్లతో కొట్ట, నానా మాటలు అనే స్థితి కనిపిస్తుంది.

ఇంటిలో ఆలానాపాలనా ఉన్నట్లయితే వీరిని ఇంటి నుండి బయటకు రాకుండా కట్టుదిట్టం చేస్తారు. ఈ మతిస్థిమితం లేకపోవడం తీవ్రతమై, పెద్దగా అరుపులు, ఎదటి వారిని కొట్టడం. రక్కడం కొన్ని సందర్భాల్లో జరుగుతుంది. దీనిని అమాయక గ్రామీణులు కొందరు మానసిక లోపం అనే విషయం విస్మరించి, గాలి ధూళి అంటూ భూతవైద్యాలు చేయిస్తుంటారు.

### 17.2.2 శారీరక వికలాంగులు

ఇక రెండవ రకం అంగవైకల్యం శారీరకమైనది. అంటే కాలు, చేయి కన్ను, చెవి లోపించండం లేక సరిగా పనిచేయలేక పోవడం, మోకాలు కీళ్లు, కండరాలు నరాల వ్యాధులు వలన కదలిక లేకపోడం వస్తువులను కదిలించలేకపోవడం అని రిహబిలిటేషన్ కౌన్సిల్ఆఫ్ ఇండియా నిర్వచించింది. శారీరక అంగవైకల్యం కూడా పుట్టుకతోనే రావచ్చు, అనేక సందర్భాలలో ప్రమాదాల కారణంగా కూడా కలగవచ్చు. జన్యు సంబంధమైన లోపం కారణంగా కాలూ, చెయ్యిలోపం ఏర్పడవచ్చు. బిడ్డ అంధుడుగా జన్మించవచ్చు. మూగి, చెవిటిగానూ కావచ్చు వీరిలో కర్మేంద్రియాల లోపమేగాని, వీటిని నడిపించే మెదడు సరిగానే ఉండవచ్చు. పరిసరాల ప్రభావం వీరిపై ఉంటుంది. ఆలోచనాశక్తి మిగతా కర్మేంద్రియాల ద్వారా పనులు చేసుకొగల శక్తి మామూలుగా ఉంటుంది. కొన్ని సందర్భాలలో మరింత చురుకుగా ఉంటుంది. ఈ కోవకు చెందివారే అంధగాయకులు, కాలుతోనో, నోటితోనో కుంచెబట్టి చిత్రాన్ని గీసే వారు. శారీరక అంగవైకల్యం కలగడానికి రోడ్డు ప్రమాదాలు, యుద్ధాలు, ప్రకృతివైపరీత్యాల, పోలియో వంటి వ్యాధులు కూడా కొన్ని కారణాలు. రైలు ప్రమాదంలో ఓ వందమంది మరణిస్తే మూడు నాలుగు వందల దాకా క్షతగాత్రులుకావచ్చు. వీరిలో కొందరు వికలాంగులు కావచ్చు. యుద్ధంలో మరణించిన వారిసంఖ్యకంటె, వికలాంగులైన వారిసంఖ్య ఎక్కువగా ఉంటుంది. హిరోషిమాలో బాంబు పేలుడులో అప్పుడు మరణించినవారు లక్షా40వేలు

BRAOU

కాగా, అర్థశతాబ్ది తర్వాత నేటివరకు మరెన్నో లక్షల మంది శారీరక మానసిక వికలాగులయ్యారు. 1985 భోపాల్ గ్యాస్ ప్రమాదంలో మరణించినవారు కొన్ని వేలమంది, అందులైన వారు, నరాలు చచ్చుబడినవారు, ఏదోఒక అంగవైకల్యంతో బాధపడేవారు కొన్నివేలమంది.

## 17.3 వికలాంగుల లక్షణాలు, భావాలు

మానసిక వికలాంగులు వయస్సుకు తగినట్లుగా మెదడు ఎదగక పోవడం వల్ల పరిసరాలను గురించి పట్టించుకునే స్థితిలో ఉండరు. కొద్దిపాటి పరిజ్ఞానం, స్పృహ ఉన్నవారు తమకు తోచిన రీతిలో స్పందిస్తుంటారు. అయితే శారీరక వికలాంగులు తమ కర్మేంద్రియాలలో ఒకటి సామన్యస్థాయిలో పనిచేయలేకపోవడం. ఏదోఒక అశక్తతతకు గురిచేసినా మానసికంగా ఎలాంటి అశక్తత ఉండదు. తమను గురించి, తమ అశక్తతను గురించి తమ పట్ల సమాజం అనుసరిస్తున వైఖరి, తమ హక్కులు, తమ ఆత్మాభిమానం మొదలైన అన్ని విషయాలపైన వీరికి అభిప్రాయాలుంటాయి. అభిప్రాయాలను స్పష్టంగానూ ప్రకటిస్తుంటారు.

వికలాంగులకొరకు రచనలు చేసే ముందు వీరి భావాలను గురించి తెలుసుకోవడం అవసరం

ఇతరులతో పోలిస్తే తమకు కొంత అశక్తత ఉన్నదన్న భావం వికలాంగుల మనస్సులో ఏదో ఒక మూల ఉండే ఆశ్చర్యపడనవసరంలేదు. కాలక్రమంలో వీరు ఈ భావాన్ని అధిగమించి ముందుకు సాగడానికి ప్రయత్నిస్తారు. అయితే వచ్చిన చిక్కు. చిన్నతనంలో ఈ అశక్తతను గురించి కుటుంబంలోని వారు తమచుట్టూ ఉన్న సమాజం కొంత న్యూనతాభావం ప్రదర్శిస్తే వీరిలో కొందరు మానసికంగా కృంగిపోతారు. అయితే అధిక సంఖ్యాకులు తమ పట్ల ప్రదర్శిస్తున్న ఈ వైఖరికి తీవ్రంగా ప్రతి స్పందించి తమ స్వశక్తిపై ఆధారపడాలన్న పట్టుదల పెరిగి సమాజాన్ని ఎదిరించి ముందుకు పురోగమిస్తారు. ఇది వికలాంగులలో తమ పట్ల తమకున్న స్థైర్య భావాలలో మొదటిది.

తమ అశక్తతను అధికమించి, తమ శక్తి యుక్తుల సహాయంతో వీలైనంత మెరుగైన జీవితం గడపాలన్న ఇచ్ఛ వీరిలో బలంగా ఉంటుది. ఏ అవకాశంలేని కాలులేని, కళ్లులేని లేక మరే విధంగా వికలాంగులైన వారుకూడా జీవించాలన్న బలమైన కోరికతో మనకు రోడ్ల దగ్గర, జన సముదాయాలలో, రైళ్లలో, బస్సులదగ్గర కన్పిస్తుంటారు. అవకాశాలుదొరకబుచ్చుకొని వాటికోసం గట్టి ప్రయత్నంచేసి ఇతర రకాలుగ యిబ్బందులు పడికూడా తమ శక్తులకు కళలో నైపుణ్యాన్ని, చదువులో ప్రతిభను పొంది జీవనం గడుపుతున్నవారు ఎందరో. గాయకులు, చిన్నచిన్న చేతి వృత్తులను నేర్చుకొన్నవారు ఈ కోవకు చెందినవారు. చదువుకుని ఉద్యోగాలలో చేరుతున్నవారు కొందరు. వీరందరిలో స్వశక్తిపై ఆధారపడి గౌరవంగా జీవించాలని ఆశించేవారు కొందరు. అవకాశాలను వినియోగించుకొని జీవన ప్రమాణాలను మెరుగు పర్చుకోడానికి కృషి చేయాలన్న తపన వీరిలో ఉంటుంది. ఇది వికలాంగుల భావాల స్థైర్య పరంపరలో రెండవది.

వికలాంగులు ఈ సమాజంలోని ఇతరులతో సమానులే. అటువంటప్పుడు మిగతావారితో సమానంగా అధికారాలు, హక్కులు అనుభవించగలగాలి. అయితే వీరి అంగవైకల్యం లేక అశక్తతను ఎత్తి చూపుతూ ఈ హక్కులను అవకాశాలను అనుభవించకుండా సమాజం అడ్డుపడుతున్నది. ఇది వికలాంగుల భావన. ఈ భావన ఉక్రోషంగా మథనగా, క్రోధంగా కూడా మారడం కన్పిస్తుంది. తమకు న్యాయంగా చెందవలసినవి అందడం లేదని, ఇతరులు తన్నుకుపోతున్నారని వీరు బాధపడ్తుంటారు. క్రమక్రమంగా ఇది తమ హక్కుల పరిరక్షణకు ఆందోళనగా రూపం దాలుస్తోంది. అంటే హక్కుల పరిరక్షణకోసం సంఘటిత, సమీకృత కృషిదిశగా మరలుతున్నారు. ఇది వికలాంగుల భావనలలో మూడవది. వారిలోఆత్మస్థైర్య చైతన్యానికి ప్రతిబింబంగా పేర్కొనవచ్చు.



BRAOU

పుట్టుకతోనే అంధత్వం, వినేశక్తి లోపించడం, కాలుచెయ్యి వికలంకావడం, పుట్టిన తర్వాత పోలియోవంటి వ్యాధుల వల్ల కాళ్లుచేతులు చచ్చుపడిపోవడం, పౌష్టికాహారలోపం వలన దృష్టిక్షీణించడం కండరాలు, నరాలు, ఎముకలు శక్తిహీనం కావడం వంటి అశక్తతలు రావచ్చు. ఇది పాపమూకాదు శాపమూకాదు. వీటికి కారణాలు ఏమైనా, వికలాంగులు స్వయంగా బాధ్యులు కాదు. అటువంటప్పుడు కుటుంబంలోనివారు, సమాజం మాపై అయ్యోపాపం అని జాలిపడటంకాక, ఈ అశక్తతను అధిగమిచండానికి చేయూత నివ్వాలి. ఆత్మాభిమానాన్ని, మనోబలాన్ని దెబ్బతీసే 'జాలి'కి బదులు, మీకు అండగా మేమున్నాం అనే భరోసా యిస్తూ, అవకాశాలు కల్పించడం మీ ధర్మం బాధ్యత.' ఇది వికలాంగుల మనోభావనలలో నాలుగవది. దీక్షా దక్షతలకు తోడు, సహకారం కావాలని కోరుకుంటుంది.

భారతరాజ్యాంగం వికలాంగులను అందరి పౌరులు మాదిరే గుర్తించి అన్ని అధికారాలు. హక్కులు కల్పించింది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చట్టాల ద్వారా వికలాంగులకు రాయితీలు, ఉద్యోగాలు, ఉపాధిపథకాలలో రిజర్వేషన్లు కల్పించాయి. అయితే అమలులో ఇవన్నీ వికలాంగులకు దక్కడం లేదు. మధ్యలో ఎవరో స్వలాభంకొరకు వీటిని అడ్డుకొంటున్నారు. మరి మాకు చెందవలసిన వాటిని పొందడానికి విన్నపాలు, అర్జీలు యిస్తూ ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించడంలో తప్పేముంది? ఇందుకై వికలాంగులందరిని సమీకరించి సంఘటిత పర్చడం న్యాయమైన చర్య. ఇది వికలాంగుల మనోభావనలలో ఐదవది. ఈ భావనలను ఆశ్రయించినవి మరికొన్ని.

## 17.3.1 కుటుంబ వైఖరి

ఒక బిడ్డ మామూలు కంటె భిన్నంగా జన్మించినప్పుడు, ఆ కుటుంబం తీవ్రమనస్తాపానికి గురవుతుంది. ఇది సహజం కూడా. కుటుంబ స్థితిగతులు, తల్లిదండ్రుల సామాజిక స్థాయి, నిబ్బరం మొదలైన అంశాలు ఆధారంగా ఈ మనస్తాపం, క్రమ క్రమంగా జాలి, నిర్లక్ష్యం, క్రోధంగా మార్పుచెందే ప్రమాదం ఉంది. వికలాంగులైన బిడ్డలపట్ల సానుభూతితో వ్యవహరించే తల్లిదండ్రులు కొందరు మాత్రమే. వికలాంగులైన బిడ్డ తమకు మోయిలేని భారమౌతారనే బాధ, భయం కలుగుతుంది. తాము బ్రతికున్నంతవరకు ఏదో ఒక విధంగా వారి ఆలనా పాలనా చూడగలిగినా, ఆ తర్వాత వారి భవిష్యత్తు ఏమిటి అనే ఆందోళన వీరిని కృంగదీస్తుంది.

ఏమైనప్పటికి, కుటుంబంలోని ఇతర సభ్యులు వికలాంగుల పట్ల ప్రదర్శించే వైఖరిలో మార్పులు కన్పిస్తాయి. ఈ మార్పులు ఇటు కుటుంబ సభ్యులలోను అటు వికలాంగులలోను మానసికంగా కొన్ని సందర్భాలలో తీవ్ర పరిమాణాలకు దారి తీస్తాయి.

బిడ్డ అంగవైకల్యంతో పుట్టడం తమ పూర్వజన్మ పాపఫలమని, ఏదేవుని శాపమోనని, గత జన్మలో చేసిన పాపాలకు. ఎవరికో చేసిన అన్యాయాలకు ఫలితం ఈ జన్మలో అనుభవిస్తున్నామని భావించేవారు ఈ నాటికీ ఎందరో ఉన్నారు. ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు అనీ,ఎలా జరగాలని రాసి పెట్టిఉంటే అలా జరుగుతుందనే సమాధాన పర్చుకుంటుంటారు. పాపము, శాపము అనే మీమాంసను ఒక ప్రక్కకు నెట్టివేసి, వర్తమానంలో ఆ వికలాంగులకు వీలైనంతా సుఖమయ జీవితం లభించడానికి తాము ఏంచేయాలి, ఏమిచేయవచ్చు అని ఆలోచించి కృషిచేసేవారు కొందరు మాత్రమే. ఈ 'కొందరు' 'అందరు'గా మారిన రోజున వికలాంగుల జీవితాలలో గణనీయమైన మార్పు వస్తుందనడంలో సందేహం లేదు.

శారీరక వికలాంగులు తమను గురించి, తమ అవసరాలను గురించి, పరిసరాలను గురించి పూర్తి అవగాహన

BRAOU

కలవారే. సాధారణవ్యక్తి కంటె కొన్ని విషయాలలో 'తక్కువ శక్తిగలవారు'. తాము అశక్తులం. శక్తిహీనులమనే భావం మనసులో ఒక మూల ఉన్నప్పటికి తమకు లభించే అవకాశాలకు అనుగుణంగా గౌరవప్రదమైన జీవితం గడపగల స్థితిలో ఉంటారు. కాలు, చెయ్యి లోపం ఉన్నప్పటికి, ఇతరులపై ఆధారపడటం నామ మాత్రంగా కనీస స్థాయిలోనే ఉంటుంది. దృష్టిహీనులు స్వయంకృషిపై ఆధారపడటం అలవర్చుకున్నప్పటికి, ఇతరులపై కొంతవరకు ఆధారపడవలసి ఉంటుంది.

ఇతరులపై ఆధారపడవలసి రావడం వికలాంగులలో న్యూనతా భావం కలిగిస్తుంది. ఇతరులకు చులకనభావం కలుగుతుంది. అయినా వీరు కుటుంబానికి మాత్రం భారం కారు.

మరొకరకం శారీరక వికలాంగులు. నరాలు, కండరాలు చచ్చుబడి పోయి, కదలలేని స్థితిలో ఉన్నవారు. మానసికంగా పరిపూర్ణంగా ఉన్నప్పటికి కదలలేక ప్రతిచిన్న పనికి ఇతరులపై కుటుంబంపై. ఆధారపడవలసి రాడం వలనవీరిలో తమపై తమకు అసహ్యం కలగవచ్చు. తమ జీవితాలకు ఒకప్రయోజనం లేదనే భావం కలగవచ్చు. తాము కుటుంబంపై మోయలేని భారం అనేభావం అశక్తులలోను, వీరు తమపై మోయలేనిభారం అని కుటుంబం భావించే స్థితి ఎదురుకావచ్చు.

మానసిక వికలాంగులు మరో కోవకు చెందినవారు. మనస్సు వయసుకు తగినట్లుగా ఎదగక పోవడంతో వీరిలో తెలివి తక్కువగా ఉంటుంది. ఈ స్థాయిని బట్టి మానసిక వికలాంగులు తమ కనీస అవసరాలను కొంతవరకైనా తాము చూచుకోగలరా. ఇతరులు పూర్తిగా వారి సంరక్షణ బాధ్యత వహించాలా అనే విషయంపైన ఆధారపడి ఉంటుంది. 0-25 స్థాయిలో . IQ ఉన్నవారు తమ పనులు ఏ విధంగానూ చేసుకోలేని వారు, 25-45స్థాయిలో ఉన్నవారు తమ పనులను కొంతవరకు చేసుకోగలరు. నిజానికి శిక్షణ అభ్యాసం ద్వారా పరిస్థితిని మరింతగా మెరుగు పర్చవచ్చు అని ప్రఖ్యాత న్యూరో మెడిసిన్ ఆచార్యులు డాక్టర్ వివేకానందమైత్రీ అభిప్రాయం.

ఇటువంటి స్థితిలో శారీరకంగా ఎదిగినా లోకజ్ఞానం శూన్యమైన ఈ వికలాంగులను ఇతరుల రక్షణలో వదిలి వెళ్లడం ప్రమాదాలకు దారితీయవచ్చు. కుటుంబవైఖరిని ఈ భావన ప్రభావితం చేస్తుంది.

"మా అమ్మాయికి 15 సంవత్సరాలు. తెలివి ఒక సంవత్సరం పిల్లతో సమానం. ఆయాలపై వదిలి వెళ్లాలంటే భయం. బదిలీలకు భయపడి ప్రమోషన్లు వదులుకున్నాం" అని వివరించారు కలకత్తాకు చెందిన ఓ బ్యాంకు ఆఫీసర్ దంపతులు ప్రశాంతపాల్, రేణుపాల్. ఈ విధమైన వైఖరి ఉన్నవారు చాల కొద్దిమంది మాత్రమే. ఎంతో గొప్పగా త్యాగం చేయవలసి ఉంటుందన్న అభిప్రాయం అనేకమందిలో ఉంటుంది. లాభనష్టాల బేరీజు వేస్తుంటారు.

అటువంటి పిల్లలకు ఆశ్రయమిచ్చి, వారి బాగోగులు చూచే స్వచ్ఛంద సంస్థలుంటే బాగుండు. ఎంత ఖర్చయినా పరవాలేదు అనే భావం ఉండేవారు కొందరు. రోజూ వారి పోషణ సమస్య ఉండదు గదా! వీరందరికి తమ పిల్లల పట్ల అపారమైన ప్రేమ ఉంటుందనడంలో సందేహం లేదు. వాస్తవ పరిస్థితుల ప్రభావం వలన వారిని దూరంగా ఉంచాలన్న నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. ఈ అశక్తులైన పిల్లలు తమ యీడు పిల్లలతో కలిసి తిరగలేకపోవడం. వారి పాఠశాలలకు వెళ్లలేక పోవడం, వీరి కోసం ప్రత్యేక శిక్షణ సంస్థలు అవసరమైనన్ని లేకపోవడం. తదితర కారణాలవలన ఇటువంటి నిర్ణయం అయిష్టంగానే అయినా, మార్గాంతరంలేక, తీసుకోవలసి వస్తుంది.

### 17.3.2 సమాజవైఖరి

వికలాంగుల అశక్తతకు వారు కారణంకాదు. పుట్టుకతోనో, పుట్టిన కొద్ది కాలానికో. తమ ప్రమేయం లేని కారణాల వలన, మరెవరి అజ్ఞానం వల్లనో ఇది వారికి వచ్చింది.

BRAOU

ఇటువంటి అశక్తులను చూచి మంచిమనసు, ఆర్ద్రభావం కలవారు జాలిపడి, దయతలిచి చేయూత నివ్వడానికి పూనుకుంటారు. బిచ్చం వేయడం వంటిదేకాని, వారిలో స్వశక్తిపై ఆధారపడాలన్న భావానికి దోహదం చేయదు. నిజానికి కొందరు ఇటువంటి 'బిచ్చం' పట్ల నిరసన వ్యక్తంచేస్తారుకూడా. 'మాకు కావలసింది అవకాశాలు. బిచ్చంకాదు. ఇదీ వారి భావం. ఈ అభిప్రాయాన్ని సమాజం గౌరవించడం సబబు. అయితే సమాజంలో సాధారణంగా వ్యక్తమయ్యేది జాలి. దయ మాత్రమేగాని, అవగాహన, గౌరవ భావంకాదు.

బస్సులో వికలాంగులకు కేటాయించిన సీట్లలో ఖాళీచేసి యివ్వడం మనస్ఫూర్తిగా చేసేవారు ఎందరు? విధిలేక. ఇతరుల మాటలకు జడిసి ఖాళీచేయడమే పరిపాటి అనిపిస్తుంది.

**అభ్యాసం - 1 : వికలాంగులంటే ఎవరు?**

.....................................................................................................................................................

.....................................................................................................................................................

.....................................................................................................................................................

.....................................................................................................................................................

.....................................................................................................................................................

## 17.4 వికలాంగులూ సాధారణ పౌరులే

BRAOU

భారతరాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ సమాన అధికారాలు, హక్కులు లభిస్తాయి. చట్టపరమైన హక్కుల మాట ప్రక్కకు నెట్టినా, అసలు వారిని సమానంగా చూడటం మానవధర్మం. శారీరకంగా, మానసికంగా మిగతావారికంటె కొంత తక్కువ శక్తివంతులను 'శక్తిహీనులనడం సరికాదేమో'. వారు ఈ దేశపౌరులే. ఈ దేశప్రగతి ఫలితాలను అనుభవించడంలో వారికీ సమాన హక్కులుంటాయి. వీటిని స్వయంగా ఇతరుల ప్రమేయం లేకండా ఈ అశక్తులు అనుభవించలేకపోతున్నారు. వీరికి చేయూత నివ్వవలసిన బాధ్యత సమాజంపై ఉంచింది మానవ ధర్మం, మన రాజ్యాంగ చట్టం.

పౌరులుగా వీరికి సమాన స్థాయి కల్పించడమేగాక, వీరిలోని అశక్తతను గుర్తించి, వారూ ఇతరులతో సమానంగా అవకాశాలు వినియోగించుకొనడానికి వీలుగ కొన్ని ప్రత్యేక రాయితీలు కల్పించాలని కూడా చట్టం నిర్దేశిస్తున్నది. సమాజంలో బలహీనులైన విద్యా, సామాజిక పరిస్థితుల దృష్టిలో షెడ్యూల్డు కులాలు, తెగలు, మొదలైన వారికి లభించిన విధంగా, వీరికి కొన్ని రాయితీలు కల్పించింది. ప్రభుత్వం విద్యాసంస్థలు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు, ప్రత్యేక ఉపాధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ఈ కోవకు చెందినవి.

### 17.4.1 జీవించాలన్న పట్టుదల

వికలాంగులలో, అశక్తతను అధిగమించి, జీవించాలన్న పట్టుదల చాల బలంగా ఉంటుంది. హెలెన్‌కెల్లర్, సూరదాస్, ద్వారం వెంకటస్వామి నాయుడు, మారెళ్ల కేశవరావు, మండాబల రామశాస్త్రి, బీతోవెన్, సుధాచంద్రన్, సతీష్ గుజ్రాల్.

రవీంద్రజైన్ ఎస్. జయపాల్‌రెడ్డి, ఎన్. గోపాలశాస్త్రి వంటివారు వారి అశక్తతను అధిగమించి జీవితంలో ఉన్నతస్థానాలకు ఎదగడం దీనికి చక్కటి ఉదాహరణ. అంగవైకల్యం అనే భావన వీరి కృషిని క్రుంగదీయలేకపోయింది. నిజానికి వారిలో పట్టుదల పెరిగి, ఈ అశక్తతను అధిగమించి ఉన్నత శిఖరాలనందుకున్నారు. తమవంటి వారికేకాదు అందరికీ ఆదర్శమూర్తులై మార్గదర్శకులయ్యారు.

ఉన్నత శిఖరాలనందుకున్న వీరిమాట అటుంచితే తమ అశక్తతను అధిగమించి ఉన్నంతలో ఏదో విధంగా జీవించాలన్న ఆకాంక్ష, పట్టుదల ఉన్నవారు మనకు నిత్యం కన్పిస్తూనే ఉంటారు. తమ తమ శక్తియుక్తులు, పరిసరాల ప్రభావం లభించే అవకాశాలు,సమాజం యిచ్చే ప్రోత్సాహం ఆధారంగా వీరి కృషి, ప్రయత్నాలు, ఫలితాలు ఉంటాయి.

ఇటీవలి కాలంలో రాజ్యాంగ చట్టాలు, సామాజిక సంప్రదాయాలు వికలాంగులకు కల్పించిన హక్కులు, అవకాశాలు, రాయితీలు సరిగా అమలు జరగడానికి, వికలాంగులను సంఘటిత పర్చి ఆందోళన. ఉద్యమాలను నిర్వహిస్తున్న నాయకులు కొందరు. వికలాంగుల సమస్యల పట్ల సామాజిక స్పృహకలిగించి, వారికి న్యాయంగా చెందవలసినవి దక్కించడానికి కృషిజరుగుతున్నది.

ఈ వికలాంగులలో అశక్తతను అధికమించి, గౌరవ ప్రదంగా జీవించాలన్న కోరిక పట్టుదల, తోటివారికి ప్రయోజనాలను సమకూర్చే యత్నం ఇది. విద్యాసంస్థలలో కొన్ని రకాల ఉద్యోగాలలో కొంతశాతం వరకు రిజర్వేషన్లు కల్పించడం ఇటువంటి సంఘటిత శక్తి ప్రదర్శన ఫలితమే.

### 17.4.2 సమాజ బాధ్యతలు

సమాజంలో వికలాంగులు జన్మించడం, తర్వాత వికలాంగులవడంసృష్టి ప్రారంభం నుండీ ఉన్న విషయమే ననవచ్చు. అలాంటి వారి సహాయం, పునరావాసం కూడా బహుశా జాలితలచినవారు చేసేవారు. చికిత్స, చేయూత నిచ్చేవారు.

ఇటీవలి కాలంలో ప్రపంచ దేశాలో ఏహోకొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు కార్యక్రమాలను చేపట్టి నిర్వహిస్తున్నప్పటికి విస్తృతమైన వ్యవస్థా పరమైన ఏర్పాట్లు ప్రారంభమై కొద్దికాలమే అయిందనవచ్చు. ప్రజల విరాళాలతో స్వచ్ఛంద సస్థలు నామమాత్రమైన నిధులతో ప్రభుత్వం కొన్ని కార్యాక్రమాలనూ నిర్వహిస్తుండేవి. వీటి మధ్య సమన్వయం కాని స్వచ్ఛంద సస్థలకు పరిపూర్ణమైన ప్రభుత్వం సహాయం కాని లేదు. నిజానికి వికలాంగుల సంక్షేమం కొరకు నిర్దిష్టమైన విధానం ఒకవిధంగా లేదనవచ్చు.

భారతదేశ జనాభాలో సుమారు 3శాతం ఏదోఒక రకమైన అంగవైకల్యంతో ఉన్నవారంటే వీరి సంక్షేమంకొరకు బృహత్తరమైన కార్యక్రమం అమలు జరపవలసిన అవసరం ఉంది. వీరిలో నాలుగింట మూడు వంతుల మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. దీనితో ఈ విషయం మరింత జటిలం అవుతున్నది. ఎన్నోగ్రామాలలో నివసిస్తుండటం ప్రజలు నిరక్షరాస్యులుకావడంతో వీరికొరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంలేదు.

దృష్టిహీనులు, బధిరులు, మానసిక వికలాంగులు, కాలు, చెయ్యి లేనివారు అని నాలుగు రకాల వికలాంగులను గుర్తించారు. కాని వీరి విద్యా విధానాలు, శిక్షణ పద్ధతులు, పునరావాస సౌకర్యాలు భిన్నంగా ఉంటాయి. వీరిలో కొందరు మామూలు విద్యాసంస్థలలో, మిగతా విద్యార్థులతో కలిసి చదువుకోగలిగిన మానసిక వికలాంగులు దృష్టి హీనుల విషయంలో

BRAOU

బధిరుల విషయంలో అనేకసమస్యలు ఎదురౌతున్నాయని అనుభవంలో గ్రహించిన విషయం కనుక ఆయా వర్గాలవారికి ప్రత్యేక సంస్థలను నెలకొల్పారు. వారి వారి శక్తిని దృష్టిలో ఉంచుకొని వికలాంగులకు తగిన వృత్తులలో శిక్షణయిచ్చే సంస్థలను నెలకొల్పారు.

వికలాంగుల సంక్షేమకార్యక్రమాల అమలుకై ప్రత్యేక శ్రద్ధ వహించే ఉద్దేశ్యంతో వివిధ రాష్ట్రాలలో ప్రత్యేక డైరెక్టరేటులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థలు ద్వారా అమలు జరిగే కార్యక్రమాలను సమన్వయం చేయడం ఈ కార్యాలయ బాధ్యత. వికలాంగుల విద్య, శిక్షణ పునరావాస కార్యక్రమాలకై ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక కార్పొరేషన్‌లను కొన్ని రాష్ట్రాలు ఏర్పాటు చేశాయి.

వికలాంగుల కొరకు ప్రభుత్వ ఉద్యోగాలలో కింది స్థాయిలో కొంతశాతం ఉద్యోగాలను వికలాంగులకై చట్టరీత్యా ప్రత్యేకించారు. విద్యాసంస్థలలోనూ ఈ రిజర్వేషన్లు ఉన్నాయి. వికలాంగులకై కేటాయించిన ఖాళీలను భర్తీ చేయడానికి ప్రత్యేక ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజిలను నెలకొల్పారు. సంక్షే పథకాలను ప్రభుత్వ సంస్థలు అమలు జరుపుతున్నప్పటికి, స్వచ్ఛంద సంస్థలకు ఇందులో ప్రముఖస్థానం కల్పించి, ఉదారంగా గ్రాంట్లు యిస్తున్నారు. రైళ్లు, బస్సులలో ప్రయాణ చార్జీలలో రాయితీలు యిస్తున్నారు.

ఇవన్నీ వికలాంగులపట్ల దయతలిచి యిస్తున్నవికాదు. వారికీ సమాజాభివృద్ధి ప్రయోజనాలను అనుభవించే హక్కు ఉన్నదన్న గుర్తింపుతో ఈ ప్రత్యేక సౌకర్యాలను సమకూరుస్తున్నారు.

వికలాంగులలో ప్రతిభావంతులను, వికలాంగుల సంక్షేమంకొరకు కృషిచేస్తున్న వ్యక్తులు, సంస్థలను ప్రభుత్వం సత్కరిస్తున్నది.మార్చినెలలో జరిగే ప్రపంచ వికలాంగుల దినోత్సవ సందర్భంగా ఈ బహుమతులు యిస్తుంటారు. ఒకవైపు వికలాంగులు స్వయంకృషిపై ఆధారపడి , వారి సంక్షేమం కొరకు అమలు జరుగుతు్న వివిధ పథకాల ద్వారా ప్రయోజనం పొందే విధంగా ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం. మరోవైపు, వికలాంగుల సంక్షేమం సమాజబాధ్యత అని గుర్తుచేస్తూ, ఈ రంగంలో గణనీయంగా సహాయంచేసిన వారిని గౌరవించి, తద్వారా ఇతరులను ప్రోత్సహించడానికి ఉద్దేశించినది. దేశజనాభాలో సుమారు 3శాతం మంది ప్రజలు, ఏదోఒక విధమైన అశక్తతకు గురిఅయినవారు. వీరి సంక్షేమం కేవలం ప్రభుత్వం వల్లనే సాధ్యంకాదు. మరింతగా స్వచ్ఛంద సంస్థలను ఈ సంక్షేమ పునరావాస కృషికి ప్రోత్సహించడానికి ఈ పథకం సహాయపడుతుంది.

BRAOU

### 17.4.3 శిక్షణ సౌకర్యాలు

వికలాంగుల అశక్తతలను దృష్టిలో ఉంచుకొని వారి విద్య, వృత్తి శిక్ష ప్రత్యేక కోవకు చెందినవనవచ్చు. ఉదాహరణకు అంధులకు విద్య నేర్పడానికి బ్రెయిలీ లిపిలోనే బోధించాలి. చెవిటివారికి సంజ్ఞలద్వారానే బోధించాలి. మూగ చెవిటివారికి మాట్లాడే వినే శక్తిని పెంపొందించడానికి కృషిచేయాలి. కాలు చెయ్యి లోపించిన వారికి తమ అశక్తతను అధిగమించడానికి మెళకువలు నేర్పాలి. ఫిజియో థెరపీద్వారా కాళ్లు చేతులు స్వాధీనంలోనికి తీసుకు రావడం సాధ్యపడవచ్చు. మానసిక వికలాంగులలో మెదడులో నిద్రాణమై ఉన్న కణాలను జాగృతం చేయగలిగితే వారి కర్మేంద్రియాలుచేసే పనులలో సమన్వయం మెరుగు పడవచ్చు. ఇలాంటివే మరెన్నో.

ఇవన్నీ వికలాంగులకు ఉద్దేశించినవి. అయితే ఆయా రంగాలలో వికలాంగులకు తోడ్పడి, శిక్షణయిచ్చే

ఉపాధ్యాయులను తయారుచేసే శిక్షణ కార్యక్రమాలుకూడా అవసరం. కీలకమైనవి. వీరి శక్తి అనుభవం. అంకితభావం ద్వారానే వికలాంగులు ప్రయోజనం పొంది, తమ అశక్తతను అధిగమించడానికి కృషిచేయగలరు.

ఇక మూడవది వికలాంగులున్న కుటుంబాలలో వారు ఏ విధంగా సహాయం చేయగలరు అనేది. ఇంటి దగ్గర అనుకూల వాతావరణం సృష్టించి వికలాంగులలోని మంచిని ప్రోత్సహిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కుటుంబ సభ్యుల బాధ్యత. ఇందుకై వారి వైఖరిలో మార్పు తీసుకురాగల శిక్షణ అవసరం. నిజానికి మొదటి రెండు రకాల శిక్షణ ద్వారా ప్రయోజనం పొందడానికి పునాది ఇంటిదగ్గరవాళ్లే కారణం. ఈ మూడు రకాల శిక్షణలు మూడు రకాల వ్యక్తుల కొరకు ఉద్దేశించినవి. మొదటిది వికలాంగులకు, రెండవది వికలాంగులకు శిక్షణయిచ్చే బోధకులకు, మూడవది కుటుంబసభ్యులకు.

ఈనాడు ప్రధానంగా మూగ చెవిటి వారికి శిక్షణ, వారికవసరమైన పరికరాల తయారీ మానసిక వికలాంగుల పునరావాసం, దృష్టిహీనుల ఉపాధ్యాయుల శిక్షణ, ఎముకలు, నరాల లోపం వలన అంగవైకల్యం పొందిన వారి పునరావాసం, వివిధ రాల అశక్తుల పునారవాసం వంటి రంగాలలో ఈ శిక్షణ కార్యక్రమాలను ప్రమాణీకరించి సర్టిఫికేటు యిస్తున్నారు. ఇలాంటివి 50 శిక్షణ కోర్సుల గుర్తించారు. దేశంలో సుమారు 50 శిక్షణ సంస్థలలో ఈ సిబ్బంది శిక్షణ సౌకర్యాలు లభిస్తున్నాయి.

ఎముకల సంబంధమైన వికలాంగులను కలకత్తాలోను, చెవిటివారికి ఆలీయవార్‌జంగ్ పేరున బొంబాయిలోను, మానసిక వికలాంగులకొరకు సికింద్రాబాదులోను, అంధులకై డెహ్రాడూన్‌లోను జాతీయ సంస్థలు వివిధ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నాయి. వికలాంగుల పునరావాస రంగంలో ఈ నాలుగు జాతీయ సంస్థల కార్యక్రమాలను భారత ప్రభుత్వం సంక్షేమశాఖ సమన్వయ పరుస్తున్నది.

### 17.4.4 సాధనాల తయారీ

వికలాంగుల పునరావాస కార్యక్రమంలో, వారి అశక్తతను అధిగమించడానికి తోడ్పడే కృత్రిమ అవయవాలు. సాధనాలు తయారీ ప్రముఖ స్థానం ఆక్రమిస్తుంది. దృష్టిహీనులు నడిచివెళ్లడానికి దాని వెతుక్కోడానికి తోలుత బెత్తం ఉండేది. కాలు లేనివారు నడవడానికి ఊతం కర్రలు, లేక కొయ్యకాళ్ళు ఉండేవి. మొదటి దశలో ఇవే సాధనాలు. అయితే శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన ప్రగతి ద్వారా ఈ సాధనాలను మెరుగు పర్చడానికి తేలికైన గట్టి పదార్థాలతో తయారుచేయడానికి కృషి జరిగింది. రోజురోజుకు ఈ కృషి కొనసాగుతూనే ఉంది. ఈనాడు తేలికయిన కొయ్య, అల్యూమినియం. స్టెయిన్‌లెస్‌స్టీలు, పి.వి.సి. చర్మం, మొదలైన పదార్థాలను అమరుస్తున్నారు. తెగిపోయిన చేతులకు బదులు కృత్రిమ అవయవం అమర్చి. చేతులు చేసే పనులను చేయడానికి అవకాశం కల్పించారు.

ప్రపంచ యుద్ధాలలో అధిక సంఖ్యలో సైనికులు వికలాంగులు కావడంతో వారి పునరవాస కృషిలో భాగంగా పునాలోని సైనిక వైద్యదళం ఈ రంగంలో విశేష పరిశోధనలు ప్రారంభించింది. మొదట సైనిక వికలాంగుల కొరకు ఉద్దేశించిన ఈ కృషి క్రమక్రమంగా పెరిగిపోతున్న వికలాంగుల సంఖ్య, కృత్రిమ అవయవాలకై పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం కృత్రిమ అవయవాల తయారీ కార్పొరేషన్‌ను స్థాపించింది. ఈ సంస్థ తన శాఖలద్వారా ఉత్పత్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఇదే విధంగా వివిధ రాష్ట్రాలలో అనేక స్వచ్ఛంద సంస్థలు కూడా కొన్ని అవయవాలను ఉత్పత్తి చేస్తున్నాయి. పరిశోధనలఫలితంగా జైపూర్‌లోని భగవాన్ మహవీర్ వికలాంగ్ సంస్థాన్‌లో డాక్టర్ ఎస్.ఆర్. మెహతా రూపొందించిన 'జైపూర్ ఫుట్' అమర్చుకున్న వికలాంగులు మామూలు నడక మాత్రమేగాక, గంతులు వేయడం, శాస్త్రీయనృత్యం కూడా చేయగలుగుతున్నారంటే ఈ రంగంలో సాధించిన ప్రగతిని ఊహించుకోవచ్చు.

BRAOU

నేత్రహీనులు చదువు కొనడానికి బ్రెయిలీ లిపి రూపొందించిన తర్వాత ఈ లిపిలో పుస్తకాలు అచ్చువేస్తున్నారు. 1951లో డెహ్రాడూన్‌లో జాతీయ అంధుల శిక్షణ, పునరావాసం సంస్థలో బ్రెయిలీలో పుస్తకాలు తయారువుతున్నాయి. ఎలెక్ట్రానిక్ పరికరాల కూర్పు, టెలివిజన్ వంటి వాటి కూర్పు, షార్ట్‌హాండ్,పేము అల్లకం వంటి వృత్తులలో అంధులకు శిక్షణ యిస్తున్నారు. అమెరికాలో తయారు చేసిన ఒక సాధనం రాసిన కాగితాలను ఉంచితే, దానిని చదివి వినిపించ గలుగుతుంది. ఇటువంటి సాధనం అంధులకు అందుబాటులో ఉంటే వారి విద్యాబోధన, ఉద్యోగ విధినిర్వహణ మొదలైన రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. వివిధ భాషలలో బ్రెయిలీ పుస్తకాలు అచ్చువేసే కేంద్రాలు దేశంలో అనేకచోట్ల ఉంటాయి.

వికలాంగుల చలన శక్తిని పెంపొందించేసాధనం చక్రాలకుర్చీ. మొదట్లో చేతులతో, తర్వాత సైకిలు చెయిను ద్వారా పనిచేసే సాధనం కాలక్రమంలో మోటారు వాహనంగా రూపొందిచారు. మోపెడ్లు ప్రత్యేక ఏర్పాట్లు గల కార్లు వచ్చాయి. సామాన్యులకు కూడా అందుబాటులో ఉండగల చక్రాల కుర్చీ, వాహనం వికలాంగుల చలన శక్తిని పెంచి ఇతరులపై ఆధారపడవలసిన అవసరాన్ని ఎంతగానో తగ్గిస్తుంది. తక్కువ ఖర్చుతో ఇటువంటి సాధనాలను రూపొందించగల పరిశోధన అభివృద్ధి కృషి నిర్వహించడానికి ఢిల్లీలో ఇండియన్ స్పైనల్ ఇంజరీస్ సెంటర్‌ను నెలకొల్పారు. ఈ సాధనాలను ఉపయోగించే వికలాంగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీటిలో మార్పులు చేస్తారు.

ఢిల్లీలోని సెంట్రల్ ఎలెక్ట్రానిక్స్ ఇంజనీర్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్‌లోనోటి మాటలతో చేసే ఆదేశాలను ఆకళించుకొని అమలు చేయగల ఒక చక్రాలకుర్చీని రూపొందించారు. ముందుకు, వెనుకకు, ప్రక్కలకు కదలివెళ్లగల సౌకర్యం ఉంది. త్వరలోనే ఇలాంటివి మార్కెట్‌లో లభ్యం కాగల అవకాశం ఉంది.

ఇదే విధంగా బెంగుళూరు, బొంబాయిలలోని బధిరుల పునరావాస శిక్షణ సంస్థలు వారికి పనికివచ్చే సాధనాలను రూపొందించడంలో వాటిని మెరుగు పర్చే కృషిలో నిమగ్నమై ఉన్నాయి.

ప్రభుత్వ సంస్థలే గాక, స్వచ్ఛంద సంస్థలు కూడా ఎన్నో ఈ రంగంలో కృషి చేస్తున్నాయి.

BRAOU

## 17.5 వికలాంగులపై రచనల లక్ష్యాలు

ఈ భాగంలో ఇప్పటివరకు వికలాంగులను గురించి వారి మనోభావాలను గురించి వారిని గురించి సమాజం ఏ విధంగా వ్యవహరిస్తున్నది, వికలాంగుల సంక్షేమం కొరకు అమలు జరుగుతున్న వివిధ కార్యక్రమాలను గురించి స్థూలంగా తెలుసుకున్నాం. వికలాంగులపై రచనలు ఎవరిని ఉద్దేశించి చేసేది కూడా చర్చించుకున్నాం.

రచనల ప్రత్యేకత ఏమిటి? ఏ ప్రయోజనాలు ఆశించి ఈ రచలు చేస్తారు? మరి ఈ రచనలలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి పరిశీలించడం అవసరం.

ఈ రచనలను ప్రధానంగా మూడు వర్గాలను దృష్టిలో ఉంచుకొని చేస్తారని ఇంతకు ముందు తెలుసుకున్నాం. వికలాంగులు, వికలాంగులున్న కుటుంబాలు, సమాజం వీరిని ఉద్దేశించి రచనలు చేయాలి. అయితే ఈ మూడు సాధించే ప్రయోజనాలు భిన్నంగా ఉంటాయి. కనుక వీటి లక్ష్యాలు, రచనా విధానం భిన్నంగా ఉంటాయి.

వికలాంగులలో తాము అశక్తులమని ఇతరులతో పోటీ పడలేమని ఒక విధమైన నిస్పృహ, న్యూనతాభావం ఉంటే

ఆశ్చర్యపడనవసరంలేదు. కనుక తమరచనలద్వారా వికలాంగులో ఇటువంటి అభిప్రాయాలను పోగొట్టి, వారిలో ఆత్మవిశ్వాసం మెరుగైన జీవితం గడపాలన్న పట్టుదల, ఇందుకొరకు గట్టి కృషి చేయాలన్న దృఢ నిశ్చయం కలిగించాలి. వికలాంగులకై వికలాంగులను ఉద్దేశించి చేసే రచనలకు ఇది ప్రధాన లక్ష్యం. విజయం సాధించిన వికలాంగు విజయగాధలకు, వికలాంగులలో మంచి లక్షణాలను ప్రాధాన్యమిచ్చే శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధిస్తున్న ప్రగతి, ప్రభుత్వం, సమాజం అమలు పరుస్తున్న సంక్షేమకార్యక్రమాలకు రచనలలో ప్రాధాన్యమివ్వాలి.

ఇక రెండవ రకం రచనలు వికలాంగులున్న కుటుంబాలను ఉద్దేశించినవి. వికలాంగుల జననం పాపమూ, శాపమూ కాదు అందులో వారి బాధ్యత లేదు అనే సత్యం ఈ కుటుంబాలవారు గుర్తించాలి. సమాజంలో వారూ సమానపౌరులే గనుక, వారికి కుటుంబంనుండి ప్రేమ ఆదరం లభించాలని, వారిని తక్కువగా చూడటం సమంజసం కాదని వారు గుర్తించాలి. ఒక విధంగా శక్తిలోపించినప్పటికి వారికి చేయూతనిచ్చి, వారి ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించగలిగితే వారూ సమాజంలో ప్రయోజన కరమైన పౌరులుగా, గౌరవప్రదంగా జీవించగలరన్న విషయం కూడా వీరు గుర్తించాలి. ఈ అభిప్రాయాలను ప్రాధాన్యమిస్తూ, ఈ కుటుంబాలను ప్రోత్సహించి వారి వ్యవహార ధోరణిలో గుణాత్మకమైన మార్పు తీసుకురావడం ఈరకం రచనల ముఖ్యోద్దేశ్యం.

భిన్నభిన్నమైన అంగవైకల్యం కలవారికి వివిధమైన సమస్యలుంటాయి. వీటిని సమాజపరంగా ఒక బాధ్యతగా గుర్తించి పరిష్కరించడం అవసరం. వికలాంగులు పట్ల, వారి అశక్తత కారణంగా వారిని చిన్నచూపు చూడటం మానవతకు మచ్చ. వారిపై జాలితలచడం కంటె, వారికి వారి స్వశక్తిపై ఆధారపడటానికి అనువైన విధంగా చేయూత నివ్వడం అవసరం. ఇటువంటి వైఖరిని సమాజంలోతీసుకురావడం రచయితల లక్ష్యం. ఇదే వారి రచనలలో ప్రతిబింబించాలి.

తాము అశక్తులము అనే భావం మనసులో అంతర్లీనంగా ఉన్న వికలాంగులకు కష్టం కలిగించేమాటలు రచనలలో చోటు చేసుకోకూడదు. కుంటివాడు, గుడ్డివాడు అనే మాటలు వారి అశక్తతను వివరించేవే. చిరకాలంగా వాడుకలో ఉన్నవే. అయితే ఈ పదాలు తమనుకించపరిచేవిగా వారు భావిస్తుంటారు. వీరిని శారీరక వికలాంగులు, దృష్టిహీనులు అనడం వారికి నచ్చుతుంది.

కొన్ని రకాల అంగవైకల్యం కూడా నిరోధించవచ్చు. ఉదాహరణకు చిన్నతనంలోనే శ్రద్ధతీసుకుంటే చూపు పూర్తిగా నశించిపోకుండా జాగ్రత్త పడవచ్చు. అదే విధంగా వినేశక్తి, తగిన శస్త్ర చికిత్సలు చేస్తే కాళ్లు చేతులు స్వాధీనంలోకిరావచ్చు.

ఆరోగ్య సూత్రాలను జాగ్రత్తగా పాటిస్తే పోలియో వంటి వాటి ద్వారా అంగవైకల్యం నివారించవచ్చు.

ఐక్యరాజ్య సమితి 1980లో ఆమోదించిన ఆల్మాఆటా ప్రకటన 2000నాటికి అందరికీ ఆరోగ్యంలో ప్రధాన అంశం ఇదే అంటే ఆరోగ్య సేవలను విస్తృతపర్చడం, వాటిని ప్రజలందరూ వినియోగించుకొనేట్లు ప్రోత్సహించడం నివారించ తగిన వైకల్యంతో వాటిని జతచేసి ప్రజలను హెచ్చరిచడం ఈ రచనల్లో ఉండాలి.

శాస్త్ర సాంకేతిక రంగాలలో రోజురోజుకు సాధిస్తున్న ప్రగతిని అంగవైకల్య ప్రభావం తగ్గించడానికి తద్వారా వికలాంగులు జీవితాలు గుణాత్మకంగా మెరుగు పడటానికి తోడ్పడాలి. ఈ కృషికి విశేష ప్రాచుర్యం కల్పించి, వాటి వలన ప్రయోజనం పొందడానికి వికలాంగులను, సమాజాన్ని ప్రోత్సహించడం మరో ముఖ్యమైన ఆశయం. స్వశక్తితో విజయాలు సాధించిన వికలాంగులు, వికలాంగులకు చేయూతనిచ్చిన సంస్థలను గురించి ప్రచారం చేయడం ఇతరులకు ఆదర్శ ప్రాయంగా ఉంటుంది.

BRAOU

## 17.6. నమూనా - వర్గీకరణ

ఇంతవరకు మనం పరిశీలించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని మనం చేసే రచనలను, వాటినుండి ఆశించే ప్రయోజనాలను బట్టి కింది విధంగా వర్గీకరించవచ్చు.

1. వికలాంగులను ఉద్దేశించినవి. వారిలో ఆత్మస్థైర్యం పెంపొదించడానికి తమ జీవితాలనుగుణాత్మకంగా మెరుగు పర్చుకొనే కృషితో వారికి చేయూత నివ్వడం, వికలాంగుల సంక్షేమం కొరకు జరుగుతున్న కృషి, ప్రభుత్వం కల్పించే రాయితీలు, హక్కులు, అవకాశాలు, అంగవైకల్యాన్ని అధిగమించడానికి శాస్త్ర సాంకేతిక రంగాలలో ప్రగతి మొదలైన అంశాలను ఈ రచనలలో స్పృశించవచ్చు.

2. వికలాంగుల కుటుంబ సభ్యులను ఉద్దేశించినవి. వికలాగుల జీవిత పోరాటం కటుంబంతోనే ప్రారంభమౌతుంది. కనుక వికలాంగుల ఆత్మస్థైర్యం కుటుంబంలోనే ముందుగా వేళ్లూనినవి. జీవితపోరాటంలో వికలాంగులకు ఇంటిలోనే చేయూత లభించాలి. వికలాంగుల జన్మ పాపఫలితమో, శాపఫలితమో అనేభావం మోయలేని బరువు అనే ఆలోచన పోయి, వాటి స్థానంలో అశక్తులైన వారిని కూడా మిగతా వారితో వీలయినంతవరకు సమానస్థాయికి తీసుకురావడానికి కృషిజరగాలి. ఇది తోటివారు, సమాజం వైఖరిలో మార్పుద్వారా సాధ్యమౌతుంది. ఈ మార్పును తీసుకురావడానికి తోడ్పడే రచనలను ఈ కోవలో చేర్చవచ్చు.

3. సమాజంలో వికలాంగుల పట్ల సోదరభావం పెంపొందించడం, వారు కూడా ఇతర పౌరులతో సమానంగా చట్టపరంగా లభించిన హక్కులు, అవకాశాలను అనుభవించగలగడంలో తోడ్పడాలి. వికలాంగులపట్ల దయ, జాలి వంటి విధానానికి బదులు, అవగాహన, గౌరవం పెంపొందాలి. సమాజంలో ఈ విధమైన మార్పు తీసుకురావడానికి తోడ్పడే రచనలు రావాలి. చేసేకృసి చేపట్టాలి.

ఈ రకాలైన రచనలలో కొన్ని నమూనాలను చూద్దాం. వీటిలో కొన్ని ఏదో ఒక వర్గం వారిన ఉద్దేశించి, ఒక ప్రయోజనం ఆశించి వ్రాసినప్పటికీ వాటి ప్రభావం ఇతర వర్గాలపైకూడా ఉంటుంది.

### 17.6.1 దృష్టిహీనులకు ఆశాకిరణం

ఇప్పుడు దృష్టిహీనులకు రెటీనా మార్పిడి ద్వారా తిరిగి దృష్టి ప్రసాదిస్తున్నారు నేత్రవైద్యులు. కనుకనే చనిపోయినా జీవించి ఉండగలరు నేత్రదానం చేయడం మొదలైన నినాదాలు ఎన్నో రోజూ మనం వింటూనే ఉన్నాం.

తీవ్రవ్యాధి, మరేకారణం వలనకానీ కన్ను బాగు చేయడానికి వీలులేనంతగా చెడిపోతే అంధత్వం వస్తుంది ఆప్టిక్‌నర్వ్. మెదడులో దృష్టికి సంబంధించిన భాగం (విజువల్ కార్టెక్స్) సరిగానే పనిచేస్తున్నప్పటికీ, చూపుపోతుంది.

ఏటా విశ్వవిద్యాలయం బయో ఇంజనీరింగ్‌శాఖ, మాంచెస్టర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లోని ఆప్టొమెట్రీ విభాగం సంయుక్తంగా చేస్తున్న కృషి ప్రస్తావించుకోవాలి ఇక్కడ. కళ్లద్దాలకు అమర్చిన ఒక ఆధునాతన వీడియో కెమెరావంటి పరికరం ద్వారా సరాసరి మెదడులోని విజువల్ కార్టెక్స్‌కు సంకేతాలు అందజేయాలనేది ఈ ప్రయత్నం. మెదడులో శాశ్వతంగా అమర్చిన సున్నితమైన ఎలెక్ట్రోడ్ల సహాయంతో ఇది పనిచేస్తుంది. వీటిద్వారా అందిన సంకేతాల ద్వారా దృష్టిహీనుడు కాంతిని చూడగల శక్తి పొందుతాడు.

ఇటువంటిదే మరో ప్రయత్నం మెసచ్యూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని వివిధ శాఖలు సంయుక్తంగా చేస్తున్నాయి. ఒక మైక్రోచిప్‌ను రూపొందించి, దానిని మెదుకు కాక రెటీనా ముందుభాగానికి అమర్చాలని ప్రయత్నం. అంధత్వం కలిగించే రెటీనా వ్యాధులవలన, ప్రధానంగా రెటీనా రార్స్, కోన్స్‌కు సంబంధించినవే. కంటిని మెదడుతో అనుసంధానం చేసే కణాలకు ఎలాంటి ప్రమాదం ఉండదు. కనుక ఈ సాధనం ద్వారా దృష్టిహీనుడు చూడగలుగుతాడని వీరి సిద్ధాంతం.

ఈ రెండు ప్రయత్నాలు విజయవంతమైతే అంధులు అశక్తతను అధిగమించడానికి ఎంతగానో తోడ్పడగలవని శాస్త్రజ్ఞుల విశ్వాసం.

ఈ వార్త అంధులకు ఎంతో ఆసక్తికరమైనది. అదే విధంగా సమాజం, కుటుంబంకూడా దీని వలన ప్రయోజనం పొందగలవు. ఇటువంటివే ఇతి వృత్తాలు విన్న మనకు కన్పిస్తాయి. వాటిని రచనాంశంగా ఎన్నుకొని రచనలు సాగించాలి.

### 17.6.2 విజయగాథలు

సంజయ్ భారత ప్రభుత్వ సమాచార శాఖలో ఉన్నతాధికారి, నిజానికి సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణుడై యోగ్యత ఆధారంగా ఉద్యోగం పొందిన మొట్టమొదటి వికలాంగుడు. 10 సంవత్సరాల వయస్సులో ఇతనికి వచ్చిన వ్యాధి (సూడో మస్కలర్ డిస్ట్రాఫీ) వలన కాళ్లు చేతులు చచ్చుబడిపోయాయి. కదలలేక పోయేవాడు. చివరకు చక్రాలకుర్చీలోకూచొని ఇంట్లో, తర్వాత బయటకు కదలడం ప్రారంభించాడు. అంటే తన అశక్తతపై పోరాటం ప్రారంభించాడు. "భారత ప్రభుత్వంలో ఉద్యోగం రావడంతో నా జీవితమే పూర్తిగా మారిపోయింది" అని సంజయ్ అంటుంటాడు. విజయం సాధించాలనన్నభావం ఆనందం అతనిలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. చక్రాల కుర్చీలో ఢిల్లీలోని శాస్త్రీభవన్‌లోని కార్యాలయానికి వస్తాడు. రెండున్నర సంవత్సరాలపాటు అమెరికాలోని భారత రాయబార కార్యాలయంలో 'ఇండియాన్యూస్' పత్రిక సంపాదకులుగా పనిచేశారు. 200పైగా వ్యాసాలు వ్రాశాడు సంజయ్.

గ్రూప్'ఏ' కేంద్ర సర్వీసులలో చేరి సంజయ్ ఒక చరిత్ర సృష్టించాడు. ఇప్పుడు అతని జీవితపోరాటం, ఆధారంగా దూరదర్శన్‌లో ఒక సీరియల్ 'జిందాదిల్' పేరున త్వరలో ప్రసారం చేయబోతోంది. దీనికి మాటలు సంజయ్ స్వయంగా వ్రాశాడు.

"వికలాంగులకు ఈ సీరియల్ ద్వారా నేను చెప్పదలచుకున్నది ఒకటే. మానవ అశక్తతను మనం మార్చుకోలేకపోవచ్చు.

**అభ్యాసం - 2 : మీ దృష్టికి వచ్చిన ఒక వికలాంగుని విజయగాథను రాయండి.**

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

................................................................................................................................................

BRAOU

## 17.7 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

- ★ సమాజంలో చిన్నచూపు చూడబడుతున్న వికలాంగుల కోసం రచనలు చేసేటప్పుడు ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకోవాలి.
- ★ మనం వాడే భాష వారి మనసును కష్టపెట్టేదిగా వుండగూడదు.
- ★ రచనలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా, తోటి వారికి స్ఫూర్తి కలిగించేలా వుండాలి.
- ★ పునరావాస కేంద్రాలు,స్వచ్ఛంద సంస్థల చిరునామాలు ఇస్తే మంచిది.

## 17.8 మాదిరి పరీక్షా ప్రశ్నలుః

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వికలాంగుల సంక్షేమం, పునరావాసంకొరకు భారత దేశంలో జరుగుతున్న కృషిని సమీక్షించండి.
2. వికలాంగుల పునరావాసరంగంలో స్వచ్ఛంద సంస్థల పాత్రను వివరించండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వికలాంగుల కొరకు విధానాన్ని వివరించండి.
2. మీకు తెలిసిన ఒక వికలాంగుని విజయగాథ.

**- గోవాడ సత్యారావు**

BRAOU

# భాగం - 18 : ప్రత్యేక సంచికలు అనుబంధాల కోసం రాయడం

## విషయక్రమం


18.0 ఉద్దేశం

18.1 ప్రవేశిక

18.2 ప్రత్యేక సంచిక, అనుబంధం అంటే ఏమిటి?

18.3 ప్రత్యేక వ్యాసం - నిర్వచనం - లక్షణాలు

18.4 ప్రత్యేక వ్యాసం - రకాలు

- 18.4.1. వార్తా వ్యాసం
- 18.4.2. సంపాదకీయాలు, సంపాదక వ్యాసాలు
- 18.4.3. వ్యక్తిత్వ వ్యాసాలు
- 18.4.4. మానవీయ వ్యాసాలు
- 18.4.5. రుతువులు, వాతావరణంలో మార్పులపై రాసే వ్యాసాలు
- 18.4.6. ఇంటర్వ్యూ ఆధారంగా రాసే వ్యాసాలు
- 18.4.7. ప్రయాణాలలో అనుభవాలను వివరించే వ్యాసాలు
- 18.4.8 జ్ఞాపకాలు ఆధారంగా రాసే వ్యాసాలు

18.5 ప్రత్యేక వ్యాసం - విభాగాలు

- 18.5.1. ఎత్తుగడ ప్రారంభం
- 18.5.2. విషయం
- 18.5.3. ముగింపు

18.6 ప్రత్యేక వ్యాసం - రచన - పద్ధతులు - వనరులు.

18.7 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

18.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 18.0 ఉద్దేశం

ఈభాగం చదివిన తర్వాత మీరు

- ప్రత్యేక సంచికలు అంటే ఏమిటి?
- ప్రత్యేక వ్యాసాల రీతులు, రకాలు, విభాగాలు
- ప్రత్యేక వ్యాసంలో వనరులు, రచనా పద్ధతులు- తెలుసుకుంటారు.

## 18.1 ప్రవేశిక

వార్తల్లో దొరకని చాలా విషయాలు, సమాచారం అంతా వ్యాసాల్లో దొరకుతుంది. నేటి పత్రికలన్నీ ముఖ్యమైన రంగాలకు సంబంధించి ప్రత్యేక అనుబంధాలు వెలువరిస్తున్నాయి. బాలలు, యువత, మహిళ, విద్య, ఆరోగ్యం, సైన్స్, వ్యవసాయం, సినిమా ఇలా అనేక రంగాలకు సంబంధించి ప్రత్యేక సంచికలు, అనుబంధాలు వస్తున్నాయి. రచనలో వార్తకు వ్యాసానికి ఎన్నో తేడాలున్నాయి. ఒక్కో రంగానికి సంబంధించి ఎలా రాయాలో తెలుసుకుందాం.

## 18.2 ప్రత్యేకసంచిక, అనుబంధం అంటే ఏమిటి?

కొన్ని సందర్భాలను పురస్కరించుకొని వెలువరించేవి విశేష సంచికలు, ప్రత్యేక సంచికలు. వీటిని ఇంగ్లీషులో సూవనీర్ (Souvenir) అనీ, స్పెషల్ నంబర్ (Special number) అనీ అంటారు. సూవనీర్‌అంటే ప్రత్యేకమైనది. జ్ఞాపకార్థం దాచుకోదగినది అని అర్థం. జయంతులు, వర్ధంతులు, నాటక పోటీలు, శతదినోత్సవాలు, సన్మానాలు షష్టిపూర్తులు, పురస్కారాలు, ఆటల పోటీలు, ప్రదర్శనలు వగైరా గుర్తుంచుకోవలసిన ఘటనలు జరిగినప్పుడు ప్రత్యేక సంచికలు ప్రచురించడం సంప్రదాయం.

ఈ రోజు దిన పత్రికల ప్రధాన సంచికలు రాజకీయ వార్తలతో నిండి పోతున్నాయి. స్థానిక వార్తల కోసం చిన్న పత్రికలు (tabloids) వెలిశాయి. ప్రధాన సంచికలో రాష్ట్రస్థాయి వార్తలు, జాతీయ అంతర్జాతీయవార్తలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇవి కొన్ని వర్గాల పాఠకులకే ఆసక్తి కలిగించే అంశాలు. ఒక కుటుంబంలో రకరకాల వయస్సులు, స్థాయిలు అభిరుచులు గల పాఠకులు ఉంటారు. కుటుంబంలోని సభ్యులందరినీ అలరించే ప్రయత్నంలో అనేక అనుబంధాలు వస్తున్నాయి. లోగడ అన్ని పత్రికలూ ఆదివారం ప్రత్యేక అనుబంధాన్ని ప్రచురించేవి. ఈ అనుబంధంలో సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, ఇతర అంశాలు ఉండేవి. ఇప్పుడు విద్యార్థులను, క్రీడాప్రియులను, ఉద్యోగార్థులను, గృహిణులను, యువతను, సినిమాల పట్ల ఆసక్తిగలవారిని ఆకట్టుకునేందుకు ప్రత్యేక అనుబంధాలు వెలువడుతున్నాయి. పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థుల కోసం 'దిక్సూచి' 'ప్రతిభ' 'సాధన' తదిత శీర్షికలతో అనుబంధాలు అందుకుంటున్నాం. ఇళ్ళు కట్టుకోవాలనుకునే వారికి, స్థలాలు కొనుగోలు చేసేవారికి అవసరమైన సమాచారం, కంప్యూటర్ రంగంలోని విశేషాలు, మహిళల సమస్యలు ఇతర అంశాలపై విడివిడిగా అనుబంధాలు ఇస్తున్నారు. రియల్‌ఎస్టేట్, చిట్‌టాక్, ఆటవిడుపు, సినిమా ప్రపంచం, యువత, మహిళ, వసుంధర, ప్రియదర్శిని, దృష్టి, ఆరోగ్యం, డాక్టర్ ఇలా రకరకాల శీర్షికలతో దాదాపు అన్ని దిన పత్రికలూ వివిధ వర్గాల పాఠకుల మన్ననపొందడానికి విశేషకృషి చేస్తున్నాయి. ప్రధాన సంచికతోపాటు అదనంగా ఇచ్చే విశేషసంచిక అనుబంధం. ఒక్కొక్క అనుబంధం ఒక్కొక్క రంగానికి ప్రత్యేకించినది కావచ్చు లేదా అన్ని రంగాల సమాచారాన్నీ కలబోసి అందించే కదంబం కావచ్చు.

## 18.3 ప్రత్యేక వ్యాసం (ఫీచర్) - నిర్వచనం, లక్షణాలు

ఆంగ్ల వాఙ్మయం ప్రభావం వల్ల తెలుగులో వచ్చిన అనేక కొత్త ప్రక్రియలలో వ్యాసం ఒకటి. వ్యాసం అంటే ఏమిటి? అని సాధారణ పాఠకులను ప్రశ్నిస్తే "పొడవుగా ఉండే రచన" అని సమాధానం వస్తుంది. 'వార్త కానిది వ్యాసం' అనే జవాబు కూడా వార్తా పత్రిక పాఠకులు చెప్పవచ్చు. ఈ రెండు సమాధానాలూ సరైనవి కావు. మంచి వ్యాసం నాలుగైదు పేరాలే ఉండవచ్చు. వ్యాసంలో వార్తాంశాలు నిండి ఉండవచ్చు. ఏదైనా ఘటనకు సంబంధించి వాస్తవ సమాచారం ఇచ్చే రచన వార్త. అభిప్రాయాలను తెలిపే రచనలు సంపాదకీయాలు. ఈ రెండూ కాక వార్తా పత్రికలో కనిపించే ఇతర రచనలు ప్రత్యేక వ్యాసాలు. కాగితం, సిరా ఉన్నంత మాత్రాన వార్తా పత్రిక రూపుదిద్దుకోజాలదు. పత్రికలో జీవకళ ఉట్టిపడాలి. అది చైతన్యవేదిక. పత్రిక కాలమ్స్‌లో కష్టాలూ, సుఖాలూ, మంచీ చెడూ కూడా ఉంటాయి. పత్రికకు వార్తలు రక్తమైతే సంపాదకీయం గుండెకాయ. ప్రత్యేక వ్యాసాలు పత్రికకు అలంకరణాలు.

ఒకరోజు మీకు కనిపించిన అన్ని దిన పత్రికలనూ తిరగేయండి. అన్నిటిలోనూ ఒకే రకమైన వార్తలు ఉంటాయి. వార్తలు సమర్పించడంలో, నిడివిలో, విస్తరణలో తేడాలు ఉండవచ్చు. కాని ఒకే చోటు నుంచి వచ్చిన వార్తలే అన్ని పత్రికలలోనూ కనిపిస్తాయి. సంపాదకీయాలు కూడా దాదాపుగా ఒకే సమస్యపై ఉంటాయి. సంపాదకుల అభిప్రాయాలు, రచనా పద్ధతులు, భాషా విన్యాసాలు భిన్నంకావచ్చు. అంశం ఒకటే. ప్రత్యేక వ్యాసాలు మాత్రం భిన్నంగా ఉంటాయి. లోతులో, విశ్లేషణలో అవగాహనలో, సమర్పణలో తేడాలుంటాయి. పాఠకులు ఏ పత్రిక చదవాలో నిర్ణయించుకునేది ఈ ప్రత్యేక వ్యాసాల ఆధారంగానే. ఒక పత్రిక స్వభావాన్ని చాటి చెప్పేదీ, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది ఈ వ్యాసాలే.

సాధారణ వార్తలలో కనిపించని, కనిపించరాని ఆవేశం, ఆలోచన, వ్యాఖ్య ప్రత్యేక వ్యాసాలలో కనిపిస్తాయి. పద విన్యాసంలో వినూత్నమైన పోకడలు కనిపిస్తాయి. విషయాన్ని బట్టి భాషాశైలి మారుతుంది. వైవిధ్యం ఉంటుంది. ప్రత్యేక వ్యాసంలో కనిపించే సాధారణ లక్షణాలు: 1. రాశికంటే వాసి ప్రధానం 2. వార్తాంశాలు ఉండరాదన్న నిబంధన ఏమీ లేదు 3. అన్వయం వ్యాఖ్య ఉంటాయి 4. భావన, స్పందన, ఆవేశం ఉంటాయి. 5. పాఠకులను సంతృప్తిపరిచే, వారి అవసరాలు తీర్చే అంశాలూ, రీతులూ ఉంటాయి.

BRAOU

**అభ్యాసం : 1 ప్రత్యేక వ్యాస లక్షణాలను సమీక్షించండి.**

............................................................................................................................................................

............................................................................................................................................................

............................................................................................................................................................

............................................................................................................................................................

............................................................................................................................................................

## 18.4 ప్రత్యేక వ్యాసం - రకాలు

ఏ విశేషమైనా వ్యాసానికి ఇతివృత్తం కాదగినప్పుడు ప్రత్యేక వ్యాసాలు ఇన్ని రకాలని ఇదమిద్ధంగా చెప్పుకోవడం సాధ్యంకాదు. అయితే, వార్తా పత్రికలలో మనంచేసే వ్యాసాలను స్థూలంగా ఎనిమిది రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. వార్తా వ్యాసాలు 2. సంపాదకీయాలు. 3. వ్యక్తిత్వ వ్యాసాలు 4. మానవీయ వ్యాసాలు 5. సామయిక వ్యాసాలు రుతువులు, వాతావరణంలో మార్పులపై రాసే వ్యాసాలు 6. ఇంటర్వ్యూ ఆధారంగా రాసే వ్యాసాలు 7. ప్రయాణాలలో అనుభవాలను వివరించే వ్యాసాలు 8. జ్ఞాపకాల ఆధారంగా జ్ఞాపకాలను తవ్వి రాసే వ్యాసాలు.

### 18.4.1 వార్తా వ్యాసం

వార్తావ్యాసం ఒక ఘటనపై నివేదిక. ఘటనకు సంబంధించిన అంశాలనే ఒక క్రమంలో పూసలలో దారం కూర్చినట్టు చెబితే ఆ కథనమే వార్తా వ్యాసం. అందులో వాస్తవాలనుపేర్కొంటూనే రచయిత అన్వయిస్తాడు. వ్యాఖ్య ఉంటుంది. వర్తమానాన్ని గతాన్ని పోల్చి పరిశీలించి భవిష్యత్తును ఈ ఘటన ఏ రకంగా ప్రభావితం చేయగలదో అంచనా వేయడం కూడా వార్తావ్యాసం ఉద్దేశం.

ఉదాహరణకు ఈ వార్త చూడండి: ఈనాడు 1995 నవంబర్ 27 హైదరాబాద్ సంచిక మొదటిపేజీలో 'చంద్రబాబు ప్రారంభోత్సవాలకు కాంగ్రెస్ అడ్డుచక్రం' అనే శీర్షికతో ప్రచురించిన వార్త వరంగల్లు జిల్లాలో కాంగ్రెస్, తెలుగుదేశం (బాబువర్గం) మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలను, అందుకు కారణమైన అంశాలను వివరిస్తుంది.

BRAOU

### 18.4.2 సంపాదకీయాలు, సంపాదక వ్యాసాలు

ఇవి పత్రికల విధానానికి అనుగుణంగా ఉంటాయి. సంపాదకీయం ఉన్న పేజీలోనే ప్రచురించే ప్రధాన వ్యాసం సంపాదక వ్యాసం. వాటిని సంపాదకీయం పేజీ వ్యాసాలు అంటాం. అభిప్రాయాలు వెలిబుచ్చడం, అంచనాలు వేయడం, మదింపు చేయడం, భవిష్యత్తును ఊహించి చెప్పడం, హెచ్చరించడం, విశ్లేషించడం ఈ వ్యాసాల లక్ష్యాలు. ప్రఖ్యాత జర్నలిస్టులు రాసే కాలమ్స్, వార్తా వ్యాఖ్యలు ఈ కోవకే వస్తాయి. ప్రస్తుతం భారత పత్రికా రంగంలో కాలమిస్టులుగా ప్రసిద్ధిచెందిన పాత్రికేయులు చాలా మంది ఉన్నారు. నాన్‌పాలియా, ఇందర్ మల్హోత్రా, రాజేందర్ పురి, కులదీప్ నయ్యర్, అరుణ్‌శౌరీ, కుశ్వంత్‌సింగ్ ఎం.జె. అక్బర్.జి.ఎస్. భార్గవ, సునీల్‌సేథీ, తవ్లీన్‌సింగ్, నీరజా చౌదరి, కుమ్‌కుమ్ ఛద్దా, నీనావ్యాస్, తదితరులు జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాలపై వ్యాఖ్యానిస్తున్నారు. తెలుగులో కాలమిస్టుల సంఖ్య తక్కువ. చమత్కారికలు రాసే హాస్యరచయితలు ఒక డజను లోపే ఉంటారు. రాజకీయ, సాంఘీకార్థిక అంశాలపై తెలుగులో సాధికారికంగా వ్యాఖ్యానించగల పాత్రికేయులు ఉండవలసినంత సంఖ్యలో లేరు. సంపాదకీయం పేజీలో ప్రచురించక పోయినా సంపాదకుడు రాసిన వ్యాసం సంపాదకీయ వ్యాసమే. ఉదాహరణకు 1995 నవంబర్ 26 ఆదివారం 'ఆంధ్రభూమి' సంచిక అనుబంధంలో

'ఉన్నమాట' శీర్షికతో ఆ పత్రిక సంపాదకుడు ఎం.వి.ఆర్. శాస్త్రి రాసిన వ్యాసం ప్రజల వద్దకు భిక్షాటన. చిత్రసమీక్షలు, పుస్తకసమీక్షలు కూడా సంపాదకీయవ్యాసాల కోవలోకే వస్తాయి.

### 18.4.3 వ్యక్తిత్వ వ్యాసాలు

ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని తెలియజెప్పే వ్యాసాలు సి. నారాయణంరెడ్డి జ్ఞానపీఠ పురస్కారాన్ని గెలుచుకున్నప్పుడో, మల్లేశ్వరి ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలలో స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నప్పుడో, డాక్టర్ అంబటి బాలమురళీకృష్ణ పదిహేడు సంవత్సరాలకే అమెరికాలో వైద్యశాస్త్రంలో పట్టా పొంది ప్రపంచ రికార్డు నెలకొల్పినప్పుడో ఈ అసాధారణ వ్యక్తుల వివరాలు, విశేషాలతో వ్యాసాలు పుంఖానుపుంఖంగా పత్రికలలో వచ్చాయి. గొప్పవారి గురించే, కీర్తి ప్రతిష్ఠలు సంపాదించేవారి గురించే రాయాలని లేదు. సామాన్య మానవుడిపై, సాధారణ గృహిణిపైన రైతు కూలీపైన చిరుగుపాతలతో తిరుగాడే బిక్షారిపైన కూడా వ్యక్తిత్వ వ్యాసం రాయవచ్చు. ఒక వ్యక్తిలోని విశేషాంశాలనూ, ప్రతిభనూ, సామర్థ్యాన్నీ, బలహీనతలనూ వెలుగులోకి తేవడం ఈ రకం వ్యాసాల ఉద్దేశం. అలాగే వ్యవస్థలోని జాడ్యాలకు సమస్యలకు ప్రతీకలైన వ్యక్తులపై వ్యాసాలు రాయడం ద్వారా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపించవచ్చు. అలాగే ఒక ప్రదేశం మంచీచెడులు వివరించడం, ఆ ప్రదేశాన్ని అదే రకమైన మరో ప్రదేశంతో పోల్చి చెప్పడం, తెలిసిన ప్రదేశం గురించి చెబుతూ కొత్త ప్రదేశాన్ని పరిచయం చేయడం ఈ వ్యాసాల ద్వారా సాధించగల ప్రయోజనాలు.

ఉదాహరణకు 1995 నవంబర్ 26 ఆంధ్రజ్యోతి సంచిక ఆదివారం అనుబంధంలో 'వరల్డ్ ఛాంపియన్ మళ్ళీ మన మల్లి, అనే శీర్షికతో వచ్చిన వ్యక్తిత్వ వ్యాసాన్ని చూడండి.

### 18.4.4 మానవీయ వ్యాసాలు

ఇవి ఎన్ని రకాలో చెప్పడం కష్టం. మానవీయ స్పందన కలిగిస్తూ జనానికి ఆసక్తి కలిగించే ఏ అంశమైనా ఈ వ్యాసాలకు ఇతివృత్తమే. ఒక్కొక్కప్పుడు వ్యక్తిత్వ వ్యాసమే జనాసక్తి వ్యాసం కూడా కావచ్చు. దుర్భర దారిద్ర్యంలో పుట్టిన వ్యక్తి స్వయం కృషితో పట్టుదలతో ఉన్నతస్థాయికి ఎదిగిన తీరు వివరించే వ్యాసం జనాసక్తి వ్యాసం. అందులో వ్యక్తిత్వ చిత్రణ కూడా ఉంటుంది. పాఠకులలో ఆసక్తినీ, ఆర్ద్రతనూ, దయనూ, ఆవేదననూ, ఆనందాన్నీ, ఆవేశాన్ని, జుగుప్సనూ, ఇతర భావాలనూ కలిగించేవి మానవీయ వార్తలు. రోజూ పత్రికలు చూస్తుంటే ఇటువంటి వార్తలు అనేకం కనిపిస్తాయి. జంతు ప్రదర్శనశాలల్లో ఒకే బోనులో పులి, మేక సహజీవనం. ఒక గ్రామంలో ప్రభుత్వం ప్రోత్సాహంతో కొందరు మహిళలు బృందంగా ఏర్పడి చెక్‌డామ్‌లు నిర్మించడం, రోడ్లు నిర్మించడం జర్మన్ మహిళ సైకిల్‌పై ప్రపంచయాత్ర చేయడం. లాతూరులో భూకంపం వచ్చిన తర్వాత వారానికి శిథిలాల కింద ఒక బాలికసజీవంగా ఉండటం, ఆమెను రక్షించడం. పెక్కంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగినప్పుడు చివరి అంతస్తులో ఉన్న పసికందును క్షేమంగా బయటికి తీసుకురావడం. ఇటువంటి చిన్న వార్తల వెనుక బోలెడు విశేషాలు ఉంటాయి. వాటిని సేకరించి ఘటన జరిగిన విధాన్ని అందంగా చెప్పగలిగితే అదే మానవీయ వ్యాసం. ఘటన ఎంత చిన్నదైనా ఆసక్తికలిగిస్తే చాలు.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ 1995 నవంబర్ 21 సంచికలో ప్రచురించిన వార్త 'రాగిసంగటి బాబాకు ప్రియం' సత్యసాయి బాబాకు రాగిసంగటి ఇష్టం అనే సంగతి అందరికీ ఆసక్తి కలిగించే అంశం. ఈ అంశాన్ని వార్తగా రాస్తే అది మానవీయ వార్తే అవుతుంది. వ్యాసంగా రాస్తే మానవీయ వ్యాసంగా రూపొందుతుంది.

### 18.4.5 రుతువులు, వాతావరణంలో మార్పులపై రాసే వ్యాసాలు

ఇవి ఎలా ఉంటాయో చెప్పనక్కరలేదు. రుతువులు తెచ్చే మార్పులు వ్యవసాయం, ఇతర రంగాలపై ఆ మార్పులు

BRAOU

చూపే ప్రభావం. మనిషి జీవితంలో ఈ మార్పులు తెచ్చే ఫలితాల గురించి తరచు వ్యాసాలు వస్తాయి. కుండపోతగా వానపడితే వ్యాసం రాయవచ్చు. సకాలంలో వానలు కురవక అనావృష్టి పరిస్థితులు ఏర్పడినా రాయవచ్చు. అకాలంలో వానకురిసి పైరు నష్టమైనా వరదలు వచ్చి కొంపాగోడూ కొట్టుకుపోయినా ప్రత్యేక వ్యాసానికి అవసరమైన సరంజామా దొరుకుతుంది. అలాగే ప్రతి సంవత్సరం వచ్చేపండుగలు పబ్బాల సందర్భంగా ప్రత్యేక వ్యాసాలు ప్రచురించడం సంప్రదాయం. పండుగలు ఒక దానివెంట ఒకటిగా వస్తాయి. ముఖ్యంగా భిన్నమతాల మిశ్రమ వ్యవస్థ ఉన్న భారత్‌లో పండుగలకు కొదువలేదు. ఉదాహరణకు ఒక్క జనవరిలోనే ఆంగ్లసంవత్సరాది, పద్నాలుగోతేదీన సంక్రాంతి, 30న మహాత్మాగాంధీ వర్ధంతి, రంజాన్ ప్రారంభం ఈ విధంగా ముఖ్యమైన తేదీలు వరుసగా వస్తాయి. ఈ సందర్భాలన్నిటిలోనూ మహాత్ముడి వర్ధంతి కూడా క్రమం తప్పకుండా మనం జ్ఞాపకం చేసుకొంటాం కనుక ఈ జాబితాలో చేర్చినా తప్పులేదు.

సంక్రాంతికి గంగిరెద్దులు, పంటలు గ్రామీణ ప్రగతికి సంబంధించిన వ్యాసాలు ప్రచురించడం ఆనవాయితీ. అదే విధంగా తక్కిన సందర్భాలకు తగినట్టు వ్యాసాలు రాయించి ప్రచురిస్తారు. ఉదాహరణలు ప్రతి పండుగకీ ప్రతి పత్రికలోనూ దర్శనమిస్తాయి.

### 18.4.6 ఇంటర్వ్యూ ఆధారంగా రాసే వ్యాసాలు

ఒక వ్యక్తిని లేదా సమస్యను ప్రాతిపదికగా తీసుకొని రాసినవి. వీటికి కూడా - ఆ మాటకొస్తే ప్రతి రచనకూ సందర్భశుద్ధి అవసరం. ప్రత్యేక వ్యాసాలు రాయాలంటే యాతన పడవలసిందే. ఎంసెట్ పరీక్షలలో మొదటి ర్యాంకు సంపాదించిన విద్యార్థిని, అతని తల్లిదండ్రులను ఇంటర్వ్యూచేసి ఆ ఇంటర్వ్యూల ఆధారంగా ప్రత్యేక వ్యాసం రాయవచ్చు. ఆ విద్యార్థి విజయశిఖరాన్ని అధిరోహించడానికి తోడ్పడిన వ్యక్తులు, పరిస్థితుల గురించి స్ఫూర్తిదాయకంగా ఇతర విద్యార్థినీ విద్యార్థులకు ఆదర్శంగా నిలిచే విధంగా వ్యాసం రాయవచ్చు. ఒకే వ్యాసం రాయడానికి పలువురిని ఇంటర్వ్యూ చేయవలసి రావచ్చు. ఉదాహరణకు ప్రత్యేక తెలంగాణా ఉద్యమం 1960వ దశకం చివరలో తెలంగాణా ప్రాంతాన్ని ఒక ఊపు ఊపింది ఆ ఉద్యమం గురించి రాయాలంటే ఉద్యమంలో పాల్గొన్న నాయకులను నడిపిన నాయకులను ఉద్యమం వల్ల నష్టపోయిన విద్యార్థులను, ఉద్యోగులను, వ్యాపారులను, ఇంటర్వ్యూ చేయాలి. వారంతా అందించిన సమాచారం ఉపయోగించి వ్యాసం రాయాలి. ఇంటర్వ్యూలో చెప్పిన అంశాలలో అత్యంత ఆసక్తికరమైన దానిని ఎంచుకొని దానిని ప్రధాన విషయంగా రాసుకోవాలి. ప్రస్తావనగా అదే అంశాన్ని స్వీకరించవచ్చు. ఇంటర్వ్యూ ఇచ్చిన వ్యక్తి చెప్పిన అంశాలనేకాకుండా ఇంటర్వ్యూ జరిగిన పరిస్థితులు, వ్యక్తి హావభావాలు, ఊతమాటలు, అలవాట్లు వైఖరి అన్నీ ప్రత్యేక వాసరచనకుతోడ్పడతాయి. ఏమి చెప్పారనే దానితోపాటు ఎలా చెప్పారన్నది కూడా ముఖ్యమే.

BRAOU

### 18.4.7 ప్రయాణాలలో అనుభవాలను వివరించే వ్యాసాలు

వీటినే ఇంగ్లీషులో Travelogues అంటారు. ప్రయాణంలో ఎదురైన అనుభవాలనూ. కనిపించిన విశేషాలనూ ఇతరులకు కళ్ళకు కట్టినట్టు వర్ణిస్తూ సాగే రచనలు ఈ కోవకు చెందినవి. సయ్యద్‌నకీర్వీ. ఎం.జె. అక్బర్,సునీల్‌సేథీ. ఉషారాయ్. డాన్‌మొరే వంటి భారత పాత్రికేయులు యాత్రా విశేషాలను ప్రత్యేక వ్యాసాలుగా రాయడంలో సిద్ధహస్తులు. యుద్ధంలో విధ్వంసమైన నగరాన్ని దర్శించినా, నయాగార జలపాతాన్ని చూసినా, దండకారణ్యంలో గిరిజనుల ఆటపాటలు గమనించినా ఇటువంటి ప్రత్యేక వ్యాసాలకు ముడిపదార్థం లభిస్తుంది. తీర్థయాత్రలు, వినోద యాత్రలు, విజ్ఞాన యాత్రలు చేసినవారు ఎంతో విలువైన సమాచారాన్ని పొందుపరచి ఆసక్తికరమైన వ్యాసాలు రాసిన సందర్భాలు ఉన్నాయి.

### 18.4.8 జ్ఞాపకాలు ఆధారంగా రాసే వ్యాసాలు

ఇవి అవ్యవధి వ్యాసాలు. ఏదో ఒక రోజు రాయవలసిన రచయిత ఏదో ఒక కారణం వల్ల రాయడు. రావలసిన వ్యాసం

రాదు. ఈ వ్యాసం వస్తుంది కదా అన్న భరోసాతో ప్రత్యామ్నాయ ఏర్పాటుచేయని సంపాదకుడికి అత్యవసరంగా ఒక వ్యాసం కావలసి వస్తుంది. తన సహచరులలో పలుకున్న వ్యక్తిని వెంటనే వ్యాసం వండేందుకు పురమాయిస్తాడు. ఖాళీని పూరించడం లాంటి వ్యవహారం. బయటికి వెళ్ళి సమాచారం సేకరించేందుకు కానీ, పుస్తకాలు చదివి నోట్స్ తయారుచేసుకునేందుకు కానీ తగిన వ్యవధిలేదు. ఏదో ఒకటి ఆలోచించి హడావుడిగా వండేయాలి. జ్ఞాపకాల దొంతరనుంచి ప్రస్తుత వ్యాసం విషయానికి సంబంధించిన అంశాలను ఏరుకొని ఉపయోగించుకోవాలి. వ్యాసానికి ఇతి వృత్తం నిర్ణయించుకోవడానికి సైతం పెద్దగా సమయం ఉండదు. ఎదురుగా ఉన్న ఆనాటి దినపత్రిక చూస్తుంటే ఏదో ఒక అంశం మన దృష్టిని ఆకర్షించాలి. దాని చుట్టూ జ్ఞాపకాలను పేర్చి అద్భుతమైన వ్యాసం రాయవచ్చు.

ఉదాహరణకు 1995 నవంబర్ 26న నాగపూర్‌లో భారత, న్యూజిలాండ్ జట్లమధ్య జరిగిన వన్‌డే క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వచ్చిన ప్రేక్షకులలో తొమ్మిది మంది గోడకూలి మరణించారు. ఈ వార్తను ఆధారంగా తీసుకొని మెదడుకు పనికల్పించగలిగితే క్రీడా మైదానాలలో బలవన్మరణాలు సంభవించిన ఘట్టాలు జ్ఞాపకం వస్తాయి. బ్రిటన్‌లో ఫుట్‌బాల్ (సాకర్) మ్యాచ్ జరిగినప్పటి హింసాకాండ, ఒలింపిక్ గ్రామంలో పదమూడుమంది ఇజ్రాయెల్ క్రీడాకారులు ఊచకోత, తదితర ఘటనలు తరుముకుంటూ స్మృతిపథంలోకి వస్తాయి. ఈ జ్ఞాపకాలన్నిటినీ వ్యాసం రాసి సంపాదకుడి మెప్పు పొందవచ్చు. ఇటువంటి వ్యాసాలను సాధారణంగా సంపాదకీయం పేజీలో ప్రధాన వ్యాసానికి, సంపాదకుడికి లేఖలు అనే శీర్షికకూ మధ్య ఉపయోగిస్తారు. దీనినే Creative middle అంటాం. ఇవి ఆలోచనా ప్రేరకంగా హృద్యంగా, తేలికగా (భారంగా కాకుండా) సున్నితంగా ఉంటాయి. హాస్యరస ప్రధానంగా వచ్చే వ్యాసాలు కూడా ఈ వర్గీకరణలోనే ఇముడుతాయి. చెరుకుముక్కలలాంటి వ్యంగ్య రచనలు, హాస్య రచనలు వార్తా పత్రికలలోతరచు కనిపిస్తాయి. గోపాలశాస్త్రి, శ్రీరమణ, తంబు, నరసరాజు, చలసాని ప్రసాదరావు, రాంభట్ల కృష్ణమూర్తి, గుడిపూడి శ్రీహరి, తెలిదేవర భానుమూర్తి, కె.ఆర్. మూర్తి, భమిడిపాటి రామగోపాలం, ఆదివిష్ణు, తదితరులు పత్రికలలో హాస్యం పండించారు. వీరిలో చాలామంది ఇంకా రాస్తున్నారు. ఈ రచనలకు ఇతివృత్తం రాజకీయపరిణామాలు, రాజకీయవాదుల పోకడలు, వింతనిర్ణయాలు కావచ్చు, సమాజంలో కనిపించే విడ్డూరాలు, విశేషాలు కావచ్చు. కుటుంబసభ్యుల మధ్య సంబంధాలు కావచ్చు. జనానికి ఆసక్తి కలిగించే ఏ అంశమైనా కావచ్చు.

## 18.5 ప్రత్యేక వ్యాసం - రకాలు

అన్ని రచనలలాగే ప్రత్యేక వ్యాసంలో కూడా మూడు భాగాలు ఉంటాయి. అవి: 1. ఎత్తుగడ 2. విషయం 3. ముగింపు.

### 18.5.1 ఎత్తుగడ (ప్రారంభం)

పాఠకులను ఆకర్షించి కట్టిపడవేసే విధంగా ఎత్తుగడ ఉండాలి. శీర్షిక చూసి వ్యాసానికి ఆకర్షితుడైన పాఠకుడు ప్రారంభవాక్యాల్లో చదివిన తర్వాత వ్యాసాన్ని విడవకుండా చివరివరకూ చదవాలి. రచయిత చదివించాలి.

ప్రస్తావన పలు విధాలు. కొందరు సామెతతో వ్యాసం ప్రారంభిస్తే మరికొందరు కొటేషన్‌తో మొదలు పెడతారు. కొందరు చమత్కారమైన ప్రకటన లేదా ప్రతిపాదనతో ప్రారంభిస్తారు. అన్ని రకాల ప్రస్తావనలూ ప్రఖ్యాత పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు 'కొత్త -పాత' అనే సంకలనం ప్రత్యేక వ్యాసాలలో కనిపిస్తాయి. కవుల ఢంకా లో "నన్నునేనే పొగడుకోగలిగినప్పుడు ఆ పని నేను మరొకరికి ఎందుకు అప్పగించాలి" అని బెర్నార్డ్‌షా తెగవేసి ఆడిగాడు అంటూ ప్రస్తావన మొదలయింది. ఇది కొటేషన్ ప్రస్తావన. కాల్చిన వంకాయపచ్చడి, పచ్చిపులుసు ఇవంటే నాకు మహా ఇష్టం. "జిహ్వాకొక రుచి, పుర్రెకొక బుద్ధి" అని పెద్దలన్నారుగదా అంటూ 'రంగు అద్దాలు' వ్యాసం ఆరంభించారు. ఇది చమత్కారమైన ప్రకటనతో ప్రారంభమైన ప్రస్తావన. "భార్యా రూపవతీ శత్రుః అన్నారు పెద్దలు, ప్రపంచం తలకిందులైనా, ఇటు సూర్యుడు అటు పొడిచినా, పిల్లలు ఈ మాట ఒప్పుకోరు. రూపం, గుణం వ్యాసంలో ఇది సామెతతతో ప్రారంభమైన ప్రస్తావన. 'హ్యామిష్ హ్యామిల్టన్ కంపెనీ లండన్ నుంచి పంపిన పుస్తకాల కేటలాగ్ ప్రొద్దున పోస్టులో వచ్చింది. దాన్ని కాసేపు తిరగవేసి, ఒక నిట్టూర్పుతో అవతల పెట్టాను. ఒక 'నిట్టూర్పు' అనేశీర్షికతో రాసిన వ్యాసానికి ఇది కథానిక తరహా ప్రస్తావన, ఒకనాడు మనదేశంలో అన్నాన్ని అమ్ముకొనడం చాలా

BRAOU

తప్పుగా ఎంచేవారు. మరి దేనినైనా అమ్ముకోవచ్చుగాని బ్రహ్మపదార్థాన్ని అమ్ముకోవడమా? `అన్నం` వ్యాసంలో ఇది ప్రశ్నతో మొదలైన ప్రస్తావన. ఇలాగే ఆశ్చర్యార్థకంతో కూడా ప్రస్తావన మొదలు కావచ్చు. "వేదాలు పౌరుషేయాలా? అపౌరుషేయాలా? అవి పౌరుషేయాలేనని డాక్టర్ భీమారావ్ అంబేద్కర్ వాదం అని ఒక చర్చనీయాంశంతో `ఆయం, గాయం` వ్యాసాన్ని నార్లవారు ఆరంభించారు. పద్ధతి ఏదైనా పాఠకులను ఆకర్షించడం ప్రస్తావన పరమోద్దేశం.

### 18.5.2 విషయం

ప్రస్తావన కేవలం ఆకర్షించడానికే. విషయాన్ని ఆ తర్వాత వివరంగా చెప్పాలి. ఈ భాగాన్ని శరీరం అని కూడా అంటాం. ఇతి వృత్తాన్ని బట్టి శరీరం పరిమాణం ఉంటుంది. ముగింపు కూడా ప్రస్తావనలాగే ఒకటి, రెండు వాక్యాలు మాత్రమే ఉంటుంది. అది ఉపసంహారం. అసలు విషయం యావత్తూ శరీరంలోనే పొందుపరచాలి. చిన్న చిన్న పేరాలతో సవివరంగా విషయం రాయాలి. ఘటనక్రమం పాటించి విషయ వివరణ సాగవచ్చు. లేదా ప్రాధాన్య క్రమంలో రాయవచ్చు. ప్రాధాన్య క్రమంలోరాస్తేనే ఆసక్తి ఉంటుంది. ముఖ్యమైన అంశం ముందు చెప్పిన తర్వాత తక్కిన వివరాలు పేర్కొనవచ్చు.

### 18.5.3 ముగింపు

ప్రస్తావన ఆసక్తి రేకెత్తించే విధంగాఉండాలి. ముగింపు ఆలోచన రేకెత్తించాలి. వ్యాసం చదివిన తర్వాత దాని తాలూకు 'రుచి' బుర్రలో కొంతకాలంపాటు ఉండే విధంగా ముగింపు ఉండాలి. ప్రస్తావన లాగే ముగింపు కూడా వివిధ రకాలు. వ్యాసాన్ని ప్రశ్నతో, ఆశ్చర్యార్థకంతో, సామెతతో, చమత్కార ప్రకటనతో ఇలా రకరకాలుగా ముగించవచ్చు.

ఉదాహరణకు మళ్ళీ నార్లవెంకటేశ్వరరావు ప్రత్యేకవ్యాసం సంపుటి `కొత్త-పాత`నే తీసుకుందాం. "నానాత్వంలో ఏకత్వం' శీర్షికతో రాసిన వ్యాసం ప్రశ్నార్థకంతో ముగుస్తుంది. "మొత్తంమీద మానవునికీ, మానవునికీ మధ్య ఏ విధమైన పోలికాలేదు. అలాగని మానవులు విభిన్నజీవులని భావించడం పొరపాటు. చూపులలో, చేతలలో, మాటలలో, పోకడలో ఆలోచనలలో, అభిరుచులలో, గుణగణాలలో, శక్తియుక్తులలో చివరికి వాసనలలో కూడా మానవుల మధ్య విభేదాలు ఉన్నప్పటికీ వాటిని మించిన ఒక ఐక్యత వారిలో ఉన్నది. దేశ, జాతి, మత, వర్ణ, వర్గ విభేదాలకు సయితం అతీతమైనట్టిది ఈ ఐక్యత. మానవులందరు ఒకే విధంగా జన్మిస్తారు. ఒకే విధంగా మరణిస్తారు. కష్టసుఖాలకు ఒకే విధంగా చలిస్తారు. సమానానుభూతి అందరిదీ. ఒక్కటే నవ్వు, ఒక్కటే నిట్టూర్పు. ఏ గుండెలో వెలిగినా ఒక్కటే ఆశ. ఏ చెక్కిలినుంచి జారినా ఒక్కటే కన్నీరు. ఇంతకంటె బలీయమైన ఐక్యత- దీన్ని మించిన ఏకత్వం ఉండగలవా?

"ఇది కట్టుకథకాదు. పిట్టకథకాదు. యదార్థంగా జరిగిన కథ. అయినా కల్పిత కథలవలె ఇదికూడా కంచికి వెళ్ళవలసిందే. మనం ఇటికి వెళ్ళవలసిందే. అంటూ చమత్కారంగా ముగించారు 'ఇంటిదొంగ' వ్యాసాన్ని. ఇవి మచ్చుకుకొన్ని. కొటేషన్‌తో వ్యాసాన్ని ముగించడం సర్వసాధారణమైన పద్ధతి. కొత్తభావం సూచిస్తూ, వ్యాసం సారాంశాన్ని ఒకటి రెండు వాక్యాలలో కుదిస్తూ ముగింపు రాయవచ్చు. ఏ విధంగా రాసినా ముగింపు పాఠకుల హృదయాలకు హత్తుకోవాలి.

**అభ్యాసం-2 : ప్రత్యేక వ్యాసాల విభాగాలను పపేర్కొనండి.**

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

.....................................................................................................................................

BRAOU

## 18.6 ప్రత్యేకవ్యాసం - రచన - పద్ధతులు - వనరులు

తెలుగు వ్యాసానికి గురజాడ అప్పారావు ఆద్యుడని చెప్పుకోవచ్చు. ఆయనకు ముందు కందుకూరి వీరేశలింగం, పరవస్తు వేంకట రంగాచార్యులు తదితరులు ప్రమేయాలు; సంగ్రహాలు, వచన కావ్యాలు, ఉపన్యాసాలు, రాశారు. కాని ఆంగ్లవ్యాస రచన ప్రక్రియను పుణికిపుచ్చుకొని తెలుగులో అదే స్థాయిలో రచన చేసినవాడు గురజాడ.

గత నూరేళ్ళలో వ్యాసం నానావిధ పరివర్తన చెంది దాదాపు అన్ని రంగాలకూ విస్తరించింది. ఇతర రచనా ప్రక్రియలలో ఇమడని విషయాలు వ్యాసంలో కుదురుతాయి. ఏ విషయమైనా వ్యాసంలో సమర్థంగా చెప్పవచ్చు.

మంచి వ్యాసానికి మంచి శైలి అవసరం. భారత క్రికెట్ చరిత్రలో ఎందరో క్రీడాకారులు 'శతాలు' చేశారు. వేలాది పరుగులు చేశారు. ఎన్ని పరుగులు చేశారన్న ప్రశ్నకన్నా ఎలా చేశారన్నది ముఖ్యం. సి.కె. నాయుడు, వినూమంకడ్, గుండప్ప విశ్వనాథ్ ఆట విరమించి ఎన్ని సంవత్సరాలైనా వారి విన్యాస విశేషాలను క్రికెట్ అభిమానులు ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. ఒక సచిన్ టెండూల్కర్, ఒక అజరుద్దీన్ కూడా వారు పరుగులు ఏ విధంగా చేస్తున్నారన్న అంశంపైనే ప్రేక్షకుల ఆదరాభిమానాలు సంపాదిస్తున్నారు. వ్యాస రచయిత సైతం అంతే. ఏమి చెబుతున్నారనేది ముఖ్యమే. కానీ ఎలా చెబుతున్నారన్నది అంతకంటే ముఖ్యం.

వార్తా రచనలలో ఆరు 'ఏ'లు ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు, ఎలా, ఏమిటి- విధిగా మొదటి రెండు మూడు పేరాలలో ఉండాలి. వ్యాసరచనలో అంతటికఠిన నియమం లేదు. కొంచెం అటూఇటూ అయినా పరవాలేదు.

టైమ్స్ ఆఫ్ ఇండియాలో ప్రత్యేక వ్యాసాల ప్రవీణుడుగా ప్రసిద్ధుడైన బి.ఎన్. కుమార్వ్యాస రచనకు పది ఆదేశక సూత్రాలు రూపొందించారు. అవిః 1. విషయాన్ని పూర్తిగా అవగాహన చేసుకోవాలి. సకల వివరాలూ సేకరించాలి. 2. వ్యాసం సమయం, సందర్భానికి అనుగుణంగా ఉండాలి. 3. పాఠకుడి దృష్టిని ఆకర్షించాలి. 4. ఒక ప్రణాళిక ప్రకారం వ్యాసం రాయాలి 5. వ్యాసం పాఠకుడికి వినోదం కలిగించాలి. 6. విజ్ఞానం కలిగించాలి. 7. పత్రికా రంగంలో లబ్ధ ప్రతిష్ఠులైనవారు రాసిన వ్యాసాలు, ఇతర రచనలు చదవాలి. 8. విలేఖరి శైలి కన్నా సాహిత్యపరమైన శైలిని అలవరచుకోవాలి అంటే, మరీ పాడిపాడిగా ఉండకూడదు. 9. వ్యాస రచనకై స్వీకరించిన వస్తువుకు సంబంధించిన విషయాలను లోతుగా పరిశీలించండి. 10. వార్తా పత్రికలలో వార్తలన్నింటినీ జాగ్రత్తగా గమనించండి. ఏ వార్తలోనైనా వ్యాసానికి అవసరమైన సమాచారం లభించవచ్చు.

ఒక్క మాటలో చెప్పాలంటే మనిషిలోని అనంతమైన ఆసక్తిని సంతృప్తిపరచడం వ్యాసం లక్ష్యం కావాలి.

వ్యాసం రాయడానికి ఒకసారి పది పదిహేను రోజుల వ్యవధి ఉంటుంది. ఒక్కోసారి ఒకటి, రెండు గంటలలోనే ఏదైనా వ్యాసం తయారు చేయవలసి ఉంటుంది. వ్యవధి ఎక్కువ లేదనో, విషయం అపరిచితమైనదనో నిరుత్సాహపడవద్దు. క్షణం కూడా వృథా చేయకుండా రంగంలోకి దూకాలి. వ్యాసం వస్తువుకు సంబంధించిన సమాచారం ఎక్కడ దొరుకుతుందో తెలుసుకొని దానిని సంపాదించాలి. వార్తా పత్రికలు, గ్రంథాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కడ సమాచారం ఉన్నదని తెలిస్తే అక్కడికి వెళ్ళి తెలిసిన వ్యక్తులతో మాట్లాడాలి. వారిని వీలైనన్ని సార్లు కలుసుకోవాలి.

ప్రముఖుల జయంతులు, వర్ధంతులు గుర్తుపెట్టుకోవాలి. ఒక కేలండర్ ప్రత్యేకంగా తయారు చేసుకోవచ్చు. చరిత్రలో ముఖ్యమైన ఘట్టాలు కూడా జ్ఞాపకం ఉంచుకోవాలి. ఉదాహరణకు జలియన్‌వాలాబాగ్ ఉదంతం, క్విట్ ఇండియా ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం వగైరా ఘట్టాల పునశ్చరణలో భాగంగా వ్యాసాలు రాయవచ్చు. గాంధీజీ, పండిట్ నెహ్రూ, పటేల్, జయప్రకాశ్, ఇందిరాగాంధి వంటి జాతీయ నాయకులు, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు వంటి త్యాగమూర్తుల జయంతి, వర్ధంతి సందర్భంగా వారికి నివాళులు అర్పించే వ్యాసాలు రాయవచ్చు. అంతవరకూ వెలుగులోకి రాని వారి జీవిత విశేషాలను, ఆలోచనలను ప్రాతిపదికగా తీసుకొని వ్యాసాలు రాయవచ్చు. ఇటువంటి వ్యాసాలు ఒకే మూసలో విసుగుకలిగించే విధంగా కాకుండా కొత్త కోణాలలో గతాన్ని పునఃపరిశీలిస్తూ రాయగలిగితే బాగుంటాయి.

BRAOU

హరికథలు, బుర్రకథలు చెప్పేవారు ఒకే కథను గ్రామాలలో తిరిగి చెబుతారు. కథ ఒకటే అయినప్పటికీ చెప్పే తీరులో, ఉపాఖ్యానాలలో, ఉదాహరణలలో గ్రామగ్రామానికీ మార్పులు చేసుకుంటారు. స్థానిక సమస్యలనూ, విశేషాలనూ జోడిస్తారు. వారికి వర్ణనా సామర్థ్యం ఉంటుంది. అందుకే రక్తికట్టించగలుగుతారు. కథను అనూహ్యమైన మలుపులు తిప్పుతూ, ఎప్పుడు ఎంత వరకు చెప్పాలో అంతవరకే చెబుతూ ఉత్కంఠను పోషిస్తారు. వ్యాసరచయితలువీరి నుంచి నేర్చుకోవలసిన అంశాలు అనేకం.

వ్యాసం రాసేందుకు బోలెడు సమాచారం సేకరిస్తాం. ఆ సమాచారాన్ని ఏమి చేయాలో పాలుపోదు. అందుకని ముందుగా ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో నిర్ణయించుకోవాలి. తర్వాత మన దగ్గరున్న సమాచారాన్ని ఒక పద్ధతి ప్రకారం ఉపయోగించుకోవాలి. ప్రస్తావన ఆసక్తికరంగా ఉన్నంత మాత్రాన సరిపోదు. రెండోపేరా నుంచి మూడోపేరాకు, అక్కడినుంచి నాలుగో పేరాకు ఆ విధంగా పాఠకులు ఆగకుండా, అత్రుతగా సహజంగా సాగిపోవాలి. మనకు తెలిసిన వాస్తవాలన్నిటినీ గుదిగుచ్చి విషయవివరణ భాగంలోదట్టిస్తే కృతకంగా, అపరిపక్వంగా తయారవుతుంది.

పాఠకులకు విసుగు కనబడకుండా అక్కడక్కడ చమత్కారికలు చిలకరించాలి. హరిదాసు పిట్టకథలు చెప్పి శ్రోతలకు నిద్రరాకుండా జాగ్రతావస్థలో ఉంచే విధంగానే వ్యాసరచయిత కూడా సందర్భశుద్ధితో హాస్యభాషణలు, ఛణుకులు, ఛలోక్తులు ఉపయోగించాలి.

వ్యాసకర్త కొన్ని కొత్త విషయాలను పాఠకులకు తెలియజేసేందుకు ప్రయత్నించాలి. సరికొత్త పరిజ్ఞానం సంపాదించామనే భావన వ్యాసం చదివిన పాఠకులలో కలగాలి.

పేరు ప్రఖ్యాతులున్న రచయితల రచనలు చదవాలి. తెలుగులో కొడవటిగంటికుటుంబరావు, చలం, రాచకొండ విశ్వనాథశాస్త్రి, పెద్దిభోట్ల సుబ్బరామయ్య వంటి రచయితలు రంగనాయకమ్మ, రామలక్ష్మి, మాలతీ చందర్‌వంటి రచయిత్రుల రచనలు చదవాలి. ఇంగ్లీషులో ఎర్నెస్ట్ హెమింగ్వే, ఇయాన్ ఫ్లెమింగ్, ఏ.జి. గార్డినర్, మహాత్మాగాంధీ, జవాహర్‌లాల్ నెహ్రూ, ఆర్.కె. నారాయణ్ వంటి రయితలను అధ్యయనం చేయాలి. విషయంలో మునిగిపోయి సాధారణ పాఠకునిలాగా చదవకుండా రచయిత పోకడలనూ, పదప్రయోగ విన్యాసాలనూ, కథాకథన చాతుర్యాన్నీ హాస్యస్ఫోరక రచనా ప్రావీణ్యాన్ని జాగ్రత్తగా గమనించాలి. తర్వాత మనకంటూ ఒక శైలిని అలవరచుకోవడానికి ప్రయత్నించాలి.

పురాణేతిహాసాలనుంచి, కావ్యాలనుంచి, జానపద కథలనుంచి పంచతంత్రం నుంచి సినిమా మాటలు, పాటలనుంచి ఎక్కడ ఏది సరిపోతే ఆ ఉదాహరణ, ఉపమానం రాస్తూ పాఠకులను అలరించాలి. సామెతలు, బాగా ప్రాచుర్యం పొందిన పదబంధాలు ఉపయోగించాలి. అలాగని అరిగిపోయిన సంభాషణల జోలికి పోకూడదు. కొత్తవాటిని సంధించాలి. వ్యాస రచనకు వనరులు ఏవి? ఏ విషయం అయినా వ్యాసార్హమే కనుక వనరులకు కొదువలేదు. ఆ దృష్టితో చూస్తే అడుగడుగునా వ్యాసానికి అవసరమైన వస్తువు కనిపిస్తుంది.

ఉదాహరణకు వార్తా పత్రికలోని అంశాలను తీసుకుందాం. రొయ్యలకు అంటువ్యాధిసోకి రొయ్యల దిగుబడి బాగా తగ్గిపోయిందని ఒక సింగిల్ కాలమ్ వార్త లోపలి పేజీలో కనిపిస్తుంది. కంప్యూటర్లకు వైరస్‌వ్యాధి సోకి కొన్ని కోట్ల రూపాయల నష్టం వచ్చినట్టు వ్యాపార వార్తల పేజీలో మరో వార్త ఉంటుంది. అసలు వైరస్ అంటే ఏమిటి? రొయ్యలను చంపే వ్యాధి ఎక్కడ మొదలయింది? ఆరాతీస్తే ఆసక్తికరమైన విషయాలు తెలిస్తే, వాటిని వ్యాసరూపంలో పాఠకులకు అందించవచ్చు.

హైదరాబాద్‌లో 1995 నవంబర్ మాసంలో బాలల చలన చిత్రోత్సవం జరిగింది. సినిమా నూరేళ్ళ పండుగ కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ రెండు వేడుకలకూ సుప్రసిద్ధ సినీనటుడు, మాజీ ముఖ్యమంత్రి, ఎన్.టి.రామారావు దూరంగా ఉన్నారు. సాధారణ పరిస్థితులలో అయితే, ఎవరు, ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఇటువంటి సమావేశాలలో రామారావు ప్రముఖ పాత్ర నిర్వహించాలి. కానీ ఆయన ఇంటిగడప దాటలేదు. ఆయన మనోగతాన్ని ఊహిస్తూ లేదా ఆయనతో మాట్లాడి వ్యాసం రాస్తే చదివిస్తుంది.

BRAOU

నగరంలో సర్కస్ ప్రదర్శనలు జరుగుతాయి. సర్కస్‌లో కవ్విస్తూ కవ్విస్తూ తిరుగాడే జోకర్ జీవితంలో విషాదాన్ని, ప్రమాదభరితమైన విన్యాసాలు చేసే మహిళల చిరునవ్వుల వెనుక దావానలాన్ని చిత్రించి రాయవచ్చు. ట్రాఫిక్ పోలీసుతో ఒక రోజుగడిపి, అతని విధినిర్వహణను గమనించి, అతడి అనుభవాలను ఉపయోగించుకొని ప్రత్యేక వ్యాసం తయారుచేయవచ్చు. ప్రధాని పి.వి. నరసింహారావు, మాజీప్రధాని రాజీవ్‌గాంధి సతీమణి సోనియాగాంధితో ఇరవై నిమిషాలు చర్చలు జరిపినట్లు పత్రికలో వార్త వస్తుంది. అంతకు మించి వివరాలు ఉండవు. ఎవ్వరూ చెప్పరు. ఆ రోజున దేశంలో ఉన్న సమస్యలనూ కాంగ్రెస్(ఐ) ఎదుర్కొంటున్న కష్టాలనూ లేదా పి.వి. సోనియాల మధ్య ఉన్నాయని అనుకుంటున్న విభేదాలనూ ప్రస్తావిస్తూ రాజకీయ విశ్లేషకులు ఊహించి సమావేశం వివరాలు రాస్తారు. కానీ సోనియాగాంధీ నివాసంలో పని చేసేవారిని, డ్రైవర్‌ను, వంటమనిషిని, ఇతరులను కలుసుకొని పి.వి. సోనియాలు సమావేశమైన ఇరవై నిమిషాలలో ఏమేమి తిన్నారో, ఏమి తాగారో, ఎవరిని పలకరించారో, ఎక్కడ కూర్చున్నారో వారి ముఖకవళికలు ఎలా ఉన్నాయో తెలుసుకొని. రాయగలిగితే మంచి వ్యాసం తయారవుతుంది. పరిశోధించి సాధించాలి.

అంటే చిన్న విషయం నుంచి పెద్ద విషయం దాకా, గల్లీనుండి ఢిల్లీదాకా ఎక్కడ చూస్తే అక్కడ ప్రత్యేక వ్యాసానికి అవసరమైన ప్రేరణ లభిస్తుంది. పరిశోధించే మనస్తత్వం, అందంగా రాసే నైపుణ్యం ఉంటే వ్యాసాల పంట పండుతుంది.

**అభ్యాసం-3 : వ్యాసాలకు ముడిసరుకును ఎలా సేకరించాలి.**

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

BRAOU

## 18.7 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

- ★ అనుబంధాలు, ప్రత్యేక సంచికలు ఎప్పుడు వెలువరిస్తారు, వాటి కోసం ఎలా రాయాలనే విషయం తెలుసుకోవాలి. వార్త రచనలో పాటించాల్సిన సూత్రాలన్నీ వ్యాసరచనలో విధిగా పాటించాల్సిన అవసరం లేదు.
- ★ సందర్భాన్ని బట్టి వ్యాసమూ రాయాలి.
- ★ గణాంకాలు, సాధికారిక సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలి. విశ్లేషణ, వివరణ వుంటే చదివించే రీతిలో ఉంటుంది.

## 18.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి

1. ప్రత్యేక వ్యాసం అంటే ఏమిటి నిర్వచించి, లక్షణాలను వివరించండి?
2 ప్రత్యేక వ్యాసం ఎన్ని రకాలో ఏవిధంగా తెలియచేయండి

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి

1. ప్రత్యేక వ్యాస రచన వనరులను, రచనకు మెలకువలను చర్చించండి?
2. ప్రత్యేక వ్యాసం విభాగాలను పేర్కొనండి.

**- కొందుభట్ల రామచంద్రమూర్తి**

# ఖండం - 4

## కాలిక పత్రికలు - ఇతర పత్రికలు

పత్రికలకు కాలీయత ప్రధానమైన లక్షణం. పత్రిక లనగానే దినపత్రిక, వార్తాపత్రికలనే అభిప్రాయం సహజంగా కలుగుతుంది. కానీ పత్రికలు వాటివాటి కాలీయతను బట్టి, అంటే అవి వెలువడే తీరునుబట్టి పలురకాలుగా వుంటాయి. ఆ కాలీయతను బట్టీ వార్తలు, వ్యాసాలు ఇతర రచనలు వుంటాయి.

పత్రికల కాలీయత (Periodicity) కేవలం పత్రిక వెలువడే సమయాన్ని మాత్రమే కాక ఆ పత్రికల స్వభావాన్ని కూడా సూచిస్తుంది. దినపత్రికలో వార్తారచనకు, వార, పక్ష, మాస పత్రికల్లో వార్తా రచనకు తేడా వుంటుంది. అలాగే వార్తలపై వివరణలు, విశ్లేషణలు, విమర్శలు, విశదీకరణలకు కూడా కాలిక పత్రికల్లోనే అవకాశాలు ఎక్కువగా వుంటాయి. ఈ ఖండంలోని ఐదు భాగాల్లో కాలిక పత్రికల రకాలు, రచనా పద్ధతులను చర్చించడం జరిగింది. అవి **1.** కాలిక పత్రికలు-రకాలు, **2.** కాలిక పత్రికా రచన, **3.** సాహిత్య పత్రికలు, **4.** సాంకేతిక పత్రికలు, పరిశోధనా పత్రికలు. **5.** సంస్థా పత్రికలు.

ఈ భాగాల్లో చర్చించిన అంశాలను చదివితే కాలిక పత్రికల స్వభావం, అవసరం అవగతమవుతుంది. అంతేకాక ప్రస్తుతం వెలువడుతోన్న కాలిక పత్రికలను పరిశీలించే అవకాశమూ కలుగుతుంది.

BRAOU

BRAOU

# భాగం - 19 : కాలిక పత్రికలు - రకాలు, స్వభావం

## విషయక్రమం


19.0 ఉద్దేశం

19.1 ప్రవేశిక

19.2 కాలికత - కాలిక పత్రికలు

19.3 కాలికత రీత్యా కాలిక పత్రికలు

19.4 స్వభావరీత్యా ప్రత్యేక పత్రికలు

19.4.1. సాధారణ లేదా సార్వజనీన కాలిక పత్రికలు

19.4.2. ప్రత్యేక తరగతి పాఠకులకోసం

19.4.3. ఒక ప్రత్యేక రంగానికి సంబంధించిన కాలిక పత్రికలు

19.5 కాలిక పత్రికల అవసరం

19.6 అదనపు సమాచారం

19.7 కాలిక పత్రికలు - పాఠకులు

19.8 అంగాల కూర్పు - ప్యాకేజి

19.9 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

19.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 19.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు.

- కాలిక పత్రికల అవసరం
- కాలనియతరీత్యా కాలిక పత్రికలు
- స్వభావరీత్యా ప్రత్యేక పత్రికల గురించి తెలుసుకుంటారు.

BRAOU

## 19.1 ప్రవేశిక

వార్తా పత్రికలంటే దినపత్రికలనే అభిప్రాయం స్థిరపడింది. దినపత్రికలకు భిన్నమైనవి కాలనియత లేక కాలిక పత్రికలు. కాలిక పత్రికలకు దేని పాఠకులు దానికి వుంటారు. దినపత్రికల్లో తాజా వార్తలు, సమాచారం వుంటుంది. అయితే కాలిక పత్రికల్లో వార్తలుండవు కానీ విశేషాలుంటాయి. వినోదం, విజ్ఞానం, ఆహ్లాదం కలిగించే రచనలుంటాయి. పాఠకుడికున్న సమస్య పఠనావసరాలను ఆసక్తికరంగా ఆకర్షణీయంగా తీర్చే అంశాలుంటాయి. వివిధ వర్గాల పాఠకుల కోసం వెలువడుతున్న కాలిక పత్రికల గురించి సవివరంగా తెలుసుకుందాం.

## 19.2 కాలికత - కాలిక పత్రికలు

పుస్తకాలకు పత్రికలకు తేడా వుంది. కథ, నవల, కవిత వంటి సృజనాత్మక రచనలైనా, పరిశోధక వ్యాసాలు, జీవితచరిత్రలు, శాస్త్ర విషయాలు వంటి ఇతర రచనలైనా పుస్తకరూపం తీసుకోవడానికి కొన్ని లక్షణాలు కలిగి ఉండాలి. అవి ఒకే వ్యక్తి రాసిన రచనలో, వేర్వేరు వ్యక్తులు ఒకే విషయంపై చేసిన రచనలో, ఒకే కాలానికి చెందిన రచనలో - మొత్తానికి ఏదో

ఒక సమానాంశం ఉన్న రచనలై ఉండాలి. పుస్తక రూపంలో వెలువడ్డ రచనలలోని అంశాలు కూడా అప్పుడప్పుడు పొరపాట్లుగా, కాలం చెల్లినవిగా తరువాతి కాలంలో గుర్తించబడవచ్చు. అయినప్పటికీ, పుస్తకాల జీవితకాలం హెచ్చు. పత్రికల విషయం అలా కాదు. సృజనాత్మక రచనలను మినహాయిస్తే, పత్రికలలోని పఠనసామగ్రికి స్వల్పకాలంలోనే కాలం చెల్లిపోతుంది. పుస్తకాలలాగా పత్రికలు పదే పదే పఠించడానికీ, పరామర్శించడానికీ యోగ్యంగా ఉండనక్కరలేదు. పత్రికలలో ప్రచురించే అంశాల మధ్య ఏకసూత్రత పుస్తకాలలో ఉన్నంత కఠినంగా ఉండనక్కరలేదు. పుస్తకాలల్లో ఉండే లక్షణాలు కలిగిన రచనలు పత్రికల్లో కూడా ప్రచురితం కావచ్చు. అప్పుడవి విడిగా సంకలితమై పుస్తకరూపం ధరిస్తాయి. పుస్తకాలకు ఒక్కసారే జన్మ, పత్రికలు పదేపదే జన్మిస్తాయి. పుస్తకం రెండోసారి, మూడోసారి, యాభయ్యోసారి కూడా పునర్ముద్రణ పొందవచ్చు. కానీ, అదే విషయం, అదే రచన. పత్రిక అలా కాదు. ప్రతిసారీ సరికొత్తగా రావలసిందే. పుస్తకాలకు, పత్రికలకు మధ్య ఉన్న ముఖ్యమైన తేడా కాలికత/ కాలనియమం (periodicity).

ఒకే పేరు (Title) తో నిర్దిష్టమైన కాలికతతో మళ్ళీమళ్ళీ సరికొత్తగా వెలువడే ప్రచురణను పత్రికలు అని స్థూలంగా చెప్పుకోవచ్చు. ఒకే పేరు, కాలికత అన్నవి ఇక్కడ ముఖ్యంగా గమనించదగ్గవి. ఈ రెండు లక్షణాలకూ, ఆధునిక ముద్రణా సదుపాయాల అభివృద్ధితో సంబంధం ఉంది.

అచ్చు యంత్రమే కాదు, కాగితాలు లేని రోజులలో కూడా గ్రంథ రచన జరిగింది. కావలసినవారు గ్రంథాల ప్రతులను తాటాకుల మీద రాసుకోవడమో, రాయించుకోవడమో ఉండేది. ఒకచోటి నుంచి మరొకచోటికి వర్తమానాలు చేరవేయడానికి శ్రీముఖాలు పంపుకోవడం ఉండేది. శుభపత్రికలూ, ఆహ్వాన పత్రికలూ కూడా ఉండేవి. కానీ, నిర్దిష్టమైన కాలికతతో ఒకే పేరుతో పునఃపునః సరికొత్త పఠనీయ అంశాల సంచికను ప్రజలకు చేరవేయడం ముద్రణా యంత్రానికి పూర్వం సాధ్యమయ్యేది కాదు. పెద్ద సంఖ్యలో, త్వరితంగా ముద్రించగలిగే యంత్రాలూ, పత్రికలను చేరవేసే రవాణాసాధనాలూ అభివృద్ధి చెందకుండా పత్రికల వ్యాప్తి సాధ్యం కాదు.

ఆరంభంలో ప్రపంచమంతటా 'దీర్ఘ' కాలికత ఉన్న పత్రికలే వెలువడ్డాయి. ఆ తరువాతే దినపత్రికలు ప్రారంభమయ్యాయి. తెలుగులో తొలిపత్రిక 1830 దశకంలో వెలువడగా, తొలి దినపత్రిక రావడానికి తరువాత 85 ఏళ్ళు ఆగవలసి వచ్చింది. 'ఆంధ్ర పత్రిక', దినపత్రిక 1914లో ప్రారంభమైంది. ఇప్పుడు సంపన్న దేశాలలో 'కాలికత' మరింత కుంచించుకుపోయి గంటల తేడాతో వార్తాపత్రికలు ఎడిషన్లు తెస్తున్నాయి. పాఠకుల సంఖ్య పెరగడం, కమ్యూనికేషన్లు విస్తరించడం, సమాచార స్పృహ, సమాచార అవసరం పెరగడం, ముద్రణారంభంలో విప్లవాత్మకమైన అభివృద్ధి జరగడం, దృశ్యశ్రవణ సమాచార సాధనాల నుంచి పోటీ ఏర్పడడం - ఈ కారణాల వల్ల వార్తాపత్రికలు తమ కాలికతను తగ్గించుకోవలసి వచ్చింది.

మన దేశంలో వార్తాపత్రికలంటే దినపత్రికలనే మాట స్థిరపడిపోయింది. వార్తేతర అంశాల పత్రికలు ఇతర కాలికతలకు సంబంధించిన వయ్యాయి. దినపత్రికలు కానివి కాలిక పత్రికలు (periodicals) గా పత్రికారంగంలో ప్రత్యేక విభాగమయ్యాయి.

కాలిక పత్రికలు - పీరియాడికల్స్ - అన్నమాట పత్రికలు ఎంత వ్యవధితో వెలువడుతాయి అన్నదానిపై వచ్చిన పేరు అయినా, విషయ స్వభావరీత్యా కూడా అవి భిన్నమైనవి. వార్తలు, సమాచారం కాని అంశాలను ప్రచురించే పత్రికలు పీరియాడికల్స్‌గా పేరుపొందాయి. కాబట్టి - కాలిక పత్రికలను కాలికత రీత్యా, స్వభావం రీత్యా రెండు రకాలుగా విభజించవచ్చు.

### కాలికత రీత్యా కాలిక పత్రికలు

ఎ) వారంలో రెండుమార్లు వెలువడే పత్రికలు (Bi-weeklies)
బి) వారపత్రికలు (Weeklies)
సి) పక్షపత్రికలు (Fortnightlies)
డి) మాస పత్రికలు (Monthlies)
ఇ) ద్వైమాసిక పత్రికలు (Bi-monthlies)

BRAOU

ఎఫ్) త్రైమాసిక పత్రికలు (Quarterlies)

జి) షణ్మాసిక పత్రికలు (Half-yearlies)

హెచ్) వార్షిక పత్రికలు (Annuals)

స్వభావరీత్యా కాలిక పత్రికలు

ఎ) సాధారణ లేదా సార్వజనీన కాలిక పత్రికలు.

బి) ఒక ప్రత్యేక తరగతి పాఠకులకోసం ఉద్దేశించిన కాలిక పత్రికలు.

సి) ఒక ప్రత్యేక రంగానికి సంబంధించిన కాలిక పత్రికలు.

కాలిక పత్రికలలో పఠనసామగ్రి అనేక రూపాలలో, ప్రక్రియలలో ఉంటుంది. వ్యాసాలు, కథలు, నవలలు, హాస్యోక్తులు, ఇంటర్వ్యూలు, ప్రశ్నలు-జవాబులు ఇలా. విషయం కూడా అనేక అంశాల కదంబంగా ఉంటుంది. సాహిత్యం, సినిమాలు, క్రీడలు, వంటకాలు వంటి అనేక అంశాల మిశ్రమం కాలిక పత్రికల్లో ప్రచురితమవుతూ ఉంటుంది. ఈ కారణంగా కాలిక పత్రికలను కదంబ పత్రికలు, మేగజైన్స్ (Magazines) అని కూడ అంటారు. ఈ 'కదంబ' స్వభావం రీత్యా కూడా కాలిక పత్రికలు మూడు రకాలు.

1. వార్తాకదంబ పత్రికలు - న్యూస్ మేగజైన్స్ (News Magazines)
2. ఫీచర్స్ మేగజైన్స్ - (Features' Magazines)
3. ఇతరమైనవి

కాలిక పత్రికలలోని రకాలు ఇక్కడ వివరంగా చర్చిద్దాము.

BRAOU

## 19.3 కాలనియతిరీత్యా కాలిక పత్రికలు

పత్రికలు ప్రారంభమైన తొలిరోజుల్లో అన్నీ కాలికపత్రికలే ఉండేవనీ, ఆధునికత వ్యాప్తి చెందడంతో వార్తాపత్రికలు, దినపత్రికలుగా విడిగా అవతరించాయని పైన చెప్పుకున్నాము. అంటే, ఆధునిక అవసరాలు కాలికతను ప్రభావితం చేశాయని అర్థం. ఆ ప్రభావం దినపత్రికల వద్ద ఆగిపోలేదు. కాలికతరీత్యా, విషయరీత్యా కొన్ని రకాల పత్రికల నిష్క్రమణకు, కొన్ని రకాల పత్రికల ఆరంభానికి కారణమైంది. ప్రత్యేక శ్రేణుల పాఠకులకోసం, కొన్ని ప్రత్యేక రంగాలలో విస్తృత సమాచారం, పఠనసామగ్రి ఇవ్వడం కోసం కొత్త పత్రికలు అవతరించాయి. కాలికతరీత్యా ప్రచురణలోకి వచ్చిన కొన్ని పత్రికలు మార్కెటింగ్ కారణాల రీత్యా నిష్క్రమించాయి. వారానికి రెండుమార్లు వచ్చే పత్రికలు, ద్వైమాసిక, త్రైమాసిక, షాణ్మాసిక వార్షిక పత్రికలు ఇప్పుడు చాలా వరకు కనుమరుగై పోయాయి. ఉదాహరణలుగా చెప్పుకోవడానికి మాత్రం కొన్ని ద్వైమాసిక, త్రైమాసిక పత్రికలు ఉన్నాయి. ఢిల్లీ నుంచి ఇంగ్లీషు, హిందీ భాషలలో వెలువడే స్త్రీ ఉద్యమ పత్రిక 'మానుషి' (Manushi) ద్వైమాసిక పత్రికగా వెలువడుతున్నది. తెలుగు అకాడమీ వారి 'తెలుగు' పత్రిక త్రైమాసిక పత్రిక. పై రెండు పత్రికలు వ్యాపార దృష్టితో నడుస్తున్న పత్రికలు కావు. మేధావులు, చైతన్యవంతులు చదవడానికి ఉద్దేశించిన పత్రికలు అవి. శాస్త్ర విషయాలపై వెలువడే పత్రికలు, ఔత్సాహికులు చిన్నపెట్టుబడితో వ్యాపారేతర కారణాలతో నడిపే పత్రికలు ఇంకా ద్వైమాసిక, త్రైమాసిక కాలికతలలో వెలువడుతున్నాయి. కాలేజీ మేగజైన్లు, సాహిత్య, సాంస్కృతిక సంస్థల వార్షిక సంచికలు మినహా ఇప్పుడు వార్షిక పత్రికలంటూ లేవు. 'ఇండియా టుడే' ప్రాంతీయ భాషలలో వెలువడడం ప్రారంభించాక వార్షిక సాహిత్య సంచికలు, సినిమా సంచికలు ప్రచురిస్తున్నది. దీపావళికి ప్రత్యేక సంచికలు (రెగ్యులర్ పత్రిక కాకుండా) వేసే సంప్రదాయాన్ని 'ఆంధ్రజ్యోతి' వారపత్రిక ఇంకా కొనసాగిస్తున్నది.

వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు మాత్రమే తెలుగు కాలిక పత్రికల్లో ఎక్కువగా చెల్లుబాటు అవుతున్న పత్రికలు. ఇందులోనూ పక్షపత్రికలది ద్వితీయ స్థానమే. ఇండియా టుడే (తెలుగు), సుప్రభాతం - ఈ రెండు న్యూస్ మేగజైన్స్

మాత్రమే పక్షపత్రికలుగా ఇప్పుడు పాఠకుల ఆదరణ పొందుతున్నాయి. తెలుగు వారపత్రికల్లో ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, స్వాతి, ఆంధ్రభూమి, మయూరి మొదలైనవి మాసపత్రికలు. విపుల, చతుర, స్వాతి, ఆంధ్రభూమి, వనిత, వనితాజ్యోతి మొదలైనవి పాప్యులర్‌మాస పత్రికలుగా మార్కెట్‌లో ఉన్నాయి.

పిల్లల పత్రికలు చందమామ, బాలజ్యోతి, బాలమిత్ర మాసపత్రికలుగా వెలువడుతున్నాయి. వ్యాపార, వాణిజ్య విశేషాల పత్రికలు షేర్‌కాలమ్, మనీ బిజినెస్ వారపత్రికలుగా, క్యాపిటల్ మార్కెట్ (తెలుగు), షేర్ బిజినెస్ (తెలుగు), దలాల్‌స్ట్రీట్ పక్ష, మాస పత్రికలుగా వెలువడుతున్నాయి. క్రీడారంగానికి, యువకులకు ప్రత్యేకంగా తెలుగులో పత్రికలు లేవు. సితార, జ్యోతిచిత్ర, శివరంజని, సూపర్‌హిట్ వారపత్రికలుగా, విజయచిత్ర మాసపత్రికగా సినిమాలలో పాఠకులకు అందుబాటులో ఉన్నాయి. వైద్య, ఆరోగ్య సలహాలకు, వినియోగదారులకు తెలియపరచడానికి ఇప్పుడిప్పుడే ప్రత్యేక పత్రికలు వస్తున్నాయి.

కథలు, నవలలు, ఫీచర్లతో వెలువడే పాప్యులర్ వీక్లీ మేగజైన్లు తెలుగుకాలిక పత్రికల్లో అగ్రస్థానంలో ఉన్నాయి. పాఠకులు అధికంగా ఉండే సినిమా పత్రికలు కూడా వారపత్రికలుగానే వస్తున్నాయి.

తెలుగులో పూర్తి వ్యవసాయ పత్రిక 'అన్నదాత' మాత్రమే. ఈనాడు గ్రూపు నుంచి వెలువడుతున్న ఈ మాసపత్రిక రైతుల అదరాభిమానాలు పొందినది. ఆయా ప్రాంతాల శీతోష్ణస్థితులు, వర్షపాతం, పంటలు, తెగుళ్ళు, సస్యరక్షణ, దిగుబడులకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని అందజేస్తోంది.

## 19.4 స్వభావరీత్యా ప్రత్యేక పత్రికలు

ఈ రకం పత్రికల గురించి వివరంగా చర్చిద్దాము.

### 19.4.1 సాధారణ లేదా సార్వజనీన కాలిక పత్రికలు

ప్రత్యేక శ్రేణి పాఠకులను కానీ, ప్రత్యేక రంగాన్నికాని ఉద్దేశించకుండా అందరినీ లక్ష్యంగా పెట్టుకుని వెలువడే కాలిక పత్రికలు ఇవి. కథలో, సీరియల్ నవలలు, ఫీచర్లు, సినిమా రంగ విశేషాల కదంబంగా వెలువడుతున్న పత్రికలన్నీ ఈ కోవలోకి వస్తాయి. ఉదాహరణకు స్వాతి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మొదలైన వారపత్రికలు.

BRAOU

### 19.4.2 ప్రత్యేక తరగతి పాఠకులకోసం

ఇందుకోసం ఉద్దేశించిన కాలిక పత్రికలు పిల్లలు, విద్యార్థులు, స్త్రీలు, యువజనులు, ఉద్యోగార్థులు ఇలా ఒక ప్రత్యేక శ్రేణికి చెందిన పాఠకులకోసం ప్రత్యేకంగా పత్రికలు. ఉదాహరణ : వనిత, వనితాజ్యోతి, చందమామ, ఉద్యోగపర్వాలు, పాఠశాల, మా బడి, ఉద్యోగ సోపానాలు మొదలైనవి.

### 19.4.3 ఒక ప్రత్యేక రంగానికి సంబంధించిన కాలిక పత్రికలు

క్రీడారంగం, వాణిజ్య రంగం, వైద్యం, వినియోగదారుల హక్కులు, ఫ్యాషన్లు - ఇలా ఒక ప్రత్యేక రంగానికో, అంశానికో సంబంధించినవి ఈ కోవలోకి వస్తాయి.

ఉదాహరణ : షేర్‌కాలం, షేర్ బిజినెస్, మనీ బిజినెస్, ఫ్యామిలీ డాక్టర్ మొదలైనవి.

కదంబ స్వభావం రీత్యా కూడా కాలిక పత్రికలు మూడు రకాలని చెప్పుకున్నాము. వార్తాపత్రికలన్నీ అత్యధికం దినపత్రికలేనని, కాలిక పత్రికల్లో వార్తాంశాలు కానివి కూడా ఉంటాయని స్థూలంగా విభజించుకున్నాము. కానీ, 'న్యూస్

మేగజైన్స్' అన్న శ్రేణి కాలిక పత్రికలలో ఒకటి ఉంది. ఇంగ్లీషులో ఇండియాటుడే. సన్‌డే. బ్లిట్జ్. వీక్. ఫ్రంట్‌లైన్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. ఏ రోజు వార్తలు ఆ రోజు దినపత్రికలో చదువుకునే పాఠకులు అవే వార్తలను కాలిక పత్రికల్లో ఎందుకు చదువుతారు? కాలిక వార్తా మేగజైన్లలో వార్తలపై ఆధారపడ్డ అంశాలే ఉన్నప్పటికీ. వాటిని పాఠకులకు అందించే పద్ధతి కాలిక పత్రికల పద్ధతి. అదనపు సమాచారంతో, ఫొటోలు బొమ్మల హంగులతో, ఆసక్తికరమైన కథనంతో వార్తలను తీర్చిదిద్దుతాయి ఈ న్యూస్ మేగజైన్లు. తెలుగులో ఈ రకం మేగజైన్లకు ఉదాహరణ - ఇండియా టుడే, సుప్రభాతం పక్ష-పత్రికలు.

ఇక ఫీచర్స్ మేగజైన్స్ అంటే వార్తాంశాలపైనా, ఇతర అంశాలపైనా రూపొందించిన విశేష వ్యాసాలు అధికంగా ఉండే పత్రికలు. ఇంగ్లీషులో రీడర్స్ డైజెస్ట్, సొసైటీ, సావీ, ఫెమినా వంటి పత్రికలు ఈ కోవలోకి వస్తాయి. (తెలుగు వారపత్రికలలో కాల్పనిక సాహిత్యం (Fiction) దే పై చేయి కాబట్టి వాటిని ఈ కోవలోకి తీసుకురాలేము. అయితే, తెలుగు వారపత్రికల్లో కూడా ఫీచర్ల అంశ పెరుగుతోంది) ఈ తెలుగులో ఈ రకం పత్రికలు లేవనే చెప్పాలి.

తెలుగు కాలిక పత్రికల్లో అధికభాగం మూడోరకానికి చెందినవి. తెలుగు కాలిక పత్రికలో కాల్పనిక సాహిత్యం విడదీయరాని భాగమైపోయింది. 'ఇండియాటుడే' వంటి పూర్తి న్యూస్ మేగజైన్ కూడా తన తెలుగు ప్రచురణలో కథను. సీరియల్‌ను చొప్పించింది. తెలుగులో పాప్యులర్ వీక్లీలు, మాసపత్రికలు అన్నీ కూడా ఫిక్షన్ అధికంగా కలగలసిన ఫీచర్ మేగజైన్లు అనేక భాషల కథల పత్రిక విపుల, నవలే పత్రికగా వస్తున్న చతుర తెలుగులో విశిష్టమైన మేగజైన్లు. వాటిని కూడా మూడో కోవలోనే చెప్పాలి.

## 19.5 కాలిక పత్రికల అవసరం

వర్తమాన రాజకీయ సామాజిక పరిణామాలనూ, సంఘటనలనూ వార్తాపత్రికలు సమాచారం రూపంలో, వ్యాఖ్యల రూపంలో అందజేస్తాయి. వార్తాపత్రికలు ప్రధానంగా దినపత్రికలే అని చెప్పుకున్నాము. మరి కాలిక పత్రికలు ఎందుకు? అవి పాఠకులకు ఏ రకం పఠన సామగ్రిని అందజేస్తాయి? ఏ పఠన అవసరాలను తీరుస్తాయి?

అక్షరాస్యుడైన పాఠకుడికి చదవడం దైనందిన అవసరంగా ఉంటోంది. విద్యాస్థాయిని బట్టి, తీరికనుబట్టి, సాంఘిక సాంస్కృతిక స్థాయినిబట్టి, ఇతర పరిస్థితులనుబట్టి పాఠకుల పఠన అవసరాలుంటాయి. భూకంపాలూ, రోడ్డు ప్రమాదాలూ, రాజకీయ మార్పులు, ఎన్నికల ఫలితాలు - ఇటువంటి సమాచారాన్ని తెలుసుకోవడం ఒక అవసరం మాత్రమే. అదికాక, చదవడం ద్వారా వినోదాన్ని, విజ్ఞానాన్ని, ఆహ్లాదాన్ని పాఠకులు పొందాలనుకుంటారు. సృజనాత్మకతను ఆస్వాదించగలిగే శక్తిని సంతృప్తి పరుచుకోవాలనుకుంటారు. రాజకీయ పరిణామాలనే కాదు, మానవ సంబంధాలను. సాంఘికంగా అంతర్లీనంగా జరుగుతున్న పెనుమార్పులను విశ్లేషించుకోవాలనుకుంటారు. మానవజీవితాన్ని ప్రతిభావంతంగా ప్రతిఫలించే కాల్పనిక సాహిత్యాన్ని చదవాలనుకుంటారు. తాము ప్రముఖులుగా భావించేవారి వ్యక్తిగత జీవితాల గురించి తెలుసుకోవాలనుకుంటారు. ఈ పఠన అవసరాలను వార్తాపత్రికలు తీర్చగలవా? మానవజీవితం ఎంత విస్తృతమైనదో, ఎంత వైవిధ్యభరితమైనదో, మానవాభిరుచులు కూడా అంతగా బహుముఖమైనవి. కాలిక పత్రికలు పాఠకుల ఈ అభిరుచి వైవిధ్యాన్ని సంతృప్తిపరుస్తాయి.

వార్తలు సమాజంలో బాహ్యంగా జరిగే సంఘటనలను మాత్రమే తెలియజేస్తాయి. కాల్పనిక సాహిత్యం సమాజంలో చలనంలో ఉన్న మానవ సంబంధాలను, సామాజిక సంబంధాలను పట్టి చూపుతాయి. ఎంతటి అధమస్థాయి సాహిత్యమైనా ప్రజల అభిరుచులను, మారుతున్న సమాజాన్ని ఏదోరకంగా ప్రతిబింబిస్తుంది. తెలుగులో సృజనాత్మక సాహిత్యానికి కాలిక పత్రికలు చేసిన సేవ అపరిమితమైనది. తొలినాటి పత్రికలేకాదు. నేటి పత్రికలు కూడా తెలుగు సాహిత్యానికి వేదికలుగా ఉంటున్నాయి.

వివిధ జీవిత విధానాలను పరిచయం చేయడం, సాంస్కృతిక రంగంలో ప్రజలకు సన్నిహితమైన సినిమా తారలవంటి వ్యక్తుల అభిప్రాయాలను, జీవిత విశేషాలను చెప్పడం, ఆహార వ్యవహారాలలో కొత్త పోకడలను చిత్రించడం - ఇవన్నీ కాలిక

BRAOU

పత్రికలు నెరవేరుస్తున్న బాధ్యతలు. ఈ రకమైన ఉపయోగకర (Utility-based) సమాచారం పాఠకులకు అవసరాన్ని, సంతృప్తిని కలిగిస్తుంది.

వార్తాపత్రికకూ, కదంబ కాలిక పత్రికకు డాక్యుమెంటరీకి, కథాచిత్రానికీ ఉన్నంత వ్యత్యాసం ఉంది. దేని ప్రయోజనం దానిది. రెండూ అవసరాలే.

**అభ్యాసం-1: కాలిక పత్రికలు ఎన్నిరకాలు?**

........................................................................................................................................................

........................................................................................................................................................

........................................................................................................................................................

........................................................................................................................................................

........................................................................................................................................................

## 19.6 అదనపు సమాచారం

దినపత్రికలు, కాలిక పత్రికలు స్వభావరీత్యా ఎలా భిన్నమైనవో చెప్పుకున్నాము. కానీ, ఆ విభజనరేఖలు మినహాయింపులు లేనివేమీ కాదు. ఇప్పుడు అనేక దినపత్రికలు ప్రతిరోజూ ఏదో ఒక ఫీచర్స్ అనుబంధాన్ని అందిస్తున్నాయి. ఆ అనుబంధాలు వారానికోసారి ప్రచురితమవుతాయి. ఆ అనుబంధాలు విడిగా చూస్తే కాలిక పత్రికల స్వభావాన్ని కలిగి ఉంటాయి. దినపత్రికల ఆదివారం అనుబంధాలైతే ప్రత్యేకంగా వారపత్రికలవలె ఉంటున్నాయి. వాటికి కూడా కాలిక పత్రికల లక్షణం ఉన్నట్టే. దినపత్రికలలో కాలిక పత్రికల అంశ ఉన్నట్టే కొన్ని కాలిక పత్రికలలో కూడా దినపత్రికల అంశ అంటే వార్తాపత్రికల అంశ ఉంటుంది. నిజానికి కొన్ని వారపత్రికలు వార్తాపత్రికలే. నెల్లూరునుంచి వచ్చే 'జమీన్ రైతు' ఎన్నో దశాబ్దాలుగా వార్తా, వ్యాసాల పత్రికగా వెలువడుతోంది. పాశ్చాత్య దేశాలలోనూ, మనదేశంలోని ఆంగ్లపత్రికా రంగంలో కూడా 'సండే న్యూస్ పేపర్స్' అన్న భావన ఉంది. ఆ పత్రికలు ప్రధానంగా వారపత్రికల వలె మేగజైన్ స్వభావాన్ని కలిగి ఉంటూనే మొదటిపేజీ మాత్రం వార్తలతో ఉంటాయి. (ఉదా : బొంబాయినుంచి శనివారం వెలువడే 'మెట్రోపాలిస్ ఆన్ సాటర్ డే') తెలుగులో జిల్లా కేంద్రాల నుంచి వెలువడే అనేక వారపత్రికలు ప్రధానంగా వార్తాపత్రికలే. కాబట్టి, కాలికతను పత్రికా స్వభావానికి నూటికి నూరుపాళ్ళు ముడిపెట్టడం సరికాదు. ప్రధాన ధోరణి మాత్రం వార్తాపత్రికలు దినపత్రికలుగా, ఇతర అంశాల పత్రికలు కాలిక పత్రికలుగా ఉంటున్నాయి.

మన దేశంలో జాతీయభావాలు బలపడడానికి ముందు ఇంగ్లీషువారి ప్రభావం వల్ల సంఘ సంస్కరణ దృష్టి ప్రవేశించింది. అచ్చు యంత్రం వాడుకలోకి రావడంకూడా అదే సమయంలో జరిగింది. సమాజంలోని దురాచారాలను రూపుమాపాలని సంకల్పించిన సంస్కర్తలకు పత్రికలు మంచి ఆయుధాలయ్యాయి. 1830 నుంచి సుమారు శతాబ్దంపాటు తెలుగులో వెలువడిన అనేక కాలికపత్రికలు ఏదో ఒక సంస్కరణను ఆశయంగా పెట్టుకున్నవే. స్త్రీ విద్యను, సార్వత్రిక విద్యను, వాడుకభాష ప్రవేశాన్ని కోరుతూ, మూఢాచారాల్ని నిరసిస్తూ సంస్కర్తలు అనేక పత్రికలు నడిపారు. విద్యావంతుల సంఖ్య పెరగడం, రవాణా సౌకర్యాలు కమ్యూనికేషన్లు భారతదేశంలోని దూరాల్ని తగ్గించి జాతీయంగా ప్రజల్ని దగ్గర చేయడం, జాతీయభావన బలపడడం కారణంగా వార్తాపత్రికలు ప్రత్యేకంగా అవతరించాయి. కాలిక పత్రికలు సాంఘిక సమస్యల చర్చలకు, సాహిత్య సేవకు పరిమితమయ్యాయి. ఇంతలో సినిమారంగం బలపడింది. సినిమాల గురించి వార్తలకు పాఠకులు పెరిగారు. 1940లలోనే ప్రత్యేక సినిమారంగ పత్రికలు మొదలయ్యాయి. పండితులు చదివే సాహిత్య చర్చలు, చరిత్ర పరిశోధక వ్యాసాలు క్రమంగా ప్రధానకాలిక పత్రికల నుంచి వైదొలిగాయి. కథలు, నవలలు, సినిమాలు, కాలక్షేపపు వ్యాసాలు - అన్న ఫార్ములాతో 1950లలో తెలుగువారపత్రిక జనంలోకి దూసుకుపోయింది. మాసపత్రికలుగా ఉన్న సినిమా రంగపత్రికలు

BRAOU

మరుగైపోయి 1970 దశకంలో సినీవారపత్రికలు ప్రారంభమయి పుంజుకున్నాయి. ఇప్పుడు వైద్య పత్రికలు, వాణిజ్య రంగ పత్రికలు, పిల్లల పత్రికలు, స్త్రీల పత్రికలు, ఉద్యోగార్థుల పత్రికలు ప్రత్యేకంగా వెలువడుతున్నాయి. సార్వజనీన పత్రికలుగా ఉన్న ప్రధాన వారపత్రికలు కూడా విషయపరధిలో ఎన్నో మార్పులకు లోనయ్యాయి. చాలా కాలంగా వెలువడుతున్న ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వారపత్రికలను 1960 దశకంతో పోల్చి చూస్తే వాటి ఫార్ములాలో, ప్రమాణాలలో ఎంతో తేడా కనిపిస్తుంది.

1980 దశాబ్దంలో మనదేశంలో టెలివిజన్ మరో బలమైన సమాచార సాధనంగా అవతరించింది. 1990 దశాబ్దారంభం నుంచి ఉపగ్రహ టెలివిజన్, కేబుల్ టీవీ ప్రజల జీవితంలో విడదీయరాని భాగాలైనాయి. ఈ పరిణామాలు దినపత్రికల కన్న కాలిక పత్రికలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. పోటీని తట్టుకోవడానికి కాలిక పత్రికలు తమ స్వరూప స్వభావాలలో పెద్దమార్పులు చేసుకోవలసి వస్తోంది. దృశ్య శ్రవణ సాధనంగా వినోదాన్నిస్తున్న టెలివిజన్ తమ పాఠకులనుకబళించకుండా, కాలిక పత్రికలు మరింత దృశ్యభరితం కావలసి వస్తోంది. శైలిని, విషయాన్ని ఆకర్షణీయంగా మలచవలసి వస్తోంది. ఈ మార్పు ఇంగ్లీషు కాలిక పత్రికలోనూ కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. ఇంగ్లీషు పీరియాడికల్స్ అన్నీ ఖరీదైన కాయితాన్ని, రంగురంగుల ముద్రణను వాడుతున్నాయి. పరిమితమైన పాఠక శ్రేణిని లక్ష్యంగా పెట్టుకుని ప్రత్యేక (Exclusive) లక్షణాలను సంతరించుకుని వెలువడుతున్నాయి.

పాఠకుడు - సంపాదకుడు అన్న సంబంధం బలహీనమై మార్కెట్ - మార్కెటీర్ అన్న భావన ఈ పోటీవల్ల బలపడుతోంది. ఎక్కువగా అమ్ముడు పోయేదే తయారుచేయాలన్న మార్కెట్ సూత్రం పత్రికలలో బలపడి, ప్రమాణాలు క్షీణిస్తున్నాయి. అసభ్యత, బాధ్యతారహితమైన రాతలు పెరిగిపోతున్నాయి. ఒకనాడు సంఘసంస్కరణకు, జాతీయోద్యమానికీ దోహదంచేసిన కాలిక పత్రికలు ఇప్పుడు సత్కాలక్షేపం కూడా అందివ్వలేకపోతున్నాయి.

## 19.7 కాలిక పత్రికలు - పాఠకులు

వ్యాపార కారణాల వల్ల, సమాచారం పఠనావసరాలు పెరిగిపోవడంవల్ల 'అందరూ' చదివే కాలికపత్రికలు తగ్గిపోయి, కొందరు మాత్రమే చదివే పత్రికల సంఖ్య పెరుగుతోంది. మార్కెట్‌లో స్థిరపడ్డ పెద్ద పత్రికలు మాత్రం సార్వజనీన పత్రికలుగా కొనసాగుతున్నాయి. మార్కెటింగ్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పత్రికలు వ్యవహరించే పద్ధతి ఆసక్తికరంగా ఉంటుంది.

## 19.8 అంగాలకూర్పు - ప్యాకేజ్

తెలుగులో ఇప్పుడు బహుళప్రచారంలో ఉన్న స్వాతి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలను పరిశీలిద్దాం. ఈ పత్రికలు సీరియల్ నవలలను, కథలను, కార్టూన్‌లను, ఫోటోలను, పండుగలు పబ్బాల విశేషాలను, సినిమాతారల వ్యక్తిగత జీవితాల గురించిన గాసిప్స్‌ను, సినిమా షూటింగ్స్ విశేషాలను, వింతలు విడ్డూరాలను, మనస్తత్వాలను, వంటకాల వివరాలను, ఫ్యాషన్స్ పోకడలను పాఠకులకు అందిస్తున్నాయి. వర్తమాన రాజకీయ పరిణామాలపై ఒకటో రెండో పరిచయాత్మక వ్యాసాలు కూడా వాటిల్లో ఉంటున్నాయి. అవి కుటుంబమంతా చదవడానికి ఉద్దేశించిన పత్రికలు. తాము సపరివార పత్రికలమనీ కుటుంబ పత్రికలమనీ ఆ పత్రికలు చెప్పకుంటాయి కూడా. విద్యావంతులై ఇంటిపట్టున ఉండే గృహిణులను, కొంత తీరిక లభించే పురుష ఉద్యోగులను, కుటుంబంలోని సీనియర్ సభ్యులను, పిల్లలను - అందరినీ సంతృప్తి పరిచే విధంగా వాటిల్లో శీర్షికలుంటాయి. ప్రతివారం ఫలానారోజున, అంటే ప్రతి గురువారమో, శుక్రవారమో, శనివారమో అవి మార్కెట్‌లోకి వస్తాయి. సీరియల్ నవలలు చదివేవారు, తాము చదువుతున్న నవలలోని తరువాతి కథ ఏమిటో తెలుసుకోవాలని కుతూహలంతో ఉంటారు. ప్రతి పత్రికా అందించబోయే శీర్షిక లెటువంటివో పాఠకులకు ముందే తెలుసుకాబట్టి, ఆయా శీర్షికలలో ఏ కొత్త పఠన

BRAOU

సామగ్రి ఉంటుందోనన్న ఉత్సుకత కూడా ఉంటుంది. దినపత్రికలు ప్రతిరోజూ అనూహ్యంగా (unpredictable) ఉండాలి. అప్పుడే పాఠకులకు తృప్తి. కాలిక పత్రికలు ఊహ్యం (predictable) గా ఉండాలి. అప్పుడే పాఠకులకు వాటిపై గురి ఉంటుంది.

దినపత్రికలు లేదా వార్తాపత్రికలలో వార్తలన్నీ పత్రికా ఉద్యోగులు రాస్తారు. కాలిక పత్రికలలో అధికభాగం బయటివారు పంపిన రచనలు ప్రచురితమవుతాయి. వార్తలన్నీ ఒకే శైలిలో, పదజాలంతో ఉంటే వార్తాపత్రిక పాఠకుడికి సదుపాయం. భిన్నమైనశైలులు, రకరకాల ధోరణులు ఉండడం కాలిక పత్రికలకు అలంకారం. దినపత్రికలకు ఉన్నట్టుగా ప్రమాణశైలి (Style Book) కాలిక పత్రికలకు ఉండదు. కాలిక పత్రికలకు ముఖ్యమైనది "ప్యాకేజ్" (Package) "ప్యాకేజ్" అంటే పత్రికలో ఉండే అంశాల ఎంపిక. పఠనాంశాలు అనేకం ఉన్నప్పుడు, లక్ష్యంగా ఉన్న పాఠకులు మెచ్చే అంశాలను ఎంపిక చేసుకుని పత్రికలో వాటిని మాత్రమే పొందుపరుస్తారు. ప్రతిపత్రికా తన పాఠకులను తాను ఎంచుకుంటుంది.

తన పాఠకుల శ్రేణి ఆధారంగా పత్రికలలోని అంశాల ఎంపిక జరుగుతుంది. ఉదాహరణగా ఇంగ్లీషు పక్షపత్రిక 'ఫ్రంట్‌లైన్' (Frontline) తీసుకుందాం. అందులో రాజకీయ విశేషాలు, సైనిక వ్యవహారాలు, పర్యావరణ సమస్యలు, ఫొటో ఫీచర్, ఇంగ్లీషు భాషా సాహిత్యాల శీర్షికలు క్రమం తప్పకుండా ఉంటాయి. అధిక ప్రజాదరణ కలిగిన న్యూస్ మేగజైన్, పక్షపత్రిక. 'ఇండియాటుడే'కు భిన్నమైన 'ప్యాకేజ్' ఇవ్వాలన్న దృష్టితో 'ఫ్రంట్‌లైన్' ఈ అంశాలను ఎంపిక చేసుకుంది. రాజకీయాలపై ఆసక్తి ఉన్న సాధారణ విద్యావంతులందరినీ 'ఇండియాటుడే' ఆకర్షిస్తుంది. 'ఫ్రంట్‌లైన్' అధిక విద్యావంతులను, వామపక్ష, ఉదార భావాలుకలవారిని మెప్పిస్తుంది.

అన్ని పత్రికలకూ ఒక్కొక్క 'ప్యాకేజ్' ఉంటుంది. దినపత్రికల విషయంలో ప్యాకేజ్ వంటి ఎడిటోరియల్ పాలసీ ముఖ్యమైనది. కాలిక పత్రికలు ప్రధానంగా కదంబ పత్రికలు కాబట్టి కదంబంలోని అంశాలు ఏమిటి అన్నది పత్రికల విజయంపై అధిక ప్రభావం చూపిస్తుంది. తెలుగు వారపత్రికల్లో అగ్రస్థానంలో ఉన్న 'స్వాతి' విజయంలో ఈ ప్యాకేజ్ పాత్ర అధికం. శృంగార వర్ణలనతో కూడిన కథను, ఒక సీరియల్‌ను క్రమం తప్పకుండా ఇస్తూనే, వృద్ధులను పిల్లలను ఆకర్షించే వివిధ శీర్షికలను 'స్వాతి' ప్రచురిస్తుంది. ఒక క్రైమ్ నవల, ఒక చారిత్రక జానపద నవల, ఒక ప్రేమ నవల, ఒక సినీతారతో ఇంటర్వ్యూ, ప్రతి పేజీలో సినిమాతారల గురించిన గాసిప్స్ ఈ కూర్పు పాఠకులను మెప్పిస్తోంది. అందుకే 1980 దశకం మధ్యలో ప్రారంభమైన ఈ పత్రిక అన్ని సీనియర్ వారపత్రికలను దాటుకుని నెంబర్‌వన్‌గా ఎదిగింది.

BRAOU

**అభ్యాసం-2: ప్యాకేజీ అంటే ఏమిటి?**

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

## 19.9 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

★ ఆరంభంలో పత్రికలు వారపత్రికలుగానో, మాసపత్రికలుగానో వెలువడేవి. ఆధునిక అవసరాల రీత్యా వార్తాపత్రికలు దినపత్రికలుగా అవతరించాయి.

★ వార్తలుకాక తక్కిన అంశాలతో కాలిక పత్రికలు వెలువడుతున్నాయి. అయితే కొన్ని మినహాయింపులు లేకపోలేదు.

[illegible] అనేక రకాలున్నాయి. తెలుగులో వారం. పక్ష. మాస పత్రికలు మాత్రమే కాలిక పత్రికలలో ఎక్కువగా ఆదరణ పొందుతున్నాయి.

## 19.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. కాలికత రీత్యా కాలిక పత్రికల రకాలను వివరించండి.
2. స్వభావరీత్యా కాలిక పత్రికల రకాల గురించి తెలపండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వార పత్రికలు
2. కాలిక పత్రిక లక్షణాలు

**- కె. శ్రీనివాస్**

BRAOU

# భాగం - 20 : కాలిక పత్రికా రచన

## విషయక్రమం

20.0 ఉద్దేశం
20.1 ప్రవేశిక
20.2 కాలిక పత్రికా రచన
20.3 రచనాంశం ఎంపిక
20.4 రచనాంశం నిర్వహణ - రచనా విధానం
20.5 ప్రారంభం - ముగింపు పద్ధతులు
20.6 శైలి
20.7 సాధనాలు
20.8 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
20.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 20.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు.

- కాలిక పత్రికల కోసం ఎలా రాయాలి?
- రచనాంశం ఎంపిక, విధానం
- శైలి, ప్రారంభం, ముగింపు పద్ధతులు తెలుసుకుంటారు.

BRAOU

## 20.1 ప్రవేశిక

కాలిక పత్రికల్లో బయటివారు అధికంగా రచనలు చేస్తుంటారు. వార్తా పత్రికల ఉద్యోగులు అంటే వృత్తి రీత్యా పత్రికా రచయితల కన్నా అభిరుచి, సృజనాత్మకత కలిగిన వారి రచనలు ఎక్కువగా వుంటాయి. మామూలు పత్రిక రచనకు, కాలిక పత్రికల కోసం చేసే రచనకు తేడా వుంటుంది. కాలిక పత్రికల కోసం రాసే రచయితలు పాఠకులలో ఆసక్తి కలిగించి మెప్పించేలా రాయాల్సి వుంటుంది. కాలికపత్రికల రచనా పద్ధతులు మొదలైన విషయాలను ఇందులో తెలుసుకుందాం.

## 20.2 కాలిక పత్రికా రచన

దైనిక వార్తా పత్రికల కంటె కాలిక పత్రికలు స్వభావరీత్యా భిన్నమైనవని తెలుసుకున్నాము. రెండింటి మధ్య మరొక ముఖ్యమైన తేడా పఠనీయ అంశాల కర్తృత్వం విషయంలో ఉన్నది. వార్తాపత్రికల్లో వ్యాఖ్యల పేజీలు మినహా, తక్కినదంతా పత్రికా ఉద్యోగులైన విలేఖరులు, సంపాదకవర్గ సభ్యులు రాసినదే ఉంటుంది. కాలిక పత్రికల విషయంలో అలా కాదు. కాలిక పత్రికల్లో అధికభాగం బయటి రచయితల రచనలు ప్రచురితమవుతాయి.

అన్ని రకాల పత్రికల విషయంలోనూ రచనలు చేసేవారు స్థూలంగా మూడు రకాలు :

★ వృత్తిరీత్యా పత్రికా రచయితలు.

అంటే పత్రికా సంస్థల్లోనూ, వార్తాసంస్థల్లోనూ ఉద్యోగులుగా ఉండేవారు. పత్రికలకు కాలమ్స్ రాస్తూ పత్రికా రచయితగానే జీవిక గడిపేవారు.

★ అభిరుచితో ఆసక్తితో తరచు పత్రికా రచనలు చేసేవారు.

వీరి ప్రధాన వ్యాపకం, జీవనాధారం పత్రికా రచన కాదు. కానీ ప్రవృత్తి రీత్యా పత్రికా రచయితలు తరచు పత్రికలకు రచనలు పంపుతారు.

★ సృజనాత్మక రచయితలు.

కథలు, నవలలు, గల్పికలు, వ్యంగ్య రచనలు చేసేవారు. వీరు రచయితలే తప్ప పత్రికా రచయితలు కారు. వీరి రచనలకు పత్రికలు వాహికలు మాత్రమే.

పైన చెప్పిన మూడు రకాల వారూ కాలిక పత్రికలకు రచనలు చేస్తారు. సృజనాత్మక రచయితలను మినహాయిస్తే, తక్కిన ఇద్దరూ పత్రికా రచయితల కోవలోకి వస్తారు. వీరు కాలిక పత్రికల పరిమితులకు, విషయ చట్రానికి లోబడి రచనలు చేయవలసిందే.

దినపత్రికలకు ఎడిటోరియల్ పాలసీ ముఖ్యమనీ, కాలిక పత్రికలకు అంశాలకూర్పు - ప్యాకేజ్ ముఖ్యమనీ ఇంతకు ముందు భాగంలో చెప్పుకున్నాము. కాలిక పత్రికలు తమ ప్యాకేజ్‌లో ఇమిడే రచనలను మాత్రమే ప్రచురిస్తాయి. కాలిక పత్రికలకు రాసేవారు ఆయా పత్రికలు అంగీకరించే అవకాశమున్నవాటినే రాస్తారు. పత్రికా రచనను వృత్తిగాకంటె ప్రవృత్తిగా తీసుకునేవారు తమకు రాయాలని బలంగా అనిపించిన అంశాన్ని తీసుకుని రచన సాగిస్తారు. దాన్ని ప్రచురించే పత్రిక కోసం తరువాత అన్వేషిస్తారు. తాము పాఠకులతో పంచుకోవాలనుకున్న అంశాన్ని అక్షరాలలోకి మలచడమే వారికి ముఖ్యం. వారుకూడా కాలిక పత్రికలు కోరుకునే కొన్ని ప్రమాణాలను, పరిమితులను నెరవేర్చవలసి ఉంటుంది. ఈ భాగంలో మనం ఆ తరహా రచయితల గురించి మాట్లాడుకోవడం లేదు. కాలిక పత్రికలకు రాయడం వృత్తిగా తీసుకుని, అధ్యయనం ద్వారా అభ్యాసంద్వారా ఆ నైపుణ్యాన్ని అలవరుచుకోవాలనుకునేవారు ఏమి చేయాలనేదాని గురించి చర్చిస్తున్నాము.

BRAOU

తక్కిన పత్రికలకంటె కాలిక పత్రికలు స్వరూప స్వభావాలలో భిన్నమైనట్లే, కాలిక పత్రికలకు రాయడం కూడా తక్కిన పత్రికలకు రాయడంకంటే భిన్నమైనది. కాలిక పత్రికలకు రాయడం ప్రత్యేకమైన నైపుణ్యం.

కాలిక పత్రికలకు రాసేవారు మొదట మూడు ప్రశ్నలు వేసుకోవాలి?

1. ఎటువంటి పత్రిక కోసం రాస్తున్నారు?

2. ఏ పాఠకుల కోసం రాస్తున్నారు?

3. రాయబోయే దానికి సందర్భశుద్ధి ఉందా?

ఈ మూడిటి గురించి సరైన అంచనాకు వచ్చిన తరువాతే విషయం ఎంపిక పూర్తికావాలి.

ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ ప్రస్తుతం వస్తున్న పీరియాడికల్స్‌ను ఒక్కసారి తిరగేస్తే కాలిక పత్రికల్లో ఎన్నిరకాల రచనలున్నాయో బోధపడుతుంది. వార్తావ్యాసాలు, ప్రత్యేకవ్యాసాలు, ప్రధాన వ్యాసాలు, ఇంటర్వ్యూలు మొదలైన ప్రక్రియల లక్షణాలను 'వార్తాపత్రికలకు రాయడం' అన్న శీర్షిక కింద తెలుసుకుంటాం. అవే ప్రక్రియలలో కాలిక పత్రికలకు రాయడంలో ఉన్న ప్రత్యేకత ఏమిటో, ఏ లక్షణాలవల్ల రచనలు కాలిక పత్రికల్లో ప్రచురణకు అర్హమవుతాయో చర్చించడం ఇక్కడ ఉద్దేశ్యం.

రచనకు అంశాన్ని ఎంపిక చేసుకోవడమే కాలిక పత్రికా రచనలో కీలకమైన విషయం. ఎంచుకున్న అంశాన్ని జనరంజకంగా నిర్వహించడం మరింత ముఖ్యమైన అంశం. కాలిక పత్రికలకుండే వెసులుబాటు ఏమిటంటే - రచన ప్రక్రియకూ, రచనా విధానానికి సంబంధించిన వెసులుబాటు. పాఠకులు ఆదరిస్తారన్న నమ్మకమూ, తమ పత్రిక చట్రంలో ఇముడుతుందన్న అంచనా ఉంటే కాలిక పత్రికల సంపాదకులు సరికొత్త ప్రక్రియలను, సరికొత్త రచనా పద్ధతులను కూడా స్వీకరిస్తాడు. 'మేగ్నా' సంస్థ ప్రచురించే స్త్రీల ఆంగ్ల మాసపత్రిక "సావీ" ప్రతినెలా ముఖచిత్ర కథనాన్ని ఉత్తమ పురుషలో అందిస్తుంది. ప్రతికూల పరిస్థితులకు ఎదురీదుతున్న ప్రముఖ మహిళలు తమ జీవితం గురించి అరమరికలూ, మొహమాటాలూ లేకుండా వెల్లడించే శీర్షిక అది. పది సంవత్సరాల క్రితం మన దేశంలోని ఏ పత్రికా అటువంటి శీర్షికను క్రమం తప్పకుండా నిర్వహించాలని అనుకోలేదు. అసలా ఆలోచనే రాలేదు. అలానే తెలుగు వారపత్రికలలో పాఠకుల ప్రమేయాన్ని ఆశించే శీర్షికలను పరిశీలించి చూడండి. ఎన్నో కొత్తపోకడలు కనిపిస్తాయి. కొత్తదనాన్ని గుర్తించి, అందుకునే చొరవ పత్రికా నిర్వాహకులకే కాదు, పత్రికా రచయితలకు కూడా అవసరం. ఒక కాలపు ఆలోచనలకు, రచన పద్ధతులకు స్థిరపడి పోయినవారు కాలిక పత్రికలకు పనికిరారు. నిత్య అన్వేషణ, నిత్యనూతనత్వం కాలిక రచయితల జీవలక్షణాలుగా ఉండాలి. కథలు, నవలలు వంటి ప్రక్రియల్లో రాసేవారినే సృజనాత్మక రచయితలని అంటున్నా, కాలిక పత్రికా రచయితలందరిలోనూ సృజనాత్మకత అంతో ఇంతో ఉండాలి. అభివ్యక్తిలో వైచిత్రి, సౌందర్యం తెలియనివారు అందమైన, ఆహ్లాదకరమైన రచన చేయలేరు. సృజనాత్మకతతో పాటు కాలిక పత్రికా రచనలో సమాచారంపాలు తక్కువైనప్పటికీ, ఇచ్చిన కొద్దిపాటి సమాచారమైనా రచనకు విశ్వసనీయతను, గౌరవాన్ని తెస్తుందని మరచిపోగూడదు. సమాచారం ఎక్కడ దొరుకుతుందో, లభించిన సమాచారాన్ని ఎలా విశ్లేషించి ఉపయోగించుకోవాలో కాలిక పత్రికా రచయితకు తెలిసి ఉండాలి. కాలిక పత్రికా రచయితకు అవసరమైన మరో గుణం ఆలోచనా పరత్వం. కాలిక పత్రికల్లో అధికం కాలక్షేపపు పత్రికలని విమర్శ ఉన్నప్పటికీ, స్వభావరీత్యా కాలిక పత్రికల్లోని రచనలన్నీ వ్యాఖ్యలతో కూడినవి, ఏవో అభిప్రాయాలను వ్యక్తపరిచేవి. కాబట్టి, రచయితకు అనేక విషయాలపై తనవంటూ కొన్ని అభిప్రాయాలుండాలి. విస్తృతమైన పఠనం, సామాజిక సమస్యల గురించి, విలువల గురించి అవగాహన, రాజకీయాలతో కూడా కనీస పరిచయం ఉన్న కాలిక పత్రికా రచయితలు ఆరోగ్యకరమైన, ప్రయోజనకరమైన రచనలు చేయగలరు.

## 20.3 రచనాంశం ఎంపిక

కాలిక పత్రికకు ఏ విషయం మీద రచనలు చేయవచ్చు? రచయిత అంశాలను ఎలా ఎంపిక చేసుకోవాలి? ఈ రెండూ ముఖ్యమైన ప్రశ్నలు.

ఒక్కముక్కలో చెప్పాలంటే మానవ జీవితానికి సంబంధించిన సమస్త అంశాలూ కాలిక పత్రికా రచనకు అర్హమైన వస్తువులే. 'కానిదేదీ రచనకు అనర్హం' అనుకుంటే కాలిక పత్రికా రచయితకు ఎంపిక మరింత కష్టమవుతుంది తప్ప సులభం కాదు. అసంఖ్యాకమైన రచనా వస్తువుల మధ్య ఎంపిక కష్టతరమైనది. అక్కడే కాలిక పత్రికా రచయిత వివేకం, విచక్షణ వ్యక్తమవుతాయి.

రచనాంశాన్ని ఎంపిక చేసుకొనేముందు రచయిత పరిగణనలోకి తీసుకోవలసిన ప్రధానమైన కొలమానాలు సందర్భశుద్ధి, ఔచిత్యం, కొత్తగా చెప్పవలసిన అవసరం. అందుబాటులో ఉన్న అనేక వస్తువులను పరిమితం చేసుకోవడానికి ఈ కొలమానం ఉపకరిస్తుంది. పిల్లలు వేసవి సెలవులు ఎలా గడపాలో చెప్పే వ్యాసం ఏప్రిల్‌లో వస్తేనే ఉపకరిస్తుంది. ఊటీలో పర్యాటకులకున్న సదుపాయాల గురించి చలికాలం రాస్తే ఎవరికి ఆసక్తి ఉండదు. వాడీవేడీ లేని రాజకీయ సమస్యల గురించి అసందర్భంగా రాస్తే ఎవరూ చదవరు. కాశ్మీర్‌లోని పరిణామాల గురించి ప్రత్యేకవ్యాసం పాఠకులను ఆకర్షిస్తుందికానీ, చల్లారిపోయిన ద్రవిడస్థాన్ ఉద్యమమో, కాలగర్భంలో కలిసిపోయిన మరేదో సంఘటనో రచనా వస్తువులైతే అంతగా చదవబుద్ధి వేయదు.

వార్తాపత్రికలలో రిపోర్ట్ అయ్యే దైనందిన పరిణామాలకు కాలిక పత్రికలలోనూ కొన్ని రచనలు ప్రతిధ్వనులుగా ఉంటాయి. వేర్పాటువాద ఉద్యమంవల్ల కాశ్మీర్‌లో పర్యాటకుల సంఖ్య, ఆదాయం తగ్గాయని పత్రికలు వార్త ప్రచురిస్తాయి.

BRAOU

ఎండిపోయిన దాల్ సరస్సు ఫొటోనూ, కాశ్మీర్‌పై వచ్చిన హిందీ సినిమాల వివరాలనూ జోడించి భారతీయుల మనస్సుల నుంచి కాశ్మీర్ అనే సుందరస్వప్నం ఎలా నిష్క్రమించిందీ, ఆ స్థానంలో బీభత్సపూరితమైన దృశ్యం ఎలా వచ్చిందీ మాననీయ కథనంతో కాలిక పత్రికలు రాస్తాయి. ఫలానా అపార్ట్‌మెంట్స్‌లో ఒంటరిగా ఉన్న గృహిణిని ఓ దొంగ హత్య చేసినవార్తను వార్తాపత్రికలు ప్రచురిస్తాయి. అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న సమస్యలు, గతంలో జరిగిన ఇటువంటి సంఘటనలు, నగరాలలో మారుతున్న జీవనశైలి - ఇటువంటి అంశాలతో కాలిక పత్రికలు ప్రత్యేకవ్యాసం ప్రచురిస్తాయి. సమాజంలో వర్తమానంలో జరుగుతున్న సంఘటనల ఆధారంగా - నిర్దిష్టత నుంచి సార్వజనీనతకు, ప్రత్యేకత నుంచి సార్వత్రికతకు అన్వయిస్తూ కాలిక పత్రికలు ప్రధాన వ్యాసాలు ప్రచురిస్తాయి. కాబట్టి - కాలిక పత్రికలలో ప్రచురించే రచనలలోని అంశాలు కాలాతీతమైనవి కావు. వర్తమానంతో వాటికి ఏదో రకమైన సంబంధం ఉండాలి. వర్తమాన అంశాన్ని ప్రస్తావించకుండా చేసే రచనలు పరిశోధక పత్రికలలోనూ, అకడమిక్ పత్రికలలోనూ మాత్రమే కనిపిస్తాయి. సందర్భ శుద్ధి లేకుండా చిత్తంవచ్చిన అంశంపై ఏదో ఒకటిరాస్తే ఆ రచయిత నవ్వుల పాలవుతారు. 1996లో రాజకీయ అవినీతి గురించి వ్యాసం రాయతలపెట్టి హవాలాకుంభకోణాన్ని టెలికాంస్కామ్‌లను ప్రస్తావించకపోతే దానికి విశ్వసనీయత, సాధికారత ఉండదు. ప్రపంచ ప్రఖ్యాత పాప్‌సింగర్ మడోన్నా అవివాహితగానే తల్లికాబోతున్నదన్న వార్త 1996 ఏప్రిల్‌లో వచ్చింది. తరువాత రెండు మాసాలదాకా ఈ వార్తకు సంబంధించిన ఆసక్తి పాఠకులకు ఉంటుంది. పెళ్ళికాని తల్లుల గురించి, అందులో ప్రముఖుల గురించి ఫీచర్ రాస్తే ఇప్పుడు సందర్భోచితంగా ఉంటుంది. ఉదాహరణగా వార్తల్లోని వ్యక్తి ఉదాహరించకుండా రాసే రచన సందర్భరహితమైపోతుంది.

కాలిక పత్రికలకు రాయబోయేవారు, రచనాంశాన్ని ఎంపిక చేసుకొనేముందు ఆ అంశానికి సందర్భశుద్ధి ఎంత ఉంది తెల్సుకోవాలి. గతంలో జరిగిన విశేషమైనా సరే, వర్తమానంలో ఆసక్తి కలిగించే లక్షణం వుండేలా చూసుకోవాలి. 'వాలెంటిన్స్ డే' సందర్భంగా కాలిక పత్రికల్లో వచ్చే రచనలు చూడండి. అన్నీ ఒకేలా ఉంటాయి. ప్రతియేడూ ఒకే రకమైన సమాచారం ఇస్తాయి. వినాయకచవితి, దీపావళి, దసరా - అన్ని పర్వదినాలకీ పత్రికలు ఇచ్చే సమాచారం ఒకే రకంగా ఉంటుంది. అయినా వాటికి పాఠకులు ఎందుకు ఉంటారంటే, ఆ రచనలు ఆ పండుగలు వచ్చేరోజుల్లో ప్రచురితమవుతాయి. కాలిక పత్రికా రచయితలు విస్మరించకూడని మరొక అంశం ఔచిత్యం. రచనాంశం పాఠకుల మనోభావాలను దెబ్బతీస్తుందా, అది ప్రచురితమయితే 'సభ్యతా ప్రమాణాలు' దిగజార్చినట్టు అవుతుందా రచయితే ముందుగా ఆలోచించాలి. జుగుప్స కలిగించే అంశాల గురించి, అకారణమైన భయాలను కలిగించే అంశం గురించి రాయకుండా ఉండడం మంచిది. వినాయక విగ్రహాలు పాలు 'తాగిన' సంఘటన గురించి ఆసక్తికరంగా రాయవచ్చు. అటువంటి సంఘటనలలో మహిమలున్నాయని నమ్ముతున్నందుకు ప్రజలను ఎద్దేవా చేయడంకానీ, ఆ మహత్యాలు నిజమేనని నిర్ధారించడంకానీ చేయకూడదు. ఆ వందతులను, నమ్మకాలను శాస్త్రీయంగా చర్చించి విమర్శించవచ్చు. కాలిక పత్రికా రచయితకూడా సమాజానికి నిబద్ధుడుగానే ఉండాలి.

వర్తమాన పరిణామాలతో ఏదో రకంగా లంకెపెట్టగలిగిన అంశాలే కాకుండా, పాఠకులకు ఆశ్చర్యాన్నీ, అద్భుత భావాన్నీ, ఆనందాన్నీ కలిగించే కొత్త అంశాలను కూడా కాలిక పత్రికా రచయిత స్వీకరించవచ్చును. ప్రభుత్వం దృష్టికీ, ప్రజల దృష్టికీ రాకుండా ఉన్న మారుమూల పర్యాటక స్థలం గురించి పరిచయ వ్యాసం రాయవచ్చు. ఓ చిన్నగ్రామంలో ఉంటూ మోటారు వాహనాల ఇంధనం వాడకాన్ని తగ్గించే విషయమై పరిశోధనలు చేస్తున్న ఓ ఔత్సాహిక శాస్త్రవేత్తను తొలిసారిగా పరిచయం చేయవచ్చు. ఒక విదేశీ వంటకం తయారీ విధానాన్ని రాయవచ్చు. స్త్రీలు ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలలో తలెత్తుతున్న సమస్యలను నాలుగైదు ఉదాహరణలతో చర్చించవచ్చు. ఓ వికలాంగుడు సాధించిన విజయాలను రాసి పాఠకులను ఉత్తేజ పరచవచ్చు. పాఠకునికి విజ్ఞానాన్నో, వినోదాన్నో, ఆహ్లాదాన్నో కలిగిస్తుందని రచయిత నమ్మినప్పుడు ఔచిత్య ప్రమాణాలకు లోబడి ఆ అంశంపై రచన చేయవచ్చు.

కాలిక పత్రికలలో ప్రచురించే రచన పాఠకుడికి పాతవిషయంపై కొత్త దృష్టి అయినా ఇవ్వాలి, ఒక నిర్దిష్ట అంశంపై సార్వత్రిక దృక్పథమైనా కలిగించాలి, పాఠకుడు తన జీవితానికో జ్ఞానానికో అన్వయించుకునేట్టు ఆసక్తికరంగా చదివించాలి, లేదా పాఠకునికి ఆ పఠనం ఓ ఆనందకరమైన అనుభవమైనా కావాలి. కొత్త జీవనవిధానాన్ని పరిచయం చేయడం, సాంస్కృతిక

BRAOU

రంగంలో ప్రజలకు సన్నిహితులైన కళాకారుల గురించి మరింతగా తెలియచెప్పడం, మారుతున్న ఆహార వ్యవహార శైలులను అనువర్తించుకోవడానికి (adaptation) వీలుగా వివరించడం - ఇవన్నీ కాలిక పత్రికలకు పాఠకులు అందించవలసినవే.

సందర్భశుద్ధి, ఔచిత్యం, కొత్తగా చెప్పవలసిన లక్షణం అయివుండడం - ఈ మూడూ కాలిక పత్రికలకు ఎంచుకోవలసిన రచనాంశంలో ఉండితీరవలసిన లక్షణాలు.

రచనాంశం ఎంపికలో మొదటి మూడు ముఖ్యమైన పరీక్షలను దాటాక - రచనలోకి ఉపక్రమించే ముందు వేసుకోవలసిన ప్రశ్నలు

1. రచన ఎందుకోసం చేస్తున్నారు?
2. ఏ రకం పత్రిక కోసం చేస్తున్నారు?
3. ఏ రకం పాఠకులను ఉద్దేశించి చేస్తున్నారు?

1. పాఠకులలో కారుణ్యభావాన్ని పెంపొందించాలనుకుని బాలకార్మికుల దుస్థితిపై వ్యాసం రాస్తూ ఛలోక్తులతో, హాస్య ఉదంతాలతో రచనను నింపేస్తే ఎలా ఉంటుంది? పాఠకులను నవ్వించే ఉద్దేశ్యంతో చేసే రచనలో గణాంకాలు పేరాలకు పేరాలు ఉంటే ఎలా ఉంటుంది? - రచనా విధానాన్ని ఎంచుకోవడానికి మొట్టమొదట వేసుకోవలసిన ప్రశ్న రచన ఎందుకోసం? సీరియస్ వ్యాసమా? వ్యంగ్య రచనా? హాస్య రచనా? కాలక్షేపపు రచనా? సరళమైన ఆహ్లాదకరమైన రచనా?

2. 'చందమామ' కు కథ రాయాలనుకొని స్త్రీ పురుష సంబంధాల సంక్లిష్టతను చర్చించే కథను రాయగలమా? జీవుల జెనెటిక్ కోడ్‌ను డీకోడ్ చేయడానికి జరుగుతున్న పరిశోధనల్లో తాజా విజయాన్ని సాంకేతిక వివరాలతో రాసి 'స్వాతి' సపరివార పత్రికకు పంపగలమా? - రచనాంశాన్నీ, రచనా విధానాన్నీ ఎంపిక చేసుకునే ముందు ఏ కాలిక పత్రికకు రచన చేయదలచుకున్నామో తేల్చుకోవాలి. పిల్లల పత్రికా? స్త్రీల పత్రికా? యువజనుల పత్రికా? కథల పత్రికా? బిజినెస్ పత్రికా? రాజకీయ వార్తా కాలిక పత్రికా? అకడమిక్ పత్రికా? సాహిత్యాభిమానులు, భాషాభిమానులు ఇష్టంగా చదివే పత్రికా?

3. రచనాంశం ఎంపికలో కూడా ఈ ప్రశ్న వేసుకున్నాము. ఇప్పుడు రచనా సంవిధానంలో కూడా ఈ ప్రశ్న ఎదురవుతుంది. ఏ రకం పాఠకులను ఉద్దేశించి రచన చేస్తున్నామో మనం ఎంచుకునే పత్రికే దాదాపు నిర్ణయిస్తుంది. అయితే, ఆహ్లాదానికి ఉద్దేశించిన కాలిక పత్రికలో కూడ ఒకటో రెండో సీరియస్ రచనలుంటాయి. సరసమైన శృంగార కథలకు ప్రాధాన్యమిచ్చే పత్రిక కూడా ఆధ్యాత్మిక శీర్షికలు ప్రచురిస్తుంది. ప్రతి పత్రికా ఒకరకం పాఠకులను లక్ష్యంగా పెట్టుకుంటుంది. అయితే లక్ష్యంగా ఉన్న పాఠకులు ఆ పత్రికకు స్థిరమైన, అధిక సంఖ్యాకులైన పాఠకులు కావచ్చుకానీ, ఇతర శ్రేణుల పాఠకులు కూడా ఆ పత్రికను చదువుతారు. కాబట్టి, పాఠకుల ఎంపిక మౌలికంగా రచయితదే అవుతుంది. రాజకీయ పరిజ్ఞానం ఓ మోస్తరుగా ఉండే వారికీ, రాజకీయాల్లో పండితులైనవారికీ ఒకే రకమైన రచన సంతృప్తినివ్వలేదు. యువజనులకు, నిరుద్యోగులకు (ఉద్యోగార్థులకు) ఉద్దేశించిన పత్రికలకూ యువజనుల ఆధునిక జీవనశైలిని చిత్రించే పత్రికలకూ ఒకే రకమైన రచనా విధానం సరిపోదు. సీనియర్ పౌరులకు, పిల్లలకు వేర్వేరు శైలులతో రాయవలసి వుంటుంది. పాఠకులలో చైతన్య స్థాయినిబట్టి, వివిధరకాల సామాజిక శ్రేణులను బట్టి అంతరాలుంటాయి. కాలిక పత్రికా రచయిత తన రచన ఎవరిని ఉద్దేశించిందో స్పష్టత కలిగి ఉండాలి.

**అభ్యాసం : కాలిక పత్రిక రచన ఎంపికలో జాగ్రత్తలేవి?**

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

BRAOU

## 20.4 రచనాంశం నిర్వహణ - రచనా విధానం

కాలిక పత్రికలకు రాయడంకోసం ఎంచుకున్న అంశాన్ని ఎలా నిర్వహించాలి? రచనకు రూపం ఎలా ఇవ్వాలి? - ఈ ప్రశ్నలను చర్చించేటప్పుడు కాలిక పత్రికలలో కనిపించే వివిధ రచన ప్రక్రియలను, వాటి ప్రత్యేకతలను ప్రస్తావించనక్కర లేదు. ప్రక్రియల తీరుతెన్నులను ఇతర భాగాల్లో చూస్తాము. ప్రత్యేక వ్యాసాలు, ప్రధాన వ్యాసాలు ఇతర ఖండాలలో చర్చకు వస్తాయి. కాలిక పత్రికల కోసం రాసేటప్పుడు రచనలో ఉండవలసిన ప్రత్యేకతలనే ఇక్కడ చెప్పుకుంటున్నాము.

"మేగజైన్లు మన సృజనాత్మకతకు గట్టి సవాళ్ళు విసురుతాయి. దినపత్రికలు విసిరే సవాళ్ళకంటే భిన్నమైనవి, కొత్తవి... మేగజైన్లలో సృజనాత్మకతకు అవకాశం ఎక్కువ" - అమెరికాలోని ఓ నగర మేగజైన్ 'సేక్రమెంటో' (SACRAMENTO) సంపాదకుడు చెరిల్‌రోమో (Cheryl Romo) అభిప్రాయం అది. కాలిక పత్రికలలో సృజనాత్మక రచనలు ప్రచురితం కావడమే కాదు, ఆ పత్రికలలో ప్రచురితమయ్యే రచనలన్నిటిలో సృజనాత్మకతపాలు ఉంటుంది. ముందే చెప్పుకున్నట్లు వార్తాపత్రికా రచన డాక్యుమెంటరీ వంటిది అయితే, కాలిక పత్రికా రచన కథాచిత్ర నిర్మాణం వంటిది.

సృజనాత్మకత

కాలిక పత్రికకోసం రాయగోరేవారు గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యమైన అంశం సృజనాత్మకత. కొత్త కల్పనలు చేయగలగడం, ఊహించగలగడం అనే అర్థంలో 'సృజనాత్మకత'ను ఇక్కడ వాడడం లేదు. అభివ్యక్తిలో విశిష్టతను, సొంతదనాన్ని ప్రదర్శించడమే ఇక్కడ సృజనాత్మకత. అందుబాటులో ఉన్న సమాచారాన్ని, అందరికీ తెలిసిన విషయాన్ని కూడా కొత్త అన్వయంతో, కొత్త వ్యాఖ్యతో జోడించగలగడమే సృజనాత్మకత" శ్రీలంకలో ఎడతెగని పోరు" అని దినపత్రికలోని వార్తా శీర్షిక ఉంటే, అదే పత్రికలోని ప్రత్యేక వ్యాసం శీర్షిక "రావణకాష్ఠం చల్లారేదెప్పుడు?" అని ప్రశ్నిస్తుంది. రెండో శీర్షికలో సృజనాత్మకత ఉన్నది. అవినీతి గురించి వ్యాసం రాస్తున్నప్పుడు - "ప్రపంచంలో అవినీతి లేనిచోటు లేదు" అని ఇందిరాగాంధీ అన్నమాటతో ప్రారంభిస్తే - గతంలోని సమాచారాన్ని సృజనాత్మకంగా స్ఫురణకు తెచ్చుకున్నట్టే. ప్రేమికుల వియోగబాధల గురించి యువజనరంజకమైన రచన చేస్తున్నప్పుడు నాలుగు హిందీ సినీగీతాలు, తెలుగు ఆత్రేయ పాటలు ఉటంకించలేకపోతే సృజనాత్మకత లోపించినట్టే.

ఈ సృజనాత్మకత పుట్టుకతో వచ్చే ప్రతిభ కాదు. సాధనలో అలవడే లక్షణం. దేశ సాంస్కృతిక వారసత్వం గురించిన అవగాహన, జాతీయ కథా వ్యక్తుల, గాథల, పురాణాల పరిచయం, భాషపై అధికారం, ఆధునిక ధోరణులతో నిరంతర సంపర్కం, ప్రజా వ్యవహార భాషలోని సజీవ వ్యక్తీకరణలతో పరిచయం, సాహిత్యంతో కళలతో పరిచయం ఇన్ని సాధించినవారు సృజనాత్మకతతో రాణించగలరు.

## 20.5 ప్రారంభం - ముగింపు - పద్ధతులు

కాలిక పత్రికకు చేసే రచన - అది ఏ ప్రక్రియకు సంబంధించనదైనా - ఆద్యంతం బిగువు సడలకుండా ఉండాలి. ఓ మంచి ఉటంకింపుతోనో, ఓ కవితాపాదంతోనో రచన ప్రారంభించి, ఆ తరువాత ఏకరువు పెట్టినట్టు రాస్తే సరిపోతుందని కొందరు భావిస్తారు. అది సరికాదు. రచన ఫలానా విధంగానే ప్రారంభించాలని లేదు. ఓ ఉటంకింపుతో ప్రారంభించవచ్చు. ఓ సంఘటనతో ప్రారంభించవచ్చు. ఒకరి అనుభవంతో ప్రారంభించవచ్చు లేదా సీదా సాదాగా ప్రారంభించవచ్చు. సాహిత్యం నుంచి ఉటంకింపులైనా, పత్రికా రచయిత సేకరించిన అభిప్రాయాల ఉటంకింపులైనా, సంఘటనల ఉటంకింపులైనా వాడవచ్చు. రచయిత చెప్పదలచుకున్న దానికి ఉటంకింపులు అనుబంధంగా ఉండాలికానీ, ఉటంకింపులతోనే నింపకూడదు. రచన పరిధిలో ఒక అంశానికి సంబంధించి పాఠకులు ఎంత సమాచారాన్ని ఆశిస్తారో అంత సమాచారాన్నీ సమకూర్చాలి. రచనకు అందంకోసం చిత్రమైన ముగింపులు ఇవ్వవచ్చుకానీ, రచన అసంపూర్ణమనే అభిప్రాయం కలగరాదు. ఇంటర్వ్యూలు పంపినప్పుడు ప్రశ్నలు - జవాబులు పద్ధతిలోనే రాయాలని లేదు. సగం రిపోర్టింగ్ పద్ధతిలోనూ సగం ఇంటర్వ్యూ రూపంలోనూ

BRAOU

రాయవచ్చు. లేదా పూర్తిగా రిపోర్టింగ్ పద్ధతిలోను రాయవచ్చు. ఫీచర్లు, స్పెషల్ ఫీచర్లు రాసేటప్పుడు క్లుప్తతముఖ్యం. రచన భాగా పెద్దదయినప్పుడు రెండు మూడు ఆసక్తికరమైన భాగాలుగా విడగొట్టాలి. కాలిక పత్రికలలో సుదీర్ఘ రచనలు ఇమడవు. వ్యాసం లేదా రచన 'థీమ్' లో ఒకదాని సమాచారం రచయిత వద్ద ఉన్నప్పుడు అది పాఠకులకు అందించడం అవసరం అనుకున్నప్పుడు అనుబంధంగా ఇవ్వాలి. ఒక ప్రత్యేక సంఘటన గురించి రాసేటప్పుడు ఆ సంఘటనకు సంబంధించిన సార్వత్రిక అంశాలను, సార్వత్రిక అంశం గురించి రాసినప్పుడు నిర్దిష్ట సంఘటనలను అదనంగా ఇస్తే పత్రికలు "బాక్సు"లలో ప్రచురించుకుంటాయి. వంట పద్ధతులు, వివరాలు రాసినప్పుడు అంచెలంచెలుగా తయారీ విధానాలను ఏకరవుపెట్టడమే రచన పద్ధతిగా ఉండాలి. హాస్యోక్తులు రాసేటప్పుడు క్లుప్తత ముఖ్యం.

## 20.6 శైలి

కాలిక పత్రికలకు చేసే రచన సరళమైనభాషలో సాగాలి. సాంకేతిక పదాలు, వార్తా పత్రికలలో వాడకంలో ఉండే అనువాద పదాలు, పడికట్టుమాటలు కాలిక పత్రికరచనలో శోభించవు. ఖండించడం, పునరుద్ఘాటించడం, వివరించడం, ఇదిలా వుండగా, వంటిమాటలు, అయిదు 'డబ్ల్యు'లు, ఒక 'హెచ్' క్రమంలో ప్రారంభించడం ఇవన్నీ కాలిక పత్రికలకు సరిపడని విషయాలు.

కాలిక పత్రికా రచనకు ఉండవసిన రెండు లక్షణాలు కథనశైలి, నాటకీయత లేదా దృశ్యశైలి. ముఖ్యంగా వార్తా కాలిక పత్రికలకు ఈ శైలులు అవసరం. వార్తా పత్రికలలో రిపోర్టుఅయిన వార్తనే మళ్ళీ మేగజైన్లలో పాఠకులు చదువుతారు. కారణం, మేగజైన్లలో సంఘటనల కథనం ఆసక్తికరంగా ఉంటుంది. టీవీలో చూసి, దినపత్రికలలో చదివి కూడా క్రికెట్‌మేచ్‌ల విశేషాలు స్పోర్ట్స్ మేగజైన్లలో చదువుతారు. కారణం, దృవ్యశ్రవణ సాధనాలకు మించిన దృశ్యశైలిలో ఆటల వర్ణన ఆమేగజైన్లలలో ఉంటుంది. అత్యంత సాధారణ సంఘటనలు సైతం మేగజైన్లలో పఠనీయ కథనాలవుతాయి.

పాఠకులతో తీరికగా ముచ్చటిస్తున్న శైలి సరదావ్యాసాలకు నప్పుతుంది. చిన్న చిన్న వాక్యాలు, సరళమైన పదజాలం, సున్నితమైన హాస్యం, సూటి వ్యక్తీకరణ ఆ తరహా రచనలకు అలంకారాలు. కవితాధోరణి మితిమీరకుండా ఉంటే మంచిది.

సృజనాత్మక రచనలకు చట్రాలను ఏవిధంగానూ నిర్ణయించలేము. కాలిక పత్రికా రచనకు కూడా ఖచ్చితమైన హద్దులను, సూత్రాలను నిర్దేశించలేము. వ్యక్తిగత ప్రతిభా పాటవాలను పూర్తిగా వ్యక్తం చేయగలిగిన కాలిక పత్రికా రచన వైవిధ్య భరితమైనది. ఎంతో స్వేచ్ఛకలిగినది. అందుబాటులో ఉన్న కాలిక పత్రికలను పరామర్శిస్తే ఈ వైవిధ్యం అవగతమవుతుంది.

BRAOU

## 20.7 సాధనాలు

కాలిక పత్రికా రచయితకు ఉండవలసిన బౌద్ధిక సాధనాలు సృజనాత్మకత, సాంస్కృతిక సాహిత్య కళారంగాలలో ప్రవేశం మొదలైనవి. కాగా భౌతికసాధనాలు కూడా కొన్ని అత్యవసరం. నిఘంటువులు, విజ్ఞాన సర్వస్వాలు, వివిధ అంశాలపై పాత పత్రికల క్లిప్పింగులఫైళ్ళు, వివిధ అంశాలపై రచయిత తాను రకరకాల మార్గాలద్వారా సేకరించుకున్న నోట్సు ఇవన్నీ కాలిక పత్రికా రచయితకు అందుబాటులో ఉండాలి. రాసుకోవడానికి ఏకాంతం, నాణ్యమైన కాగితాలు, మంచికలం ఇవెలాగూ తప్పనిసరి.

## 20.8 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

సందర్భశుద్ధి, ఔచిత్యమూ, కొత్తఅంశమూ ఉంటే ఏదైనా కాలిక పత్రికా రచనకు అర్హమైనదే. దిన పత్రికా రచనకూ కాలిక పత్రికా రచనకూ భేదం ఉంది. కాలిక పత్రికారచయితకు సృజనాత్మకత ఉండాలి. కథనశైలి, దృశ్యశైలి అలవరచుకోవాలి. రచనలో సహాయపడడానికి ఇతరుల రచనలు, పాత సమాచారం, సాంస్కృతికాది రంగాల పరిచయం, ప్రజావ్యవహారంతో

సజీవసంబంధం ఉండాలి. అన్నీ అందరికీ సమకూరగలవని చెప్పలేముకానీ, మంచి కాలిక పత్రికారచయిత కావడానికి మరో దగ్గరదారి ఏదీ లేదు.

## 20.9. మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. కాలిక పత్రికల కోసం రాసేవారు రచనాంశాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలి?
2. రచనాంశం నిర్వహణ, రచనా విధానం తెలుపండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. శైలి
2. ముగింపు

- కె. శ్రీనివాస్

BRAOU

# భాగం - 21 : సాహిత్య పత్రికలు

## విషయక్రమం

21.0 ఉద్దేశం
21.1 ప్రవేశిక
21.2 సాహిత్య పత్రిక నిర్వచనం- స్వరూపం
21.3 సాహిత్య వ్యాసమంటే?
21.4 సాహిత్య రచన చేసేవారికి వుండాల్సిన లక్షణాలు
21.5 సాహిత్య వ్యాసాల ప్రయోజనం
21.6 స్వభావ రీత్యా సాహిత్య వ్యాసాల రకాలు
21.7 సాహిత్య వ్యాసాల వర్గీకరణ
21.7.1. వ్యాఖ్యానపూర్వక వ్యాసం
21.7.2. వివరణాత్మక వ్యాసం
21.7.3. విశ్లేషణాత్మక వ్యాసం
21.7.4. పరిశోధనాత్మక / సిద్ధాంత ప్రతిపాదక వ్యాసం
21.7.5. సమీక్షాత్మక వ్యాసం
21.7.6. వాద ప్రతివాద వ్యాసం
21.8 సాహిత్య వ్యాసాల్లో శైలి
21.8.1. అలంకారిక శైలి
21.8.2. స్పష్టత
21.9 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
21.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 21.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు.

- సాహిత్య పత్రికల స్వరూపం, ప్రయోజనం
- సాహిత్య పత్రికల్లో ఉండే అంశాలు
- సాహిత్య పత్రికల కోసం వ్యాసాలు రాయవలసిన పద్ధతి
- సాహిత్య వ్యాసాలలో వైవిధ్యం తెలుసుకుంటారు.

## 21.1 ప్రవేశిక

పత్రికా రచనలో సాహిత్య పత్రికలకోసం రాయడమన్నది ఒక విలక్షణమైన అంశం. మామూలు దిన, వార పత్రికలకోసం రాయడానికీ, సాహిత్య పత్రికల కోసం రాయడానికీ కొంత తేడా వుంటుంది. సాహిత్య పత్రికల కోసం ఎంచుకునే

అంశాలు భిన్నంగా ఉంటాయి. వాటి అభివృద్ధి కూడా యథాలాపంగా కాక, సోపపత్తికంగా ఉంటుంది. సాహిత్య పత్రికలకు రచనలు చేయడంలో మెళకువలను చర్చించవలసి వుంది.

## 21.2 సాహిత్య పత్రిక నిర్వచనం, స్వరూపం

విభిన్న ప్రక్రియల్లో సరికొత్త రచనలను, ప్రాచీన, ఆధునిక సాహిత్యంపై విమర్శలను అందించే పత్రిక సాహిత్య పత్రిక. సాహిత్య పత్రికలలోని అంశాలను రెండు విధాలుగా విభజించవచ్చు.

1. సృజనాత్మక రచనలు (Creative Writings)

2 విమర్శనాత్మక రచనలు (Critical Writings)

మొదటి దానిలో కథ, సీరియల్ నవల, కవిత, నాటకం, గల్పిక ఉంటాయి. రెండవదానిలో పుస్తక సమీక్ష, విభిన్న రచనలపై విమర్శనా వ్యాసాలు ఉంటాయి. 'సాహితి' వంటి పత్రికల్లో సృజనాత్మక రచనలే ఎక్కువగానూ, 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' వంటి పత్రికల్లో విమర్శనాత్మక రచనలే ఎక్కువగానూ ఉండేవి. 'భారతి' మాసపత్రికలో రెండింటికీ సమాన ప్రాధాన్యం ఉండేది. తొలి రోజుల్లో సాహిత్య పత్రిక సారస్వతంతోపాటు, విద్య, సంస్కృతులకు సంబంధించిన విషయాలను కూడా ప్రచురించేది. ఉదాహరణకు సాహిత్యానికి ప్రాధాన్యమిచ్చిన మొట్టమొదటి పత్రికగా చెప్పుకునే 'సుజనరంజని' (1862-67)లో భాషా సాహిత్యాలతో పాటు, అప్పటి మెట్రిక్యులేషన్ తెలుగు ప్రశ్నాపత్రంలోని ముఖ్యమైన ప్రశ్నలను కూడా ప్రచురించేది. అదే విధంగా పురుషార్థ ప్రదాయిని (1872న ప్రారంభం), జన వినోదిని (1875-85), ప్రబంధ కల్పవల్లి (1880-82), అముద్రిత గ్రంథ చింతామణి (1885-1904) వంటి 19వ శతాబ్దం పత్రికల్లోనూ, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక వంటి 20వ శతాబ్దం పత్రికల్లోనూ సాహిత్య వ్యాసాలే అధికంగా వున్నా, ఇతర విజ్ఞాన సంబంధమైన విషయాలను కూడా ప్రచురించేవారు. సాహిత్య విషయాలు 75 శాతానికి పైగా ఉన్నందువల్ల వీటిని సాహిత్య పత్రికలుగా పరిగణించవచ్చు. 90 శాతానికి పైగా సాహిత్య సంబంధమైన రచనలలో కూడా పూర్ణ సాహిత్య పత్రికలుగా పరిగణించదగినవి ఇవి :

1. భారతి

2 సాహితి

3 ప్రతిభ

4. అభ్యుదయ

5. పరిశోధన

6. సృజన

ప్రస్తుతం పై పత్రికలు రానప్పటికీ, సాహిత్య పత్రికలు లేని కొరతను స్రవంతి, సమాలోచన, 'తెలుగు' పత్రికలోని భాషా సాహిత్య విభాగం, దినవార పత్రికలలోని రెండు మూడు పుటలు కొంతవరకు తీరుస్తున్నాయి.

మొత్తం మీద తొలినుంచీ వెలువడిన కేవల సాహిత్య పత్రికలు, రాజకీయాలతోపాటు సాహిత్యాన్ని కూడా అందించే పత్రికలు చేసిన కృషిని ఈ విధంగా చెప్పవచ్చు.

1) ప్రాచీన కావ్య ప్రబంధాల ప్రచురణ.

BRAOU

2) భాషా సాహిత్య విమర్శనం.

3) సాహిత్య వాద వివాదాలు.

4) నవలలు, వ్యాసాలు, కథల ప్రచురణ.

5) పుస్తక సమీక్షలు.

6) సారస్వత విషయాలపై పండితుల ఉత్తర ప్రత్యుత్తరాలు.

7) ఆంగ్లం సంస్కృతంలో ఇతర భారతీయ భాషలనుంచి అనువాదాలు. *

**అభ్యాసం-1: తెలుగులో ప్రస్తుతం వెలువడుతున్న సాహిత్య సంచికలేవి?**

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

## 21.3 సాహిత్య వ్యాసమంటే

సాహిత్య వ్యాసమంటే ఒక రచన, రచయిత ప్రక్రియ, ఉద్యమం, ధోరణి - ఇత్యాదులలోని లోతుపాతులను అంచనా వేస్తూ, విశ్లేషణాత్మకంగా రాసే వ్యాసం. రచన - 'రామాయణం' నుంచి 'రాజు-మహిషి' వరకు ఏదైనా కావచ్చు. రచయిత 'వ్యాసుడి' నుండి 'సినారె' వరకు ఎవరైనా కావచ్చు. ప్రక్రియ 'పురాణం'నుంచి కాలమ్ దాటని కథ వరకు ఏదైనా కావచ్చు. ఏదో ఒక విషయం గురించి తన దృక్పథాన్ని ఉపపత్తులతో సహా నిరూపించుకోవడం సాహిత్య వ్యాసకర్త చేసేపని.

## 21.4 సాహిత్య వ్యాసరచన చేసేవారికి వుండాల్సిన లక్షణాలు

1) తాను ఎంచుకున్న అంశాల్లో అభినివేశం, పరిజ్ఞానం ఉండాలి.

2) తను ఆకళింపు చేసుకున్న విషయాలను క్రోడీకరించి ప్రకటించ గలప్రతిభ ఉండాలి.

3) ఒక సాహిత్య విషయంలోని మంచి చెడులను తూచగల వివేకం, పరిపక్వత ఉండాలి.

4) రచనలో ఆత్మాశ్రయత్వం (subjectivity) కంటే వస్తుగతత్వం (objectivity), నిష్పాక్షికత (Impartiality) ఉండేలా జాగ్రత్త వహించాలి.

5) పరస్పర విరుద్ధ ప్రకటనలూ, స్వవచన విఘాతాలూ రాకూడదు.

6) తను ప్రతిపాదించిన విషయాలను తదుపరి చర్చల్లో సమర్థించుకోడానికి అవసరమైన సామర్థ్యం, తప్పును ఎవరైనా ఎత్తిచూపిస్తే స్వీకరించగల సహృదయత, ప్రతివిమర్శల నెదుర్కొనగల ధీరత్వం ఉండాలి.

7) సాహిత్య వ్యాసకర్త లక్ష్యం సాహిత్య వికాసమేగాని వ్యక్తిగత దూషణలూ అలాంటి ఇతరమైనవీ కాగూడదు.

* 'తెలుగు పత్రికల సాహిత్య సేవ' (తిరుమల రామచంద్ర) ఆధారంగా.



BRAOU

## 21.5 సాహిత్య వ్యాసాలు - ప్రయోజనం

1) సాహిత్యంలో ఒక కొత్త కోణాన్ని పరిచయం చేయడం;

2) మరుగునపడిన రచన లేదా రచయితను ప్రచారంలోకి తీసుకురావడం;

3) ఒక సరికొత్త చర్చను ప్రతిపాదించడం;

4) పాఠకుడికి సాహిత్యంపట్ల అభిరుచిని కలిగించడం;

5) సాహిత్య విమర్శనా ప్రక్రియ వికాసానికి దోహదం చేయడం.

ఇవి స్థూలమైన ప్రయోజనాలు. ఇతర ప్రయోజనాలన్నీ ఈ ఐదింటిలో ఏదో ఒక సూత్ర పరిధిలోనే ఉంటాయి. ప్రతి సాహిత్య వ్యాసమూ, పై అయిదు ప్రయోజనాలనూ సాధించదన్న విషయం తెలిసిందే. ఇందులో ఏదో ఒకటి లేదా ఒకటి కంటే ఎక్కువ ప్రయోజనాలను సాహిత్య వ్యాసాలు సాధిస్తాయి.

## 21.6 స్వభావరీత్యా సాహిత్య వ్యాసాల రకాలు

BRAOU

సాహిత్య వ్యాసాలు స్వభావాన్ని బట్టి రెండు విధాలుగా ఉంటాయి.

1) భాషా సంబంధమైన వ్యాసాలు (language)

2) సాహిత్య సంబంధమైన రచనలు (literary)

భాషా సంబంధమైన వ్యాసాల్లో పదాలు, వాటి అర్థ వివేచన, ఇతర భాషలతో సామ్యాలు, తెలుగు భాష పుట్టుక, వ్యాకరణ, ఛందో సంబంధమైన అంశాల వివరణలు, చర్చలు ఉంటాయి. తొలినాటి సాహిత్య పత్రికల్లో భాషా సంబంధమైన వ్యాసాలు ఎక్కువగా ఉండేవి. ముఖ్యంగా వ్యావహారిక భాషా ఉద్యమం ప్రబలంగా ఉండే రోజుల్లో ఆనాటి దినపత్రికల్లోనూ, సాహిత్య పత్రికల్లోనూ గ్రామ్యభాష, వ్యావహారిక భాష, గ్రాంథిక భాషల స్వరూపం, ప్రయోజనాల గురించి ఉద్దండ పండితులు నిత్యచర్చలు జరిపేవారు. ఒక్కొక్క సంధి, సమాస రూపాలపై చర్చలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఉదా॥కు 1982 సంవత్సరం 'భారతి' మాస పత్రికలో 'అలరుబోడి ఇత్యాది సమాస విచారణ' అనే వ్యాసాన్ని ఆచార్య జి. లలిత రాశారు.

ఇక సాహిత్యపరమైన వ్యాసాల్లో 'నవలా రచనా విధానములు' (1978, మే 11, ఆంధ్ర పత్రిక) వంటి నవలా సిద్ధాంత వ్యాసాలతోపాటు, 'రాయలనాటి రసికత', 'తెలుగు వారి సొమ్ములు' వంటి సాహిత్యం ద్వారా అభివ్యక్తమయ్యే సంస్కృతీ విశేషాలపై వ్యాసాలు కూడా ఉంటాయి. కనుక, సాహిత్య పత్రికల కోసం చేసే రచనల్లో చాలా వైవిధ్యం ఉంటుంద

## 21.7 సాహిత్య వ్యాసాలు – వర్గీకరణ

సాహిత్య పత్రికలకోసం చేసే రచనలన్నీ ఒకే విధంగా ఉండవు. వ్యాసంలోని వస్తువును బట్టి, రచయిత సామర్థ్యాన్ని, దృక్కోణాన్ని బట్టి, అప్పటి సాహిత్య వాతావరణాన్ని బట్టి, ఆ పత్రిక స్వభావాన్నిబట్టి సాహిత్య వ్యాసాలు కొన్ని రకాలుగా ఉండవచ్చు. అవి :

1) వ్యాఖ్యాన పూర్వక వ్యాసం

2) వివరణాత్మక వ్యాసం

3) విశ్లేషణాత్మక వ్యాసం

4) సిద్ధాంత ప్రతిపాదన వ్యాసం

5) సమీక్షాత్మక వ్యాసం

6) వాదప్రతివాద వ్యాసం

### 21.7 1 వ్యాఖ్యానపూర్వక వ్యాసం

ఇందులో రచయిత దృక్కోణంకంటె, అభిప్రాయంకంటే గ్రంథమే ముఖ్యం. అంటే ఒక గ్రంథరచన విషయాలను పరిచయం చేయడం కోసం, అందులోని వివిధ విషయాలకు టిప్పణి చెప్పే రచన యిది. ఉదా॥కు 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' లో తిక్కన సోమయాజిపై వారణాసి సుభద్రమ్మ వ్యాసం. ఈ వ్యాసం లక్ష్యం తిక్కన పద్యాలు ఉల్లేఖిస్తూ, వాటికి తాత్పర్యం, విశేషార్థం చెప్పడమే. ఇలాంటి వ్యాసాల్లో రచయిత కొత్తగా, సొంతంగా చెప్పే విశేషాలు ఎక్కువ ఉండవు. గ్రంథం మీద భక్తితో, గౌరవంతో, ప్రశంసాత్మకంగా రాసే వ్యాసాలు ఇవి.

### 21.7.2 వివరణాత్మక వ్యాసం

సాహిత్యానికి సంబంధించిన ఏదైనా ఒక విషయం తీసుకుని, దానికి సంబంధించి జరిగిన అధ్యయనం, ఇతరులు ప్రకటించిన అభిప్రాయాలు మొదలైనవి విస్తారంగా చెప్పడం ఈ రకమైన వ్యాస లక్షణం. ఇందులో కూడా స్వీయ అభిప్రాయ ప్రకటనకు ప్రాముఖ్యం తక్కువగా ఉంటుంది. ఒక అంశంపై జరుగుతున్న కృషిని, అక్కడక్కడా సమర్థింపులతో వర్ణించడమే జరుగుతుంది. ఉదాహరణకు 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' ప్రమాదీత సంవత్సరంనాటి 4 సంచికలో 'ఆంధ్ర భాషా సంస్కరణము' అనే శీర్షికతో తాతా సుబ్బరాయశాస్త్రి రాసిన వ్యాసం. ఆ వ్యాస ప్రారంభం ఈ విధంగా వుంది. "ప్రకృతమునందాంగ్ల భాషాభివృద్ధిని జూడఁ గొంత వరకు నూతన సంస్కరణముల చేత నభివృద్ధి నందింపక పూర్వహిత నిబంధనల చేత సాకల్పముగ నిర్బంధించినచో దేశభాష అభివృద్ధినొంద జాలవని కొందరు పండితులు దలంచుచున్నారు ఆ తర్వాత ఆంధ్ర భాషపై ప్రభావాలు, సంస్కరణ ఆవశ్యకత అనే విషయాలను, ఇతర పండితుల అభిప్రాయాలు ఉల్లేఖిస్తూ, వ్యాసంలో వివరించారు.

ఇలాంటి వ్యాసం వీటిపై అధ్యయనం చేసేవారికి, సాహిత్య విద్యార్థులకు ఉపకరిస్తుంది.

### 21.7.3 విశ్లేషణాత్మక వ్యాసం

ఒక సాహిత్య విషయంలోని మంచి చెడులను, సోదాహరణంగా విశ్లేషిస్తూ, సాహిత్యంలో దాని స్థానాన్ని గురించి చర్చా రూపకంగా ప్రస్తావించే వ్యాసాన్ని విశ్లేషణాత్మకమని చెప్పవచ్చు. 1982 'భారతి'లో 'అభ్యుదయోద్యమం-వచన కవిత' అనే శీర్షికతో టి.ఎల్. కాంతారావు రాసిన వ్యాసం దీనికి చక్కని ఉదాహరణ. సాహిత్య వ్యాసంలో ఉపోద్ఘాతం ఎలా వుండాలో చెప్పడానికి కూడా ఇది మంచి ఉదాహరణ. "సాహిత్యంలో ఉద్యమం భావసంబంధి. రూపం ప్రక్రియ సంబంధి. పాత వ్యవస్థను నిర్మూలించాలనే తపనతో, కొత్త వ్యవస్థను నిర్మించాలనే ఆకాంక్షతో, పాత విశ్వాసాల పట్ల ద్వేషాన్నీ, కొత్త విశ్వాసాల పట్ల మక్కువను పెంచుకుంటూ ఒకానొక వినూతన జీవన దృక్పథాన్ని సమాజంలో ప్రచారం చేసేటప్పుడు, ఆ దృక్పథం ఒక ఉద్యమంగా విస్తరిస్తుంది. ఉద్యమ ప్రచార సాధనాల్లో కళారూపాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఇట్లా ఒక ప్రత్యేక సైద్ధాంతిక దృక్పథంతో, అంతదాకా ఉన్న సామాజిక విలువలను, కవితా విలువలను ధిక్కరిస్తూ తెలుగునేల మీద కాలూనిన మహా ఉద్యమం అభ్యుదయ కవిత్వోద్యమం". ఈ రకం వ్యాసంలో ఇతరుల అభిప్రాయాలు, దృక్కోణాలను వివరించడంతోపాటు, రచయిత తన అవగాహన, పాండిత్యాలతో వాటి విలువలను బేరీజు వేశాడు.

BRAOU

### 21.7.4 పరిశోధనాత్మక / సిద్ధాంత ప్రతిపాదక వ్యాసం

ఈ రకం వ్యాసంలో రచయిత తను అధ్యయనం చేసిన సాహిత్య విషయాల నుంచి ఒక సొంత సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తాడు లేదా తను కనుగొన్న ఒక కొత్త విషయాన్ని చెప్తాడు. ఈ సిద్ధాంతం ఒక ప్రక్రియలో, కవి కాలానికో, గ్రంథ కర్త నిర్ధారణకో సంబంధించినదై వుండవచ్చు. ఉదాహరణకు ఈ శతాబ్ది ఆరంభంలో 'రంగనాథ రామాయణం' కర్తృత్వం విషయమై ఉద్దండ పండితులు పలువురు స్వీయ సిద్ధాంతాలను ప్రచారంలోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. కట్టమంచి రామలింగారెడ్డి రంగనాథ రామాయణ గ్రంథకర్త గోనబుద్ధారెడ్డి అనీ, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఈ కావ్య కర్త రంగనాథుడనే కవి అనీ వాదిస్తూ వ్యాసాలు రాశారు.

అదే విధంగా 1982 భారతి, మార్చి నెల సంచికలో 'విశ్వబ్రాహ్మణ కవులు' అనే శీర్షికలో వ్యాసం రాశారు. ప్రాచీన శాసనాలనుల్లేఖిస్తూ, ఏయే రాజుల కాలంలో విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన కవులుండేవారో సోదాహరణంగా చెప్పిన వ్యాసం.

'భారతి' పత్రిక 1982వ సం॥లోనే కొండూరు వీరరాఘవాచార్యులు 'సుద్యుర్న రాజ చరిత్రము' అనే కావ్యం గురించి రాశారు. 20వ శతాబ్ది ఆరంభంలో కొళ్ళిపాటి గురవయ్య రాసిన ఈ ప్రబంధాన్ని వెలుగులోకి తీసుకువచ్చిన పరిశోధనాత్మక వ్యాసమిది.

సిద్ధాంత ప్రతిపాదక వ్యాసాల్లో మరొక రకం వ్యాసాలు - ఒక ప్రక్రియలోని లోతుపాతులను వివరించి, దాని అవసరాన్ని, ఔచిత్యాన్ని నిర్ధారించడానికి ప్రయత్నించేవి. 'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక' 48వ వార్షిక సంచికలో 'ఆంధ్ర సాహిత్యము - అపరాధ పరిశోధక నవలల స్థానము' అనే వ్యాసాన్ని వి. వెంకటరామమూర్తి రాశారు. బెంగాలీ నవలలు, ఆంగ్ల నవలలు తెలుగు సాహిత్యంపై ప్రభావం చూపుతున్న తొలిరోజుల్లో, తామర తంపరగా వచ్చిన అపరాధ పరిశోధక నవలల అనువాదాలను, వాటి ప్రేరణతో వచ్చిన మౌలికమైన తెలుగు డిటెక్టివ్ నవలలను విమర్శిస్తూ రాసిన వ్యాసం. రచయిత, డిటెక్టివ్ నవలల స్వరూప స్వభావాల కోవలోంచి, అవి పరిత్యాజ్యాలని చెప్పు. "పై తరగతికి చెందిన నవలా సాహిత్యమును సాధ్యమయినంత తగ్గింప ప్రయత్నించవలెను. ఈ నవలల ఆవశ్యకత అంతగా దోహదపడదు" అని ముగించారు. నవలా సాహిత్యంలో అపరాధ పరిశోధన నవలలనే విభాగమే ఉండనవసరం లేదని రచయిత సిద్ధాంతీకరించారు.

BRAOU

### 21.7.5 సమీక్షాత్మక వ్యాసం

ఏదో ఒక పుస్తకాన్ని సమీక్షిస్తూ రాసే సాహిత్య వ్యాసం సమీక్షా ధోరణిలో ఉంటుంది.. తీవ్రమైన విమర్శతో కూడిన సమీక్షాత్మక వ్యాసానికి మంచి ఉదాహరణ 1982 సం॥ భారతిలో వచ్చింది. 'ప్రాచీన సాహిత్యానికి సమాధి తెలుగు అకాడెమీ సాహిత్య పదకోశం' అనే ఈ విమర్శనా వ్యాసంలో ఈ గ్రంథాన్ని దుమ్మెత్తిపోశారు. "ఈ కోశ నిర్మాణం అంతా తప్పుడు కొలతలతో ప్రారంభమయింది. వాడిందంతా కల్తీ సిమెంటు, మంచి సరుకు కోసం ఎవరూ మార్కెట్లోకి వెళ్ళిన పాపాన పోలేదు. కాంట్రాక్టుకి ఇచ్చినట్టు లేదు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలలో ఇళ్ళులేని కొంతమందికి ధన సహాయం చేస్తే వాళ్ళే కట్టుకుంటారు. అట్లాగే ప్రభుత్వం డబ్బిస్తే అకాడెమీ పండితులు దీనిని నిర్మించారు"

పుస్తక సమీక్ష సాహిత్య వ్యాసంగా మారిన సందర్భాలు గతంలోకంటె ఇటీవలె ఎక్కువగా ఉన్నాయి. ఆచార్య చేకూరి రామారావు 'ఆంధ్రజ్యోతి'లో రాసిన 'చేరాతలు' ధారావాహిక రచనలో మామూలు వ్యాసాలతోపాటు, కొత్తగా వెలువడిన పుస్తకాల సమీక్ష కూడా ఉండేది.

### 21.7.6 వాదప్రతివాద వ్యాసం

ఈ రకమైన వ్యాసాలు ఒక సృజనాత్మక రచనకు ప్రతిస్పందనగా కాక, ఒక విమర్శనా వ్యాసానికి ప్రతిస్పందనగా ఉంటాయి. ఒక వ్యాసంలో ప్రస్తావించిన సాహిత్య సిద్ధాంతాలు, అభిప్రాయాలతో ఏకీభవించినపుడు లేక విభేదించినపుడు 'వాద ప్రతివాద వ్యాసం' రూపుదిద్దుకుంటుంది ఒక సాహిత్య వ్యాసానికి చర్చా రూపాన్ని కల్పించేది ఈ రకమైన వ్యాసమే..

1923లో 'సాహితి' సాహిత్య పత్రికలో 'నాకు తోచినట్లు' అనే శీర్షిక కింద ఒక విమర్శకుడు నండూరి సుబ్బారావు 'ఎంకిపాటల'ను తూలనాడారు. అదే సంచికలో మరో విమర్శకుడు 'ఎంకి పాటల'ను అతిశయోక్తులతో ప్రశంసించారు. ఈ రెండు విరుద్ధ వ్యాసాలకూ ప్రతిస్పందన ఆ తర్వాతి సంచికలో వచ్చింది. ఆరికపల్లి లక్ష్మీనరసింహరావు ఈ రెండు వ్యాసాలూ అతిగా వున్నాయని విమర్శిస్తూ, రెండిటిలోని సద్విమర్శనూ 'ఎంకి పాటల'పై తన అంచనాను జోడించి చక్కటి వాదంతో కూడిన వ్యాసం రాశారు.

క్రమేపీ తక్కిన అన్నిరకాల రచనల కంటె సాహిత్య పత్రికల్లో వాదప్రతివాద రచనల సంఖ్యే ఎక్కువైంది. భారతి, ప్రతిభ, సాహితి, ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, ఆంధ్రపత్రిక మొదలైన సాహిత్య పత్రికల్లో వివరణాత్మక, విశ్లేషణాత్మక, పరిశోధనాత్మక, సమీక్షాత్మక వ్యాసరచనకు ఎక్కువ ప్రోత్సాహం ఉండేది. సిద్ధాంత ప్రతి పాదక, వాద ప్రతివాద విమర్శలకు కూడా చోటు ఇప్పటికీ. వచ్చిన వ్యాసాలే ఎక్కువగా రచింపబడడం, ముద్రించడం జరిగేది. ఆనాడు వాదప్రతివాదాలు కూడా ఎక్కువగా పాఠ వివేచన, కృతికర్త, కృతి రచనాకాలం ఇత్యాదులకు సంబంధించి ఉండేది. ఉదా॥కు తిమ్మావజ్ఝల కోదండరామయ్య, నాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ వంటివారు భారతం ఇతర కావ్యాలలోని పద్యాలకు పాఠాంతరాల గురించి చర్చించేవారు. ఏ పాఠం గ్రాహ్యమనే విషయంలో వారిమధ్య భేదాభిప్రాయాలు వచ్చినప్పుడు 'వాద ప్రతివాదాలు' 'భారతి' వంటి సాహిత్య పత్రికల్లో చోటు చేసుకునేవి.

కేవలం సాహిత్య పత్రికలు నిలిచిపోయి, దినపత్రికలు 'ఆదివారం, సోమవారం' అనుబంధాల్లో సాహితీ వ్యాసాలకు స్థలం కేటాయించడంతో, సాహిత్య పత్రికలకోసం రాసేవారూ వాటిని ప్రచురించే సంపాదకులు కూడా మారారు. గతంలో సాహిత్య పత్రికలకోసం రాసిన వారు విధిగా పండితులై వుండేవారు. తెలుగు, సంస్కృత, ఆంగ్ల సాహిత్యాలు మూడింటినీ గానీ, రెండింటినిగానీ క్షుణ్ణంగా చదువుకున్నవారై ఉండేవారు. అందువల్ల ఎంచుకునే విషయాలలోనూ, అభివ్యక్తిలోనూ, భాషలోనూ ప్రౌఢత్వం, పటుత్వం కనిపిస్తూండేవి. కానీ సాహిత్య పత్రికలు అంతరించిపోయి, సాహిత్యాను బంధాల దశకు చేరుకునే సరికి, సాహిత్య వ్యాస రచన, పఠనం కూడా అందరికీ అందుబాటులోకి వచ్చాయి. సాహిత్యం దినపత్రికలో భాగం కావడం వల్ల, సాధారణ పాత్రికేయులు సైతం సాహిత్యంలో అభినివేశం వల్లగానీ, వృత్తి అవసరాల వల్లగానీ సాహిత్య వ్యాసాలు రాస్తున్నారు. ఈ కారణంగా సాహిత్యవ్యాసం కేవలం సాహితీపరులకే పరిమితమన్న అభిప్రాయం తొలగిపోయింది. విభిన్న సామాజిక, రాజకీయ ఉద్యమాలు, దేశకాల పరిస్థితుల్లో పరిణామాల వల్ల సాహిత్యానికి సామాజిక శాస్త్రాలతో, ఇతర కళలతో సంబంధం వుందనే సాహిత్య విమర్శ కేవలం సాహిత్యగ్రంథ విమర్శగా మిగిలిపోక, ఆ రచన వెనకవున్న సమాజ వ్యవస్థనూ, రాజకీయ నేపథ్యాన్ని విశ్లేషించాలనే అభిప్రాయం ఏర్పడింది.

పాత్రికేయులు, కవులు, ఇతర సృజనాత్మక రచయితలు సాహిత్య పత్రికలకు వ్యాసాలు రాయడం ప్రారంభించడంతో, ఎన్నుకునే అంశాలు, భాష, శైలి అన్నీ మారాయి. సాహిత్యానుబంధాలలోని వ్యాసాలు రచనలకే కాక, సాహిత్య సభల పరామర్శకు కూడా విస్తరించాయి.

ఉదా॥ చలం శతజయంతి సందర్భంగా హైదరాబాదు నగరంలో ఏర్పాటు చేసిన ఒక శాఖలో ఒక వక్త చేసిన ప్రసంగాన్ని దుయ్యబడుతూ 1995, మే 15వ తేదీ 'ఆంధ్రప్రభ' సాహిత్యానుబంధంలో ఒక వ్యాసం వచ్చింది. "తెప్పలుగా పారి పొంగి పొర్లిన 'వీర' రస ప్రవాహంలో శ్రోతలకు బదులు వక్త కొట్టుకుపోయాడు. దారి తప్పాడు. ఎక్కడో మునిగి ఇంకెక్కడో తేలాడు. శ్రోతలు మాత్రం నీరసించారు. మైమరచి చేసిన పాత్ర పోషణ పుణ్యమా అని మాట తడబడి పరస్పర విరుద్ధ ప్రకటనలు, అసందర్భ ప్రలాపాలు, అసత్యాలు, అర్ధసత్యాలు ఆ మార్క్సిస్టు మహాశయుడు ప్రసంగించినంత మేరా దొర్లాయి" (వ్యాసకర్త - దేశికాచారి). ఇందులో విషయంపై కంటె వ్యక్తిపైనే ఆగ్రహం ఎక్కువ కనిపిస్తుంది.

అదే విధంగా దళితకవిత్వం పైన ఆంధ్రప్రభ, ఉదయం, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి సాహిత్యానుబంధాల్లో చాలా విరివిగా వాదప్రతివాద రచనలు వచ్చాయి. అయితే వీటిలో అన్నింటినీ సాహిత్య రచనలనే చెప్పలేం. చాలా రచనలు దళిత కవిత్వ చర్చను వదిలి, వ్యక్తులు, వారి జీవితాల విమర్శకు పూనుకున్నాయి.

BRAOU

ఆంధ్రజ్యోతి దినపత్రిక ఒకసారి ఆదివారం అనుబంధంలో పి.సి రాములు, ఆర్. సీతారామారావు వ్యాసానికి ప్రతిస్పందిస్తూ, ఇలా అన్నారు. "సీతారామారావుగారు తన వ్యాసంలో కొన్నిచోట్ల అమాయకత్వాన్నీ, కొన్నిచోట్ల అతి తెలివినీ ప్రదర్శించి, సారాంశంలో తనకు తెలియకుండానే తన మానసిక బలహీనతని బయట పెట్టుకున్నారనిపిస్తుంది"

అదే విధంగా, ఆంధ్రప్రభలో శిఖామణి సతీశ్‌చందర్ వ్యాసానికి ప్రతివాదనగా రాస్తూ, "...వ్యాసకర్త మాటేమిటి? దళితుడై పుట్టి పుస్తకానికి పంచమ వేదం అని పేరుపెట్టి, మంటలపై కాక పెడుతున్న కృత్రిమ మాదిగ డప్పును కవర్ పేజీగా వేసుకుని, అగ్రవర్ణాలవారి చేత ముందుమాటలు రాయించుకోవచ్చు" అంటారు.

సాహిత్య పత్రికలకోసం వ్యాసాలు రాసేవారు పైన పేర్కొన్న రెండు ఉదాహరణలలోని పొరపాట్లు చేయకూడదు. ఒక విమర్శకుడి అభిప్రాయంతో విభేదించడానికీ, దానికి అక్షరరూపం ఇవ్వడానికీ అందరికీ హక్కు వుంది. కానీ ఆ విభేదాలు సాహిత్య సిద్ధాంతాలకే పరిమితమై వుండాలి. వ్యక్తుల కుల, మత, వర్గ, లింగ ప్రస్తావన వల్ల, సాహిత్య విషయాలపట్ల అవగాహన కలగడానికి బదులు, మొత్తం చర్చ పక్కదారులు పడుతుంది. ఇటువంటి విమర్శలు చదివిన పాఠకుడు 'ఓహో ఈ ఇద్దరు వ్యక్తులకూ పడదు కాబోలు' అనుకుంటాడే తప్ప, వీరిద్దరి సిద్ధాంతాలలోని మంచిచెడ్డలను బేరీజు వేయలేడు. అదే వ్యాసంలో వ్యాసకర్త చెప్పే సాహిత్యపరమైన సహేతుక విమర్శలు ఈ వ్యక్తిగత దూషణలో కొట్టుకుపోయే ప్రమాదం వుంది. ఒక వ్యాసంపై వ్యతిరేకతను వ్యక్తం చేస్తూనే, స్వీయసిద్ధాంతాన్ని సంయమనంలో చెప్పినపుడు అది చక్కని సాహిత్యవ్యాసం అవుతుంది.

ఉదా॥ 1995 మార్చి ఆంధ్రప్రభలో 'ముద్రకాదు, సాహిత్యంలో మనిషి ముఖ్యం' అనే వ్యాసంలో ఫణిహారం వల్లభాచార్య ఈ రకమైన సంయమనం పాటించారు. "కళాత్మక స్పందన పొందటం అది కవిత అవునా కాదా అన్న దానికి గీటురాయి. దాని తరువాతనే దానిలో సామాజిక ప్రయోజనము వగైరాలు. సామాజిక ప్రయోజనము ప్రధానం కాదా అంటే "నేను కవిని, కవిత్వం రాస్తున్నాను' అన్నపుడు మొదటి వివేచన 'అది కవిత్వము కాదా' అన్నదే అవుతుందికానీ 'ఫలానా సిద్ధాంతానికి అనుగుణము కాదా అనేది కాదు. రెండవదే ప్రధానమైతే వ్యాసం రాసుకోండి. అది కవిత్వమనే మౌలికద్రవ్యం కానంతవరకూ కవిత్వమని బుకాయించకండి."

ఈ విధంగా సాహిత్య పత్రికల కోసం చేసే రచనల్లో విషయాన్ని, అభివ్యక్తి తీరు తెన్నులను వ్యాసకర్త లక్ష్యాన్ని బట్టి విభిన్న రకాలు కనిపిస్తాయి.

**అభ్యాసం-2: సాహిత్య వ్యాసాల రకాలు.**

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

.......................................................................................................................................

## 21.8 సాహిత్య వ్యాసాల్లో శైలి

సాహిత్య పత్రికలకోసం, దినపత్రికల్లో సాహిత్యానుబంధాలకోసం చేసే రచనల్లో శైలి, మామూలు పత్రికా రచనలకంటె కొంత భిన్నంగా ఉంటుంది. వ్యావహారికంలోనే కొంత ప్రౌఢమైన, సాభిప్రాయ ప్రయోగాలు చేయాలి. వార్తల్లో రాసినట్టు యథాలాపంగా కాక, చిక్కని, చక్కని పదజాలం వాడాలి. ఆంగ్లభాష నుంచి ఉల్లేఖించినపుడు తెలుగు అనువాదం కూడా ఇవ్వాలి. సాహిత్య వ్యాసాల్లో ఉపయోగించే శైలి అనేక రకాలుగా ఉండవచ్చు :

BRAOU

### 21.8.1 అలంకారిక శైలి

చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా కాక, రూపకం, అతిశయోక్తి ఇలాంటి అలంకారాల సహాయంతో కవితాత్మకంగా చెప్పడం అలంకారిక శైలి.

'సాక్షి' వ్యాసకర్తగా సుప్రసిద్ధులైన పానుగంటి లక్ష్మీనరసింహరావు ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక ప్రమాదీచ సంవత్సరం సంచికలో 'గ్రామ్యవాదుల భాషాపవాదము' అనే వ్యాసం రాశారు. అయిన శైలి ఇలా వుంది. ఎత్తుగడే విలక్షణంగా, వినూత్నంగా ఉంది.

"హరిహరీ! మన గ్రాంథికాంధ్ర భాష మరణించినదా? ఎప్పుడు? ఎవ్వరును వినలేదే? ఈ యాకస్మికోపద్రవమేల కలిగినది? ఈ నడుమ భాషకస్వస్థత యని కూడా వినలేదే?.. ఆంధ్రభాష మృతభాషయని చెప్పనొప్పునా? ఊరెగిరి పోవునట్లు మాటలాడుచున్న యుపన్యాసకర్త మూగవాడని చెప్పుటకుఁ జెవిటి వాడైన సాహసించునా? నిరంకుశముగ నాకసమున నెగురు పక్షిని ఱెక్కలు లేవని వాదింపవచ్చునా? సంవత్సరమున కొక్క పిల్లనుగను నిల్లాలు గొడ్రాలని పలుకదగునా?" గ్రాంథిక భాషను వ్యతిరేకించేవారిని దుమ్మెత్తిపోసే ఈ వ్యాసంలో వ్యంగ్యంతో కూడిన అలంకారిక శైలి కనిపిస్తుంది.

### 21.8.2. స్పష్టత

వ్యంగ్యంలోనూ సూటిగా రచించేశైలి మరో రకమైనది. సుమధురం, సునిశితమైన వ్యంగ్యం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ శైలిలో కనిపిస్తుంది. 1960 భారతి మాసపత్రికలో ప్రాచీన కావ్యాల సాదుపాదాలు నిర్ణయించే ఉత్సాహం ప్రభుత్వానికీ, విశ్వ విద్యాలయాలకూ తగ్గిపోతుందని ఎగతాళి చేసిన తీరు గమనించండి.

"పుస్తక వ్యాపారులకు ఇందుకై పెట్టిన అసలు లేవడు గనక వారికా ప్రక్క చూపు సహజముగా నుండదు. మరి విశ్వవిద్యాలయాల వారికి ఈ పనియందంతగా గౌరవాభిమానములున్నట్లు కానరాదు. వారు 'నిత్య విజ్ఞాన భిక్షువులు'. ఎంత ద్రవ్యము వచ్చినా ఏ 'లేబరటరీ' గవాక్షమునందో కుమ్మరించి, సంచి దులుపుకుని నిత్య యాత్రకు మరల వెళ్ళుతారు"

మొత్తం మీద సాహిత్య పత్రికల కోసం రాసేవారు అంటే సాహిత్య విమర్శనా వ్యాసాలు రాసేవారు వ్యంగ్యం, అధిక్షేపం, హాస్యం అనే ఆయుధాలను విరివిగా వాడుకుంటారు. కానీ వ్యంగ్యానికి లక్ష్యం సాహిత్యమే కావాలి గానీ! ఆ సాహిత్యం సృష్టించిన రచయిత కాదు. వ్యక్తికీ, అతని రచనకు ఉన్న అంతరాన్ని విమర్శకుడు విస్మరిస్తే అది వైయుక్తిక విమర్శే అవుతుందికానీ, సాహిత్య విమర్శ కాదు. ఒక రచన విమర్శకు రచయిత నేపథ్యం ఎంతవరకు వసరమో, అంత స్వీకరించాలి కానీ రచన కంటె మరొక ప్రాముఖ్యం రచయిత వ్యక్తిగత జీవితానికి ఇవ్వడం సాహిత్య విమర్శలో గర్హించవలసిన విషయం.

## 21.9 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

సాహిత్య పత్రికల కోసం రాయడం ఆషామాషీ వ్యవహారం కాదు.

★ సాహిత్యం పట్ల అభినివేశం రాసే విషయం పట్ల పరిజ్ఞానం అవసరం.

★ రాసే విషయం వల్ల ఏదైనా ప్రయోజనం వుండాలి.

★ సాహిత్య వ్యాసాల్లో ఏడు రకాలు వున్నాయి.

★ మామూలు రచనలకు, సాహిత్య పత్రికల రచనకు చాలా తేడా వుంది.

★ వ్యావహారికంలోనే ప్రౌఢమైన సాభిప్రాయ ప్రయోగాలు చేయాలి.

★ సాహిత్య వ్యాసాలు రాసేవారికి కనీసం రెండు భాషల్లో ప్రావీణ్యముండాలి.

## 21.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. సాహిత్య వ్యాసాల వర్గీకరణను వివరించండి.
2. సాహిత్య వ్యాసాల్లో శైలి

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. సాహిత్య వ్యాసమంటే ఏమిటి?
2. వాద ప్రతివాద వ్యాసం.

BRAOU

**- సి. మృణాళిని**

# భాగం - 22 : సాంకేతిక పత్రికలు, పరిశోధన పత్రికలు

## విషయక్రమం


22.0 ఉద్దేశం

22.1 ప్రవేశిక

22.2 శాస్త్రవేత్తలు విధిగా ఎందుకు రాయాలి?

22. 3 సాంకేతిక, పరిశోధనాత్మక పత్రికలు

- 22.3.1 ఆవిర్భావం, అభివృద్ధి
- 22.3.2 ప్రచురణల రకాలు
- 22.3.3 పరిశోధనాత్మక పత్రికల సాంప్రదాయాలు
- 22.3.4 ప్రమాణీకరణ విధానాలు
- 22.3.5 పరిశోధనాంశాలకు సంబంధించిన పత్రికల గుర్తింపు

22.4 వ్యాస రచన

- 22.4.1 వ్యాస ప్రణాళిక
- 22.4.2 వ్యాసం - రూపు రేఖలు
- 22.4.3 తొలి ప్రతి
- 22.4.4 సహాయక సమాచారం
- 22.4.5 ఉపయుక్త గ్రంథాల పట్టిక

22.5. వ్యాస ప్రతి పునశ్చరణ

- 22.5.1 తొలి ప్రతి పునశ్చరణ
- 22.5.2 తదుపరి పునర్విమర్శ
- 22.5.3 తుది ప్రతి

22.6 ప్రతిశోధనా పత్రాన్ని ప్రచురణకు సమర్పించడం

22.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

22.8 మాదిరి పరీక్ష ప్రశ్నలు


BRAOU

## 22.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు

- శాస్త్రవేత్తలు ఎందుకు రాస్తారు?
- సాంకేతిక ప్రచురణలు, పరిశోధనాత్మక పత్రికల స్వభావం
- ఈ పత్రికల్లో ప్రచురణకి వ్యాసాలు ఎలా రాయాలి
- సృజనాత్మక, ఆకర్షణీయ శైలిలో వ్యాసాలు ఎలా రాయాలి

అనే విషయాలకు తెలుసుకుంటారు.

## 22.1 ప్రవేశిక

పత్రికల రకాలు, వాటి స్వభావాలు, మొదలయిన విషయాల్ని నేటి పత్రికలకు రాయడం గురించి ప్రస్తావించిన సందర్భంలో చర్చించుకున్నాం. శాస్త్రీయ, సాంకేతిక పత్రికలకు రాయడం ఎలా? రాసే పద్ధతులు ఏవి? అనే అంశాల్ని గురించి ఈ భాగంలో తెలుసుకుందాం.

శాస్త్ర సాంకేతికాంశాల సమాచార వ్యాప్తి విషయంలో పత్రికలు వహించే పాత్ర కీలకమైంది. శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలను, పరిశోధనల ఫలితాల్ని సామాన్యుడికి అందించేవి చాలామటుకు పత్రికలే కావడంల వల్లే అవి ప్రచురణ వ్యవస్థకు ఆయువు పట్టు లాంటివి. సాంకేతిక, సాహిత్య పత్రికలకు రాయడంలో పాటించవలసిన నియమాలు కొన్ని ఉన్నాయి. సాంకేతిక, సాహిత్య పత్రికలకు రాసే విధానంలో కొన్ని వైవిధ్యాలు కనిపిస్తాయి. సాహిత్య పత్రికలకు రాసే నియమాలు అందరికీ అవగాహన ఉన్న సామానమైన అంశాలే. కాగా సాంకేతిక పత్రికల విషయంలో మాత్రం కొన్ని నియమిత నిబంధనలు ఉంటాయి. ఖచ్చితంగా వాటిని పాటించవలసిన అవసరమూ ఉంటుంది. సాంకేతిక పత్రికలకు రాయడంలో ఒక నిర్మితి (Structure) అంటూ వుంటుంది.

దిన పత్రికలు, మ్యాగజైన్స్‌కి గానీ రాయడం వేరు. సాంకేతిక, శాస్త్రీయ పత్రికలకు రాయడం వేరు. శాస్త్ర, సాంకేతిక పత్రికలకు రాసే రచనలు విధిగా కొత్తవై, సొంతమై ఉండాలి. పరిశోధనల్లో నూతనాంశాల్నిగానీ, కొత్త కోణాల్నిగానీ ప్రస్తావించగలగాలి. సిద్ధాంత ప్రమాణాల్ని, శైలిని అనుసరించి ఉండాలి. వాటిని ప్రచురణకు స్వీకరించడం సరాసరి జరగదు. పరిశోధన వ్యాసంలోని అధ్యయనాంశాలను పరిశీలిస్తారు. నిపుణుల పరిశీలనకు పంపే ప్రయత్నమూ చేస్తారు. కొన్ని సందర్భాలలో నిపుణులు సూచించిన విధంగా మార్పులు చేయడం తప్పనిసరి. అవసరమనుకుంటే పరిశోధనా ఫలితాలను మరోసారి నిర్ధారణ చేసుకుని, వ్యాసాన్ని తిరిగి రాయవలసి వస్తుంది. దీనితో శాస్త్రీయ నాణ్యత లోపించకుండా ఉంటుంది.

BRAOU

## 22.2 శాస్త్రవేత్తలు విధిగా ఎందుకు రాయాలి?

శాస్త్ర సాంకేతిక పరిశోధనలు నిరంతర తత్వం కలవి. శాస్త్రజ్ఞులు గావించే పరిశోధనలు నిరంతరం కొనసాగేవే. పరిశోధనలు, ప్రమాణాలు. ఈ రెండూ ఇచ్చే ఫలితాలు శాస్త్ర సాంకేతిక రంగాలలో కొత్త ఆవిష్కరణల్ని, కొత్త కోణాల్ని సృష్టిస్తాయి. మానవాళి జీవితాల్ని స్పృశిస్తాయి. సమాజం మనుగడను నిర్దేశిస్తాయి. ఈ ఫలితాలు వ్యాసాల రూపంలో పత్రికల్లో వస్తేనేగానీ, జన బహుళ్యానికి తెలియవు - జన బాహుళ్యంలోకి ఈ ఫలితాలు వెళ్లడంతో ప్రాథమికంగా రెండు ప్రయోజనాలు కన్పిస్తాయి. ఒకటి - దూర తీరాలకు ఫలితాలు చేరడం అంటే మారుమూల ప్రాంతాల్లో నివసించే సామాన్యుడికి దగ్గరగా వెళ్లడం. రెండోది శాస్త్ర వేత్తకు గుర్తింపు తెచ్చిపెడ్తుంది. ఉన్నతికి కొన్ని సందర్భాల్లో పదోన్నతికి తోడ్పడ్తుంది. పరిశోధన విశేషాల్ని, ఫలితాల్ని రాసి పత్రికల ద్వారా ప్రచురణ జరిగినప్పుడే ఇది సాధ్యపడ్తుంది, తప్ప మరో విధంగా కాదు. ఇది వరకే అందుబాటులో ఉన్న విజ్ఞానానికి కొత్త ఆవిష్కరణలు, ఫలితాలు ప్రచురితమే తోడైతే వైజ్ఞానిక పరిధి విస్తరిస్తుంది. వైజ్ఞానిక వ్యాప్తికి దోహద పడుతుంది.

## 22.3 సాంకేతిక, పరిశోధనాత్మక పత్రికలు

శాస్త్ర, సాంకేతిక సమాచార ప్రసరణలో పత్రికలు కీలకపాత్ర వహిస్తాయి. శాస్త్ర, సాంకేతిక, కాలిక పత్రికల్లో వచ్చే పరిశోధన వ్యాసాలు సరాసరి ప్రచురణలుగా పేర్కొనవచ్చు. పరిశోధన వ్యాసాల ప్రచురణల విషయంలో మరో విధమైన అది సౌలభ్యమూ ఉంది. అది పరిశోధనా ఫలితాన్ని సూత్ర ప్రాయంగా వైజ్ఞానిక సదస్సులు, చర్చలు సమావేశాల్లో ప్రస్తావించడం.

పరిశోధనా పత్రాల రూపంలో సమర్పిస్తారు. ఫలితాలను సహశాస్త్ర వేత్తలు, నిపుణుల ముందు చర్చకు ఉంచుతారు. తర్వాత ఆ పరిశోధన పత్రాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా పత్రికల్లో ప్రచురిస్తారు. అయితే చాలా సందర్భాలలో 'ప్రత్యేక సంచికలు', 'ప్రత్యేక ప్రచురణల' సంకలనాల రూపంలో ఈ పరిశోధన పత్రాలను ప్రచురిస్తారు.

### 22.3.1 ఆవిర్భావం, అభివృద్ధి

శాస్త్ర, సాంకేతిక పత్రికలు ఆవిర్భావం 300 సంవత్సరాల క్రితమే జరిగింది. ఆవిర్భావానికి ముందు శాస్త్రవేత్తల మధ్య సమాచారం ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా జరగడాన్ని గుర్తించవచ్చు. వైజ్ఞానిక సమాచారం మందకొడిగా జరిగేది. అంతేగాకుండా కొందరికే లభించేది. లండన్‌లో రాయల్ సొసైటీని స్థాపించడంతో శాస్త్ర వేత్తలు ఒక వేదికపై కలుసుకుని, తమ తమ పరిశోధనల ఫలితాల్ని పరస్పరం చర్చించుకునే వీలు కలిగింది. ఈ సమావేశాలకు హాజరు కాలేని శాస్త్రవేత్తల కోసం, సమావేశంలో సమర్పించిన నివేదికల్ని జరిగిన చర్చల్ని రాత రూపంలో పొందు పరిచేవారు. మొదట్లో లాంఛనంగా ఉపయోగపడ్డ ఇలాంటి రికార్డులే. ఆ తర్వాత అధికారిక ప్రచురణలై వ్యాప్తి చెందాయి. ఈ నేపథ్యంలో రాయల్ సొసైటీ కార్యదర్శి హెన్రీ ఓల్డెన్ బర్గ్ స్థాపించిన "ది ఫిలాసాఫికల్ ట్రాన్సాక్షన్" (The Philosophical Transactions) పత్రికని మొట్ట మొదటి వైజ్ఞానిక పత్రికగా పేర్కొనవచ్చు. విజ్ఞాన శాస్త్రంలో రాయల్ సొసైటీ సభ్యుల వైజ్ఞానిక అన్వేషణలకు, పరిశోధనా ఫలితాలకూ ఈ తొలిపత్రికే ఒక ప్రసార మాధ్యమమైంది. పద్దెనిమిది, పంతొమ్మిదో శతాబ్దాల్లో ఇలాంటి సొసైటీలు వివిధ రంగాల్లో ఆవిర్భవించడంతో, ఆయా రంగాల్లో ప్రత్యేకతకు ప్రాముఖ్యం పెరిగింది. 1977 అంచనాల ప్రకారం ప్రపంచంలో 54,000కు పైగా శాస్త్ర సాంకేతిక పత్రికలు ప్రచురితమవుతున్నాయని తెలుస్తోంది.

ప్రస్తుతం ఉన్న సాంకేతిక, శాస్త్రీయ పత్రికల్లో అధిక భాగం, ఆయా రంగాల సొసైటీలు, వృత్తిపరమైన సంస్థలు, ప్రభుత్వ విభాగాలు విభిన్న ప్రయోజనాల నిమిత్తం ప్రచురింపబడుతున్నాయి. ఇలా ప్రచురించబడుతున్న పత్రికల్ని రెండుగా విభజించవచ్చు. మొదటిది ప్రైమరీ పత్రికలు కాగా రెండోది సెకండరీ పత్రికలు వార, పక్ష, మాస, త్రైమాసిక.

పత్రికలుగా వెలువడే ప్రైమరీ పత్రిక పాఠకులు అధిక సంఖ్యలో ఉంటారు. నూతన పరిశోధనలు, వాటి ఫలితాల్ని, వివరాల్ని ప్రైమరీ పత్రికల్లో వెల్లడిస్తారు. ప్రైమరీ పత్రికల్లో ఉండే అంశాలపైన విస్తృత అవగాహన కల్పించే సమాచారాన్ని సెకండరీ పత్రికలు అందిస్తాయి. ఈ కోవలోకి వచ్చే పత్రికలు - ఇండెక్సింగ్, అబ్‌స్ట్రాక్టింగ్ పత్రికలు.

BRAOU

### 22.3.2 ప్రచురణల రకాలు

సాంకేతిక, శాస్త్రీయ పత్రికల్లో ఎక్కువ భాగం పూర్తిస్థాయి పత్రాన్ని, కొత్త సమాచారం, ఇతర వైజ్ఞానిక వివరాలు ఆక్రమిస్తాయి. కచ్చితమైన నిర్మితి ఒకటి ఈ పత్రికలకు ఉంటుంది. దీన్నే వైజ్ఞానిక పత్రం నిర్మితిగా కూడా పేర్కొనవచ్చు. ఇది పరిచయంతో మొదలవుతుంది. చర్చాంగానికి సంబంధించి జరిగిన పూర్వకృషి, కొనసాగిన ప్రయోగ పద్ధతులు వాడిన పరికరాలు, చర్చాంశం విశ్లేషణ ప్రస్తావించే ఫలితాలు, ముగింపు, వాటి విలువ, ప్రాముఖ్యత - వంటి వాటిని ఒక క్రమ పద్ధతిలో ప్రస్తావించడమే నిర్మితి.

ఈ పత్రికల్లో కన్పించే సమాచార విధానాలు రెండు విధాలుగా వుంటాయి. అవి ఒకటి షార్ట్ పేపర్స్ రెండోది "ర్యాపిడ్ కమ్యూనికేషన్స్". నాలుగైదు పేజీల నిడివి మించని షార్ట్ పేపర్స్‌లో పరిమిత ప్రాముఖ్యంగల విషయాల్ని చర్చిస్తారు. విశేష ప్రాముఖ్యం కలిగి, సత్వర ప్రచారం అవసరం గల విషయాలుంటే "ర్యాపిడ్ కమ్యూనికేషన్స్"ని ఒక రకంగా పరిశోధనా పత్రంగా

అభివర్ణించవచ్చు. ఇలాంటి కమ్యూనికేషన్‌లలో చాలా వరకు ప్రయోగాల పరిచయం పరిమితంగా ఉంటుంది. ఫలితాలు, ముగింపుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

### 22.3.3 పరిశోధనాత్మక పత్రికల సంప్రదాయాలు

వ్యాసాల తరహా, శైలులకు సంబంధించి పరిశోధనాత్మక పత్రికలలో కొన్ని నియమాలు కన్పిస్తాయి. ''రచయితలకు సూచనలు, నిబంధనలు'' శీర్షికలో వైజ్ఞానిక పత్రికలు ఈ నిబంధనలను ప్రస్తావిస్తాయి. మొదటి సంచికలో గానీ, అన్ని సంచికల్లో గానీ రెండవ పేజీలోనో చివరి పేజీ పైననో దీన్ని పొందు పరుస్తారు. కొందరు ప్రచురణ కర్తలు వాటిని విడిగా ఓ చిన్న పుస్తక రూపంలో ప్రచురించి, ఉచితంగా ఇస్తారు. రచయితలు నిబంధనల్ని చదవడం ఎంతైనా అవసరం. నిబంధనల్లో మార్పులేమన్నా ఉన్నాయో యందుగా తెల్సుకోవడము అవసరమే. ఇది వారి సమయాన్ని, కృషిని వృథాపోకుండా చూస్తుంది.

ప్రచురణ విధానం, వ్యాసం నిర్మించి ఆమోదయోగ్యమైన సైజులో గల పేపర్‌లో లైన్ల మధ్య ఇవ్వాల్సిన ఖాళీ, టైప్‌ప్రింట్‌లో కాగితపు నాణ్యత, పరిమాణం, పట్టికలు, చిత్రాలు వేసే తీరు, యూనిట్‌ల కొలతల విధానం వంటి వాటి వివరణ కన్పిస్తుంది. వ్యాసంలో పొందుపర్చాల్సిన సంప్రదింపు గ్రంథాలను ప్రస్తావించే విధానం, కూడా ఇస్తారు. క్లుప్తంగా ఇవీ "రచయితలకు సూచన''ల్లో పొందుపరచడం గమనిస్తాం. ఆయా వైజ్ఞానిక పత్రికల ప్రచురణ విధానాన్ని బట్టి కొద్దిపాటి మార్పులతో ఈ సూచనలను ఇస్తారు. రచనలు విధిగా ఈ సూచలనకు అనుగుణంగా కొనసాగాలి. వైజ్ఞానిక రచనల క్రయరీతిలో ఇవ్వడం పాఠకుడికి అర్థం చేసుకోవడంలో సౌలభ్యానిస్తుంది.

### 22.3.4 ప్రమాణీకరణ విధానాలు

వైజ్ఞానిక పత్రాల ప్రచురణ శైలి ఒక అంశం అయితే మరొకటి వాటి నాణ్యత. నాణ్యతను పరిశోధనాంశాల విశ్వసనీయత దృష్టితో పరిశీలిస్తారు. ప్రచురణకు ఆమోదించిన పత్రాలలో ఇటువంటి విశ్వసనీయత ఉండడానికిగాను, ప్రచురణకర్తలు వాటిని ప్రచురణకుస్వీకరించడానికి ముందే నిర్ధారణకు ఉపక్రమిస్తారు. దీనికి ఒక పద్ధతిని అవలంబిస్తారు. వైజ్ఞానికపత్రాన్ని సంపాదకుని పరిశీలనకు ముందు సమర్పిస్తారు. స్వయంగా సంపాదకుడే దాని ప్రచురణార్హతను నిర్ధారించడం జరుగుతుంది. మరికొన్ని సందర్భాల్లో సంపాదక మండలిలోని మరొక సభ్యునికి పంపిస్తారు. ఇంకొన్నిసందర్భాల్లో విషయ నిపుణులకు పంపిస్తారు. ఏది ఏమైనా వైజ్ఞానిక పత్రాలు చర్చించిన వైజ్ఞానిక ఏర్పాటు పట్ల ప్రవేశం ఉన్నవారు సగిశీలించే ఏర్పాటు చేస్తారు. ఇలా పరిశీలించే నిపుణులు శాస్త్రవేత్తలే అయి ఉంటారు. ఆయారంగాలలో కృషి చేసిన వారై ఉంటారు. ప్రచుణాశైలి విషయంలో, వైజ్ఞానికపత్రం పరిశోధనాంశాల విశ్వసనీయత విషయంలో కట్టుదిట్టమైన ఏర్పట్లు వైజ్ఞానిక పత్రికలలో ఉండడం ఒక విశేషం. ప్రచురణకు అంగీకరించే పత్రాలు నిర్ణీతస్థాయి. రచనలయితేనే ప్రచురణకు స్వీకరించడం జరుగుతుంది.

ఇలా స్వీకరించడానికి ముందు కొంత ప్రక్రియను చూస్తాం. అవి పత్రం నాణ్యతని నిర్ధారించాక, తిరిగి దానిని సంపాదకుడికి పంపిస్తారు. పరిశీలకుని రిపోర్టు జతపర్చబడి ఉంటుంది. నివేదికలో పత్రం ప్రచురణకు ముందు చేపట్టాల్సిన చర్యల్ని మార్పుల్ని ఇస్తారు. పత్రాన్ని ఉన్నదున్నట్టు ప్రచురించవచ్చని విషయ నిపుణుడు అభిప్రాయపడితే యధావిధిగా ప్రచురిస్తారు. మార్పులు, చేర్పులు చేయమని సూచిస్తే రచయితకు వాటిని సరిదిద్దడానికి తిరిగి పంపిస్తారు. కనీస ప్రయాణాలు లేకపోయినా, పత్రిక స్పెషలైజేషన్ పరిధిలో ఇమడని పత్రాన్ని తిరస్కరిస్తారు.

ఏకపక్ష అభిప్రాయాలకు ఆస్కారం లేకుండా కొందరు ప్రచురణ కర్తలు స్వతంత్ర ప్రతిపత్తిగల ఇద్దరు పరిశీలకులకు

BRAOU

పత్రాల్ని పంపిస్తారు. పత్రాల ప్రచురణలో నిష్పాక్షికమైన అభిప్రాయంకోసం ఈ పద్ధతిని అవలంబిస్తారు. కొందరు ప్రచురణ కర్తలు, పత్రాన్ని ఒకటో పరిశీలకుడు తిరస్కరించిన సందర్భాల్లోనే రెండో పరిశీలకుడిని సంప్రదిస్తారు. భౌతిక, జీవ శాస్త్రాలకు చెందిన పత్రికల్లో 70 శాతం ఈ సంప్రదింపు వ్యవస్థని అవలంబిస్తారని వెల్లడిస్తుంది. దాదాపు వైజ్ఞానిక పత్రికలు అన్నీ ప్రచురణలో ఈ రకమైన విధానాలనే అవలంబిస్తాయి.

వైజ్ఞానిక పత్రాలను పత్రంలో చర్చించిన అంశాల విశ్వసనీయత ఆధారంగా తిరస్కరించడం ప్రచురణ ప్రక్రియలో అంతర్భాగం. తిరస్కరణకు గురయ్యే పత్రాల శాతం 15 నుంచి 90 వరకు కూడా ఉంటుంది.

### 22.3.5 పరిశోధనాంశాలకు సంబంధించిన పత్రికల గుర్తింపు

ఒక పరిశోధనకు పూనుకునే యువ శాస్త్రవేత్తలని, ఆ క్షేత్రంలో ఇంతకు ముందు ఏదైనా పత్రికలు ప్రచురిత మయ్యాయా అన్న ప్రశ్న తరచూ వేధిస్తూంటుంది. వారి అవసరాలను తీర్చడానికిగాను, ఇదివరకు ప్రచురితమైన సాంకేతిక, శాస్త్రీయ పత్రికలు జాబితాను పొందుపరిచిన 'విషయసూచిక (Bibliographical aids) సహకరిస్తుంది. న్యూయార్క్‌లోని బోకర్ (Bowkar) పబ్లిషింగ్ కంపనీ వార్షిక ప్రచురణ ముద్రించే 'ఇంటర్నేషనల్ పీరియాడికల్స్ డిక్షనరీ' (International periodicals Dictionary) ఒక విశేష ప్రచురణ. ప్రపంచ వ్యాప్తంగా ప్రచురితమయ్యే 65,000కు పైగా పత్రికల వివరాలు ఇందులో పొందుపరచడం కన్పిస్తుంది. అయితే, ఇందులో యేడాదికి కనీసం ఒక్కసారైనా ప్రచురితమయ్యే వాటికే చోటు ఉంటుంది. అడపా, దడపా వచ్చే పత్రికల్ని మాత్రం దీనికి అనుబంధ ప్రచురణలో ముద్రిస్తారు. ప్రచురణ భాష ప్రచురణ ప్రారంభమైన సంవత్సరం, వెల, కొలతల వివరాలు ప్రచురణకర్త, సంపాదకుడు, సర్క్యులేషన్‌కు సంబంధించిన వివరాలనుఇస్తారు. వ్యాసాల ఇండెక్స్, అబ్‌స్ట్రాక్ట్ సమాచారం లభించే పక్షంలో దాన్ని ప్రచురించే సెకండరీ పత్రికల వివరాలను కూడా చేర్చుతారు.

ఒక విషయానికి సంబంధించిన పత్రికల వివరాలను తెలియజేసే మరో పత్రిక 'గైడ్ టు సైంటిఫిక్ పీరియాడికల్స్' ఎన్ ఎనోటేటెడ్ బిబ్లియోగ్రఫీ" (Guide to Scientific periodicals: an annotated bibliography) లండన్ సంస్థ లైబ్రరీ అసోసియేషన్ ప్రచురణ ఇది. ఇందులో పత్రికల వివరాల్ని విషయాల వారీగానే గాకుండా దేశాల వారీగా కూడా ఇస్తారు.

ఢిల్లీలోని ఇండియన్ నేషనల్ సైంటిఫిక్ డాక్యుమెంటేషన్ సెంటర్ ప్రచురించే 'ఇండియన్ సైంటిఫిక్ పీరియాడికల్స్' డిక్షనరీని ప్రచురిస్తుంది. మన శాస్త్రవేత్తలు చాలామంది దీన్ని ముందుగా సంప్రదిస్తుంటారు.

ఒక విషయానికి సంబంధించి ప్రచురితమైన పత్రికల పేర్లని తెలుసుకున్నాక, అందులో ఏ ఏ పత్రికలు అందుబాటులో ఉన్నాయో లైబ్రరీలో అడిగి తెలుసుకోవాలి. అదే క్షేత్రంలో పనిచేస్తున్న సీనియర్ సహచరుల తోడ్పాటు కూడా తీసుకోవాలి.

**అభ్యాసం - 1 : సాంకేతిక పత్రికల ఆవిర్భావాన్ని గురించి చర్చించండి.**

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

.....................................................................................................................

BRAOU

## 22.4. వ్యాస రచన

### 22.4.1. వ్యాస ప్రణాళిక

చేసిన కృషికీ, పరిశీలించిన ఫలితాలకీ, వాటి నుంచి వచ్చిన నిర్ధారణలకీ రికార్డులాంటిది శాస్త్రీయ/ పరిశోధనాత్మక పత్రం. ఒక పరిశోధనాత్మక పత్రికలో ప్రచురితం కావాలంటే, నిక్కచ్చిగా,స్పష్టంగా సంక్షిప్తంగా రాయాలి. ముద్రణా ఖర్చులు పెరిగిపోవడంతో, స్థలానికి పోటీ తీవ్రమవుతున్న దృష్ట్యా వ్యాసాలు క్లుప్తంగా ఉండాలి.

పరిశోధనా పత్రాన్ని రాయాలనుకున్నప్పుడు ఏ పత్రికని రాద్దామనుకుంటున్నామో ఆ పత్రికతో వచ్చే వ్యాసాల రూపాల్ని అధ్యయనం చేసి మనకు సరిపోయే నిడివిని ఎంచుకోవాలి.

వ్యాసం మరీ చిన్నదైతే తప్ప, ఎలా ఉండాలో ముందే రాసుకోవాలి. ముందుగా శీర్షికలు. ప్రధాన శీర్షికకల్ని నిర్ణయించుకోవాలి. శీర్షికలో వ్యాసనిర్మాణం మొదలవుతోంది. తద్వారా రచయితకూ, పాఠకులకీ దానికి సంబంధించి స్పష్టమైన అవగాహన కలుగుతోంది. వ్యాస నిర్మాణానికి సంబంధించి నాలుగు పద్ధతులు కనిపిస్తాయి. ఒక్కో విషయానికి ఒక్కో పద్ధతిని అవలంబించడమూ చూస్తాం. క్లుప్తంగా ఈ వ్యాస నిర్మాణ పద్ధతులను తెలుసుకుందాం.

1. జీవశాస్త్ర పత్రికల వ్యాసాలు ప్రధానంగా నాలుగు విభాగాలుగా వర్గీకరించి నిర్మిస్తారు. పరిచయం, పరికరాలు, పద్ధతులు: ఫలితాలు, చర్చ విశ్లేషణలు, దీన్నే "ఇమార్డ్" (IMARD) నిర్మాణంగానూ చెప్తారు.

2. వర్ణనాత్మక విజ్ఞాన విషయంలో పరిచయం, భౌగోళిక, చారిత్రాత్మక సందర్భంగ, పరిశీలన, పరిశోధన, వాటి ఫలితాల విశ్లేషణ, చర్చ, నిర్ధారణ వంటి శీర్షికల కింద వ్యాస నిర్మాణం జరుగుతుంది.

3. ఒక సైద్ధాంతిక పత్రానికి పరిచయం, సైద్ధాంతిక విశ్లేషణ, ప్రయోజనాలు, నిర్ధారణలు అనేవి మధ్య శీర్షికలు.

4. ఒక వినూత్న పద్ధతిని అభివర్ణించే పత్రంలో, పరిచయం- విధాన వర్ణన, కొత్త పద్ధతి పరీక్షలు, చర్చ అనేవి శీర్షికలు.

ఒక సుదీర్ఘ, సంక్లిష్టమైన వ్యాసానికి, పైన పేర్కొన్న ప్రామాణిక రూపాల్లో మార్పులు అవసరం కావచ్చు ఒక్కో విభాగాన్ని పలు ఉప విభాగాలుగా చేయాల్సి రావచ్చు. అందువలన విషయం, వ్యాసానానికి తగిన రీతిలో ముందే కచ్చితమైన ప్రణాళిక రూపొందించుకోవడం ముఖ్యం.

### 22.4.2 వ్యాసం - రూపురేఖలు

మీ ఫలితాలు, పరిశీలనలు, నిర్ధారణలు, సందర్భాలు, ఇతర సంబంధిత సమాచారాన్ని గనక నోటు బుక్కులోనో, విడి కాగితాలపైనో రాసుకుని ఉంటే వాటిని పద్ధతి ప్రకారం అమర్చి, వ్యాసపు రూపురేఖల్ని (out line) లేదా తొలిప్రతిని రాయడం సులభమవుతుంది. అయితే మనం అనుకున్న ప్రకారం రూపం ఉండాలే తప్ప, రూపం మనల్ని నిర్దేశించేలా ఉండకూడదు. అది మన వ్యాసానికి తోడ్పాటుగా ఉండాలిగానీ, ఆదేశించేలా ఉండొద్దు. మన వాదనల్ని రూపం క్రమబద్ధంగా ఉంచుతుంది. రూపాలు రెండు రకాలు. విషయ రూప నిర్మాణం (Topic outline) వాక్యరూప నిర్మాణం (Sentence out line) ముఖ్యమైన అంశాల్ని వరుసక్రమంలో ఉంచే విషయరూపంలో కొత్త అంశాల్ని చేర్చవచ్చు. ఆ ప్రకారం వివిధ స్థాయిల్లోకి విడదీయవచ్చు. ఆలోచనలకూ, కీలకాంశలకూ రూపమివ్వడం, వాటిని వర్డ్ ప్రాసెసింగ్ (Word processing) ప్రోగ్రామ్ గల కంప్యూటర్‌లోకి ఎక్కించడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

BRAOU

ప్రధాన విభాగాలన్నింటితో పాటు ప్రతీవ్యాసంలో దానిపేరు (Title) ప్రచురణ వివరాలు, సంక్షేపం, కృతజ్ఞతలు,ఉదహరించిన సందర్భాలు ఉంటాయి.

పరిశోధనా వ్యాసంలో అంకెల విధానంలో అమర్చిన శీర్షికలు, ఉపశీర్షికలు, వ్యాస నిర్మాణంగా మనకు కనిపిస్తాయి. ఈ రకం అమరికలో 1.0, 2.0, 3.0. ప్రధాన శీర్షికలయితే, 1.1. గానీ, 2.1 గానీ శీర్షికలుగా చెప్పుకోవచ్చు. 1.2.1. గానీ, 2.1.1. గానీ. 3.1.2 గానీ ఉపశీర్షికలుగా పేర్కొనవచ్చు.

## 22.4.3 తొలి ప్రతి

రూపం పూర్తయ్యాక, ఒక తాత్కాలిక టైటిల్‌ని ఖరారు చేయాలి. తదుపరి దశలో దీనిని మార్చనున్నందున టైటిల్‌లో నిడివి ఎంత ఉన్నా ఫరవాలేదు. అది వ్యాస ప్రయోజనాన్ని ప్రతిబింబించేలా ఉండాలి. ఈ దశలోరాసిన సంక్షిప్తాన్ని" (abstract) నిశితంగా పరిశీలించి, అవసరమైన పక్షంలో తిరిగి మార్చి రాయాలి. వ్యాసంలో చెప్పబోయే పరిశోధనపై పాఠకులకు అద్దం పట్టే విధంగా కన్పించేది ఈ సంక్షిప్తమే.

వ్యాసంలో సూచికకు ఉపయోగపడే కొన్ని పదాలు వుంటాయి. వీటిని కీలక పదాలు (Key words) గా వ్యవహరిస్తారు. 'సూచీపదాల'నీ పేర్కొనవచ్చు. వివరణ యిచ్చే పదాలుగాను ప్రస్తావించవచ్చు. వివరణ యిచ్చే పదాలు గాను ప్రస్తావించవచ్చు. కంప్యూటర్ల నుంచి సమాచారాన్ని సంగ్రహించే విషయంలో పదాలు బాగా సహకరిస్తాయి.

రచయితలకు సంబంధించిన వివరణల్ని మొదట్లోనే ఇవ్వాల్సిన అవసరం కన్పించదు. కానీ, వ్యాసం తుది ప్రతి పూర్తయ్యేలోపు రచయితల పేర్లని ఖరారు చేసుకోవాలి. పరిశోధన ప్రణాళిక, విశ్లేషణల్లో సంబంధంలేని వారిని రచయితలుగా చేర్చడం మంచిదికాదు. రచనా హక్కు విషయంలో అంగీకారం ఒకటంటూ ఉండాలి. లేని పక్షంలో కొన్ని సందర్భాల్లో ఆ తర్వాత సమస్యలు ఎదురవుతాయి. పరిశోధనకు తోడ్పడని వ్యక్తిని రచయితగా పేర్కొనడం అనైతికమనే భావన శాస్త్రవేత్తలు ప్రస్థావించడం మనకు తెల్సిన విషయమే. రచయితలు ఒకరికంటే ఎక్కువ ఉన్నట్టయితే, పత్రికలు వారిపేర్లని అక్షరక్రమంలో ప్రచురిస్తాయి. కలిసికట్టుగా పనిచేసినప్పుడు సమరూపత ఉండటానికిగాను రాత కర్యాక్రమం ఒక్కరే నిర్వహించాలి. మిగతావారు చేతిరాతలోగల ప్రతిని సరిదిద్దాలి. ఒకవేళ వేరు వేరు విభాగాలను వేరు వేరు వ్యక్తులు రాసిన పక్షంలో సమరూపత, స్థిరత్వం ఉండడానికిగాను ఒకేవ్యక్తి ఎడిటింగ్ (Editing) చేసి తుది ప్రతిని సిద్ధం చేయాలి.

## 22.4.4. సహాయక సమాచారం

పరిశోధనలో భాగంగానే పరిశోధకులు వివిధ పరిశీలనల నోట్సు పట్టికలు. గ్రాఫులు వంటి వాటిని కూడా సంప్రదిస్తారు. పరిశోధన సమాచారం వివిధ రూపాలలోఉండడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ దశలో. నిర్ధారణలని సమర్థించడానికి అనువుగా సమాచారాన్ని, ఎలా సమర్పించాలో నిర్ణయించాలి. పత్రికలిచ్చే "రచయితలకు సూచనలు" ఈ విషయంలో కొంతమేకు తోడ్పడతాయి. ఇలాంటి సమాచారాన్ని విపులంగా ఇచ్చే విధానాన్ని కొన్ని"శైలి క్రోడీకరణాలు" (Style Manuals) మార్గదర్శకాల రూపంలో వివరిస్తాయి. జీవశాస్త్ర సంపాదకుల మండలి (Council of Biology Editors) ఇలాంటి పత్రికని ఒకదాన్ని తయారుచేస్తుంది. 1988లో అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ బయాలింజికల్ సైన్సెస్ దీన్ని ప్రచురించింది. దీన్నే 'సి బి ఇ' స్టయిల్ మాన్యువల్ (CBE Style Manual) గా పేర్కొంటారు.

గణాంక వివరాల్ని వెల్లడించడానికి పెద్దగా స్థలం ఆక్రమించకుండా పట్టికలు ఉపయోగపడతాయి. స్థలాన్ని బాగా

BRAOU

అక్రమించే సందర్భాల్లో సంపాదకులు, రిఫరీలు వీటిని పక్కకు తప్పిస్తారు. కేవలం స్థలాభావం దృష్ట్యానే ఇది జరుగుతుంది. చిన్న చిన్న పట్టికలకు బదులు వీలయినంతవరకు వ్యాసంలో వాక్యాల రూపంలోనే కుదించి రెండు మూడు వాక్యాల్లో పట్టికల్లోని పరిశీలనాంశాలను ప్రస్తావించడం మంచిది.

వ్యాసానికి సంబంధించిన చిత్రాల్ని (Illustrations) ముందుగానే పరిశీలించాలి. పాఠకులకు విషయం వెంటనే అర్థం కావడానికి ఇవి తోడ్పడతాయి. చిత్రాల్లో పటాలు, గ్రాఫులు, లైన్ డ్రాయింగ్‌లు, టోన్ డ్రాయింగ్ (Tone Drawing) లు,ఫోటోలు మొదలైన రూపాల్లో చిత్రాల్ని పరిశోధనా వ్యాసాల్లో చూస్తుంటాం. ఒక విధంగా పరిశోధనా వ్యాసాలకు ఇవి ఊపిరినిస్తాయి. సరిపోయినన్ని చిత్రాలు లేకుంటే వ్యాసమే దెబ్బతింటుంది. కొన్ని పత్రికలు తమ తీరుకి అనుగుణంగా రచయితలు ఇచ్చిన చిత్రాల్ని మార్చి ప్రచురిస్తాయి. నాణ్యతగల చిత్రాలను గీయడంలో నైపుణ్యతగల చిత్రాకారుడ్ని వినియోగించుకోవాలి.

ఇంతకుముందు ప్రచురితమైన వ్యాసాల నుంచి ఏ ఏ భాగాలను, ఏ ఏ చిత్రాల్ని మళ్ళీ ఇవ్వాలనుకున్నది. ఈ దశలోనే నిర్ణయించాలి. ఇతర రచయితల ప్రచురితమైన ప్రచురితం కాని సమాచారాన్ని వాడుకోవాలనుకుంటే ఆ రచయితలతోపాటు ప్రకాశకుల అనుమతికూడా తీసుకోవాలి.

### 22.4.5. ఉపయుక్త గ్రంథాల పట్టిక

పరిశోధన సమయంలో సంప్రదించిన వివిధ గ్రంథాల పరిశోధన వ్యాసాల వివరాలను పొందుపరచాలి. దీన్నే ఉపయుక్తగ్రంథాల పట్టిక అని కూడా అంటారు ఒక్కో వ్యాసానికి సంబంధించిన సమాచారాన్ని విడివిడిగా నమోదుచేయాలి. సంప్రదించిన గ్రంథాల జాబితాని అక్షర క్రమంలో కార్డులపై టైప్ చేయాలి. అసలు గ్రంథాలతో పరిశోధనా పత్రాన్ని పోల్చి తనిఖీచేయాలి.

వ్యాసంలో పేర్కొన్న విధానంపై వివరణ పట్టిక శైలి ఆధారపడి ఉంటుంది. అధికభాగం వివరణ పట్టికల పత్రికలు (Bibliographical Journals) అంకెల విధానం కంటే పేరు - సంవత్సరాన్నే ఎక్కువ ఉపయోగిస్తాయి.

ఉపయుక్తగ్రంథ సమాచారాన్ని పొందుపరిచే పద్ధతిని ELSE - Ciba Foundation workshop Recommendation (1978) ISO 690 (1987) లో ప్రస్తావిస్తున్నాయి. ఆ ప్రస్తావనలను క్లుప్తంగా తెల్సుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ సందర్భంగానే కొన్ని ఉదాహరణలను కింద ఇస్తున్నాం. పరిశీలించండి.

1. Lonelock, J.E., White field M. 1982. Life span of the biosphere, Nature (London) 296: 561 - 563.

2. Howard J. 1982 Darwin Oxford: oxford university press. 101 P.P.

3. Heslop - Harrison J. 1983. The Scientific information system in the United kingdom. In: Monten AA, Tiuman T, eds: Information policy and scientific research Amsterdam; Ecsevier. PP 13 - 118.

4. Faimbach SE, Truman J W 1987 Mechanisms for programmed cell death in the nervous system of a........... an : Block Y. O'canner M, eds. Selective neuronal death: Chichester : Wiley: p.P. 65-76 (Ciba Foundation Symposium 126)

BRAOU

సి.బి.ఇ. స్టయిల్ మాన్యువల్ ప్రకారం ఉపయుక్త గ్రంథాలను పరిశోధనా పత్రంలో పొందుపరిచే విధానాన్ని తెలుసుకోగలిగాలి. సమాచారం కొద్దిగా భిన్నంగా కన్పించడం చూస్తాం. కొన్ని ఉదాహరణలను పరిశీలించి చూద్దాం.


1. Hicdebrandt, Albert C 1948. Influence of Some carbon compounds on growth of plant tissue cultures in vitro. An at Rec. 100: 674.

2. Groyane Vanghan, H. 1992 Fungi Asconnjcetes.

3. Overstruct H.A. 1925. The psychology of effective writing. Pages 87-109 in H.A. Overstrut. Influencing human behavior,. Mow. Norton & Co, New York.


**అభ్యాసం - 2 : ఏవేని ఐదు ఉపయుక్త గ్రంథాల పట్టికలను తయారుచేయండి.**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 22.5. వ్యాస ప్రతి పునశ్చరణ

### 22.5.1. తొలి ప్రతి పునశ్చరణ

తొలి ప్రతి స్థూలంగా వ్యాసాన్ని వివరిస్తుంది. దానిని పూర్తిస్థాయి వ్యాసం చేయాలంటే మార్పులు, చేర్పులు అవసరం అవుతాయి. మళ్ళీ రాయాల్సి వస్తుంది. తొలి వ్యాసం ప్రతిని పునర్విమర్శ చేయడం పరిశోధన వ్యాసం రచనలో ఒక అంతర్భాగం. ఇలా చేస్తున్నపుడు కొన్ని విషయాల్ని గుర్తుంచుకోవాలి. అవి :

1. వ్యాస నిర్మాణంపై ముందుగా దృష్టి సారించాలి. శైలిని పునర్విమర్శ చేసే ముందు అన్ని భాగాలు. పేరాలు. నిర్మాణాలు సరైన క్రమంలో ఉండేలా చూడాలి. లేకుంటే అలా అమర్చాలి.

2. కీలకాంశాలన్నీ ప్రస్తావించామో లేదో గమనించాలి. అనవసరమైన ప్రస్తావనలను తొలగించాలి. ప్రధాన అంశాలు, పరిశోధన వ్యాసంలో ఆవశ్యక అంశలు ఏవైనా పొరపాటున ప్రస్తావనకు రాని పక్షంలో వాటిని చేర్చాలి.

3. వ్యాస నిర్మాణంలో వరుసక్రమం, నిక్కచ్చిదనం స్థిరత్వం. వాస్తవికతల దృష్టిలో పరీక్షించాలి. పరిశోధన వ్యాసరచన తార్కికంగా కొనసాగింతో లేదో చూసి వ్యాసం తార్కికంగా చర్చను మలచాలి. శీర్షికలు వ్యాసానికి సరిపోతాయా లేదా అన్నది చూసుకోవాలి. శీర్షికల, ఉప శీర్షికల పరిమాణాలు సరైన క్రమంలో ఉండాలి. పేరాలని అర్థవంతంగా విడదీయాలి.

4. చిత్రాల్ని పరీక్షించాలి. అంతగా సంబంధం లేని వాటిని తొలగించాలి. టేబుల్ టైటిల్స్, ఫుట్‌నోట్సు మొదలైన వాటిలో అవసరమైన మార్పులు చేయాలి.

BRAOU

5. కొలతల విషయంలో ఎస్. ఐ. (Systeme International) యూనిటీని ఉపయోగించాలి. ప్రామాణీకరించిన సంకేతాక్షరాలు ( Abbreviations) పరిభాషా ప్రకరణ (Nomenclature) లని వాడాలి. అంతర్జాతీయంగా ఆమోదయోగ్యమైన శాస్త్ర, సాంకేతి, గణిత, సంకేతాలను, గుర్తులను (Symbols) ని మాత్రమే వాడాలి.

6. వ్యాస ప్రతిలోని అంశాల నిక్కచ్చిదనాన్ని, అందులో పేర్కొన్న కొటేషన్స్ (Quotations) ని సరిచూడాలి. ప్రతిలో సంప్రదించిన వ్యాసాల తాలూకు గ్రంథాల్ని చదివి, కొటేషన్స్‌ని సరిచూసుకోవచ్చు. ఈ విషయానికి సంబంధించిన తొలి పత్రికల్ని, వార్తా పత్రికల్నిచూసి సమాచారాన్ని సమీక్షించుకోవాలి. కొటేషన్ సందర్భానుసారం సందర్భానికి సరిపడేవే ప్రస్తావించాలి.

7. అవసరమైన మార్పులు చేశాక పరిశోధనా పత్రాన్ని నిబంధనల ప్రకారం టైప్ చేయాలి. వర్ణక్రమం (Spelling) వ్యాకరణ (Grammar) దోషాలను సరిదిద్ది వీలుండే కంప్యూటర్‌ని ఉపయోగించండి.

8. వ్యాసం నిడివి ప్రచురితమయ్యే పత్రిక నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి.

### 22.5.2. తదుపరి పునర్విమర్శ

రెండో ప్రతి నిర్మాణం, నిడివితో సంతృప్తి చెందాక, పదాలు వాక్యాలు, పేరాల్ని మరోసారి పరిశీలించండి. తార్కిక క్రమం (Logical order) విస్పష్టత వచ్చేదాకా ఎన్నిసార్లయినా రాయండి.

ప్రతినిరాసే సమయంలో తమ పరిశోధనా దృష్టిని పక్కనబెట్టాలని యువ శాస్త్రవేత్తలకు సీనియర్లు సలహా ఇస్తుంటారు. అలాగైతే, రచయిత చిత్తుప్రతిని క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి వీలవుతుంది. అందులో ప్రతి వాక్యాన్ని, ప్రతి పదాన్నీ సమీక్షించాలి. దానితో అనవసర పదాలను, వాక్యాల్ని తొలగించి వాక్యాలని పునర్నిర్మించవచ్చు. తద్వారా నిక్కచ్చిదనం, విస్పష్టత రావడంతో పాటుసుఖంగా చదవడం సాధ్యమవుతుంది.

BRAOU

### 22.5.3. తుది ప్రతి

చిత్తు ప్రతి నిర్మాణం, శైలిని పలుమార్లు పునర్విమర్శ చేశాక, తుది ప్రతి ప్రచురణకు అవసరమైన అన్ని నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలి. వ్యాసానికి, పరిశోధనా ప్రాముఖ్యంతోపాటు ఆకర్షణీయమైన రూపం (apearance) కూడా ఎంతో ముఖ్యం. అందంగా ఉండే ప్రతి సంపాదకులని, పాఠకులని వెంటనే ఆకట్టుకుంటుంది.

తుది ప్రతిని పత్రికకు ఇచ్చేముందు ఈ కింది వివరాలు ఉండేలా జాగ్రత్త పడాలి.

శీర్షిక పేజీ, రచనా హక్కుల వివరాలు కొన్ని సందర్భాల్లో 'సొంతరచనేనని ఇచ్చే హామి పత్రం, సంక్షిప్తం, (ఒకవేళ పత్రికకు అవసరమైతే కీలక పదాలతో) సంకేతాక్షరాలు, కీలక పదాలు వ్యాస ప్రతి (శీర్షికలు, ఉపశీర్షికలతో) ఫుట్‌నోట్సు, ఎండ్ నోట్సు, (అడిగిన పక్షంలో విడి కాగితంపై) పట్టికలు, చిత్రాలు (వేరువేరు కాగితాలపై).

## 22.6. ప్రతిశోధనా పత్రాన్ని ప్రచురణకు సమర్పించడం

చక్కగా సిద్ధం చేసిన పరిశోధనా పత్రాన్ని ఆ విభాగంలో ప్రత్యేకతగల పరిశోధనా పత్రికకు పంపించవచ్చు. ముందుగా విషయం, ప్రయోజనాల ప్రామాణికతలకు అనువుగా ఉండే పత్రికని ఎంచుకోవాలి. పేపర్‌ని సమర్పించాలనుకునే పత్రికల

జాబితాను తయారు చేసి, ఆ పత్రికల విషయ పరిమాణం, జాతీయ/ అంతర్జాతీయ వార్తా సేకరణ పరిధి, తిరస్కార రేటు మొదలగు అంశాలను పరిశీలించాలి.

1. విషయాన్ని సూటిగా చెబుతూ పరిమిత నిడివిగల కవరింగ్ లెటర్‌ని రాయాలి.

2. పత్రికా నిబంధనలు పేర్కొన్న పక్షంలో కొందరు రిఫరీల పేర్లను సూచించాలి.

3. మానవాళి, జంతుజాలం పైనా పై పరిశోధన చేసినట్టయితే, మీ సంస్థ నైతిక సంఘం ( ethics committee) నుంచి అధీకృత లేఖ (letter of authorisation) ని జత చేయాలి.

4. ఉదహరించిన కోట్ (Quote) చేసిన రచనలకు సంబంధించి హక్కుదారుల నుంచి అనుమతి పత్రాన్ని జత చేయాలి.

5. కోరిన సంఖ్యలో ప్రతుల కాపీలకు సరిపడే కవర్‌లో పూర్తి పోస్టేజ్ స్టాంపులను పెట్టి పంపించాలి. కవర్‌పై భాగాన "వైజ్ఞానిక ప్రతి, వాణిజ్యం కాదు" అని రాయాలి.

6. జతచేసిన లేఖలన్నిటినీ కలుపుకుని పత్రపు అదనపు ప్రతిని దగ్గర ఉంచుకోవాలి. కొన్నిసార్లు మధ్యలో పేపర్ పోవడమో, పాడవడమో జరుగుతోంది. అలాంటప్పుడు అదనపు కాపీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

7. నిర్ధారిత సమయం తర్వాతనే ప్రచురణ విషయం విచారించండి.

8. వ్యాసాన్ని ఉన్నదున్నట్టుగా ఆమోదిస్తారని ఆశించకండి. పునర్విమర్శ అవసరమైతే, మార్పులుచేసి మళ్ళీ పంపించండి.

9. చిత్తు ప్రతి తిరస్కరించినా, దానిపై కఠినంగా వ్యాఖ్యానించినా ఆగ్రహం చెందకండి. సంపాదకుడితో వాదించి ఫలితం లేదు.

10. ఒక పత్రిక ఆ విషయం తమ పరిధిలోకి రాదని చిత్తు ప్రతిని తిరస్కరిస్తే ఆ విషయానికి సంబంధించిన మరో పత్రికకి పంపించండి.

BRAOU

## 22.7. ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ సాంకేతిక, శాస్త్రీయ పత్రికలకు రాయడంపై పలు అంశాలను ఈ భాగంలో నేర్చుకున్నాం.

★ ఈ పత్రికలకు రాయడంలో ఉండే మెళకువలు, వార్తా పత్రికలు, సాహిత్య పత్రికలు, మ్యాగజైన్లు, ఫీచర్లు రాయడం కంటే భిన్నమైన ప్రక్రియని మీరు గమనించే ఉంటారు.

★ శాస్త్రవేత్తలు విధిగా ఎందుకు రాయాలో తెలుసుకున్నాం. తమ పరిశోధనల ఫలితాల్ని శాస్త్రీయ వర్గానికి వెల్లడించడానికి శాస్త్రవేత్తలు రాయాలని నొక్కి చెప్పాం.

★ ఈ నేపథ్యంలో శాస్త్రీయ సమాచారాన్ని వ్యాప్తి చేయడంలో పరిశోధనాత్మక పత్రికలు మాధ్యమాలవుతాయి.

★ తమ ప్రచురణల శైలి, తీరుతెన్నులు విషయంలో సాంకేతిక, వైజ్ఞానిక పత్రికలకు నిర్దుష్ట సంప్రదాయాలున్నాయి.

★ రచయితలు తమ వ్యాసాల్లో నిర్మాణాన్ని, శైలిని, విధిగా పాటించాలి.

★ నిర్మాణానికి సంబంధించి శాస్త్రీయ నమూనాల్ని ప్రచారంలో వున్న ప్రధాన నమూనాల్ని వివరించాలి.

★ వ్యాస రచనలో ప్రణాళికా దశ, తొలి ప్రతి, సహాయక సమాచార సమర్పణ, సందర్భశైలి వ్యాసపు తుది రూపం సిద్ధమయ్యే వరకు ప్రతి పునర్విమర్శ మొదలగు పలు దశలను కూడా వివరించాలి.

## 22.8. మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. సాంకేతిక, పరిశోధనా పత్రికలు అవలంబంచే నిర్ధారణా విధానంలో గల మంచి, చెడులను చర్చించండి.

2. ఒక పరిశోధనాత్మక వ్యాసం రాయడానికి అవసరమైన వివిధ దశలని వివరించండి. దశలో ప్రణాళిక సిద్ధంకావడాన్నివిపులంగా చర్చించండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. పత్రికలో ర్యాపిడ్ కమ్యూనికేషన్స్

2. IMRAD నిర్మాణం.

**- వి. చంద్రశేఖరరావు**

BRAOU

# భాగం - 23 : సంస్థా పత్రికల కోసం రాయడం

## విషయక్రమం


23.0 ఉద్దేశం

23.1 ప్రవేశిక

23.2 సంస్థా పత్రిక అంటే ?

23.3 ధ్యేయం

23.4 సంస్థా పత్రికల చరిత్ర

23.5 సంస్థా పత్రికల రకాలు

23.5.1 ఆంతరిక సంస్థా పత్రికలు

23.5.2 బాహ్య సంస్థా పత్రికలు

23.5.3 ఆంతరిక-బాహ్య సంస్థా పత్రికలు

23.6 ప్రస్తావనలు (contents)

23.7 మీ సంస్థా పత్రికల కోసం రాయడం

23.7.1 సూటిగా రాయడం

23.8 సంస్థా పత్రికల్లో ప్రధాన శీర్షికలు

23.8.1 సంపాదకీయాలు

23.8.2 సంస్థాధిపతి లేఖ

23.8.3 ఉద్యోగుల సంక్షేమ పథకాలు

23.8.4 వ్యక్తిగత నిర్వహణలో గొప్పదనం

23.8.5 సాంస్కృతిక, సామాజిక ఘట్టాలు

23.8.6 సంపాదకునికి లేఖ

23.9 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

23.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 23.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు

- సంస్థా పత్రిక అర్థాన్ని, పాత్రను అర్థం చేసుకొంటారు.
- వివిధ రకాల సంస్థా పత్రికలను గుర్తిస్తారు.
- సంస్థా పత్రికల్లోని విషయాలను గ్రహిస్తారు.
- సంస్థా పత్రికలలోని వివిధ శీర్షికలకు రచనాశైలిని గమనిస్తారు.
- సంస్థా పత్రికను ఎడిట్ చేసే ప్రయత్నం చేస్తారు.

## 23.1 ప్రవేశిక

వార్తా పత్రికలలో మాదిరే సంస్థా పత్రికలలోనూ జర్నలిజం కనిపిస్తుంది. సంస్థా పత్రికలు ఒక విధంగా జర్నలిజంలోని

BRAOU

అంతర్భాగమే. పత్రికా రచన సూత్రాలే సంస్థా పత్రికల రచనకు వర్తిస్తాయి. సంస్థా పత్రికలకు రాయడాన్ని వివరించే ప్రయత్నం ఈ భాగంలో చేస్తున్నాం. సంస్థా పత్రికలకు సంబంధించి కొన్ని రచనా సూత్రాలను వివరించడంతోపాటు, వివిధ రకాల శీర్షికల్ని, ఈ శీర్షికలకు రాసే విధానాన్ని చర్చిస్తున్నాం. ఈ అంశాలు మార్గదర్శకాలుగా ఉండటమే కాకుండా, సంస్థా పత్రికలకు రాయడానికి, సంస్థా పత్రికలను ఎడిట్ చేయడానికి మీకు దోహదపడ్తాయి.

## 23.2 సంస్థా పత్రిక అంటే

ఏ సంస్థలోనయినా ముందు మనకు కన్పించేది ఉద్యోగులు. సంస్థల యాజమాన్యాలు చాలామటుకు ఉద్యోగులతో ఉంచుకోవలసిన సంబంధాలను పెద్దగా గుర్తించవు. ప్రజల పట్ల బాధ్యత, వినియోగదారుడి సేవలపట్ల ఉద్యోగులను ఉత్తేజితుల్ని చేయడం కన్పించదు. ఈ సందర్భాలలో ప్రజా సంబంధాల విషయంలో సంస్థ ఏమేర కృషి చేసినా కోరిన ఫలితాలనివ్వవు. ప్రజా సంబంధాలు ముందు ఉద్యోగులతోనే ప్రారంభం కావాలని ఇది సూచిస్తుంది. ఉద్యోగులతో సంబంధాల్ని ఏర్పరుచుకోడానికి పలు మాధ్యమాలను వినియోగిస్తారు. సంస్థాగత సంబంధాల ప్రసారంకోసం (communication) వినియోగించే సాధనాలలో సంస్థా పత్రిక ఒకటి. వీటిని సంస్థా సంకలనం (House Magazine) అని కూడా వ్యవహరిస్తారు. కుటుంబంలో నల్గురి మధ్య ఉండే సంబంధబాంధవ్యాలను స్ఫురించే 'కుటుంబమనే' భావమే సంస్థలో, - సంస్థా, నిర్దేశిత వర్గమైన ఉద్యోగుల పట్ల సంస్థా పత్రికల భావన వెనకాల కనిపిస్తుంది. సంస్థా పత్రికల (House Journals) రూపకల్పనకు కారణమూ అదే.

'సంస్థా పత్రిక అనేది పారిశ్రామిక సంస్థగానీ, వ్యాపార సంస్థగానీ, ప్రభుత్వ రంగ సంస్థగానీ లాభాపేక్ష లేకుండా కాలికంగా ప్రచురించే ప్రచురణగా' - బ్రిటిష్ ఇండస్ట్రియల్ ఎడిటర్స్ అసోసియేషన్ భావించింది. అంతరిక, బాహ్య ప్రజలకోసంగానీ - ఈ ఇద్దరికీ గానీ విద్య, ప్రేరణాంశాల ప్రసారంకోసం సంస్థ ప్రచురించే కాలిక ప్రచురణగా సంస్థా పత్రికను నిర్వచిస్తారు. సంస్థా పత్రికలు 'ఉద్యోగుల కోసం' ఒక మాధ్యమంగా ప్రపంచం మొత్తం మీద అమిత ప్రాచుర్యాన్ని పొందగలిగాయి.

BRAOU

## 23.3 ధ్యేయం

సంస్థా పత్రికలకు ప్రధానంగా మూడు ధ్యేయాలు ఉన్నాయి. అవి ఉద్యోగులకు యాజమాన్యంతోనూ; యాజమాన్యం ఉద్యోగులతోనూ; ఉద్యోగులు పరస్పరం ఒకరితో మరొకరు సంబంధాలను ఏర్పరుచుకోవడానికి ప్రసార మాధ్యమంగా పనిచేయడం, ప్రసార వ్యవస్థలోని ఆరోహణ (upward), అవరోహణ (downward), సమాంతర (Horizontal) . భావనల వంటి మూడు ఆధార భావనలు ఈ ధ్యేయంలో కన్పిస్తాయి. అయితే సంస్థ అమలుపరిచే పటిష్టమైన పర్సనల్ పాలసీ, మానవ వనరుల అభివృద్ధి పాలసి వంటి వాటివల్లే ఉద్యోగులతో మంచి సంబంధాలకు ఆస్కారం ఏర్పడ్తుంది..

## 23.4 చరిత్ర

చారిత్రకంగా పరిశీలిస్తే ప్రజాసంబంధాలలో 'సంస్థా పత్రికలు' ఒక ప్రాచీన మాధ్యమంగా కనిపిస్తాయి. గ్రేట్ బ్రిటన్‌లోని గ్రేట్ వెస్టర్న్ రైల్వే 19వ శతాబ్దం మధ్యకాలంలోనే దీని ప్రాధాన్యాన్ని గుర్తించడమే ఒక ఉదాహరణ. ఉద్యోగులతో మాట్లాడటం, వారు చెప్పింది వినడం సంస్థా పత్రికలు చేసేపని. 1880 దశకం మధ్యలో ఈ భావం అమెరికాలో చోటుచేసుకుంది. అమెరికాలోని లోవెల్ కాటన్ మిల్స్‌వారు ప్రారంభించిన 'లోవెల్ ఆఫరింగ్' అనే మొట్టమొదటి సంస్థా పత్రిక 1840లో వెలుగుచూడటం చరిత్ర మనకు గుర్తు చేస్తుంది. సంస్థా పత్రిక భావనకు ఊపిరిగా ఉద్యోగుల సంబంధాల్ని ఇక్కడ చూస్తాం. సంస్థా పత్రికలను - హౌస్

ఆర్గాన్స్ (House organs), ఎంప్లాయీ న్యూస్ పేపర్ (Employee News paper), కంపెనీ న్యూస్‌పేపర్ (Company News paper), ఇన్ హౌస్ పబ్లికేషన్ (In house publication) వంటి వివిధ రకాల పేర్లతో పిలవడం కన్పిస్తుంది.

భారతదేశంలో సంస్థా పత్రికలకు గల ప్రాధాన్యం 1956లో సంస్థా పత్రికల ఎడిటర్లు ఒక 'వృత్తిపరమైన వ్యవస్థగా' (Professional body) ఏర్పడటంతో ప్రస్ఫుటమయింది. మొదట్లో, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఎడిటర్లు'గా ఏర్పడిన సంఘం, ఆ తర్వాత 'అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ ఎడిటర్స్ (ABE) గా రూపాంతరం చెందింది. ఈ అసోసియేషన్ ప్రచురించే వార్షిక డైరెక్టరీలో సంస్థా పత్రికలకు సంబంధించి ప్రచురణ ప్రదేశాలను, భాషా, ప్రచురణ వ్యవధి వంటి పలు అంశాలను పొందుపరచడం కనిపిస్తుంది. 1931లో తొలిసారిగా మనదేశంలో ప్రచురింపబడిన "ఢిల్లీ క్లాత్‌మిల్స్" పత్రిక అతి ప్రాచీనమైన సంస్థా పత్రిక ప్రచురణగా పేర్కొనవచ్చు.

## 23.5 సంస్థా పత్రికలు - రకాలు

ప్రజా సంబంధాలలో ప్రధానంగా మూడు రకాల పాఠకులను పరిగణనలోకి తీసుకోవాలి. అంతరిక, బాహ్య, అంతరిక-బాహ్య తరహా పాఠకులే వారు. అక్షరాస్యులైన ఉద్యోగులు, ప్రజలకు దగ్గరగా వెళ్లడానికి దోహదపడే 'సంస్థా పత్రికలు' ఒక సరైన మాధ్యమం. అది సంస్థ తమది అనే భావనను పెంపొందిస్తుంది. సంస్థా పత్రికలను పాఠకుల మానసిక నైజాన్ని బట్టి మూడు రకాలుగా వర్గీకరిస్తారు.

### 23.5.1 ఆంతర్గత సంస్థా పత్రికలు

సంస్థలు తమ ఉద్యోగుల కోసం ప్రచురించే ఈ అంతర్గత పత్రికల్ని - 'ఉద్యోగుల పత్రికలు'గా అభివర్ణిస్తారు. బయటి ప్రపంచం వార్తలను పెద్దగా ఇందులో ప్రచురించరు. కొన్ని సందర్భాలలో సంక్షేమ విషయాలు, ప్రజా సమాచార విషయాలు ప్రస్తావించడం మాత్రం కన్పిస్తుంది. ఉద్యోగులు విద్యా (Education) ప్రేరణ (Motivation) అంశాలను వెలిబుచ్చడానికే కాకుండా, తమ సమస్యల వ్యక్తీకరణకు కూడా వేదికగా నిలబడ్తుంది. ఒక విధంగా ఉద్యోగి - యజమానికి మధ్య వారధిలాంటిది. కంపెనీ ఇమేజ్‌ని పెంపొందించే ప్రయత్నమూ చేస్తుంది. పని, సిబ్బంది, శాఖలు-విభాగాల మధ్య అంతర్గతంగా ఉండే పలు అంశాలను చర్చిస్తుంది. వివిధ విభాగాల మధ్య, సిబ్బంది మధ్య అంతర్గత అంశాలనే కాకుండా, ఆయా విభాగాల సిబ్బంది, ఆంతరంగిక అంశాలను స్పృశిస్తుంది. 'విత్‌ఔట్ రిజర్వ్' (without reserve) అనే త్రైమాసిక సంస్థా పత్రిక అంతరిక సంస్థా పత్రికలకు ఒక మంచి ఉదాహరణ. దీన్ని ముంబాయిలో రిజర్వ్ బ్యాంక్ ప్రచురిస్తోంది.

### 23.5.2 బాహ్య సంస్థా పత్రికలు

బాహ్య సంస్థా పత్రికల విలువ అంతరిక పత్రికల్తో పోలిస్తే ఎక్కువే. వినియోగదారులు, డీలర్లు, సేల్స్ ఏజంట్లు, ప్రచారకర్తలు వంటి వారికోసం ఉద్దేశించి వాటిని ప్రచురిస్తారు. ఒక విధంగా ఇది 'మార్కెటింగ్ పత్రిక'. వినియోగదారుడికి ఏం కావాలో అది గుర్తించి చెప్తుంది. మద్రాసులోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రచురిస్తున్న 'డీలర్ న్యూస్' బాహ్య సంస్థా పత్రికలకు చక్కటి ఉదాహరణ. ఇది డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, వినియోగదారుడికి సంబంధించి అనేక విషయాల్ని అందిస్తుంది. 'హోస్ట్ ట్రేడ్ బులెటిన్' కేవలం తన వినియోగదారులతోనే సంభాషిస్తుంది. ఎయిర్ ఇండియా ప్రచురించే 'నమస్కార్' విమాన ప్రయాణ సందర్భంగా విమానంలో ప్రయాణీకులకు 'మీ వ్యక్తిగత కాపీ, పట్టుకెళ్లండి" అని ఇస్తారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్ తన ప్రయాణీకులకు ఇచ్చే విమాన పత్రిక 'స్వాగత్'. ఈ రెండూ ప్రధానంగా తమ వినియోగదారులను దృష్టిలో ఉంచుకొని ప్రచురించే సంస్థా పత్రికలే.

బాహ్య సంస్థా పత్రికలు చేసేదేమిటో క్లుప్తంగా ఇక్కడ ఒకసారి రేఖామాత్రంగా పరిశీలిద్దాం.

★ వినియోగదారుడికి కంపెనీతో ఉండే సంబంధాన్ని వివరించడం.

BRAOU

★ వారి సంఖ్యాబలాన్ని, ప్రభావాన్ని విశదం చేయడం.

★ ఒకరికొకరి పరిచయం నిర్వహించడం.

★ ఉత్పాదనల సమాచారాన్ని గైడెన్స్‌ను ఇవ్వడం.

★ వారివారి రంగాలకు సంబంధించి విద్యావంతుల్ని చేసే కృషి.

★ ఉత్పాదనల వినియోగంలో శిక్షణ.

★ పరస్పర సంబంధం కలిగిన రంగాలలో యాజమాన్యానికి, వినియోగదారుడికి మధ్య ఒక చర్చా వేదికగా ఉండటం.

### 23.5.3 ఆంతర్గత, బాహ్య సంస్థా పత్రికలు

సంస్థా పత్రికలలో ఇది మూడో రకం. అంతర్గత, బాహ్య లక్షణాల కలగలిసిన మిశ్రమ రకం. ఉద్యోగులకు, బయటివారికి - ఇద్దరికీ ఉద్దేశించబడే పత్రిక. ఒకవైపు ఉద్యోగుల సహకారాన్ని కోరుతూనే, వినియోగారులు, వారి అవసరాలు, సమావేశాల పట్ల శ్రద్ధ వహిస్తుంది. విస్తారిత కుటుంబం అనే ధ్యేయంతో ప్రచురిస్తారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు ప్రచురించే సంస్థా పత్రిక 'సందేశ్' ఈ రకమైన పత్రికల కోవలోకి వస్తుంది. టాబ్లాయిడ్ పరిమాణంలో ఉండే ఈ పత్రికలో కంపెనీ ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులు, ఇతర షిప్పింగ్ కంపెనీలు, మీడియా వారికోసం - సమాచారం ఉంటుంది. ఆంతరిక, బాహ్య పాఠకులలో కంపెనీ ఇమేజ్‌ని పెంపొందించే ప్రయత్నం ఇది చేస్తుంది.

అభ్యాసం - 1 : సంస్థా పత్రికలు ఎన్ని రకములు.

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

.......................................................................................................

## 23.6 ప్రచురణాంశం (Contents)

సంస్థా పత్రికల్లోని ప్రచురణాంశం (contents) పత్రికకు హృదయం వంటివి. ప్రస్తావనలను రాసే తీరు పాఠకులు చదివేటప్పుడు వారిలో ఉత్సుకతను రేకెత్తించాలి.

సంస్థా పత్రికల నిర్మితిని పరిశీలిస్తే - 'సంపాదకత్వం'తో గానీ, సంస్థ ప్రధాన అధికారి 'సందేశం'తో గానీ మొదలవుతుంది. పత్రికలో ఉండే అంశాలను సృజించే విధంగానో, సంస్థలో జరిగిన ప్రధాన సంఘటనల ఆధారంగానో సంపాదకీయం / సందేశం ఉంటుంది. కొన్ని సందర్భాలలో మాననీయాంశాలు ఉన్న ఏదైన ఉత్తేజ పూరిత విషయాన్ని ప్రస్తావించటం కూడా జరుగుతుంది. కంపెనీ నిర్వహణ, కొత్త ఉత్పాదనలు, ప్రక్రియలు, విస్తరణలు, ఆరోగ్యం, సంక్షేమ చర్యలు వంటివి ప్రధాన శీర్షికలుగా సంస్థా పత్రికల్లో కన్పిస్తాయి. ఇవి ఉద్యోగులు రాసినవైనవి కావచ్చు, బైలైన్‌తో వచ్చేవి కావొచ్చు ఈ శీర్షికల్లో కన్పిస్తాయి. సాధ్యమైనంతవరకు రాసిన వారి పేరు ప్రచురణతో పాటు ప్రచురించాలి. నిపుణలతో కంపెనీ నిర్వహణపై రాయించాలి.

పత్రికలో కేంద్రకంగా కన్పించేవి మరికొన్ని వార్తలు - అవి ప్రమోషన్లు, బదిలీలు, నియామకాలు, పదవీ విరమణలు. ఎవార్డులు, వివాహాలు, పుట్టుకలు, మరణాలు వంటివే కాకుండా సంస్థలో జరిగే వివిధ ప్రదేశాల సంఘటనలు, వార్తలు ఉంటాయి. ఉద్యోగుల నుంచి వచ్చే రచనలు పద్యాలు, కథలు, వ్యాసాలు, చిత్రాలు, ఫొటోలు సంస్థా పత్రికలకు పరిపూర్ణతను కల్పిస్తాయి. పత్రికల్లో 'హాస్యం' ఉండటం తప్పనిసరి. అంతర్లీనంగానైనా గోచరిస్తుంది.

BRAOU

ప్రస్తావనల తీరును (contents) ను విశ్లేషిస్తే కింది అంశాలు సంపాదకుడి దృష్టిని బాగా ఆకర్షిస్తాయని గుర్తిస్తాం.

★ సంస్థ ప్రధాన అధిపతి సందేశం గానీ, లేఖ గానీ.

★ సంపాదకీయం

★ అమలులో ఉన్న కార్యక్రమాల, కొత్త ప్రణాళికలపై శీర్షికలు

★ ఉద్యోగి సంక్షేమ పథకాలు

★ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు

★ సాంఘిక ఘటనలు / వివాహాలు / జన్మదినాలు

★ ఉద్యోగి సమాచారం, నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, పదవీ విరమణలు

★ ఉద్యోగుల రచనా వ్యాసంగం - కథలు, వ్యాసాలు, కవిత్వం వంటివి.

★ సరదా శీర్షికలు, హాస్యరచనలు, కార్టూన్లు, నవ్వుల పువ్వులు వంటివి.

★ రచన అంశానికి సంబంధించిన బొమ్మలు, స్కెచ్‌లు, చార్టులు, కార్టూన్లు.

'ప్రస్థానం' - ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ప్రచురిస్తున్న సంస్థా పత్రిక. దీన్ని ఉదాహరణగా తీసుకొని క్లుప్తంగా విశ్లేషిద్దాం. యాజమాన్య పక్షీయంగా కన్పించే ఈ పత్రికలో యాజమాన్యం అభిప్రాయాలు, ఉన్నతాధికారుల చిత్రాలు కన్పిస్తాయి. ఉద్యోగుల వార్తాంశాలు చోటు చేసుకుంటాయి. ఉద్యోగులు, కార్మిక సంఘాలు తమ అభిప్రాయాలను వ్యక్తీకరించేందుకు అవకాశం ఉంది. సంస్థా పత్రిక రూపంలోని ఈ మార్పు ప్రస్తావన, రూపకల్పనా విధానాలలో కనిపిస్తుంది. పని స్థలాలలో ఉద్యోగుల కార్యక్రమాల పరిధిని ఎక్కువగా గమనిస్తాం. ఈ సంస్థా పత్రికల ప్రస్తావనాంశాలు నాలుగు విధాలైనవి.

1. యాజమాన్య వార్తలు : అధ్యక్షుడి సందేశం, కార్యనిర్వాహక నిర్దేశకుడి సందేశం, బోర్డు నిర్ణయాలు, పాలసీలు, కార్పొరేషన్ కార్యక్రమాలు.

2 సంపాదకీయం: ఉద్యోగులను ఉత్తేజపరిచే విధంగా ఉత్పాదకతకు సంబంధించిన కాలమ్‌లు.

3. సంక్షేమ చర్యలు: మంచి పనికి ప్రోత్సాహం, క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాలు.

4. ఉద్యోగుల రచనా వ్యాసంగం: వారి రచనలు, సలహాలు, లేఖలు వంటివి.

ఫొటోల ప్రచురణకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోంది. వర్క్ షాపులలో పనిచేస్తున్న సందర్భాలను ప్రతిబింబిస్తూ తీసిన చిత్రాలు కనిపిస్తాయి. ముందు, వెనుక అట్టలమీద చిత్రాలను ప్రచురించడానికి ఎంపికచేయడంలో ఈ సాధారణ అంశాలు ప్రాధాన్యం వహిస్తాయి. 'ముఖ్యపేజీ విస్తరణ'లో విభాగాల పనితీరును ప్రదర్శించే ఫొటోలను ముద్రించేవారు. 1988 నవంబరు పత్రిక ముఖచిత్రం డ్రైవర్ రాజాది. ఉత్తమ డ్రైవర్‌గా యాజమాన్యం నుంచి ప్రశంసలను పొందడం దీని ఎంపికకు కారణం.

ఉద్యోగులు రచనలు చేసేవిధంగా ప్రోత్సహిండానికి - రచనలకు తగిన పారితోషికం ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయించింది. ఉద్యోగుల రచనలు బాగా పెరిగాయి.

ప్రధాన సంస్థా పత్రికల విషయంలో ప్రస్తావనకొచ్చే అంశాలు కొన్ని వున్నాయి. వీటిని పత్రికలో పొందుపరచడంలో సమ తౌల్యాన్ని సాధించాలి. కొన్నిటిని బాగా వక్కాణించటం, మరికొన్నిటిని చిన్నచూపు చూడటం, మరికొన్నిటిని పట్టించుకోకుండా పోవడం వంటివి జరగకూడదు. అప్పుడే సంస్థా పత్రిక చదువరుల దృష్టిలోనూ, యాజమాన్యం దృష్టిలోనూ సాణ్యమైన పత్రికగా నిలబడ్తుంది. ఉత్పాదకత పెంపొందించడానికి ఒక దారినేర్పరుస్తుంది.

BRAOU

## 23.7 మీ సంస్థా పత్రికకోసం రాయడం

వార్తా పత్రికలలో మాదిరిగా సంస్థా పత్రికలలో పెద్ద ఎత్తున బయటివారి రచనలు కన్పించవు. సంపాదకుడిగా వ్యవహరించే ప్రజాసంబంధాల మేనేజరే చాలా వరకు రచన చేయవలసి ఉంటుంది. ఈ కింద చర్చించే అంశాల ద్వారా సంస్థా పత్రికకు ఎలా రాయాలి అన్నది తెలుస్తుంది. కొన్ని మార్గదర్శకాలు లభిస్తాయి. రాయడం, తిరిగి రాయడం వంటి విషయాల పట్ల కొంత అవగాహన ఏర్పడుతుంది.

### 23.7.1 సూటిగా రాయడం

చెప్పదల్చుకున్నది సూటిగా రాయాలి. విశేషణాలు వాడకూడదు. భాషాడంబరం తగదు. డొంకతిరుగుడుగా రాయడం కూడదు. సూటిగా, స్పష్టంగా చిన్న పదాలతో సరళంగా చెప్పాలి. సూటిగా రాయడంలో మనకు కన్పించే ప్రధాన లక్షణాలు

- ★ మంచి పదాలు
- ★ చిన్న వాక్యాలు
- ★ అవగాహనకొచ్చే విధంగా చిన్న పేరాలు
- ★ నిర్మితీయ అవుట్ లైన్లు

సంపాదకుడిగా వచ్చిన రచనలలోని పదాలను పాఠకుడికి అర్థమయే విధంగా మార్చాలి. చెప్పాలి (to inform), ఉత్తేజ పరచాలి (to motivate) అనే సూత్రాల ఆధారంగా రచన, ఎడిటింగ్ నిర్వహించగలిగితే రచన క్లుప్తంగా, సూటిగా, బాగా అర్థమయ్యే రీతిలో ఉంటుంది. సంస్థ పత్రిక ఉపయోగం మీకు తెలుసు. రచనను సరిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత సంపాదకుడిగా మీదే అవుతుంది.

ఉద్యోగులకు సంబంధించిన పత్రికలు కావడం వల్ల ఉన్నతాధికారులనుండి, వివిధ విభాగాలనుండి సందేశాలు, నివేదికలు వస్తాయి. వారు స్వతహాగా రచయితలు కారు. రచన విషయంలో వారికి ఏ శిక్షణా ఉండదు.

అయినా సంస్థా పత్రికల సంపాదకులు వాటిని సరిచేసే సాహసం చేయరు. అధికారి చెప్పింది మార్చటమా ... అన్న భయమే ఇందుకు ప్రధాన కారణం. రాసిన అధికారి మీ పై అధికారి కావొచ్చు, కానీ సంస్థా పత్రికకు మీరే అధికారి అన్నది గుర్తుంచుకోవాలి. సంపాదకుడిగా మీరు చేసే ఎడిటింగ్ మాత్రమే సంస్థా పత్రిక ఇమేజ్‌ను పెంపొందిస్తుంది. మరేదీ కాదు.

మంచి పదాలెప్పుడూ చక్కని అర్థాన్నిస్తాయి. సరైన పదాలని ఎంపిక చేయడం నేర్చుకోవాలి. పదాల ఎంపిక విషయంలో అభ్యాసం చేసిన మీదటే మీకా నేర్పు అలవడుతుంది.

పదాల మాదిరే వాక్యాలు. వాక్య నిర్మాణం సరైందయితే దాని ప్రవాహం సహజసిద్ధంగా కనిపిస్తుంది. ఒక వాక్యంలో 15 నుంచి 20 పదాలకంటే ఎక్కువ కాకుండా చూసుకోవాలి. పెద్ద వాక్యాలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులున్నాయని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. కామాలు, ఇతర విరామ చిహ్నాలు ఎంత తక్కువగా ఉంటే అంత మంచిది. కామాలు, కోలన్‌లతో వాక్యాన్ని విరిచి వేసే బదులు వాక్యం విడదీసి రెండుగా తిరిగి రాయగల్గడం పరిశీలించాలి. కామాలు అధికంగా ఉన్న వాక్యాన్ని చదవడానికీ సమయం ఎక్కువ పడ్తుంది.

పేరాలలో ఒకే భావనను ఏకధాటిగా ప్రస్తావించడం చిన్నతనంలో నేర్చుకుని ఉంటారు. పేరాలోని చివరి వాక్యం తర్వాత ప్రస్తావించే విషయానికి కొనసాగింపు నివ్వాలి. వార్తా లేఖ (News letter) రాసేటప్పుడు దీన్ని మర్చిపోవడమే మంచిది. పేరాలో ఒకే భావనను విడనాడాలి. పేరాలు చిన్నవయితే చెప్పదల్చుకున్నది ఇంకా బాగా చెప్పగలరు. పేరా మొదట్లో, చివరా ఖాళీ స్థలం

తెల్లగా కన్పిస్తే కొత్త పదాలున్నాయనే భావం ఏర్పడుతుంది. పాతకుడ్ని ఆకర్షిస్తుంది. పేరాల విషయంలో మరొక విషయాన్ని గుర్తుంచుకోవాలి. రాసిందేదయినా ఒకసారి పరికించండి. మొదటి, చివరి వాక్యాల్ని రెండింటినీ హైలైట్ చెయ్యండి. ఆ తర్వాత ఈ రెండు వాక్యాల్ని చదవండి. అర్థం వస్తుంది. అలా అనిపిస్తే దీన్ని బట్టి మీ పేరాలు పొడవైనవని అర్థం. పేరా మార్పులో ఉన్నది అధికస్థాయి పదాల కూర్పే అనిపిస్తుంది. సందేశం మధ్య అడ్డుగా నిలుస్తుంది. మీ సంస్థా పత్రికలో రచనలను. ఈ విధానంలో పరీక్షించి చూడండి. మీరెంత తగ్గించగలరో ప్రయత్నించండి. సాధారణంగా బాగా తగ్గించగలిగే ఆస్కారమే కనిపిస్తుంది.

ఏ వ్యాసం రాసినా, రచన చేసినా దానికంటూ ఒక రేఖాచిత్రం ఉండాలి. రేఖా చిత్రం పూర్వపగానే ప్రస్తావించవలసిన అంశాలు పేరాల వారీగా కుదించగలరు. తదనుగుణంగా వాక్యాల కూర్పు చేయగలరు. రాయదల్చుకున్న రచనకు సంబంధించిన ఆలోచనలను ముందుగా ఒకసారి రాసుకోవాలి. సారూప్యత కలిగిన ఆలోచనల్ని ఒకచోట చేర్చాలి. ఆ తర్వాత ఒక వరుసక్రమంలో పేర్చాలి. పేరాలకు ఒక ప్రస్తావన క్రమాన్ని నిర్ధారించాలి. బయటివారితో రాయించే వ్యాసాలు మీరు వేసుకున్న ప్రణాళిక ప్రకారం కావాలనుకున్నప్పుడు, రచయితకు ఆ అంశానికి సంబంధించి ఒక రేఖా చిత్రాన్ని రూపొందించి ఇవ్వాలి.

## 23.8 సంస్థా పత్రికలలో శీర్షికలు

సంస్థా పత్రికలలో ప్రస్తావనలు (contents) శీర్షికల్ని సూచిస్తాయి. ప్రతి శీర్షికకు ఒక విలక్షణమైన శైలి ఉంటుంది. సంపాదకీయాలు, సంస్థ విధాన అధిపతి నుండి లేఖ, ఉద్యోగుల సంక్షేమ పథకాలు, వ్యక్తిగత నిర్వహణలో గొప్పదనం వంటి వాటిని వివరించే ప్రయత్నం చేశాం.

### 23.8.1 సంపాదకీయాలు

సంస్థా పత్రికలలో సంపాదకీయాలను పరిశీలిద్దాం. పరిశీలించే ముందు సమాధానాలు తెలుసుకోవల్సిన ప్రశ్నలు కొన్ని మీముందు కొస్తాయి. అవి :

సంపాదకీయం అంటే ఏమిటి?
సంపాదకీయాన్ని ఎవరు రాస్తారు?

ఈ ప్రశ్నలకు సమాధానం - సంపాదకుల విషయంలో పూర్వ పరిజ్ఞానమే. వార్తా పత్రికలు, కాలిక పత్రికల్లో సంపాదకీయాలను ఒక ప్రత్యేకమైన పేజీలో ముద్రించడాన్ని గమనిస్తారు. వార్తా పత్రికల్లో సంపాదకీయాలపైన మాస్ట్‌హెడ్ (Mast head) ఉంటుంది.

వార్తా పత్రిక సంపాదకుడు, అతని నిర్దేశకత్వంలో సహాయక సంపాదకులో వార్తల్లోని అంశాలపైన సంపాదకీయం రాస్తారు. వార్తల్లో ఆరోజు ప్రధాన అంశం వల్ల సాధారణంగా సంపాదకీయం ఉంటుంది. రెండు, మూడు సంపాదకీయాలు కూడా దినపత్రికల్లో కనిపిస్తాయి. ఎడిటోరియల్ పాలసీ ఆధారంగా సంపాదకుడు సంపాదకీయంలో తన అభిప్రాయాల్ని వెల్లడించే అవకాశం ఉంది.

వార్తా పత్రికలు, కాలిక పత్రికల్లో సంపాదకుడు కీలకమైన వ్యక్తి. పాలసీలను నిర్ధారిస్తాడు. సంపాదక సిబ్బందిని నియమిస్తాడు. వారి పనిని పర్యవేక్షిస్తూ పత్రికా ప్రచురణ సమర్థవంతంగా నిర్వహించే ప్రయత్నం చేస్తాడు. వార్తాపత్రిక ప్రతిష్టను నిర్మించే ప్రయత్నం కొనసాగిస్తూ ఉంటాడు. ప్రముఖ జర్నలిస్టు బి. పార్థసారథి 'బేసిక్ జర్నలిజం' అన్న పుస్తకంలో ఎడిటర్ గురించి ప్రస్తావించిన అంశాలు ఒకసారి క్లుప్తంగా మననం చేసుకోవాలి.

సంపాదకుడు ఒక నిర్వాహకుడు, ఒక సమన్వయకర్త. సంపాదక విభాగంలో పనిచేస్తున్నవారికి పాలసీ, నియమాల, స్టాండర్డ్‌ని సంపాదకుడు నిర్ధారిస్తాడు. వార్తా పత్రిక ఇమేజ్ పెంపొందించగలడు. మన దేశంలో ప్రతి వార్తాపత్రికా సంపాదకుడి పేరు తప్పనిసరిగా ప్రచురించాలి. సంస్థా పత్రికలలోనూ ఇది కన్పిస్తుంది.

BRAOU

## సంపాదకీయాల ప్రాధాన్యం

సంపాదకుడి ప్రాధాన్యాన్ని గుర్తించాం. వార్తా పత్రికల్లో సంపాదకీయాల ప్రాధాన్యాన్ని పరిశీలిద్దాం. 'ప్రొఫెషనల్ జర్నలిజమ్' అనే పుస్తకంలో ప్రముఖ పత్రికా రచయిత ఎమ్.వి. కామత్ ప్రస్తావించిన అంశాలు క్లుప్తంగా తెల్సుకుందాం. ఆయన దృష్టిలో సంపాదకీయం ఒక 'చలన ప్రక్రియ'. సంపాదకీయాలు ప్రతిస్పందనలను కల్పిస్తాయి. చర్యకు పురికొల్పుతాయి. విప్లవాన్ని ప్రేరేపిస్తాయి. ఆలోచనల్ని పదును చేస్తాయి. సంపాదకీయం రాయడానికి తగ్గ అంశం ఉండాలి. ఖాళీ స్థలాన్ని నింపడానికి దేన్నిపడితే దాన్ని రాయలేం. కొందరు సంపాదకులు రాయదగ్గ స్థాయిలో అంశాలు లేనప్పుడు 'సంపాదకీయాన్ని' రాయకపోవడమూ మనం గమనించవచ్చు. సంపాదకీయానికి ఒకశైలి అనేది ఏదీలేదు. కానీ ఒక ప్రారంభం, ఒక ప్రస్తావన, ఒక ముగింపు ఉన్నాయి. ఈ విధంగా సంపాదకీయం పాఠకుడి దృష్టిలో ఒక ప్రాధాన్యంగల రచన. ఒక ఉన్నతమైన రచనగా పాఠకులు భావిస్తారు.

## సంస్థా పత్రికల్లో సంపాదకీయాలు

వార్తా పత్రికల్లో సంపాదకుడు, సంపాదకీయాల స్థానాన్ని, ప్రాముఖ్యాన్ని గుర్తించగలిగారు. సంస్థా పత్రికల్లో ఈ రకమైన సంపాదకీయాలు ఉండవని తెలుసు. కానీ ఇటీవలి కాలంలో సంస్థా పత్రికలు సంపాదకీయాలను కల్గి ఉంటున్నాయి. ప్రజా సంబంధాల అధికారులే దీన్ని నిర్వహిస్తారు. ఈ కొత్త ఒరవడి వారి భావప్రకటనకు కొత్త అవకాశాల్ని కల్పిస్తుందనే చెప్పాలి. ఒకవిధంగా ఇది హర్షించదగ్గ ఒరవడే.

సంస్థా పత్రికల్లో 'సంపాదకీయం' రాయడమన్నది సంపాదకుడి ఇష్టం. దాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. సంస్థా పత్రికలో సంపాదకీయం రాయడం చేయాలా, వద్దా అన్నది వ్యక్తిగత ఇష్టా ఇష్టాల మీదే ఆధారపడి ఉంటుంది. మరి రాయాలనుకున్నప్పుడు ప్రస్తావించవలసిన అంశాలేవి? ఇలానే ఉండాలి, ఉండకూడదు అని నిబంధనలు విధించడం సహజ విరుద్ధమైన చర్యే అవుతుంది విస్తృత పరిధిలో ఆలోచించినప్పుడు కొన్ని అంశాలు మనదృష్టిలోకి రాకమానవు. అవి-.

సంస్థ, ఉద్యోగులకు సంబంధించి ప్రత్యేక, ప్రస్తుత అంశాలపై రాయడం.

విహంగ వీక్షణ పంథాలో పత్రికలో ప్రస్తావించే అంశాలను బహుక్లుప్తంగా చెప్పడం - ఒకదానికొకటి అనుసంధానం చేయడం. పాఠకుడి ఉత్సుకతను ఉత్తేజపరిచే విధంగా ఇది తోడ్పడుతుంది. కర్టెన్ రైజర్ అవుతుంది. సంస్థా పత్రికల్లో సంపాదకీయాల్లో సమాచారం, అందించే విద్యా, ఉత్తేజం కల్పించే విధంగా అంశాలు ఉండాలి.

BRAOU

### 23.8.2 సంస్థ ప్రధాన కార్యనిర్వహణాధికారి లేఖ

క్రమం తప్పని శీర్షికగా ఇది ఉండాలి. సంస్థా పత్రికలల్లో ఒక ప్రధాన లక్షణంగా నిలదొక్కుకోవాలి. సంచికకు సంచికకూ లేఖాంశం మారవచ్చు. ప్రధాన కార్యనిర్వహణాధికారికి ఉద్యోగులను ఉత్తేజితుని చేసి ఉత్పాదకత పెంచే అవకాశాన్ని కల్పిస్తుంది.

- ★ సంస్థ పాలసీలను, ఆచరణలను వివరించడంతోపాటు
- ★ కొనసాగుతున్న పథకాల అమలు, వాటి పురోగతి,
- ★ భవిష్యత్ ప్రణాళికలు, వాటి మంచీ చెడ్డలు
- ★ ఉత్పాదక దిశగా విస్తరణ,
- ★ పోటీ మార్కెట్‌లో ఉత్పాదన గొప్పతనం,
- ★ విదేశీ సహకారం - సంస్థ భవిష్యత్తు,
- ★ సంస్థలో వ్యక్తిగత స్థాయిలో గొప్పదనాలు, ప్రశంసలు,
- ★ ఉద్యోగ సంక్షేమ పథకాలు,

సంస్థను సందర్శించిన దిగ్గజాల సమాచారం వంటి వాటిని ఆధారం చేసుకొని సంపాదకీయాన్ని, లేఖని రూపొందించే ప్రయత్నం చెయ్యాలి. ఈ లేఖను రాయడంలో ప్రధాన కార్యనిర్వహణాధికారికే పూర్తి స్వేచ్ఛ నివ్వాలి. ప్రజా సంబంధాల అధికారి ప్రమేయం ఉండకూడదు.

రచనను కూర్పు గావించడం, అందంగా తీర్చిదిద్దడం వరకే ప్రజా సంబంధాల అధికారి పరిమితమవడం తప్పనిసరి. కూర్పు గావిస్తున్నప్పుడు లేఖలోని భాషను తాకగూడదు. ఉత్సాహం కొద్దీ చేస్తే ప్రధాన అధికారి తప్పుగా అర్థంచేసుకునే ప్రమాదం ఉంది. ఎమ్.డి.తో చర్చించాక ప్రజాసంబంధాల అధికారులు లేఖను రూపొందించి ఆమోదంకోసం తరచూ జరిగే యత్నమే.

పేజీ అలంకరణ, రూపకల్పన సమయంలో ఎమ్.డి. సందేశంతోపాటు ఫొటోనికూడా ప్రచురించే ప్రయత్నం చేయ్యాలి.

అభ్యాసం - 2 : ఏదైనా ఒక సంస్థా పత్రికకు సంపాదకీయం రాయండి.

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

## 23.8.3 ఉద్యోగుల సంక్షేమ పథకాలు

ఉద్యోగుల కోసం పలు సంక్షేమ పథకాలను సంస్థలు అమలుచేయడం చూస్తూనే ఉన్నాం. విద్య, గృహవసతి, ప్రసూతి, ఆరోగ్యం, వాయిదా పద్ధతిలో కొనుగోలు, భవిష్య నిధి, పెన్షన్ వంటి పథకాలెన్నో సంస్థలు అమలు పరుస్తున్నాయి. ఉద్యోగులకు వివిధ సంక్షేమ పథకాల గురించి తెలియాలి. పథకాల ప్రధాన లక్షణాలు తెలుసుకోవాలి. అప్పుడే ఉద్యోగులు ఈ పథకాల వల్ల కలిగే లాభాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోగలరు. వీటికి సంస్థాగతంగా - సంస్థాపత్రిక ఒక మాధ్యమ వారధి. ఉద్యోగుల ప్రతిస్పందన కూడా దీని ద్వారా తెలుసుకోగలం. యాజమాన్యానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. ఈ ధోరణి ఉద్యోగి - యజమానుల మధ్య సత్సంబంధాలను నెలకొల్పే ప్రయత్నం చేస్తుంది.

BRAOU

ఈ శీర్షికను రాయడం ఎలా ?

మొదటిగా పథకం విశేషాలను వివరణాత్మకంగా విశదీకరించాలి. విశదీకరణలో భాగంగా స్పృశించవలసిన అంశాలు కొన్ని ఉంటాయి. అవి -

- ★ పథకం కింద, విభాగాల పరంగా, ప్రాంతాలవారీగా, లబ్ధిదారులను గుర్తించడం.
- ★ ఆర్థిక వనరుల తర్వాత - సంవత్సరాల వారీగా.
- ★ పథకాలకు ఆర్థిక సహాయం అందించే ఆధారాలు
- ★ విదేశీ సహాయం ఏదైనా పథకానికి వచ్చే పక్షంలో దానిలో విశదీకరించాలి.
- ★ ఇదే తరహా పథకాలను మరే సంస్థయినా అమలుచేస్తే దాన్ని బట్టి బేరీజువేయడం గుణాత్మకంగా పథకం
- ★ అమలుకు చర్యల చేపట్టడానికి గల పరిధిని ప్రస్తావించడం.
- ★ పథకానికుండే పరిమితులను ప్రస్తావించడం

గణాంక వివరాలు విరివిగా పొందవచ్చు. కాని వాటిని రచనలో వినియోగించే సందర్భాలలో జాగ్రత్త అవసరం. తప్పనిసరయితే తప్ప వాటి జోలికి పోకూడదు. సంఖ్యలు పాఠకుడ్ని ఆకట్టుకోలేవు. కాబట్టి గణాంక వివరాలను వాడటంలో రెండు విధాలను మనం గుర్తించవచ్చు. అవి -

- ★ శీర్షిక కింద ప్రధాన ప్రస్తావనలో అక్కడకూడా పరిమితంగా వాడటం

★ చిత్ర రూపంలోకి మార్చి శీర్షిక రచనలోకి చొప్పించడం.

ఒకవేళ మొదటి తరహాను ఎంపికచేస్తే గణాంక వివరాల ప్రస్తావన ఒకస్థాయిని అధిగమించకూడదు. సంఖ్యల ప్రస్తావన కిక్కిరిసి కన్పించకూడదు. బడ్జెటు ప్రస్తావనలా ఉండకూడదు. చదివే అంశానికి, సంఖ్యలకి మధ్య సమతౌల్యం ఉండాలి. సంఖ్యలు మాటల్ని, వాక్యాల్ని కప్పేయకూడదు. పథకం ఏదైనా జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిల్లో, దేశస్థాయిలో సృజనాత్మకత గొప్పదనం కారణంగా గుర్తింపు పొందగలిగినప్పుడు రచనలో ఈ అంశాన్ని కచ్చితంగా చెప్పాలి. పథకం పట్ల వెలువడిన అనుకూల భావాలను, ప్రముఖుల ప్రతిస్పందనలను సేకరించి ఉంచుకోవాలి. ప్రజా సంబంధాల అధికారి ఈ సమాచారాన్ని పొందే ప్రయత్నం చెయ్యాలి.

### 23.8.4 వ్యక్తిగత నిర్వహణలో గొప్పదనం

వ్యక్తిగత నిర్వహణలో గొప్పదనాల గురించి ఇప్పుడు పరిశీలిద్దాం. ఉన్నతోద్యోగికావచ్చు. కింది తరగతి ఉద్యోగి కావొచ్చు. ప్రతీ ఉద్యోగి సంస్థలో ఒక అంతర్భాగం సంస్థ సమర్థవంతంగా పనిచేయడానికి ఇద్దరూ తమవంతు కృషి చేస్తారు. ఎవరి కృషి వాడికి ప్రత్యేకించినదై ఉంటుంది. వారి కృషిలోని ధనాత్మక అంశాలను, సేవా తత్పరతను ప్రశంసించ వలసి అవసరం ఉంటుంది.

ఉదాహరణకు : పరిశోధ, అభివృద్ధి విభాగంలో పనిచేస్తున్న అధికారి ఉత్పత్తిని పెంచే విధంగా ఉత్పత్తి పద్ధతులను తక్కువ శ్రమ వినియోగంతో రూపొందించినపుడు, సాంకేతికజ్ఞుల మన్ననలను పొందగలిగినప్పుడు అతనిలోని వ్యక్తిగత నిర్వహణ గొప్పదనాన్ని ప్రశంసించాలి. ప్రోత్సహించాలి. ఈ పనిని సంస్థాపత్రిక ద్వారా చేయడం అవసరం. అతనికి గుర్తింపు రావడంతోపాటు, మిగతా శ్రామికులకు మార్గదర్శకంగా, స్ఫూర్తిగా కన్పిస్తారు. అదే ఒక మధ్యస్థాయి ఉద్యోగిని తీసుకుందాం. ఎక్కువ పనిగంటలు కృషి చేసి అధిక సంఖ్యలో ఉత్పాదనలకు కారకుడవుతాడు. దీన్ని కూడా సంస్థా పత్రికల పుటల్లోకి ఎక్కించవలసిందే. ఏ స్థాయి ఉద్యోగి అయిన వ్యక్తిగత నిర్వహణలో గొప్పదనాన్ని ప్రదర్శించినప్పుడు సంస్థ ఈ విధంగా చేయడం కనీస ధర్మం కావాలి.

### ఈ శీర్షికలను రాయడమెలా?

ఈ శీర్షికలలో నిర్వహణలో గొప్పదనం ఎంత విలువైందో వ్యక్తిగతంగా ఉద్యోగికూడా అంతే విలువను పొందుతాడు. కాబట్టి ఉద్యోగి గురించి స్కెచ్ రూపంలో ఆకర్షకంగా రాయాలి. ఉద్యోగికి సంబంధించి చిన్న చిన్న వివరాలతో విసిగించేదిగా ఉండకూడదు. సాధారణంగా ఆంగ్ల సంస్థా పత్రికలలో ఇటువంటివి వస్తుంటాయి. వాటిని ఒకసారి పరిశీలిచండి. రెండు అంశాలను ఈ శీర్షికలలో ప్రత్యేకించి చెప్పవచ్చు. వ్యక్తి భాగస్వామి గురించి ఒకటయితే పిల్లల గురించి మరొకటి - చెప్పటం వల్ల మాననీయ ఆసక్తిని ఆకర్షించగలం. సాధారణంగా ఇటువంటివి కొసమెరుపులా చివరి పేరాలో రావాలి.

విశిష్టతను సాధించడానికి అతను ఎన్నుకున్న మార్గాల్ని విశదీకరించాలి. సంస్థకు కలిగే లాభాన్ని స్పష్టం చేయాలి. వీలయినచోట సంఖ్యాపరంగ ప్రస్తావించాలి. అప్పుడే ఉద్యోగి గొప్పదనం పరిధిని గుర్తించగలరు. ఉద్యోగి గొప్పదనం పై అధికార్ల దృష్టి వచ్చి ఉండవచ్చు. సాంకేతికజ్ఞులు అభినందించి ఉండవచ్చు వారి ప్రశంసల ప్రస్తావన శీర్షికలోకి చొప్పించడం వల్ల శీర్షిక విశ్వసనీయత పెరుగుతుంది.

తర్వాత ఉద్యోగిలో ముఖాముఖి విషయానికొద్దాం. వాస్తవాలని ప్రత్యక్షంగా అతని ద్వారా తెలుసుకొనేందుకు ఇది తోడ్పడుతుంది. ప్రజా సంబంధాల అధికారి ఉద్యోగి దగ్గరికి వెళ్లి మాట్లాడించగలగాలి. కొత్త సమాచారాన్ని సేకరించగలగాలి. అతని మాటల్లోనే పాఠకుడికి చెప్పడం శీర్షికలో ప్రధాన అంశం కావాలి. కొన్ని సందర్భాలలో ఉద్యోగి తనకు తానుగా తన విజయాన్నుంచి కొన్ని సృజనాత్మక అంశాలను చెప్పాలని ముందే నిర్ణయించుకుంటాడు. రాసి ఉంచుకోవడమూ జరుగుతుంది. ఈ సందర్భాలలో దాన్ని సంపాదించి, ఉద్యోగి ప్రొఫైల్‌తోపాటు ప్రచురించాలి. అయితే శీర్షిక ప్రారంభంలో ఒక వివరణాత్మక నోట్‌ను ఇవ్వడం మంచిది. పాఠకుడికి త్వరగా అర్థంచేసుకునే వీలు కల్పిస్తుంది.

ప్రొఫైల్‌లోని పేరాలను క్రమరీతిలో అమర్చాలి. పాఠకుడు ఉద్యోగి, అతని జీవితం, సాధించిన విజయం, దాని స్వభావం

BRAOU

పట్ల పూర్తి అవగాహన పొందే అవకాశం లభిస్తుంది. ప్రొఫైల్ విభాగంగా చిన్నదిగా ఉండాలి. ఇలా వీలుకాని సందర్భాల్లో మాత్రం మరీ పెద్దదిగా మాత్రం మారకుండా చూడాలి.

### 23.8.5 సాంస్కృతిక, సామాజిక ఘటనలు

ఇటీవలి కాలంలో సంస్థలో జరిగే సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు ప్రాధాన్యతను సాధించుకొన్నాయి. ఉద్యోగులు పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమాలలో పాల్గొనడమే ఇందుకు ప్రధాన కారణం. విస్తృత పరిధిలో ఉండే ఈ కార్యక్రమాలలో సంగీత సమ్మేళనాలు, నృత్య ప్రదర్శనలు, మాజిక్ ప్రదర్శనను, బాలల సమ్మేళనాలు, వార్షికక్రీడలు, పుస్తక ప్రదర్శనలు, దీపావళి, దసరా ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలు, ఫేషన్ పరేడ్‌లు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, సామూహిక పిక్నిక్‌లు, ముషాయిరాలు, కవి సమ్మేళనాలు, నాటక ప్రదర్శనలు. ఇలా... ఎన్నో

ఉద్యోగులను ఉత్తేజితులను గావించడానికి యాజమాన్యాలు ఈ కార్యక్రమాల నిర్వహణలో ఆసక్తిని ప్రదర్శిస్తున్నాయి. తరచూ ఆయా సందర్భాలలో వీటి ఏర్పాటులో పాలుపంచుకొంటున్నాయి. యాజమాన్యాలు వీటిని ఒక సృహృద్భావ చర్యగా పరిగణించటం కన్పిస్తుంది. సంస్థలోని ప్రముఖులు, ముఖ్యులు ఈ కార్యక్రమాలలో పాలుపంచుకోవడం ఒక విశేషం.

ఇటువంటి శీర్షికలను ఎలా రాయాలి? - అనిఆలోచించినప్పుడు కొన్ని ప్రధాన లక్షణాలను దృష్టిలో ఉంచుకోవాలి.

- ★ కార్యక్రమం తేదీ, స్థలం, సందర్భాలు పూర్తిగా సూచించాలి.
- ★ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథుల పేర్లు, హోదాలు ప్రస్తావించాలి.
- ★ కార్యక్రమం ప్రధాన అంశాలను ఆసక్తికరంగా రాస్తూ, కార్యక్రమంలో జరిగే ఆసక్తికరమైన విషయాల్ని ప్రస్తావించాలి.
- ★ సమావేశంలో పాల్గొన్నవారిని చక్కగా వర్ణించి రాయాలి.

వాస్తవానికి ఇటువంటి శీర్షికలు క్లుప్తంగా ఉండాలి. ఒకే నెలలో జరిగిన కార్యక్రమాల సంఖ్య అధికమయితే రెండు మూడు పేరాలకంటే ఎక్కువగా ఒక్కో కార్యక్రమం గురించి రాయకూడదు. అంటే 8, 10 కార్యక్రమాల దాకా చక్కటి రేఖాచిత్రాలలో పొందుపరచవచ్చు.

పండుగలకు సంబంధించి రాసేటప్పుడు - పండుగ పూర్వాపరాలు, మతపరంగా ప్రాధాన్యం విపరించాలి. ఇతర మతాలవారి భావాలను కించపరచకుండా జాగ్రత్త పడాలి.

### 23.8.6 సంపాదకునికి లేఖలు

వార్తా పత్రికలన్నిటిలోను 'సంపాదకీయానికి' ప్రత్యేకించి ఒక పేజీని కేటాయిస్తారు. పాఠకుల అభిప్రాయల కోసం స్థలాన్ని కేటాయిస్తారు పాఠకులనుంచి ఉత్తరాల రూపంలో వచ్చే అభిప్రాయాల్ని ఎంపికచేసి ఇక్కడ ప్రచురిస్తారు. కొన్ని ప్రత్యేక వార్తాకథనాలను ప్రచురిస్తారు. పాఠకులనుంచి వచ్చే ఉత్తరాలు విభిన్న అంశాలను చెంది ఆసక్తికరంగా ఉంటాయి కాబట్టి సంపాదకులు వాటిని ప్రయత్నిస్తారు. పాఠకులనుంచి వచ్చే ఉత్తరాల్లో నిరసనలు, ప్రశంసలు, కోర్కెలు, సమస్యలూ.. అన్నీ ఉంటాయి.

ఒక విధంగా ఈ ఉత్తరాలు సమాజ అవసరాలను ప్రతిబింబిస్తాయి. మానవాళి అవసరాల్ని సూచిస్తాయి. వార్తా పత్రికలో వచ్చిన వార్తలమీద, శీర్షికలమీదా, వాటి ఆధారంగానూ ఉత్తరాలు రాస్తారు. కొన్ని కొత్త అంశాలు వెలుగుచూస్తాయి. కొన్ని కేవలం సమాచారాన్నే ఇస్తాయి. ప్రముఖ జర్నలిస్టుల అభిప్రాయంలో ఎడిటర్ కాలమ్‌కు వచ్చే ఉత్తరాల వైవిధ్యాన్ని - సామాజిక స్పృహకు దర్పణంగా పేర్కొంటారు. వార్తాపత్రికలు, కాలిక పత్రికలలో ఇది క్రమం తప్పని శీర్షిక పాఠకులకు చెందిన శీర్షిక పాఠకుల రాసిన ఉత్తరాలు, వాటి అంశాలు ఏవైనా, వాటిల్లోంచి ఎంపిక చేసుకునే బాధ్యత సంపాదకుడిదే. మరొకరిది మాత్రం కాదు. ఉత్తరాల నిడివి ఎంత తక్కువలో వాటి ప్రచురణకు లభించే అవకాశాలు అంత ఎక్కువని గమనించాలి. ఈ నేపథ్యంలో ప్రజా సంబంధాల అధికార్లు సంస్థా పత్రికల ఎడిటర్లుగా ఈ శీర్షిక ఏర్పాటుకు కృషి చేయాలి ఉద్యోగుల ఆకాంక్షలని, అభిప్రాయాలని, సలహాలని

BRAOU

తెల్సుకునే అవకాశాన్ని ఇస్తుంది ఈ శీర్షిక. ఉద్యోగుల ఫీడ్‌బాక్ సమాచారాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. కొన్ని సంస్థా పత్రికల్లో వస్తున్న లేఖల్ని ఒకసారి పరిశీలించండి. ఉదాహరణ ఒకదాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం.

అభ్యాసం - 3 : సంపాదకునికి ఏదేని సమస్యపై ఒక లేఖ రాయండి.

.............................................................................................................................................

.............................................................................................................................................

.............................................................................................................................................

.............................................................................................................................................

.............................................................................................................................................

## 23.9 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

★ సంస్థా పత్రికలు సంస్థ ప్రచురించే పత్రికలు. ఉద్యోగులలో ఉత్తేజాన్ని, విద్యాంశాలను స్ఫురింపచడాన్ని ధ్యేయంగా పెట్టుకొని ప్రచురిస్తారు.

★ సంస్థా పత్రికల్ని మూడు రకాలుగా వర్గీకరిస్తారు. అవి ఆంతరిక, బాహ్య, ఆంతరిక-బాహ్య సంస్థా పత్రికలు.

★ సంస్థా పత్రికల ఆవిర్భావం 1840లో అమెరికాలోని లోవెల్ కాటన్ మిల్స్ వారు ప్రచురించిన 'లోవెల్ ఆఫరింగ్'తో మొట్టమొదటిసారిగా వెలుగుచూశాయి.

★ సంపాదకీయం, సంస్థ ప్రధాన అధికారినుండి లేఖ, సంక్షేమ వార్తలు, ఉద్యోగుల వ్యక్తిగత నిర్వహణ, సాంస్కృతిక, సామాజిక ఘటనలు, పాఠకుల ఫోరమ్ వంటి ప్రస్తావనలు (contents) సంస్థా పత్రికల్లో కనిపిస్తాయి.

★ సంస్థా పత్రికలకోసం రాయడం, ఎడిట్ చేయడానికి సంబంధించి మార్గదర్శకాలు చర్చించుకున్నాం.

BRAOU

## 23.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. సంస్థా పత్రికను నిర్వచించండి? అంతర్గత, బాహ్య ప్రజలకు సమాచారంకోసం, విద్యావసరాల కోసం సంస్థా పత్రికల పాత్ర, పరిధులను వివరించండి?

2. మీ దృష్టిలో ప్రభుత్వరంగ బ్యాంకు సంస్థా పత్రికలు ఉండాల్సిన ప్రస్తావనలు (contents) ఏవి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులు మించకుండా సమాధానం రాయండి.

1. సంస్థా పత్రికలకు రాసేటప్పుడు దృష్టిలో వుంచుకోవలసిన మార్గదర్శకాలను చర్చించండి?

2. బాహ్య సంస్థా పత్రికలు?

**- సి.వి. నరసింహారెడ్డి**

BRAOU

# ఖండం - 5

# విన్యాసం, నమూనా - అలంకరణ, ముద్రణ

పత్రికా నిర్వహణలో రచన ఎంత ముఖ్యమో ముద్రణ కూడా అంతే ముఖ్యం. ముద్రణ అంటే కేవలం అచ్చువేయడం అనికాదు. ముద్రణ ప్రక్రియలో అనేక అంశాలు ఇమిడి వుంటాయి. ఫాంట్లు ఎంపిక మొదలుకుని అక్షరాలను కూర్చేవరకు వివిధ దశల్లో ముద్రణ ప్రక్రియ కొనసాగుతుంది. జర్నలిజం విద్యార్థులకు, వృత్తిలో ఉన్నవారికి ముద్రణకు సంబంధించిన అవగాహన తప్పనిసరి. ఈ ఖండంలో ముద్రణా ప్రక్రియకు సంబంధించిన వివిధ దశలను వివరించడం జరిగింది. **1.** పేజీ అలంకరణ మెలకువలు **2.** ముద్రణ పద్ధతులు, ప్రక్రియలు **3.** ముద్రణలో కంప్యూటర్ల పాత్ర **4.** గ్రాఫిక్ రూపకల్పన, నిర్మాణం **5.** తెలుగు ఫాంట్లు - వికాసం **6.** విన్యాసం నమూనా - కీలకాంశాలు.

ఈ భాగాలను చదివితే ముద్రణలో ఇమిడివున్న అంశాలు బోధపడతాయి. వీటితో సమకాలిన పత్రికల్లో వస్తోన్న ముద్రణ మార్పులు పరిశీలించండి. కొత్త మెలకువలు నేర్చుకోవడానికి, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మార్పునకు లోనవుతున్న విన్యాసాలను, నమూనాను అర్థంచేసుకోవడానికి ఈ ఖండం దోహదపడుతుంది.

BRAOU

BRAOU

# భాగం - 24 : పత్రికల్లో పేజీ అలంకరణ - మెలకువలు

## విషయక్రమం


24.0 ఉద్దేశం

24.1 ప్రవేశిక

24.2 అలంకరణ అంటే?

24.3 అలంకరణ - దాని ప్రాధాన్యం

24.4 అలంకరణ సూత్రాలు

24.5 దినపత్రికల్లో తొలి పేజీ అలంకరణ

24.6 టాబ్లాయిడ్ పత్రికల్లో పేజీ అలంకరణ

24.7 కాలిక పత్రికల్లో అలంకరణ

24.8 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

24.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 24.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- అలంకరణ అంటే ఏమిటి?
- అలంకరణ ప్రాధాన్యం
- అలంకరణ సూత్రాలు
- వివిధ రకాల పత్రికల్లో అలంకరణ గురించి తెలుసుకుంటారు.

## 24.1 ప్రవేశిక

మనిషి అందంగా వున్నప్పటికీ కొద్దిగా అలంకరించుకున్నట్టయితే ఆ అందం ద్విగుణీకృతమవుతుంది. అందంగా వున్న ఇంటికి కొద్దిగా అలంకరణ చేసినట్టయితే ఆ ఇంటి అందం ఇనుమడిస్తుంది. అందంగా వున్న ప్రతీదీ జనాన్ని ఇట్టే ఆకర్షిస్తుంది. సమాచారం అందించే పత్రికలకు అందం, ఆకర్షణ ఏమిటి? అవి ఎందుకు? అనే ప్రశ్నలు పాతకాలం నాటివి. ఈ రోజుల్లో ఏ వస్తువును లేదా ఉత్పత్తిని అమ్మాలన్నా అది ముందు ఆకర్షణీయంగా వుండాలి. దాని తర్వాతే ఆ వస్తువు మంచి చెడ్డలు, గుణగణాలు పరిశీలనకు వస్తాయి. ప్రజలను ఆకర్షించడంలో ఆ వస్తువు ఎంత మంచిదైనా, ఎంత తాజా సమాచారం అందించే పత్రికయినా ఆకర్షణీయంగా లేనట్టయితే అది ప్రజల దృష్టిని ఆకర్షించదు. ప్రజల దృష్టిని ఆకర్షించలేనప్పుడు ఎంత తాజా సమాచారం వున్నప్పటికీ ప్రయోజనం వుండదు. తాజా సమాచారం అందించే పత్రికకు కొద్ది అలంకరణ తోడైనట్టయితే అది బంగారానికి తావి అబ్బినట్టు వుంటుంది. అప్పుడే అది ప్రజల్లోకి చొచ్చుకు వెళ్తుంది.

BRAOU

## 24.2 అలంకరణ అంటే?

అలంకరణ ఆదికాలం నాటిదైనా అలంకరణ పదం (మేకప్) కావ్యాలలో కనిపించి తరువాత రంగస్థలంలో మరింత విస్తృతికి వచ్చిందే. రంగస్థలంపై నటించే వ్యక్తులకు (పాత్రలకు) అలంకరణ చేయడం లాంటిదే పత్రికల పేజీలకు అలంకరణ చేయడం.

అలంకరణ ప్రధానోద్దేశం :

1. చూపుతోనే పాఠకుడిని ఆకర్షించడం
2. ప్రధాన వార్తలను సులభంగా గుర్తించడం
3. ఆ రోజు అత్యంత ప్రధానమైన వార్తను హైలైట్ చేయడం
4. మంచి శీర్షికలతో పాఠకుడిని ఆకర్షించడం

అలంకరణ అనేది ఎడిటింగ్‌లో భాగం. చాలామందికి పత్రికల్లో పనిచేస్తున్న వారికి సైతం అలంకరణ ఎడిటింగ్ వేర్వేరనే భావన వుంది. కానీ అది సరికాదు. మంచి అలంకరణ అనేది మంచి ఎడిటింగ్ అవుతుంది. వార్తను చూడగానే దాని ప్రాధాన్యమేమిటి? దాన్ని ఎంత రాయాలి? ఎలాంటి శీర్షిక, ఎన్ని వరుసలు పెట్టాలి? ఆ వార్తను ఏ పేజీలో ఎక్కడ, ఎంత స్థలంలో పెడితే అందంగా వుంటుంది? ఇత్యాది విషయాలన్నీ సబ్ ఎడిటర్ చెప్పగలిగి వుండాలి. పత్రికల్లో పేజీల అలంకరణ ప్రధాన ఉప సంపాదకుడు చేస్తుంటాడు. అన్ని పేజీలు అలంకరించడం అతనొక్కనికి సాధ్యం కాదు కనుక లోపలి పేజీల అలంకరణను ఆసక్తి కలిగిన ఉపసంపాదకునికి అప్పగిస్తాడు. అతను మాత్రం తొలి పేజీ అలంకరణ చూసుకుంటాడు. అయితే ఒకటి, రెండు పత్రికల్లో తప్ప మిగిలిన అన్ని చోట్ల సబ్ ఎడిటర్లు, కొత్తగా చేరిన, అంతగా అనుభవం లేని పార్ట్‌టైమ్ సబ్ ఎడిటర్లు కూడా పేజీల అలంకరణ చేస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' పత్రికలో న్యూస్ డెస్క్, మేకప్ డెస్క్ వేర్వేరుగా వున్నాయి. న్యూస్ డెస్క్‌లో వున్న సీనియర్ లేదా చీఫ్ సబ్ ఎడిటర్ చెప్పిన ప్రాధాన్యాల ఆధారంగా మేకప్ డెస్క్‌లో వుండే సబ్ ఎడిటర్ లేదా సీనియర్ సబ్ ఎడిటర్ పేజీల అలంకరణ చేస్తారు. దీనివల్ల అలంకరణపై ఎక్కువ దృష్టి పెట్టవచ్చని ఒక వాదన వుంది. న్యూస్ డెస్క్‌ను నిర్వహించే వ్యక్తే అలంకరణ కూడా చూసినట్టయితే పేజీలు బావుంటాయని మరో వాదన.

అలంకరణ అంటే రంగులు పూయడమేనా? అవునని చాలా మంది భావిస్తుంటారు. రంగులు పూయడమొక్కటే అలంకరణ ఎన్నటికీ కాదు. అలంకరణ అనేది విషయం (Content), రూపు (Form) ల సమ్మేళనం. వాటిలో ఏది లోపించినా అసంపూర్తిగానే వుంటుంది. అలంకరణ బాగుందని ఎవరైనా మెచ్చుకున్నారంటే ఆ పత్రికలో విషయం సరైనరీతిలో లేదన్నమాట. అలంకరణ అనేది అసలు విషయాన్ని మింగేయరాదు. విషయాన్ని మరింత స్పష్టపర్చేందుకు మాత్రమే అలంకరణ తోడ్పడాలి.

## 24.3 అలంకరణ - దాని ప్రాధాన్యం

పూర్వకాలం పత్రికలు ఎంత ఎక్కువ సమాచారం అందజేస్తున్నామనే దానిపైనే దృష్టి కేంద్రీకరించేవి. అప్పటి సంపాదకులు అలంకరణను అసలు పట్టించుకునేవారు కాదు. అలంకరణ అనే విషయమే వారి దృష్టికి రాలేదని కూడా చెప్పుకోవచ్చు. ఆ కాలంలో వ్యాపార ప్రకటనలు తొలి పేజీ నిండా వుండేవి. వార్తలకు చోటు తక్కువ. జాతిపిత మహాత్మాగాంధీ దారుణ హత్యకు గురైనప్పుడు సుప్రసిద్ధ దినపత్రిక 'ది హిందూ' ఆ వార్తను లోపలి పేజీలో సింగిల్ కాలమ్‌గా వేసిందని తెలిసినప్పుడు ఆశ్చర్యం కలగక మానదు. కానీ అది నిజం. ప్రతి రోజులాగే ఆ దురదృష్టకరమైన రోజుకూడా తొలి పేజీ నిండా వ్యాపార ప్రకటనలే వున్నాయి. కానీ ప్రస్తుతం కాలం మారింది. కాలంతో పాటు పాఠకులూ మారారు. పాఠకుల అభిరుచికి అనుగుణంగా పత్రికలూ మారక తప్పలేదు.

BRAOU

ప్రస్తుతం పత్రికల్లో వార్తలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అలంకరణకు కూడా అంతే ప్రాముఖ్యం ఇస్తున్నారు. పోటీలో లేని ఏవో ఒకటిరెండు పత్రికలు మినహా మిగిలిన పత్రికలన్నీ అలంకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. ఏ అలంకరణ పాఠకులను ఆకర్షిస్తుందనే విషయంపై నిరంతరం పరిశోధనలు జరుగుతూనే వున్నాయి. పాఠకుల అభిరుచి తెలుసుకునేందుకు సర్వేలు జరిపి వారి అభిప్రాయాలకు అనుగుణంగా తమ అలంకరణ పద్ధతులను మార్చుకుంటున్నాయి. నేటి పోటీ ప్రపంచంలో వినియోగదారుణ్ణి ఆకర్షించడం ఒక్కటే ఉత్పత్తిదారుల లక్ష్యం. పత్రికలు అందుకు భిన్నంకావు. పాఠకుల్లో వస్తున్న మార్పును పసిగట్టే 'ది హిందూ', 'టైమ్స్ ఆఫ్ ఇండియా' మాడ్యులర్ అలంకరణ విధానాన్ని అవలంబిస్తున్నాయి. టెలిగ్రాఫ్ ప్రారంభం నుంచీ అదే విధానాన్ని అనుసరిస్తోంది. తెలుగులో 'ఈనాడు' ఈ ఆధునిక విధానాన్ని అవలంబిస్తోంది. 'ఆంధ్రజ్యోతి' సమతల అలంకరణ పద్ధతి పాటిస్తోంది. నిజానికి తెలుగు పత్రికల్లో, ఈనాడు మినహా మరే పత్రికకూ అలంకరణ విధానమనేది లేదని చెప్పకోవచ్చు. తెలుగు పత్రికల్లో అలంకరణ విషయంలో చెప్పకోదగ్గ పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త సిటీ టాబ్లాయిడ్.

## 24.4 అలంకరణ సూత్రాలు

అలంకరణ ఫలానా విధంగా మాత్రమే వుండాలని చెప్పడం వల్ల అలంకరణ అసలు లక్ష్యమే దెబ్బతింటుంది. ఎప్పటికప్పుడు కొత్తదనంతో కూడిన అలంకరణే పాఠకులను ఆకర్షిస్తుంది. అయినప్పటికీ అలంకరణ విషయంలో పాటించదగినవి కొన్ని సూత్రాలు వున్నాయి.

1. పేజీ పై భాగంలో శీర్షికలను కలగలిసేలా పెట్టకూడదు. దీనివల్ల ఒక వార్త ప్రాధాన్యాన్ని మరోటి దెబ్బతీస్తుంది. చదవడం పాఠకునికి ఇబ్బందికరంగా వుంటుంది.
2. పేజీ కింది భాగంతో సహా ఎక్కడైనా శీర్షికలను కలగలిసేలా పెట్టి గందరగోళంగా తయారు చేయకూడదు.
3. ఒకే పాయింటు సైజుగల శీర్షికలను పక్కపక్కనే పెట్టకూడదు. దీనివల్ల పాఠకుడు చికాకు పడే అవకాశముంది.
4. ఒకే పాయింటు లేదా ఒకే అక్షర స్వరూపం (టైప్ ఫేస్) గల శీర్షికలను పేజీనిండా పరచరాదు. భిన్నత్వం లేని శీర్షికలతో కూడిన పేజీ ఆసక్తికరంగా వుండదు.
5. భిన్న రకాలైన టైపులను (ఫాంట్లను) వాడాలి. పేజీలో ఒక్కటి రెండు మానవీయ వార్తలు వుండాలి.
6. ఆ పేజీలో ప్రాధాన్యంగల వార్తకు ప్రత్యేకమైన శీర్షిక పెట్టి పైన అలంకరణ చేయాలి.
7. వార్తల ప్రాధాన్యాన్ని బట్టి శీర్షికల పరిమాణం వుండాలి.
8. పేజీ మడతలో శీర్షికలు, ఫోటోలు రాకుండా చూడాలి. వ్యాపార ప్రకటనల పక్కనే ఫొటోలు, చిత్రాలు, గ్రాఫులు రాకుండా చూడాలి. వ్యాపార ప్రకటనల కారణంగా అవి ప్రాధాన్యం కోల్పోతాయి.
9. పేజీని నాలుగు సమ భాగాలుగా భావించుకుని ఒక్కో భాగంలో కనీసం ఒక ముఖ్యమైన వార్తయినా వచ్చేలా చూడాలి. దీనివల్ల పేజీలో సమతూకం ఏర్పడి ఆకర్షణీయంగా వుంటుంది.
10. పేజీ అలంకరణ విషయంలో చొరవ ధైర్యం చూపాలి. అప్పుడే పేజీల్లో కొత్తదనం, తాజాదనం వుంటాయి.
11. భిన్నమైన అంటే రాజకీయ, వాణిజ్య, వ్యాపార, క్రీడా, వైజ్ఞానిక, సాంకేతిక, వ్యవసాయ ఇత్యాది వార్తలను ఒక్కో రంగానికి సంబంధించినవి ఒక్కో చోట వచ్చేట్టు చూడాలి.

BRAOU

12. రంగులు పూయడమే అలంకరణ కాదు కనుక వార్తను బట్టి అసలు రంగు, వాడాలా? వద్దా? వాడితే ఏ రంగు ఏ మేరకు వాడాలనేది నిర్ణయించుకోవాలి.

13. శీర్షికలకు బ్లాక్ రివర్సులు, స్క్రీన్‌లు అవసరాన్ని బట్టి ఇచ్చినట్టయితే అలంకరణ బాగుంటుంది.

14. ప్రతి పేజీలో కనీసం ఒక ఫోటో అయినా వుండేట్టు చూడాలి. ఫోటోలు వుండటం వల్ల పాఠకుని కళ్ళు ఎక్కువ శ్రమకు గురికావు.

15. వార్తల్లో అక్షర స్వరూపాలను మార్చడం ద్వారా వార్తలను తద్వారా పేజీలకు తాజాదనం తేవచ్చు.

16. ఎప్పుడూ 10.5 "పైకా"నే కాకుండా 10.3 "పైకా" ఇచ్చి బాక్స్ కొట్టవచ్చు. లేదా ఇటాలిక్స్ ఇవ్వవచ్చు. బోల్డ్‌లో ఇచ్చి వార్తకు "రివర్స్" ఇవ్వవచ్చు.

17. మధ్యలో శీర్షికను పెట్టి చుట్టూ వార్తను పెట్టవచ్చు.

18. వార్త మధ్యలో ఫోటో పెట్టి చుట్టూ బాక్స్ కొట్టవచ్చు.

19. పెద్ద ఫోటోలో సంబంధిత చిన్న ఫోటోను ఇన్‌సర్ట్ చేయడం ద్వారా ఆకర్షించవచ్చు.

20. ఫోటోలను కనీసం మూడు కాలమ్‌లకు తగ్గకుండా వేయడం మంచిది. తెలుగు పత్రికల్లో ఫోటోలను కుదించడమనే దురలవాటు వుంది. ఇది అంత మంచిదికాదు.

21. ఒక్క ఫోటో వేయి మాటల పెట్టు. సంబంధిత వార్తతో ఫోటో వున్నట్టయితే తప్పనిసరిగా పెట్టాలి.

22. లోపలి పేజీల్లో వ్యాపార ప్రకటనలు ఎక్కువగా వుంటాయి. ప్రకటనలు పోను మిగిలిన స్థలానికి సరిపోయే వార్తలే పెట్టాలి. పెద్ద వార్తను పెట్టి మధ్యలో ముగించడం వల్ల పాఠకునికి వార్త పూర్తిగా అర్థం కాదు. ఈ ఇబ్బంది లేకుండా ఆ స్థలంలో అక్కడ సరిపోయే వార్తలు పెట్టడం మంచిది.

23. కాలమ్‌ల మధ్య కొద్దిగా ఖాళీ స్థలం (వైట్ స్పేస్) వదలడం లేదా అవసరానికి అనుగుణంగా సన్నవి లేదా మందం గీతలు కొట్టడం అలంకరణకు తోడ్పడుతుంది.

24. ఒక విషయానికి సంబంధించిన వార్తలన్నీ ఒకే చోట వుండటం వల్ల పాఠకునికి శ్రమ తగ్గుతుంది.

25. సుదీర్ఘమైన వార్తల్లో పాఠకులకు ఆసక్తి వుండదు.

**అభ్యాసం1: అలంకరణ ఎందుకు అవసరం?**

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

BRAOU

## 24.5 దిన పత్రికల్లో తొలి పేజీ అలంకరణ

పత్రిక మొత్తంలో ప్రధానమైంది తొలి పేజీ. ఇది పత్రిక స్వరూపానికీ, సౌందర్యానికీ అద్దం లాంటిది. గడచిన 24 గంటల్లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన ప్రధాన సంఘటనలకు, దుర్ఘటనలకు, సంభవాలకు తొలి పేజీలో స్థానం వుంటుంది. దీన్ని మిగిలిన పేజీలన్నింటికన్నా మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దవలసి వుంటుంది. సాధారణంగా తొలిపేజీలో వర్గీకృత ప్రకటనలు వుండవు. సింగపూర్, హాంకాంగ్ పత్రికల్లోనయితే మొదటి పేజీలో శీర్షికలు తప్ప వార్తలుండవు. జపాన్ పత్రికల మొదటి పేజీ గజిబిజిగా గందరగోళంగా వుంటుంది. కొన్ని అమెరికా పత్రికల తొలి పేజీల్లో వ్యక్తిగత విషయాలు, ప్రకటనలు పత్రికలో ఫోటోలు మాత్రమే వుంటాయి. బైబిల్ పత్రికల్లో ఫొటోలు, శీర్షికలు మాత్రమే వుంటాయి. అసలు వార్తలు లోపలి పేజీల్లో వుంటాయి. కొన్ని పత్రికలు మొదటి పేజీలోనే సంపాదకీయాలు ప్రచురిస్తాయి. కొన్ని పత్రికలు ఆ పేజీలో ప్రకటనలను ప్రచురించవు. కొన్ని పత్రికల్లో బాక్స్ ఐటమ్‌లను మాత్రమే తొలి పేజీలో ప్రచురిస్తారు. అనేక పత్రికలు తొలి పేజీలోని నిలువుగళ్ళ (కాలమ్స్) మధ్య నిలువు గీతలుంచవు. కూపన్ శీర్షిక (మాస్ట్‌హెడ్) సంపుటి, సంచిక, ప్రచురణ స్థలం, తేదీ, సంపాదకుని పేరు, వ్యవస్థాపకుని పేరు వగైరా ప్రధానాంశాలు ఈ పేజీలోనే కనిపిస్తాయి.

దృష్టిపాతం మొదట ఏయే అంశాలను గుర్తిస్తుందో గ్రహించి తొలి పేజీ అలంకరణ చేయాలి. శాస్త్రజ్ఞుల పరిశోధనల ప్రకారం మొదట పై ఎడమ నుంచి కుడికి అక్కడి నుంచి ఈశాన్యం మీదుగా దక్షిణానికి చూపు ప్రసరిస్తుంది. కిందనుంచి దృష్టి రెండు మూడు రకాలుగా పైకి మళ్ళుతుంది. తొలి పేజీ అలంకరణను వార్తా సంపాదకుడు లేదా ప్రధాన సంపాదకుడు పర్యవేక్షిస్తారు. పర్యవేక్షకులు, వృత్తిరీత్యా కాకపోయినా ప్రవృత్తి రీత్యా చిత్రకారులై వుండటం ఉపయోగకరం. తొలి పేజీ అలంకరణ ప్రత్యేక శ్రద్ధతో చేయవలసిన పని కాబట్టి పాఠకుల దృష్టిని మొదట ఏయే అంశాలు ఆకర్షిస్తాయో గ్రహించటం ఎంతో అవసరం. అనేక పరిశోధనల ఫలితంగా ఈ కింది విషయాలను నిపుణులు గమనించి పాత్రికేయులకు సిఫారసు చేశారు. (జర్నలిజం అవగాహన-ఆచరణ- రాంభట్ల కృష్ణమూర్తి)

1. చిన్న అక్షరాలతో వుండే వార్తల కన్నా పెద్ద పరిమాణంలో వుండే పతాక శీర్షిక (బ్యానర్ లేక స్ట్రీమర్)నే ముందుగా చదువుతారు.

2. కూపక శీర్షిక కన్నా మరే శీర్షిక పరిమాణం పెద్దదిగా వుండకూడదు.

3. అంచెలంచెలుగా శీర్షికలు పెట్టినప్పుడు అన్నింటికన్నా పైనున్న పంక్తినే ముందుగా చదువుతారు. కాబట్టి అత్యంత ప్రధాన సార్వత్రికాంశాన్ని అన్నింటికన్నా పైనున్న అంచెలో రాయటం అవసరం.

4. సీదాసాదాగా వుండే రోమకాక్షరాలకన్నా (రోమన్ లెటర్స్) ముందు పక్కలు వాలి వుండే ఇటాలియన్ అక్షరాలను ఎక్కువగా చదువుతారు.

5. నిలువు గడి (కాలమ్) పొడవునా పైనుంచి కిందకి ఏకాంతంగా కనిపించే వార్తా కథనం కన్నా ముందు రెండు మూడు నిలువు గళ్ళు వెడల్పున సమతలంగా (Horizontal) అమర్చిన కథనాన్ని చదువుతారు. లంబ విన్యాసం (Vertical) కన్నా సమతల విన్యాసం అందంగా కనిపిస్తుంది.

6. వార్తా కథనాన్ని మధ్యలో ఆపి తరువాయి భాగం. మరో పేజీలో చూడవచ్చునన్న నిర్దేశం పాఠకులను విసిగిస్తుంది. సాధ్యమైనంత వరకు తొలి పేజీలో గళ్ళు మార్చటం గానీ, తరువాయి భాగాలుగా మరో పేజీలో పూర్తి చేయటం గాని పరిహరించడం మంచిది. విధిలేని పరిస్థితిలో వార్తా కథనంలో మిగిలిన భాగాన్ని మరో పేజీలో ప్రచురించవలసి వస్తే అది సులభంగా, స్పష్టంగా కనిపించేటట్లు అమర్చాలి.

7. సమతల విన్యాసంతో ప్రచురించే కథనాలయినా రెండు మూడు నిలువు గళ్ళు వెడల్పును అధిగమించడం తగదు.

BRAOU

8. అత్యంత ప్రధానమైన వార్తా కథనాన్ని పెద్ద అక్షరాల శీర్షికతో తొలిపేజీ ఎడమ భాగంలో మడతకుపైన అమర్చాలి. అలాగే దానికి రాసిన పరిచయాన్ని కూడా వార్తా శరీరానికి వాడిన అక్షరాల కన్నా పెద్ద పరిమాణంలో వున్న వాటితో ప్రదర్శించాలి.

9. అత్యంత ప్రధాన వార్తా కథనంతో సంబంధంలేని ప్రముఖ చిత్రానికి తర్వాతి ప్రత్యేక స్థానమివ్వాలి. అంటే తొలి పేజీ కుడి భాగంలో మడతపై స్థానాన్ని దానికి కేటాయించాలి.

10. బుద్ధిపూర్వకంగా సాధించిన అసౌష్ఠవం తొలి పేజీని మరింత సజీవంగా, ఉత్తేజకరంగా అలంకరిస్తుంది.

11. తొలిపేజీ కిందికి రానురాను భారం అధికం కాకూడదు. అది కూడా ఒక వైపు పెరిగి మరో వైపు తగ్గకూడదు.

12. అత్యంత సంక్లిష్టమైన పద్ధతులను పాటించకూడదు. అందుకు చాలా సమయం వెచ్చించవలసి వస్తుంది. అకస్మాత్తుగా మార్పులు చేయవలసి వస్తే అత్యలంకరణ ఇబ్బంది పెడుతుంది.

13. మడత కింది భాగం పైభాగమెంత ప్రాధాన్యం కలదని గుర్తించాలి. మడత కింద ద్వితీయ ప్రాధాన్యంగల కథనాన్ని అమర్చడం మంచిది. కథనాన్ని రెండు మూడు నిలువుగళ్ళలో సర్దేటప్పుడు అవి ప్రతి అడుగునా సమతలంలో సమాన దైర్ఘ్యం వుండేట్లు సరిచూసుకోవాలి.

14. పేజీ అడుగున సమతల విన్యాసం చూడముచ్చటగా ప్రయోజనవంతంగా వుంటుంది.

15. రెండు నిలువు గళ్ళ వెడల్పున్న రెండు కథనాలను ఒక దానికి కింద మరొకటి అర్థరహితంగా అమర్చకూడదు.

16. సౌష్ఠవం కోసం ఒక నిలువుగడి పక్కన మరొకటిగా అమర్చడం బావుంటుంది.

17. అన్ని వార్తలను మొదటి పేజీలోనే పెట్టాలని ప్రయత్నించడం మంచిది కాదు.

18. ఎక్కువ వార్తలను మొదటి పేజీలో పెట్టడం వల్ల గజిబిజిగా, గందరగోళంగా తయారవుతుంది.

19. తక్కువ వార్తలను సంపూర్ణంగా పెట్టడం వల్ల అందం వస్తుంది. ఆరు నుంచి ఎనిమిది వార్తల కన్నా ఎక్కువ పెట్టరాదు.

20. తొలి పేజీలో కనీసం మూడు కాలమ్‌లకు తక్కువ కాని ఫోటో వుండేలా చూడాలి. గరిష్ఠంగా మూడు ఫోటోల వరకు పెట్టవచ్చు.

21. శీర్షికలకు రకరకాల పాయింట్ సైజులు వాడాలి. ఒకే పాయింటు సైజున్న శీర్షికలను వరుసగా పెట్టడం మంచిది కాదు.

22. రకరకాల అక్షర స్వరూపాలను విరివిగా వాడుకోవాలి. వాటివల్ల పేజీలో నూతనత్వం వస్తుంది.

23. అతిగా రంగులు వాడి చేసే అలంకరణ పాఠకునికి శ్రమ కలిగిస్తుంది.

24. వార్తలను బట్టి రంగులు వాడటం మంచిది. విషాద వార్తకు పసుపు, వినోద వార్తకు నలుపురంగు వాడటం సరైంది కాదు.

25. స్క్రీన్‌లు, రివర్సులు కూడా మోతాదు మించి ఇవ్వరాదు.

26. భిన్న రకాలైన ఫాంట్లతో కూడిన శీర్షికలు వాడాలి.

27. వార్తలకు సంబంధించి కాలమ్ సైజులు వైవిధ్యంతో ఉంటే బావుంటుంది.

28. చిన్న చిన్న పేరాలు, సబ్ హెడ్డింగులు వున్నట్టయితే శ్రమ వుండదు.

29. ఏ విశేషమూ తెలపని సబ్ హెడ్డింగుల బదులు వార్తలో ప్రాముఖ్యం కలిగిన ఏదో ఒక విషయాన్ని తీసుకుని వ్యాఖ్య రూపంలో పెట్టడం బాగుంటుంది.

BRAOU

30. వార్త అరంభంలో లీడ్ పెద్ద పాయింటులో, విషయం సాధారణ పాయింట్‌లో ఇవ్వడం వల్ల రెండింటి సైకాలు మార్చడం వల్ల పాఠకుడు ఆసక్తిగా చదివే అవకాశం వుంటుంది.

## 24.6 టాబ్లాయిడ్ పత్రికల్లో పేజీ అలంకరణ

మన దేశంలో ఇటీవల టాబ్లాయిడ్స్ (చిన్నసైజు పత్రికలు- వాటి సైజు దినపత్రికల సైజులో సగం)కు ఆదరణ పెరుగుతోంది. ఇంగ్లండ్ టాబ్లాయిడ్‌ల సంస్కృతి మన దేశంలో లేదు. అమెరికా, బ్రిటన్‌లలో వున్న స్థాయిలో మన దేశంలో టాబ్లాయిడ్స్ లేవు. మన దేశంలో చాలా కాలం నుంచి వున్నదీ, పేరు పొందినదీ 'బ్లిట్జ్' టాబ్లాయిడ్. ఇటీవల బొంబాయిలో 'మిడ్‌డే' టాబ్లాయిడ్‌కు ఆదరణ లభిస్తోంది. మన తెలుగులో టాబ్లాయిడ్స్ విడిగా పెద్ద సంఖ్యలో లేవు. అయితే దిన పత్రికల అనుబంధాలుగా వెలువడుతున్నాయి. ఈనాడు, ఆంధ్రజ్యోతి, వార్త దినపత్రికలు జిల్లా, సిటీ ఎడిషన్లు టాబ్లాయిడ్స్ వేస్తున్నాయి. పేరుకు అనుబంధాలే అయినా అవి స్వతంత్ర పత్రికల స్థాయిలో వుంటున్నాయి.

టాబ్లాయిడ్ పేజీల అలంకరణ బ్రాడ్‌షీట్ సైజులో వుండే దినపత్రికల పేజీల అలంకరణకు భిన్నంగా వుంటుంది. పెద్ద సైజు దినపత్రికల్లో అలంకరణకు ఎక్కువ అవకాశముంటుంది. టాబ్లాయిడ్స్‌లో స్థలం తక్కువగా వున్నప్పటికీ ప్రయోగాలకు అనువుగా వుంటుంది. టాబ్లాయిడ్స్‌లో మూడు లేదా నాలుగు కాలమ్స్ మాత్రమే వుంటాయి. వార్తలు కూడా మొదటి పేజీలో మూడు లేదా నాలుగు కన్నా ఎక్కువ వేయడం కష్టం. టాబ్లాయిడ్స్‌లో ఎక్కువగా మాడ్యులర్ అలంకరణ వుంటుంది. పత్రిక పరిమాణమే అలా వుంటుంది గనుక చాలా పత్రికల్లో మాడ్యులర్ అలంకరణ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. టాబ్లాయిడ్ పత్రికలు దిన పత్రికలకు, మ్యాగజైన్లకు మధ్యలో వుంటాయి. టాబ్లాయిడ్ పత్రికలు మ్యాగజైన్ అలంకరణను పాటించినట్లయితే పాఠకులను ఎక్కువగా ఆకర్షించే అవకాశముంది. టాబ్లాయిడ్‌ను సాధారణ దినపత్రిక కన్నా భిన్నంగా వుండేలా చూడాలి. అలంకరణ విషయంలో అమెరికన్ టాబ్లాయిడ్స్‌ను చూసినట్టయితే- న్యూస్‌డే అనే టాబ్లాయిడ్ తమ మొదటి పేజీని పోస్టర్‌లాగా ఉపయోగిస్తుంది. అసాధారణ పరిస్థితుల్లో తప్ప ఏ రోజూ మొదటి పేజీలో ఎలాంటి వార్తలనూ ప్రచురించదు. ఒక పెద్ద ఫోటో వేసి లోపలి పేజీల్లో వున్న నాలుగైదు వార్తలను సూచిస్తుంది. ద డెయిలీ న్యూస్, సన్‌టైమ్స్, పత్రికలు మామూలు దినపత్రికల్లానే ప్రధాన వార్తలను ప్రచురిస్తాయి. లోపలి పేజీల్లో వున్న వార్తలను సూచిస్తాయి. క్రిస్టియన్ సైన్స్ మానిటర్ మామూలు దిన పత్రిక లాగానే వుంటుంది.

BRAOU

### టాబ్లాయిడ్ అలంకరణ

1. తొలి పేజీలో పెద్ద ఫోటోవేసి లోపలి పేజీల్లో వున్న వార్తలను సూచించవచ్చు.
2. ఒక ఫోటో వేసి రెండు మూడు వార్తల భాగాలను ప్రచురించి తరువాయి భాగాల్లో ఇవ్వవచ్చు.
3. గరిష్టంగా నాలుగు వార్తల వరకు తొలి పేజీలో వేయవచ్చు.
4. వార్తలను మధ్యలోఆపి తరువాయి పేజీల్లోకి కంటిన్యుయేషన్ సాధ్యమైనంతవరకు ఇవ్వకూడదు.
5. పాఠకులు మొదటి పేజీ తర్వాత చూసేది మూడో పేజీ కనుక ఆ పేజీలో ముఖ్యమైన వార్తలను ప్రచురించాలి.
6. మధ్య పేజీలను సెంటర్ స్ప్రెడ్‌గా వాడడం వల్ల స్థలం కలసివస్తుంది. పెద్ద ఫోటోలను ప్రచురించవచ్చు. ఎక్కువ సమాచారాన్ని ఇవ్వవచ్చు.
7. కాలమ్స్ మధ్య ఖాళీ స్థలం (వైట్ స్పేస్) ఇవ్వడం వల్ల పేజీ అందం పెరుగుతుంది.
8. పేజీలో స్థలం గురించి చింతించకుండా వార్తను ప్రారంభించినప్పుడు పెద్ద అక్షరంతో మొదలుపెట్టాలి.
9. ఫోటోలను సాధారణ పద్ధతిలో కాక గుండ్రంగా లేదా ముక్కలుగా చేసి అతికించి లేదా నెగిటివ్ రూపంలో ప్రచురించడం వల్ల ఆకర్షణ పెరుగుతుంది.

10. చివరి పేజీకి కూడా ప్రాధాన్యముంది కనుక దాన్నీ తొలిపేజీ అంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.

11. భిన్నమైన అక్షర స్వరూపాలను వాడడం ద్వారా పత్రికను భిన్నంగా తీసుకురావాలి.

12. పెట్టే శీర్షికలు, వాడే రంగులు, ప్రచురించే ఫోటోల్లో ప్రత్యేకత కనబర్చడం ద్వారా పత్రికకు భిన్నమైన రూపు కల్పించాలి.

**అభ్యాసం-2: దినపత్రికకు, టాబ్లాయిడ్‌కు పేజీ అలంకరణలో గల తేడా ఏమిటి?**

............................................................................................................................................

............................................................................................................................................

............................................................................................................................................

............................................................................................................................................

............................................................................................................................................

## 24.7 కాలిక పత్రికల్లో అలంకరణ

కాలిక పత్రికల్లో అలంకరణకు బోలెడంత అవకాశం వుంటుంది. అందుకు తగిన సమయం కూడా వుంటుంది. కాలిక పత్రికల్లో ఎక్కువగా లంబ విన్యాసం వుంటుంది.

1. పేజీలో ఖాళీస్థలం వృథా అవుతుందని భావించి అలంకరణ చేయాలి.
2. ఫోటోలను రకరకాల పరిమాణాల్లో వేయాలి.
3. రంగులను విరివిగా వాడవచ్చు.
4. అక్షర స్వరూపాలతో అనేక ప్రయోగాలు చేయవచ్చు.
5. ఒక పేజీలో ఇన్ని కాలమ్స్ వుండాలనే నిబంధన వుండదు గనుక ఇష్టం వచ్చిన వైనంలో కథనాలకు ఇవ్వవచ్చు.
6. గ్రాఫులు, రేఖా చిత్రాలు, వ్యంగ్య చిత్రాలు విరివిగా వాడవచ్చు.
7. కథనం ప్రారంభించినప్పుడు పెద్ద అక్షరాలను వాడటంద్వారా పాఠకులను ఆకర్షించవచ్చు.
8. కాలిక పత్రికల అలంకరణకు విధి నిషేధాలేవీ లేనందున మన ఊహలకు అనుగుణమైన అలంకరణ చేసేందుకు ప్రయత్నించవచ్చు.

ఇక ప్రత్యేక పత్రికలు అంటే సినిమా, క్రీడల పత్రికల్లో ఫోటోలను ఎక్కువగా ప్రచురించడం ద్వారా పాఠకులను ఆకట్టుకోవచ్చు. కవర్‌పేజీపైన కంటికి ఇంపైన ఫోటోలు వేయాలి. లోపలి పేజీల్లో అలంకరణకు విస్తృతావకాశముంటుంది. రంగులు, గీతలు, ఖాళీస్థలం, ఫోటోలు, శీర్షికల ద్వారా అలంకరణ చేయవచ్చు.

## 24.8 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ పాఠకులను ఆకర్షించేందుకు పత్రికలకు అలంకరణ అవసరం.

★ తాజా వార్తలు, అలంకరణ కలిగిన పత్రికలు ప్రజల్లోకి చొచ్చుకుపోతాయి.

BRAOU

★ అలంకరణ అంటే రంగులు పూయడం కాదు.

★ అలంకరణ కూడా ఎడిటింగ్‌లో భాగమే.

★ లోపలి పేజీల కన్నా తొలి పేజీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.

★ అలంకరణకు కొన్ని సూత్రాలు పాటించినట్టయితే మంచిది.

★ టాబ్లాయిడ్ మేగజైన్ల అలంకరణ దిన పత్రికల అలంకరణ కన్నా భిన్నమైంది.

## 24.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. అలంకరణ సూత్రాలు ఏవి?
2. తొలి పేజీ అలంకరణ గురించి తెలపండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులు మించకుండా సమాధానాలు ఇయ్యండి.

1. అలంకరణ అంటే ఏమిటి?
2. అలంకరణ ప్రాధాన్యాన్ని వివరించండి?

BRAOU

కె. శివశంకర్

# భాగం - 25 : ముద్రణ పద్ధతులు - ముద్రణ ప్రక్రియలు

## విషయక్రమం


25.0 ఉద్దేశం

25.1 ప్రవేశిక

25.2 ముద్రణ అంటే ఏమిటి?

25.3 ముద్రణ చరిత్ర

25.4 ముద్రణ పద్ధతులు

25.4.1. లెటర్ ప్రెస్

25.4.2. ఆఫ్‌సెట్ ప్రింటింగ్

25.4.3. గ్రవ్యూర్ ప్రింటింగ్

25.4.4 స్క్రీన్ ప్రింటింగ్

25.5 ముఖ్య విషయాలు గుర్తుదాం

25.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 25.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చది...రు.

- ముద్రణ అంటే ఏ...
- ముద్రణ చరిత్ర...
- ముద్రణ పద్ధ...

## 25.1 ప్రవేశిక

జ్ఞాన స...ం భద్రపరచడంలో అత్యధిక సంఖ్యాకులకు తక్కువ వ్యయ ప్రయాసలతో అందించడంలో ...ంది. భావ వ్యక్తీకరణలో ముద్రణ ఒక కీలకమైన మాధ్యమమైంది. స్పష్టమైన సమర్థమైన, శక్తి... అనేది ప్రత్యేకమైన మాధ్యమమని రచయితలు గుర్తించారు. ముద్రణ అనేది శాశ్వత మాధ...స్థానం. ఇతర ప్రసార సాధనాలైన రేడియో, టెలివిజన్ లాంటి వాటితో పోల్చి చూసినట్టయి...నుకూలంగా అందుబాటులో వుండే మాధ్యమం. ఇతర సాధనాల నుంచి కూడా సమాచారా...అనేది మనం కోరినచోట కోరిన సమయంలో సులభంగా అనుకూలంగా లభ్యమ...

...ుకోవడం తప్పనిసరి. ఎందుకంటే రచయితలు తమ రచనలకు కేవలం ...రచనలు ప్రచురితమవ్వాలి. కేవలం ప్రచురితమవ్వడమే కాదు సరైన విధంగా రాసిన అక్షరాల అకృతి, పరిమాణం, పేజీ అలంకరణ మొదలైనవి ఒకరి రచనలను ఆకర్ష...

గుర్తి... వ్యాసాలు పుస్తకాలు వచ్చాయి. సమాచారం ఎలా ప్రసారమవుతుందనే

BRAOU

★ అలంకరణ అంటే రంగులు పూయడం కాదు.

★ అలంకరణ కూడా ఎడిటింగ్‌లో భాగమే.

★ లోపలి పేజీల కన్నా తొలి పేజీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి.

★ అలంకరణకు కొన్ని సూత్రాలు పాటించినట్టయితే మంచిది.

★ టాబ్లాయిడ్ మేగజైన్ల అలంకరణ దిన పత్రికల అలంకరణ కన్నా భిన్నమైంది.

## 24.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. అలంకరణ సూత్రాలు ఏవి?
2. తొలి పేజీ అలంకరణ గురించి తెలపండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులు మించకుండా సమాధానాలు రాయండి.

1. అలంకరణ అంటే ఏమిటి?
2. అలంకరణ ప్రాధాన్యాన్ని వివరించండి?

BRAOU

*- కె. శివశంకర్*

# భాగం - 25 : ముద్రణ పద్ధతులు - ముద్రణ ప్రక్రియలు

## విషయక్రమం

25.0 ఉద్దేశం
25.1 ప్రవేశిక
25.2 ముద్రణ అంటే ఏమిటి?
25.3 ముద్రణ చరిత్ర
25.4 ముద్రణ పద్ధతులు
25.4.1. లెటర్ ప్రెస్
25.4.2. ఆఫ్‌సెట్ ప్రింటింగ్
25.4.3. గ్రవ్యూర్ ప్రింటింగ్
25.4.4 స్క్రీన్ ప్రింటింగ్
25.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
25.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 25.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు.

- ముద్రణ అంటే ఏమిటి?
- ముద్రణ చరిత్ర
- ముద్రణ పద్ధతులు తెలుసుకుంటారు.

BRAOU

## 25.1 ప్రవేశిక

జ్ఞాన సంపదను ముందుతరాలకోసం భద్రపరచడంలో అత్యధిక సంఖ్యాకులకు తక్కువ వ్యయ ప్రయాసలతో అందించడంలో ముద్రణ ఒక ముఖ్య సాధనమైంది. భావ వ్యక్తీకరణలో ముద్రణ ఒక కీలకమైన మాధ్యమమైంది. స్పష్టమైన సమర్థమైన, శక్తివంతమైన వ్యక్తీకరణకు ముద్రణ అనేది ప్రత్యేకమైన మాధ్యమమని రచయితలు గుర్తించారు. ముద్రణ అనేది శాశ్వత మాధ్యమం కనకనే దీనికి ఈ ప్రత్యేకమైన స్థానం. ఇతర ప్రసార సాధనాలైన రేడియో, టెలివిజన్ లాంటి వాటితో పోల్చి చూసినట్లయితే ముద్రణ అనేది చౌకగా త్వరగా అనుకూలంగా అందుబాటులో వుండే మాధ్యమం. ఇతర సాధనాల నుంచి కూడా సమాచారాన్ని పొందవచ్చు.అయితే ముద్రణ అనేది మనం కోరినచోట కోరిన సమయంలో సులభంగా అనుకూలంగా లభ్యమవుతుంది.

ముద్రణ గురించి రచయితలు తెలుసుకోవడం తప్పనిసరి. ఎందుకంటే రచయితలు తమ రచనలకు కేవలం రాసినంత మాత్రాన గుర్తింపు పొందలేరు గనుక. ఆ రచనలు ప్రచురితమవ్వాలి. కేవలం ప్రచురితమవ్వడమే కాదు సరైన విధంగా ఆకర్షణీయంగా ప్రచురితమవ్వాలి. ఉదాహరణకు అక్షరాల ఆకృతి, పరిమాణం, పేజీ అలంకరణ మొదలైనవి ఒకరి రచనలను గుర్తించడంలో దోహదపడతాయి.

ప్రసార రంగం గురించి వేల సంఖ్యలో వ్యాసాలు పుస్తకాలు వచ్చాయి. సమాచారం ఎలా ప్రసారమవుతుందనే

విషయమై శాస్త్రీయ పరిశోధనలు జరిగాయి. ఈ విషయమై ఒక అవగాహనకు వచ్చేందుకుగాను పాశ్చాత్య నాగరికత ఎలా అభివృద్ధి చెందిందనే విషయాన్ని తెలుసుకుందాం. రాయడం, మాట్లాడటం, ఆలోచన ప్రక్రియల ద్వారా భావ వ్యక్తీకరణ. వివిధ రకాల పరిస్థితుల్లో మనం స్పందించే తీరులో మన అభివృద్ధి ద్యోతకమవుతుంది.

నాగరికుడైన మానవుని అభివృద్ధిని మెక్‌లూహన్ నాలుగు దశలుగా విభజించాడు. ఆదిమ సమాజం, లిపి సమాజం, ముద్రణాధిక్యం కలగిన సమాజం, వ్యష్టి సమాజం. ఈ సమాజాల్లో భావ వ్యక్తీకరణ ఆయా సమాజాల అస్తిత్వ పరిరక్షణ కోసం మొదలైందే. ప్రజ్ఞా పాటవాలు, ఆలోచనా పరంపరలు ఇందులోంచి జనించినవే.

ఆదిమ సమాజంలోనే మాట అభివృద్ధి చెందింది. మాటను రాతలోకి మార్చే రోజుల్లో లిపి సమాజం అభివృద్ధి చెందింది. రచనలు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయగల ముద్రణాధిక్య సమాజపు మొట్టమొదటి దశ పునరుజ్జీవన కాలం. వ్యష్టి సమాజంలో ఉపగ్రహాలు, టెలివిజన్, కంప్యూటర్ల ద్వారా అప్పటికప్పుడు భావ వ్యక్తీకరణ చేసుకునే వీలుంది.

ఈ కారణాల వల్ల ముద్రణకు సంబంధించి ముఖ్యమైన సూత్రాలను తెలుసుకోవడం అవసరం. ముద్రణకు అవసరమైన వాటి గురించి, ముద్రణ చరిత్ర గురించి తెలుసుకునే ముందు అసలు ముద్రణ అంటే ఏమిటో తెలుసుకుందాం.

## 25.2 ముద్రణ అంటే ఏమిటి?

ముద్రణ అనేది ఒక కళ. కొంతమంది దీనిని శాస్త్రమని అంటారు. మరికొందరు దీనిని కళ, శాస్త్రం కలగలిసిన విషయమని చెబుతారు. ముద్రణ రంగంలోని వారు ఇది ఒక జీవన విధానం అంటారు. ముద్రణ అనే పదం సామాన్యులకు కూడా తెలిసిన పదమే. నిఘంటువులో అతిగా నిర్లక్ష్యానికి గురైన పదం ముద్రణ అని ముద్రణ రంగంలోని వారు భావిస్తుంటారు.

మనిషి తనచుట్టూ జరుగుతున్న విషయాలను ప్రపంచంలో జరుగుతున్న సంగతులను తెలుసుకునేందుకు ఎక్కువ ఆతృత కనబరుస్తాడు. తాజా రాజకీయాల గురించి తెలుసుకోవాలని తాను, బులియన్ రేట్లు తెలుసుకోవాలని తండ్రి, ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో క్రికెట్ టెస్టులో భారత్ బాగా ఆడుతోందా, లేదా అనే సంగతి తెలుసుకోవాలని కొడుకు ఉత్సుకతతో వుంటారు. ఈ విషయాలన్నింటినీ రేడియో, టెలివిజన్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. అయినంత మాత్రాన వారు పత్రికలను చదవడం మానేస్తారా? ఎప్పటికీ మానేయరు. ముద్రితమైన ప్రతీ అక్షరం సత్యమేనని నానుడి ఇక్కడ వర్తిస్తుంది.

ఆక్సిజన్ లేకుండా మనిషి బతకలేనట్టే ముద్రణ అనేది కూడా ఒక అనివార్యమైన అవసరంగా మారింది. ముద్రణ లేని ప్రపంచాన్ని ఊహించడం అసాధ్యమే. మన రోజువారీ జీవితంలో ముద్రణకున్న ప్రాధాన్యాన్ని తెలియజెప్పే ఉదాహరణ.

మీరు నిద్రనుంచి లేవగానే మీకు ఎదురుగా గోడపై అందంగా రంగుల్లో ముద్రించి బడివున్న క్యాలెండర్ మిమ్మల్ని చిరునవ్వుతో పలకరిస్తుంది. పళ్ళు తోముకోవడానికి బ్రష్ తీస్తే దానిపై ఆ కంపెనీ పేరు ముద్రించి వుంటుంది. టూత్ పేస్టు అక్షరాలు ముద్రించిన ట్యూబులో వుంటుంది. కాఫీ కోసం వెళ్తే కాఫీపొడి కంపెనీ పేరు ముద్రించిన కంటెయినర్‌లో వుంటుంది. అల్పాహారం దగ్గర బ్రెడ్ ముద్రించిన వాక్స్ కోటెడ్ పేపరులో వుంటుంది. బ్రెడ్ కోసం వాడే వెన్న కూడా ముద్రించిన ఫాయిల్ పేపరులో వుంటుంది. భోజనం తర్వాత మీరు వేసుకునే ప్రియమైన వక్కపొడిపై ముద్రించి వుంటుంది. సిగరెట్ పెట్టెలపై పొగతాగడం ఆరోగ్యానికి హానికరం అనే చట్టబద్ధమైన హెచ్చరిక కూడా ముద్రింతమై వుంటుంది. ప్రయాణాల్లో మీరు చదివే పత్రికలు, డాక్యుమెంట్లు ఏదైనా ముద్రించి వుంటాయి. మీరు ఇంటికి రాగానే సినిమాకు వెళ్దామని ఎవరో ఒకరు పట్టుబడతారు. మీరు సినిమా హాలుకు వెళ్ళి చిన్న చిన్న అక్షరాలు ముద్రించిన టిక్కెట్ల కోసం పరుగులు పెడతారు. ఇంటర్‌వెల్‌లో మీరు నమిలే చిప్స్, తినే బిస్కెట్స్ ముద్రించబడిన ప్యాకెట్లలో వుంటాయి. మీరు తాగే శీతల పానీయాల సీసాలపై కూడా మీకిష్టమైన బ్రాండ్ పేరు ముద్రించి వుంటుంది. ఇంటికి వచ్చి విశ్రాంతిగా పడుకునే ముందు ఏదో నవల చదువుతారు. ఈ రకంగా ముద్రణ అనేది మన జీవితాల్లో విడదీయరాని భాగమైంది. ఇదంతా చదివిన తర్వాత మీరు ముద్రణ మన వెంట పడుతోందా? లేక మనమే ముద్రణ వెంట పడుతున్నామా? అని అడగవచ్చు.

BRAOU

## 25.3 ముద్రణ గురించిన సంక్షిప్త చరిత్ర

ముద్రణ అనేది మొదట ఎనిమిది తొమ్మిది శతాబ్దాల్లో చైనాలో ప్రారంభమైంది. చెక్కలపై అక్షరాలు చెక్కి ఇందుకోసం ఉపయోగించేవారు. కొన్ని శతాబ్దాల తర్వాత మట్టితో చేసిన టైపును చైనా పుస్తకాలు రోల్స్ తయారీకి ఉపయోగించారు. యూరప్‌లో ముద్రణను ఎప్పుడు కనుగొన్నారన్న విషయమై కచ్చితమైన తేదీ ఏదీ తెలియదు. జర్మనీకి చెందిన జోహాన్స్ గూటన్‌బర్గ్ 1440-50 మధ్య కాలంలో కదిలే టైపును కనుగొని వాడినట్టు ప్రచారంలో వుంది. 1467లో విలియం కాక్స్‌టన్ ద్వారా ముద్రణ ఇంగ్లండులో ప్రవేశించింది. కాక్స్‌టన్ వెస్ట్ మినిస్టర్‌లో ప్రెస్‌ను ఏర్పాటు చేశారు.

అయితే ముద్రణ రంగానికి సంబంధించి ప్రగతి నత్తనడకన సాగింది. పుస్తకాల్లో శీర్షిక పేజీలు, విభాగాల పేర్లు, ఫోలియోలు లేవు. పేరాలు కలిసిపోయేవి. పదాలు ఒక పద్ధతి లేకుండా లైను చివర అర్ధాంతరంగా అంతమయ్యేవి. 16వ శతాబ్దం ప్రారంభం నుంచి ముద్రణనాణ్యత క్షీణించింది. ఈ పరిస్థితి 19వ శతాబ్దం అఖరివరకు కొనసాగింది. అత్యుత్తమ నాణ్యతతో తక్కువ సంఖ్యలో పుస్తకాలు ప్రచురించడం ద్వారా ఇంగ్లాండుకు చెందిన విలియం మోరిస్ నాణ్యమైన ముద్రణ పునరుద్ధరణకు కారణమయ్యారు.

ముద్రణకు కావలసినవిః ముద్రణకోసం తప్పనిసరిగా కావలసినవి

1. ముద్రణ ఉపరితలం
2. సిరా
3. కాగితం
4. ముద్రణ పరికరం లేదా యంత్రం

ముద్రణ ఉపరితలంః ముద్రణ ఉపరితలం ముద్రణ ప్రక్రియపై ఆధారపడి వుంటుంది. దీని గురించి ఈ పాఠంలో తెలుసుకుంటాం.

BRAOU

## 25.4 ముద్రణ పద్ధతులు

ముద్రణ పద్ధతులు నాలుగు రకాలు. అవి

1. లెటర్ ప్రెస్
2. ఆఫ్‌సెట్
3. గ్రవ్యూర్
4. స్క్రీన్ ప్రింటింగ్

### 25.4.1. లెటర్ ప్రెస్

ఉబ్బెత్తుగా ముద్రణ ఉపరితలం నుంచి సిరా కాగితంపైకి వెళ్ళే ప్రక్రియను లెటర్ ప్రెస్ ముద్రణ పద్ధతి అంటారు. ఈ

ప్రక్రియలో ఇమేజ్ (అక్షరం, గుర్తు, బొమ్మ మొ॥నవి) ముద్రణ రహిత ప్రాంతం కంటె ఉబ్బెత్తుగా వుంటుంది. సిరాను పూసినప్పుడు ముద్రణ ప్రాంతం అంటే ఇమేజ్‌కు మాత్రమే అంటుకుని ఒత్తిడి కారణంగా అది కాగితంపై ముద్రితమవుతుంది.

వివిధ రకాలైన ముద్రణ పద్ధతుల్లో లెటర్ ప్రెస్ పురాతనమైంది. ప్రపంచంలోని మొట్టమొదటి బైబిల్‌ను గుటెన్‌బర్గ్ ఈ ప్రక్రియ ద్వారానే ముద్రించాడు. ముద్రణ రంగంలో లెటర్‌ప్రెస్ రెండు శతాబ్దాల పాటు రాజ్యమేలింది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది దాదాపుగా కనుమరుగయే దశలో వుంది. అతి తక్కువ ఖర్చుకాగల ముద్రణ పద్ధతి లెటర్ ప్రెస్ పద్ధతి. ఎందుకంటే అక్షరాల నేరుగా కాగితంపై అచ్చవుతాయి గనుక. మన దేశంలో 500 సంవత్సరాల తర్వాత కూడా లెటర్ ప్రెస్‌ను ఇంకా విస్తృతంగాఉపయోగిస్తున్నారు. కాకపోతే ఇటీవలి కాలంలో దీని వాడకం తగ్గింది.

లెటర్ ప్రెస్‌లో వున్న ప్రధాన సౌలభ్యం ముద్రణకు వెళ్ళేముందు కూడా అవసరమైన సవరణలు చేయవచ్చు. ఈ విధానంలో వున్న చివరి నిమిషంలో కూడా సవరణలు చేసే సౌకర్యం ఇతర విధానాల్లో లేదు. సాంప్రదాయకమైన పుస్తక ప్రచురణ ఈ పద్ధతి ద్వారానే జరుగుతోంది. తక్కువ పేజీలతో తక్కువ సంఖ్యలో పుస్తకాలు అవసరమైనప్పుడు ఈ లెటర్ ప్రెస్ విధానాన్ని ఉపయోగించుకోవచ్చు. ప్రకటనలు, అమ్మకం సమాచారం వాణిజ్య ప్రకటనలు, కవర్లు, లేబుల్స్. విజిటింగ్ కార్డులు మొదలైనవి లెటర్ ప్రెస్‌ద్వారా చేసుకోవచ్చు. ఇవన్నీ లెటర్ ప్రెస్ ద్వారానే చేయాలని ఏమీ లేదు. ఇతర పద్ధతుల ద్వారా కూడా చేయవచ్చు.

నూతన ముద్రణ పద్ధతులు వచ్చిన నేపథ్యంలో అయిదు శతాబ్దాల పాటు కొనసాగిన లెటర్‌ప్రెస్‌కు 'బ్లాక్ ఆర్ట్' అని పేరు వచ్చింది. లెటర్ ప్రెస్‌లో కాలంచెల్లిన పాత పద్ధతులు అనుసరించడం ఎక్కువ. నల్లసిరాను ఉపయోగించడం కారణంగా ఈ పేరు వచ్చింది. మరో రకంగా చెప్పాలంటే లెటర్‌ప్రెస్ ఇప్పుడు అసహ్యమైన నత్తనడకతోసాగే శ్రమతో కూడిన పద్ధతి. ఎందుకంటే నూతన విధానాల్లో అద్భుతమైన నైపుణ్యం, వేగం పనితీరు వున్నాయి.

లెటర్‌ప్రెస్ లోహపు ముద్రణ ఉపరితలంపై ఆధారపడి వుంది. ఇప్పుడది కాలం చెల్లిన పద్ధతి. కొన్ని ప్రత్యేక రంగాల్లో మాత్రమే ఇది వాణిజ్య పరంగా గిట్టుబాటవుతోంది. మన దేశంలో దీని వాడకం ఇటీవల తగ్గినప్పటికీ ప్రాధాన్యం మాత్రం అలాగే వుందని చెప్పుకోవచ్చు. గుటెన్‌బర్గ్ కాలం నుంచి 15 సంవత్సరాల క్రితం వరకు కూడా లెటర్‌ప్రెస్ ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌ను స్పష్టంగా గుర్తించడానికి వీలయ్యేది.

యాభై అంతకుమించి వయస్సున్న రచయితలకు లెటర్‌ప్రెస్‌తో వారికున్న అనుబంధం మధుర స్మృతులుగా పదిలపర్చుకోదగ్గ దనడంలో ఎలాంటి సందేహం లేదు.

### 25.4.2. ఆఫ్‌సెట్ ప్రింటింగ్

ఆఫ్‌సెట్ ప్రింటింగ్ లిథోగ్రఫీ సూత్రంపై ఆధారపడి వుంది. లిథోగ్రఫీని ప్లానోగ్రఫీ అనికూడా పిలుస్తారు. దీనిని 1798లో అలాయ్ సెనెఫెల్డర్ కనుగొన్నారు. ఈ ముద్రణ ప్రక్రియ యూరప్‌లో శరవేగంగా వ్యాపించింది.

లిథోగ్రఫీ సూత్రం: సెనెఫెల్డర్ మొదట తన పనిని సున్నపు రాయిపైన మొదలుపెట్టాడు. సున్నపురాయి సహజంగానే రంధ్రాలు కలిగి వుండి నీటిని పీల్చుకునే గుణం కలది. రాయి ఉపరితలం జిడ్డు(గ్రీజు)గా వుండటంతో అది సిరాను పీల్చుకుంటుంది. మిగిలిన ప్రాంతాన్ని తేమగా ఉంచినంతవరకు అక్కడ సిరా అంటదు. మనం కోరుకున్న ఇమేజ్‌ను నేరుగా రాయిపై పడేలా చేయవచ్చు. లేదా ముందుగా సిద్ధం చేసుకున్న కాగితం నుంచి రాయిపై పడేలా చేయవచ్చు.

దృశ్యం (ఇమేజ్-అక్షరాలు, గుర్తులు, బొమ్మలు) రహిత, సహిత ప్రాంతాలు సమాన ఉపరితలం కలిగి వుంటాయి. లిథోగ్రఫీలో మూల సూత్రం ఏమిటంటే గ్రీజు, నీరు వికర్షించుకుంటాయి. కనుక ఆఫ్‌సెట్ ప్రింటర్ దృశ్య సహిత.రహిత ప్రాంతాలను ఒకే తలంతో వుంచుతాడు. అదే సమయంలో దృశ్య రహిత ప్రాంతాలను సిరాతో ముద్రణ, ముద్రణేతర

BRAOU

ప్రాంతాలను విడిగా వుంచడంలో తోడ్పడుతుంది. కనుక సిరా పూసినప్పుడు అది దృశ్య ప్రాంతానికే పరిమితమవుతుంది. గ్రీజు సిరాను ఆకర్షిస్తుంది. అలాగే తేమ ప్రాంతం తేమను ఆకర్షిస్తుంది. దృశ్య రహిత ప్రాంతమంతా తేమగా వుంటుంది.

ఆఫ్‌సెట్ పద్ధతిలో పల్చని అల్యూమినియం లేదా పింక్ ప్లేటుపైకి ఇమేజ్‌ను ఫోటో తీయడం ద్వారా బదిలీచేసి రసాయనాలు పూసి ముద్రణ చేస్తారు. ఈ ప్రక్రియలో పల్చని తెల్లని ప్లేట్లపై ముద్రణ పటాలు, ఛార్టులు, కార్టన్, లేబుల్ ముద్రణ పద్ధతులు కూడా అభివృద్ధి చెందాయి. పిల్లల పుస్తకాలు, పుస్తకాల కవర్లు, గ్రీటింగ్‌కార్డులు, పోస్టర్లు, మెయిల్ ఆర్డర్ కేటలాగులు, సాంప్రదాయకమైన పల్చని అట్టగల పుస్తకాల ముద్రణ కూడా జరుగుతోంది. ఆఫ్‌సెట్‌లో టిష్యూ పేపర్‌లాంటి పల్చని కాగితం నుంచి గట్టి అట్ట వరకు కూడా సులువుగా శక్తిమంతంగా ముద్రించవచ్చు.

దేశంలోని అనేక ముద్రణశాలలు ఆఫ్‌సెట్ పద్ధతిని ప్రవేశపెడుతున్నాయి. కొత్త ముద్రణశాలలు ఈ పద్ధతిని ఉపయోగిస్తున్నాయి.

ఆఫ్‌సెట్ రంగం గణనీయంగా అభివృద్ధి చెందింది. అమెరికా, జర్మనీ, జపాన్ దేశాలు వాటంతటవే పనిచేసే రెండు మూడు, నాలుగు, ఆరు రంగులను ముద్రించే యంత్రాలను తయారుచేశారు. ప్రస్తుతం మనకు ఆఫీసులో పెట్టుకునే చిన్నయంత్రం నుంచి పలు రంగులను ముద్రించే భారీ యంత్రాల వరకు అందుబాటులో వున్నాయి. కాగితానికి రెండు వైపులా ముద్రించే యంత్రాలు కూడా వున్నాయి. రీలుతో కూడిన ఆఫ్‌సెట్ యంత్రాల ప్రాధాన్యత లితో ప్రింటింగులో పెరిగింది.

మీడియా రచయితలు వెబ్ ఆఫ్‌సెట్ ముద్రణ గురించి తెలుసుకోవడం తప్పనిసరి. 1961లో అమెరికాలో ప్రారంభమైన ఈ వెబ్ ఆఫ్‌సెట్ ముద్రణ త్వరగా వ్యాప్తి చెందింది. కొద్దికాలంలోనే బ్రిటన్ తదితర యూరప్ దేశాల్లో కూడా ప్రవేశించింది.

వెబ్ ఆఫ్‌సెట్‌లో చిత్రాల పునరుద్ధరణ నాణ్యత బాగా వుంటుంది. చిత్రాన్ని చుక్కలు చుక్కలుగా మార్చడం, సులువైన రంగుల ముద్రణ సులభమైన నిర్వహణ, రంగుల యూనిట్లను అమర్చడం ద్వారా వాణిజ్యపరమైన ఉత్పత్తి పెద్ద ఎత్తున నాణ్యతతో చేయవచ్చు. భారత దేశంలోని అనేక పత్రికలు వెబ్ ఆఫ్‌సెట్ యంత్రాలను ఉపయోగిస్తున్నాయి. మొదట్లో ఇవి ఆంగ్ల పత్రికలకే పరిమితమైనప్పటికీ ఇప్పుడు భాషా పత్రికలు సైతం వాటిని వాడుతున్నాయి.

వెబ్ ఆఫ్‌సెట్ యంత్రాల ద్వారా అన్ని రకాల ముద్రణ పనులు చేయవచ్చు. పుస్తకాల ప్రచురణ, వార్తా పత్రికల ముద్రణ ప్రత్యేకమైన ముద్రణ పనులకు వీటిని ఉపయోగిస్తున్నారు.

BRAOU

### 25.4.3. గ్రవ్యూర్ ముద్రణ

గ్రవ్యూర్ ముద్రణ పద్ధతిని ఇంటాగ్లియో అని కూడా అంటారు. దీనిని కార్లక్లెష్ అనే వ్యక్తి కనుగొన్నారు. ఈ పద్ధతిలో ముద్రణ ప్రాంతం లోపలికి వుంటుంది. సిరా కాగితంపైకి వెళ్ళేముందు ఈ లోతైన ప్రాంతంలోకి వెళ్తుంది. ముద్రణ రహిత ప్రాంతం ముద్రణ ప్రాంతం కన్నా ఎత్తులో వుంటుంది. అంటే గ్రవ్యు పద్ధతి లెటర్ ప్రెస్ పద్ధతికి పూర్తిగా భిన్నమైంది. గ్రవ్యు పద్ధతిలో ఉపయోగించే సిరా చాలాపల్చగా వుండి గ్రవ్యు ప్లేట్ లేదా సిలిండర్‌లోని లోతైన ప్రాంతంలోకి సులువుగా వెళ్తుంది.

లోహ ఉపరితలంపైనున్న సిరా కేంద్రాల నుంచి వచ్చిన సిరాతో ఇమేజ్ కాగితంపై ముద్రితమవుతుంది. ఈ ముద్రణ పద్ధతిలో ఒక్కో అంగుళానికి వేలకొలది డిప్రెషన్స్ వుంటాయి. సిరా లోహ ఉపరితలంపై పరుచుకుంటుంది. ఎక్కువగా వున్న సిరాను డాక్టర్ బ్లేడ్‌గా పిలవబడే బ్లేడ్‌తో తొలగిస్తారు. ప్రతి చిన్న రంధ్రం, సిరా కేంద్రంగా పని చేస్తుంది. లోహ ఉపరితలానికి కాగితాన్ని ఒత్తగానే బ్లాటింగ్ పేపర్ సిరాను పీల్చుకున్నట్టుగా సిరా కాగితంపైకి బదిలీ అవుతుంది. కాగితంపై అచ్చయిన సిరా చుక్కలు దృశ్యాన్ని ఏర్పరుస్తాయి. ఈ వాక్యం ముద్రించబడాలంటే అలాంటి పది సిరా కేంద్రాలు అవసరం.

అత్యున్నత ప్రమాణాలతో చిత్రాలను ముద్రించాలంటే గ్రవ్యు పద్ధతి ఎంతో ఉత్తమమైందని మీడియా రచయితలు తెలుసుకోవాలి. అయితే లక్షలాది కాపీలు ముద్రించినప్పుడే ఈ పద్ధతి ఆర్థికంగా లాభదాయకంగా వుంటుంది. ఈ ముద్రణ

పద్ధతిని దినపత్రికలతో సహా వార్తా పత్రికలు, మేగజైన్లు, సచిత్ర పత్రికలు. పర్యాటక సమాచారం మొదలైన వాటి ముద్రణకు వినియోగిస్తున్నారు. గ్రవ్యూ పద్ధతిలో ముద్రించినవి అందంగా, ఆకర్షణీయంగా, ఘనంగా వుంటాయి. కోటెడ్ సాక్స్‌తో సహా మంచి నాణ్యమైన కాగితంపైనే గ్రవ్యూ ముద్రణ చేస్తారు. అంతగా ఖరీదు లేని కాగితంపై కూడా ముద్రణకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. పేపర్ బోర్డులు, లోహపు ఫాయిల్స్. వివిధ రకాలైన ప్లాస్టిక్ ఫిల్ములు, ప్యాకేజి పరిశ్రమకు సంబంధించిన ముద్రణ పనులకు కూడా వినియోగిస్తారు.

**అభ్యాసం : లెటర్ ప్రెస్ అంటే?**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

### 25.4.4. స్క్రీన్ ప్రింటింగ్

స్క్రీన్ ప్రింటింగ్ ప్రక్రియను అలంకరణ ప్రక్రియగా పేర్కొనవచ్చు. ఇది ప్రాథమికంగా బ్యానర్లు, లోహ, గాజు, ప్లాస్టిక్ గుర్తులు, ప్రింటెడ్ సర్క్యూట్స్, బట్టలు, జౌళి వస్త్రాలు, వస్తువులు, వాల్ పేపర్ ఇంకా పలు రకాల పనులకు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలో స్క్రీన్‌పై ముద్రణ జరుగుతుంది. గతంలో స్క్రీన్ ప్రింటింగ్ అనేది పట్టుకు మాత్రమే పరిమితం. కనుకనే దీనిని సిల్క్ స్క్రీన్ అని కూడా అంటారు.

స్క్రీన్ ప్రింటింగ్ పుస్తకాలను పెద్ద ఎత్తున తయారు చేసేందుకు ఉద్దేశించింది కాదు. పుస్తకాలు వార్తా పత్రికల ముద్రణలో ఇది అవసరమే. అయితే ఏదైనా భారీ సంఖ్యలో చేసేందుకు దీనితో వీలుపడదు. స్క్రీన్ ప్రింటింగులో అతి చిన్న అక్షరాలు కూడా స్పష్టంగా పునర్ముద్రించవచ్చు. ప్రస్తుతం సగం రంగుల దృశ్యాలను మాత్రమే బాగా తయారు చేయగలుగుతున్నారు. నగరాల్లో బాగా అనుభవమున్న పనివారు పూర్తి రంగుల దృశ్యాలను కూడా విజయవంతంగా తయారు చేయగలుగుతున్నారు. సాంప్రదాయకంగా స్క్రీన్ ప్రింటింగ్ అనేది లైన్ డిజైన్‌తో ఆర్ట్ వర్క్‌కు సంబంధించిన ఉత్పాదనలో బాగా ఉపయోగపడుతుంది. స్క్రీన్ ప్రింటింగ్‌ను అనేక షాపుల్లో ఇంకా చేతితోనే చేస్తుంటారు. ప్రస్తుతం స్క్రీన్ ప్రింటింగ్ ముద్రణశాలలు పెద్ద సంఖ్యలో ఏర్పడ్డాయి.

స్క్రీన్ ప్రింటింగ్ ప్రక్రియలో ఏ దృశ్యాన్నయినా ఏ ఆకారం పరిమాణం డిజైన్‌లోనైనా దేనిపైనైనా బదిలీ చేయవచ్చు. ముద్రణ నాణ్యత బాగా వుంటుంది. ఇది మెల్లగా జరిగే ప్రక్రియ. రచయితలు ఈ మూడు విషయాలు తెలుసుకుంటే చాలు.

## 25.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ ముద్రణ అనేది భావ వ్యక్తీకరణకు శక్తివంతమైన శాశ్వతమైన సాధనం.

★ ముద్రణ చైనాలో మొదలైంది.

★ ముద్రణలో లెటర్ ప్రెస్ పురాతనమైన ప్రక్రియ. ఆఫ్‌సెట్, గ్రవ్యూ, స్క్రీన్ ప్రింటింగ్ వచ్చినప్పటికీ లెటర్ ప్రెస్ ప్రాధాన్యం మన దేశంలో అంతగా తగ్గలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది అంతరించిపోయే దశలో వుంది.

BRAOU

★ ఆఫ్‌సెట్ ముద్రణ పెద్ద ఎత్తున పుస్తకాలు, పత్రికలు మొదలైనవి ముద్రించేందుకు బాగా పనికి వస్తుంది. ముద్రణ నాణ్యత బాగా వుంటుంది.

★ గ్రవ్యు పద్ధతిలో చిత్రాలు స్పష్టంగా బాగా వస్తాయి.

★ స్క్రీన్ ప్రింటింగ్ పరిమిత అవసరాలను మాత్రమే తీరుస్తుంది.

★ రచయితలు ముద్రణకు సంబంధించి ఈ కనీస విషయాలు తెలుసుకోవడం అవసరం.

## 25.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ముద్రణ పద్ధతుల గురించి వివరంగా తెలపండి?
2. ముద్రణ చరిత్రను వివరించండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులు మించకుండా సమాధానాలు రాయండి.

1. ఆఫ్‌సెట్?
2. స్క్రీన్ ప్రింటింగ్?

**- డి. నాగార్జున**

BRAOU

# భాగం - 26 : ముద్రణలో కంప్యూటర్ల పాత్ర

## విషయక్రమం


26.0 ఉద్దేశం

26.1 ప్రవేశిక

26.2 టైప్ సెట్టింగ్ రకాలు

26.2.1. చేతి కంపోజింగ్

26.2.2. యంత్రాల ద్వారా కంపోజింగ్

26.2.3. కంప్యూటర్ల ద్వారా కంపోజింగ్

26.2.4. డి.టి.పి.

26.2.4.1. డి.టి.పి. విభాగాలు

26.2.4.2. డి.టి.పి. ఉపయోగాలు

26.3 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

26.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 26.0. ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు.

- మీడియా రచనకు కంపూటర్లు సాధనాలు కావడం
- ఎలక్ట్రానిక్ యంత్రాల ఉపయోగాలు
- వివిధ రకాలైన కంపోజింగ్ గురించి

తెలుసుకుంటారు.

## 26.1 ప్రవేశిక

సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈ ఆధునిక యుగంలో ముద్రణ రంగంలో కూడా ఎన్నో మార్పులు వచ్చాయి. చేతి కంపోజింగ్ నుంచి డెస్క్‌టాప్ పబ్లిషింగ్ వరకు వచ్చిన మార్పుల గురించి కొంతయినా తెలుసుకోవలసిన అవసరం పత్రికా రచయితలకు వుంది. అక్షరాలను ఏర్చి కూర్చే దశ నుంచి- కంపోజింగే కాదు, రంగుల్లో పేజీ అలంకరణ కూడా కంప్యూటర్లమీదే చేసే దశకు రావడం మానవ ప్రగతికి నిదర్శనం. ప్రస్తుత పరిశ్రమ వేగాన్ని అందుకుని పత్రికా రచయితలకు గ్రాఫిక్ కళలోని ఆధునిక ధోరణుల పరిచయం తప్పనిసరి.

నూతన పరిణామాలను అర్థం చేసుకునే ముందు కొన్ని వందల సంవత్సరాల క్రితం రచయితలు తాము

రాసినవిషయాల్ని ఎలా అచ్చురూపంలోకి తెచ్చేవారో తెలుసుకోవాలి. ఎందుకంటే వేగం, నాణ్యత, నిపుణత, తప్పుల్లేని అచ్చు విషయంలో అప్పటికీ ఇప్పటికీ పోలికే లేప్పటికీ ప్రాథమిక అచ్చు విధానంలో మార్పు ఏమీ లేదు. ప్రస్తుత అచ్చు విధానం గతంలోని పద్ధతుల కంటె ఎన్నో రెట్లు మెరుగు.

## 26.2 టైపు సెట్టింగ్ రకాలు?

టైపుసెట్టింగ్‌లో నాలుగు రకాలు వున్నాయి.

1. చేతి కంపోజింగ్
2. యంత్రాల ద్వారా కంపోజింగ్
3. కంప్యూటర్ల ద్వారా ఫోటో కంపోజింగ్
4. డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (డి.టి.పి)

### 26.2.1. చేతి కంపోజింగ్

అచ్చుయంత్రాన్ని కనిపెట్టిన గుటెన్‌బర్గ్ కాలంనుంచీ పత్రికా రచయితలు తమవార్తల అచ్చుకోసం చేతి కంపోజింగునే ఆశ్రయించారు. అచ్చుయంత్రానికి పూర్వం రచయితలే తమ రచనలను ప్రతులుగా రాసేవారు. అయితే చూచి రాతవల్ల వారు ఎక్కువ సంఖ్యలో ప్రతులను రాయడం సాధ్యపడేది కాదు.

దాదాపు ఒక అంగుళం పొడవుండి సీసంతో తయారు చేయబడిన టైపు విభాగాలను కూర్చడం ద్వారా చేతి కంపోజింగ్ చేస్తారు. ఈ విభాగాల్లో అక్షరాలు, గుర్తులు, బొమ్మలు మొదలైనవి కింద చూపిన విధంగా తల్ల క్రిందులుగా ఉబ్బెత్తుగా వుంటాయి.



లోతు గుర్తు పరిమాణాన్ని నిర్ణయిస్తుంది.

అక్షరం (Type)

ఈ అక్షరాలు ఉబ్బెత్తుగా వుండటం వల్ల సిరా పూసినప్పుడు అక్షరాలకు మాత్రమే అంటుకుని కాగితంపై ఒత్తినప్పుడు అవి అచ్చుపడతాయి. ఈ విధంగా టైపు విభాగాల కూర్పు చేసేవారిని చేతి కంపోజిటర్ అంటారు.

చేతి రాత ప్రతి ఆధారంగా కంపోజిటర్ వివిధ రకాల పరిమాణాల్లో వివిధ రకాల పెట్టెల్లో ఉన్న టైపు విభాగాలను ఎంపిక చేసుకుంటాడు. ఒక్కో పెట్టెలో ఒక్కో అక్షరం వుంటుంది. ఈ విధంగా టైపు విడిభాగాలను అక్షరాలుగా వాక్యాలుగా పేరాలుగా కూర్చి చివరికి పేజీలుగా అమరుస్తారు. ఒక్క అక్షర నిర్మాణంలో తప్ప తెలుగులోను ఇంగ్లీషులోను చేతి కంపోజింగ్ ఒకే విధంగా వుంటుంది. ఉదాహరణకు తెలుగులో ఇంగ్లీషులో లాగా కాకుండా ఒత్తులు, దీర్ఘాలు, వుంటాయి. తెలుగులో కంపోజింగ్ ఎంత కష్టమో దీనివల్ల తెలుస్తుంది. పూర్తి అక్షరాలు, ఒత్తులు, దీర్ఘాలు, కొమ్ములు, తదితరాలు కలిపి వుండే పెట్టెల సంఖ్య వందల్లో వుంటుంది. సాధారణ తెలుగుకు సంబంధించిన టైపులు 691 పెట్టెలతో కూడిన నాలుగు అరలుంటాయి.

చేతి కంపోజింగ్ అధిక శ్రమతో నైపుణ్యంతో కూడుకున్నది. ఈ విషయంలో తగిన అనుభవం, నైపుణ్యం లేనట్టయితే ఆ పని మరింత కష్టమవుతుంది. తప్పుల సవరణ దుస్సాధ్య మవుతుంది. టైపు విభాగాల పరిమాణాన్ని బట్టి అనుభవం, మంచి

BRAOU

సమన్వయంతో ఒక్కో కంపోజిటర్ గంటకు వేయి అక్షరాలను కూర్చగలడు. సాంకేతికపరమైన ఇబ్బందులు వున్నప్పటికీ చేతి కంపోజింగ్ శతాబ్దాల పాటు అంటే యంత్రాలద్వారా కంపోజింగ్ వచ్చిన 19వ శతాబ్దం వరకు కొనసాగింది.

### 26.2.2. యంత్రాల ద్వారా కంపోజింగ్

టైపు నాణ్యత వేగం పెంచేందుకుగాను యంత్రాల ద్వారా కంపోజింగ్ అవతరించింది. ఈ యంత్రాలు ప్రధానంగా టెక్స్ట్‌టైపు సమాచారాన్ని అందించేవి. ఒక్కో పెట్టె నుంచి ఒక్కో అక్షరాన్ని ఏర్చి కూర్చే చేతి కంపోజింగ్‌లాగా కాక కీబోర్డును నిర్వహించడం ద్వారా కంపోజింగ్ జరుగుతుంది. ఎక్కడ సవరణలు అవసరమైతే అక్కడ అప్పటికప్పుడే చేయవచ్చు. లైనో టైపులో మొత్తం లైను ఒకే భాగంగా విడివిడిగా వుంటాయి. వేగం, నాణ్యత, స్పష్టత, అనుకూలత విషయంలో విప్లవాత్మకమైన దైనప్పటికీ యంత్రాల ద్వారా కంపోజింగ్ దాదాపు వందేళ్ళే మనగలిగింది. తెలుగులో యంత్రాల ద్వారా కంపోజింగ్ చాలా తక్కువ కాలం జరిగింది. మోనోటైపు తెలుగు పత్రికా రంగంలో కీలక పాత్ర వహించినప్పటికీ, లైనో టైపు మాత్రం ప్రయోగదశలోనే అంతరించింది.

### 26.2.3. కంప్యూటర్ల ద్వారా ఫోటో కంపోజింగ్

వివిధ రకాలైన ముద్రణ ప్రక్రియలను గురించి మనం ఇంతకుముందు పాఠంలో తెలుసుకున్నాం. లెటర్ ప్రెస్‌లో మనకు కావలసిన ఇమేజ్‌లు నేరుగా కాగితంపై పడేవి. ఆఫ్‌సెట్, గ్రవ్యూ, సిల్క్ స్క్రీన్ మొదలైన ప్రక్రియల్లో ఇమేజ్ (అక్షరాలు, గుర్తులు, బొమ్మలు) ఫోటోగ్రాఫిక్ పద్ధతుల ద్వారా కోరుకున్న దానిపై ముద్రితమవుతుంది. 19వ శతాబ్దం చివరలో లోహపు టైపు లేకుండా రాత ప్రతిలోని విషయాన్ని కాగితంపై ప్రచురించేందుకు ప్రయత్నాలు జరిగాయి. 1940 చివరలో జరిగిన కంప్యూటర్ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి ఫోటోటైపు సెట్టింగ్ వాణిజ్య పరంగా విజయవంతమయ్యేందుకు దోహదపడింది. అప్పట్నుంచీ ఇప్పటివరకు టైపు సెట్టింగు చరిత్ర గణనీయంగా మార్పు చెందింది.

ఫోటోటైపు సెట్టింగులో మీడియా రచయితలకు అనూహ్యమైన అనుకూలతలు వున్నాయి.

1. ఆపరేటర్ తాను కీ బోర్డులో ఏం కొడుతున్నదీ తెరపై చూడవచ్చు.
2. సవరణలు అవసరమైన చోట వెంటనే చేయవచ్చు.
3. తాను టైపు చేసిన సమాచారాన్నంతా ఆపరేటర్ భద్రపరచుకోవచ్చు.
4. తాను చేసిన దానిలో మార్పులు ఎప్పుడు అవసరమైనా ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు. చేతి కంపోజింగులో ఇది అసాధ్యం, కాగా యంత్రాల ద్వారా కంపోజింగులో ఇది కొంతవరకు మాత్రమే సాధ్యం.
5. పూర్తి సమాచారాన్ని ఎక్కించిన తర్వాత వరసల పొడవు, అక్షరాల పరిమాణం, మొదలైనవి మార్చాల్సిన అవసరం ఏర్పడినప్పుడు మనకు కావాల్సిన పొడవు, పరిమాణం తదితర వివరాలను తెలియజేసినట్టయితే కొన్ని నిమిషాల్లోనే మనం కోరిన సమాచారం కోరుకున్న విధంగా వస్తుంది.
6. ఒక భాష నుంచి మరో భాషకు మారడం సులభం.
7. ప్రస్తుత ఫోటో కంపోజింగ్, యంత్రాల్లో కొన్ని రకాలైన కమాండ్స్ మాత్రమే వుండటం వల్ల తెలుగు టెక్ట్స్ సెట్టింగ్ చాలా సులభమైంది. వేగం, నాణ్యత కూడా పెరిగింది.
8. సమాచారాన్ని రెండు విధాలుగా మనం తీసుకోవచ్చు. లైన్ ప్రింటర్ ద్వారా హార్డ్ కాపీ తీసుకోవచ్చు. హార్డ్ కాపీలో అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులు చేసిన తర్వాత మామూలు తెల్లకాగితంపై లేజర్ ప్రింటర్ ద్వారా ఫెయిర్ కాపీ తీసుకోవచ్చు. లేజర్ ప్రింటర్ నుంచి వచ్చే కాపీలో మొదలైనవన్నీ వుంటాయి. లేజర్ ప్రింటర్ నుంచి కాపీ వచ్చిన

BRAOU

అనంతరం కూడా సవరణలు చేసుకోవచ్చు. తప్పులు లేకుండా సమాచారం సిద్ధమైనట్టయితే ఫిల్మ్ లేదా బ్రోమైడ్‌గా పిలవబడే ఫోటోగ్రాఫిక్ కాగితంపై తుది ప్రతిని తీసుకోవచ్చు. ఆఫ్‌సెట్ ప్లేట్ మీదకు సమాచారాన్ని మార్చేందుకు బ్రొమైడ్‌ను ఉపయోగిస్తారు.

ఒక తరంలో నెలల తరబడి రాత్రి పగలు కష్టపడితే గాని అక్షర కూర్పు ద్వారా కొన్ని వందల పేజీలు తయారుచేసే పరిస్థితి ప్రస్తుతం పూర్తిగా మాయమైంది. ఈ ఆధునికమైన ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా కొద్ది సమయంలోనే అనేక పేజీలు పొందగలుగుతున్నాయి. దీనికి నిదర్శనం మనం రోజూ చదువుతున్న పత్రికలు, వేలకు వేల పుటలున్న గ్రంథాలు. దీనికి తోడు అతి తక్కువ తప్పులతో చాలా కళాత్మకంగా వున్న అక్షర కూర్పు మనం ఈ ఎలక్ట్రానిక్ యంత్రాల ద్వారా పొందగలుగుతున్నాం.

### 26.2.4. డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (డి.టి.పి.)

ప్రపంచ ప్రసిద్ధిపొందిన అల్డస్ కార్పొరేషన్ అధ్యక్షుడు పాల్ బ్రెయినర్డ్ 1980 మధ్యలో మొదటిసారిగా డెస్క్‌టాప్ పబ్లిషింగ్ అనేపదాన్ని ఉపయోగించారు. చరిత్రలో స్వల్ప కాలంలో అనల్పంగా పెరిగిన విధానం ఈ డి.టి.పి.

గుటెన్‌బర్గ్ అచ్చు యంత్రాన్ని కనుక్కోవడంతో పుస్తకాలు ఇతర ప్రచురణలు ప్రజలకు ఎలా అందుబాటులోకి వచ్చాయో. అలాగే డి.టి.పి. ద్వారా సామాన్యులు సైతం తమ వృత్తిపరమైన డాక్యుమెంట్లను తామే స్వయంగా తయారు చేసుకోగలుగుతున్నారు.

#### 26.2.4.1. డి.టి.పి. విభాగాలు

డి.టి.పిలో పర్సనల్ కంప్యూటర్ వర్డ్ ప్రాసెసింగ్ సాఫ్ట్‌వేర్, పేజీ లే అవుట్ సాఫ్ట్‌వేర్, లేజర్ ప్రింటర్ వుంటాయి. రేఖాచిత్రాలు, ఫోటోలు తీసేందుకు లేదా వాటిలో మార్పులు చేసేందుకు సాఫ్ట్‌వేర్, చిత్రాలను ఫోటోలను డిజిటల్ కంప్యూటర్‌లోకి మార్చే స్కానర్ (హార్డ్‌వేర్) కూడా డి.టి.పి.లో భాగమే. మౌస్ సహాయంతో కర్సర్‌ను నియంత్రించడం ద్వారా తెరపై దృశ్యాలను మార్చవచ్చు.

లేజర్‌ప్రింటర్ నుంచి వచ్చే పేజీలు తుది ప్రచురితాలు కావచ్చు. వందలు లేదా వేల సంఖ్యలో కాపీలు అవసరమైన పక్షంలో ఇమేజ్ సెట్టర్లయిన హయ్యర్ రిజల్యూషన్ లేజర్ ప్రింటర్ల ద్వారా ప్లేట్ల తయారీ కోసం మాస్టర్లను కూడా తయారు చేయవచ్చు. పేజీ విన్యాసం, అలంకరణ పేజీ లే అవుట్ సాఫ్ట్‌వేర్ ప్రధాన విధి. సాంప్రదాయకమైన ప్రచురణలో లే అవుట్, అలంకరణ, అతికించడం తదితర పనులను డైరెక్టర్, గ్రాఫిక్ డిజైనర్ వారి సహాయకులు చేస్తుంటారు.

డి.టి.పి. లో మీడియా రచయిత పేజీ మొత్తాన్ని ప్రింట్ లేదా ఫిల్మ్, బ్రొమైడ్ రూపంలో రాకముందే తెరలపై చూడవచ్చు. మరోవిధంగా చెప్పాలంటే రచయిత తన పేజీలను అవి బయటికిరాకముందే ఇష్టం వచ్చిన రీతిలో తెరపైనే మార్చుకోవచ్చు. దీనితో సమయం శ్రమ, డబ్బు ఎంతో కలిసివస్తుంది.

#### 26.2.4.2. డి.టి.పి. ఉపయోగాలు

మీడియా రచయిత డి.టి.పి. ఉపయోగాలు గురించి తెలుసుకుని వుంటే మంచిది. ఉపయోగాలు.

ఎ. రేఖాచిత్ర నివేదికలు : టేబుల్స్, గ్రాఫులు రేఖా చిత్రాలతో కూడిన సుదీర్ఘమైన నివేదికలను డి.టి.పి. ద్వారా రూపొందించడం ఒక్కటే దీనిలో వున్న సౌలభ్యం కాదు. అవే నివేదికలను శ్రమ లేకుండా తర్వాత మార్చుకోవచ్చు. తిరిగి రాసుకోవచ్చును.

లేజర్ ప్రింటర్ ద్వారా వచ్చే కాపీల్లో అవసరమైన సవరణలు చేసుకోవచ్చు. ప్రతి పేజీని తప్పులు లేకుండా చూసుకోవచ్చు. డి.టి.పి.లో ఈ పని వేగంగా జరగడం ఒక ప్రధానమైన సౌలభ్యం.

బి. సమాచారం : సమాచారాన్ని తాజా వివరాలతో వుంచుకోచ్చు. ఒకోకసారి అప్పటికప్పుడు కూడా మార్పులు చేయాల్సిన

BRAOU

అవసరం ఉంటుంది. సాంప్రదాయకమైన ప్రచురణలో సమూల మార్పులకు వారాల కొద్దీ సమయం పడుతుంది. ఇక్కడ ఆ పని కొన్ని గంటల్లోనే చేసుకోవచ్చు.

సి. **వార్తా లేఖలు :** (న్యూస్ లెటర్స్) డి.టి.పి.ని మొదట్లో వార్తా లేఖల కోసం ముఖ్యంగా సిబ్బంది వార్తా లేఖల తయారీ కోసం ఉపయోగించేవారు. సాంప్రదాయక ప్రచురణలో మొత్తం సమాచారం వచ్చిన తర్వాత టైపు చేసి, అచ్చువేసి వార్తా లేఖలు తయారుచేసేవారు. ఈ పని పూర్తయేసరికి అయిదు నుంచి వారం రోజులు పట్టేది. డి.టి.పి. రాకతో ఈ పనంతా ఒక్క రోజులో పూర్తవుతోంది.

వార్తా లేఖ కోసం కంపెనీ ఉద్యోగులు తమ పర్సనల్ కంప్యూటర్లను ఉపయోగించి వార్తలు, విషయాలు కథలు రాయవచ్చు. వార్తా లేఖ సంపాదకుడు, ఆ సమాచారాన్నంతా వారి కంప్యూటర్ల నుంచి సేకరిస్తాడు. సంచిక కోసం మొత్తం సమాచారం సిద్ధమైన తర్వాత దాన్ని పేజీల్లోకి మార్చి లేజర్ ప్రింటర్ ద్వారా తీసుకున్న ప్రతులను ధ్రువీకరణ కోసం ఉన్నతాధికారులకు పంపిస్తారు. అవసరమైన సవరణలు చేసి వెంటనే కొత్త ప్రతులను తీసుకోవచ్చు. అధికారులు అనుమతించిన వెంటనే వార్తా లేఖలను పంపిణీ చేయవచ్చు.

డి. **కేటలాగులు :** కేటలాగుల తయారీకి డి.టి.పి. బాగా పనికి వస్తుంది. సాంప్రదాయకమైన ప్రచురణలో చిన్న సవరణలు చేయాలన్నా ఎక్కువ ఖర్చవుతుంది. డి.టి.పి.లో అయితే ఉత్పత్తి వ్యయం తగ్గడమే గాక సమయం కూడా బాగా కలిసివస్తుంది. కేటలాగ్ రూపురేఖలు మారకుండా వున్నట్టయితే సమాచారాన్ని ఎప్పటికప్పుడు మార్చుకోవచ్చు.

ఇ. **బ్రోచర్లు :** మార్కెటింగ్‌కు సంబంధించి బ్రోచర్లు ముఖ్యమైనవి. బ్రోచర్ల తయారీలో రచయితలు ముఖ్యపాత్ర వహిస్తారు. బ్రోచర్లు చిన్నవిగానైనా వుండవచ్చు లేదా అనేక పేజీలు, రంగులతో పెద్దదిగానైనా వుండవచ్చు. బ్రోచర్ల తయారీలో డి.టి.పి. ప్రముఖ పాత్ర పోషిస్తోంది. వ్యయం తగ్గింపునకు తోడ్పడమే గాక తక్కువ మంది ప్రజలకు ఉద్దేశించిన ఉత్పత్తులను సంబంధించిన ప్రచార అవసరాలను కూడా తీరుస్తోంది.

BRAOU

ఎఫ్. **అడ్వర్టయిజింగ్ అండ్ ప్రమోషన్ :** ఈ రంగానికి సంబంధించి డి.టి.పి. బాగా ఉపయోగపడుతోంది. పత్రికా ప్రకటనలు, ప్రచార సాహిత్య సమాచారం, పత్రికలకు, మేగజైన్లకు, జర్నల్స్‌కు వ్యాపార ప్రకటనల రూపకల్పనకు సంబంధించి ఎలక్ట్రానిక్ పేజ్ లేఅవుట్, అలంకరణ పద్ధతులు బాగా తోడ్పడుతున్నాయి.

జి. **మీడియా రచయితలకు డి.టి.పి. ఉపయోగం :** డి.టి.పి. ఉపయోగాలు ఎన్నో రకాలు. ఎవరి అవసరాల స్థాయిని బట్టి వారికి ఆ విధంగా ఉపయోగపడుతుంది. రేఖా చిత్రాలతో కూడిన డాక్యుమెంట్లను ఒకే వ్యక్తి రూపొందించుకోవచ్చు. డాక్యుమెంట్ల తయారీకి సంబంధించిన వివిధ దశల నియంత్రణ ఒకే వ్యక్తి చేతిలో వుంటుంది. తక్కువ వ్యయంతో పేజీలను వెంటనే తీసుకోవచ్చు. స్వల్ప వ్యయం ఆకర్షణీయమైన విజువల్స్, సత్వర అవసరాల కోసం డి.టి.పి.ని మించింది లేదని చెప్పుకోవచ్చు.

## 26.3. ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

- ★ అచ్చు యంత్రాలు లేని కాలంలో రచయితలు పుస్తకాలను ఎన్నిప్రతులైనా చేతితోనే రాసేవారు.
- ★ తొలిరోజుల్లో సీసంతో తయారైన అక్షరాలను చేతి కంపోజింగ్ ద్వారా అమర్చి ముద్రించేవారు.
- ★ లైనోటైపు, యాంత్రిక వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత కంపోజింగ్ నాణ్యత పెరిగింది.
- ★ ఇప్పుడు కంప్యూటర్లు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల కంపోజింగ్ వేగవంతం కావడమే కాక తప్పులు తక్కువగా దొర్లే అవకాశం వుంది.

★ డి.టి.పి. వ్యవస్థలో గ్రాఫులు, రేఖలు, కేటలాగ్‌లు, బొమ్మలు ఏదైనా రూపురేఖలు మారకుండా కంపోజ్ చేయవచ్చు.

## 26.4 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. టైపు సెట్టింగు పద్ధతుల గురించి తెలపండి?
2. డి.టి.పి. ఉపయోగాలు తెలపండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. యంత్రాల ద్వారా కంపోజింగ్?
2. వార్తా లేఖలు?

- డి. నాగార్జున

BRAOU

# భాగం - 27 : గ్రాఫిక్స్ రూపకల్పన - నిర్మాణం

## విషయక్రమం


27.0 ఉద్దేశం

27.1 ప్రవేశిక

27.2 పత్రికలలో గ్రాఫిక్స్

27.3 రూపకల్పన

27.4 నిర్మాణం-ముద్రణాంశాలు

27.5 కొత్త టెక్నాలజీల పాత్ర

27.5.1. అల్డస్ పేజ్‌మేకర్

27.5.2. వెంచుర పబ్లిషర్

27.5.3. అడోబ్ ఇలస్ట్రేటర్

27.5.4. అల్డస్ ఫ్రీ హాండ్

27.5.5. కోరల్ డ్రా

27.5.6. హార్వర్డ్ డ్రా

27.6 గ్రాఫిక్స్ ప్రచురణకు సూచనలు

27.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

27.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 27.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు

- పత్రికా ప్రచురణలో గ్రాఫిక్స్ నిర్వహించే పాత్రను గుర్తిస్తారు. ముద్రణా టెక్నాలజీలో వచ్చిన మార్పుల కనుగుణంగా గ్రాఫిక్స్ చిత్రీకరణ, ముద్రణ విషయాలలో చోటు చేసుకున్న మార్పులను
- గ్రాఫిక్స్ రూపకల్పన - నిర్మాణానికి సంబంధించి సాంకేతిక, కళాత్మక అంశాలను, విలువలను
- గ్రాఫిక్స్ నిర్మాణం విషయంలో కొత్త టెక్నాలజీల పాత్రను గుర్తిస్తారు. కంప్యూటర్ల ద్వారా లభించే అవకాశాలను తెలుసుకుంటారు.

## 27.1 ప్రవేశిక

గ్రాఫిక్స్ అనే పదానికి అర్థాన్ని ఒకసారి పరిశీలిద్దాం. గుర్తుల రూపంలో కన్పించేది అనే భావం ప్రధానంగా కన్పిస్తుంది. బొమ్మల రూపంలో, రేఖలరూపంలో కన్పించడం అన్నదీ ఈ భావంలోనే చూస్తాం. రాత విషయంలో, ముద్రణ విషయంలో, డ్రాయింగ్ విషయంలో, పెయింటింగ్‌ల విషయంలో.. ఇలా అనేక విషయాలల్లోని అంశాల్ని దృశ్యాంగ రూపంలో ప్రదర్శించడాన్నే గ్రాఫిక్స్ అన్న అర్థంతో వాడతారు. పత్రికా ప్రచురణలో మనం చూసే శీర్షికలు, ఫొటో గ్రాఫులు, గ్రాఫులు, అక్షర విన్యాసాలు, రేఖా బలాలు, కార్టూన్లు వంటివి 'గ్రాఫిక్స్' అనే అర్థంలోనే చూస్తాం. పత్రిక భాషలో వాడే 'గ్రాఫిక్స్'కు, ప్రసార మాధ్యమాలలో వాడే

BRAOU

'గ్రాఫిక్స్'కు మధ్యన భావనాపరంగా వ్యత్యాసం పెద్దగా కన్పించదు. ఈ రెండు మాధ్యమాలకున్న ప్రసార లక్షణాలను, ధర్మాలను బట్టి వాటి మాధ్యమ లక్షణాలను సొంతం చేసుకోగలిగాయి. గ్రాఫిక్స్ కళాత్మకంగా కంటికింపైనవి. పాఠకులకు సందేశాన్ని ప్రతిభావంతంగా ప్రసారం చేయగలవు.

గ్రాఫిక్స్ సంక్లిష్టమైన భావనలను, వాస్తవాలను, ప్రక్రియలను తేలికైన అర్థంలో చెప్పగలవు. ఎన్నైనా ఉదాహరణలను చెప్పుకోవచ్చు. దిన, వార పత్రికలు వేటిని తిరగేసినా మనకెన్నో అంశాలు గ్రాఫిక్స్‌పైన ఆధారపడి ఉండటం కన్పిస్తాయి. బరువైన అంశాన్ని తేలిగ్గా, ఇతరుల్ని నొప్పించకుండా చెప్పడానికి కార్టూన్లవంటివి ముందుకొస్తాయి. గ్రాఫుల్ని చూడగానే దత్తాంశం ప్రవర్తన తీరు ఎలా ఉందో ఇట్టే గ్రహించగలం. జరిగిన సంఘటనల్లో కీలకమైన క్షణాన్ని ఫొటో రూపంలో బంధించి ఆ క్షణంలో ఇమిడి ఉన్న భావాన్ని, పరిస్థితిని స్పష్టపరచగలం. ఒక విధంగా 'గ్రాఫిక్స్' వార్తలోని అంతర్భాగాలు. కఠినంగా ఉండే భావాన్ని సైతం తేలికపర్చి, అవసరమైతే హాస్యాన్ని జోడించి మరీ చెప్పగలవు.

పత్రికా ప్రచురణలో గ్రాఫిక్స్‌ను అర్థవంతంగా ప్రస్తావించడం ఒక కళ. ఇది ఒక్కరితో జరిగే పనికాదు. నలుగురైదుగురు కలసికట్టుగా చేసేపని. పత్రికా ప్రచురణలో వారి స్థానాన్ని, స్థాయినిబట్టి చేసే కృషి ఈ కలిసికట్టు ప్రయత్నంలో కన్పిస్తుంది. చిత్రకారుడు, ఫొటోగ్రాఫరు, ఉపసంపాదకుడు, సంపాదకుడు, లే అవుట్ ఆర్టిస్ట్ వంటివారు ఈ సందర్భంగా కన్పిస్తారు. వివిధ పత్రికలలో ఉండే ప్రచురణ ప్రక్రియ విధానాన్ని బట్టి 'గ్రాఫిక్స్' ఎంపిక, ప్రచురణ కన్పిస్తుంది. ఇవన్నీ కళాత్మక అంశాలకు సంబంధించినవి. ముద్రణాయంత్రాలు, గ్రాఫిక్స్ రూపకల్పనలో తోడ్పడే పరికరాలు వంటివి సాంకేతిక అంశాలుగా మనం గుర్తించవచ్చు. గ్రాఫిక్స్ రూపకల్పనలో కళాత్మక అంశాలు, సాంకేతిక అంశాలు రెండూ కలసి వార్తాపత్రికల పేజీల అమరికలో దోహదపడ్డాయి. పేజీలకు ఆకట్టుకోగలిగే గుణాల్ని తెచ్చిపెట్టాయి. చెప్పదల్చుకున్న సమాచారాన్ని, సందేశాన్ని - త్వరితంగా, తేలిగ్గా, సమర్థవంతంగా పాఠకుడికి చేరవేస్తాయి.

## 27.2 పత్రికలలో గ్రాఫిక్స్

పత్రికలలో గ్రాఫిక్స్‌ను వివిధ రూపాలలో చూస్తాం. వార్తా పత్రికలు ప్రచురించే గ్రాఫిక్స్ వేరు. వారపత్రికలు, పక్ష పత్రికలు, మాస పత్రికలు వంటి కాలిక పత్రికలు ప్రచురించే గ్రాఫిక్స్ వేరు. అలాగే వివిధ సందర్భాలలో ప్రత్యేక సంచికలుగా వెలువడే ప్రచురణలలో గ్రాఫిక్స్ వేరుగా ఉంటాయి. గ్రాఫిక్స్ పరిధి, అవకాశాలు భిన్నంగా కన్పిస్తాయి. అవసరాలలోనూ వైవిధ్యం కన్పిస్తుంది.

పత్రిక ప్రచురణ మొదలయిన నాటినుంచి ఈ గ్రాఫిక్స్ ప్రస్తావన ఉంది. ముద్రణ రంగంలో వచ్చిన మార్పులతో పాటు గ్రాఫిక్స్ చిత్రీకరణ, ప్రదర్శనలోనూ మార్పులు వచ్చాయి. ప్రాముఖ్యం పెరుగుతూ వచ్చింది. ముద్రణ పరంగా కొంత కష్టమైన పనే అయినా గ్రాఫిక్స్ చిత్రీకరణలో ఎక్కడా వెనుకంజలేదు.

లెటర్‌ప్రెస్ - పత్రికా ప్రచురణలో అతిప్రాచీనమైన ముద్రణా విధానం. ఆ రోజుల్లో గ్రాఫిక్స్ ప్రచురణకు చేసిన కృషి అనల్పం. చాలాకాలం పాటు పత్రికలు ఈ విధానంలోనే ముద్రితమయ్యాయి. ఆ తర్వాత ఆఫ్‌సెట్ విధానం వచ్చింది. 1960 దశాబ్దంలో పలు వార్తా పత్రికలు ఆఫ్‌సెట్ విధానంలో ప్రచురణను ప్రారంభించాయి. ఆ తర్వాత 'గ్రావ్యూర్' ప్రింటింగ్ టెక్నాలజీ అమలులోకి వచ్చింది. కొంతకాలానికి 'ఫ్లెక్సోగ్రఫీ' ముద్రణా విధానం అమలులోకి రావడంతో ముద్రణా పరంగా వచ్చిన విప్లవాత్మకమైన మార్పులు గ్రాఫిక్స్‌పైన ప్రసరించాయి. గ్రాఫిక్స్ చిత్రీకరణ, రూపకల్పన, నిర్మాణం విషయంలో ఎన్నో మార్పులు వచ్చాయి. నాణ్యతను పొందగలిగాయి. కంప్యూటర్ల ప్రమేయంతో పత్రికా రంగంలో వచ్చిన మార్పులు బహువిధాలు. ముద్రణ తేలికవడమే కాకుండా, చిత్రాల్ని, బొమ్మల్ని తేలిగ్గా ప్రచురించే అవకాశం లభించింది. ఒక విధంగా పత్రికలలో గ్రాఫిక్స్ స్థాయిని పెంచగలిగాయి ఈ పరిణామాలు. గుణాత్మకమైన మార్పే ఇది. ఆర్టిస్టుల పరిధి విస్తృతమైంది. కొత్త నిర్వచనం గ్రాఫిక్స్‌కు ఇచ్చే వీలును కల్పించగలిగింది. రంగులలో ప్రచురించడం - గ్రాఫిక్స్ ప్రచురణను బాగా ప్రభావితం చేయగలిగిన కారణాలలో ఒకటి.

BRAOU

గడచిన రెండు దశాబ్దాలక్రితం ప్రారంభమైన విప్లవాత్మకమైన మార్పులు 90 దశకం మధ్యకాలం నాటికి వేగం బాగా పుంజుకుని పత్రికా ప్రచురణను కొత్తదారుల్లో నడిపించాయి. ప్రస్తుతం దిన, వార, మాస పత్రికలలో వస్తున్న గ్రాఫిక్స్‌లో కొత్త పోకడలను గమనిస్తాం. నాణ్యతలో పెరుగుదల కన్పిస్తుంది. అధునిక చిత్రీకరణ విధానాలు కన్పిస్తాయి. ప్రదర్శనలోను వైవిధ్యం కన్పిస్తుం. పేజీల అలంకరణ, విషయ పరిధిలో విస్తృతత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలలో ప్రచురించబడిన కొన్ని చిత్రీకరణలను గ్రాఫిక్స్‌కు ఉదాహరణగా కింద ఇస్తున్నాం. వాటి ప్రచురణ ధ్యేయాన్ని కూడా క్లుప్తంగా ప్రస్తావించాం. పత్రికా ప్రచురణలో గ్రాఫిక్స్ ఏమేర స్థానాన్ని ఆక్రమించుకున్నాయో, ఈ ఉదాహరణల నేపథ్యంలో పరిశీలించండి. పత్రికల్లో వాటి స్థానాన్ని, పేజీల అలంకరణలో వాటి పాత్రను ఒకసారి అధ్యయనం చేయండి. పత్రికల్లో గ్రాఫిక్స్ - వాటి నైజం, రూపురేఖలు, అవకాశాలు, పరిధి అవసరాల పట్ల ఒక అవగాహన ఏర్పడుతుంది. పత్రికలలో గ్రాఫిక్స్ ప్రచురణలో మరో రెండు ప్రధాన అంశాలు మన దృష్టిలోకి వస్తాయి. అవి - (1) సాంకేతిక అంశాలు, (2) కళాత్మక అంశాలు. సాంకేతిక అంశాలలో ప్రసార మాధ్యమానికి ఉన్న సామర్థ్యాలు, పరిమితులు ఇమిడి ఉన్నాయి. సాంకేతిక అంశాలు - చాలా మటుకు ముద్రణారంగానికే సంబంధించినవి. గడచి రెండు దశాబ్దాల కాలంలో అంటే 80వ దశకం నుంచి ముద్రణా రంగంలో వచ్చిన మార్పులతోపాటు, గ్రాఫిక్స్ రూపకల్పనలో సాంకేతిక పరికరాలు, కంప్యూటర్లవంటి సాంకేతిక స్థానాలు ఎక్కువగా పాలుపంచుకోవడం కారణంగా మార్పులు మరింత వేగంగా జరిగాయి. ఫొటోగ్రఫీ, యాంత్రిక పరికరాలకే పరిమితమైన గ్రాఫిక్ కళ కంప్యూటర్ టెక్నాలజీ అనువర్తనాలలో విప్లవాత్మక మార్పులకు లోనైంది. సమయాన్ని, వ్యయాన్ని పరిమితం చేయగలగింది. నియంత్రించగలిగింది. మరో విధంగానైతే ఇది సాధ్యపడేది కాదు. గ్రాఫిక్స్ సమాచారాన్ని దాచి ఉంచగల సామర్థ్యంతోపాటు, అవసరమైనప్పుడే దాన్ని తిరిగి పొందగల అవకాశాలనీ సాధించిపెట్టాయి. కళాత్మక అంశాలు విడమర్చి చెప్పాల్సి అవసరం లేదు. అక్షర విన్యాసంతోపాటు, రేఖా చిత్రాలు, బొమ్మలు, రంగుల చిత్రీకరణ వంటివి ప్రధానపాత్ర వహిస్తాయి. ఒక విధంగా ఇవి గ్రాఫిక్ 'శైలి'కి రూపకల్పన చేస్తాయి. శైలితోపాటు వివిధ అంశాల సంఘటనం (composition) కూడా ముఖ్యమైంది. ఛాయ, అక్షర విన్యాసం వంటివాటి కళాత్మక పంథాలో అమర్చడం, పేర్చడంలోనే సంఘటనం కన్పిస్తుంది. సంఘటనంలో వివిధ అంశాల సమతూకం వల్లనే ఇది సాధ్యపడ్తుంది. కొన్ని సందర్భాలలో సమతూకం లేకపోయినా కళాత్మకత కన్పిస్తుంది. సౌష్టవ సంఘటనమైనా, అసౌష్టవ సంఘటనమైనా - కళాత్మకతను ప్రదర్శించడమే గ్రాఫిక్‌కు ప్రధాన ఉద్దేశం.

BRAOU

**అభ్యాసం-1: గ్రాఫిక్ అంటే ఏమిటి?**

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

## 27.3 రూపకల్పన

గ్రాఫిక్స్ రూపకల్పనలో చిత్రీకరణ అంశాలు, సాంకేతిక వనరులు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. గడచిన దశాబ్దకాలంలో పత్రికా ముద్రణ విషయంలో వచ్చిన పెనుమార్పులు గ్రాఫిక్స్ రూపకల్పనను సైతం ప్రభావితం చేయగలిగాయి. ముద్రణ టెక్నాలజీలో ముడిపడ్డ గ్రాఫిక్స్ రూపకల్పనను విశ్లేషిస్తే మూడు ప్రధాన దశలు మనకు కనిపిస్తాయి. అవి : 1) మాన్యువల్ గ్రాఫిక్స్ (2) మెకానికల్ గ్రాఫిక్స్ (3) కంప్యూటర్ గ్రాఫిక్స్. ఈ మూడు దశలలోను అంతర్దశలుగా మరికొన్ని దశలూ కనిపిస్తాయి. ఈ దశలు, అంతర్దశలూ అన్నీ కలిసి గ్రాఫిక్స్ రూపకల్పనలో - పరిణామ క్రమాన్ని వర్తిస్తాయి. మూడు దశలలోను మనకు 'ఆర్టిస్ట్' ప్రమేయం కన్పిస్తుంది. అయితే మాన్యువల్ దశలో ఆర్టిస్ట్ పరిధులు వేరు. కంప్యూటర్ దశలోని పరిధులు వేరు. అలాగే అవకాశాలు, కొత్తదనాలు కన్పించినా ప్రాథమికంగా కొన్ని అంశాలు మాత్రం కీలకమైనవిగానే కొనసాగుతున్నాయి. చిత్రీకరణ

సంఘటనం (Picture Composition) రంగులు (Colour) స్పష్టత పరిధి (Contrast range) కొలమానం (scale) వంటివి ఈ కోవలోకి వచ్చే అంశాలు.

పత్రికలలో ప్రచురించే గ్రాఫిక్స్ ఉద్దేశాలు బట్టి ఈ నాలుగు కీలక అంశాలు కొద్ది హెచ్చు తగ్గులలో ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. ప్రస్తుత విషయచర్యను విస్తృతపరిధిలో పరిగణించినప్పుడు మూడు లక్ష్యాలు గ్రాఫిక్స్ రూపకల్పన విషయంలో చెప్పుకోవచ్చు. అవి - (1) వార్తా విలువలను ప్రతిబింబించడానికి, (2) విజ్ఞాన సంబంధ విలువలకోసం (3) వాణిజ్య ప్రకటనల కోసం మనం పత్రికల్లో వస్తున్న గ్రాఫిక్స్‌ను గనుక ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం అర్థం కాకపోదు. గ్రాఫిక్స్ ప్రచురణ లక్షణాలు, ఉద్దేశాల ఆధారంగానే సాంకేతిక - మానవ వనరుల వినియోగం, ఆర్థిక అంశాల వెసులుబాటు కన్పిస్తాయి. వాణిజ్య ప్రకటనల కోసం రూపొందించే 'గ్రాఫిక్స్'ను చూస్తే మనకు ఇది అర్థం కాకపోదు.

ఎంత సాంకేతికంగా అవకాశాలున్నా, ఆర్థిక పరంగా వెసులుబాటు ఉన్నా 'ఆర్టిస్టు' తర్వాతే. ఆర్టిస్టు ఊహాకల్పన తర్వాతే. టెక్నాలజీ ఏదైనా మనం చెప్పింది చెయ్యగలదేకాని తనంతతానుగా ఏదీ నిర్వహించలేదు. గ్రాఫిక్స్ రూపకల్పనలో - ఆర్టిస్టు కళాత్మక అంశాలనే కాకుండా మరెన్నో అంశాలను దృష్టిలో ఉంచుకోవాలి. గ్రాఫిక్స్‌ను ఒక రూపకల్పనగా మాత్రమే చూడకూడదు. పత్రికా రచనలో దానికున్న స్థానం ఏమిటి - అన్నది రచనా పరంగా, ప్రచురణ పరంగా - ఆలోచించాలి. రచనా పరంగా ఆలోచించినప్పుడు - ఏం చెప్పాలి, ఎలా చెప్పాలి, చెప్పాల్సిన రూపం ఏదీ, ఏ సందర్భంలో చెప్పాలి ఇలా ఎన్నో విషయాలు ఆలోచనలోకి వస్తాయి. దిన పత్రికలయితే ఒక విధానాన్ని - వార పత్రికలయితే మరో విధానాన్ని, మాస, త్రైమాసిక వగైరా, వగైరా పత్రికలయితే ఇంకో విధానాన్ని రూపకల్పన ప్రక్రియలో అవలంబించవలసి వస్తుంది. రాజకీయ కార్టూన్లు, టుమ్రీకార్టూన్లు, కేరికేచర్లు, పిల్లల సీరియల్‌ని కార్టూన్లు - ఫీచర్లలో పొందుపరచే చిత్రీకరణలు మనం చూస్తూనే ఉంటాం. ఫొటోలు ప్రచురించడాన్ని గమనిస్తాం. కొన్ని ఉదాహరణలు మీ పరిశీలన కోసం కింద ఇస్తున్నాం. పరిశీలించండి.

ప్రచురణపరంగా ముద్రణ విధానం ఒక ఎత్తైతే, సాంకేతిక వనరులు మరొక ఎత్తు. పత్రికలలో ఈ అంశాలే పత్రికా ప్రచురణలో సౌష్ఠవాన్ని (symmetry) తులనాత్మకతను (Balance) కళాత్మకతను (aesthetics) ఆపాదిస్తాయి. గ్రాఫిక్స్ రూపకల్పనలో ఈ సందర్భంగా ప్రముఖ భూమికను నిర్వహించే ప్రస్తావనలు కొన్ని ఉన్నాయి. ముద్రణాక్షరం సైజు మార్పును, బ్రేకర్లు, పేరాగ్రాఫులు, ముద్రణ బరువులను సమంగా ఏర్పాటు వంటివి ప్రస్తావించదగ్గవి. మనం చదివే అలవాట్లను బట్టి రూపకల్పన విధానం శాసించబడుతుంది. భారతీయ భాషల్లో చాలా భాషలు ఎడమనుంచి కుడివైపుకు చదువుకుంటూ పోతాం. అదే జపాన్ వంటి దేశాల్లో పైనుంచి కిందకి, అరబిక్, ఇస్లామిక్ దేశాలలో కుడినుంచి ఎడమకి చదువుతారు. ఇవన్నీ కూడా గ్రాఫిక్ రూపకల్పనాంశాలే. గ్రాఫిక్ రూపకల్పనలో ధ్యేయం కన్పిస్తుంది. గ్రాఫిక్స్ అవసరం కన్పిస్తుంది. విస్తారమైన అవకాశాలు కన్పిస్తాయి. క్రియేటివిటీకి ఆస్కారాలూ ఉన్నాయి. గ్రాఫిక్స్ రూపకల్పనలో ఇంకా వైవిధ్య లక్షణాలు ఇమిడి ఉన్నా గ్రాఫిక్స్ ఉన్నవి ప్రాథమికంగా పత్రికా ప్రచురణలో 'లే అవుట్, డిజైనింగ్ ప్రక్రియలో' అంతర్భాగాలు. పత్రికకు ఆయువుపట్టు వంటివి కావడం వల్లే గ్రాఫిక్స్ రూపకల్పన ఒక సంక్లిష్ట ప్రక్రియగాను, ఒక సమ్మిళిత విధానంగానూ కన్పిస్తుంది. పత్రికా రచనలో గ్రాఫిక్స్ రూపకల్పన ఒక చలన ప్రక్రియ. నిరంతరం మార్పుల్ని సొంతంచేసుకుంటూ, కొత్తదారులు తొక్కగలిగే సత్తా వీటికుంది.

## 27.4 నిర్మాణం - ముద్రణాంశాలు

గ్రాఫిక్స్ నిర్మాణం ఒక ప్రత్యేక సాంకేతిక ప్రక్రియ. రూపకల్పన గావించిన చిత్రీకరణను స్పష్టంగా తిరిగి సృష్టించడం ప్రత్యేక కళ. చిత్రీకరణను స్పష్టంగా తిరిగి సృష్టించడాన్నే (reproduction) నిర్మాణం అనే అర్థంలో చర్చించడం చేస్తున్నాం. ముద్రణాపరంగా 'నిర్మాణమే' అన్న భావంతోనే చర్చిస్తున్నాం. చిత్రీకరణచేసిందాన్ని ఉన్నదున్నట్టుగా తిరిగి రూపొందించడం - 'నిర్మాణం' అనడం జరిగింది కాబట్టి ముద్రణాంశాలు ప్రస్తావించడం తప్పనిసరి. అయితే ముద్రణాంశాలు కేవలం సాంకేతిక పరికరాలకే పరిమితం కాదు. చిత్రీకరణకు వర్తిస్తాయి. చిత్రీకరణ (Visual) ఉద్దేశం ఏమిటి? - అనేది ప్రాథమికమైన ప్రశ్న. దృశ్యం - దృష్టిని ఆకర్షిస్తుంది. కేంద్రార్థాన్ని చెప్పే ప్రయత్నం చేస్తుంది. ఇందుకోసం ఎన్నో రకాలైన చిత్రీకరణ విధానాలను

BRAOU

పాటిస్తాం. రేఖాచిత్రాలు, ఫొటోలు, ఏనిమేషన్, కార్టూన్లు ఇలా అనేకమైన చిత్రీకరణ విధానాలు కన్పిస్తాయి. ఏదైనా విషయాన్ని వర్ణించడానికి, ప్రతిబింబించడానికి, చిత్రీకరణ చేస్తాం. ప్రక్రియను వర్ణించే ప్రయత్నము చేస్తాం. ఒక వస్తువునో, సంఘటనలో గుర్తించడానికి వీలు 'సింబలైజ్' చేస్తాం. మరోవైపు ముద్రణా ప్రక్రియలో చోటుచేసుకుంటూ వస్తున్న విప్లవాత్మకమైన మార్పులు గ్రాఫిక్స్ నిర్మాణం (Graphics) లో ఎంతో వెసులుబాటును కల్పిస్తున్నాయి. 'లెటర్ ప్రెస్' ప్రచురణలు కలిగిన రోజుల్లో గ్రాఫిక్స్ నిర్మాణం ఎంతశ్రమతో కూడుకున్న పనిగా ఉండేదో వేరే చెప్పనవసరం లేదు. ఒక్కో చిత్రీకరణను ఒకటికి రెండుసార్లు 'టచప్' 'రీటచప్' చేస్తేనేగానీ గీసిన చిత్రం గీసినట్టుగా కన్పించేది కాదు. అలాగే కలర్ ఫొటో ముద్రణ రాకముందు నలుపు తెలుపు చిత్రాల ముద్రణ పరిస్థితీనూ. ఆఫ్‌సెట్ ముద్రణ, గ్రావ్యూర్ ముద్రణ పద్ధతులు వచ్చాక గ్రాఫిక్స్ నిర్మాణంలో ఎంతో వెసులుబాటు కన్పించేది. కంప్యూటర్ల ప్రవేశం తర్వాత గ్రాఫిక్స్ రూపకల్పన - నిర్మాణంలో వచ్చిన మార్పులు గణనీయమైనవి. గడచిన ఒకటి, రెండు దశాబ్దాలలో పత్రికా ప్రచురణలను చూస్తే ఈ మార్పుని స్పష్టంగా కన్పిస్తాయి

చిత్రీకరణలో మరోవైపు మనకు కన్పించే అంశాలు కొన్ని లేకపోలేదు. చిత్రాల విషయంలోనైతే - కాంట్రాస్ట్, ప్రపోర్షన్, సింప్లిసిటీ, కలర్ - వంటివి. అక్షరాల - లిపి విషయంలో మాత్రం అక్షరం రకం, సైజులు, వివిధ విధాలైన అక్షరాలు, స్క్రీన్‌లు, రివర్స్ అక్షరాలు వంటివి కన్పిస్తాయి. గ్రాఫిక్స్ నిర్మాణంలో వీటితోపాటు కన్‌సిస్టెన్సీ, కంటిన్యూటీ, లైన్లు, వ్యాసాల మధ్యలో ఖాళీస్థలం, మార్జిన్‌లు వంటివీ ప్రధాన భూమికనే నిర్వహిస్తాయి. గ్రాఫిక్స్ నిర్మాణ ప్రక్రియలో ఈ విషయాల పట్ల సమగ్ర అవగాహనంటూ ఒకటి ఉండాలి. గ్రాఫిక్స్ నిర్మాణం ద్వారా - చిత్రాల స్పష్టత, అక్షరాల స్పష్టత రావాలి. గ్రాఫిక్ రూపకల్పనను అచ్చుగుద్దినట్టు ఉన్నది ఉన్నట్టుగా కన్పించడం పత్రికా ప్రచురణ నాణ్యతను పెంచడమే కాకుండా. నిర్మాణ ప్రక్రియలో కొత్త కొత్త పోకడలను సృష్టించడానికి దోహదపడ్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమూ గ్రాఫిక్స్ నిర్మాణాన్ని మరింత సమర్థవంతమైన అంతర్భాగంగా పత్రికా ప్రచురణ అందిస్తుంది.

## 27.5 కొత్త టెక్నాలజీల పాత్ర

కంప్యూటర్‌ల మూలంగా పత్రికా రచయితలు సృజనాత్మక కళాకారులుగా మారిపోయారు. పాత్రికేయులకు అనుగుణమైన డి.టి.పి ప్యాకేజీలను అధునాతన కంప్యూటర్‌లు అందిస్తున్నాయి. పేజ్ లే అవుట్ లేదా పేజ కంపొజిషన్ ప్యాకేజీలు అనే కంప్యూటర్ ప్రోగ్రాముల ద్వారా పాత్రికేయులు తమ అభిలాషలు, ఊహలకు అనుగుణంగా పేజీలు రూపొందించుకోవచ్చు. పాత్రికేయుడు తాను కంపోజ్ చేసిన వార్తను కంప్యూటర్ తెరపై చూసుకుంటూ పేజీలు తనకిష్టమొచ్చిన రీతిలో అమర్చుకోవచ్చు. పేజ మేకప్‌నకు అనువుగా వార్తలు పెంచుకోవడం లేదా తగ్గించుకోవడం చేసుకోవచ్చు. వార్తలకు బాక్సులు కట్టడం, తగిన ఫొటోలను అమర్చడం కూడా కంప్యూటర్‌ల ద్వారా అత్యంత సులభమైపోయింది. మనం నిత్యం చేసే ఒక్కో విధమైన పనికి ఒక్కో రకమైన డిటిపి ప్రోగ్రాం ఉంటుంది. సాధారణ సాఫ్ట్‌వేర్ ప్యాకేజీ ద్వారా ఒకపేజ డాక్యుమెంట్‌ను రూపొందించుకోవచ్చు. వివిధ రకాల అక్షర రూపాల (ఫాంట్) తో వివిధ రూపాలలో వార్తలను అమర్చడానికి ఫొటోలు అమర్చడానికి భిన్న పద్ధతులు గల డిటిపి ప్యాకేజీలున్నాయి. పూర్వము పత్రికా రచయితలు కంపొజిటర్ల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసి వచ్చేది. దీనివల్ల ఎంతో జాప్యం జరిగి ఇబ్బందులు ఎదుర్కొవ వలసి వచ్చేది.

డిటిపి విధానం ద్వారా పాత్రికేయుని సౌలభ్యం పెరిగింది. పర్సనల్ కంప్యూటర్‌కు సంబంధించి కొన్ని సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాములకు సంబంధించి కొద్దిపాటి శిక్షణ పొందినట్లయితే పత్రికా రచయిత తన పనిని ఎవరిపై ఆధారపడకుండా చేసుకోగలడు. అందువల్ల గ్రాఫిక్ రూపకల్పనకు సంబంధించి కొన్ని సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాములను తెలుసుకోవడం అవసరం.

### 27.5.1 ఆల్డస్ పేజ్‌మేకర్

ఇది చాలా పేరొందిన సాఫ్ట్‌వేర్ ప్యాకేజి, దీనిని ఎప్పటికప్పుడు అధునాతనంగా మారుస్తుండడం వల్ల ఎంతో సౌలభ్యం ఏర్పడింది. ఇప్పుడు దీని '7-0' తరహా మార్కెట్‌లో ఉంది. దీని ద్వారా కంపోజ్ చేసిన వార్తలను పేజీల రూపంలో తమ

BRAOU

అభిరుచుల కనుగుణంగా అమర్చుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌ను తెరవగానే మనకు పేజి స్వరూపము తెరపై కనిపిస్తుంది. ఈ ఖాళీ పేజిలోకి వార్తలను ఎక్కించుకోవచ్చు. సౌకర్యాన్నిబట్టి వార్తలను పేజీలోని ఆ మూలకు ఈ మూలకు జరుపుకోవచ్చు. వివిధ రకాల అక్షర రూపాలను కూడా ఉపయోగించుకోవచ్చు. ఏ వార్తకు లేదా హెడ్డింగ్‌కు ఏ రంగు ఇవ్వాలి అనేది కూడా నిర్ణయించుకోవచ్చు. "పేజ మేకర్" అది నుంచి డాక్యుమెంట్లు, బ్రోచర్లు, న్యూస్‌లెటర్లు, తయారు చేయడానికి ఎక్కువగా ఉపయోగించేవారు - ఇందులో అక్షరాలను అనుకున్న రీతిలో మార్చుకోవచ్చు - అక్షరాల పరిమాణము పెద్దగా చిన్నగా మార్చడమే కాకుండా అక్షరాలను ఇటాలిక్స్‌లలో గాని ఒకవైపు వంగి ఉన్నట్లుగా (స్లాంట్) గాని ప్రముఖ చిత్రకారుడు బాపు అక్షరాల రూపంలో గాని మార్చుకోవచ్చు. వార్తను హెడ్డింగ్‌ను లేదా బొమ్మను తలక్రిందులుగా గాని, వాలుగా గాని త్రిప్పిపెట్టడం కూడా ఇందులో సాధ్యమవుతుంది.

### 27.5.2 వెంచుర పబ్లిషర్

ప్రసిద్ధమైన సాఫ్ట్‌వేర్ ప్యాకేజీలలో వెంచుర పబ్లిషర్ ఒకటి. ఐబిఎమ్ కంపెనీకి చెందిన డెస్క్ టాప్ పబ్లిషింగ్ (డి.టి.పి) ప్యాకేజిలలో ఇది ప్రధానమైంది. "పేజి మేకర్"లాగ ఇది నేర్చుకోవడానికి అంత సులభమైంది కానప్పటికి దీనికి కొన్ని ప్రత్యేకమైన ఉపయోగాలున్నాయి. ఒకే ఫార్మాట్‌లో ప్రచురించే పుస్తకాలు డాక్యుమెంట్లు తదితరమైన వాటికి ఇది ఉపయోగకరంగా ఉంటుంది. దీని ద్వారా కొన్ని స్పెషల్ ఎఫెక్ట్స్ తీసుకరావచ్చు. ఒక వస్తువును మరో వస్తువుతో సంధానం చేయవచ్చు. ఒక నల్లని చదరపుగడి మరో తెల్లని చదరపు గడిని కలిపి కొంత నలుపు కొంత తెలుపు ఛాయగల గడిని రూపొందించవచ్చు. ఒక రూపాన్ని మరో రూపంగా మార్చవచ్చు. ఉదాహరణకు కుక్కకు కోతి ముఖం తగిలించవచ్చు.

కొన్ని ప్రధానమైన ప్రయోగాలను డ్రాయింగ్ ప్రోగ్రాముల గురించి తెలుసుకుందాం.

### 27.5.3 అడోబ్ ఇలస్ట్రేటర్

వృత్తి పరమైన కళాకారులకు డిజైనర్‌లకు ఇది ఎంతో ఉపయోగకరమైనది. దీనిలో ఒక వస్తువును రూపొందించిన తర్వాత దానిని మనం ఇష్టం వచ్చిన రీతిలో మార్చుకోవచ్చు. ఆ వస్తువు పరిమాణాన్ని పెంచవచ్చు తగ్గించవచ్చు. అడ్డంగా నిలువుగా సాగదీయవచ్చు - అంతే కాకుండా గ్రాఫిక్‌లను కూడా బొమ్మల మాదిరిగా ఇష్టం వచ్చిన రీతిలో మార్చుకోవచ్చు.

### 27.5.4 ఆల్డస్ ఫ్రీ హాండ్

1988లో విడుదలైన ఈ సాఫ్ట్‌వేర్ ప్యాకేజ అడోబ్-ఇలస్ట్రేటర్ ప్రోగ్రామ్స్‌కు గట్టి పోటిగా నిలిచింది. దీనిలో వస్తువు ప్రధాన రూపు రేఖలు మాత్రమే కనిపిస్తాయి. ప్రివ్యూమోడ్‌లో వస్తువు మొత్తాన్ని పరిశీలించవచ్చు. దీనికి కొన్ని అదనపు సౌకర్యాలున్నాయి. అడోబ్ ఇలస్ట్రేటర్ ఆల్డస్ ఫ్రీ హాండ్‌లే గాకుండా ఐబిఎమ్‌కు చెందిన కోరల్ డ్రా, హార్వర్డ్ డ్రా ప్రోగ్రాములు కూడా ఉన్నాయి.

### 27.5.5 కోరల్ డ్రా

విండో బెస్ట్ ఇలస్ట్రేషన్ ప్యాకేజ్‌లలో కెల్ల ఈ కోరల్ డ్రాకు ఎంతో పేరుంది. దీనిలో మున్న పలు ప్రత్యేకతల మూలంగా గ్రాఫిక్ రూపకల్పన అతి సులభంగా ఉంటుంది. ఇందులో 150 టైప్ ఫేస్‌లు ఉండటం విశేషం.

### 27.5.6 హార్వర్డ్ డ్రా

హార్వర్డ్ డ్రా ఇటీవలనే రూపొందింది. మిగతా ఇలస్ట్రేషన్ ప్యాకేజిల కుండే ప్రత్యేకతలన్ని దీంట్లో ఉన్నాయి. గ్రాఫిక్స్‌ను ప్రివ్యూ మోడ్‌లో సృష్టించగలగడం మల్టిపుల్ లేయర్స్, మల్టిపుల్ లెవెల్స్ కలగియుండడం దీని ప్రత్యేకత. కంపోజయిన టెక్స్ట్‌ను నేరుగా తెరపైకి తెచ్చి ఎడిట్ చేసుకోవచ్చు.

BRAOU

**అభ్యాసం-2:** **పేజిమేకర్ గురించి వివరించండి.**

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

..........................................................................................................................................

## 27.6 గ్రాఫిక్స్ ప్రచురణకు సూచనలు

గ్రాఫిక్స్ ప్రక్రియ సాంకేతికమైంది అని గుర్తించాలి. కళాత్మక విలువలు ఉన్నాయనీ గమనించాం. సాంకేతిక, కళాత్మక విలువల్ని అర్థవంతంగా, సమర్థవంతంగా మిళితం చేయగలిగితేనే పాఠకుడి దృష్టిని ఆకట్టుకోగలదు. పత్రికా ప్రచురణే పాఠకుడిని ఆకట్టుకోవడం తప్పనిసరి. పత్రికా రచనలో కృషిచేస్తున్న వారెవరైనా సరే గ్రాఫిక్స్ ప్రచురణకు సంబంధించి కొన్ని ప్రాథమిక అంశాల్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు.

★ గ్రాఫిక్స్ క్లిష్ట భావాలను సరళంగా చెప్పగలగాలి. సంక్లిష్టమైన ప్రక్రియలను సులభంచేయాలి. వాస్తవాలను సూటిగా చెప్పాలి. వీటిని చెప్పడంలో, ప్రతిబింబించడంలో నేర్పు కావాలి. గ్రాఫిక్స్ రచయిత ఆలోచనా పరిధి విస్తృతం చేసుకోవాలి. సృజనాత్మకంగా ఆలోచించగలగాలి

★ గ్రాఫిక్స్ ఊహలను ప్రస్తావించగలవు. ఊహాజనితమైన గ్రాఫిక్స్ రూపకల్పనలో 'క్రమత్వం' ఉండాలి. నిర్దేశిత పాఠకుడి మనోస్థాయిని స్పృశించడం చేయాలి.

★ గ్రాఫిక్స్ పత్రికా ప్రచురణలో అంతర్భాగం. పత్రికకు అందాన్నిస్తాయి. ఆకర్షణను కల్పిస్తాయి. గ్రాఫిక్స్ ఏర్పాటులో తగిన శ్రద్ధ చూపాలి. కళాత్మక విలువల దృష్ట్యా వాటి ఏర్పాటు జరగాలి.

★ పత్రికా ప్రచురణలో - గ్రాఫిక్స్ ప్రచురణ చేసే సందర్భాల్లో పాఠకుల పఠనా విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. కొందరు కుడినుంచి ఎడమకు చదువుతారు. మరికొన్ని దేశాలవారు ఎడమనుండి కుడికి చదువుతారు. ఈ లక్షణాలను బట్టి చిత్రీకరణ విధానమూ, ప్రచురణ శైలీ మారుతాయి. పత్రికా రచయిత వీటిని దృష్టిలో ఉంచుకోగలగాలి.

★ కంప్యూటర్ రంగంలో వస్తోన్న విప్లవాత్మకమైన మార్పులు - పత్రికా ప్రచురణను పెద్ద ఎత్తున ప్రభావితం చేయడం కనిపిస్తుంది. కంప్యూటర్ భాషలో చిత్రీకరణ, గ్రాఫిక్స్ రూపకల్పనలో వచ్చే కొత్త పోకడలను, కొత్త విన్యాసాలను గుర్తిస్తూ వాటి వినియోగం జరగాలి.

## 27.7 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ గ్రాఫిక్స్ అనేవి పత్రికార్థంలో బొమ్మలు, రేఖలు గుర్తుల రూపంలో కన్పించే చిత్రీకరణాలని ప్రస్తావించాం.

★ సంక్లిష్టమైన భావాలను, వాస్తవాలను, ప్రక్రియలను తేలికైన అర్థంలో గ్రాఫిక్స్ చెప్పగలవని తెలుసుకున్నాం.

★ బరువైన విషయాన్ని నొప్పించని భాషలో చెప్పగల ధైర్యం కార్టూన్లవంటి గ్రాఫిక్స్‌కు ఉందని గ్రహించాం.

BRAOU

★ సంఖ్యాపరంగా ఉండే దత్తాంశాల గ్రావులు ఎంతగానో తోడ్పడ్డాయని చర్చించుకున్నాం.

★ పత్రికా ప్రచురణలో 'అర్టిస్ట్' ఒక ప్రధాన వ్యక్తిగా గుర్తించాం.

★ ఆర్టిస్ట్ పరిది సాంకేతిక పరిజ్ఞానం పెరుగుదలలో పాటు విస్తరిస్తూ వస్తోంది.

★ కంప్యూటర్ యుగమైన ఈ రోజుల్లో 'ఆర్టిస్టు' పరిధి ఎలాంటిదో అవగాహనలోకి వచ్చింది.

★ పత్రికలలో గ్రాఫిక్స్ పరిధిని, విస్తారాన్ని గ్రహించాం.

★ వార్తా విలువలకోసం, సమాచారాల కోసం, వాణిజ్య ప్రకటనల అవసరాలకోసం గ్రాఫిక్స్ తోడ్పాటు అనల్పమైంది.

★ ప్రస్తుతం పత్రికా ప్రచురణ రంగంలో వస్తోన్న మార్పుల్లో గ్రాఫిక్స్ స్థాయిని పరిశీలించాం.

★ కళాత్మక అంశాలు, సాంకేతిక వనరుల ప్రమేయాన్ని విపులంగా చర్చించాం.

★ గ్రాఫిక్స్ రూపకల్పనలో, నిర్మాణంలో వచ్చే పలు అంశాల్ని క్లుప్తంగా చర్చించుకున్నాం.

★ నిర్మాణంలో ప్రస్తావనకొచ్చే ఉద్దేశాల్ని తెల్సుకున్నాం.

★ గ్రాఫిక్స్ ప్రచురణలలో స్పష్టతను ఎలా సాధించాలో తెలుసుకునే ప్రయత్నంచేశాం. కావల్సిన అవసరాల్ని, ఆస్కారాల్ని పరిశీలించాం.

★ గ్రాఫిక్స్ ప్రచురణకు సంబంధించి కొన్ని సూచనలని క్లుప్తంగా చర్చించుకున్నాం.

BRAOU

## 27.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1) పత్రికలలో గ్రాఫిక్స్ ప్రాధాన్యతను వివరించండి?

2) గ్రాఫిక్ నిర్మాణంలో కొత్త టెక్నాలజీ పాత్రను పేర్కొనండి.

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1) గ్రాఫిక్స్ అంటే ఏమిటి?

2) కోరల్ డ్రా?

**- డి. నాగార్జున**

# భాగం - 28 : తెలుగుఫాంట్లు - వికాసం

## విషయక్రమం


28.0 ఉద్దేశం

28.1 ప్రవేశిక

28.2 పత్రికా ప్రచురణ - ముద్రణ

28.3 తెలుగు ఫాంట్లు - పరిణామాలు

28.4 ముద్రణలో వచ్చిన పరిణామాలు

28.5 పత్రికా ప్రచురణ : భవిష్యత్తు

28.6 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

28.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 28.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తర్వాత మీరు ఈ కింది విషయాలను వివరించగలుగుతారు.

- పత్రికా ప్రచురణ, ముద్రణారంగంలో వచ్చిన పరిణామాల మధ్యగల సంబంధం
- అక్షర స్వరూపాలపైన ముద్రణారంగంలో వచ్చిన విప్లవాత్మక పరిణామాలు చూపే ప్రభావం
- పత్రికలలో తెలుగు అక్షర స్వరూపాల వికాసం.
- పత్రికల ప్రచురణలో గుణాత్మకంగా, కళాత్మకంగా రూపుదిద్దుకొంటున్న మార్పులు కొత్త టెక్నాలజీల ఆవిర్భావం, కంప్యూటరీకరణ, అక్షరాల కూర్పులో ఆటోమేషన్‌ల గురించి తెలుసుకుంటారు.

BRAOU

## 28.1 ప్రవేశిక

1450లో జాన్ గుటెన్‌బర్గ్ ముద్రణ విధానాన్ని కనుగొన్నారు. తొలిరోజుల్లో కదిలే లోహ ముద్రణ అక్షరాల ద్వారా ముద్రణ జరిగేది. డచ్ మిషనరీల ప్రయత్నాలు వల్ల 1556 ప్రాంతంలో భారతదేశంలోకి 'లెటర్‌ప్రెస్' రూపంలో ముద్రణ (printing) అడుగుపెట్టింది.

భారతదేశంలో వెలువడిన మొట్టమొదటి వార్తాపత్రిక 'బెంగాల్ గెజట్' ఇంగ్లీషులో ప్రచురించబడింది. ఇది 1780లో కలకత్తా నుంచి వెలువడేది. జామ్స్ ఆగస్టస్ హికీ దీన్ని ప్రచురించాడు.

అక్షరాల కూర్పు చేతితో చేసేవారు. తర్వాత ఫొటో టైప్‌సెట్టింగ్ ద్వారా జరిగేది. ఇప్పుడు కంప్యూటర్లు ఈ పనిచేస్తున్నాయి. ముద్రణ యంత్రాల విషయంలో సైతం గణనీయమైన అభివృద్ధి జరిగింది. చేతితో నడిచే యంత్రాలు క్రమేపి కనుమరుగవుతూ పూర్తి స్వయంచలన (automatic) యంత్రాల ప్రవేశం. ఆ తర్వాత కంప్యూటర్లే ముద్రణ యంత్రాలను నడిపించే స్థాయికి టెక్నాలజీ వెళ్లగలిగింది.

లోహాలను కరిగించి అక్షరాలు అచ్చులు రూపొందించడం పోయి 'డిజిటల్' అక్షర స్వరూపాలు వచ్చాయి. అక్షర స్వరూపాల తయారీలోనే కాదు, వాటి రూపురేఖల్లోనూ మార్పులు చేర్పులు రాగలిగాయి. ఈ అక్షర స్వరూపాల (ఫాంట్ల) లోని వికాసం పత్రికా ప్రచురణకు కొత్త వొరవడిని తెచ్చిపెట్టింది. వార్తా కథనాల స్వరూపాలు, అమరికలో కొత్తదారుల్ని వెదుక్కోగలిగాయి. శీర్షికల ప్రదర్శనలోనూ, పేజీల అలంకరణ విషయంలోనూ గణనీయమైన మార్పులే వచ్చాయి. ఈ వికాసం కేవలం ఇంగ్లీషు పత్రికల ప్రచురణకే పరిమితమవలేదు. ఇతర భారతీయ భాషల పత్రికలను తాకగలిగింది. తెలుగు భాషా పత్రికల ప్రచురణలో ఇటీవల వస్తున్న కొత్తదనం మనందరికీ పరిచయమే అక్షరాలూ, బొమ్మలూ కంటికి ఇంపైన రంగుల్లో చూస్తున్నాం. ఈ దశాబ్దిలో పత్రికల ముద్రణలో కళాత్మకత పెరిగింది.

## 28.2 పత్రికా ప్రచురణ : ముద్రణ

పత్రికా ప్రచురణ అనగానే ముద్రణ అనే భావిస్తాం. కానీ ముద్రణ వేరు. పత్రికా ప్రచురణ విషయంలో ప్రచురణకు, ముద్రణకు ప్రత్యేకత ఉంది. వార్తా పత్రికలలో, ముఖ్యంగా దినపత్రికలలో ప్రతి వార్తకు శీర్షిక ఉంటుంది.. పెద్ద పెద్ద అక్షరాలలో శీర్షిక ఉంటుంది. ఈ అక్షర స్వరూపం వార్త ప్రాధాన్యాన్ని బట్టి పెరుగుతూ పోతుంది. వార్తల వివరణ భాగంలో అక్షరాల పరిమాణం చిన్నదౌతుంది. వార్తలు ఒక్క నిలువుగడి, రెండు నిలువుగళ్ల వెడల్పులో ప్రచురిస్తారు. శీర్షికలో ఇతోధిక ప్రభావాన్ని ఆశించినప్పుడు అసాధారణ అక్షరస్వరూపా (Font) లను వాడతారు. ఈ అంశాలన్నీ కూడా పత్రికా ప్రచురణకూ, ముద్రణకూ ఉన్న అనుబంధాన్ని సూచిస్తాయి. పత్రికా ప్రచురణలో ముద్రణకు సంబంధించిన అంశాలను ప్రస్తావన చేసేలా చేస్తాయి.

ముద్రణాపరంగా టెక్నాలజీ కల్పిస్తున్న కొత్త ధోరణులు, అక్షర స్వరూపాలలో వస్తున్న పరిణామాలు ఒక కీలకమైన రంగంగా పేర్కొనవచ్చు. పత్రికా ప్రచురణ స్వరూప స్వభావాలను పెద్ద ఎత్తున ప్రభావితం చేయగలిగిన సామర్థ్యం వీటికి ఉండటమే దీనికి ప్రధాన కారణం.

ముద్రణ లక్షణాలు పత్రికా కార్యాలయంలో అందుబాటులో ఉన్న అక్షర స్వరూపాలు (Types), అక్షర ముఖాలు (Type Faces), వాటి పరిమాణాల (Sizes) పైన ఆధారపడి ఉంటాయి. చిన్న పత్రికలపైన వీటి ప్రభావం అధికం. వీటికి తోడు అక్షర స్వరూపాల్లోని వైవిధ్యమూ(change in fonts) అంతరమూ (contrast), తెల్లజాగా (white space) సంతులనమూ (Balance) అనే నాలుగు లక్షణాలు పత్రికా ప్రచురణలో అతి ముఖ్యమైనవి. పేజీనిండా నల్లటి అక్షరాలే ఉండి, సుదీర్ఘ వాక్యాలవల్ల తెల్లటిజాగా ఎక్కడా కన్పించకపోతే చదవటం ఎంత కష్టమో ఒకసారి ఊహించి చూడండి. మీకే అర్థమౌతుంది.

BRAOU

ముద్రణలో సాంకేతిక అభివృద్ధి కల్పించిన అవకాశాలతోపాటు, కొన్ని పరిమితులు లేకపోలేదు. లోహ ఖండాలతో అచ్చు కావలసిన అక్షరాలనూ, పంక్తులనూ బిగించి కట్టి ముద్రణకు సిద్ధంచేసే పాత పద్ధతితో పోలిస్తే ఇప్పటి పత్రికా పేజీ అలంకరణ పద్ధతి అనియంత్రితం. అక్షరాల, పంక్తుల మధ్య అంతరాల కల్పన (spacing) పూర్వమున్నంత కచ్చితంగా లేదు. క్రమబద్ధత లోపించడాన్ని గమనిస్తాం.

పత్రికా ప్రచురణలో ముద్రణాపరంగా ఆలోచించినపుడు మరెన్నో అంశాలు ఇటువంటివే మంచీ, చెడూ రెండూ కన్పిస్తాయి. రాసే శీర్షికలో పెద్దక్షరాలు, పల్చటి (thin), మొద్దక్షరాల (bold letters) వాడకం, చదివే అలవాట్లు, పేజీల పునర్వ్యూహనం, పేజీల అలంకరణ, ఆకర్షణల మధ్య అంతరం, మారుతున్న టెక్నాలజీల పట్ల అవగాహన వంటివి పత్రికా ప్రచురణలో ముద్రణాపరమైన అంశాలుగా భావించవచ్చు. అక్షర స్వరూపం, ముద్రణా యంత్రం కలిసికట్టుగా కనిపిస్తాయి కాబట్టి వీటిల్లో కలిగే పరిణామాలు సృష్టించే అవకాశాలు, పరిమితులలో ఒక అల్లికతత్త్వం కన్పిస్తుంది.

అభ్యాసం-1 : పత్రికా ప్రచురణలో ప్రధానమైన ముద్రణ అంశాలు ?

......................................................................................................................................................

......................................................................................................................................................

......................................................................................................................................................

......................................................................................................................................................

......................................................................................................................................................

## 28.3 తెలుగుఫాంట్లు - పరిణామాలు


ముద్రణ ప్రక్రియ వెలుగు చూసిన నాటినుంచి అక్షర స్వరూపాలను తీర్చిదిద్దే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. 1470లో నికోలస్ జెన్సన్ 'రోమన్' టైపు ముఖాలను రూపొందించాడు. వాటితో ఉండే 'ఇటాలిక్' తరహా అక్షరస్వరూపాలను అల్డస్ రూపొందించాడు. ఈ తర్వాత 19 శతాబ్దం దాకా అచ్చు యంత్రాలలో మార్పులూ, వాటితోపాటు ముద్రణ అవకాశాల విస్తరణ, అదే సమయంలో అమెరికాలో 'కాంటెంపరరీ' టైపు ముఖాలు రూపొందడం కనిపిస్తాయి. ఇంగ్లీషు అక్షర స్వరూపాలను ఆరు రకాలుగా వర్గీకరిస్తారు. అవి : గోతిక్ (Gothic), రోమన్ (Roman), శాన్‌సెరిఫ్ (Sanserif), హెబ్రూ (Hebrew or egipgram), కర్సివ్ (cursive or script), కాంటెంపరరీ (Contemporary) అక్షర స్వరూపాలు. ఇంగ్లీషులో 'ఫాంట్' అనే పదానికి సమానార్థంలో 'అక్షర స్వరూపం' వాడాం. అక్షర స్వరూపాల వికాసం గురించి ప్రస్తావించినప్పుడు. దానిలో ముడిపడి ఉన్న కొన్ని సాంకేతిక వివరాలు తెలుసుకోవాలి. అప్పుడే అక్షర స్వరూపాల వికాసం పట్ల సరైన అవగాహన కలుగుతుంది. తెలుగు ఫాంట్లకు ఇంచుమించు ఇవే సాంకేతిక వివరాలు వర్తిస్తాయి.

అక్షరం (Type) దీర్ఘచతురస్ర రూపంలో ఉండే లోహపు భాగం. దానికి వెడల్పు (width) లోతు (depth) ఎత్తు (height) ఉంటాయి. అక్షరం (Type) వెడల్పు, లోతు, సైజు, రూపం మీద ఆధారపడి ఉంటాయి. కానీ ఎత్తుమాత్రం మారదు అది 0.918" అక్షర స్వరూపాన్ని, దానిలో వివిధ భాగాలను కింద పొందుపరచిన చిత్రంలో గుర్తించవచ్చు. ఫాంట్లను పాయింట్లతో కొలుస్తారు. 1878లో ఈ రకమైన కొలమానం అమలులోకి వచ్చింది. ప్రపంచం యావత్తు ఈ కొలమానాన్నే అనుసరిస్తుంది. ఇక్కడ ఒక పాయింట్ అంటే ఒక అంగుళంలో 72 భాగం అన్నమాట. అంటే 0.0138" ఈ కొలత అతి చిన్నది కావడం వల్ల 12 పాయింట్లను ఒక పైకా (PICA) అంటారు. అక్షర స్వరూపాలు 4 నుండి 72 పాయింట్ల సైజు వరకు లభిస్తాయి. 72 పాయింట్లు దాటిన అక్షర స్వరూపాలను చెక్కలతో చేస్తారు.

BRAOU

ఒకే రకానికి చెందిన ఫాంట్లను ఒకశ్రేణి (series) గా వ్యవహరిస్తారు. ఒకే వర్గానికి చెందిన ఫాంట్లను ఒక కుటుంబం (family) గా చెప్తారు. ఫాంట్లు అనగానే కేవలం అక్షర రూపాలేకాకుండా, వాటికి తోడుగా ఉండే ముద్రణ రూపాలైన బార్డర్‌లను, రూల్‌లను, స్పేస్‌లను, లీడ్‌లను, ఫర్నిచర్‌లను కలిపి చెప్తారు. సంఖ్యలు, పైబడి, దిగవబడి అక్షరాలను కూడా వీటికి జతచేస్తారు.

A Set-width of body (వెడల్పు)
B Point-size of body
H Nick
J Foot
K Height of type piece (.918) (ఎత్తు)
L Shoulder



ముద్రణ యంత్రాలలో వచ్చిన సాంకేతిక అభివృద్ధి అక్షర స్వరూపాల మీద పడక తప్పలేదు. ఫొటో టైప్ కూర్పు,

కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ల దిశగా పయనించి ఇప్పుడు 'డిజిటల్ ప్రక్రియలోకి' అక్షర స్వరూపం అడుగిడింది. అయితే పెద్ద పెద్ద పత్రికా ప్రచురణ సంస్థలే ఈ ఆధునిక టెక్నాలజీలను అమలు చేస్తున్నాయి. 'లెటర్‌ప్రెస్' ముద్రణ ఇంకా అధికస్థాయిలోనే వినియోగంలో కొనసాగుతోంది. తెలుగు ముద్రణా రంగంలో దీన్ని దాటి వేరే పరిస్థితి కన్పించదు. 'లెటర్ ప్రెస్' ముద్రణ అవకాశాలు పెరిగాయి తప్ప తక్కువ మాత్రం కాదు.

తెలుగు ఫాంట్ల విషయానికొస్తే మొదటగా మనం గుర్తుచేసుకోదగ్గ విషయం ఒకటి ఉంది. అది ప్రపంచంలో అన్ని భాషల ముద్రణ ఒక ఎత్తు, తెలుగు ముద్రణ ఒక ఎత్తు - అనేది. తెలుగు అక్షరాలు కూర్చడానికి కంపోజిటర్ శతావధాని. సహస్రావధాని కావల్సి వచ్చేది. అన్న భావం కొందరి జ్ఞాపకాల్లోంచి ఇంకా చెరిగిపోలేదు.

భారతదేశంలో నాలుగు శతాబ్దాల కిందటే ముద్రణ ప్రారంభమయింది. 1807లో అచ్చయిన 'తెలుగు వ్యాకరణం' ఆ తర్వాత 1812లో బైబిల్ 'న్యూ టెస్టమెంట్' మొదటిసారి అచ్చయిన వాటిల్లో ఉన్నాయి. అవి అచ్చయింది ఆంధ్రరాష్ట్రంలో కాదు కలకత్తాలో. కలకత్తా సమీపంలోని శ్రీరామ్‌పూర్ ప్రాంతంలో 1746లో ఇంగ్లీషు పాదరీలు - డాక్టర్ మార్షమన్, డాక్టర్ క్యారీ. డాక్టర్ వార్ - తెలుగు, నాగరి, తమిళ, కన్నడం మున్నగు ఏడెనిమిది భాషల అక్షరాలు పోతపోయించారు. అయినా మొట్టమొదట తెలుగు పుస్తకాలు విదేశాలలోనే అచ్చయేవి.

**అభ్యాసం -2 : ఫాంట్లను కొలిచే విధానం ఏది?**

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

..................................................................................................................

BRAOU

తెలుగులో ఎక్కువగా వచ్చేది తలకట్టు గల అక్షరాలు. ఇప్పటి అక్షర రూపాల వాడుక వెయ్యి సంవత్సరాల పైనుంచే ఉంది. మధ్యలో లిపి సంస్కరణ ప్రయత్నాలు కొన్ని జరగకపోలేదు. ముద్రణ దృష్టితో చూస్తే అక్షరరూపాలు ఉత్తమమైనవి కాదని భావించేవారు ఉన్నా లిపి స్వరూపం చెడకూడదనే భావన ఉంది. తెలుగు అక్షరరూపాలను ముద్రించేందుకు వీలు కల్పిస్తూ కంపోజింగ్ గళ్లలో దాదాపు 700 దిమ్మలుంటాయి. లిపిని మార్చుకుంటేకానీ వీటి సంఖ్య కుదింపు సాధ్యం కాదు. అక్షర స్వరూపాలు స్వల్ప మార్పుకు లోనయ్యాయే తప్ప, పూర్తి మార్పు లేవీ రాలేదు. అదీ ముద్రణలో వచ్చిన మార్పులతో అన్వయం కోసమే అక్షర స్వరూపాలు తమని తాము మార్చుకోగలిగాయి. ఎక్కువ సందర్భాల్లో ఉన్న అక్షర స్వరూపాలే మెరుగు పడ్డాయి తప్ప లిపిలో సంబంధం పెట్టుకోలేదు. లెటర్‌ప్రెస్‌లో వాడే దిమ్మలు, తదితర ముద్రణాలయంలో కన్పించే పరికరాల చిత్రాలను కింద పొందుపరిచాం పరిశీలించండి.

ఆఫ్‌సెట్ ముద్రణ వచ్చినా, ఫొటో టైప్ సెట్టింగ్ అయినా. అక్షరాల రూపకల్పన కంప్యూటర్లే చేసినా మౌలికమైన మార్పులేవీ తెలుగుఫాంట్లలో కానరావు. ఆధునిక ముద్రణ విధానాల వల్ల పత్రికల అలంకరణలో మార్పు వచ్చింది. పత్రిక సుందరంగా, శుభ్రంగా, ఆకర్షణీయంగా తయారవుతూ పెద్ద పత్రికలకు లాభదాయకంగా పరిణమించింది. బ్లాక్‌మేకింగ్ వంటి బాధల నుంచి బొమ్మలు, చిత్రాలు బయటపడ్డాయి.

తెలుగు ఫాంట్లలో ఇంగ్లీషు భాషలో వచ్చినంతగా పెద్ద సంఖ్యలో 'శ్రేణులు' కన్పించవు. సాంప్రదాయకంగా వస్తున్న శ్రేణులే ముద్రణలో నాణ్యతకోసం, మారుతున్న సాంకేతికతలో అన్వయం కోసం మెరుగులు దిద్దుకోగలిగాయి. కాకపోతే ఒకటిరెండూ కొత్తశ్రేణులు వెలుగు చూడగలిగాయి. అందులోని చేతిరాత ఆధారంగా రూపొందిన ఫాంట్లు కొన్ని. దీనికి కంప్యూటర్ పరిజ్ఞానమే బాగా దోహదం చేసింది. 'బాపూ స్క్రిప్ట్' ఇందుకు ఒక ఉదాహరణ. తెలుగు అక్షర స్వరూపాల (font)

ను పరిచయం చేస్తూ పాయింట్ కొలమానాన్ని, పల్చటి, మొద్దక్షరాల మధ్య వ్యత్యాసం మీకు తెలియడం కోసం కొన్ని నమూనాలను ఈ కింద పొందుపరుస్తున్నాం పరిశీలించండి.

బాపు స్క్రిప్ట్

## 28.4 ముద్రణలో వచ్చిన పరిణామాలు

అన్ని యంత్రాలతోపాటు ముద్రణ యంత్రం కూడా ఎంతో అభివృద్ధి చెందింది. 9వ శతాబ్దంలో చైనాలో రిలీఫ్ ఇమేజ్ (relief image) పద్ధతిలో చెక్కలమీద చెక్కిన అక్షరాలతో ప్రారంభమైన ముద్రణ ఎన్నో మలుపులు తిరిగి కంప్యూటర్ యుగంలోకి చేరుకుంది.

లెటర్ ప్రెస్ ముద్రణ విధానం చాలాకాలం నుంచి అమలులో ఉంది. రిలీఫ్ ప్రింటింగ్ పద్ధతిలో లెటర్‌ప్రెస్ ముద్రణ కన్పిస్తుంది. ముద్రణ భాగం ప్రతిబింబరూపంలో అచ్చుభాగం కంటే ఎత్తులో ఉండటమే దీనికీ పేరు రావడానికి దోహదపడింది. ఇప్పటికీ ఈ ముద్రణ విధానం చెప్పుకోదగ్గ స్థాయిలో అమలులో ఉండటం విశేషం. 15వ శతాబ్దంలో ఈ తరహా ముద్రణకు అవకాశాలు బాగా పెరిగాయి.

BRAOU

1960 ప్రాంతంలో ఆఫ్‌సెట్ (Offset), లితోగ్రఫీ (Lithography) విధానాలు వెలుగుచూశాయి. లితోగ్రఫీపైన వచ్చిన అభివృద్ధే ఆఫ్‌సెట్ ముద్రణ. దీని ముద్రణ వేగం అధికం. రంగుల ముద్రణకు బాగా ఉపకరిస్తుంది. ఈ విధానంలో అచ్చు ఉపరితలమూ, ఉపరితలం కానిభాగం ఒకే ఎత్తులో ఉంటాయి. ఒకదానిలో ఒకటి కలవని నీరు, గ్రీజ్ ఆధారంగా ముద్రణ చేస్తారు. ఇవికాక గ్రావియర్ ప్రింటింగ్, సిల్క్‌స్క్రీన్ ప్రింటింగ్ విధానాలు ఉన్నాయి. సిల్క్ స్క్రీన్ విధానం వార్త పత్రికల ప్రచురణల కోసం వాడరు. పత్రికల ఆర్థికస్థాయిని బట్టి బహుళ ప్రాచుర్యంలో ఉన్నవి లెటర్ ప్రెస్, ఆఫ్‌సెట్ ముద్రణ విధానాలు. చిన్న పత్రికలు లెటర్ ప్రెస్‌ను ఆశ్రయిస్తే, పెద్ద పత్రికలు ఆఫ్‌సెట్ ముద్రణను చేపట్టగలిగాయి.

కంప్యూటర్ టెక్నాలజీ, ఫేజ్‌లైన్ ట్రాన్స్‌మిషన్ (phase line transmission) వంటి సాంకేతికాలు ఆప్టికల్ ఫైబర్ (optical fibre) శాటిలైట్ (satellite) ప్రవేశంతో ముద్రణరంగంలో అద్భుతాలను చూస్తున్నాయి. అక్షర స్వరూపాన్ని ఎలక్ట్రానిక్ సంకేతాల ద్వారా ప్రసారం చేస్తున్నారు. డిజిటలైజ్ (Digitalize) చేసి చేస్తున్నారు. బ్లాక్‌మేకింగ్‌తో పనిలేకుండా చిత్రాలను, బొమ్మలను, తదితర రూపాలను తేలిగ్గా రూపొందించి, ముద్రించడమూ చేస్తున్నారు. ఈ పరిణామాలు యంత్ర పరికరాల ఏర్పాటుకు ఎక్కువ స్థలాన్ని కోరకుండా, కర్మాగారాన్ని కార్యస్థానం (work station) స్థాయికి మార్చగలిగాయి.

అక్షరాలకు రకరకాల రూపాలివ్వడం, స్వరూపాదులను పెంచడం, తగ్గించడం వంటి చర్యలు సులభంగా కొనసాగుతున్నాయి. ఇటువంటివే పందలాది అవకాశాలు అందుబాటులోకి రాగలిగాయి. ముద్రణారంగం కంపోజిటర్ దిమ్మలనుంచి డిజైనర్ చేతివాటానికి చిక్కింది.

తెలుగు పత్రికా ప్రచురణ నిన్నమొన్నటి దాకా అక్షరాల కూర్పు (Letter Press) తో, ట్రెడిల్‌మెషిన్ (Tredle machine) లతో కొనసాగింది. రోటరీ యంత్రాలు కేవలం పెద్ద పత్రికలే కలిగి ఉండేవి. మోనోటైపు ముద్రణకు తెలుగులో పెద్దగా ప్రోత్సాహం లభించలేదు. యాంత్రికంగా కూర్చడం (mechanical composing) అసలు వ్యాప్తిలోకే రాలేదు.

ఈలోగానే ఛాయారూప రచన (Photo type setting) పెద్ద పత్రికలకు తప్పనిసరైంది. మధ్యకాలంలో వ్యాప్తిలోకి వచ్చి నేటికీ బహుళ వ్యాప్తిలోనే ఉంది ఆఫ్‌సెట్ ముద్రణ విధానం. అంతర్గత ఆధునిక ముద్రణా విధానాలను ఎంపికచేసుకుని శాటిలైట్ ద్వారా పంపే ఎలక్ట్రానిక్ సంకేతాల సహకారంతో పత్రికా ప్రచురణ చేపట్టడం పెద్ద పత్రికలు చేపట్టిన ప్రయత్నాలలో భాగంగా కన్పిస్తాయి.

## 28.5 పత్రికా ప్రచురణ : భవిష్యత్తు

పత్రికా ప్రచురణ కోసం ముద్రణ రంగం ఈ దశాబ్దంలో ఎన్నో కొత్త అవిష్కరణలను చూసింది. పెద్ద పత్రికలకు సమాచార ప్రసారం కోసం కొత్త అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. కంప్యూటరీకరణ, అక్షరాల కూర్పులో ఆటోమేషన్, పద ప్రక్రియలో ఇమేజ్ మానిపులేషన్ (Image manipulation of word processing), మల్టికలర్ స్కానింగ్ (Multi colour scanning) ప్రాసెసింగ్, ప్రింటింగ్ ప్రక్రియల్లో త్వరితగతిన వస్తున్న విప్లవాత్మకమైన మార్పులే ఇందుకు దోహదపడుతున్నాయి. పత్రికా ప్రచురణ ముద్రణలో ఇవి సృజనాత్మక అవకాశాలు.

ఒక వైపు డిజిటల్ టెక్నాలజీ అక్షర ముఖాల్ని ఎలక్ట్రానిక్‌గా ప్రోగ్రాంచేసి, ప్రాసెస్ చేసి విస్తృత పరిధిలో అక్షరాల్ని, పదాల్ని, ఖాళీలను తదితర ఫాంట్లను, షాడో, అవుట్‌లైన్, హాఫ్‌లైన్, ప్రతిబింబాత్మక ఎఫెక్ట్‌లను సృష్టించగల అద్భుత అవకాశాలను కల్పిస్తోంది. మరోవైపు డి.టి.పి (Desk Top Publishing) టెక్నాలజీ ప్రచురణ రంగాన్ని టైపుల కూర్పునుంచి, ముద్రణదాకా పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తోంది. ముద్రణ - ముద్రణస్థాయి నుంచి ఎదిగి గ్రాఫిక్‌కళగా రూపుదిద్దుకునే దిశగా కొనసాగుతోంది. ప్రచురణ సంస్థ ఒక కార్యస్థానం (work station) గా రూపాంతరం చెందుతోంది. తెలుగు పత్రికా ప్రచురణ - ముద్రణ కూడా ఈ దిశగా నడిచే ప్రయత్నం చేయక తప్పదు. ఇప్పుడిప్పుడే ఊపిరిపోసుకుంటున్న ఈ తరహా ఆచరణలు కొన్ని ఉన్నాయి. పత్రికా ప్రచురణ 'ముద్రణ చిత్రానికి' భవిష్యత్తు ఒకేరూపు నిస్తుందనడంలో అతిశయోక్తికి తావేదీ ఉండదు.

**అభ్యాసం- 3ః ప్రధానమైన ముద్రణ విధానాలు ఏవి? ఏముద్రణ విద్యలు పత్రికా ప్రచురణకు బాగా ఉపకరిస్తున్నాయి.**

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

## 28.6 ముఖ్యవిషయాలు గుర్తుంచుకుందాం

★ అక్షర స్వరూపాలలోని వికాసం పత్రికా ప్రచురణ కొత్త ఒరవడిని తెచ్చిపెట్టింది. వార్తా కథనాలు, వార్తల అమరికలో, శీర్షికల రూపకల్పనలో దీన్ని చూస్తాం.

★ ముద్రణలో కొత్త ధోరణులు, అక్షర స్వరూపాలలో వస్తున్న పరిణామాలు పత్రికా ప్రచురణలో ముద్రణాంశాలలో కీలకమైనవి. ముద్రణ లక్షణాలు, అక్షర స్వరూపాల్లో వైవిధ్యం, ముద్రణలో సాంకేతిక అభివృద్ధి తెచ్చిపెట్టిన పరిమితులు కొన్ని ముద్రణాంశాలలో భాగమే. వివిధ ముద్రణాంశాల అవకాశాలు, పరిమితులలో అల్లికతత్వం ఉంది.

★ అక్షర స్వరూపాల మార్పు ఒక చలన ప్రక్రియ. అక్షర స్వరూపాలకు కొన్ని లక్షణాలున్నాయి. సాంకేతిక వివరాలు కన్పిస్తాయి. ముద్రణ యంత్రాల అభివృద్ధితో పాటు అక్షర స్వరూపాల వికాసం ముడిపడి ఉంది. తెలుగు అక్షరాలకున్న

BRAOU

ప్రత్యేక లక్షణాల కారణంగా తెలుగు ఫాంట్లలో పెద్దగా మార్పులు రాలేదు. సాంప్రదాయకంగా వస్తున్న అక్షరశ్రేణుల్లోనే ముద్రణ, సాంకేతికలో అన్వయం కోసం మెరుగులు దిద్దుకోగలిగాయి.

★ ముద్రణలో నాలుగు రకాల ముద్రణా ప్రక్రియలు కనిపిస్తాయి. అవి : 1) లెటర్‌ప్రెస్ 2) లితోగ్రఫీ. ఆఫ్‌సెట్ 3) గ్రావియర్ 4) స్క్రీన్ ప్రింటింగ్ ముద్రణా విధానాలు.

★ కంప్యూటర్ టెక్నాలజీ, శాటిలైట్ ప్రసార అవకాశాలలో ముద్రణ విప్లవాత్మకమైన మార్పులకు లోనౌతోంది. తెలుగు పత్రికా ప్రచురణలో పెద్దపత్రికలు ఈ అవకాశాలను వినియోగించుకునే ప్రయత్నంలో ఉన్నాయి.

★ భవిష్యత్తులో ముద్రణ - ముద్రణ స్థాయి నుంచి మారి గ్రాఫిక్ కళగానూ, ప్రచురణ సంస్థ కర్మాగారం కాకుండా కార్యస్థానంగాను రూపుదిద్దుకోగలవు.

## 28.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ముద్రణలో వచ్చిన పరిణామాలు తెలుగు ఫాంట్ల వికాసానికి ఏ విధంగా తోడ్పడుతున్నాయి? వర్ణించండి?
2. పత్రికా ప్రచురణలో ప్రస్తావనకొచ్చే కొన్ని ముఖ్యమైన ముద్రణాంశాలను ప్రస్తావించండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. భవిష్యత్తులో పత్రికా ప్రచురణ?
2. తెలుగులో ఫాంట్ల అభివృద్ధికి జరిగిన కృషి?

**- ఉమాపతి వర్మ**

BRAOU

# భాగం - 29 : విన్యాసం నమూనా - కీలకమైన అంశాలు

## విషయక్రమం

29.0 ఉద్దేశం
29.1 ప్రవేశిక
29.2 విన్యాసం అంటే ఏమిటి?
 29.2.1 ఎందుకీ విన్యాసం
29.3 విన్యాసంలో రకాలు
 29.3.1 సమతూకం
 29.3.2 వైవిధ్యం
 29.3.3 అనుపాతం
 29.3.4 ఐక్యత
29.4 డమ్మీ తయారు చేసే విధానం
29.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం
29.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 29.0 ఉద్దేశం

ఈ భాగం చదివిన తరువాత మీరు

- విన్యాసం, నమూనా అంటే ఏమిటి?
- వార్తా పత్రికలో వాటి ప్రాముఖ్యం
- విన్యాసం వివిధ రూపాలు.
- డమ్మీ తయారు చేయడమెలా.
- నమూనా తయారు చేసే విధానాలు

తెలుసుకుంటారు.

## 29.1 ప్రవేశిక

వార్తా పత్రిక తయారీలో వివిధ దశలుంటాయని ఇప్పటికే మీరు అర్థం చేసుకొని ఉంటారు. విలేఖరులు వివిధ ప్రాంతాలకెళ్ళి వార్తలు సేకరించి రాసిచ్చాక అవి కంపోజ్ అవుతాయి. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో రాసే అవసరం లేకుండా పోతోందన్న విషయాన్ని కూడా మీరు ఇతర పాఠంలో నేర్చుకొని ఉంటారు. ముఖ్యమైన వార్తలను పేజీపై అమర్చి అలంకరించే ముందు దశ విన్యాసం, నమూనా.

## 29.2 విన్యాసం అంటే ఏమిటి?

ఇంతకుముందు పేరాలో వివరించినట్లు పేజీపై వార్తలు అమర్చేందుకు అనుసరించే వ్యూహం ఊహాచిత్రం విన్యాసం. చాలా సందర్భాలలో విన్యాసానికి, నమూనాకు, విన్యాసానికి పేజీ అలంకరణకు తేడా ఏమిటన్న సందేహం కలుగుతుంది.

ఈ విషయాన్ని కొంతస్పష్టంగా అర్థం చేసుకునేందుకు వార్తాపత్రిక తయారీని గృహనిర్మాణంతో పోల్చుదాం. అయితే, ఈ విషయంలో రెంటిని కచ్చితంగా పోల్చిచూడకండి. మొత్తం మీద సారూప్యాన్ని అర్థంచేసుకోండి.

ఇల్లు కట్టాలని నిర్ణయించుకొన్నాక ఎలా కట్టాలి? ఎలా కడితే అందంగా ఉంటుంది? ఏ గది ఎక్కడ ఉండాలి? ఏ ద్వారం ఎటువైపు ఉండాలి? ఇలాంటి అనేక నిర్ణయాలు తీసుకోవాల్సుంటుంది. వాస్తుశాస్త్రాన్ని అధ్యయనం చేస్తారు. ఈ ప్రక్రియనే విన్యాసం లేదా ఆంగ్లంలో డిజైన్ అంటాం.

ఒక్కసారి విన్యాసం లేదా డిజైన్ నిర్ణయించుకున్నాక ఒక నమూనా చిత్రాన్ని లేదా బ్లూప్రింట్‌ని తయారుచేస్తాం. ఇంజనీరు లేదా డ్రాఫ్ట్‌మన్ ఈ పని చేస్తారు. దీన్నే నమూనా (Lay out) అంటాం.

ఆ తర్వాత నమూనా ఆధారంగా అవసరమైన చోట, అనివార్యమైనచోట కొన్ని మార్పులు, చేర్పులు చేసుకొంటూ గృహనిర్మాణం కొనసాగుతుంది. ఇదే పేజీ అలంకరణ.

### 29.2.1 ఎందుకీ విన్యాసం

విన్యాసం, నమూనా పేజీ అలంకరణల తేడా అర్థం చేసుకొన్నారు కదా. ఇక ఇక్కడ కొంతమంది విద్యార్థులడుగవచ్చు. ఈ విన్యాసం, నమూనాల గొడవెందుకు! యథేచ్ఛగా పేజీ అలంకరణ చేయవచ్చు కదా. ఇలా చేస్తే సమయం కూడా ఆదా అవుతుంది. నిజమే, ప్రస్తుతం చాలా పత్రికలలో అనేక సందర్భాలలో జరుగుతున్నది కూడా ఇదే. సమయం చాలకపోవడం. వార్తాపత్రిక తయారీ శరవేగంతో జరిగే ప్రక్రియ గనుక. కానీ, ఒక్క విషయం, శాస్త్రీయంగా చేసే పని కొంత సమయం తీసుకోవచ్చు కానీ, దాని ఫలితం దానిదే.

BRAOU

వార్తను వస్తువుతో పోల్చడం లేదు కానీ వస్తువులకు ప్యాకేజ్ ఎంత ముఖ్యమో వార్తలకు విన్యాసం అంతే ప్రధానం. వార్తా పత్రికలలో విన్యాసం వలన ప్రధానంగా ఈ క్రింది ఉపయోగాలుంటాయి.

1) ఒక వస్తువు ఎంత నాణ్యత కలిగినప్పటికి అది వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తే తప్ప దాని నాణ్యత విదితం కాదు. అలాగే వార్త ఎంత ఆసక్తికరమైనప్పటికీ - అది ఎంత బాగా రాసినదయినప్పటికీ ఆకర్షణీయంగా లేనంత కాలం పాఠకుల దృష్టిని ఆకర్షింపజాలదు. అందువలన విన్యాసం ప్రధాన ఉద్దేశ్యం పాఠకుల దృష్టికి ఆకర్షించగలిగేలా చేయడం, వివిధ వార్తా పత్రికల మధ్య విపరీతంగా పోటీ పెరగడం దీనికి తోడు దృశ్య శ్రవణ ప్రసార సాధనాలైన టెలివిజన్ నుంచి వార్తాపత్రికలు గట్టి ప్రభావాన్ని ఎదుర్కొంటున్న ఈ రోజులలో పాఠకులను ఆకర్షించేందుకు విన్యాసం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకొంటుంది.

2) గజిబిజిగ ఉన్న పేజీని చదవడం చాలా కష్టంగా ఉంటుంది. విన్యాసం పాఠకుడు పత్రికను సులువుగా చదవటానికి సహకరిస్తుంది.

3) పాఠకుడు వివిధ వార్తల ప్రాధాన్యాన్ని విలువలను సాపేక్షంగా అర్థం చేసుకొనేందుకు సహాయపడుతుంది. వార్తా విలువలు (News values) గురించి మీరు వేరే పాఠంలో నేర్చుకున్నారు. ఆ వార్తా విలువలను పత్రికలో ప్రకటించడం విన్యాసం ఉద్దేశం.

4) వార్తాపత్రిక సరళిని, ధోరణిని అర్థం చేసుకునేందుకు విన్యాసం దోహదం చేస్తుంది. మీరు 'హిందూ' పత్రికను 'దక్కన్ క్రానికల్' పత్రికను పోల్చి చూడండి. మీకే అర్థమవుతుంది. హిందూ పత్రికలో వార్తల పొందికను చూస్తే ఆ పత్రిక సీరియస్ స్వభావం కలిగినవిగను, హుందాతనం ప్రదర్శించేదిగాను ఉంటుంది. అదే 'దక్కన్ క్రానికల్' లో వార్తల పొందికే ఏదో గోరంతలు కొండంతలు చేస్తున్నదా అన్నట్లు అగుపిస్తుంది. ఏ రకంగానైతే మనిషి అలంకరణ ఆ వ్యక్తి సంస్కృతిని ప్రతిబింబిస్తుందో అదే విధంగా విన్యాసం ఆ పత్రిక స్వభావాన్ని చాలా మట్టుకు అర్థం చేసుకొనటానికి ఉపకరిస్తుంది. కొన్ని దినపత్రికలు తమ విన్యాసాన్ని మార్చుకుంటూ టాబ్లాయిడ్ పత్రికలలాగ తయారవుతుందన్న విమర్శకూడా ఉంది.

5) విన్యాసం మొత్తం పత్రిక స్వభావాన్నే గాకుండా ఒక వార్త స్వభావాన్ని కూడా అర్థం చేసుకోడానికి సహాయపడుతుంది. ఉదాహరణకు ఒక వార్త ఆసక్తికరంగా అంటే దాన్ని వంకర టింకర అక్షరాలలో ప్రచురించడం లేదా కాలమ్ (column) లో ఎడమవైపో లేదా కుడివైపో కొంత స్థలం విడచి అక్షరాలుంచటమో (దాన్నే ఫ్లష్ రైట్, ఫ్లష్ లెఫ్ట్ అంటారు) చేస్తారు లేదా బాక్స్ కడతారు. ఈ రకంగా విన్యాసంతో వార్త స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు.

పత్రికలో ఎన్ని పేజీలుండాలి. ఏ పేజీ ఎక్కడ ఉండాలి. పేజీ కొలతలేను. పేజీలో తరచుగా ఏ సైడు ఫొటో వెయ్యాలి. ఇలాంటివన్నీ మొత్తం పత్రిక విన్యాసం క్రిందకి వస్తాయి. ఇదిగాక ప్రతి పేజీకి విన్యాసముంటుంది. వివిధ పేజీల విన్యాసం మొత్తం పత్రిక విన్యాసం తీరుకు లోబడి ఉండాలి.

మీరు వార్తాపత్రికల ఆర్థిక ప్రాతిపదికను ఇతర పాఠాలలో చదివారు. పాఠకుడు చెల్లించే వెల వాస్తవానికి మొత్తం పత్రిక ఉత్పత్తి ఖర్చుకన్నా తక్కువగా ఉంటుంది. అందువలన వ్యాపార ప్రకటనలు వార్తా పత్రికకు వెన్నెముకలాంటివి. అందువలన ఏ పేజీలో ఏ మేరకు వ్యాపార ప్రకటనలుండాలి. అవి పేజీలో ఎక్కడ ఉండాలి అనే అంశాలు అడ్వర్టయిజింగ్ శాఖ నిర్ణయిస్తుంది. పాతకాలం రోజులలో సంపాదకులకు ఈ స్వేచ్ఛ ఉండేది కానీ, పత్రిక వ్యాపారంగా మారిన ఈ రోజులలో ఇది సాధ్యం కాదు. ఈ పాఠానికి సంబంధించినంతవరకు మీరు ముఖ్యంగా అర్థం చేసుకోవాల్సిన విషయం వ్యాపార ప్రకటనలు విన్యాసకుని స్వేచ్ఛను కొంతమేరకు హరిస్తాయి. ఇది మన పాత్రికేయ వృత్తిలో ఉండే పరిమితుల్లో ఒకటని గమనించి వ్యవహరించాలి. అలాగే వార, పక్ష పత్రికల విన్యాసం దినపత్రికలకన్నా బాగుంటుంది. దీనికి కారణం వార, పక్ష పత్రికలలో తీరిగ్గా చేసుకోవచ్చు. అదే దినపత్రికలలో అయితే ఆ అవకాశం ఉండదు. విన్యాసం కళాత్మక చర్య కానీ, పత్రిక ప్రచురణ సమయంతో పరుగులు తీసే ప్రక్రియగనుక పాత్రికేయులు తమ కళాత్మక దృష్టిని పరిస్థితులకు లోబడి ప్రదర్శించుకోవలసి వస్తుంది.

అందుకే, పత్రికా విన్యాసకులు ఈ పరిమితులను మీరు అర్థంచేసుకోవాలి. మరో విషయం పేజీలో ఏయే విషయాలు ఉంటాయన్న దాన్నిబట్టి విన్యాసం మారుతుంది. ఉదాహరణకు సంపాదకీయముండే పేజీలో విన్యాసం కూర్చేందుకు పెద్దగా అవకాశం లేదు, అలాగే, లోపలిపేజీలతో పోల్చినప్పుడు మొదటి పేజీలో విన్యాసం పెద్ద సవాల్. అందుకే, మొదటి పేజీ విన్యాసాన్ని సంపాదకులు స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. సంపాదకులు లేని సమయంలో న్యూస్ ఎడిటర్ స్థాయి వారే చూస్తారు. ఇందుకు కారణం మొదటి పేజీయే ముందుగా పాఠకుని దృష్టిని ఆకర్షించేది.

సమయాభావం కారణంగా విన్యాసాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ఎందుకంటే, పాఠకులు చూసేది పత్రికను కానీ ఆ పత్రిక తయారీలో ఉన్న ఇబ్బందులను కాదు. అవి వారికి అర్థం కావు. వారు పట్టించుకోరు కూడా.

అభ్యాసం - 1 : విన్యాసం అంటే మీకు ఏమని బోధపడింది?

................................................................................................

................................................................................................

................................................................................................

................................................................................................

................................................................................................

BRAOU

## 29.3 విన్యాసంలో రకాలు

పత్రికల విన్యాసం వివిధ రకాలుగా చేయవచ్చు. ఈ పద్ధతులు ఏమిటీ అనేది వివరించే ముందు రెండు విషయాలు గుర్తించాలి. మొదటిది పత్రిక చదివే పాఠకులకు ఇది ఏ పద్ధతిలో జరిపిన విన్యాసం అని అర్థం కాకపోవచ్చు. అలాగే విన్యాస పద్ధతులలో లోపాన్ని గుర్తించకపోవచ్చు కూడా. అందుకే ఏదో ఒకటి చేస్తే సరిపోతుందన్న భావన కొంతమంది పాత్రికేయులలో కలిగే అవకాశం లేకపోలేదు. కానీ, ఇక్కడ మీరు గమనించాల్సిన విషయం పత్రిక విన్యాసం ఇంతకు ముందుగానే వివరించినట్లు ఒక సృజనాత్మక కళ. తప్పొప్పులు కళాత్మక దృష్టితో చూస్తే తప్ప అర్థంకాదు. అయినంత మాత్రాన సామాన్యుడు ఎలా ఉన్నా స్వీకరించలేడు. ఉదాహరణకు మనం ఒక శిల్పాన్ని చూసాం అనుకోండి. ఆ శిల్పాన్ని చెక్కడంలో అనుసరించిన శాస్త్రీయ సూత్రాలు మనకు అర్థం కావు. (ప్రత్యేకంగా శిల్పకళ అధ్యయనం చేసి ఉంటే తప్ప) అలాగే ఆ శిల్పం చెక్కడంలో ఉన్న లోపాలను మనం ఎత్తి చూపలేం. కానీ, ఒక్క విషయం మాత్రం మనకు అర్థం అవుతుంది. ఆ శిల్పం ఆకర్షణీయంగా ఉందా లేదా అన్నది మాత్రం తెలుస్తుంది.

అలాగే పేజీ విన్యాసం ఏ పద్ధతిలో జరిపారో పాఠకుడు గుర్తించలేకపోవచ్చు. ఆ విన్యాసంలో ఉన్న లోపాలను చెప్పలేకపోవచ్చు. కానీ, ఆ పేజీ బాగుందా, లేదా అన్న విషయం మాత్రం పాఠకుడు గమనించగలడు.

పాఠకులను ఆకర్షించడమే పాత్రికేయులుగా మన ప్రధాన లక్ష్యం గనుక విన్యాసాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సిన అవసరముంది.

విన్యాస పద్ధతుల్లోకి పోయేముందు మరో చిన్నమాట. ఈ పద్ధతులను మొత్తం మీద చూడాలి తప్ప కచ్చితంగా ఊహించకూడదు.

BRAOU

విన్యాసం వివిధ పద్ధతులు

1. సమతూకం (Balance)
2. వైరుధ్యం (Contrast)
3. అనుపాతం (Proportion)
4. ఐక్యత (Unity)

### 29.3.1 సమతూకం

పేజీలోని ఏ రెండు భాగాల మధ్య అయినా సమతూకాన్ని సాధించడం ఈ పద్ధతి విశిష్టత. పేజీ పైభాగం క్రింది భాగం మధ్య సమతూకాన్ని సాధించవచ్చు. లేదా కొన్ని సందర్భాలలో పేజీ ఎడమ, కుడి వైపుల మధ్య సమతూకాన్ని సాధించవచ్చు. ఇది బహుళ ప్రాచుర్యం కలిగిన పేజీ విన్యాసం. చాలా సందర్భాలలో విన్యాసం బాధ్యతలు నిర్వహించే సంపాదకులు ఈ రకం విన్యాసం వైపు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు.

అయితే, ఇక్కడ ఒక్క విషయం మాత్రం తప్పనిసరిగా గుర్తుంచుకోండి. ఈ సమతూకాన్ని ఏదో బంగారం కొలిచినట్లుగా ఖచ్చితంగా చూడాల్సిన అవసరం లేదు. పేజీలో మొత్తం మీద సమతూకం అంటే సరిపోతుంది. పేజీని చూసినప్పుడు ఏదో ఒకవైపే మొగ్గు ఉన్నట్లు కనబడకూడదు.

పైభాగం క్రింది భాగం మధ్య సమతూకాన్ని సాధించుకున్నప్పుడు గరిమనాభి ఎక్కడ ఉండాలన్న సమస్య వస్తుంది. గణితశాస్త్ర రీత్యా ఉండే కేంద్ర బిందువు ఇక్కడ పేజీపై క్రింది భాగాలను విడదీసే గరిమనాభిగా ఉండదు. దీనికిగాను చూపు గుర్తించే కేంద్ర బిందువు (optical centre) ను పరిగణనలోకి తీసుకొని పేజీ రెండు భాగాల మధ్య సమతూకాన్ని సాధించాలి.

పేజీని చూసినపుడు మన దృష్టి ఎక్కడ పడుతుందో అది కేంద్రబిందువు అనుకోవచ్చు. ఇది గణితశాస్త్ర రీత్యా ఉండే కేంద్ర బిందువు (mathematical centre) కన్నా కొద్దిగా పైగా ఉంటుంది.

సమతూక విన్యాసం అవసరమేమి !

1) సమతూకం లేని పేజీ నిర్దుష్టంగా ఉండదు.

2) సమతూకం లేనప్పుడు పాఠకులకు చిరాకు కలగవచ్చు.

3) సమతూక విన్యాసం పేజీకి సమగ్రతను ఇస్తుంది.

4) పేజీలోని అన్ని భాగాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం వల్ల పాఠకుని దృష్టి కేవలం కొన్ని వార్తలవైపే మరలి మిగతా వార్తలను పట్టించుకోకుండా పోయే ప్రమాదం తప్పుతుంది. అయితే. కొన్ని సందర్భాలలో సమతూకం సాధించడం అనర్థదాయకంగా కూడా ఉండవచ్చు. ఉదాహరణకు ఒకరోజు వార్త అత్యంత ప్రాధాన్యం కలిగినది అయినప్పుడు పేజీలో ఆ వార్త ప్రముఖంగా ఉంటుంది. పెద్ద ఫొటో. పెద్ద అక్షరాలతో శీర్షిక ఉండాల్సి ఉంటుంది. అంతేగాక, పాఠకుని దృష్టిని కూడా వెంటనే ఆ వార్త వైపు ఆకర్షించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితిలో సమతూకం అనవసరం.

అందువలన ప్రధానంగా గమనించాల్సిన విషయం. అవసరాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి విన్యాస పద్ధతిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అన్ని సందర్భాలలో అన్ని పద్ధతులు పనికిరాకపోవచ్చు.

ఎలాగైతే పెళ్ళి సందర్భంలో ఒకరకం సంగీతం, సంతాపం ప్రకటించాల్సినప్పుడు మరోరకం సంగీతం ఉంటుందో వార్తలను బట్టి కూడా విన్యాసం మారుతూ ఉండాలి.

ఇక సమతూక విన్యాసం సాధించడమెలా? ఏదీ సమతూకం లేని పేజీయో అర్థమయితే ఆ పని చేయకుండా ఉంటేసరి పోతుంది.అప్పుడ సమతూకం పేజీలో ఏర్పడినట్లే.

పేజీలో సమతూకం లేకుండా ఉండే స్థితి ఈ విధంగా ఉంటుంది.

1) పై భాగాన పెద్ద శీర్షికలు, క్రింది భాగాన అప్రధానమైన, చిన్నవైన శీర్షికలు.

2) పెద్ద వార్తలు పై భాగాన, చిన్న వార్తలు క్రింది భాగాన ఉండడం. ఉదాహరణకు నాలుగు కాలమ్‌ల వార్త పేజీ పై భాగాన ఉండి క్రింది భాగాన కనీసం మూడు కాలమ్‌ల వార్తయినా లేకుండా ఉండడం.

3) పెద్ద సైజ్ ఫొటో క్రింది భాగాన ఉండి పై భాగాన అలాంటి ఫొటో లేదా పెద్ద వార్త లేకుండా ఉండడం.

సమతూకాన్ని సాధించటానికి కీలక సూత్రం ఆ పేజీలో రావలసిన పెద్ద ఫొటోలు, వార్తలు, శీర్షికలు పేజీలోని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా చూసుకోవాలి.

పేజీ విన్యాసంలో సమతూకాన్ని నియత (Formal) లేదా అనియత (Informal) పద్ధతిలోనూ సాధించవచ్చు. నియత పద్ధతిలో పేజీలో రెండువైపులా సమతూకాన్ని సాధించాలి. ఈ రకం విన్యాసంలో పేజీలోని ఒక వైపు మరో వైపుకు దర్పణంగా ఉంటుంది. దీన్ని సౌష్టవ సమతూకం (Symmetrical Balance) అని కూడా అంటాం.

ఈ సౌష్టవ సమతూక పద్ధతిలో పేజీ పై, క్రింది భాగాల మధ్య సమతూకం ఉండకపోవచ్చు కూడా. చాలా పత్రికలు చాలా సందర్భాలలో అనియత (Informal) సమతూకానికే ప్రాధాన్యతనిస్తున్నాయి.

### 29.3.2 వైవిధ్యం :

రెండు విరుద్ధ అంశాలను ఒకే చోట చూపించడం ద్వారా వైరుధ్యాన్ని (contrast) పేజీ విన్యాసంలో సాధించవచ్చు.

BRAOU

ఏవైనా రెండుకన్నా, అంతకన్నా ఎక్కువ కానీ పరస్పరం విరుద్ధంగా ఉండే అంశాలను పేజీలో పొందుపరచడం వలన వైవిధ్య విన్యాసాన్ని సాధించవచ్చు. ఉదాహరణకు సన్నటి అక్షరాలతో రాసిన శీర్షికను చిక్కటి అక్షరాలతో రాసిన శీర్షికను లేదా పెద్ద సైజ్, చిన్న సైజ్ ఫొటోలను కలిపి ఒకే పేజీలో వాడడం ద్వారా పేజీని ఆకర్షణీయం చేయడమే వైవిధ్య విన్యాస ప్రత్యేకత.

విన్యాసం ఒక కళ అనుకొన్నాము. ఇతర కళలలో ఉండే సూత్రాలు ఈ కళకు కూడా వర్తిస్తాయి. గానకళను విన్యాసంతో పోలుద్దాం. గాయకుడు ఒకే పాటలో ఒకసారి స్వరాన్ని పెంచుతూ తగ్గిస్తూ పాడడం ద్వారా శ్రోతల దృష్టిని ఆకర్షిస్తాడు. అలాగే ఈ వైరుధ్యం చాలా కళలలో తరచూ కనపడే అంశం.

పేజీ మొత్తం ఒకే మూసలో ఉన్నట్లు కనబడకుండా వైరుధ్య విన్యాసం నిరోధిస్తుంది. అలాగే. తీవ్రస్థాయిలో వైరుధ్యం కూడా మంచిది కదు. ఇలా చేయడం వలన పాఠకుని దృష్టి విరుద్ధ అంశాలవైపే నిలిచి మొత్తం పేజీపైన దృష్టి లేకుండా పోయే ప్రమాదముంది.

వైరుధ్యమే కాదు ఆ మాటకొస్తే ఏ విన్యాసం కూడా తీవ్రస్థాయిలో చేయాలనుకోవడం మంచిది కాదు. విన్యాసం కూడా కళ గనుక ఏ కళ అయినా యాంత్రికంగా ఉండకూడదు. సృజనాత్మకంగా ఉండాలి.

ఉప్పు కారం రెండు సరిగ్గా ఉంటేనే వంట ఇంపుగా ఉంటుంది. కానీ, అదే సమయంలో వాటిలో ఏది ఎక్కువైనా, రెండెక్కువైనా భరించలేం.. అలాగే, పేజీ విన్యాసంలో కూడా వైరుధ్యం ఎక్కువైతే కూడా నష్టమే. ఇలా అయితే, విరుద్ధ అంశాలవైపే పాఠకుని దృష్టి మరలి పేజీ మొత్తంపై వారి దృష్టి లేకుండా పోతుంది.

పేజీ విన్యాసంలో వైరుధ్యాన్ని నాలుగు రకాలుగా సాధించవచ్చు.

1) ఆకృతి (Shape)

2) కొలత (Size)

3) బరువు (Weight)

4) దిశ (Direction)


**ఆకృతి :** వివిధ ఆకృతులలో ఉన్న ఫొటోలను ఉపయోగించి ఈ విధమైన వైరుధ్యాన్ని సాధించవచ్చు. కొన్ని వార్తలను పాఠకుల దృష్టిని ఆకర్షించేందుకు కాలమ్ ఒకవైపు మాత్రం సమానంగా ఉంచి మరోవైపు హెచ్చు తగ్గులు ఉంచుతారు. ఈ రకమైన ఆకృతిలో మార్పులు చేయడం వలన పేజీలో అన్ని వార్తలు ఒకే రకంగా కనపడకుండా చేయడం, తద్వారా వైరుధ్యాన్ని సాధించవచ్చు.

**సైజ్ :** ఒక పేజీలో ఒకచోట పెద్ద చిత్రాన్ని మరోచోట చిన్న చిత్రాన్ని వాడడం ద్వారా వైరుధ్యాన్నితేవచ్చు. అలాగే వివిధ టైప్‌సైజ్‌ల శీర్షికలను వాడడం ద్వారా పేజీలో వైరుధ్యాన్ని తీసుకురావచ్చు (టైప్ సైజుల గురించి మీరు ఇతర పాఠాలలో చదివి ఉంటారు గనుక వాటిని ఇక్కడ మళ్ళీ వివరించడం లేదు.)


**బరువు :** ఈ విధమైన విన్యాసాన్ని సాధించేందుకు ఒకే పేజీలో చిక్కటి రంగు ఫొటోను, తేలిక రంగు ఫొటోలను వాడాల్సుంటుంది. లేదా ఫొటోలకు బదులుగానో, వాటితోపాటైనా ఒకే పేజీలో కొన్ని వార్తలకు ముద్దక్షరాలతో (Bold Faced Letters), మరో శీర్షికకు తేలిక అక్షరాలతో శీర్షికలివ్వడం ద్వారా కూడా ఈ విధమైన వైరుధ్యాన్ని విన్యాసంలో సాధించవచ్చు.

**దిశ :** మీరు వార్తా పత్రికలలో చూస్తూ ఉంటారు. మూడు కాలమ్‌లలో ఉన్న ఒకవార్త ఉంటే, అంతే పెద్ద వార్త రెండు కాలమ్‌లలో ఉంటుంది. ఉదాహరణకు 360 చదరపు సెంటీమీటర్ల వైశాల్యంగల వార్త ఉందనుకోండి. దాన్ని రెండు రకాలుగా అడ్డంగానూ, నిలువుగానూ పేజీలో అమర్చవచ్చు. ఒక కాలమ్ సైజు దాదాపు 6 సెం.మీ. అనుకోండి. ఈ 360 చ.సెం.మీ. వార్తను మూడు కాలమ్‌లలో 20 సెం.మీ పొడవులో అమర్చవచ్చు. అప్పుడు వార్త అడ్డంగా పేజీలో ఉంటుంది. ఇదే వార్తను రెండు కాలమ్‌లలో (2×6 = 12 సెం.మీ.) 30 సెం.మీ. పొడవులో అమర్చవచ్చు. అప్పుడా వార్త నిలువు దిశగా ఉంటుంది. ఈ క్రింది పటాలను పరీక్షించండి.

BRAOU




అడ్డు దిశగా వార్తను అమర్చడం




నిలువు దిశగా వార్తను పేజీలో అమర్చే విధానం

గమనిక : ఈ పత్రాలలోని కొలతలు ఖచ్చితమైనవి కావు.. కేవలం ఉదాహరణకు మాత్రమే ఇచ్చినవి.

పేజీ విన్యాసంలో వైరుధ్యాన్ని సాధించుటకు వార్తలను కొన్నింటిని అడ్డు దిశగా, మరి కొన్నింటిని నిలువుదిశగా అమర్చాలి.

చివరగా ఒక్క విషయాన్ని గమనించండి, వైరుధ్యాన్ని విన్యాసంలో ఆకృతి, కొలమానం (size), బరువు (weight), దిశ (Direction) లాంటివి ఉపయోగించి సాధించవచ్చని పైన వివరించాం. అయితే, ఈ అన్నిటిని ఒకే పేజీలో వాడడం మంచిది కాదు.

BRAOU

## 29.3.3 అనుపాతం (Proportion)

పేజీలో ఏదైనా చతురస్రాకారంలో ఉండరాదు. సాధ్యమైన మేరకు చతురస్రాకారంలో ఉండే ఫొటోలను వాడకుండా ఉండడం మంచిది. అలాగే వార్తను అమర్చేటప్పుడు కూడా అది చతురస్రాకారంలో రాకుండా జాగ్రత్త పడాలి. దీనికి కారణం చతురస్రాకారంలో ఉండేది పేజీలో అనాకర్షణీయంగా ఉంటుంది. అయితే వార్తకానీ, ఫొటోకానీ దీర్ఘచతురస్రాకారంలో అమర్చినప్పుడు వాటి కొలతల మధ్య ఏ అనుపాతం ఉండాలన్నదే సమస్య. ఆకర్షణీయంగా ఉండాలంటే వార్తను కానీ ఫొటోను కానీ 3:5 నిష్పత్తిలో అమర్చాలి. ఏదైనా పేపర్ మీదకాని వివిధ వార్తలను పోల్చి చూడండి. మీకే అర్థమవుతుంది. 3:5 నిష్పత్తిలో అమర్చబడిన వార్తను, ఇతర నిష్పత్తులలో ఉన్న వార్తలను పోల్చండి. ఏ అనుపాతంలో ఉన్న వార్త ఆకర్షణీయంగా కనబడుతుందో విశదమవుతుంది.

అయిత కచ్చితంగా ఇదే నిష్పత్తితో వార్తను అమర్చాలి అని భావించకూడదు. గణితశాస్త్రరీత్యా నిక్కచ్చితనం అవసరం లేదు. కావలసిందల్లా ఆకర్షణీయంగా ఉండడమే.

## 29.3.4 ఐక్యత

ఇక విన్యాసంలో చివరి పద్ధతి ఐక్యత. ఇంతవరకు మనం సమతూకం, వైరుధ్యం, అనుపాతం అనుసరించి ఏ విధంగా విన్యాసం సాధ్యమవుతుందో చర్చించాం. ఇక ఐక్యత అనే నియమం ద్వారా పేజీ విన్యాసం ఎలా చేయాలో చూద్దాం.

ఈ పద్ధతిలో పేజీ మొత్తం ఒక భావన కలిగించేలా ఉండాలి. ఏదో పేజీలో వార్తలు, ఫొటోలు చిందరవందరగా పడేసినట్లుగా కాకుండా అవన్నీ వాటి, వాటి స్థలాల్లో ఉండాల్సినవి ఉండినట్లు పేజీని కనిపించేలా చూడడం ఈ విధమైన విన్యాస

పద్ధతి విశిష్టత. ఈ రకమైన పద్ధతిలో పేజీలోని ప్రతివార్త పాఠకుని దృష్టిని ఆకర్షించటానికి పోటీ పడుతున్నట్లుగా కాకుండా అన్నీ కలిసి పాఠకుని దృష్టిని ఆకర్షించేలా ఉండాలి.

ఐక్యత అనే విన్యాసాన్ని సాధించాలంటే పేజీలోని ఏ భాగాన్ని అమర్చినప్పుడైనా మొత్తం పేజీ ఎలా కనబడుతుందో విన్యాసకుడు ఊహించుకోవాలి. ప్రతి వార్తను కానీ, ఫొటోను కాని ఇక్కడ పెడితే ఎలా ఉంటుందో పోల్చి చూస్తూ పేజీతో వివిధ అంశాలను అమర్చడం ద్వారా ఈ పద్ధతి విన్యాసాన్ని సాధించవచ్చు.

ఆభ్యాసం - 2 : విన్యాసం ప్రాధాన్యతను వివరించండి.

..............................................................................................................................................................

..............................................................................................................................................................

..............................................................................................................................................................

..............................................................................................................................................................

..............................................................................................................................................................

## 29.4 డమ్మీ తయారుచేసే విధానం

విన్యాసంలో కీలకమైన అంశం డమ్మీ తయారుచేయడం. ముద్రించాక మనం చూసే పత్రిక నమూనాయే డమ్మీ.

ప్రముఖ జాతీయ పత్రికతో లేక స్థానిక భాషా పత్రికలు సైతం డమ్మీని తయారు చేస్తున్నాయి. పేజీ అలంకరణ బాగుండటానికే కాక ఈ ప్రక్రియను సులభ సాధ్యం చేసేందుకు కూడా డమ్మీ ఎంతో అవసరం. బాగా అనుభవం గడించిన పాత్రికేయులు మినహా మరెవరైనాసరే, డమ్మీ తయారు చేస్తే తప్ప అందమైన పేజీని పాఠకులకివ్వలేరు. చాలా సందర్భాలలో అప్పుడప్పుడే పేజీ అలంకరణ చేసే బాధ్యతలు మీదబడ్డ ఉప సంపాదకులు డమ్మీ తయారు చేసుకోకుంటే గందరగోళంలో పడతారు. ఏ వార్తను ఏ పేజీలో ఎలా పొందుపరచాలి, ఫొటోలు ఎక్కడ ప్రచురించాలి, వ్యాపార ప్రకటనలు ఎక్కడుంటాయో పేజీ అలంకరణకు ముందే ఒక అవగాహనకు రావలసి ఉంటుంది. అనుకున్న విన్యాసంలో పేజీని అలంకరించేందుకు ఈ అవగాహన ఎంతైనా అవసరం.

ఇప్పటిదాకా పేజీ అలంకరణలో ఆ రకంగా ముద్రించేందుకు పేజీని తయారు చేయడంలో డమ్మీ కీలక అవసరాన్ని చర్చించాం. ఈ పాఠం మొదట్లోనే మీకు వివరించినట్లు పేజీ తయారీని గృహనిర్మాణంతో పోల్చండి. బ్లూ ప్రింట్ లేదా గృహం నిర్మాణం ఇల్లు కట్టే మేస్త్రీలకు దిక్సూచిలాంటిది. అలాగే ఈ నమూనాలో డమ్మీ పేజీ అలంకరణకు, ముద్రణకు మార్గదర్శి లాంటిదని స్థూలంగా అర్థం చేసుకోవాలి.

ఇక డమ్మీని ఎలా తయారుచేయాలి అనే అంశంలోకి వెళ్దాం.

పేజీ డమ్మీలో అంటే ముద్రించే పేజీ నమూనా, పేజీలోని వార్తలు, ఫొటోలు, కార్టూన్లు, శీర్షికలు, వ్యాపార ప్రకటనలు లాంటివన్నీ పేజీలో ఎక్కడ ఉండాలో ఆలోచించి తెల్ల కాగితంపై గీసుకుని ఉండే నమూనాయే డమ్మీ అంటారని మీకిప్పటికి అర్థమయి ఉండవచ్చు.


ముందుగా డమ్మీలో వ్యాపార ప్రకటనలు ఎక్కడ ఉంటాయో అడ్వర్టయిజింగ్ డిపార్ట్‌మెంట్ నిర్దేశిస్తుంది. కొన్ని సందర్భాలలో డమ్మీలో వ్యాపార ప్రకటనల స్థలాన్ని సైజుని అడ్వర్‌టైజ్‌మెంట్ డిపార్టుమెంట్ సూచించి ఎడిటోరియల్ డిపార్టుమెంటుకు పంపుతారు. అప్పుడు వార్తల డమ్మీని తయారు చేసుకొనేందుకు అవకాశాలు తగ్గుతాయి. మరికొన్ని పత్రికలలో సందర్భాలలో వాటిని అడ్వర్టయిజింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారు రాతపూర్వకంగా కాక ఎడిటోరియల్ డిపార్ట్‌మెంట్‌కు మాటల్లో తెలియజేయవచ్చు.

ఎలా చేసినప్పటికి నమూనాలో వ్యాపార ప్రకటనల విషయంలో సంపాదక వర్గానికి అధికారం ఉండదు. ఇందుకు కారణం ఈ పాఠంలో ముందుగానే వివరించినట్లు వ్యాపార ప్రకటనలు పత్రిక ఆర్థిక వ్యవస్థకు జీవనాడిలాంటివి.

BRAOU

అడ్వర్టయిజింగ్ డిపార్ట్‌మెంట్ వారు వ్యాపార ప్రకటనలు నిర్దేశించాక పేజీ ఎలా ఉండాలో ఒక తెల్లకార్డుపై ఆర్టిస్టుచేత గీయించాలి. ఈ కార్డు గట్టి అట్ట రూపంలో ఉంటుంది. అంటే ఒక వార్తను కానీ, శీర్షికను లేదా ఫొటోను కానీ పేజీలో ఎంత పొడువు వెడల్పులలో ఎక్కడ పొందుపరచాలనుకున్నామో తెల్లకార్డుపై కచ్చితంగా అంతే స్థలం చుట్టూ ఒక పట్టా గీయాలి. అందులో వార్త ఎడమ నుండి అంటించాలి. ఎక్కడి వరకుండాలి, శీర్షిక ఎక్కడిదాకా వస్తుంది అనేది స్పష్టంగా గీతలు గీయాలి. అలాగే పేజీలో ఉండాల్సిన అన్ని అంశాలను ఆయా సైజులలో బాక్సులను తెల్లకాగితంపై గీయాలి. ఇలాంటి స్పష్టమైన సూచనలను తెలిపే తెల్లకార్డునే డమ్మీ అంటారు.

ఈ క్రింది నమూనాను పరిశీలిస్తే 'డమ్మీ' గురించి మీకు సులభముగా అర్థం అవుతుంది.



డమ్మీ



అచ్చుప్రతి

వార్తా పత్రికల కార్యాలయాలలో బ్రాడ్ ఫీట్‌పై టాబ్లాయిడ్‌ల కచ్చితమైన కొలతలను ఒక ఫిలింపైకానీ, తెల్లకార్డుపై కానీ గీసి ఉంచుతారు. వివిధ పత్రికలు తమతమ పత్రికలలో సైజులలో దాన్ని తయారు చేస్తారు. దీన్నే గ్రిడ్ అంటారు. చాలా పత్రికల కార్యాలయాలతో ఈ గ్రిడ్‌ను ఫిలింలలో తయారు చేస్తున్నారు. ఒక గ్లాసుపైన ఈ గ్రిడ్ అంటించి ఉంటుంది. గ్రిడ్ క్రింద ట్యూబ్‌లైట్ అమర్చి ఉంటుంది. డమ్మీ గీయించిన తెల్లకార్డును గ్రిడ్‌పై అంటిస్తే గ్రిడ్‌పై ఉన్న పేజీ కొలతలు కార్డుపై కనిపిస్తాయి.

BRAOU

అప్పుడు, తెల్లకార్డు పై కొలత పత్రిక మాస్ట్‌హెడ్‌ను అంటిస్తారు (మాస్ట్‌హెడ్ అంటే పత్రిక పేరు ఉంచే స్థానం) ఇందుకు కారణం మాస్ట్‌హెడ్ రోజు రోజుకు మారదు. మార్చవలసి వస్తే చాలా అరుదుగా మారుస్తారు. ఈ మాస్ట్‌హెడ్‌ను అంటించాకనే డమ్మీ గీయడం ఆరంభిస్తాం. ఒకవేళ మాస్ట్‌హెడ్ అందుబాటులో ఉండకుంటే అంతస్థలం ఖచ్చితంగా కొలిచి వదిలేసి డమ్మీ గీయాలి. ఇక లోపలి పేజీల డమ్మీ గీయాల్సి వచ్చినప్పుడు మాస్ట్‌హెడ్ ఉండదు గనుక ఆ అవసరం లేదు. పై నుంచీ డమ్మీ గీసుకుంటూ రావచ్చు.

వివిధ పేజీల డమ్మీల తయారీ బాధ్యత ఎవరిపై ఉంటుందనేది ఖచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే ఈ బాధ్యతల విభజన పత్రిక పత్రికకు మారుతుంటుంది. కొన్ని జాతీయ స్థాయి పత్రికలలోనో, ప్రముఖ విదేశీ పత్రికలలోను ప్రత్యేకంగా విన్యాస సంపాదకులు (డిజైన్ ఎడిటర్) ఉంటారు. ఈ పరిస్థితి తెలుగు పత్రికలలో ప్రత్యేకంగా కనబడదు. సహజంగానైతే మొదటి పేజీ డమ్మీని సంపాదకులో లేదా వార్తా సంపాదకులో (న్యూస్ ఎడిటర్) స్వయంగా చూస్తారు. ఇక లోపలి పేజీలు డమ్మీల తయారీ బాధ్యత ప్రధాన ఉప సంపాదకులు (చీఫ్ సబ్ ఎడిటర్) పైననో లేదా సీనియర్ ఉప సంపాదకుల పైననో ఉంటుంది.

అయితే చాలా పత్రికలలో ఈ లోపల పేజీల డమ్మీలను ఎవరు తయారు చేసుకోవడం లేదు. మనస్సులోనే పేజీ స్వరూపాన్ని ఊహించి నేరుగా పేజీలనే పెట్టిస్తున్నారు.

తెలుగు దిన పత్రికలలో వివిధ జిల్లాలకు ప్రత్యేక అనుబంధాలున్న సంగతి మీకు తెలిసిందే. ఈ వివిధ జిల్లాల అనుబంధాలను ఆయా డెస్క్ ఇన్‌చార్జీలే మొదటి పేజీ డమ్మీల (జిల్లా అనుబంధాల) తయారీ బాధ్యతను చూస్తుంటారు. సాధారణంగా ఈ డెస్క్ ఇన్‌ఛార్జీలు సీనియర్ లేదా చీఫ్ సబ్ ఎడిటర్ స్థాయివారే ఉంటారు.

ప్రస్తుతం డమ్మీల తయారీ కలర్ పేజీలకే పరిమితమయ్యే సాంప్రదాయం కూడా కనబడుతోంది.

డమ్మీ తయారు చేయనప్పుడు విన్యాసం మనస్సులోనే ఊహించుకొని నేరుగా పేజీ అలంకరణకు పూనుకుంటారు. ఇక డమ్మీ తయారు చేయడానికి ముందు అందుబాటులో ఉన్న వార్తలు, వార్తా ఫీచర్లు, ఫొటోలు, కార్టూన్లు, వ్యాపార ప్రకటనలు

ఒక్కసారి పరీక్షించుకోవాలి. రాబోయే వార్తలు ఏమైనా ఉన్నాయో అవగాహన ఏర్పరచుకోవాలి. డమ్మీ తయారయ్యాక దశ పేజీ అలంకరణ ప్రారంభం కావడం. ఒకవేళ అది రంగుల (కలర్) పేజీ అయితే డమ్మీని మొదట కెమెరా సెక్షన్‌కు పంపించాల్సి ఉంటుంది. అప్పుడు ఈ డమ్మీలో ఏ శీర్షికకు ఏ రంగు వాడాలో ఎక్కడ ఏ రంగు స్క్రీన్ వాడాలో అన్న వివరాలన్నిటిని స్పష్టంగా తెలుపాలి. కెమెరా సెక్షన్ నుంచి డమ్మీరాగానే పేజీ అలంకరణ మొదలుపెడ్తారు.

అయితే, తెల్లకార్డుపై డమ్మీ తయారు చేసే ప్రక్రియ అంతరిస్తున్నది. కంప్యూటర్ల ఆధారంగా గల డెస్క్‌టాప్ పబ్లిషింగ్ (డి.టి.పి.లు) పత్రికా ప్రచురణా రంగంలోకి అడుగు పెట్టాక పరిస్థితులు మారుతున్నాయి. తెలుగు పత్రికలలో కూడా ఈ మార్పులు ప్రవేశించాయి. ముద్రణా సాంకేతిక పరిజ్ఞాన రంగంలో శరవేగంగా మార్పులు దూసుకువస్తున్న రోజులివి. ఇందుకనుగుణంగా పాత్రికేయ వృత్తి రీత్యా ఉండే బాధ్యతల పునర్ నిర్వచనం జరుగుతూ ఉంటుంది.

అభ్యాసం - 3 : వివిధ విన్యాసాల్లో 'డమ్మీలు' తయారుచేయండి.

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

## 29.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

- ★ మొదటి పేజీ నమూనా, ఇతరపేజీలనమూనాలో మార్పు ఉంటుంది. ఈ విషయాన్నిమీరు వివరంగా పేజీ అలంకరణ అనేపాఠంలో నేర్చుకున్నారు. అలాగే పత్రిక స్వరూపంబట్టి కూడా నమూనా మారుతుంది. మన తెలుగు పత్రికలలో ప్రధాన పత్రిక బ్రాడ్‌షీట్ రూపంలో ఉంటే పేజీల అనుబంధాలు టాబ్లాయిడ్ రూపంలో ఉంటాయి. బ్రాడ్‌షీట్ పత్రికల కొలతలు దాదాపు నూతనంగా ఉంటాయి. అయితే టాబ్లాయిడ్ సైజులు మారవచ్చు.
- ★ అలాగే నమూనాలో పత్రికలోని వివిధ పేజీలలో ఏముండాలి అని కూడా నిర్ణయించుకోవాలి. ఉదాహరణకు అంతర్జాతీయ వార్తలు, క్రీడావార్తలు, వాణిజ్యవార్తలు, ప్రత్యేక పేజీలలో ప్రచురించే సాంప్రదాయం ఉంది. అయితే ఆయా పత్రికలు తమకున్న స్థల సదుపాయం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకుంటాయి.
- ★ అలాగే మరో ముఖ్య విషయం. పేజీ నిలువు స్వరూపం ఎలా ఉండాలి? కాలమ్ సైజులు ఎలా ఎంత ఉండాలి? కొన్ని పత్రికలు ఆరు కాలమ్‌లలో ఉంటే మరికొన్ని పత్రికలు ఎనిమిది కాలమ్‌లలో ఉంటుంది. ఎనిమిది కాలమ్‌లలో ఉన్న పత్రిక కాలమ్ వెడల్పు ఆరు సెంటీమీటర్లుంటే అదే ఎనిమిది కాలమ్‌లున్న పత్రికలో కాలమ్ వెడల్పు నాలుగున్నర సెంటీమీటర్లుంటుంది.
- ★ విన్యాసానికి నిర్దిష్టరూపం నమూనా అయితే నమూనాకు కార్య రూపాన్నివ్వడమే పేజీ అలంకరణ. ఈ పాఠంలో మీరు నేర్చుకున్న వివిధ అంశాలను మీరు రోజు చదివే పత్రికలతో అన్వయించి పరిశీలించండి. చెప్పిన విషయాలు ఇంకా స్పష్టంగా అర్థం చేసుకోటానికి సహకరిస్తుంది.

## 29.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వార్తా పత్రికలలో విన్యాసాన్ని సోదాహరణంగా వివరించండి?
2. వివిధ రకాల విన్యాస పద్ధతులేవి? మీరు తరచుగా చదివే ఏ పత్రికలో నుండి ఉదాహరణలతో పై పద్ధతులను చర్చించండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానం రాయండి.

1. డమ్మీ అంటే ఏమిటి?
2. నమూనా అంటే ఏమిటి?

**- కె నాగేశ్వర్**

BRAOU

BRAOU

# ఖండం - 6

## భారత రాజ్యాంగం-పత్రికారంగం

పత్రికలు కేవలం కబుర్లకో, కాలక్షేపానికో పరిమితం కాలేదు. మొదట సామాజిక సంస్కరణకోసం, సమాచార వ్యాప్తికోసం ప్రారంభమైన పత్రికలు ఇవాళ విస్తృత సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నాయి. అంతే కాకుండా వ్యవస్థకు 'నాలుగో పాదంగా' మారాయి. పత్రికలు జన జీవనంలో ప్రధాన భూమికను పోషించే స్థితికి ఎదిగిన క్రమంలో పత్రికా స్వేచ్ఛ అవసరమైంది. స్వేచ్ఛను నియంత్రించేందుకు పరిమితులు అవసరమైనాయి.

ముఖ్యంగా భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ ప్రత్యేకంగా లేదు. అది రాజ్యాంగంలో భాగంగానే ఉంది.తదనుగుణంగా చట్టాలు, శాసనాలు రూపొందించబడినాయి. ఈ ఖండంలో భారతదేశ పత్రికావ్యవస్థకు సంబంధించిన వివిధ రాజ్యాంగ న్యాయ పరమైన అంశాలను పొందుపరచడం జరిగింది. అవి **1.** భారతరాజ్యాంగం, పత్రికారంగం **2.** పత్రికా మండలి, పత్రికా శాసనాలు, పత్రికాస్వేచ్ఛ **3.** వార్త సంస్థలు **4.** పాత్రికేయ చట్టాలు, యూనియన్లు, వేతన బోర్డులు **5.** పాత్రికేయులు, నైతిక విలువలు.

ఈ ఖండం చదివిన తరువాత పాత్రికేయులకు ఉన్న స్వేచ్ఛ, పరిమితులు హక్కులు, బాధ్యతలు తెలుసుకోగలుగుతారు. పాత్రికేయ విద్యార్థులకు చట్టాలను సంబంధించిన అవగాహన తప్పనిసరి కూడా.

BRAOU

BRAOU

# భాగం - 30 : భారత రాజ్యాంగం పత్రికారంగం

## విషయక్రమం


30.0 ఉద్దేశం

30.1 ప్రవేశిక

30.2 స్వాతంత్ర్యాలపై ఆంక్షలు

30.3 రాజ్యాంగంలోని ప్రధాన అంశాలు

30.3.1 అవతారిక అంతరాత్మ

30.3.2 సమైక్య లక్షణాలు గల సమాఖ్య

30.3.3 క్రియాశీల ఫెడరలిజం

30.3.4 రాజ్యాంగంలో యూనిటరీ లక్షణాలు

30.4 రాజ్యాంగ మౌలిక స్వరూపం

30.5 న్యాయ సమీక్ష

30.6 ప్రాధమిక హక్కులు

30.7 స్వాతంత్ర్యాలు

30.8 రాష్ట్రపతి అధికారాలు

30.8.1 పాలనా సంబంధమైనవి

30.8.2 శాసనాధికారాలు

30.8.3 ఆర్థిక సంబంధమైనవి

30.8.4 అసామాన్య అధికారాలు

30.9 ఆదేశిక సూత్రాలు

30.10 సభాధిక్కారం - కోర్టు ధిక్కారం

30.11 పత్రికా స్వాతంత్ర్యం

30.12 పార్లమెంటు,శాసనసభల కార్యకలాపాల ప్రచురణకు రక్షణ

30.13 ముఖ్యవిషయాలను గర్తుంచుకుందాం

30.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు


BRAOU

## 30.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- రాజ్యాంగంలోని ప్రధానాంశాలు
- సభాధిక్కారం, కోర్టుధిక్కారం
- భావ ప్రకటనా స్వాతంత్ర్యం
- శాసనసభల కార్యకలాపాల ప్రచురణకు రక్షణ

తెలుసుకుంటారు.

## 30.1 ప్రవేశిక

భారత రాజ్యాంగంలో పత్రికా రచయితలకు ప్రత్యక్షంగా సంబంధమున్న అధికారాలు రెండు ఉన్నాయి. 19 (1) (డి), 361 (డి). అయితే పత్రికా రచయిత "అన్నిటి గురించి ఎంతో కొంత, కొన్నిటి గురించి అంతా" తెలుసుకోవాలని నానుడి. దీనిని అనుసరించి మంచి పత్రికా రచయిత అనిపించుకోవాలనుకునే వ్యక్తి భారత రాజ్యాంగంలోని ముఖ్యాంశాలన్నింటినీ స్థూలంగా తెలుసుకోవడం అవసరం. ఉదాహరణకు రాజ్యాంగంలోని మూడవ ప్రకరణం దేశపౌరులందరికీ కొన్ని ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. స్వాతంత్ర్య హక్కు ఇందులో భాగమే. రాజ్యాంగంలోని 19వ అధికరణ ఈ స్వాతంత్ర్య హక్కులకు సంబంధించినది. వాక్ భావ ప్రకటనా స్వాతంత్ర్యం ఇందులో ఒకటి. దాని గురించి వివరంగా తర్వాత తెలుసుకుందాం. మిగతా ప్రాథమిక హక్కులలో సమానత్వపు హక్కు, దాస్యత్వ నిరోధ హక్కు, మత స్వాతంత్ర్య హక్కు మొదలైనవి ఉన్నాయి. ఈ హక్కులలో దేనినైనా హరించడం జరిగినప్పుడు ఆర్టికల్ 32 ద్వారా సుప్రీంకోర్టుకు లేదా ఆర్టికల్ 226 ద్వారా రాష్ట్ర హైకోర్టుకు రిట్ దరఖాస్తు చేసుకుని వాటిని తిరిగి సాధించుకోవచ్చు.

## 30.2 స్వాతంత్ర్యాలపై ఆంక్షలు

రాజ్యాంగంలోని 18వ ప్రకరణంలోని అధికరణ ప్రకారం దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించినప్పుడు ఈ ప్రాథమిక హక్కుల అమలు నిలిచిపోతుంది. 358, 359వ అధికరణాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితి అమలులో ఉన్నంతకాలం 19వ అధికరణలోని స్వాతంత్ర్య హక్కుల అమలు నిలిచిపోతుందని 358వ అధికరణ ప్రకటించగా ఆ హక్కుల అమలు కొరకు ఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించినా అవి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయబోవని 359వ అధికరణ స్పష్టం చేస్తున్నది. పత్రికా రచయితలకు ఈ విషయం తెలిసి వుండాలి. ముందుగా రాజ్యాంగంలోని ప్రధాన అంశాల గురించి తెలుసుకుందాం.

## 30.3 రాజ్యాంగంలో ప్రధానాంశాలు

BRAOU

### 30.3.1 అవతారిక అంతరాత్మ

భారతరాజ్యాంగాన్ని అధ్యయనం చేయదలచినప్పుడు అవతారిక అంతరాత్మతో ఆ పని ప్రారంభించాలి. అవతారిక అంతరాత్మను రాజ్యాంగవేత్తలు "రాజ్యాంగపు అంతరాత్మ" అని అభివర్ణించారు. రాజ్యాంగంలోని దాదాపు 500 అధికరణలలో నిక్షిప్తరచిన విలువల సారాంశం అవతారికలో వ్యక్తమవుతుంది. భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యంగా ఈ అవతారిక మొదట పేర్కొన్నది. సోషలిస్టు, సెక్యులర్ అనే రెండు మాటలను తర్వాత రాజ్యాంగం 42వ సవరణ ద్వారా 1976లో చేర్చారు. అవి చేర్చే ముందు కూడా మన రాజ్యాంగ ఆశయం వివిధ అధికరణలలో వ్యక్తమైన ప్రకారం మతాతీత సమసమాజ స్థాపనగానే వుండింది. కుల, మత, భాషా, ప్రాంత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా దేశ పౌరులందరికీ సమాన ప్రతిపత్తి, సమానవకాశాలు వుండాలనడంలో అర్థం ఇదే కదా! అయినా తర్వాత కాలంలో పాలకులు మరింత స్పష్టంగా వుండాలన్న భావంతో ఈ రెండు మాటలను అవతారికలో చేర్చారు.

ఈ అవతారిక అంతరాత్మ ప్రజలందరికీ న్యాయం, స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం సాధించడానికి హామీ ఇస్తున్నది. న్యాయం అన్న మాటనే తీసుకుంటే ప్రజలందరికీ సాంఘిక ఆర్థిక రాజకీయ త్రివిధ న్యాయం సాధిస్తామని అవతారిక పూచీ ఇస్తున్నది. స్వాతంత్ర్యం అంటే భావస్వాతంత్ర్యం, వ్యక్తీకరణ స్వాతంత్ర్యం, మతస్వాతంత్ర్యం, ఆరాధనా స్వాతంత్ర్య కూడాఅని వివరించింది. అలాగే సమానత్వమంటే సమాన ప్రతిపత్తి సమాన అవకాశాలు అని స్పష్టపరిచింది. ఇక సౌభ్రాతృత్వ భావనను ప్రజలందరిలో ప్రోత్సహించడమంటే వ్యక్తి స్వాభిమానాన్ని, జాతి సమైక్యత సమగ్రతలనూ పరిరక్షించే విధంగా దాన్ని

సాధించాలని పేర్కొంది. అందుచేత ఈ అవతారికను రాజ్యాంగపు ఆశయాల, ఆకాంక్షల పేటికగా పేర్కొనవచ్చు. రాజ్యాంగంలోని వివిధ అధికరణల ప్రయోజనమేమిటో ఇది సూచిస్తుంది. అవి ఆ ప్రయోజనాన్ని సాధించేవిగా వున్నాయో. లేదో తెలుసుకోవడానికి గీటురాయిగా ఉపయోగపడుతుంది.

### 30.3.2 సమైక్య లక్షణాలు గల సమాఖ్య

ఇక భారత రాజ్యాంగం ముఖ్య లక్షణాల గురించి తెలుసుకుందాం. ఇది ప్రపంచంలో కెల్లా అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందింది. ఇది యూనిటరీ (ఏక కేంద్ర) లక్షణాలు గల ఫెడరల్ (రాష్ట్రాల సమాఖ్య) రాజ్యాంగం. తొలి ఆర్టికల్ భారతదేశాన్ని 'రాష్ట్రాల సంఘం' అని అభివర్ణించింది. దీన్ని బట్టి ఇది ఫెడరల్ రాజ్యాంగమే అనుకోవాలి. కానీ ఆ రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించే హక్కు రాజ్యాంగం పార్లమెంటుకు ప్రసాదించింది. అంటే కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు. ఉన్న వాటిని తగ్గించవచ్చు. వాదన కోసం రేపు పార్లమెంటు రాష్ట్రాలన్నిటినీ కలిపి దేశమంతా ఒకే రాష్ట్రం అనవచ్చు. కాని అలా మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదని 1973లో ప్రాథమిక హక్కుల కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. (మౌలిక స్వరూపాన్ని గురించి విడిగా తెలుసుకుందాం). కాని సందిగ్ధ పరిస్థితి వుంది. కనుకనే నిపుణులు మన రాజ్యాంగం యూనిటరీయా, ఫెడరలా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ప్రకటిస్తున్నారు. రాజ్యాంగంలో ఈ రెండు లక్షణాలు ఉన్నాయి.

### 30.3.3 క్రియాశీల ఫెడరలిజం

సార్వభౌమధికారం రాజ్యాంగానికి ధారాదత్తమై వుండటం ఫెడరల్ వ్యవస్థలో మొదట చెప్పుకోవలసిన అంశం. కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన స్పష్టంగా వుండటం మరో ముఖ్యమైన అంశం. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ఎవరి అధికారాలేమిటో వివరంగా తెల్పుతున్నది. దాని ప్రకారం కేంద్ర పరిధిలో 97 అంశాలు, రాష్ట్రాల జాబితాలో 66 అంశాలు ఉన్నాయి. అయితే 47 అంశాలతో ఉమ్మడి జాబితా ఒకటి ఉండటం అందులోని అంశాల విషయంలో వివాదం ఉత్పన్నమైనప్పుడు కేంద్రానిదే పైచేయిగా వుండటం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. అంతేకాదు కేటాయించిన అంశాలను చూసినా కీలకాధికారాలు, కేంద్రానికే కల్పించబడిన ఏమర్జెన్సీ అధికారాల ప్రయోజనం కూడా ఇదే. వీటన్నిటిని దృష్టిలో వుంచుకుని భారత రాజ్యాంగాన్ని క్రియాశీల ఫెడరలిజం అని కూడా నిపుణులు వర్ణించారు.

BRAOU

### 30.3.4 రాజ్యాంగంలో యూనిటరీ లక్షణాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన సమంగా లేకపోవడం మొదటిది. ఈ అంశాన్ని ఇంతకు ముందు చర్చించి దాని ప్రయోజనాన్ని గురించి తెలుసుకున్నాం. ఆర్థిక వనరుల విషయంలో రాష్ట్రాలు కేంద్ర సహాయంపై ఆధారపడవలసి వుండటం, దీనికి ఆర్థిక సంఘం ఏర్పాటుకు రాజ్యాంగంలో అవకాశం వుండటం, ఏ నిధులు ఏ మేరకు రాష్ట్రాలకు చెందాలో నిర్ణయించే అధికారం దానికి ఉండటం పరిష్కారంగా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

రాజ్యాంగాన్ని సవరించే అధికారం కేంద్రానికి మాత్రమే ఉండటం మరొకటి. అయితే కొన్ని సవరణలకు రాష్ట్రాలలో సగానికి మించిన వాటి ఆమోదం అవసరం కావడంతో వాటికి కొంత పాత్ర కల్పించినట్టయింది. ఇక రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేకపోవడం, రాష్ట్రాల శాసనాలను తిరస్కరించే అధికారం రాష్ట్రపతికి ఉండటం. (ఇలాంటి విషయాలలో రాష్ట్రపతి కేంద్రమంత్రి మండలి సలహాను విధిగా పాటిస్తారు గనుక).

ఇంతేగాక దేశమంతటికీ ఒక రాజ్యాంగం ఉండటం, ఒకే పౌరసత్వం ఉండటం, పౌర, శిక్షాస్మృతులు ఒకే విధంగా ఉండటం, ఐ.ఎ.ఎస్. వంటి కేంద్రీకృత పాలనాధికార వ్యవస్థ ఉండటం, ఏకీకృత న్యాయవ్యవస్థ ఉండటం గట్టి యూనిటరీ లక్షణాలు.

రాజ్యాగం నిర్మాతలు మన దేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా వర్ణించడంలో కూడా నిగూఢార్ధముంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ సభలో ఆ విషయం చెప్పారు. ఫెడరేషన్ అంటే రాష్ట్రాలు కోరి ఏకమైన వ్యవస్థ. దానిలో విడిపోయే అధికారం భాగస్వాములకు వుంటుంది. యూనియన్ అనేది అలా కోరి ఏర్పరచుకున్నందున రూపుదిద్దుకున్నది కాదు. కనుక అవిభాజ్యమైనది. సంప్రదాయ సిద్ధమైన ఫడరల్ రాజ్యాంగాలకు మన రాజ్యాంగానికి వున్న మౌలికమైన తేడా అదే.

**అభ్యాసం-1: 1. సమాఖ్య అంటే ఏమిటి?**

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

**2. ఫెడరలిజం అవశ్యకతను చెప్పండి?**

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

..........................................................................................................................................................................................

## 30.4 రాజ్యాంగ మౌలిక స్వరూపం

BRAOU

భారత రాజ్యాంగాన్ని సరళ రాజ్యాంగంగా పండితులు గుర్తించారు. అంటే మారుతున్న అవసరాలకు అనుగుణంగా దాన్ని సవరించుకునే అవకాశం వున్నదన్న మాట. రాజ్యాంగాన్ని సవరించడానికి మూడు పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. 1. సామాన్య మెజారిటీతో సవరణ 2. పార్లమెంటు ఉభయసభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో సవరణ 3. పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీయే కాకసగానికి పైగా రాష్ట్రాల ధృవీకరణ అవషరమున్న సవరణ షెడ్యూళ్ళలోని వివరాల వంటి మామూలు అంశాల సవరణకు సామాన్య మెజారిటీ చాలు. ముఖ్యమైనఅంశాలు సవరించాలంటే పార్లమెంటు ఉభయసభలలో మూడింట రెండువంతుల మెజారిటీ అవసరం. రాష్ట్రాల అధికారాలతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధమున్న అధికరణలను సవరించాలంటే సగానికిపైగా రాష్ట్రాల ధృవీకరణ కూడా అవసరమవుతుంది.

1967లో రాజ్యాంగాన్ని సవరించడానికి పార్లమెంటుకు ఉన్న అధికారాలపై సుప్రీంకోర్టు చరిత్రాత్మకమైన తీర్పు చెప్పింది. పంజాబ్‌ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోలక్‌నాథ్ అనే వ్యక్తి వేసిన కేసులో తీర్పు చెబుతూ ప్రాథమిక హక్కులను హరించే లేదా తొలగించే రాజ్యాంగ సవరణలు తెచ్చే అధికారం పార్లమెంటుకు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అంటే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం పార్లమెంటుకు లేదన్నది దాని సారాంశం. 1973లో కేరళ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కేశవానంద భారతి అనే వ్యక్తి కేసులో తీర్పుతో ఈ మౌలిక స్వరూప భావన స్థిరపడింది. ప్రాథమిక హక్కుల కేసుగా ప్రసిద్ధికెక్కిన ఆ కేసులోరాజ్యాంగపు అవతారికలోనూ, ఆదేశిక సూత్రాలలోనూ పొందుపరిచిన ఆశయాల సాధనకోసం పార్లమెంటు రాజ్యాంగాన్ని

ప్రాథమిక హక్కులతో సహా సవరించవచ్చునని పేర్కొంటూనే సుప్రీంకోర్టు ఆ పని మౌలిక స్వరూపానికి భంగం కలుగకుండా చేయాలని నిర్దేశించింది. పార్లమెంటు తీసుకువచ్చిన రాజ్యాంగ సవరణల చెల్లుబాటును కోర్టులు పరిశీలించకుండా చేద్దామని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రభుత్వం ఒక ప్రయత్నం చేసింది. కాని ప్రాథమిక హక్కుల కేసులోనూ తర్వాత మినర్వా మిల్లు కేసులోనూ ఇచ్చిన తీర్పులద్వారా సుప్రీంకోర్టు ఆ ప్రయత్నాన్ని విఫలం చేసింది. ఇప్పుడున్న స్థితి ఏమిటో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కోకా సుబ్బారావు మాటలలో ఈ విధంగా చెప్పుకోవచ్చు. "భారత రాజ్యాంగం ప్రకారం చట్టసభకు కోర్టుకు మధ్య ఘర్షణ ఏర్పడే అవకాశమే లేదు. అవి పరస్పర పూరకాలుగా పనిచేస్తాయి. ఒకటి చట్టాలను రూపొందిస్తే రెండోది వాటి చెల్లుబాటును నిర్ధారిస్తుంది".

## 30.5 న్యాయ సమీక్ష

పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలు చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను అంటే చెల్లుబాటును పరిశీలించి నిర్ధారించే అధికారం రాజ్యాంగంలోని 13(2) అధికరణ. సుప్రీంకోర్టుకు, హైకోర్టులకు కల్పించింది. దీన్ని క్లుప్తంగా న్యాయ సమీక్షాధికారం అంటారు. న్యాయ సమీక్ష అంటే "ఏ చట్టాన్ని కాని, అధికార చర్యని కానీ, రాజ్యాంగబద్ధమవునా, కాదా అని పరిశీలించి అలా కానప్పుడు ఆ చట్టం లేదా ఆ చర్య చెల్లనేరదని ప్రకటించడానికి కోర్టులకున్న అధికారం". న్యాయ సమీక్ష విషయంలో భారతదేశంలో కోర్టుల పాత్ర బ్రిటన్, అమెరికాలలోని కోర్టుల పాత్ర కన్నా భిన్నమైనది. బ్రిటన్‌లో పార్లమెంటుచేసిన ఏ శాసనాన్నీ కోర్టులు కొట్టివేసే వీలులేదు. అమెరికన్ కోర్టులు విధివిధానానుసరణలో లోపం జరిగిందని భావించినప్పుడు కూడా చట్టాలు చెల్లవని ప్రకటిస్తుంటాయి. కానీ మన దేశంలో కోర్టులు మధ్యేమార్గాన్ని అవలంబించవలసివుంటుంది. రాజ్యాంగమే చట్టసభలకు అధికారాలనుఇచ్చి వాటికి పరిమితులు విధించింది. నిర్దిష్ట పరిమితులను అతిక్రమించాయా అన్న విషయాన్నే మన కోర్టులు పరిశీలిస్తాయి. అలాగే ఆయా చట్టాలు రాజ్యాంగం మూడవ భాగంలోని ప్రాథమిక హక్కులకు భంగకరంగా వున్నాయా అని పరిశీలించి అలా వున్నప్పుడు అవి చెల్లవని ప్రకటిస్తాయి. ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు రాజ్యాంగం 32వ అధికరణ ప్రకారం సుప్రీంకోర్టును లేదా 226 అధికరణ ప్రకారం హైకోర్టులనూ ఆశ్రయించవచ్చు. అత్యవసర పరిస్థితి కాలంలో రాజ్యాంగ సవరణల ద్వారా కోర్టుల అధికారాలను తొలగించే ప్రయత్నాలు జరిగాయి. కాని సుప్రీంకోర్టు మినర్వా మిల్లు కేసులో ఈ ప్రయత్నాలను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. తర్వాత 44వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు పూర్వస్థితిని పునరుద్ధరించింది.

న్యాయ సమీక్ష అనేది రాజ్యాంగ చట్టాన్నీ, ప్రజాస్వామ్య వ్యవస్థనూ సంరక్షించవలసిన బాధ్యతను సఫలప్రదంగా నిర్వర్తించడానికి సుప్రీంకోర్టుకూ, హైకోర్టులకూ కల్పించిన సాధనం అని చెప్పవచ్చు.

## 30.6 ప్రాథమిక హక్కులు

భారత రాజ్యాంగంలోని మూడవ ప్రకరణ చాలా మహత్వపూర్ణమైనది. దీనిలో ప్రాథమిక హక్కులు నిర్వచింపబడివున్నాయి. మామూలు చట్ట ప్రకారం ఒక దేశపౌరులకు లభించే హక్కులు సాధారణ హక్కులు కాగా లిఖిత రాజ్యాంగం ప్రసాదించే హక్కులను ప్రాథమిక హక్కులుగా రాజ్యాంగనేత్తలు నిర్వచించారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు ఈ ప్రాథమిక హక్కులను ప్రసాదించే ప్రభుత్వం వాటికి ప్రతిబంధకాలు సృష్టించరాదని స్పష్టపరచడమే గాక వాటిని అమలు జరిపించుకోవడానికి రిట్ అధికారాలను కూడా కల్పించింది. ఈ ప్రాథమిక హక్కులు 12వ అధికరణతో ప్రారంభమై 35వ అధికరణ వరకు సాగుతాయి. ఇందులో 14వ అధికరణ సమానత్వ హక్కుకు సబంధించింది. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంత. లింగ భేదాలతో నిమిత్తం లేకుండా చట్టం ముందు దేశ పౌరులందరూ సమానమేనని ఈ అధికరణ ప్రకటిస్తున్నది. 15వ అధికరణ కుల, మత, ప్రాంత, లింగ భేధాలను పురస్కరించుకుని ఏ పౌరుని పట్ల విచక్షణ చూపరాదని నిర్దేశిస్తున్నది. 16వ అధికరణ ప్రభుత్వోద్యోగాలలోఅందరికీ

BRAOU

సమానవకాశాలను నిర్దేశిస్తున్నది. 17వ అధికరణ అస్పృశ్యతను నిషేధిస్తున్నది. 18వ అధికరణ సైనిక, విద్యాత్మక ఘనతను చూపించేవి తప్ప ఇతర రకాల బిరుదులన్నింటిని నిషేధించడం ద్వారా పౌరునికీ పౌరునికీ మధ్య విచక్షణకు ఏలాంటి అవకాశం వుండకుండా జాగ్రత్త పడుతున్నది. ఇవన్నీ ప్రజలందరికీ సమానత్వం కల్పిస్తాయనీ, దేశంలో సెక్యులర్ వ్యవస్థ నెలకొల్పుతాయని అవతారికలో రాజ్యాంగం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఉపయోగపడతాయి.

## 30.7 స్వాతంత్ర్యాలు

ఇక ఈ ప్రకరణంలోని అతి ముఖ్యమైన స్వాతంత్ర్యాలను ఆర్టికల్ దేశపౌరులకు సప్త స్వాతంత్ర్యాలను ప్రసాదించింది. కాని తర్వాత ఆస్తికి సంబంధించిన స్వాతంత్ర్యాన్ని తొలగించారు. ఇప్పుడు ఆరు స్వాతంత్ర్యాలు ఉన్నాయి. 1. వాక్ భావ ప్రకటనా స్వాతంత్ర్యం 2. ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే స్వాతంత్ర్యం 3. సంఘాలు, యూనియన్లు ఏర్పాటు చేసుకునే స్వాతంత్ర్యం 4. దేశమంతటా స్వేచ్ఛగా సంచరించే స్వాతంత్ర్యం 5. దేశంలో ఏ ప్రాంతంలోనైనా స్థిరపడి నివాసమేర్పరచుకునే స్వాతంత్ర్యం 6. ఏ వ్యాపారాన్నయినా, వృత్తినైనా, పనినైనా, పరిశ్రమైనా చేపట్టే స్వాతంత్ర్యం.

ప్రతి పౌరునికీ ఆస్తిని సంపాదించి, వుంచుకొని అన్యాక్రాంతం చేసే స్వాతంత్ర్యం కూడా మొదట్లో వుండేది. కాని రాజ్యాంగం 44వ సవరణ చట్టం ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించారు. దీనికి అనుగుణంగా రాజ్యాంగంలోని ఇతర అధికరణలను కూడా సవరించారు. అంతేగాక రాజ్యాంగం 12వ ప్రకరణంలోని నాలుగవ అధ్యాయం లో '300-ఎ' అనే కొత్త అధికరణను చేర్చారు. దీని ప్రకారం "చట్టరీత్యా లభించే అధికారాన్ని వినియోగించితే తప్ప ఏవ్యక్తీ ఆస్తినీ హరించరాదు" అంటే ఆస్తి హక్కు ప్రాథమిక స్వాతంత్ర్యాలలో భాగంగా కాకచట్టబద్ధమైన హక్కుగా మిగిలి ఉందన్నమాట.

19 (1) (ఎ) అధికరణంలోని స్వాతంత్ర్యాలలో వాక్ భావ ప్రకటనా స్వాతంత్ర్యం మొదటిది. పత్రికా రచయితలు, ప్రసార మాధ్యమ నిర్వాహకులు వాటిని గురించి క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం. వాటిని వివరంగా ముందు భాగంలో తెలుసుకుందాం. మొదటి దేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి అధికారాల గురించి తెలుసుకుందాం.

BRAOU

**అభ్యాసం-2: 1. ప్రాథమిక హక్కులేమిటో పేర్కొనండి ?**

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

**2. వాక్, భావ ప్రకటన స్వాతంత్ర్యాన్ని వివరించండి?**

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

## 30.8 రాష్ట్రపతి అధికారాలు

భారత దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉన్నందున నిజమైన పాలనాధికారాలు ప్రభుత్వాధినేత అయిన ప్రధానమంత్రి చేతిలో కేంద్రీకృతమై వుండటం సహజం. రాజ్యాంగాధినేత అయిన రాష్ట్రపతి తన విధుల నిర్వహణలో మంత్రి మండలి సలహాను అనుసరించే వ్యవహరించాలని 74(1) అధికరణ నిర్దేశిస్తున్నదని ఈనాడు అంతా అంగీకరిస్తున్నారు. ఆ కారణం చేత రాష్ట్రపతి అధికారాలు నామమాత్రమని భావించే వారున్నారు. ఎన్నికల తర్వాత కాని మరొకప్పుడు కానీ ప్రధానిని నియమించేటప్పుడు లోక్‌సభలో మెజారిటీ మద్దతు ఎవరికి వుందో స్పష్టంగా తెలియని పరిస్థితులలో మాత్రమే ఆయన స్వంత విచక్షణను ఉపయోగించి కీలకపాత్ర వహించే అవకాశముంది తప్ప తక్కిన సమయాలలో లాంఛనాలు పూర్తి చేయడమే తప్ప చేసేదేమీ లేదనే భావన పరివ్యాప్తమై ఉంది. అదేమైనా రాష్ట్రపతి అధికారాలేమిటో తెలుసుకోవడం మాత్రం చాలా అవసరం.

రాష్ట్రపతి అధికారాలను సామాన్య, అసామాన్యమైనవి అని రెండుగా వర్గీకరించవచ్చు. సామాన్య అధికారాల కింద ఆయనకు పాలనా సంబంధ అధికారాలు 8. శాసన సంబంధమైనవి 10. ఆర్థిక సబంధమైనవి అయిదు. న్యాయ సంబంధమైనవి ఒకటి, అన్యమైనవి నాలుగు వున్నాయి.

### 30.8.1 పాలనా సంబంధమైనవి

1. పరిపాలన నిర్వహణ, నియమాల తయారీ, మంత్రులకు పనుల కేటాయింపు.
2. మంత్రిమండలి నిర్ణయాల గురించి తెలుసుకోవడం, ఏవైనా విషయాలు పరిశీలించాల్సిందిగా మంత్రి మండలిని కోరడం
3. ముఖ్య పదవులలో వ్యక్తులను నియమించడం, అవసరమైతే తొలగించడం.
4. కేంద్రపాలిత ప్రాంతాల, గిరిజన ప్రాంతాల పాలనను నిర్వహించడం.
5. విదేశాలతో సంబంధాలను నిర్వహించడం.
6. సర్వసేనాధిపతి బాధ్యతలు నిర్వహించడం.
7. సుప్రీంకోర్టు ఇతర స్వతంత్రాధికార వ్యవస్థల వ్యవహార నియమావళి రూపొందించడం.
8. రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు పంపడం, రాజ్యాంగ వ్యవస్థ విఫలమైనపుడు 356వ అధికరణను ప్రయోగించి వాటి పాలనా బాధ్యతలను చేపట్టడం.

### 30.8.2 శాసనాధికారాలు

1. పార్లమెంటు సమావేశాల ఘటన, విఘటన.
2. రాజ్యసభకు 12 మంది సభ్యులను, లోక్‌సభకు ఇద్దరు సభ్యులను నామినేట్ చేయడం.
3. పార్లమెంటు సమావేశంలో ప్రారంభోపన్యాసమివ్వడం, అవసరమైన సందేశాలు పంపడం.
4. ఆర్థిక బిల్లులపై వీటో అధికారాలను ప్రయోగించడం.
5. కొన్ని రకాల బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి అనుమతి ఇవ్వడం.
6. ఆర్డినెన్సులను జారీ చేయడం.

BRAOU

7. పార్లమెంటరీ కమిషన్‌ల నివేదికలను సభలలో సమర్పింపచేయడం .

8. తాత్కాలిక సభాపతులను నియమించడం.

9. నౌకాశ్రయాలు, విమానాశ్రయాలకు సంబంధించిన చట్టాలలో మార్పులు, చేర్పులను అనుమతించడం.

10. రాష్ట్రాల శాసనాలను వీటో చేయడం.

### 30.8.3 ఆర్థిక సబంధమైనవి

1. లోక్‌సభలో ఆర్థిక బిల్లుల ప్రతిపాదనకు పూర్వానుమతి ఇవ్వడం.

2. దేశ సంచితనిధిని నియంత్రించడం.

3. పార్లమెంటులో బడ్జెట్‌ను సమర్పింప చేయడం.

4. ఆర్థిక కమిషన్‌ను నియమించడం.

5. ఆదాయం పన్ను మొదలగు వాటిలో రాష్ట్రాల వాటాలను నిర్ణయించడానికి అనుమతి నివ్వడం.

న్యాయ సంబంధమైన అధికారంలో శిక్షలను తగ్గించడం, మాఫీచేయడం, క్షమాభిక్ష ప్రసాదించడం ఉన్నాయి. ఇతర అధికారాలలో 1. ఏదైనా ముఖ్యమైన వివాదాస్పద అంశాన్ని సుప్రీంకోర్టుకు సలహానిమిత్తం పంపడం 2. యు.పి.ఎస్.సి. వ్యవహార నియమావళిని ఆమోదించడం 3. అధికార భాషా సంఘాన్ని నియమించడం 4. జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం కోసం ప్రత్యేక నిబంధనలు ఆమోదించడం.

### 30.8.4 అసామాన్య అధికారాలు

రాష్ట్రపతి అసామాన్య అధికారాలలో అత్యవసర అధికారాలు ఉన్నాయి. విదేశీ దురాక్రమణ లేదా దండయాత్ర, లేదా అంతర్యుద్ధ పరిస్థితులు ఏర్పడినప్పుడు 352 అధికరణ కింద, ఏదేని రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ విఫలమైనప్పుడు 356 అధికరణ కింద, ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు 360 అధికరణ కింద రాష్ట్రపతి ఈ అధికారాలను వినియోగించవచ్చు.

BRAOU

## 30.9 ఆదేశిక సూత్రాలు

రాజ్యాంగం నాలుగవ భాగంలో 35 నుంచి 51 అధికరణలలో ఆదేశిక సూత్రాలు ఉన్నాయి. ఇవి ప్రభుత్వం సాధించవలసి ఉన్న 19లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. ఇవి కోర్టులలో రిట్ దరఖాస్తులు వేయడం ద్వారా అమలు పరచుకోగలిగినవి కావు. కాని ప్రభుత్వం తమ బాధ్యతగా వీటిని అమలు పరచవలసివుంది. అందరికీ తగినంత ఉపాధి కల్పించడం సంపద కేంద్రీకరణను నిరోధించడం, సమానమైన పనికి సమానవేతనం లభించేటట్లు చూడడం, దేశ పౌరులందరికీ ఉమ్మడి పౌరస్మృతిని అమలుపరచడం, 14 ఏళ్ళ లోపు బాలలందరికీ ఉచిత నిర్బంధ విద్యా విధానాన్ని అమలు పరచడం గ్రామ పంచాయితీలను వ్యవస్థీకరించడం, మద్యపానాన్ని నిషేధించడం, గోవధను నిషేధించడం వంటివి ఈ ఆదేశిక సూత్రాలలో ముఖ్యమైనవి. వీటి అమలులో ఒక్కోసారి ప్రాథమిక సూత్రాలు ఘర్షణ ఉత్పన్నం కావచ్చు. అలాంటప్పుడు సవరణలు తెచ్చింది. కానీ అలా చేయడం రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చడమవుతుందని చెప్పి సుప్రీంకోర్టు వాటిని కొట్టివేసింది. అంటే ఎవరి ప్రాథమిక హక్కులకు భంగకరం కాని విధంగా ఈ ఆదేశిక సూత్రాలను అమలు జరపాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్న మాట.

## 30.10 సభాధిక్కారం - కోర్టు ధిక్కారం

రాజ్యాంగంలోని 105(3), అధికరణ 194(3) అధికరణ గురించి తెలుసుకోవాలి. ఇవి పార్లమెంటు, రాష్ట్ర, శాసనసభల విశేషాధికారాలకు సంబంధించినవి. అలాగే గత 129వ అధికరణం 215 అధికరణం గురించి కూడా తెలియాలి. ఇది కోర్టు ధిక్కరణకు పాల్పడిన వ్యక్తులను శిక్షించడానికి సుప్రీంకోర్టుకు రాష్ట్ర హైకోర్టులకు అధికారం ఇస్తున్నది. ఈ నాలుగుఅధికరణల గురించి వాక్ భావప్రకటన స్వాతంత్ర్యానికి సంబంధించిన 19(1) (డి) అధికరణ మాదిరిగానే పత్రికా రచయిత క్షుణ్ణంగా తెలుసుకోవలసిన అవసరముంది. కోర్టు దిక్కారాన్ని నిర్వచించి పరిమితం చేయడానికి 1917వ సంవత్సరపు కోర్టు ధిక్కార చట్టం ఒకటి ఉంది. ఆ చట్టాన్ని అధ్యయనం చేసేటప్పుడు 129, 215 అధికరణల గురించి తెలుసుకోవచ్చు. పార్లమెంటు సభ్యుల, శాసన సభ్యుల విశేషాధికారాలను వీలైనంత త్వరలో నిర్వచిస్తూ చట్టాలు చేయాలి అని రాజ్యాంగం నిర్దేశించినప్పటికీ ఇంతవరకు అలాంటి చట్టమేదీ రాలేదు. కనుక వీటికి సంబంధించి రాజ్యాంగంలో ఉన్న అధికరణలను ఇంతవరకు ప్రాగైన దృష్టాంతరాలతో కలిపి అధ్యయనం చేయవలసి వుంటుంది.

## 30.11 పత్రికా స్వాతంత్ర్యం

పత్రికా స్వాతంత్ర్యం కూడా ఇమిడి వున్న 19(1)(ఎ) అధికరణ గురించీ 361(ఎ) అధికరణ గురించీ సంపూర్ణంగా అధ్యయనం చేయడం అవసరం. స్వాతంత్ర్యానికి పూర్వం భారతదేశంలో ప్రాథమిక హక్కులు లేవుకనుక ప్రతికాస్వాతంత్ర్యమే లేదు. 1950లో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం మూడవ ప్రకరణలో ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. 19వ అధికరణం దేశ పౌరులందరికీ సంపాదించి, ఉంచుకునే లేదా అన్యాక్రాంతం చేసే స్వాతంత్ర్యాన్ని రాజ్యాంగం 44వ సవరణ ద్వారా తొలగించారు. వీటిలో మొదటిది వాక్ భావా ప్రకటనా స్వాతంత్ర్యం. ఈ స్వాతంత్ర్యాలు అన్నీ సమాన ప్రతిపత్తి కలిగినవే అయినప్పటికీ స్వాతంత్ర్యాలలో మొదటి స్థానంలో వాక్ భావా ప్రకటనా స్వాతంత్ర్యాన్ని పెట్టి రాజ్యాంగ రచయితలు దీని ప్రాముఖ్యమేమిటో విశదపరిచారు. ఈ వాక్ భావ ప్రకటనా స్వాతంత్ర్యంలో పత్రికా స్వాతంత్ర్యం ఒక భాగం. భారత రాజ్యాంగంలో పత్రికా స్వాతంత్ర్యం అన్న మాటలు లేవు. అయితే భావా ప్రకటనా స్వాతంత్ర్యం అన్న దానిలో పత్రికా స్వాతంత్ర్యం ఇమిడి వున్నదని 1950లోనే మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రమేష్ థాపర్ వేసిన కేసులోను, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బ్రిజ్‌భూషణ్ వేసిన కేసులోను ఇచ్చిన తీర్పుల ద్వారా సుప్రీంకోర్టు స్పష్టపరిచింది. పత్రికా స్వాతంత్ర్యం ఏమిటనేది ఇంకో భాగంలో తెలుసుకుందాం.

BRAOU

ఈ విధంగా 19వ అధికరణ ద్వారా పౌరులందరికీ లభించిన స్వాతంత్ర్యాలు నిర్బంధమైనవి కావు. అవి అదే అధికరణలోని 2,3,4,5,6 క్లాజులలో పేర్కొన్న పరిమితులకు లోబడి వుంటాయి. అదే విధంగా 19 (1) (ఎ) ద్వారా పౌరులకు లభించిన వాక్ స్వాతంత్ర్యం భావ ప్రకటన స్వాతంత్ర్యం విధించే "సహేతుకమైన ఆంక్షలకు" లోబడి వుంటాయి. భారతదేశ సార్వభౌమాధికారం, దేశ సమగ్రత దేశ బాధ్యత, విదేశాలతో స్నేహ సంబంధాలు, ప్రజాబాధ్యత లేదా నైతికతలను పరిరక్షించడానికి పరువునష్టం కలిగించే ప్రకటనలను కోర్టు ధిక్కారాన్ని నేరానికి పురికొల్పడానికి అరికట్టడానికి ఈ ఎనిమిది అంశాలకు సంబంధించి ఆంక్షలు విధించవచ్చునన్నమాట.

ఈ ఆర్టికల్‌ను 1951లో తెచ్చిన మొదటి రాజ్యాంగ సవరణ ప్రకారం, మళ్ళీ 1963లో తెచ్చిన 16వ సవరణ ప్రకారం పటిష్టపరచడం జరిగింది. ఈ రెండు సవరణల పరిణామ రూపంగా ఈ క్లాజులో భారత సార్వభౌమాధికారం, దేశ సమగ్రత, ప్రజా బాధ్యత, విదేశాలతో స్నేహ సంబంధాల పరిరక్షణ అనే కారణాల చేత వాక్‌భావ ప్రకటనా స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు విధించడానికి అవకాశం ఏర్పడింది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. అమెరికాలో కూడా మొదటి రాజ్యాంగ సవరణ పత్రికా స్వాతంత్ర్యానికి సంబంధించిందే, అక్కడ రాజ్యాంగంలో వాక్ స్వాతంత్ర్యంతోపాటు పత్రికా స్వాతంత్ర్యాన్ని గురించి కూడా ప్రత్యేకంగా పేర్కొన్నారు. మొదటి సవరణ "వాక్ స్వాతంత్ర్యాన్ని పత్రికా స్వాతంత్ర్యాన్ని కుందించే శాసమేదీ పార్లమెంటు

చేయరాదు" అని నిర్దేశిస్తున్నది. అంటే అమెరికాలో పత్రికా స్వాతంత్ర్యాన్ని తగ్గించే చట్టమేదీ చేయడానికి అవకాశమే లేదు. మన దేశంలో సహేతుకమైన ఆంక్షలు మాత్రం విధించే అవకాశముంది. ఇదీ ఒకందుకు మంచిదే అని రాజ్యాంగ పండితులు భావిస్తున్నారు. ఎందుకంటే ఈ సహేతుకమైన ఆంక్షలు రెండవ క్లాజులో పేర్కొన్న ఎనిమిది అంశాలకు సంబంధించినంతవరకే పరిమితమై వుంటాయి. పరిమితి మీరినప్పుడు వాటిని కోర్టులో సవాలు చేయవచ్చు.

**అభ్యాసం-3: పత్రికా స్వాతంత్ర్యం రాజ్యాంగ బద్ధంగా వుండాలా, వద్దా చర్చించండి.**

..............................................................................................................................................

..............................................................................................................................................

..............................................................................................................................................

..............................................................................................................................................

..............................................................................................................................................

## 30.12 పార్లమెంటు, శాసనసభల కార్యకలాపాల ప్రచురణ రక్షణ

ఆర్టికల్ 361(1) (డి) పత్రికలకు ఈ రక్షణ కల్పించింది. ఇది రాజ్యాంగంలో ముందునుంచి లేదు. 1978లో 44వ సవరణ ద్వారా దీన్ని చేర్చారు. దీని పూర్తి సారం ఇలా వుంది. "పార్లమెంటు ఉభయ సభలలో దేనిలో కాని లేదా రాష్ట్ర విధానసభలో కాని లేదా ఏదేని రాష్ట్రానికి చెందిన విధాన మండలి ఉభయ సభలలో దేనిలోనైనా కాని జరుగుతున్న కార్యకలాపాల గురించి భావం చెడకుండా పత్రికలో వార్త ప్రచురించినందుకు ఏ వ్యక్తి కూడ. అలాంటి ప్రచురణ దురుద్దేశంతో చేశాడని రుజువైతే తప్ప ఏ కోర్టులోను సివిల్ లేదా క్రిమినల్ చర్యకు లోను కాబోడు". అయితే పై క్లాజు పార్లమెంటు ఉభయ సభల్లో ఏదైనా, లేదా రాష్ట్ర విధానసభ లేదా రహస్య సమావేశాలలోని కార్యకలాపాలకు వర్తించదు.

పై క్లాజు ఒక బ్రాడ్‌కాస్టింగ్ స్టేషన్ ద్వారా ప్రసారమయే కార్యక్రమాలకు లేదా సర్వీసులో భాగంగా వైర్‌లెస్ టెలిగ్రాఫ్ ద్వారా అందించే రిపోర్టులకు లేదా సమాచారానికి కూడా పత్రికలలో ప్రచురించిన రిపోర్టులకూ. సమాచారానికీ వర్తించినట్లుగానే వర్తిస్తుంది. ఈ అధికరణలో పత్రిక అంటే పత్రికలో ప్రచురణార్థం ఉద్దేశించి వార్తాసంస్థ పంపే సమాచారమని కూడా అర్థం.

పార్లమెంటు సభ్యులకు శాసన సభ్యులకు సభలో విస్సంకోచంగా ఏ అంశాన్ని గురించయినా మాట్లాడే విశేషాధికారం ఉంది. అలా వారు చేసిన ప్రసంగాలను పురస్కరించుకుని ఎవరూ వారిపై ఏ చట్టం కిందా తుదకు పరువునష్టం చట్టం కిందకూడా చర్య తీసుకోవడానికి వీలు లేకుండా ప్రచురించిన పత్రికలకు మొదట్లో ఎలాంటి రక్షణ లేకుండేది. సభ్యుల ప్రసంగాలను భావం చెడకుండా ప్రచురించిన సందర్భాలలో కూడా రక్షణ వుండేది కాదు. పార్లమెంటులో సభ్యులు చేసిన ప్రసంగాలను ప్రచురించినందుకు కలకత్తా హైకోర్టులో పత్రికలపై 1951లో సురేష్ అనే అతను, 1956లో సతీష్ అనే అతను పరువునష్టం దావాలను వేశారు. ఆ కేసుల్లో తీర్పునిస్తూ హైకోర్టు సభ్యులకు రాజ్యాంగం కల్పించిన రక్షణలు వారికే పరిమితమని వారి ప్రసంగాలను ప్రచురించిన పత్రికలకు వర్తించదని స్పష్టం చేసింది. పత్రికల ఈ సంకటస్థితిని నివారించడానికి 1956లో ఫిరోజ్‌గాంధీ చొరవ తీసుకుని పార్లమెంటు కార్యకలాపాల (ప్రచురణకు రక్షణ) చట్టం అనే పేరిట పార్లమెంటులో ఒక చట్టాన్ని ఆమోదింపచేశారు. దాని ప్రకారం పార్లమెంటులో జరిగిన కార్యకలాపాలను ప్రచురించే పత్రికలకు ప్రసారంచేసే రేడియోకు సివిల్ క్రిమినల్ చర్యలకు గురికాకుండా రక్షణ లభించింది. అయితే ఆ ప్రచురణ పార్లమెంటు ఉభయ సభలలోని కార్యకలాపాలకు సంబంధించినదై వుండాలి. భావం చెడకుండా రాసినదై వుండాలి. ప్రజాహితం కోరి రాసినదై వుండాలి. దురుద్దేశంతో రాసినది కాకూడదు. అలాంటప్పుడు రక్షణ లభిస్తుంది. కాని ఈ రక్షణ రాష్ట్రాల శాసనసభ్యుల విషయంలో ఒక్క ఒరిస్సాలో తప్ప మరెక్కడా వుండేది కాదు.



BRAOU

1975లో అత్యవసర పరిస్థితి విధించినప్పుడు ప్రధాని ఇందిరాగాంధి పత్రికలపై ప్రి సెన్సార్‌షిప్ విధించారు. పార్లమెంటు వార్తలపై సెన్సార్‌షిప్ అమలు జరపడం సాధ్యం కాదని గ్రహించి ఈ చట్టాన్ని రద్దు చేశారు. 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చాక దీన్ని పునరుద్ధరించారు. అంతటితో ఆగక రాజ్యాంగంలోని 361(ఎ) అనే కొత్త అధికరణను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం పార్లమెంటు ఉభయ సభల కార్యకలాపాల ప్రచురణకే కాక రాష్ట్రాల శాసనసభల కార్యకలాపాల ప్రచురణకు కూడా అడిగే ప్రశ్నలు. ప్రవేశపెట్టే తీర్మానాలు, జరిపే చర్చలు, తీసుకునే నిర్ణయాలు అన్నీ దాని కిందకు వస్తాయి. సభ్యుల మధ్య అనధికారిక విషయాలపై జరిగే సంభాషణ అందులో భాగం కాదు.

## 30.13 ముఖ్య విషయాలను చర్చించుకుందాం

- ★ భారత రాజ్యాంగం పౌరులకు కొన్ని హక్కులను ఇచ్చింది ఈ హక్కుల్లో సమాచారాన్ని తెలుసుకునే హక్కు కూడా ఒకటి రాజ్యాంగంలోని 19వ అధికరణం ఈ హక్కులకు సంబంధించింది. అయితే ఈ హక్కులు శాశ్వతం కాదు. అత్యవసర పరిస్థితుల్లో ఈ హక్కులు రద్దుచేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది.
- ★ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం భారతదేశం ఏకకేంద్ర రాజ్యాల సమాఖ్య. రాష్ట్రాల శాసనసభలు, పార్లమెంటు శాసనాలు చేసినా వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుంది.
- ★ రాజ్యాంగం పౌరులకు కొన్ని హక్కులు, స్వాతంత్ర్యాలు ఇచ్చింది. శాసనాలవల్ల ఈ హక్కులకు, స్వాతంత్ర్యాలకు భంగం కలిగితే న్యాయస్థానాలకు నివేదించుకోవచ్చు.
- ★ భారత రాజ్యాంగానికి అధినేత రాష్ట్రపతి.
- ★ అన్ని హక్కులతో పాటు రాజ్యాంగం పౌరులకు భావ ప్రకటన, సమాచారం తెలుసుకునే హక్కును కూడా ఇచ్చింది.

## 30.14 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన స్వాతంత్ర్యాలేమిటి?
2. ఆదేశిక సూత్రాలకు, ప్రాథమికహక్కులకు మధ్య ఘర్షణ ఏర్పడితే పరిష్కారమేమిటి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులు మించకుండా సమాధానాలు రాయండి.

1. న్యాయ సమీక్ష అంటే ఏమిటి?
2. అవతారికను 'రాజ్యాంగపు అంతరాత్మ' అని ఎందుకు వర్ణించారు?

**- జి.ఎస్. వరదాచారి**

BRAOU

# భాగం - 31 : పత్రికా మండలి, పత్రికా శాసనాలు, పత్రికా స్వేచ్ఛ

## విషయక్రమం


31.0 ఉద్దేశం

31.1 ప్రవేశిక

31.2 పత్రికా మండలి

31.3 పత్రికా శాసనాలు

31.3.1 హిందూ వివాహాల చట్టం, బాలల చట్టం

31.3.2 యువజనుల (హానికరమైన) ప్రచురణ చట్టం

31.3.3 మందులు మహిమాన్విత చికిత్సల (అభ్యంతరకర ప్రచురణలు)చట్టం

31.3.4 పత్రికలు, పుస్తకాల రిజిస్ట్రేషన్ చట్టం

31.3.5 కాపీరైట్ చట్టం

31.3.6 కోర్టు ధిక్కార నేరం

31.3.7 సభా ధిక్కార నేరం

31.3.8 అధికార రహస్యాల చట్టం

31.3.9 పరువు నష్టం - మానహాని (అపవాద నింద)

31.4 పత్రికా స్వాతంత్ర్యం

31.4.1 స్వాతంత్ర్యం భావన

31.4.2 సహేతుక ఆంక్షలు

31.5 ముఖ్య విషయాలను గుర్తుంచుకుందాం

31.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు


## 31.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- పత్రికా మండలి
- పత్రికా శాసనాలు
- పత్రికా స్వాతంత్ర్యం గురించి తెలుసుకుంటారు

BRAOU

## 31.1 ప్రవేశిక

దేశంలో వేలాదిగా ఉన్న పత్రికలు ఒక నిర్దిష్ట నియమావళిని పాటించేలా పత్రికా మండలి చూస్తుంది. నిజానికి ఇవి పాటించాలి ఇవి పాటించరాదు అని చెప్పేందుకు రాతపూర్వక నియమావళి అనేది ఏదీ లేదు. పత్రికలు వేటికవి స్వయంగా నియమావళి రూపొందించుకుని పాటించాలనేది పత్రికా మండలి అభిప్రాయం. పత్రికలకు సంబంధించిన వివిధ శాసనాలు తెలుసుకోవడం అవసరం. పత్రికా స్వాతంత్ర్యం గురించి మనం అనేకసార్లు వింటుంటాం. అయితే పత్రికా స్వాతంత్ర్యం అని ప్రత్యేకంగా ఏదైనా వుందా? అసలు పత్రికా స్వాతంత్ర్యం అంటే ఏమిటి? మొదలైన విషయాల గురించి తెలుసుకుందాం.

## 31.2 పత్రికా మండలి

పత్రికా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికీ, పత్రికల, వార్తా సంస్థల ప్రమాణాలను మెరుగుపరచడానికీ పత్రికా మండలి (ప్రెస్‌కౌన్సిల్) ఏర్పాటైంది. మొదటి ప్రెస్ కమీషన్ ఇలాంటి సంస్థను ఏర్పాటు చేయాలని 1954లో సూచించింది. ఆ సూచన మేరకు 1965లో పార్లమెంటు ప్రెస్ కౌన్సిల్ చట్టం చేసింది. కాని అది సమగ్రంగా లేదని అత్యవసర పరిస్థితి రోజుల్లో దాన్ని రద్దుచేశారు. తర్వాత 1978లో ఇప్పుడున్న చట్టం తెచ్చారు. వృత్తి ప్రమాణాలను మెరుగుపరచడానికై పత్రికా రచయితలకు ప్రవర్తనా నియమావళిని రూపొందించాలని ఈ చట్టంలో ఉన్నప్పటికీ అలాంటి నియమావళిని పత్రికా రచయితల సంఘాలే స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని కౌన్సిల్ ఛైర్మన్లు అభిప్రాయపడ్డారు. ఈ కౌన్సిల్‌కు న్యాయమూర్తిగా పని చేసిన లేదా చేస్తున్న వ్యక్తి ఛైర్మన్‌గా ఉంటారు. దీనిలో 28మంది సభ్యులుంటారు. వీరిలో 13మంది వర్కింగ్ జర్నలిస్టులు వుంటారు. వారిలో ఆరుగురు ఎడిటర్లు, ఆరుగురు యాజమాన్యసంస్థల ప్రతినిధులు అంటే చిన్న మధ్య పెద్ద పత్రికల నుంచి ఇద్దరేసి చొప్పున ఉంటారు. వార్తా సంస్థల ప్రతినిధి ఒకరుంటారు. విద్యా, సాహిత్య, సాంస్కృతిక, శాస్త్ర, న్యాయ రంగాలకు చెందిన నిష్ణాతులు ముగ్గురుంటారు. పార్లమెంటు ఉభయసభల నుంచి ఐదుగురు సభ్యులుంటారు.

ఈ మండలి పత్రికల ఫిర్యాదులనూ పత్రికలపై ఇతరులు చేసే ఫిర్యాదులనూ కూడా పరిశీలించి తమ ఆదేశాలు జారీ చేస్తుంది. నిర్ధారణ అయినప్పుడు వారిని అభిశంసిస్తుంది. ప్రభుత్వాలు పత్రికలను లొంగదీయాలని చేసే యత్నాలను తగు ఆదేశాల ద్వారా నిరోధిస్తుంది. 13వ సెక్షన్ దీని విధులను కింది విధంగా నిర్వచిస్తుంది. 1. పత్రికలు, వార్తా సంస్థలు తమ స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడంలో తోడ్పడటం 2. ఉన్నత వృత్తి ప్రమాణాలకు అనుగుణమైన ప్రవర్తనా నియమావళిని రూపొందించడం 3. పత్రికా రచయితలలో ఉత్తమాభిరుచులను పెంపొందించేట్టు చేయడం 4. వార్తల ప్రాచుర్యాన్ని అరికట్టే చర్యలను గమనించి పరిష్కారం సూచించడం 5. పత్రికలకు విదేశాల నుంచి అందే డబ్బుపై నిఘావేసి వుంచడం 6. పత్రికా వ్యాపారంలోని వివిధ వర్గాల మధ్య సత్సంబంధాలు ఉండేట్టు చూడటం 7. పత్రికారంగంలోని గుత్త పోకడల నివారణకు యత్నించడం. మండలి వివిధ ఫిర్యాదులపై తన నిర్ణయాలను పత్రికలకు విడుదల చేస్తుంది. పత్రికలు వాటికి తగు ప్రచారం ఇవ్వాలని ఆశిస్తుంది.

BRAOU

## 31.3 పత్రికా శాసనాలు

పత్రికా శాసనాలు లేదా పత్రికా చట్టాలు అనగానే పత్రికలకు మాత్రమే ప్రత్యేకంగా వర్తించే శాసనాలు. లేదా చట్టాలు అనే భావన కలుగుతుంది. కానీ అది సరికాదు. పత్రికలకు పత్రికలలో పనిచేసే వారికి మాత్రమే వర్తించి, ఇతర పౌరులెవరికీ వర్తించని ప్రత్యేక చట్టాలు కొన్నివున్నా ప్రజలందరికీ వర్తిస్తూ పత్రికలకూ వర్తించే సాధారణ చట్టాలే అధికం. పత్రికా స్వాతంత్యం అనేది పౌరులందరికీ వున్న భావ ప్రకటనా స్వాతంత్ర్యంలో భాగం కనుకనే ఈ విధంగా ఉంది. ఇలాంటి చట్టాలు చిన్నవీ, పెద్దవీ దాదాపు మూడు పదుల వరకు వున్నాయి. వీటిలో కొన్ని పత్రికా నిర్వహణను క్రమబద్ధం చేయడానికి ఉద్దేశించినవైతే మరికొన్ని

విధి నిర్వహణలో జరిగే శాసనోల్లంఘనకు శిక్ష విధించడానికి ఉద్దేశించినవి. ఇలాంటి సాధారణ, ప్రత్యేక చట్టాలన్నింటినీ అధ్యయనం చేయడం అవసరం. ముందుగా ఈ చట్టాలలో ముఖ్యమైన వాటి పేర్లు తెలుసుకుందాం.

1. భారత శిక్షాస్మృతి 1860.
2. పత్రికలు, పుస్తకాలు, రిజిస్ట్రేషన్ చట్టం 1867.
3. సమాచార భారత పోస్టాఫీసు చట్టం 1898.
4. అధికార రహస్యాల చట్టం 1923.
5. మందులు, మహిమాన్విత చికిత్సల (అభ్యంతరకర ప్రకటనల) చట్టం 1954.
6. వర్కింగ్ జర్నలిస్టుల (ఉద్యోగ స్థితిగతులు ఇతర అంశాలు) చట్టం 1954.
7. హిందూ వివాహాల చట్టం 1951.
8. యువజనుల (హానికరమైన ప్రచురణల) చట్టం 1956.
9. కాపీరైట్ చట్టం 1957.
10. బాలల చట్టం 1960.
11. కోర్టు ధిక్కార చట్టం 1971.
12. ప్రెస్ కౌన్సిల్ చట్టం 1978.

పత్రికా శాసనాలలో కొన్నింటి గురించి ముఖ్యాంశాలే తెలుసుకున్న కొన్నిటి విషయంలో మాత్రం వివరంగా తెలుసుకోవడం తప్పనిసరి. కొన్ని శాసనాలను ఈభాగంలో, మరికొన్నిటిని ముందుభాగాలలో తెలుసుకుందాం.

ఉదాహరణకు పోస్టాఫీసు, టెలిగ్రాఫ్ చట్టాలు. వార్తా పత్రిక అనే పదబంధానికి నిర్వచనం చెప్పిన తొలి చట్టం పోస్టాఫీసు చట్టం. పోస్టు ద్వారా పంపే పత్రికలకు రాయితీ ఇవ్వడానికి పత్రికంటే ఏమిటో నిర్వచనం చెప్పాల్సి వచ్చింది. వార్తలుకాని, వార్తలపై వ్యాఖ్యలు కాని కలిగివుండి (అడ్వర్టయిజుమెంట్లతో బాటు లేదా అడ్వర్టయిజుమెంట్లు లేకుండా) ముద్రితమై నిర్ణీత కాల వ్యవధిననుసరించి వెలువడే పత్రాన్ని పత్రిక అని ఈ చట్టం పేర్కొంది. రాయితీ పొందాలంటే అలాంటి పత్రికకు నిర్ణీత సంఖ్యలో చందాదారులు కూడా వుండాలి. పత్రికలు, పుస్తకాల రిజిస్ట్రేషన్ చట్టంలోకూడా 'పత్రిక' అంటే ఏమిటో నిర్వచనం వుంది. అయితే 1869లో చట్టం అమలులోకి వచ్చినప్పుడు లేదు. 1922లో చేసిన సవరణ ద్వారా చేర్చారు. పోస్టాఫీసు చట్టం ప్రకారంగానీ, టెలిగ్రాఫ్ చట్టంప్రకారం గానీ అభ్యంతరకర సమాచారం పంపడానికి వీలు లేదు. అలాంటివి వచ్చినప్పుడు వాటిని జప్తుచేసే అధికారం ఆయా అధికారులకు వుంది.

### 31.3.1 హిందూ వివాహల చట్టం, బాలల చట్టం

వీటి గురించి పత్రికా రచయితలు తెలుసుకోవాలి. వివాహాల చట్టంలో 22వ సెక్షన్ ప్రకారం కోర్టులో విచారణకు వచ్చిన కేసులను కక్షిదారులకు ఏ ఒక్కరి కోరికపైనైనా రహస్యంగా జరపవచ్చు. అలాంటప్పుడు ఆ విచారణ తాలూకు వివరాలు తెలిసినా పత్రికలలో ప్రచురించడానికి వీలులేదు. అలా ప్రచురించినట్లయితే వెయ్యి రూపాయల జరిమానా శిక్షగా విధించవచ్చు. అలాగే బాలల చట్టం 36వ సెక్షన్ ప్రకారం బాల నేరస్తుల విచారణకు సంబంధించిన కేసులలో ఏ పత్రికా అలాంటి బాల నేరస్తుని పేరు, చిరునామా, అతడి పాఠశాల పేరు లేదా అతడిని గుర్తించడానికి దారితీసే ఇతర సమాచారం ఫోటో ప్రచురించకూడదు. ప్రచురించినట్లయితే వెయ్యి రూపాయల జరిమానా శిక్షగా విధించవచ్చు. అయితే అలాంటి ప్రచురణ ఆ బాలుడి ప్రయోజనాల దృష్టిలో మంచిదని భావించినప్పుడు విచారణాధికారి లిఖిత పూర్వకంగా కారణాలను వెల్లడిస్తూ ప్రచరణకు అనుమతి ఇవ్వవచ్చు.

BRAOU

### 31.3.2 యువజనుల (హానికరమైన) ప్రచురణల చట్టం

ఈచట్టం కింద యువజనులలో నేర ప్రవృత్తిని ప్రోత్సహించే ప్రచురణలను నిషేధించారు. యువజనులు అంటే 20 ఏళ్ళ లోపు వారని చట్టం నిర్వచించింది. హానికరమైన ప్రచురణలు అంటే నేరానికి హింసా చర్యలకు. అసభ్యకరమైన జుగుప్సాకరమైన ప్రవర్తనకు యువజనులను పురికొల్పే కథలు, బొమ్మల కథలు, ఇతర రచనలు కలిగిన పత్రికలు. కరపత్రాలు మేగజైన్లు, పుస్తకాలు అని వివరించడం జరిగింది. ఇవి అమ్మకానికి, అద్దెకు ఇవ్వడానికి, పంపిణీ చేయడానికి, బహిరంగ ప్రదర్శనకు ఉద్దేశించి ముద్రించిన వ్యక్తి ఇవి కలిగి వున్న వ్యక్తీ అవి ఎక్కడ దొరకుతాయో ప్రచార ప్రకటనలు జారీ చేసిన వ్యక్తీ శిక్షార్హులవుతారు. ఇలాంటి వారికి ఆరు నెలల జైలుశిక్ష లేక జరిమానా లేదా రెండూ విధించవచ్చు.

### 31.3.3 మందులు, మహిమాన్విత చికిత్సల (అభ్యంతరకర ప్రచురణలు) చట్టం

ఈ చట్టం కింద అభ్యంతరకరమైన ప్రకటనలు (అడ్వర్టయిజ్‌మెంట్లు) ప్రచురించడం శిక్షార్హం. మహిమాన్విత చికిత్సలు అంటే రోగాలను నయంచేస్తామనో, బలాన్ని కలిగిస్తామనో నమ్మించి అమ్మజూపిన తావీజులు, మంత్రాలు, కవచాలు మొదలైనవి. ఇలాంటి అడ్వర్టయిజ్‌మెంట్లు ఇచ్చిన వ్యక్తితో పాటు పత్రిక ముద్రణకర్త, ప్రచురణ కర్త కూడా నేరస్తులవుతారు. ఇలాంటి నేరానికి మొదటిసారైతే ఆరునెల జైలుశిక్ష లేదా జరిమానా, రెండూ లేదా అంతకుమించిన వారైతే ఏడాది జైలు లేదా జరిమానా రెండూ విధించడానికి వీలుంది.

### 31.3.4 పత్రికలు, పుస్తకాల రిజిస్ట్రేషన్ చట్టం

ఈ చట్టం దేశంలో అచ్చయిన ప్రతి పత్రికా, పుస్తకం ప్రతులను భద్రపరచడానికి వాటిని రిజిస్ట్రేషన్ చేయడానికి ఉద్దేశించినది. 1867లో మొదట అమలుపరచిన ఈ చట్టాన్ని 1955లో మొదటి ప్రెస్ కమిషన్ సిఫార్సుల ననుసరించి సవరించి ప్రెస్ రిజిస్ట్రార్ నియామకానికి వీలు కల్పించారు. ఈ ప్రెస్ రిజిస్ట్రార్ దేశంలో ప్రచురణవుతున్న పత్రికలన్నిటి వివరాలు గల రిజిస్టర్‌ను తయారుచేస్తారు. దీనిలో ప్రతి పత్రిక పేరు అది ఏ భాషకు చెందిందీ, ప్రచురణ కాల వ్యవధి సంపాదకుని పేరు. ముద్రాపకుని పేరు, ప్రచురణ కర్తపేరు, ప్రచురణ స్థలం, వారానికి వెలువడే పేజీల సగటు సంఖ్య, సంవత్సరంలో వెలువడే సంచికల సంఖ్య ముద్రించే ప్రతుల సగటు సంఖ్య, అమ్మకమయ్యే ప్రతుల సగటు సంఖ్య ఉచితంగా పంచే ప్రతుల సంఖ్య అమ్మకం ధర, యజమానుల పేర్లు ఇతర వివరాలు చేరుస్తారు. ఈ వివరాలు కలిగివున్న వార్షిక నివేదికలు ప్రచురిస్తారు. కొత్త పత్రికలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇస్తారు. పత్రికల ప్రచురణకర్తలు ప్రెస్ రిజిస్ట్రార్‌కు యేటేటా వివరాల నివేదికలు విధిగాపంపాలి. అలా పంపని వారికి లేదా తప్పుడు సమాచారం పంపినవారికి 500 రూపాయల వరకు జరిమానా విధించవచ్చు. కొత్తగా పత్రికను ప్రారంభించదలుచుకున్న వ్యక్తి తమ ప్రాంతపు జిల్లా మేజిస్ట్రేట్ ముందు డిక్లరేషన్ దాఖలు చేయాలని ఈ చట్టంలోని 5వ సెక్షన్‌నిర్దేశిస్తున్నది. ఆ డిక్లరేషన్‌లో పత్రిక పేరు, భాష, సంపాదకుని పేరు. ముద్రాపకుని పేరు, ప్రచురణకర్త పేరు, కాల వ్యవధి ముద్రణ ప్రచురణ స్థలం తదితర వివరాలు పేర్కొనాలి. మేజిస్ట్రేట్ దానిని ప్రెస్ రిజిస్ట్రార్‌కు పంపుతారు. ఆయనఅదేపేరుగల పత్రిక మరొకటి అదేభాషలో లేదని చూసుకుని 19(సి) సెక్షన్ కింద రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. సర్టిఫికెట్ లభించిన తేదీ నుంచి వారపత్రిక లేదా అంతకు తక్కువ కాల వ్యవధికల పత్రిక అయితే ఆరు వారాలలోగా, వారానికి మించిన కాల వ్యవధితో ప్రచురితమయ్యే పత్రిక అయితే మూడు నెలలులోగా ప్రచురణ ప్రారంభించవలసి వుంటుంది. లేని పక్షంలో సర్టిఫికేట్‌కు కాలదోషం పడుతుంది. పత్రిక సంపాదకుడు, ముద్రాపకుడు. ప్రచురణ కర్త, మారినట్టయితే 24 గంటలలోగా సంబంధిత మేజిస్ట్రేట్‌కు ఆ మార్పు గురించి తెలియజేయాలి. ఏదేని పత్రికను ఈ చట్టనిబంధనలను ఉల్లంఘించి ప్రచురిస్తున్నారని తెలిసినప్పుడు ప్రెస్ రిజిస్ట్రార్ దరఖాస్తు చేయగా సంబంధిత మేజేస్టేట్ తగు నోటీసు ఇచ్చి విచారణ జరిపిన తర్వాత అవసరమనుకుంటే డిక్లరేషన్‌ను రద్దు చేయవచ్చు. అంతేకాదు నియమాలను ఉల్లంఘించి పత్రికకు సంపాదకత్వం వహించిన లేదా ముద్రించిన లేదా ప్రచురించిన వ్యక్తికి మేజిస్ట్రేట్ ముందు నేరం రుజువైనట్టయితే రెండు వేలకు మించకుండా జరిమానా లేదా ఆరునెలల వరకు జైలు శిక్ష లేదా రెండూ విధించవచ్చు.

BRAOU

అచ్చయిన ప్రతీ పత్రిక ప్రతులు రెండేసి ప్రెస్ రిజిస్ట్రార్‌కు ఉచితంగా పంపాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది. అలా పంపకపోవడం తప్పవుతుంది. అలాంటి తప్పు జరిగినప్పుడల్లా 50 రూపాయల చొప్పున జరిమానా చెల్లించవలసి రావచ్చు.

ఈ చట్టం పత్రికల ప్రచురణను క్రమబద్ధం చేయడానికి ఉద్దేశించిందే తప్ప వాటిని అదుపు చేయడానికి ఉద్దేశించింది కాదు. గనుక ఇది రాజ్యాంగ సమ్మతమైందని కోర్టులు తీర్పులు చెప్పాయి.

### 31.3.5 కాపీరైట్ చట్టం

1955 సంవత్సరపు కాపీరైట్ చట్టం ఇతరులతో పాటు పత్రికా రచయితలకు కూడా వర్తిస్తుంది. కాపీరైట్ వెనుక ఉన్న సిద్ధాంతమేమిటంటే ఒక వ్యక్తి తన శ్రమ, తెలివితేటలు, నేర్పరితనం ఉపయోగించి ఏదైనా రచననో, చిత్రాన్నో, ఇతర కళారూపాన్నో రూపొందిస్తే అది అతని ఆస్తి అవుతుంది. అలాంటి ఉత్పత్తి మౌలికమైన సృజనాత్మక రూపమైనట్టిదయితే దానిపై అతనికి చట్టబద్ధమైన హక్కు ఏర్పడుతుంది. ఏవరైనా ఆ రచనను, కళారూపాన్ని అనుకరించి అనువదించి లేదా ఇతర విధాల సంగ్రహిస్తే అది నేరమవుతుంది. ఒక పత్రికా రచయిత తన విధులు నిర్వర్తిస్తున్నప్పుడు ఈ నేరానికి పాల్పడే అవకాశం ఉంటుంది.

ఈ చట్టంలోని మూడవ సెక్షన్ ఆలోచనలకు, సమాచారానికి, వార్తలకు కాపీరైట్ హక్కు ఉండదనీ స్పష్టం చేస్తోంది. ఏదేని ఆలోచనను సమాచారాన్ని తీసకుని సృష్టించిన సాహితీ కళరూపకానికి కాపీరైట్ ఉంటుంది. సంగీత కళారూపాలకు కూడా వుంటుంది. కాపీరైట్ ప్రచురిత రచనలతో పాటు అముద్రిత రచనలకు కూడా వుంటుంది. సెక్షన్ 45 ఈ హక్కు రిజిస్ట్రేషన్‌కు వీలుకల్పిస్తున్నది. కాని రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని విధించడం లేదు. కనుక రిజిస్టర్ చేసుకోనంత మాత్రాన ఈ హక్కు లేకుండా పోదు. సెక్షన్ 6 ఈ సందర్భంగా ఉత్పన్నమయ్యే కొన్ని వివాదాలను కాపీరైట్ బోర్డు పరిష్కరిస్తుందని ప్రకటిస్తున్నది. కానీ కాపీరైట్ హక్కుకు భంగం వాటిల్లినప్పుడు ఆ హక్కుదారు సెక్షన్ 55 కింద ఉల్లంఘనను నివారించడానికి, నష్టపరిహారం రాబట్టడానికి కోర్టులో సివిల్ దావా వేయవచ్చు. ఆ ఉల్లంఘన వల్ల హక్కుదారుకు ఎంత మేర నష్టం కలిగిందో అంచనా వేసి కోర్టు నష్టపరిహారం పరిమాణాన్ని నిర్ణయిస్తుంది.

పత్రికా రచయితలు 51, 52 సెక్షన్లను బాగా అధ్యయనం చేయాలి. 51వ సెక్షన్ ఏది కాపీరైట్ ఉల్లంఘనో వివరంగా తెలుపుతోంది. 52వ సెక్షన్ ఏది కాపీరైట్ ఉల్లంఘన కాదో తెలుపుతుంది. రచయిత అనుమతి లేకుండా ఏ వ్యక్తి అయినా ఆయన రచనను పునర్ముద్రించి సొమ్ము చేసుకోవడం కాపీరైట్ ఉల్లంఘన అవుతుంది. ఆ రచనను నాటకంగా మార్చి లేదా సినిమాగా తీసి సొమ్ము చేసుకోవడం కూడా నేరమవుతుంది. అయితే ఆ రచనలోని ఇతివృత్తం సినిమా ఇతివృత్తం ఒకటే అయినంత మాత్రాన అది దాని అనుకరణ అనడానికి వీలులేదు. యాదృచ్ఛికమైన పోలికలు వుండటం కాక, ఇది దాని నకలే అని రెండూ చూసిన పాఠకునికి లేదా ప్రేక్షకునికి గట్టి అభిప్రాయం కలిగేటట్టు వుంటేనే అది ఉల్లంఘన కిందికి వస్తుంది.

ఒక సాహితీ లేదా కళారూపాన్ని పరిశోధన కోసం, లేదా వ్యక్తిగత అధ్యయనం కోసం వాడుకోవడం లేదా సమకాలీన సంఘటనల గురించిన వార్తా రచన కోసం వాడుకోవడం, కోర్టు విచారణలకు సంబంధించిన వార్తలు రాయడంలో వాడుకోవడం లేదా సమీక్షకోసం వాడుకోవడం, లేదా పత్రికలలో సమకాలిన ఆర్థిక రాజకీయ మత సంబంధమైన అంశాలపై రాసే వ్యాసాలలో తగుమాత్రం భాగాన్ని వాడుకోవడం లేదా బహిరంగసభలో వక్త ఇచ్చిన ఉపన్యాసాన్ని వార్తగా రాసేటప్పుడు వాడుకోవడం నేరం కాదు. శాసనసభ చర్చలలో కోర్టు విచారణలలో ఉల్లేఖనలు కూడా కాపీరైట్ ఉల్లంఘన కిందకు రావు.

సెక్షన్ 52లో తగుమాత్రం, అనే మాటకు చాలా ప్రాముఖ్యం వుంది. ఉదహరించడం, ఉటంకించడం పేరుతో ఒక రచనను పూర్తిగా పునర్ముద్రించి మూల ప్రచురణ గిరాకీ తగ్గిపోయేటుల చేయడం అంగీకరాయోగ్యం కాదు. తగుమాత్రం అంటే ఎంత అనేది సందర్భాన్ని బట్టి ఉంటుంది. దాన్ని కోర్టు నిర్ధారిస్తుంది.

ఒక పత్రికా రచయిత తాను ఉద్యోగంలో వున్నప్పుడు విధులలో భాగంగా చేసిన రచనలన్నింటిపై కాపీరైట్ హక్కు మరో విధంగా ఒప్పందం కుదుర్చుకుంటే తప్ప పత్రికా యజమానికే చెందుతుంది. పత్రికలో ప్రచురణ నిమిత్తం రచయితలు పంపే రచనలపై ప్రథమ ప్రచురణ హక్కు మాత్రమే పత్రికకు చెందుతుంది.

BRAOU

63వ సెక్షన్ కాపీరైట్ హక్కును తెలిసే బుద్ధి పూర్వకంగా అతిక్రమించిన వారికి ఏడాది వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించడానికి వీలు కల్పిస్తుంది. ఇది బాధితుడు వేసుకునే సివిల్ దావా కాక అయన తీసుకునే క్రిమినల్ చర్య.

### 31.3.6 కోర్టు ధిక్కార నేరం

రాజ్యాంగంలోని 12వ అధికరణ సుప్రీంకోర్టును, 215వ అధికరణ హైకోర్టులను రికార్డుల కోర్టులుగా పేర్కొంది. అంతేగాక వాటికి తమను ధిక్కరించిన వారిని విచారించి శిక్షించే అధికారం కూడా ఇచ్చింది. అయితే ఇందుకు సంబంధించిన విధి విదానాన్ని నిర్దేశించలేదు. అంతకుముందు 1926లో చేసిన కోర్టు ధిక్కార చట్టం విచారణా పద్ధతులను నిర్దేశించింది. దాని ప్రకారం హైకోర్టుకు తనను, తన ఆధీనంలోని న్యాయస్థానాలను ధిక్కరించిన వారిని విచారించి, శిక్షించే హక్కు ఉండేది. రాజ్యాంగంలో 225 అధికరణం ప్రకారం అ హక్కు రక్షింపబడింది. 1971లో పార్లమెంటు కోర్టు ధిక్కార నేరాన్ని నిర్వచించి, దాని పరిధిని పరిమితం చేయడంతో పాటు విచారణ విధానాన్ని నిర్దేశించడానికి ఒక చట్టం చేసింది, ఈ చట్టం ప్రకారం కోర్టు ధిక్కార నేరం సివిల్ నేరం, క్రిమినల్ నేరమూ రెండూ కావచ్చు. స్థూలంగా చెప్పాలంటే కోర్టు ఆదేశాలను, డిక్రీలను ఉత్తర్వులను పాటించకపోవడం లేదా కోర్టుకు ఇచ్చిన మాటను ఉల్లంఘించడం సివిల్ నేరం కిందికి వస్తుంది.

పత్రికలు చేసే ధిక్కరణ క్రిమినల్ నేరం కిందికి వస్తుంది. ఏదేని కోర్టును కించపరిచే లేదా అ ధోరణిలో గల రాతలు లేదా దృశ్య సంకేతాలు (అంటే కార్టూన్లు, స్కెచ్‌లు) కోర్టు పనిపై అపనమ్మకం కలిగించే లేదా దానికి అవరోధం కల్పించే లేదా అందుకు దారితీసే విధంగా వున్న ప్రచురణలు, న్యాయపాలనకు ఏదో విధంగా ఆటంకం, ప్రతిబంధకం కలిగించే లేదా అందుకు దారితీసే విధంగా వున్న ప్రచురణలు క్రిమినల్ నేరం కిందికి వస్తాయి.

సెక్షన్ మూడు అమాయక ప్రచురణలు కోర్టు ధిక్కార నేరం కిందికి రావని ప్రకటిస్తున్నది. అంటే కోర్టులో ఏదో వ్యవహారం విచారణలో వుందని తెలియక దానిపై వ్యాసం రాశామనుకోండి. అది నేరం కాదు. అయితే ఇందులో చిత్తశుద్ధి ముఖ్యం. సెక్షన్ నాలుగు కోర్టులలో జరిగే విచారణల గురించి భావం చెడకుండా వార్తలు ప్రచురించడం నేరం కాదని ప్రకటిస్తున్నది. సెక్షన్ అయిదు విచారణ పూర్తయి తీర్పు చెప్పిన కేసులో గుణదోష విచారణ జరపడం సద్విమర్శ చేయడం నేరం కాదని ప్రకటిస్తున్నది. కేసుల గురించిన వార్తల ప్రచురణ, తీర్పులపై సద్విమర్శ అనేది సవ్యమైన న్యాయపాలన లభించాలన్న ప్రజా ప్రయోజనానికి తోడ్పడతాయి. కనుక ఏదేని కోర్టు చర్యను చట్టానికి అనుగుణంగా లేదని కాని, ప్రజా శ్రేయస్సుకు దోహదకరంగా లేదని కాని సహేతుకంగా వాదించినట్టయితే దాన్ని కోర్టులు ధిక్కారంగా భావించవు. సద్విమర్శ అనేది సరియైన న్యాయపాలనకు, ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛకూ మధ్య వారధి లాంటిది. అయితే ఏది సద్విమర్శ అనేది తేల్చడానికి సందర్భ శుద్ధినీ, వాడిన భాషనూ ఎవరిని దృష్టిలో ఉంచుకుని రాశారన్న విషయాన్ని న్యాయస్థానాలపట్ల కక్షిదారులకు, సమాజానికి ఆ రాత ఎలాంటి భావాన్ని కలిగిస్తుందన్న విషయాన్ని పరిశీలించడం జరుగుతుంది. ఒక తీర్పు చట్టానికి గాని, కేసులో వచ్చిన సాక్ష్యాలకు గాని అనుగుణంగా లేదనడం నేరం కాదు. లేదా ఆ కేసులో విధించిన శిక్ష గతంలో ఇలాంటి కేసుల్లో విధించిన శిక్షలకు పోలిక లేకుండా వున్నదనడం నేరం కాదు. అయితే న్యాయమూర్తులకు దురుద్దేశాలను ఆసమర్థతను అంటగట్టడం సద్విమర్శ కాజాలదు.

సెక్షన్ ఏడు రహస్య విచారణల, వార్తల ప్రచురణను భావం చెడకుండా రాసినా కోర్టు ధిక్కార నేరంగా పరిగణిస్తుంది. ఎందుకంటే మన దేశంలో కోర్టులు కొన్ని ప్రత్యేక సందర్భాలలో తప్ప బహిరంగ విచారణే జరుపుతాయి. విడాకుల కేసులు, బాల నేరస్తుల కేసులు, అధికార రహస్యాల చట్టం కింద నేరాలు, ఇలా ఆయా చట్టాలు అనుమతించిన సందర్భాలలోనే రహస్య విచారణ జరుపుతాయి. కనుక ఆ కేసుల విచారణ వివరాలనూ, మరేదైన విషయాలలో కోర్టు ఏదైనా విచారణ రహస్యంగా జరుపుతామనీ, దాని వివరాలు రాయకూడదని ప్రత్యేకంగా ఆదేశించిన సందర్భాలలో ఆ వివరాలను ప్రచురించడం నేరమవుతుంది.

సెక్షన్ 12 కోర్టు ధిక్కార నేరానికి శిక్షేమిటో నిర్దేశిస్తున్నది. ఈ చట్టంలో ఇతరత్రా నిర్దేశించిన సందర్భాలలో లేదా మరో

BRAOU

చట్టంలో నిర్దేశించిన సందర్భాలలో తప్ప కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారికి ఆరు నెలల వరకు సాధారణ ఖైదు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు. కోర్టును తృప్తిపరచే విధంగా క్షమాపణలు చెప్పుకొన్న సందర్భాలలో శిక్ష తగ్గవచ్చు. దీనికి ఒక వివరణ కూడా సెక్షన్‌లో చేర్చారు. దాని ప్రకారం చిత్తశుద్ధితో చెప్పుకున్న క్షమాపణలు నిర్నిబంధంగా లేవన్న షరతులతో కూడి ఉన్నవని చెప్పి కోర్టు తిరస్కరించడానికి వీలులేదు. సాధారణంగా కోర్టులు క్షమాపణలను అంగీకరించి క్షమిస్తున్నాయి. కోర్టు ధిక్కార నేరాలపై కోర్టులు ఎవరేని పౌరుని ఫిర్యాదుపై కాని అడ్వకేట్ జనరల్ ఫిర్యాదుపైనకాని లేదా తమంతట తాము కాని విచారణ చేపట్టవచ్చు. అయితే నేరం జరిగిన ఏడాదిలోగా విచారణ చేపట్టకపోతే కాలదోషం పడుతుంది. శిక్షకు పాత్రుడైన వ్యక్తికి అప్పీలు చేసుకోవడానికి హక్కు వుంటుంది.

### 31.3.7 సభా ధిక్కార నేరం

కోర్టు ధిక్కార నేరం మాదిరిదే సభా ధిక్కార నేరం. కోర్టులకు మాదిరిగానే పార్లమెంటుకు, శాసనసభలకు కూడా వాటిని అవమానానికి, అప్రతిష్ఠకు గురిచేసిన వారిని, వాటి పనికి అవరోధం కల్పించిన వారిని శిక్షించే హక్కు రాజ్యాంగం ప్రసాదించింది. రాజ్యాంగంలోని 105(3) అధికరణలో పార్లమెంటుకు 194(3) అధికరణ రాష్ట్రాల శాసనసభ్యులకు కొన్ని విశేషాధికారాలనూ, హక్కులనూ మినహాయింపులనూ దత్తం చేశాయి. అయితే వాటిని సభలే నిర్వచించుకోవాలని పేర్కొంది. అంతదాకా రాజ్యాంగం అమలులోకి వచ్చిననాడు బ్రిటిష్ కామన్స్ సభకు ఉన్న హక్కులు, అధికారాలు వీరికి వుంటాయని పేర్కొంది.

పత్రికా రచయితలకు సంబంధించినంత వరకు వార్తలు, వ్యాఖ్యల ప్రచురణ ద్వారానే వారు సభాధిక్కార నేరానికి గురయ్యే అవకాశం ఉంటుంది. సభాధిక్కారం అనేది విస్తృతార్థం కలమాట. అందుకే సభా హక్కులు, విశేషాధికారాలేమిటో నిర్వచించాలనీ. అలా చేసినట్టయితే ధిక్కారానికి ఆస్కారం వుండదని పత్రికా రచయితలు కోరుతున్నారు. వారి సంఘాలు పదేపదే కోరుతున్నాయి. పత్రికా చట్టాల విచారణ సంఘం కూడా ఈ వాదాన్ని సమర్థించింది. ఇటీవల ప్రెస్ కౌన్సిల్ కూడా కోరింది. అటు పార్లమెంటు కాని, ఇటు శాసనసభలు కానీ ఇంతవరకూ ఏ చట్టం చేయలేదు. ఒక అనిశ్చిత స్థితి వుంది. గడిచిన నాలుగు దశాబ్దాలపై చిలుకు కాలంలో ఎదురైన అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని పత్రికా రచయితలు తీసుకోవలసిన జాగ్రత్తలేమిటో గుర్తించడం జరిగింది. అవి

1) సభను లేదా దాని కమిటీలను కించపరిచే రాతలు రాయరాదు.
2) సభా కార్యకలాపాలకు సంబంధించినంతవరకు సభ్యుల శీలాన్ని, ప్రవర్తనను శంకించే రాతలు రాయరాదు.
3) సభ్యులు సభలో నిర్వహించవలసిన బాధ్యతలను బెదిరింపుల ద్వారా ప్రభావితం చేయగల రాతలు రాయరాదు.
4) సభా కార్యకలాపాల గురించి తప్పుడు వార్తలు ప్రచురించరాదు.
5) ఎవరేని సభ్యుణ్ణి ఉద్దేశపూర్వకంగా అణచివేయరాదు.
6) రికార్డులలో నుంచి తొలగించిన అంశాలను ప్రచురించరాదు.
7) ప్రశ్నలు అడగకముందు, కమిటీలు నివేదికలను సభకు సమర్పించక ముందు వాటి వివరాలు ప్రచురించరాదు.
8) విచారణకు పిలిస్తే రావడానికి నిరాకరించరాదు.
9) సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించరాదు. ఎవరేని పత్రికా రచయిత సభా ధిక్కార నేరానికి పాల్పడ్డాడని భావించినప్పుడు ఆ అంశాన్ని విచారణ నిమిత్తం సభా హక్కుల సంఘానికి సమర్పిస్తారు. ఆ సంఘం విచారణ జరిపి నేర నిర్ధారణ చేస్తుంది. పత్రికా రచయిత తన వాదాన్ని వినిపించవచ్చు. లేదా క్షమాపణలు చెప్పుకోవచ్చు. బేషరతు క్షమాపణలను సాధారణంగా అంగీకరించి క్షమిస్తారు. నేరం శిక్షార్హమైందని భావిస్తే నాలుగు రకాల శిక్షలు విధించవచ్చు.

అవి 1) వెలి 2) మందలింపు 3) అభిశంసన 4) జైలుశిక్ష

BRAOU

ఏ పత్రికా రచయితనైనా సభా కార్యకలాపాల వార్తలు రాయడానికి అనుమతించడం, అనుమతించకపోవడం స్పీకర్ ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. అందుచేత ఏ పత్రికా రచయితనైనా సభా ధిక్కారానికి పాల్పడ్డాడనుకున్నప్పుడు స్పీకర్ అతనికి ఇచ్చిన అనుమతి పత్రాన్ని రద్దు చేయవచ్చు. ఇక మందలింపు, అభిశంసన దాదాపు రెండూ ఒకటే. దానిలో నిందితుని రప్పించే విధానంలో తేడా వుంది. ఒక దానిలో నిందితుడిని సభ ముందుకు రప్పించి మందలిస్తారు. నేరం కొంచెం తీవ్రమనుకుంటె పట్టి తెప్పించి అభిశంసిస్తారు. నేరం ఇంకా తీవ్రమైందనుకుంటే జైలు శిక్ష కూడా విధించవచ్చు. తమిళనాడులో ఈ మధ్య ఒక పత్రికా సంపాదకుడిని జైలుకు పంపిన దృష్టాంతముంది.

### 31.3.8 అధికార రహస్యాల చట్టం

1923లో అమలులోకి వచ్చిన ఈ చట్టం భారతీయులకు అంటే విదేశాల్లో వుండే భారత పౌరులు, ప్రభుత్వోద్యోగులతో సహా అందరికీ వర్తిస్తుంది. ఈ చట్టంలో అయిదవ సెక్షన్ కీలకమైంది. దీని ప్రకారం రహస్య అధికార సమాచారం, నోట్, ఆర్టికల్, స్కెచ్, ప్లాన్, కోడ్, మాడల్, నిషేధిత ప్రాంతం ఫొటో మొదలైన వాటిని సంపాదించడం నేరం అవుతుంది. ఇలాంటి ప్రచురణ దేశ సార్వభౌమత్వానికీ, సమగ్రతకూ, భద్రతకు, విదేశాలతో స్నేహ సంబంధాలకు భంగం కలిగించే అవకాశముంటుందని భావన. సామాన్యంగా ప్రభుత్వ కార్యాలయాలలో అవసరమున్నా, లేకపోయినా ఎక్కువ పత్రాల మీద 'రహస్యం' అని రాస్తుంటారు. ఏది రహస్యమో, ఏది అధికార రహస్యమో ఎక్కడా నిర్వచించలేదు. అలా ఎవరో ఉద్యోగి రాసిన ప్రతి పత్రాన్ని రహస్యంగా భావించి దాని ప్రచురించని పత్రికలను ప్రాసిక్యూట్ చేసే ప్రమాదం లేకుండా దేశ భద్రతకు రక్షణకు విఘాతం కలిగించే వెల్లడింపులకు మాత్రమే ఈ చట్టాన్ని పరిమితం చేయాలని పత్రికా రచయితల సంఘాలు కోరుతూ వచ్చాయి. అయితే ఈ చట్టం కింద ఇటీవలి కాలంలో పత్రికలపై కేసులు పెట్టడం జరగలేదన్న యదార్థాన్ని దృష్టిలో ఉంచుకుని దీన్ని సవరించడం అంత అవశ్యం కాదని వాదించేవారూ ఉన్నారు. అమెరికాలో ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని తెలుసుకునే హక్కు కల్పిస్తూ ఒక చట్టం వుంది. అలాంటిది మన దేశంలో లేదు. అధికార రహస్యాల చట్టంలోని అయిదవ సెక్షన్‌ను తీసి సమగ్రమైన సమాచార హక్కు చట్టాన్ని తేవాలని రెండవ ప్రెస్ కమిషన్ సూచించింది.

### 31.3.9 పరువు నష్టం - మానహాని (అపవాద నింద)

ఒక వ్యక్తి పరువును చట్టం ఆస్తిగా పరిగణిస్తుంది. దానికి ఏ విధమైన హాని కలిగించినా అది నేరమవుతుంది. మానహానిని కౌటిల్యుడు కూడా నేరంగా పరిగణించి దానికి దండన నిర్దేశించాడు. ఇప్పుడు మన దేశంలో ఇందుకు సంబంధించి అమలులో వున్న చట్టం భారత శిక్షాస్మృతిలోని కొన్ని సెక్షన్‌లు మాత్రమే. దీనికి ప్రత్యేకమైన చట్టం లేదు. శిక్షాస్మృతిలోని 499 నుంచి 502 వరకు ఉన్న సెక్షన్లు ఇందుకు సంబంధించినవి. అయినా ఇవే ఒక ప్రత్యేక శాసనమంత సమగ్రంగా వున్నాయి.

పవురు నష్టం లేదా మానహాని సివిల్ క్రిమినల్ రెండు రకాల నేరమూ కావచ్చు. క్రిమినల్ నేరానికి సంబంధించిన శిక్షాస్మృతిపైన ఉదహరించినది. సివిల్ శాసనం మన దేశంలో క్రోడీకరించలేదు. కనుక ఇందుకు సంబంధించిన సివిల్ దావాలలో బ్రిటిష్ సంప్రదాయాలను అనుసరించి పరిష్కారం చెబుతున్నారు.

క్రిమినల్ చట్టాన్ని గురించి తెలుసుకుందాం. శిక్షాస్మృతిలోని 499వ సెక్షన్ ఏ వ్యక్తి అయినా మరో వ్యక్తిపై మౌఖికంగా కాని, చదవడానికి ఉద్దేశించిన రాతల ద్వారా కాని లేదా దృశ్య సంకేతాల ద్వారా కాని అతనికి హాని కలిగించే ఉద్దేశంతో లేదా హాని కలిగిస్తుందని నమ్మడానికి వీలైన అపాదన ఏదైనా చేసినట్టయితే కొన్ని మినహాయింపులకు లోబడి పరువు నష్టం కలిగించిన వాడవుతాడని పేర్కొంటున్నది. సెక్షన్‌లో 10 మినహాయింపులకు చెందిన నాలుగు వివరణలు ఉన్నాయి. వాటి గురించి పరిశీలించే ముందు పరువు నష్టం కలిగించే మాటల రాతల లక్షణాలు తెలుసుకుందాం. వీటిలో ఒక వ్యక్తికి పరువునష్టం కలిగించగల ఆపాదన వుండాలి. అది ఒక వ్యక్తిని ఉద్దేశించినదై వుండాలి. అది మౌఖిక, లిఖిత లేదా బొమ్మల రూపంలో ఎలాగైనా వుండవచ్చు. అది ప్రచురణ అయి వుండాలి. ఇక సెక్షన్‌లోని వివరణల గురించి తెలుసుకుందాం. మొదటి వివరణ ప్రకారంచనిపోయిన వ్యక్తిపై చేసే అపాదన కూడా ఆయన బతికి వున్నప్పుడు అదే ఆరోపణ చేస్తే పరువునష్టం కిందకివచ్చేదిగా

BRAOU

ఉండి, అలాంటి ఆపాదనను ఆయన కుటుంబ సభ్యులకో లేదా దగ్గరి బంధువులకో మనస్తాపం కలిగించే ఉద్దేశంతో చేసినదైనట్టయితే నేరమవుతుంది. రెండవ వివరణ ప్రకారం ఏదేని కంపెనీ లేదా సంఘం లేదా వ్యక్తుల సమూహంపై చేసిన ఆపాదన కూడా నేరమవుతుంది. మూడో వివరణ ప్రకారం అన్యోపదేశంగా లోకోక్తిగా చేసిన ఆపాదన కూడా నేరమవుతుంది. నాలుగవ వివరణ ప్రకారం ఏ ఆపాదన అయినా ప్రత్యక్షంగాగాని, పరోక్షంగా గాని ఆపాదనకు సరైన వ్యక్తిని సాటివారి దృష్టిలో హీనపరిచేదిగా ఉంటే అతనిపట్ల జుగుప్సకలిగించేదిగా వుంటే నేరమవుతుంది.

ఇక మినహాయింపుల గురించి తెలుసుకుందాం.

1. శ్రేయస్సు దృష్ట్యా ఎవరైనా వ్యక్తిపైన ఆపాదన చేయవలసిన లేదా ప్రచురించవలసిన అవసరం ఉన్నప్పుడు అలాంటి అరోపణ చేయడం పరువునష్టం కలిగించడం కిందికి రాదు.
2. ఒక ప్రజా సేవకుని శీలంపై ఆయన అధికార విధి నిర్వహణతో సంబంధమున్నంతవరకు ఏదైనా ఆపాదన సదుద్దేశంతో చేసినట్టయితే అది పరువునష్టం కలిగించడం కిందికి రాదు.
3. ఏదేని వ్యక్తి శీలంపై ఏదైనా ప్రజా సమస్యకు సబంధించి సదుద్దేశంతో ఏదైనా ఆరోపణ చేసినట్టయితే అది పరువు నష్టం కిందికి రాదు.
4. ఏదైనా కోర్టులో విచారణ వివరాలను భావం చెడకుండా ప్రకటించడం నేరం కాదు.
5. ఏదేని కోర్టులోవిచారణలో వున్న సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి ఎవరేని వ్యక్తి లేదా కక్షిదారు లేదా సాక్షి లేదా ఏజెంట్ ప్రవర్తనపై ఆ కేసుకు సబంధించినంతవరకు సదుద్దేశంతో ఏదైనా అభిప్రాయం ప్రకటించినట్టయితే అది పరువునష్టం కిందకు రాదు.
6. ఎవరైనా రచయిత ఏదైనా రచనా రూపాన్ని ప్రజల ముందు వుంచినప్పుడు దాని గుణదోషాల గురించి, ఆ రూపకానికి సంబంధించి రచయిత శీలాన్ని గురించి సదుద్దేశంతో ఏదైనా అభిప్రాయాన్ని ప్రకటించినట్టయితే అది పరువునష్టం కలిగించడం కిందకు రాదు.
7. ఏవరైనా అధికారి తన కింది అధికారిని ఆయన విధుల నిర్వహణకు సబంధించినంతవరకు సదుద్దేశంతో అభిశంసించినట్టయితే అది నేరం కాదు.

పత్రికా రచయితలు వృత్తిలో భాగంగా చేసే ఆపాదనలన్నీ లిఖితపూర్వకంగా వుంటాయని వేరే చెప్పనక్కరలేదు. అది ప్రచురణ అవుతుంది. అప్పుడు దానివల్ల బాధితుడైన వ్యక్తి ఆపాదన తన గురించేననీ అది పరువునష్టం కలిగించేదిగా వుందని, అది అబద్ధమనీ అంటూ పత్రికా రచయితపైన, సంపాదకునిపైన ప్రచురణ కర్తపైన కేసు పెడతాడు. అప్పుడు నిందతులు అది అబద్ధంకాదనీ, అంతేకాక మినహాయింపులలో ఏదోఒకదాని కిందికి వస్తుందని రుజువు చేయవలసి వుంటుంది. ఈ మినహాయింపులలో ఎనిమిదింటిలో 'సదుద్దేశం' అనే పదం వుంది. కొన్నిటిలో ప్రజాశ్రేయస్సు అనే మాటలున్నాయి. అంటే పత్రికా రచయితలు పరువునష్టానికి దారితీసే ఆపాదనలు ప్రచురించే ముందు అవి యదార్థమైనవని సరిచూసుకోవడమేగాక ప్రజాశ్రేయస్సుకు తోడ్పడతాయనే నమ్మకం కూడా కుదర్చుకోవాలి. నిర్లక్ష్యంగా ఎవరినో సాధిద్దామన్న దృష్టితో ఏమీ రాయకూడదు. సదుద్దేశంతోరాయాలి. కళాకృతులను సమీక్షించేటప్పుడు సద్విమర్శ మాత్రమే చేయాలి.

శిక్షాస్మృతిలో 500 సెక్షన్ ప్రకారం పరువునష్టం నేరానికి పాల్పడినవారికి రెండేళ్ళ వరకు జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించవచ్చు. బాధితులు సామాన్య శాసనాల కింద సివిల్ దావాకూడా వేయవచ్చు. పత్రికా రచయిత, సంపాదకుడు, ప్రచురణకర్త, ముద్రాపకుడు, పత్రికా యజమాని వీళ్ళందరిపై కలిసిగాని, విడివిడిగా కాని, ఏ ఒక్కరిపైన గాని బాధితుడు దావా వేయవచ్చు. సివిల్ దావాలో ఆపాదన అబద్ధం కాదు యదార్థం అని రుజువు పరచగలిగితే చాలు. అంతేగాక పత్రికా రచయితలకు మరో మూడు ప్రతివాదాలు (డిఫెన్సెస్) కూడా అందుబాటులో ఉన్నాయి.

అవి 1. సమర్థనీయత 2. సద్విమర్శ 3. విశేషాధికారం

BRAOU

సమర్థనీయత అనే ప్రతివాదం కింద ఆపాదన మొత్తం మీద యదార్థం అని రుజువు చేయగలిగితే చాలు. నూటికి నూరుపాళ్ళు నిజం అని రుజువు చేయాల్సిన పనిలేదు. సద్విమర్శ ప్రజాశ్రేయస్సు దృష్టితో చేసిందై వుండాలి. అప్రస్తుత ప్రసంగంగా ఉండరాదు. దురుద్దేశం తొంగిచూడకూడదు. కోర్టు విచారణలోని అంశాలుశాసనసభ చర్చలలో అంశాలు,పాలనా వ్యవహారాలకు సంబంధించిన అధికార ప్రకటనలు. వాటిలోనిందాపూర్వకమైన ఆపాదన ఉన్నా ప్రచురించాల్సిన బాధ్యత పత్రికా రచయితలకు ఉంది. అవన్నీ విశేషాధికారం కిందకి వస్తాయి. వాటిని పురస్కరించుకుని పత్రికా రచయితలను కోర్టుకు ఈడ్చే అవకాశం లేదు.

సివిల్ దావాలో నేరం రుజువైతే పరిహారం చెల్లించాల్సి రావచ్చు. బాధితుడికి సమాజంలోవున్న హోదా, గౌరవం, ప్రతిష్ఠలను దృష్టిలోవుంచుకుని ఆపాదన తీవ్రతను దానికి లభించిన ప్రచార విస్తృతిని దృష్టిలోవుంచుకుని కోర్టు పరిహార మొత్తాన్ని నిర్ణయిస్తుంది. క్షమాపణలు చెప్పుకోవడం నేర తీవ్రతను తగ్గించవచ్చు.

పరువునష్టం కలిగించే ఆపాదన పునఃప్రచురణ కొత్త నేరమవుతుంది. ఇంకెవరో చేసిన ఆరోపణనే మేం ప్రచురించామనో ఇంకో పత్రికా వేసిన దాన్నే పునర్ముద్రించామనో వాదించి ప్రయోజనం లేదు.

501వ సెక్షన్ ముద్రాపకుడు 502వ సెక్షన్ అమ్మకందారు కూడ శిక్షార్హుడేనని ప్రకటిస్తున్నది. అయితే పరువునష్టం కలిగించే అంశాలువున్నాయని తెలియక ముద్రించిన ముద్రాపకుడి పట్ల, అలాగే అమాయకుడైన అమ్మకం దారుపట్ల కోర్టులు ఉదారదృష్టి వహించవచ్చు. అలాగే పత్రికలో ఏ విషయాలు ప్రచురితమవుతున్నాయో ఏ రోజుకారోజు తెలుసుకోవడానికి అవకాశం లేని యజమాని పట్ల కూడా ఉదారంగా వ్యవహరించవచ్చు.

భారత శిక్షాస్మృతిలోని 124 ఎ (దేశద్రోహ ప్రచురణలు) 153- (జాతి, ప్రాంత భాషా బేధాలను రెచ్చగొట్టి ప్రజా వర్గాల మధ్య ద్వేష భావాలను రెచ్చగొట్టే రాతలు) 153-బి (జాతీయ సమైక్యతకు భంగం కలిగించే రాతలు) 295-ఎ (మత, విశ్వాసాలను కించపరిచే రాతలు 505 (ప్రజలను భయభ్రాంతులు చేసి నేరాలకు పురికొల్పే రాతలు) సెక్షన్ల గురించి కూడా పత్రికా రచయితలు తెలుసుకుని ఉండాలి. ఈ నేరాలకు మూడేళ్ళ వరకు జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించే అవకాశముంది.

BRAOU

## 31.4 పత్రికా స్వాతంత్ర్యం

పత్రికా స్వాతంత్ర్యం అంటే ప్రభుత్వం నుంచికాని మరే అధికార వ్యవస్థనుంచి కాని ఎలాంటి ఒత్తిడి, అదుపు ఆంక్షలులేకుండా వార్తలకూ,వార్తలపై వ్యాఖ్యనూ ప్రచురించే స్వేచ్ఛ అని స్థూలంగా నిర్వచించవచ్చు.

ప్రజాస్వామిక వ్యవస్థలోసార్వభౌమాధికారం ప్రజలకే చెందుతుంది. ఆ ప్రజలు పాలనాధికార బాధ్యతలను ఎవరికి అప్పగించాలో నిర్ణయించాలంటే వారికి సమాజ స్థితిగతుల గురించి దానిముందు ఉన్న లక్ష్యాల గురించి, వాటిని సాధించడానికి గల మార్గాలు గురించి ఆయా వ్యవస్థల, పక్షాల శక్తి సామర్థ్యాల గురించి సరైన సమాచారం తెలిసి ఉండాలి. ప్రజాస్వామ్యం కొత్త ఆలోచనలను స్వీకరించడం ద్వారా వాటిని పరీక్షించి చూడటం ద్వారా,కాలదోషం పట్టిన వాటిని తిరస్కరిచండం ద్వారా వర్థిల్లుతుంది. అందుచేత ప్రజల ముందు సమస్త సిద్ధాంతాలను, భిన్నాభిప్రాయాలను, వాటి గుణదోష చర్చలను సత్యనిష్ఠతో. సాకల్యంగా ఉంచవలసిన బాధ్యత పత్రికలపై వుంది. ఆ బాధ్యతను సమర్థతతోనిర్వహించడంలో ఎటువైపునుంచీ ఎలాంటి ప్రతిబంధకాలూ వుండరాదు. పత్రికా స్వాతంత్ర్యం అంటే బాధ్యతలనుంచి విముక్తి కాదు బాధ్యతాయుతంగా రాసే స్వేచ్ఛ మాత్రమే. అమెరికాలోవలెఎలాంటి ఆంక్షలూ విధించడానికి వీలులేని వ్యవస్థలోనైనా, భారతదేశంలోవలె సహేతుకమైన ఆంక్షలు విధించడానికి వీలున్న వ్యవస్థలోనైనా పత్రికలు విశృంఖలంగావ్యవహరించే ప్రసక్తే లేదు.

పత్రికా స్వాతంత్ర్యం అనేది మరోరకంగా చెప్పాలంటే అధికార వ్యవస్థనుంచే కానీ ఎలాంటి ప్రతిబంధకాలు లేకుండా సమస్త సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రజలకున్న హక్కులని చెప్పవచ్చు.

భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా 1959లో ఎక్స్‌ప్రెస్ పత్రికలు తెచ్చిన ఒక కేసుపై తీర్పులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హమైనవి.

1. భిన్నమైన పరస్పర విరుద్ధమైన అధారాల నుంచి అందిన సమాచారాలు విస్తృతంగా ప్రచారానికి నోచుకోవడం ప్రజా సంక్షేమానికి అవశ్యమన్న విశ్వాసంపైన పత్రికా స్వాతంత్ర్యం ఆధారపడి ఉంది.

2. అలాంటి స్వాతంత్ర్యం స్వతంత్రులైన ప్రజలకు చెందిన, స్వతంత్ర ప్రభుత్వానికి పునాది వంటిది.

3. ప్రభుత్వాధినేతలు ప్రజాభిప్రాయాన్ని తమ చెప్పుచేతలలో ఉంచుకోకుండా కాపడటమే అలాంటి స్వాతంత్ర్య ఉద్దేశం.

### 31.4.1 స్వాతంత్ర్యం భావన

చారిత్రకంగా చూస్తే ఈ పత్రికా స్వాతంత్ర్యం అనేభావ ఇంగ్లాండ్‌లో అంకురించింది. తొలి పత్రికలు అక్కడే ఆవిర్భవించాయి గనుక ఈ పరిణామం సహజమైంది. కానిభావ ప్రకటనాస్వేచ్ఛ అనేది భారతీయులకు కొత్త భావనకాదు. పురాణయుగంలోనే నారదుడు, సంజయుడు, వంటి సమాచార వితరణ బాధ్యతలు నిర్వహించిన వ్యక్తులు స్వేచ్ఛగా పరిణామాల గురించిన జంకు లేకుండా వ్యవహరించిన దృష్టాంతాలు వున్నాయి. "నబ్రూయాత్ సత్యమప్రియం" అనే సూక్తిని వారు పాటించలేదు. సంజయుడు కురుక్షేత్రంలో జరిగిందేదో అదే చెప్పాడు. కాని ధృతరాష్ట్రునికి అప్రియంగా ఉంటుందని చెప్పకుండా ఉండలేదు. నారదుని సంగతి సరేసరి. అతనికి 'కలహభోజనుడు' అనే బిరుదు ఎందుకు వచ్చిందో వేరే చెప్పాలా?

అధునికయుగంలో పత్రికా స్వాతంత్ర్యం బ్రిటన్‌లోఆవిర్భవించగా అమెరికాలోరాజ్యాంగబద్ధమైన హక్కుగా మారి బలపడింది. ఈనాడు అమెరికన్ పత్రికలకున్న స్వేచ్ఛ, గౌరవం అనన్యమైంది. మన దేశంలో పత్రికలు కూడా స్వేచ్ఛ విషయంలో అమెరికా పత్రికలను ఆదర్శంగా తీసుకుని పురోగమించడానికి యత్నిస్తున్నాయి. మన సుప్రీంకోర్టు కూడా ఈ స్వాతంత్ర్య పరిరక్షణలో అమెరికన్ సుప్రీంకోర్టు తీర్పులకు దృష్టాంతాలుగా స్వీకరించిన సందర్భాలే ఎక్కువ. ఫలితంగా ఇవాళ మన దేశానికి సంబంధించినతవరకు పత్రికా స్వాతంత్ర్యం అంటే ఈ కింది అంశాలతో కూడి ఉంటుదని నిర్ధారణ అయింది.

1. వార్తలను (సమకాలిన చరిత్ర అనదగిన యదార్ధ సమాచారాన్ని) వాటిపై వ్యాఖ్యలను ఎంపికచేసి ముద్రించి ప్రచురించడం.

2. ముద్రిత సమాచారాన్ని ఇతరులకు అందజేయడం.

3. రాజకీయాంశాలపైన, ప్రజా సమస్యలపైన ప్రజలు తమ అభిప్రాయాలను ప్రకటించడానికి. చర్చ లేవదీయడానికీ వీలు కల్పించడం.

4. ప్రభుత్వ వ్యవహారాలపైన రాజకీయ నాయకుల ప్రవర్తనపైన, చట్ట పరిధికిలోబడి ప్రజలు చేసే విమర్శలకు ప్రచురణావకాశం కల్పించడం.

5. ఏ వార్తనైనా, సమాచారాన్నయినా అనవసరమనుకుంటే ప్రచురించడానికి నిరాకరించడం.

6. ఈ భాధ్యతల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని సేకరించి ప్రచురించడం.

మన దేశంలో చట్టబద్ధమైన సమాచార స్వాతంత్ర్యం లేదా తెలుసుకునే హక్కులేదు. మన పత్రికలు 19(1) (ఎ) కింద లభించే వాక్, భావ ప్రకటనా స్వాతంత్ర్యం పరిధికి లోబడి పౌరులందరి మాదిరిగానే వ్యవహరించవలసి వుంటుంది. పత్రికలకు ప్రత్యేక హక్కులుగాని, విశేషాధికారాలు కానీ, మినహాయింపులు, సౌకర్యాలు కానీ లేవు. పత్రికా యజమానులకు, పత్రికా సంపాదకులకు దేశ పౌరులుగా లభించే స్వాతంత్ర్యమే పత్రికా స్వాతంత్ర్యంగా ప్రతిఫలిస్తున్నది

### 31.4.2 సహేతుక ఆంక్షలు

ఈ పత్రికా స్వాతంత్ర్యంపైన సహేతుక ఆంక్షలు విధించే చట్టాలు ఇదివరకే అమలులో ఉన్నవైనా, కొత్తగా చేసేవైనా రాజ్యాంగ సమ్మతంగా వుండాలి. అంటే 19(2) అధికరణకు లోబడి వుంటే చెల్లుబటు అవుతాయి.

దేశ సార్వభౌమత్వం, సమగ్రతల పరిరక్షణ అనే అంశంకింద అధికార రహస్యాల చట్టం,భారతీయ శిక్షాస్మృతిలో దేశద్రోహానికి సంబంధించిన సెక్షన్లు పౌరరక్షణ చట్టం. జాతీయ భద్రతా చట్టం మొదలైనవి చెల్లుబాటవుతాయి.

విదేశాలతో స్నేహ సంబంధాల పరిరక్షణ అనే అంశం శిక్ష్మాస్మృతిలోని క్లాజులు, టెలిగ్రాఫ్. పోస్టాఫీసు చట్టాలు. మందులు, మహిమాన్విత చికిత్సల(అభ్యంతరకర ప్రకటనల) చట్టం మొదలైనవి చెల్లుబాటవుతున్నాయి.

అసభ్య రచనల పరువునష్టం కలిగించే రాతల నిషేధానికి కూడా 19(2) కింద వీలుంది. కనుక శిక్షా స్మృతిలోని సంబంధిత క్లాజులు చలామణిలో ఉండగలిగాయి.

కోర్టుధిక్కార నేరాన్ని శిక్షార్హం చేస్తున్న చట్టం కూడా రాజ్యాంగ నిబంధనల ననుసరించి చేసిందే గనుక చలామణి అవుతున్నది.

## 31.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ పత్రికా స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికీ, పత్రికల, వార్తా సంస్థల ప్రమాణాలను మెరుగుపరచడానికి పత్రికా మండలి కృషి చేస్తుంది.

★ పత్రికలకు, పత్రికలలో పనిచేసే వారికి మాత్రమే వర్తించి, ఇతర పౌరులెవరికీ వర్తించని కొన్ని ప్రత్యేక చట్టాలు పత్రికా స్వాతంత్ర్యం విషయంలో ఉన్నా ప్రజలందరికీ వర్తించే చట్టాలే అధికంగా వర్తిస్తాయి. ఈ సాధారణ, ప్రత్యేక చట్టాల అధ్యయనం పాత్రికేయులకు తప్పనిసరి. పత్రికలు, పుస్తకాల రిజిస్ట్రేషన్ చట్టం (1867), కాపీరైట్ చట్టం (1957), కోర్టుధిక్కార చట్టం (1971), ప్రెస్ కౌన్సిల్ చట్టం (1978), వర్కింగ్ జర్నలిస్టుల చట్టం (1954) వంటి చట్టాలను ప్రధానంగా అధ్యయనం చేయాలి.

★ కోర్టుల. శాసన సభలు, పార్లమెంటులో జరిగే చర్యలను రాయడంలో ఉన్న అవకాశాలను, పరిమితులు తెలుసుకోవాలి. వీటి ధిక్కార నేరానికి దూరంగా ఉండాలి. పత్రికా రచయితగా ఈ అంశాలను రాయడంలో తీసుకోవలసిన జాగ్రత్తలను. లభించే మినహాయింపులను తెల్సుకున్నాం.

★ పరువు నష్టం మానహాని నేరమవుతుందని గుర్తించాం. శిక్షాస్మృతిలో 499 నుచి 522 సెక్షన్లలో ఇందుకు సంభవించిన అంశాలు సమగ్రంగా ఉంటాయని తెలుసుకున్నాం. ఈ నేరాలను సివిల్. క్రిమినల్ నేరాలుగా పరిగణిస్తారని గుర్తించాం. ఏయే అంశాలు పరువునష్టం మానహాని కిందకు రావో గుర్తించగలిగాం. పత్రికా రచయితలను అందుబాటులో మూడు ప్రతివాదాలు ఉన్నాయి.

★ పత్రికా స్వేచ్ఛ అంటే ప్రభుత్వం నుంచి కాని మరే అధికార వ్యవస్థ నుంచి కాని ఎలాంటి ఒత్తిడి అదుపు ఆంక్షలు లేకుండా వార్తలలకూ, వాఖ్యలకూ ప్రచురించే స్వేచ్ఛ అని నిర్వచిస్తారు. పత్రికా స్వాతంత్ర్యం భావన. దానితోబాటే కన్పించే సహేతుక ఆంక్షలున్నాయి.

BRAOU

## 31.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. పత్రికా శాసనాలు ఎన్ని? ఒక్కోదాని గురించి క్లుప్తంగా రాయండి?

2. కాపీరైట్ చట్టంకింద పత్రికా రచయితలకు లభించిన మినహాయింపులు ఏవి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. పరువునష్టం లేదా మానహాని అంటే చట్టం ఇచ్చిన నిర్వచనం ఏమిటి? అది ఎన్ని రకాలు?

2. పత్రికా స్వాతంత్ర్యాన్ని ఎలా నిర్వచిస్తారు?

**- జి.ఎస్. వరదాచారి**

BRAOU

# భాగం - 32 : వార్తా సంస్థలు

## విషయక్రమం

32.0 ఉద్దేశం

32.1 ప్రవేశిక

32.2 వార్తా సంస్థలు

32.2.1 జాతీయ వార్తా సంస్థలు

32.2.2 విదేశీ వార్తా సంస్థలు

32.3 ప్రభుత్వ సమాచార సంస్థలు

32.3.1. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పి.ఐ.బి.)

32.3.2 డైరెక్టరేట్ ఆఫ్ ఆడియో విజువల్ పబ్లిసిటీ (డి.ఏ.వి.పి)

32.4 భారత పత్రికా ప్రచురణ సంస్థల సంఘం (ఇండియన్ న్యూస్ పేపర్స్‌సొసైటీ)

32.5 ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఎ.బి.సి.)

32.6 ప్రెస్ కమిషన్

32.7 ప్రెస్ రిజిస్ట్రార్

32.8 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

32.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

BRAOU

## 32.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- వార్తా సంస్థలు
- ప్రభుత్వ సమాచార వ్యవస్థలు
- భారత పత్రికా ప్రచురణ సంస్థల సంఘం
- ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్
- ప్రెస్ కమిషన్
- ప్రెస్ రిజిస్ట్రార్ గురించి తెలుసుకుంటారు.

## 32.1 ప్రవేశిక

పత్రికా వ్యవస్థ సమర్థంగా, సక్రమంగా పని చేయాలంటే వివిధ సంస్థల తోడ్పాటు అవసరం. పత్రికలకు జీవమైన వార్తలు వాటికి ఎలా అందుతాయి? ఏయే మార్గాల ద్వారా వార్తల సేకరణ జరుగుతుంది? మొదలైన విషయాలను వార్తాసంస్థలు ప్రభుత్వ సమాచార సంస్థల్లో తెలుసుకోవచ్చు. పత్రికలను ఎక్కడ రిజిస్టర్ చేసుకోవాలి ఏయే నియమాలు పాటించాలి, సర్క్యులేషన్ వివరాలు ఎలా తెలుస్తాయి. తదితర విషయాలను తెలుసుకోవడం ఎంతోఅవసరం.

## 32.2 వార్తా సంస్థలు

ముఖ్యకేంద్రాలలో తమ ప్రతినిధులను నియమించి వార్తలను సేకరించి వాటిని వివిధ భాషలపత్రికలకు, ఇతర సంస్థలకు అమ్మే సంస్థలను వార్తా సంస్థలంటారు. ఇవి రెండు రకాలు 1. దేశీయ వార్తా సంస్థలు లేదా జాతీయ వార్తా సంస్థలు. 2. అంతర్జాతీయ వార్తా సంస్థలు.

### 32.2.1 దేశీయ వార్తా సంస్థలు

మన దేశంలో దేశవ్యాప్త వార్తా సేకరణ వితరణ, యంత్రాంగం కల ముఖ్య వార్తాసంస్థలు రెండు ఉన్నాయి. అవి ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పి.టి.ఐ.), యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా (యు.ఎన్.ఐ). పి.టి.ఐ., యు.ఎన్.ఐ. లకు హిందీలలో కూడా వార్తలు అందజేసే విభాగాలు ఉన్నాయి. అంతేగాక వీటికి వార్తాచిత్రాలను పంపిణీ చేసేవ్యవస్థలు కూడా ఉన్నాయి. పి.టి.ఐ. కి రాయిటర్ అనే బ్రిటిష్ వార్తా సంస్థతోను, యు.ఎన్.ఐ. కి అసోసియేటెడ్ ప్రెస్ (ఎ.పి.) అనే అమెరికా వార్తా సంస్థతోను విదేశీ వార్తల సరఫరాకు ఒప్పందాలువుండేవి. ఈ రెండు వార్తా సంస్థలు క్రమంగా ఎదిగి ఇవాళ మూడవ ప్రపంచ దేశాలెన్నిటితోనో వార్తాల మార్పిడి ఒప్పందాలు కేంద్రాలలో స్వంత ప్రతినిధులను ఏర్పాటు చేసుకోగలిగాయి.

మన దేశంలో కె.సి.రాయ్ అనే అతను అసోసియేటెడ్ ప్రెస్ అనేపేరుతో మొదటి ప్రపంచ యుద్ధానికి ముందే వార్తా సంస్థను ఏర్పాటు చేశారు. దీనికి రాయిటర్స్‌తో అనుబంధం వుండేది. ఇది 1948లో సహకార యాజమాన్య ప్రాతిపదికపై ఏర్పాటైన పి.టి.ఐలో విలీనమైంది.

చాలాకాలం పాటు విదేశీ వార్తలకోసం పత్రికలు పాశ్చాత్య వార్తా సంస్థలపై ఆధారపడేవి. వర్ధమాన దేశాల వార్తలందించడంలో అవి న్యాయం చేయడం లేదన్న భావన వుండేది. అలీనదేశాల నాయకుల చొరవతో ఈ దేశాలు తమ వార్తలను పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడానికి 1976లో అలీనదేశాల వార్తా వ్యవస్థ (పూల్)ను ఏర్పాటు చేసుకున్నాయి.

### 32.2.2 విదేశీ వార్తా సంస్థలు

ఎ. రాయిటర్: రాయిటర్ 1860లో తపాలా సౌకర్యాలు వినియోగించుకుని భారతదేశంలో వార్తలు పంపిణీచేయడం ప్రారంభించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకు భారీ ఆంగ్ల పత్రికలు విదేశీయుల యాజమాన్యంలో ఉన్నందున విదేశీవార్తల కోసం అవి రాయిటర్‌పైనే ఆధారపడేవి. భారత ఉపఖండంలో స్వంత ఉపసంస్థ అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ ఇండియా ద్వారా పత్రికలకు వార్తలు అందిస్తూ వుండేది. 1948లో భారతీయ వార్తా సంస్థ (పిటిఐ) ఏర్పడటంతో దానితో ఒప్పందం కుదుర్చుకుని వార్తలందిస్తున్నది. రాయిటర్‌వార్తాసంస్థను జర్మనీ నుంచి బ్రిటన్ వలసవచ్చిన పాల్‌జూలియన్ రాయిటర్ అనే అతను లండన్‌లో 1851లో నెలకొల్పారు. 1941 వరకు అది కుటుంబసంస్థగా వుండి అప్పటినుంచి లాభార్జన దృష్టిలేని ట్రస్టుగా మారింది.

BRAOU

బి. అసోసియేటెడ్ ప్రెస్ ఆఫ్ అమెరికా (ఎ.పి.) : ఇది 1848లో న్యూయార్క్‌లో ఏర్పడిన అమెరికన్ వార్తా సంస్థ. ఇది ప్రపంచంలోనే తొలి వార్తా సంస్థగా ప్రసిద్ధికెక్కింది. దీని వార్తలు కొనుగోలు చేసే పత్రికలు. రేడియోల సంఖ్య కూడా అత్యధికం. ప్రపంచమంతటా వార్తాసేకరణకు దీనికి ప్రతినిధులుఉన్నారు. భారతదేశంలో యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా ద్వారా ఇది తనవార్తలను చందాదారులకు అందిస్తున్నది. వాణిజ్య వార్తలు, ఛాయా చిత్రాలు. వ్యంగ్య చిత్రాలు కూడా అందించే వ్యవస్థ కలిగివుంది.

సి. ఏజెన్సీ ఫ్రాన్స్ ప్రెస్ (ఎ.ఎఫ్.పి): చెందిన వార్తాసంస్థ. ఇది ఫ్రెంచి భాషతోపాటు ఇంగ్లీషు. జర్మన్. స్పానిష్ భాషల్లో కూడా చాలాకాలంగా వార్తలందిస్తూ వచ్చింది. భారతదేశంలో వార్తలందించడానికి దీనికి కూడా (పిటిఐ)తో ఏర్పాటువుంది

**అభ్యాసం - 1 : వార్తా సంస్థలని వేటిని అంటారు? ముఖ్యమైన విదేశీ వార్తా సంస్థలను ప్రస్తావించండి.**

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

## 32.3 ప్రభుత్వ సమాచార సంస్థలు

### 32.3.1 ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి)

BRAOU

ఇది కేంద్రప్రభుత్వం సమాచార ప్రసార మంత్రిత్వశాఖకు చెందిన ఒక విభాగం. దేశ్యాప్తంగా కార్యాలయాలు కలిగి ప్రభుత్వ సమాచారాన్ని ప్రచార సాధనవాలకు అందజేస్తుంది. ఇంగ్లీషులోనేకాక కొన్ని ఇతర భారతీయ బాషలలో కూడా ప్రభుత్వ సమాచారాన్ని అందరికీ అందిస్తుంది. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ఫొటోలనుకూడా పత్రికలకు సరఫరా చేస్తుంది. అంతేగాక ప్రజాభిప్రాయం ఎలా మారుతున్నదో ప్రభుత్వానికి తెలియపరుస్తుంది. వివిధ భాషల పత్రికలలో వచ్చిన వార్తల క్లిప్పింగ్స్ తీసి ఫైళ్ళను రూపొందిస్తుంది. మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల పత్రికా గోష్ఠులునిర్వహించడం ద్వారా ప్రభుత్వ విధాన నిర్ణయాలను ప్రజలకు తెలియపరచడమేగాక పత్రికల వారు కోరిప్పుడు వివిధ అంశాలపై బ్యాక్‌గ్రౌండ్ సమాచారాన్ని అందించి ప్రభుత్వ విధానాలను సరైనవిధంగావిశ్లేషించడానికి వారికి తోడ్పడుతుంది.

### 32.3.2 డైరెక్టరేట్ ఆఫ్ ఆడియో విజువల్ పబ్లిసిటీ (డి.ఎ.వి.పి)

ఇది కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన విభాగమే. కేంద్రప్రభుత్వం వారిఅడ్వర్టయిజ్‌మెంట్లను ఇది వివిధ పత్రికలకు అందజేస్తుంది. రేట్లు కూడా నియమాల అనుసారం నిర్ణయిస్తుంది. ప్రభుత్వ ప్రచురణల విక్రయ బాధ్యతను కూడా చూస్తుంది. ముద్రణలో ఉత్తమ ఫలితాలు సాధించిన పత్రికా పుస్తకప్రచురణ సంస్థలకు ఏటేటా బహుమతులు కూడా ఇస్తుంది.

ఇదే విధంగా రాష్ట్రప్రభుత్వాలకు సమాచార, ప్రజా సంబంధాలశాఖలు (డి.పి.ఆర్) ఉన్నాయి. ఇవి రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన సమాచారాన్ని, ఫోటోలను పత్రికలకు అందజేయడమే గాక రాష్ట్ర ప్రభుత్వ అడ్వర్టయిజ్‌మెంట్లను కూడా పత్రికలకు ఇచ్చే బాధ్యతను నిర్వహిస్తాయి.

## 32.4 భారత పత్రికా ప్రచురణ సంస్థల సంఘం (ఇండియన్ న్యూస్‌పేపర్స్ సొసైటీ)

మొదట్లో దీని పేరు ఇండియన్ అండ్ ఈస్టర్న్ న్యూస్‌పేపర్ సొసైటీ (ఐ.ఇ.ఎన్.ఎస్) ఉండేది. 1939లో ఇది భారతీయ పత్రికా ప్రచురణ కర్తల కేంద్ర సంఘంగా స్థాపించబడింది. అయితే దక్షిణాసియాలోని ఇతర దేశాల్లోని పత్రికా ప్రచురణ శ్రీలంక, బర్మా దేశాలకు చెందిన కొన్ని పత్రికలు దీనిలో సభ్యత్వం స్వీకరించాయి. యాభై సంవత్సరాల తర్వాత ఇది తన కార్యకలాపాలను భారతీయ పత్రికా ప్రచురణ సంస్థలకే పరిమితం చేస్తూ ఐ.ఎన్.ఎస్‌గా మారింది. సభ్య సంస్థల వ్యాపార ప్రయోజనాలను కాపాడటం దీని ప్రథమ కర్తవ్యం. అందుకోసం సభ్యులకు ఉపయోగపడే సమాచారాన్ని సేకరించి అందజేస్తుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల చేసే శాసనాల వల్ల, పత్రికా ప్రచురణ వ్యాపారానికి ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఎదురవుతాయనుకుంటే రాయబారాలద్వారా, చర్చలద్వారా అవసరమైతే న్యాయవ్యవస్థ ద్వారా వాటిని పరిష్కరించడానికి యత్నిస్తుంది. వృత్తి, ప్రమాణాలు మెరుగుపరచుకోవడానికి కూడా యత్నిస్తుంది.

అడ్వర్టయిజ్‌మెంట్ వ్యాపారంలో ఉన్నత ప్రమాణాలను కాపాడటానికి అడ్వర్టయిజింగ్ సంస్థలకు అక్రెడిటేషన్ కూడా ఇస్తుంది. ఉత్తమ వ్యాపారానికి అవరోధంగా వుండే అంశాలను తొలగించడం ద్వారా అడ్వర్టయిజింగ్ సంస్థలకు న్యాయమైన లాభం వచ్చేట్టు చూస్తుంది. పత్రికా సంస్థలకు అడ్వర్టయిజింగ్ సంస్థలకు మధ్య వివాదాలేమైనా ఏర్పడినప్పుడూ వాటిని పరిష్కరిస్తుంది. ప్రభుత్వ అడ్వర్టయిజ్‌మెంట్లకు డి.ఎ.వి.పి.నుంచి తగు రేటును రాబట్టడానికి ప్రయత్నిస్తుంది. సర్క్యులేషన్ పెరుగుతున్న పత్రికలకు తగినంత న్యూస్‌ప్రింట్ (పత్రికల కాగితం) కేటాయించేట్టు ప్రభుత్వాన్ని ఒప్పించడానికి కూడా ప్రయత్నిస్తుంది.

**అభ్యాసం - 2 : ప్రభుత్వ ప్రచార సంస్థలను వివరించండి.**

..................................................................................................................................................

..................................................................................................................................................

..................................................................................................................................................

..................................................................................................................................................

..................................................................................................................................................

## 32.5 ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఎ.బి.సి.)

ఇది 1948లో ఏర్పాటైంది. ఇది మూలధనంగాని, లాభాపేక్షగాని లేని సంస్థ. దీన్ని ఒక కార్యనిర్వాహకమండలి నడుపుతుంది. ఈ మండలిలో సగంమంది సభ్యులు వంతు ప్రకారం యేటేటా రిటైరవుతుంటారు. దీనిలో పత్రికా సంస్థలకు, అడ్వర్టయిజర్లకు, అడ్వర్టయిజింగ్ సంస్థలకు సభ్యత్వం వుంటుంది. ఈ సంస్థ పత్రికల ప్రాచుర్యం (సర్క్యులేషన్)ఎంత వుందో

BRAOU

ఆడిట్ చేసి యేడాదికి రెండుసార్లు నిర్ధారిత సంఖ్యలతో నివేదికలు సభ్యులకోసం ప్రచురిస్తుంది. ఈ ప్రాచుర్యాన్ని అందరూ ప్రామాణికంగా తీసుకుంటారు. అడ్వర్టయిజ్‌మెంట్ల విషయంలో ఈ సర్టిఫికెట్‌కు చాలా విలువ వుంది.

## 32.6 ప్రెస్ కమిషన్

మన దేశంలో ఇప్పటివరకు రెండు ప్రెస్ కమిషన్లు ఏర్పాటై నివేదికలు సమర్పించాయి. మొదటిది 1952లోదేశంలో కొత్తగా అమలులోకి వచ్చిన ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల స్థానాన్ని, స్థాయిని, పనితీరును పరిశీలించి మెరుగుపరచడానికి సూచనలివ్వడానికి ఏర్పాటైంది. దీనికి జస్టిస్, జి.ఎస్. రాజాధ్యక్ష ఛైర్మన్. మరో పదిమంది సభ్యులు వుండేవారు. ఈ కమిషన్ పత్రికలకు ప్రశ్నావళిని ఇచ్చి మౌలిక సాక్ష్యాలు సేకరించి సుమారు 600 పేజీల సుదీర్ఘమైన నివేదికను 1954లోప్రభుత్వానికి సమర్పించింది. ప్రెస్ రిజిస్ట్రార్ వ్యవస్థ, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం, జర్నలిస్టుల వేజ్‌బోర్డుల ఏర్పాటు ప్రెస్ కౌన్సిల్ ఏర్పాటు దీని సిఫార్సుల ఫలితమే. దీనివల్ల పత్రికా రచయితల ఉద్యోగ స్థితిగతులు ఎంతో మెరుగయ్యాయి గనుక దీనిని జర్నలిస్టుల పాలిటి కల్పవృక్షమని వర్ణించారు. జర్నలిస్టులకు ప్రవర్తనా నియమావళిని కూడా కమిషన్ సూచించింది.

రెండవ ప్రెస్ కమిషన్ 1977లో ఏర్పాటైంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి పి.కె. గోస్వామి దీని అధ్యక్షుడు. 1982లో ఈ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఎమర్జెన్సీ కాలంలో ఏర్పాటైనందున దాని సిఫార్సులు పెద్దగా ఎవరి దృష్టినీ ఆకర్షించలేదు.

## 32.7 ప్రెస్ రిజిస్ట్రార్

మొదటి ప్రెస్ కమిషన్ 1952లో దేశంలో పత్రికల స్థితిగతులను పరిశీలించే పనిని చేపట్టినప్పుడు దేశంలో ఎన్ని పత్రికలు వున్నాయో చెప్పే వ్యవస్థ కూడా లేకపోయింది. పత్రికలు, పుస్తకాల రిజిస్ట్రేషన్ చట్టం 1867నుంచి అమలులో వున్నా ఎవరు పత్రికను ప్రారంభించాలన్నా ముందుగా అనుమతి తీసుకోవాలన్న నిబంధన అమలులో వున్నా కేంద్ర సమాచార శాఖ వద్దగానీ, రాష్ట్రాల సమాచార పౌర సంబంధాల శాఖల వద్దకానీ పత్రికల వివరాలు అందుబాటులో లేని దుస్థితి ఉండేది. అందుచేత మొదటి ప్రెస్ కమిషన్ ప్రెస్ రిజిస్ట్రార్ అనే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును అనుసరించి 1956 జులై ఒకటోతేదీని భారత ప్రభుత్వం రిజిస్ట్రార్ ఆఫ్ న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియాను నియమించింది. దేశంలో పత్రికలకుసంబంధించిన సమస్త వివరాలను సేకరించి ఉంచే చట్టబద్ధమైన వ్యవస్థ ఇది. పత్రికలు ప్రారంభించే ముందు పేరు కేటాయించడంతో పాటు ప్రతి సంవత్సరం మార్చి నెలలోవాటి సమస్త వివరాలను అంటే సంపాదకుడు ఎవరు? ప్రచురణ కర్త ఎవరు? భాగస్వాములెవరు? అనే వివరాలతో పాటు, ప్రాచుర్య సంఖ్యలను కూడా తెప్పించి, వార్షిక నివేదికలను ప్రచురించే బాధ్యతను ఈ రిజిస్ట్రార్ నిర్వహిస్తున్నారు. ఈ సమాచారాన్నంతా సమీకరించి ఒక పద్ధతిలో అమర్చడానికి చాలా సమయం పగుతుంది గనుక సాధారణంగా ప్రెస్ రిజిస్ట్రార్ నివేదికలలో రెండు మూడేళ్ళ కిందటి సమాచారం వుంటుంది. అయినా పత్రికల ప్రచురణలో వృద్ధి తరుగుదల ఇత్యాది అంశాల గురించి సాధికార సమాచారం ఈ నివేదికలలోనే లభ్యమవుతున్నందున ఇవి చాలా ఉపయుక్తంగా వుంటాయి.

**అభ్యాసం - 3 : 'ప్రెస్‌కమీషన్' గురించి రాయండి?**

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

..............................................................................................................................

BRAOU

## 32.8 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ తమ ప్రతినిధుల ద్వారా వార్తలను వివిధ ప్రదేశాలనుంచి సేకరించి వివిధ పత్రికలు, ఇతర సంస్థలకు అమ్మే సంస్థలను వార్తా సంస్థలుగా పేర్కొంటారు.

★ రాయిటర్, అసోయిటెడ్ ప్రెస్ ఆఫ్ అమెరికా, ఎజెన్సీ ఫ్రాన్స్‌ప్రెస్ విదేశీ వార్తా సంస్థలు పసిద్ధిచెందిన వార్తా సంస్థలు. భారతదేశ వార్తా సంస్థలు, పత్రికలలో వీటికి వార్తలను, ఛాయా చిత్రాల వంటి వాటిని సరఫరా చేస్తాయి.

★ భారత ప్రభుత్వ సమాచార శాఖకు చెందిన ప్రసారమంత్రిత్వ ప్రభుత్వ సమాచార సంస్థలు (పి.ఐ.బి, డి.ఎ.వి.పి.).

★ పత్రికా ప్రచురణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ఐ.ఎన్.ఎస్. సహకరిస్తుంది.

★ ఎ.బి.సి. ఆడిట్‌చేసి సర్క్యులేషన్ విషయంలో ఇచ్చే సర్టిఫికేట్‌కు చాలా విలువ ఉంది.

★ ప్రెస్ కమీషన్, ప్రెస్ రిజిస్ట్రార్ జర్నలిస్టుల పాలిటి కల్పవృక్షమైతే పత్రికలకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించి ఉంచే చట్టబద్ధమైన వ్యవస్థ.

## 32.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. భారత దేశంలో వార్తాసంస్థల ఆవిర్భావం గురించి తెలిపి ఇప్పుడున్న వార్తాసంస్థల పనితీరును వివరించండి?
2. ప్రెస్ రిజిస్ట్రార్ విధుల గురించి రాయండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. ఐ.ఎన్.ఎస్.
2. రాయిటర్.

**- జి.ఎస్. వరదాచారి**

BRAOU

# భాగం - 33 : పాత్రికేయ చట్టాలు, యూనియన్లు, వేతన బోర్డులు

## విషయక్రమం

33.0 ఉద్దేశం

33.1 ప్రవేశిక

33.2 వర్కింగ్ జర్నలిస్టుల చట్టం

33.3 ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐ.ఎఫ్.డబ్ల్యు.జె)

33.4 వేతన బోర్డులు

33.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

33.6 మాదిరి సరీక్షా ప్రశ్నలు

## 33.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత మీరు

- వర్కింగ్ జర్నలిస్టుల చట్టం
- జర్నలిస్టు యూనియన్లు
- వేతన బోర్డుల గురించి తెలుసుకుంటారు.

BRAOU

## 33.1 ప్రవేశిక

సమాజంలోని వివిధ వర్గాల ప్రజల బాగోగుల గురించి పట్టించుకునే పాత్రికేయుల బాగునుచూసేదే వర్కింగ్ జర్నలిస్టుల చట్టం. దీనిలో వర్కింగ్ జర్నలిస్టంటే ఎవరు? ఆయా సంస్థల తరపున వారికి సమకూరే ప్రయోజనాలేమిటో తెలుసుకోవచ్చు. వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల మాదిరిగానే పాత్రికేయులకు కూడా సంఘాలున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల కోసం, కార్మికుల కోసం ప్రభుత్వం, ఆయా సంస్థలు వేతన సంఘాలకు నియమించినట్టే ప్రభుత్వం పాత్రికేయుల కోసం కూడా వేతన బోర్డులను నియమిస్తుంది. వాటి గురించి తెలుసుకుందాం.

## 33.2 వర్కింగ్ జర్నలిస్టుల చట్టం

వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యోగ స్థితిగతులను మెరుగుపరచడానికి మొదటి ప్రెస్ కమిషన్‌సిఫార్సుల మేరకు 1955లో చేసిన సంక్షేమ చట్టం ఇది. చట్టం రాకపూర్వం జర్నలిస్టుల పనిగంటల విషయంలో కాని నియామకాలు, తొలగింపులు, సెలవులు, జీతభత్యాల విషయంలోకాని ఓ క్రమపద్ధతి ఉండేదికాదు. ఈచట్టం అమలులోకి వచ్చాక ఇవన్నీ క్రమబద్ధమైనాయి. దేశంలో మొట్టమొదటిసారి శ్రమజీవన పత్రికా రచయిత (వర్కింగ్ జర్నలిస్టు) అనే పదబంధం వాడుకలోకి వచ్చింది. అలా అంటే

ఎవరో ఈచట్టం సమగ్రమైన నిర్వచనం చెప్పింది. సెక్షన్ 92 (ఎఫ్)లోగల ఆ నిర్వచనం మేరకు శ్రమజీవన పత్రికా రచయిత అంటే ప్రధాన వ్యాపకం పత్రికా రచనగా గలిగి ఒక వార్తా పత్రికా సంస్థలోగాని దానికి సంబంధించి గాని నియమితుడైన వ్యక్తి. ఆయన సంపాదకుడు, సంపాదకీయ లేఖకుడు, న్యూస్ ఎడిటర్, సబ్ ఎడిటర్. ఫీచర్ రైటర్. కాపీ రైటర్. రిపోర్టర్, కరస్పాండెంట్ కార్టూనిస్టు, న్యూస్ ఫోటోగ్రాఫర్, ప్రూఫ్‌రీడర్ కావచ్చు. కానీ ప్రధానంగా నిర్వహణ లేదా యాజమాన్య బాధ్యతలునిర్వహించే వ్యక్తి కాకూడదు.

ఈ నిర్వచనం ప్రకారం అంశకాలిక పద్ధతిపై పనిచేసే గ్రామీణ విలేకరులు కూడా ప్రధాన వ్యాపకం పత్రికా రచన అయితే శ్రమజీవన (working) పత్రికా రచయితలుగా పరిగణింపబడతారని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ప్రధాన వ్యాపకానికి ఆదాయం ప్రాతిపదిక కాదు.

ఈ చట్టంలో నిర్దేశించని అంశాల విషయంలో పత్రికా రచయితలకు పారిశ్రామిక వివాదాల చట్ట నిబంధనలు వర్తిస్తాయని సెక్షన్ 3 ప్రకటిస్తున్నది. ఈ సెక్షన్ ప్రకారం రిట్రెంచ్‌మెంట్ అవసరమైనప్పుడు సంపాదకునికైతే ఆరునెలల నోటీసు. ఇతర జర్నలిస్టులకు మూడు నెలల నోటీసు ఇవ్వాల్సి వుంటుంది.

సెక్షన్ 5 పత్రికా రచయితలకు గ్రాట్యుటీ ఇవ్వాలని నిర్దేశిస్తున్నది. ఏదేని సంస్థలో పనిచేసి రిటైరైన లేదా పనిచేస్తూ మరణించిన అర్ధ సంవత్సరానికి మించి సర్వీసుకు ఆయన చివరకు పొందిన జీతం ప్రకారం 15 రోజుల జీతం చొప్పున లెక్కకట్టి గ్రాట్యుటీ చెల్లించాలి. అంతేగాక పదేళ్ళకు మించిన సర్వీసు కలిగిన పత్రికా రచయిత స్వచ్ఛందంగా రాజీనామా చేసినా అదే లెక్కన గ్రాట్యుటీ చెల్లించాలి. పత్రికా రచన సత్యనిష్ఠతో చేయవలసిన పని. ఒక్కోసారి యజమానుల ప్రయోజనాలకూ సత్యనిష్ఠకూమధ్య పత్రికా రచయిత నలిగిపోయే పరిస్థితి రావచ్చు. అలా మానసిన క్షోభకుగురై అకారణంగా రాజీనామా చేసిన పత్రికా రచయితకు కనీస సర్వీసు మూడేళ్ళు వుంటేచాలు. గ్రాట్యుటీ చెల్లించాలని ఈ సెక్షన్ నిర్దేశిస్తున్నది.

సెక్షన్ 6 పత్రికా రచయిత పనిగంటలను నిర్ణయించింది. దీని ప్రకారం పత్రికా రచయిత పగటి షిప్టులో ఆరు గంటలు. రాత్రి షిఫ్టులోనైతే అయిదున్నగంటలు పని చేయవలసి వుంటుంది.

సెక్షన్ 7 పండుగ సెలవులు, ఆకస్మిక సెలవులు గాక ప్రతీ పత్రికా రచయితకు ప్రతి యేడూ డ్యూటులోగడిపిన గడువులో పదకొండో వంతు చొప్పున ఆర్జిత సెలవు, అలాగే పద్దెనిమిదో వంతుకు తగ్గకుండా నగం వేతనంపై అనారోగ్య సెలవు ఇవ్వాలని నిర్దేశిస్తున్నది.

సెక్షన్ 8 పత్రికా రచయితల వేతన స్కేళ్ళ నిర్ణయానికి సంబంధించింది.

సెక్షన్ 9వ వేతన బోర్డు నియామకానికి సంబంధించింది. పత్రికా రచయితల వేతన స్కేళ్ళు నిర్ణయించడానికి ప్రభుత్వం అవసరమనుకున్నప్పుడల్లా త్రైపాక్షిక వేతన బోర్డును నియమించడానికి ఈ సెక్షన్ వీలు కల్పిస్తుంది. వేతన మండలిలో పత్రికా సంస్థల ప్రతినిధులు ఇద్దరు, పత్రికా రచయితల ప్రతినిధులు ఇద్దరు, స్వతంత్ర వ్యక్తులు ఇద్దరు వుంటారు. దీని అధ్యక్షుడిగాహైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన లేదా చేస్తున్న వ్యక్తి వుంటారు. ఈ మండలి సిఫార్సులు అనుసరించి ప్రభుత్వం వేతనాలు నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తుంది. 1970లో తెచ్చిన ఒకసవరణ ద్వారా వేతన నిర్ణాయక మండలికి సంబంధించి ఈ చట్టంలోని నిబంధనలు జర్నలిస్టేతర పత్రికా సిబ్బందికికూడా వర్తింపజేశారు.

సెక్షన్ 17 పత్రికా రచయితలకు రావలసిన బాకీలను ప్రభుత్వం భూమిశిస్తు మాదిరిగా శాసన నిబంధన ప్రయోగించి వసూలు చేసి ఇవ్వాలని నిర్దేశిస్తున్నది. ఈ విధంగా ఈచట్టం పత్రికా రచయితల పాలిట కల్పవృక్షంగా మన్నన పొందింది.

BRAOU

**అభ్యాసం - 1 : వర్కింగ్ జర్నలిస్టుల చట్టం ప్రాధాన్యాన్ని రాయండి.**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 33.3 ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐ.ఎఫ్.డబ్ల్యు.జె)

ఐ.ఎఫ్.డబ్ల్యు.జె. దేశంలోని శ్రమజీవి పత్రికా రచయితల సంఘాల సమాఖ్య పత్రికా రచయితల యూనియన్లన్నీ ట్రేడ్ యూనియన్ యాక్ట్‌కింద రిజిస్టరై వుంటాయి. ఇలాంటి సంఘాలు దేశమంతటా స్వాతంత్ర్యానికి ముందు నుంచే వుండేవి. 1950లో అక్టోబర్ 28వ ఎం. చలపతిరావు గారి కృషితో అవన్నీ కలిసి ఈ సమాఖ్యను ఏర్పరచుకున్నవి. దీని కృషి ఫలితంగానే మొదటి ప్రెస్ కమిషన్ 1952లో ఏర్పాటైంది. అది పత్రికా రంగాన్ని క్రమబద్ధం చేయడానికి, ఉద్యోగుల స్థితిగతులు మెరుగుపరచడానికి జర్నలిస్టుల వేతన మండలులలో ఈ సమాఖ్య ప్రతినిధులు నామినేట్ అయి పత్రికా రచయితల ప్రయోజనాలు కాపాడుతుంటారు. దీని నాయకులలో భేదాభిప్రాయాలేర్పడి ఈ మధ్య నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఇండియన్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అనే రెండు కొత్త జాతీయస్థాయి సంఘాలు ఏర్పడ్డాయి.

మన రాష్ట్రంలో రాష్ట్రస్థాయిలో కార్మిక సంఘాల చట్టం కింద నమోదైన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ఉంది.

## 33.4 వేతన బోర్డులు

కార్మికులందరికీ న్యాయమైన వేతనం లభించేట్టు చూడటం జాతీయ లక్ష్యంగా రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలలో 43వ అధికరణ ద్వారా నిర్ణయించుకున్నాం. పాత్రికేయ సమాఖ్య కోరిక మేరకు వర్కింగ్ జర్నలిస్టుల చట్టంలో ఈ లక్ష్యసాధన కోసం 12వ సెక్షన్ ద్వారా అవసరమైనప్పుడల్లా వేతన బోర్డు నియామకానికి ఏర్పాటు జరిగింది. ఈ వేతనబోర్డు త్రైపాక్షికమండలిగా వుంటుంది. ఇద్దరు జర్నలిస్టుల ప్రతినిధులు, ఇద్దరు యాజమాన్యాల ప్రతినిధులు, ముగ్గురు స్వతంత్ర సభ్యులలో ఒకరు ఏదేని హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన లేదా చేస్తున్న వ్యక్తి ఉంటారు. న్యాయమూర్తి దీనికి ఛైర్మన్‌గా నియమితుడవుతారు.

1956లో బొంబాయి హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సి.హెచ్.వి. దివేతియా అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల కోసం మొట్టమొదటి చట్టబద్ధమైన వేతన బోర్డును నియమించింది. ఈ బోర్డు 1957లో నివేదిక సమర్పించింది. పత్రికా సంస్థల ఆర్థిక స్థోమతను పరిగణనలోకి తీసుకోకుండా స్కేళ్ళు నిర్ణయించిందంటూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికాధిపతులు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. కోర్టు వారికి అనుకూలంగా తీర్పు చెప్పింది. దానితో 1958 జూన్ 14న రాష్ట్రపతి ఒక ఆర్డినెన్సు ద్వారా వేతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ 1959లో నివేదిక సమర్పించింది. దాన్ని ప్రభుత్వం ఆమోదించి అమలుపరిచింది. జర్నలిస్టులకు క్రమ పద్ధతిలో వేతన స్కేళ్ళు తొలిసారిగా అలా అమలులోకి వచ్చాయి.

BRAOU

ఆ తర్వాత 1963లో న్యాయమూర్తి జి.కె.షిండే అధ్యక్షతన రెండో వేతన బోర్డు ఏర్పాటైంది. ఆ బోర్డు 1967లో నివేదిక సమర్పించింది. 1975లో న్యాయమూర్తి డి.జి.పాలేకర్ అధ్యక్షతన మూడవ వేతన బోర్డు ఏర్పడింది. ఈ బోర్డు 1976లో జర్నలిస్టులకు తాత్కాలిక సహాయం ఇవ్వవలసిందిగా సిఫార్సు చేసింది. దానితో యజమానుల ప్రతినిధులు బోర్డును బహిష్కరించారు. విధిలేక ప్రభుత్వ బోర్డును ట్రిబ్యునల్‌గా మార్చింది. 1980లో ట్రిబ్యునల్ నివేదిక సమర్పించింది. పాలేకర్ పత్రికల స్థూల ఆదాయాన్ని నిర్ణయించే సూత్రాన్ని విప్లవాత్మకంగా మార్చారు. ముందు గ్రూపులు, చెయిన్లు, మల్టిపుల్ యూనిట్లు అనే వర్గీకరణ వుండేది. పాలేకర్ దాన్ని రద్దుచేసి ఒక యజమాన్యం కింద వుండే అన్ని పత్రికలను కలిపి స్థూల ఆదాయం నిర్ణయించాలన్నారు. దీన్ని కూడా పలు పత్రికలు కోర్టులో సవాలు చేశాయి. కానీ చివరకు ఈ సూత్రాన్ని సుప్రీంకోర్టు ధ్రువపరిచింది. గ్రామీణ ప్రాంతపు అంశకాలిక విలేకరులకు స్టాఫ్ విలేకరికి ఇచ్చే వేతనంలోమూడో వంతు జీతం ఇవ్వాలని కూడా ఈ బోర్డు సిఫార్సు చేసింది. కాని ఏ పత్రికా దీన్ని అమలు పరచలేదు.

1985లో బచావత్ వేతన బోర్డు ఏర్పాటైంది. ఇది 1988లో తాతాల్కిక ప్రతిపాదనలను ప్రకటించింది. దీనిపై కూడా పత్రికా యజమానులు కోర్టుకు వెళ్ళారు. చివరకు సుప్రీంకోర్టు స్థానికంగా సిబ్బందితో కుదుర్చుకున్న రాజీ, ఒప్పందాలకు లోబడి దీని సిఫారసులను 1988 జనవరి ఒకటో తేదీ నుంచి అమలు జరపాలని తీర్పు చెప్పింది. చాలా పత్రికలు బచావత్ వేతన బోర్డు సిఫారసులను ఇంకా అమలుపరచవలసి వుంది.

ఈలోగా అస్సాం హైకోర్టు మాజీ న్యాయమూర్తి రాజ్‌కుమార్‌మనిసనసింగ్ అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వం మరో వేతన బోర్డును ఏర్పాటు చేసింది.

**అభ్యాసం - 2 : జర్నలిస్టుల వేతన స్కేళ్లను నిర్ధారించే వేతన బోర్డుల నియమాకాన్ని ప్రస్తావించండి?**

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

..........................................................................................................................................................

## 33.5 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

★ వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యోగ స్థితిగతులను మెరుగు పరచడానికి 1955లో చేసిన సంక్షేమ చట్టం వర్కింగ్ జర్నలిస్టుల చట్టం.

★ వర్కింగ్ జర్నలిస్టులకు సంబంధించిన పనిగంటలు, సెలవులు, వేతన స్కేళ్లు, వేతన బోర్డుల ఏర్పాటు వంటి పలు సంక్షేమ చర్యలు ఈ చట్టంలో ఉన్నాయి.

★ పత్రికా రచయితల యూనియన్లు ట్రేడ్‌యూనియన్ యాక్టు కింద నమోదు కాబడి ఉంటాయి. ఐ.ఎఫ్. డబ్ల్యు.జె. దేశంలోని పత్రికా రచయితల సంఘాల సమాఖ్య. ఈ సమాఖ్య రెండుగా చీలి కొత్త జాతీయ సంఘాలు ఇటీవలే ఏర్పడ్డాయి.

★ 1956నుంచి 1985 దాకా వివిధ వేతన బోర్డుల జర్నలిస్టుల వేతన స్కేళ్లను సిఫార్సు చేశాయి. ప్రస్తుతం 1996లో నియమించిన వేతన బోర్డు జర్నలిస్టుల వేతన స్కేళ్ల నిర్ధారణను పరిశీలిస్తోంది.

BRAOU

## 33.6 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. 1955 సంవత్సరపు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పత్రికా రచయితల పాలిటి కల్పవృక్షంగా అభివర్ణించడానికి కారణమేమిటి?

2. జర్నలిస్టుల యూనియన్ల గురించి వివరంగా రాయండి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. వేతన బోర్డులు

2. వర్కింగ్ జర్నలిస్టు

***- జి.ఎస్. వరదాచారి***

BRAOU

# భాగం - 34 : పాత్రికేయులు - నైతిక విలువలు

## విషయక్రమం

34.0 ఉద్దేశం

34.1 ప్రవేశిక

34.2 నైతిక విలువల ఆవశ్యకత

34.3 మొదటి ప్రెస్ కమిషన్ సూచనలు

34.4 స్వచ్ఛంద నియమావళి వైపు మొగ్గు

34.4.1 వార్తల నిజానిజాలు తెలుసుకోకపోవడం

34.5 మత విద్వేషాలు రెచ్చగొట్టే వార్తలు

34.6 సమాధానమిచ్చే హక్కు

34.7 పరువునష్టం కలిగించే లేదా అశ్లీలపు రాతలు

34.8 పాత్రికేయ అనౌచిత్యం

34.9 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

34.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

## 34.0 ఉద్దేశం

ఈ పాఠ్యాంశం చదివిన తరువాత

- పత్రికా రచయితలకు నైతిక విలువల ఆవశ్యకత
- నైతిక విలువలకు సంబంధించి ప్రెస్ కమిషన్ సూచనలు
- పత్రికా మండలి సూచనలు తెలుసుకుంటారు.

## 34.1 ప్రవేశిక

పత్రికలు, ప్రసారసాధనాలు ప్రజాభిప్రాయాన్ని సృష్టించి, మలిచే ప్రభావశీల సాధనాలు. అవి ప్రజా ప్రయోజనాలను కాపాడుతాయని ప్రజల నమ్మకం. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పనిచేయవలసిన బాధ్యత పత్రికా రచయితలపై ఉంది. ఈ బాధ్యతా నిర్వహణలో పలుసార్లు పరస్పర విరుద్ధ ప్రయోజనాల కోసం పాటుపడే వ్యక్తులు, వర్గాల గురించి రాయవలసి వస్తుంది. అలాంటి సంకట పరిస్థితిలో పత్రికా రచయితలు ఎలా మెలగాలి? అన్నది తెలుసుకుందాం.

BRAOU

## 34.2 నైతిక విలువల అవశ్యకత

ప్రజాభిప్రాయాన్ని సృష్టించి మలిచే శక్తివంతమైన పత్రికలు, ప్రసారసాధనాల్లో పనిచేసే జర్నలిస్టులకు నైతిక విలువలు లేనట్టయితే ప్రజాభిప్రాయాన్ని వారు తమ రాతలో ప్రతిబింబించలేరు. నైతిక విలువల్లేని పాత్రికేయులు ప్రజాభిప్రాయాన్ని తప్పుదారి కూడా పట్టించవచ్చు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు రాయడం ద్వారా తమ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకునే అవకాశముంది. సమాజంలోని ఏ ఇతరుల కన్నా పాత్రికేయులకు నైతిక విలువలు ఎక్కువ అవసరం. విలువలకు సంబంధించి చట్టాలు స్పష్టంగా విధివిధానాలను పేర్కొన్నంతవరకు సమస్యే లేదు. కాని చట్ట పరిధికి అందని సందర్భాలలోకూడా పత్రికా రచయిత ధర్మపక్షాన్ని వహించవలసిన బాధ్యత వుంది. పాత్రికేయులు స్వచ్ఛందంగానే కొన్ని నైతిక సూత్రాలను పాటించడానికి ఇష్టపడతారు. అయితే ధర్మసందేహం తలెత్తినప్పుడల్లా మార్గదర్శనం కోసం పూర్వ దృష్టాంతాలను వెతుకుతారు. కాలక్రమేణా లిఖిత, అలిఖిత నియమావళి ఒకటి రూపొందుతూ వస్తున్నది.

డాక్టర్లు, న్యాయవాదులకు వలెనే పత్రికా రచయితలకు ఒక లిఖిత నైతిక నియమావళి ఉంటే మంచిదని చాలా మంది భావిస్తూ వచ్చారు. 1954లో నివేదిక సమర్పించిన మొదటి ప్రెస్ కమిషన్ కూడా పత్రికా మండలిని ఏర్పాటుచేయాలని సిఫార్సు చేస్తూ ఆ పత్రికా మండలితన ప్రథమ కర్తవ్యంగా పత్రికా రచయితలకు నైతిక నియమావళిని రూపొందించాలని సూచించింది. అంతేకాదు, అఖిల భారత పత్రికా సంపాదకుల మహాసభ, వర్కింగ్ జర్నలిస్టుల భారతీయ సమాఖ్య ఇదివరకే రూపొందించిన నియమావళులను ప్రశంసిస్తూ మండలి రూపొందించబోయే నియమావళిలో ఈ కింది అంశాలను చేర్చాలని కూడా సూచించింది.

## 34.3 మొదటి ప్రెస్ కమిషన్ సూచనలు

BRAOU

1. పత్రికా రచన ప్రజాభిప్రాయాన్ని మలిచే శక్తిగల సాధనం గనుక జర్నలిస్టులు తమ వృత్తిని ధర్మసంబంధమైనదిగా భావించి ఎల్లప్పుడూ ప్రజా ప్రయోజనాల రక్షణకు పాటుపడటానికి సుముఖంగానూ సిద్ధంగానూవుండాలి.

2. పత్రికా రచయితలు తమ బాధ్యతల నిర్వహణలో మానవ హక్కులకు, సామాజిక హక్కులకు తగు విలువ ఇవ్వాలి. వార్తా రచనలో వ్యాఖ్యల రచనలో సదుద్దేశంతో సబబుగా వ్యవహరించడం తనవృత్తి పరమైన బాధ్యతగా భావించాలి.

3. యదార్థ సమాచార సేకరణ ప్రచురణ హక్కును సవ్యమైన వ్యాఖ్యను, విమర్శచేసే హక్కునూ ఎల్లప్పుడూ కాపాడాలి.

4. హింసకు దారితీసేవీలున్న ఉద్రిక్తతలను రెచ్చగొట్టే వార్తలను రాసేటప్పుడు జర్నలిస్టులు నిగ్రహాన్ని పాటించాలి.

5. పత్రికా రచయితలు తాము అందిస్తున్న సమాచారం సరైందిగా వుండేట్టు జాగ్రత్త వహించాలి. యదార్థాన్ని వక్రీకరించకూడదు. అవసరమైన ఏసమాచారాన్నీ దాచకూడదు. అబద్ధమని లేదానిజం కాదని తెలిసిన ఏ సమాచారాన్నీ ప్రచురించకూడదు.

6. ప్రతి వార్తకూ, వ్యాఖ్యకూ బాధ్యత వహించాలి. అలా బాధ్యత వహించదలచనట్టయితే ఆ విషయం ముందే స్పష్టంగా తెలియపరచాలి.

7. ధృవపడని వార్తలను గుర్తించి వాటిని అలాగే చెప్పాలి.

8. సమాచారం అందించిన వారి నమ్మకాన్ని భంగపరచరాదు. వృత్తిపరమైన రహస్యాల్ని భద్రపరచాలి.

9. విధి నిర్వహణలో వ్యక్తిగత ప్రయోజనాల ప్రభావం ఉండకూడదు.

10. ప్రచురితమైన తర్వాత ఏసమాచారమైనా సరైంది కాదని తెలిస్తే వెంటనే స్వచ్ఛందంగా దాన్ని సవరించాలి. అలాంటి సమాచారం ఆధారంగా చేసిన వ్యాఖ్యలను సరిదిద్దాలి.

11. వార్తలు సేకరించి, రాసి ప్రచురించే వారందరూ తమ వృత్తి గౌరవాన్ని కాపాడాలి. ఆగౌరవానికి తగ్గపనులనే అంగీకరించాలి.

12. వార్తలు ప్రచురించడానికో లేదా ప్రచురించకుండా వుండటానికో లంచం అడగడం తీసుకోవడం లేదా ప్రలోభాలకు లొంగడం నీచాతినీచం.

13. ప్రజాహితంతో సంబంధం లేని వ్యక్తిగత వివాదాలపై పత్రికలో వాదోపవాదాలు లేవదీయడం వృత్తి ధర్మానికీ గౌరవానికీ విరుద్ధం.

14. వ్యక్తుల వ్యక్తిగత జీవితాన్ని గురించి పుకార్లు, గాలికబుర్లకు ప్రచారమివ్వడం వృత్తి ధర్మానికి విరుద్ధం. ధ్రువపడినా అంతరంగిక వార్తలను ప్రజాహితంతో సంబంధం లేనప్పుడు ప్రచురించడం తగదు.

15. అపవాదులను అనిర్ధారిత ఆరోపణలను ప్రచారం చేయడం వృత్తిపరమైన నేరం.

16. సమాచార చౌర్యం కూడా వృత్తిపరమైన నేరమే.

17. చాయాచిత్రాలు తీసేటప్పుడు విలేకరులు ప్రెస్ ఫోటోగ్రాఫర్లూ అమాయకులై బాధిత కుటుంబాలవారికి అవమానమూ అవేదనా కలిగించకుండా జాగ్రత్త, వహించాలి.

అభ్యాసం - 1 : పత్రికా రచయితల విషయం మీకు ప్రధానమనిపించిన నాలుగు నైతిక విలువలను - ప్రెస్‌కమీషన్ సూచననుండి ఎంపిక చేయండి.

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

.................................................................................................................................

BRAOU

## 34.4 స్వచ్ఛంద నియమావళి వైపు మొగ్గు

భారతీయ పత్రికా మండలి తొలిసమావేశం (1966) లోనే పత్రికలకు ప్రవర్తనా నియమావళి గురించి ప్రెస్ కమిషన్ చేసిన సూచనను పరిశీలించింది. ఒక సమగ్ర నైతిక నియమావళిని రూపొందించడం ఆ దశలోసాధ్యమూ కాదు, అలాంటి అవసరమూ లేదన్న నిర్ణయానికి వచ్చింది. పత్రికా రచయితలే స్వచ్ఛంద నియమావళిని రూపొందించుకుంటారన్న విశ్వాసాన్ని ప్రకటించింది. తర్వాత వచ్చిన పత్రికా మండలి ఛైర్మన్లు కూడా పత్రికా రచయితలే స్వచ్ఛంద నియమావళిని రూపొందించుకోవడం వాంఛనీయమన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. రెండవ ఛైర్మన్ ఎ.ఎన్.సేన్ ఒకడుగు ముందుకు వెళ్ళి నైతిక సూత్రావళిని బయటి వారు రూపొందించడం పత్రికా స్వేచ్ఛకు భంగకరమని కూడా ప్రకటించారు. దేశీయ పత్రికలు మొత్తం మీద సంయమనంతోనే వ్యవహరిస్తున్నాయనీ. ఎక్కడో ఒక పత్రిక సంచలన సృష్టికి పాల్పడినా స్వచ్ఛంద క్రమశిక్షణే దానికి విరుగుడని అభిప్రాయపడ్డారు.

అయితే పదేపదే నైతిక సూత్రాలను ఉల్లంఘించే పత్రికలను దారిలో పెట్టడానికి మందలింపును మించిన శిక్ష ఏదైనా వుండాలన్న ఆలోచన అసలు రాకుండా పోలేదు. మూడుసార్లు మండలి మందలింపులకు గురైన పత్రికలకు అడ్వర్టయిజ్‌మెంట్లు, తపాల సౌకర్యాలూ నిలిపివేయాలన్న ప్రతిపాదన కూడా పరిశీలనకు వచ్చింది. కాని చివరకు అలాంటి చర్య వాంఛనీయం కాదని భావించడం జరిగింది. పత్రికా మండలి ప్రత్యక్షంగా నైతిక సూత్రాలంటూ రూపొందించకపోయినా తన

పరిశీలనకూ తీర్పునకూ వచ్చిన అనేక కేసులలో ఇచ్చిన రూలింగ్‌లను క్రోడీకరిస్తే. అవే అవశ్యం ఆచరణీయమై నియమావళిగా రూపొందుతాయి. అలాంటి సూత్రాలను విషయపరంగా వేర్వేరు ప్రకరణాలలో విభజించి అధ్యయనం చేయవచ్చు. పత్రికా రచయితల సౌలభ్యం కొసం పత్రికా మండలే వాటిని సంపుటీకరించి అందించింది.

### 34.4.1 వార్తల నిజానిజాలు తెలుసుకోకపోవడం

వార్తల నిజానిజాలను తెలుసుకోవడానికి సంబంధించి పాటించవలసిన సూత్రాలను పత్రికా మండలి పలు తీర్పులలో ఇచ్చిన రూలింగ్‌ల ఆధారంగా ఈకింది విధంగా రూపొందించడం జరిగింది.

1. ప్రచురణకు ముందు వార్త ముఖ్యంగా ఉద్రిక్త తెలుసుకోవడం తప్పనిసరి. ముఖ్యంగా ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పుడు ఆ ఉద్రిక్తతను మరింత రెచ్చగొట్టే అవకాశమున్న వార్తలను వ్యాఖ్యలను రాసే ముందు నిజానిజాలను కచ్చితంగా నిర్ధారించుకోవడం పత్రికా రచయిత విధి.

2. ఒక వ్యక్తినిగాని, సంస్థనుగాని అప్రతిష్ఠపాలుజేసే వార్త రాసేముందు విలేకరి. ప్రచురించే ముందు సంపాదకుడూ అది నిజమైందేనని నిర్ధారించుకోవాలి. అభిజ్ఞవర్గాల ద్వారానో, సన్నిహిత వర్గాల ద్వారానో తెలిసిందన్న అస్పష్టవాదం ఏమాత్రం సమర్థనీయం కాదు.

3. అధీకృత విలేకరులుపంపే ప్రతి వార్తానూ సంపాదకుడు నిజమా, కాదా అని మరోసారి ప్రయత్నించి తెలుసుకునే అవకాశం వుండదు గనుక, పొరపాటు దొర్లకుండా జాగ్రత్త పడుతూనే ఒకవేళ ఎప్పుడైనా పొరపాటు జరిగితే నిర్నిబంధంగా దానిపైన సవరణ ప్రచురించి విచారాన్ని వ్యక్తపరచాలి.

4. గౌరవనీయులైన వ్యక్తులే తగినంత ఆధారం వున్న దనిపించే విధంగా అందించిన సమాచారం సరైంది కాదని వార్త ప్రచురణ అనంతరం తెలితే సంపాదకుడిని దోషిగా పరిగణించడానికి వీలులేదు. వార్త ప్రచురణ సమయంలో ఉన్న పరిస్థితులేమిటన్నదే పరిశీలించదగిన అంశం. దర్యాప్తు సంఘాలు. న్యాయ విచారణ సంఘాలు చేసే పని పత్రికా సంపాదకుడు చేయజాలరు. కనుక నైతిక సూత్రాల ఉల్లంఘన దోషం అలాంటి సందర్భాలలో అతనికి అంటదు.

5. ఊరంతా అనుకుంటున్నా కేవలం పుకారు ఆధారంగా వార్తను ప్రచురించడం సమర్థనీయం కాదు. అది నిజమా. కాదా అని స్వతంత్రంగా విచారించి నిర్ధారణ చేసుకోవాలి.

6. ప్రముఖ వ్యక్తులు పత్రికా గోష్ఠులను ఏర్పాటు చేసికొని, పత్రికా ప్రకటనల రూపంలో కాని వివాదాస్పద ప్రకటనలు చేసినప్పుడు వాటిని ప్రచురించే హక్కు పత్రికలకు ఉంది. వాటి నిజానిజాలను స్వతంత్రంగా నిర్ధారించుకోవలసిన బాధ్యత పత్రికా రచయితపై మోపడం కుదరదు.

7. ప్రసంగ ధోరణిలో ఎవరో చేసిన ఒక వ్యాఖ్యను సందర్భం నుంచి విడదీసి, అత్యధిక ప్రాముఖ్యమిచ్చి అపార్థం కలిగించే విధంగా ప్రచురించడం తగదు.

**అభ్యాసం - 2 : స్వచ్ఛంద నియమావళివైపు మొగ్గును వివరించండి.**

......................................................................................................

......................................................................................................

......................................................................................................

......................................................................................................

......................................................................................................

BRAOU

## 34.5 మత విద్వేషాలు రెచ్చగొట్టే వార్తలు

రెండున్నర దశాబ్దాల కాలంలో పత్రికా మండలి పరిశీలించి చెప్పిన తీర్పుల ఆధారంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే అవకాశమున్న వార్తలు ప్రచురించేటప్పుడు పత్రికా రచయితలు పాటించవలసిన సూత్రాలను ఈ విధంగా రూపొందించడం జరిగింది.

1. ఒక సామాన్య నేరాన్ని ఒకవర్గం వారు మరో వర్గం వారిపై పనిగట్టుకుని జరుపుతున్న అత్యాచారంగా చిత్రీకరించి, ఆ వర్గంవారినీ, వారికి పత్తాసు పలుకుతున్నదని రాష్ట్రప్రభుత్వాన్నీ విమర్శించడం తగదు. పత్రికా రచయితకు విమర్శించే హక్కు, వ్యాఖ్యానించే హక్కువుందని అంగీకరించినా మత సామరస్యాన్ని కాపాడవలసిన బాధ్యత కూడా వున్నందున వాంఛనీయం కాదు.

2. ఒక వర్గంవారికి జరుగుతున్న అన్యాయాన్ని వెలుగులోకి తేవడం పత్రికా రచయిత న్యాయమైన విధే అయినప్పటికీ కల్పనలు, అతిశయోక్తులు రాయడంద్వారా అన్యాయాన్ని చక్కదిద్దడానికి యత్నిస్తున్నామనడం సమర్థనీయం కాజాలదు. జరిగిన సంఘటనలనే భయోత్పాతం కలిగించే విధంగా చిత్రీకరించడం, సంచలనాత్మకమైన శీర్షికల ద్వారా జనంలో అభద్రతా భావం శాంతి భద్రతలు కాపాడే యంత్రాంగంపై అవిశ్వాసం కల్పించడం ఖండించదగిన విషయం.

3. మతపరమైన అంశాలను ఆధారం చేసుకున్నవే అయినా కార్టూన్లు సరదాకోసం ఉద్దేశించినవి గనుక అందరూ వాటిని విశాల దృష్టితో స్వీకరించాలి.

4. పత్రికా రచయిత పాత్రికేయ అనౌచిత్యానికి పాల్పడ్డాడా అనే విషయం ఆయన రచనలు ఏ అంశాలపై ఆధారపడి జరిగాయో అవి వాస్తవాలా, కాదా అన్న దానిపై ఆధారపడి వుంటుంది.

5. వాక్‌స్వాతంత్ర్యంలో భిన్నాభిప్రాయ ప్రకటనలో ప్రభుత్వ వ్యతిరేక ప్రకటనలు చేయడం అంతర్భాగమే అయినా పరుషభాష వాడటం, ప్రస్తుత విషయాలతో సంబంధం లేని వ్యక్తిగత దూషణలకు పాల్పడటం వాంఛనీయం కాదు.

6. విమర్శలో వ్యంగ్యోక్తులు, వక్రోక్తులూ భాగమే అయినా వాటిని ఎగతాళి కిందకు, అశ్లీల వ్యాఖ్యల కిందకు దిగజార్చడం వాంఛనీయం కాదు.

7. ఏదేని మత సంస్థ, సాగిస్తున్న అవాంఛనీయ కార్యకలాపాలను విమర్శించడం. దానిపై చర్యతీసుకోవాలని ప్రభుత్వాన్ని అర్థించడం మత విద్వేషాన్ని రెచ్చగొట్టడం కిందికి రాదు.

8. ఆధునికతను వ్యతిరేకిస్తూ ప్రాచీన సంప్రదాయాలనే పాటించాలని బోధిస్తూ రాసినంత మాత్రాన నైతిక సూత్రాల ఉల్లంఘన కాదు.

9. ఒక మత వర్గాన్ని దేశద్రోహులుగా చిత్రించడం సబబు కాదు.

10. రాసిన రాతలు చట్టవిరుద్ధమైనవైతే అవి నైతిక సూత్రాలకు విరుద్ధమైనవిగా కూడా భావించబడతాయి.

11. గత కాలపు తప్పులను మళ్ళీ చేయవద్దని చెప్పడం కొందరికి నచ్చనివైనా చారిత్రక సత్యాలను తిరిగి ఉల్లేఖించడం నైతిక సూత్రాలకు విరుద్ధంకాదు.

12. పుకార్లపై ఆధారపడిన వార్తలు ఎలా అవాంఛనీయమో, పూర్తి వివరాలను అందించకుండా తొక్కిపెట్టడం కూడా అంతే ఆక్షేపణీయం.

13. ఏ మత వర్గం వారి లోపాలనైనా అబద్ధాలు, అతిశయోక్తులకు పాల్పడకుండా నిగ్రహపూరితంగా విమర్శించడం నైతిక సూత్రాల ఉల్లంఘనగా పరిగణింపబడదు.

BRAOU

**అభ్యాసం - 3 : మత విద్వేషాల వార్తలను రాసేటప్పుడు పరిగణించదగ్గ ప్రధానమైన సూచనలేవి?**

........................................................................................................................................................

........................................................................................................................................................

........................................................................................................................................................

........................................................................................................................................................

........................................................................................................................................................

## 34.6 సమాధానమిచ్చే హక్కు

పత్రికలలో వచ్చిన రాతలవల్ల బాధితులైన వ్యక్తులకు సమాధానమిచ్చే హక్కువుంది. వార్తలు, వ్యాఖ్యల ప్రచురణలో పత్రికలు పూర్తి జాగ్రత్త వహిస్తూనే ఎప్పుడైనా పొరపాట్లు దొర్లితే ఆ విషయం తెలియగానే సవరణలు వేయడంతో పాటు బాధితుల సమాధానాలను ప్రకటించడం కూడా నైతిక బాధ్యత. విషయం తీవ్ర పరిణామాలకు దారితీసేదిగా వున్నప్పుడు కేవలం ఖండనను ప్రచురించడమే గాకుండా సంపాదకుడు విచారాన్ని కూడా వ్యక్తపరచాలని పత్రికా మండలి కొన్ని కేసులలో ఆదేశించింది.

1. అనిర్ధారిత వార్తను ఆధారంగా చేసుకుని రాసిన వ్యాఖ్యలు, సంపాదకీయాల పట్ల పత్రికా మండలి తీవ్రవైఖరిని అవలంబించింది. ఒక వార్త ప్రజాశ్రేయస్సుకు సంబంధించినదని అనిపించినప్పుడు వెంటనే ప్రచురించడం కొంత సదుద్దేశనీయం కావచ్చునేమో కాని, అది పూర్తిగా నిజమని నిర్ధారణ కాకుండా దానిపై వ్యాఖ్యలూ, సంపాదకీయాలు రాసేయడం అంత అవసరమేమీ కాదని మండలి అభిప్రాయపడింది. దానివల్ల ఒరిగే ప్రజాశ్రేయస్సేమీ వుండదని పేర్కొంది.

2. తప్పుడు వార్తపై ఆధారపడి వ్యాఖ్య చేసినప్పుడు ఆ విషయం తెలియగానే సవరణ వేయడంతోపాటు విచారాన్ని కూడా వ్యక్తపరచాలని మండలి రూలింగ్ ఇచ్చింది.

3. తప్పుడు వార్తపై ఆధారపడి వ్యాఖ్యలు ప్రచురితమైనప్పుడు బాధితులైన వ్యక్తులే కాక, ఏ పాఠకుడైనా తప్పును ఎత్తిచూపవచ్చని, అతని వాదనను ప్రచురించడం సంపాదకుని నైతిక బాధ్యత అని కూడా మండలి నిర్ణయించింది.

4. అయితే పొరపాటను ఎత్తిచూపుతూ వచ్చిన లేఖ నిందలతో పరువునష్టం కలిగించేదిగా వున్నప్పుడు దానిని ప్రచురించాల్సిన బాధ్యత సంపాదకుడిపై లేదు.

5. సవరణ లేదా ఖండన సవ్యంగా వుంటే మాత్రం దాన్ని వీలైనంత వేగిరంగా ప్రచురించాలి.

6. అలాంటి సవరణను లేదా ఖండనను సంపాదకుడు అవసరమనుకుంటే యథాతథంగానూ లేదా అసందర్భపు అంశాలను తొలగించే లేదా తన వ్యాఖ్యను జోడించే ప్రచురించవచ్చు. అలా చేయడంలో సమాధానపు మౌలిక స్వరూపాన్ని మాత్రం మార్చకూడదు. లేఖకుడి వాదనను తారుమారు చేయకూడదు.

7. సంపాదక లేఖల ప్రచురణ విషయంలో పాటించదగిన కొన్ని సూత్రాలను కూడా పత్రికా మండలి రూపొందించింది.

8. ఎ) లేఖల ప్రచురణ సంపాదకుడి ఇష్టాయిష్టాలమీద ఆధారపడి వుంటుంది. కాని ఆయన ఏకపక్షంగా కాక ఔచిత్యాన్ని పాటించి నిర్ణయం తీసుకోవాలి.

BRAOU

బి) ఒక అంశంపై ఒక వాదనను ప్రచురించినప్పుడు దానికి భిన్నమైన వాదనను ప్రకటించే అవకాశం కూడా ఇవ్వాలి.

సి) ఎవరేని వ్యక్తిపై విమర్శ ప్రచురితమైనప్పుడు ఆ వ్యక్తి సమాధానం పంపితే దాన్ని విధిగా ప్రచురించి ఆ వ్యక్తికి వున్న సమాధానమిచ్చే హక్కును గౌరవించాలి.

9. గ్రంథ సమీక్షలలో ప్రత్యక్షంగాగాని, అన్యాపదేశంగా గాని ఒక ప్రస్తావన వస్తే తన వైఖరిని స్పష్టపరుచుకునే అవకాశం బాధితునికి కల్పించాలి.

10. ఒక అంశంపై వాదోపవాదాలను ఎప్పుడు మానివేయాలో నిర్ణయించే హక్కు సంపాదకునిదే.

## 34.7 పరువునష్టం కలిగించే లేదా అశ్లీలపు రాతలు

పరువునష్టం కలిగించే రాతలు భారతీయ శిక్షాస్మృతికింద శిక్షార్హమైనవి. బాధుతులు సివిల్ దావా కూడా వేసి నష్ట పరిహారాన్ని రాబట్టుకోవచ్చు. ఆచట్టం కిందగాని, మరే చట్టం కిందగాని నేరంగా భావించబడే రాతలన్నీ నైతిక సూత్రాలకు విరుద్ధమైనవని ముందే ఒకసారి తెలుసుకున్నాం. ఈ శీర్షిక కింద చట్టపరిధిలోకిరాని అంశాలపై పత్రికా మండలి ఇచ్చిన రూలింగులను పరిశీలిద్దాం. ప్రజా నాయకుల పబ్లిక్ వ్యవహారాల మీద వ్యాఖ్యలు చేయడం తప్పుకాదు. అయితే వారి కుటుంబ జీవితాన్ని రచ్చకీడ్చరాదు. వారి ప్రవర్తనను ప్రకటనలను బట్టి పత్రికా రచయిత ఏవైనా నిర్ధారణలు చేసినట్టయితే అవిసహేతుకంగా ఉన్నంతవరకు పాత్రికేయ అనౌచిత్యం కిందికి రాదు.

బ్లాక్‌మెయిల్ ద్వారా డబ్బు సంపాదిద్దామన్న ఉద్దేశంతో పత్రికను ప్రారంభించే యత్నం విఫలమై పత్రికను మూసివేసిన ఒక సంపాదక యజమాని కేసు పత్రికామండలి పరిశీలన కోసం వచ్చింది. పత్రిక మూతపడ్డా సంపాదకుడు మందలింపునకు గురికావలసిందేనని తీర్పు చెప్పింది.

అమ్మకాలు పెంచుకోవడానికో, ఇతర విధాల ధనార్జనకో పదేపదే అశ్లీల రాతలు,కథలు ప్రచురించడం కూడా నీతిబాహ్యమని మరోకేసులో మండలి నిర్ణయించింది. అన్యాపదేశంగా వ్యక్తులపై రుజువులకు అందని నిందలు వేయడం నీతి బాహ్యమని మరోకేసులో మండలి స్పష్టం చేసింది.

పాఠకుల్లో కామోద్రేకాన్ని రెచ్చగొట్టే రాతలు అసభ్య రాతలుగా భావించబడుతాయి. ఫోటోలు కూడా అసభ్యంగా ఉండవచ్చు. అడ్వర్టయిజ్‌మెంట్లు కూడా అసభ్యంగా వుండవచ్చు. వాటి ప్రచురణను ఆపవలసిన బాధ్యత సంపాదకునిది. పత్రిక స్థాయి,అది ఏ రంగానికి చెందినదనే దాన్ని బట్టి కొంత వెసులుబాటుకు అవకాశం వుంది. కుటుంబమంతా చదువుకునే పత్రికలలో ప్రచురించకూడని కొన్ని బొమ్మలను సినిమాలకు మాత్రమే పరిమితమైన పత్రికలలో వేయవచ్చు. అలాగే వైద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన పత్రికలలో ఇతరత్రా వేయకూడని శరీరావయవాల బొమ్మలు వేయవచ్చు. విషయ వివరణ చేయవచ్చు.

## 34.8 ప్రాతికేయ అనౌచిత్యం

ఏచట్టాలకూ, నియమాలకూ అందని అనౌచిత్యాలుకూడా కొన్ని సందర్భాలలో జరిగిపోతూ ఉండవచ్చు. ఈ శీర్షిక కిందవాటిని చర్చిద్దాం.

ఉదాహరణకు ఎవరైనా 'ఆఫ్ ది రికార్డ్' అని ఏవేని విషయాలు చెబితే వాటిని ప్రచురించకూడదన్న నియమాన్ని

BRAOU

పత్రికా రచయితలు స్వచ్ఛందంగా పాటిస్తుంటారు. విలేకరులకు శిక్షణ ఇచ్చేటప్పుడు అలా ఎవరైనా 'ఆఫ్ ది రికార్డ్' విషయం చెబుతామంటే వినకూడదని చెబుతుంటారు. ఎందుకంటే ఆ విషయం మనకు మరో మార్గంగా కొంచెం ముందూ వెనకా తెలుస్తుంది. అప్పుడు దాన్ని ప్రచురిస్తే మొదట చెప్పిన వ్యక్తి మనం విశ్వాసఘాతానికి పాల్పడ్డామని నిందిస్తాడు. మాకు వేరే మార్గంగా తెలిసిందన్నా నమ్మడు. అందుచేత ఆయన చెబుతానన్నప్పుడు వినకపోవడమే మంచిది. ఏదో కారణం చేత విన్నామనుకోండి. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా వెంటనే ప్రచురించవలసిన విషయం అనుకోండి. అప్పుడు ఏం చేయాలి? ఈ ధర్మ సందేహానికి పత్రికా మండలి ఒక కేసులో రెండు పద్ధతులు సూచించింది. మొదటిది ఆ విషయ ప్రాధాన్యాన్నీ, దాన్ని వెంటనే ప్రచురించాల్సిన అవశ్యకతనూ చెప్పిన వ్యక్తికి వివరించి అతని అనుమతి పొంది ప్రచురించడం. రెండవది ఆ విషయం 'ఆఫ్ ది రికార్డ్' అని చెప్పిందే అయినా ప్రజాశ్రేయస్సు దృష్ట్యా ప్రచురిస్తున్నామంటూ 'గమనిక' ఒకటి రాసి దాన్ని ప్రచురించడం.

అడ్వర్టయిజ్‌మెంట్లు చట్ట విరుద్ధమైనవి ఎట్టి పరిస్థితుల్లోను ప్రచురించకూడదు. చట్ట విరుద్ధం కాకున్నా నీచంగా అసభ్యంగా వున్నవి ప్రచురించడం అనౌచిత్యం కిందికి వస్తుంది. వేరే పత్రికల్లో నుంచి ఉల్లేఖనలు ప్రచురించినప్పుడు అవి పూర్తిగా మూలానుసారంగా వుండేట్టు చూడాలి. వాటిని అస్తవ్యస్తం చేసి ప్రచురించడం నైతిక సూత్రాలకు విరుద్ధం.

నైతిక సూత్రాలను ఉల్లంఘించిన పత్రికా రచయిత ఆ పత్రిక ప్రచురణ ఆగిపోయినంత మాత్రానదోష విముక్తుడు కాబోడని పత్రికా మండలి స్పష్టం చేసింది.

పత్రికా మండలి మూడో ఛైర్మన్‌గా వున్న ఆర్.ఎన్. సర్కారియా కూడా పత్రికా రచయితల సంఘాలే స్వచ్ఛంద నియమావళిని రూపొందించుకోవడం మంచిదని సూచించారు. అఖిల భారత పత్రికా సంపాదకుల మహాసభ, భారతీయ పత్రికా రచయితల సమాఖ్య, తమ సభ్యుల మార్గదర్శనం కోసం చాలా కాలం కిందటే నియమావళులు రూపొందించినట్టు ఇంతక్రితం చెప్పిన సంగతి గుర్తుండే వుంటుంది. వాటినీ, ప్రెస్ కమిషన్ చేసిన సూచనలనూ, పత్రికా మండలి వివిధ కేసులలో ఇచ్చిన తీర్పులను దృష్టిలో వుంచుకుని పత్రికా రచయితలు పాటించవలసిన నైతిక విలువలను ఈ విధంగా క్రోడీకరించవచ్చు.

1. ప్రజలకు యదార్థమై, నిర్దిష్టమైన, సమగ్రమైన సమాచారాన్ని ప్రాతికేయ నిష్పాక్షికతను పాటిస్తూ అందించడం పత్రికా రచయిత ప్రాథమిక విధి. ప్రజలకు స్వేచ్ఛంగా అలాంటి సమాచారాన్ని తెలుసుకునే హక్కుంది.
2. వ్యాఖ్యలు, విమర్శలు చేసేటప్పుడు పత్రికా రచయితకు సామాజిక బాధ్యత వుంది.
3. పత్రికా రచయితకు సామాజిక బాధ్యత ఉంది. గనుక పత్రికా రచనను వ్యాపార వాణిజ్యాల సరుకుగా భావించకుండా సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే వ్యవసాయంగా భావించి బాధ్యతతో, నిగ్రహంతో సమాజంలో ఉద్రిక్తతలు, హింస పెరగకుండా వ్యవహరించాలి.
4. వృత్తిపరమైన నిజాయితీని అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూ వ్యక్తిగత ప్రయోజనాలకు అర్రులుచాచక పోవడమే గాకుండా ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదు.
5. వార్తా ప్రచురణలో పొరపాటు జరిగినప్పుడు వెంటనే సవరించుకోవడమే గాకుండా బాధితునికి వుండే సమాధానమిచ్చే హక్కును గౌరవించి ఆయన భావాన్ని కూడా ప్రచురించాలి.
6. ప్రజలకు పత్రికను వారి భావ ప్రకటన నిమిత్తం అందుబాటులో వుంచి భావ వినిమయంలో వారికి భాగస్వామ్యం కల్పించాలి.
7. ఇతరుల ఏకాంత హక్కును గౌరవించడమే గాక అనిర్ధారిత వార్తలను అపనిందలను పరువునష్టం కలిగించే అంశాలను ప్రజా శ్రేయస్సుతో నిమిత్తం లేనప్పుడు పక్కనబెట్టి వారి స్వాభిమానాన్ని కాపాడటంలో తోడ్పడాలి.
8. ప్రజాస్వామ్య సంస్థలను, ప్రజల నైతిక విలువలను దెబ్బతీసే ప్రచురణలకు పాల్పడకుండా వృత్తి ప్రమాణాలను ఉన్నత స్థాయిలో నిలబెట్టాలి.

BRAOU

అభ్యాసం - 4 : పత్రికా ముఖంగా సమాధానమిచ్చే హక్కు ఎవరికి ఉంటుంది.

.................................................................................................................................................

.................................................................................................................................................

.................................................................................................................................................

.................................................................................................................................................

.................................................................................................................................................

## 34.9 ముఖ్య విషయాలు గుర్తుంచుకుందాం

- ★ జర్నలిస్టులకు నైతిక విలువలు లేనట్టయితే ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించలేరు.
- ★ పత్రికా రచయితలకు నైతిక నియమావళి ఉండాలని భావిస్తారు. ప్రెస్ కమిషన్ 1954లో తన నివేదికలో ఈ విషయాన్ని ప్రస్తావించింది. కొన్ని సూచనలూ చేసింది.
- ★ ఈ నియమావళి విషయంలో స్వచ్ఛంద నియమావళి వైపు మొగ్గు పత్రికామండలిని తాను అనేక కేసులలో ఇచ్చిన రూలింగ్‌లను అచరణాయమైన నియమాలను క్రోడీకరించి పత్రికా రచయితలకు అందించింది.
- ★ వార్తల నిజానిజాలను తెలుసుకోవడం తప్పనిసరి. పత్రికా మండలి తన తీర్పులలో ఇచ్చిన రూలింగ్‌ల ఆధారంగా పాటించవలసిన కొన్ని సూత్రాలు ఏర్పడ్డాయి.
- ★ మత విద్వేషాల వార్తలు రాసేటప్పుడు నైతిక విలువల అవసరం ఏంతైనా ఉంది. విద్వేషాలను రెచ్చగొట్టడం కూడదు. పత్రికలలో వచ్చిన రాతలవల్ల బాధితులయిన వారి సమాధానం ప్రకటించడం పత్రికా రచయిత నైతిక బాధ్యత.
- ★ చట్టాలకు నియమాలకు అందని అనౌచిత్యాలు కొన్ని ఉన్నాయి. ఈ దిశగా పత్రికా రచయిత పాటించదగ్గ నైతిక విలువలు ఉన్నాయి.

BRAOU

## 34.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

I. కింది ప్రశ్నలకు 30 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. పత్రికా రచయిత పాటించాల్సిన నైతిక సూత్రాలను వివరించండి?
2. పుకార్ల ఆధారంగా వార్త రాయడం సబబా? దానివల్ల కలిగే దుష్పరిణామాల నివారణకు చేయవలసిందేమిటి?

II. కింది ప్రశ్నలకు 20 పంక్తులకు మించకుండా సమాధానాలు రాయండి.

1. పాత్రికేయ అనౌచిత్యం
2. సమాధానమిచ్చే హక్కు

***-జి.ఎస్. వరదాచారి***

BRAOU

BRAOU